ముత్యాల శాల

వచన కావ్యం

డా॥ ఆకొండి విశ్వనాథం

ముత్యాల శాల
(వచన కావ్యం)



డా॥ ఆకొండి విశ్వనాథం

ముఖచిత్రం : కె. ఎస్. పాణి

డిజైన్, బుక్‌మేకింగ్ :
అగ్రిగోల్డ్ మల్టీమీడియా, విజయవాడ.

MUTHYALASALA

by **Aakondi Vishwanadham**

ప్రథమ ముద్రణ : ఆగస్టు 2014

© ఆకొండి విశ్వనాథం

20-6-12, అంజయ్యరోడ్,

ఒంగోలు - 523 002.

ప్రకాశంజిల్లా, ఆంధ్రప్రదేశ్

దూరవాణి : 08592 - 236515

చరవాణి : 98486 21314

ప్రతులకు :

మేనేజింగ్ ఎడిటర్,

నది మాసపత్రిక

అగ్రిగోల్డ్ మల్టీమీడియా

26-20-44, సాంబమూర్తిరోడ్,

గాంధీనగర్, విజయవాడ-520 003.

ఫోన్ : 0866-3200080

మరియు విశాలాంధ్ర బుక్‌షాపులలో లభించును.

హెచ్చరిక : ఈ పుస్తకంలో ఏ భాగాన్ని కూడా పూర్తిగాగాని, కొంతగాని కాపీరైట్ హోల్డరు ముద్రణకర్త ఆకొండి విశ్వనాథం గారి నుండి ముందుగా వ్రాతపూర్వకంగా అనుమతి పొందకుండా ఏ రూపంగా వాడుకున్నా కాపీరైట్ చట్టరీత్యా నేరం. - **ప్రచురణ కర్తలు.**

ముత్యాలశాల

వచన కావ్యం

రచయిత

దర్శనాచార్య డాక్టర్ ఆకొండి విశ్వనాథం

M.A.Telugu, M.A. Hindi, Ph.D. Telugu M.U., M.A. Darsanas, M.A. Samskrit,
Ph.D. Samskrit. A.U., Bhasha Praveena, Samskrit Vyakarana Kovida,
Samskrit Tarka Kovida, P.O.L. Alamkaras., P.G. Diplomas etc.,

విశ్రాంతాచార్య, సహస్రాధిక గ్రంథకర్త,
సువర్ణ గండపెండేర విభూషిత మకుట ధారణ కనకాభిషిక్త,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ప్రతిభాపురస్కార గ్రహీత,
భారత ఎక్సలెన్స్ అవార్డి– న్యూఢిల్లీ,
యునెస్కో ఇంటర్నేషనల్ గోల్డెన్ బెస్ట్ కపుల్ అవార్డి,
శ్రీహనుమదాచార్య పీఠాధిపతి,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత,
భ్రూకళావధాన స్రష్ట, ఎజ్ఞన పీఠ సంస్థాపకులు,
శ్రీ విద్యారణ్య భారతి, విశ్వభారతి అధ్యక్షులు,

అంజయ్య రోడ్, ఒంగోలు - 523 002, ఆంధ్రప్రదేశ్, ప్రకాశం జిల్లా,
భారతదేశం. దూరవాణి: 08592 - 236515, చరవాణి: 9848621314

కృతజ్ఞతాంజలి

అభినవ వేద వ్యాస మహర్షి, అగ్రిగోల్డ్ సంస్థ ఛైర్మన్, **'నది'** ఎడిటర్ & పబ్లిషర్ గౌ॥ **శ్రీ వేంకట రామారావు అవ్వాస్** గారు, నే రచించిన **'ముత్యాలశాల'** వచనకావ్యం, **'నది'**చే ఉత్తమస్థాయిలో ప్రథమ బహుమతిని పొందిన శుభ సందర్భాన్ని పురస్కరించుకొని, ఫోనులో ఆ కావ్యాన్ని శ్లాఘిస్తూ, నన్నభినందించారు. కావ్యమునందలి వాద ప్రతివాదాలు ఆలోచనామృతాలని, సాహిత్యం ఆపాతమధురమని వాగమృతధార నందిస్తూనే, గాయత్రీ మంత్రాక్షరాలు ఇరవై మూడా లేక ఇరవై నాలుగా అనే విషయ ప్రతిపాదన చక్కగ నున్నదని సద్వైమర్శిక బ్రహ్మలై ముచ్చటించారు. కరదర్శన విషయాన్ని భిషగ్వరులై విశ్లేషించారు. ఆ నవ్యాంధ్ర భోజుని అమృతవాణి శ్రవణానందంగా వింటూనే వారిని విద్యావాచస్పతులుగా సంభావించాను. వారు, స్వాతంత్ర్య సమరయోధులు **శ్రీ అవ్వా వేంకట అప్పారావు** సాహితీ అవార్డు నందజేయుట ముదావహం. ఈ రీతిగ, ఈ భారత భారతీ సేవకుని ఆశీర్వదించిన ఆ పుంభావ సరస్వతికి వినమ్రపూర్వక కృతజ్ఞతాంజలులు.

శ్లో ॥ అవ్వాఖ్య సత్కులే జాతః
"వీ.ఆర్.రావ్." ఇతి కీర్తిమాన్ ।
వాగ్మీ, ధీరో, గుణీ, శ్లాఘ్యః
నిత్యం విజయతే తరామ్ ॥

"సంత్వాసించామి యజుషా ప్రజామాయుర్ధనంచ; దీర్ఘమాయుః". - శ్రుతి

నది మేనేజింగ్ ఎడిటర్, అగ్రిగోల్డ్ సంస్థ వైస్ ఛైర్మన్ గౌ॥ **శ్రీ సీతారామ్ అవ్వాస్** గారికి, ఈ తెలుగులెంక ఆకొండి కృతజ్ఞతాంజలి. నది ఎడిటర్ ఇన్‌చార్జి గౌ॥ **శ్రీ ప్రభాకర్ జలదంకి** (ప్రజ) గారికి పరశ్శతాధిక నమస్సుమనస్సులు. న్యాయనిర్ణేతలకు, పాఠక పరమహంసలకు, చిరంజీవి హనుమాన్‌కు, రసజ్ఞులకు విజ్ఞులకు విశ్వనాథ వరివస్యతుని వరివస్య. నరజన్మను వరజన్మగ ప్రసాదించిన తల్లిదండ్రులకు ప్రణతులు.

శ్రీనాథ కవి, దక్షిణాధీశుని **ముత్యాలశాలలో** తనంతటి ప్రతిభాశాలియైన డిండిమభట్టారకులతో వాదించి, వారి చేతనే కంచు ఢక్కను పగుల గొట్టించి, కవి సార్వభౌమ బిరుదాంచితులైనట్లు తెలుగు సాహిత్య చరిత్ర పుటలలో సువర్ణాక్షరాలతో లిఖింపబడిన సత్యం. మరి, వారుభయులు ఏమేమి శాస్త్రాంశాలు వాదించుకొన్నారో, ఎన్ని రోజులు వాద సభలు జరిగినవో సుస్పష్టతలేదు. వాది ప్రతివాదులిద్దఱూ వేదవేదాంతాది సమస్త శాస్త్రాలు తెలిసిన విద్వత్కవిశేఖరులే. అందుకే వేదవేదాంతాది సమస్త శాస్త్రాలను వాదించి

యుంటారని, అందులకై నలుబది రోజులు వాద సభలు జరిగి యుండవచ్చునని సంభావించి, **'ముత్యాలశాల'** కావ్యాన్ని రచించాలని **"నది"** ప్రకటన చూచినంతనే నా అంతఃకరణ ప్రేరేపించినది. పదిహేనురోజులు దీక్ష వహించి, ఈ **ముత్యాలశాల** కావ్య రచన పూర్తిచేసి, 'నది'కి పంపించాను. నదీమతల్లి కరుణించినది. ప్రథమ బహుమతి నందించినది. మది మోదిల్లినది. నదీమతల్లికి, విద్వత్కవీశ్వరులకు నేనధమర్ణుడను. ప్రాడ్వివాక వరేణ్యులై సువర్ణాక్షతల నభినందించిన ప్రాచార్య శ్రీ కె.ఎం.ఎల్.ఎన్. మూర్తి కులపతులకు శతకోటి ప్రణిపాతములు. ఈ సత్కావ్య రచనలోనే గాక, నా సహస్రాధిక రచనలలో కూడ సహాయ సహకారముల నందించు నా తుల్యశీలకు సౌభాగ్యాశీస్సులు. మాకు అన్నివిధాల సహకరించు రామలక్ష్మణుల వంటి చిరంజీవులగు **శివకుమార్, శ్రీకాంత్** పుత్రులకు వారి కుటుంబములకు మా శుభాశీస్సులు. "శతమానం భవతి శతాయుః పురుషశ్శతేంద్రియ ఆయుష్యేవేంద్రియే ప్రతితిష్ఠతి"... శ్రుతి.

శ్లో॥ మైత్రేయీ, జానకీ, భైమీ, సావిత్రీ, భారతీ, సతీ ।
అమరజ్యోతి రాకొండి, వందనీయా నిరంతరమ్ ॥

శ్లో॥ "జయన్తి తే సుకృతినో రస సిద్ధాః కవీశ్వరాః ।
నాస్తితేషాంయశః కాయే జరామరణజం భయమ్" ॥ స్వస్తి.

- డా॥ ఆకొండి విశ్వనాథం.

అభినందనము

శ్లో॥ రమ్యాకొండి కులాబ్ధి పార్వణశశీ ! జ్యోతిర్వధూహృద్వశీ,
నానాశాస్త్ర పురాణ కావ్యపఠితీ ! శ్రీ విశ్వనాథః కృతీ !
అస్మన్మిత్ర శిరోమణిః సుమధురాన్ గ్రంథాన్ ప్రబంధాన్ వరాన్
గీర్వాణాంధ్ర గిరా సదా విరచయన్ జీయాత్ సహస్రంసమాః॥

- విద్యావిభూషణశ్రీ గరిమెళ్ళ సోమయాజులు శర్మ.

కృతజ్ఞతాంజలి

శ్లో॥ శ్రీ పుష్పగిరి సంస్థాన పఠితం గుణమండితమ్ !
శ్రీ సోమయాజి శర్మాణం, బాల్యమిత్రం స్మరామ్యహమ్॥

- డా॥ ఆకొండి విశ్వనాథం

కె.ఎం.ఎల్.ఎస్. మూర్తి

రిటైర్డ్ ప్రిన్సిపాల్, జవహర్‌భారతి, కావలి

అరుదుగా వచ్చే రచనల్లో 'ముత్యాలశాల' ఒకటి

ఇది క్రీ.శ. 15వ శతాబ్దానికి చెందిన ఒక మనీషి ఉత్థాన పతనాల హేల. ఆ మహాపురుషుడు ఈశ్వరార్చన కళాశీలుడు; బ్రాహ్మీదత్త వరప్రసాదుడు; ఉరుప్రజ్ఞా విశేషోదయుడు; వెరసి ఆయన తెలుగుల కవిసార్వభౌముడు శ్రీనాథుడు.

ఆంధ్రకవులెందరున్నా శ్రీనాథ కవిసార్వభౌమునిది ఆ కవి శ్రేణిలో ఒక ప్రత్యేక స్థానం. ఆయనకున్న విద్వత్తు అనితరసాధ్యం. ఆంగ్ల కవుల్లో మిల్టన్‌లాంటివాడు ఆ మహనీయుడు. ఆయన కవితాధార పండితపామరుల్ని సమానంగా అలరించగలదు. ఆయన సీసం సరస్వతీ నిశ్వాసం. ఆయన భక్తి అసమానం. ఇహ పరాల్ని జోడుగా నడిపి వాటికి అద్భుతమైన సమన్వయాన్ని కూర్చి జోరుగా అనుభవించిన కవిజోదు ఆయన. ఆయన జీవితకాలం క్రీ.శ. 1360 నుండి క్రీ.శ. 1450 దాకా పరివ్యాప్తమై 90 వసంతాల్ని కండ్లచూచింది. ఆయన కవితా వ్యవసాయం మరుత్తరాట్చరిత్రతో తన 12వ ఏటనే ప్రారంభమై పండు ముసలి వయస్సులో పలనాటి వీరచరిత్ర దాకా కొనసాగింది. కొండవీటి రెడ్డి రాజుల ఆస్థానంలో 20 సంవత్సరాల పాటు (1404 నుండి 1424 వరకు) విద్యాధికారిగా ఎందరో కవి పండితుల్ని పరీక్షించి సమ్మానింపజేశాడు. అటుపై రాజమహేంద్రవర రెడ్డి రాజ్యం చేరుకొని వేమారెడ్డి వీరభద్రారెడ్లకు అత్యంత ఆత్మీయుడై ఆ రాజ్యం 1444 ప్రాంతాల్లో పతనం అయ్యే దాకా సర్వ గౌరవాలూ, భోగభాగ్యాలూ అనుభవించాడు. ఈ లోపల రెడ్డి రాజులకు బద్ధశత్రువులైన పద్మనాయక ప్రభువుల చేత (రాచకొండ, దేవరకొండ ప్రభువులు) గూడా సమ్మానింపబడ్డాడు. విజయనగర ప్రభువులైన ప్రౌఢదేవరాయల ముత్యాలశాలలో ఆయన ఆస్థాన విద్వాంసుడు గౌడ డిండిమభట్టును ఓడించి ఆ మహనీయుని కంచు ఢక్కను పగులగొట్టించి చంద్రభూష క్రియాశక్తి ఆధ్యక్ష్యంలో కనకాభిషేకాన్ని పొందుతాడు. ఆ సందర్భంలో 40 రోజుల పాటు డిండిమునితో ముత్యాలశాలలో శ్రీనాథుడు జరిపిన వాగ్వివాదాలను రచయిత డా॥ ఆకొండి విశ్వనాథం గారు యెంతో చక్కగా వివరించారు. మొదటిరోజు శ్రీనాథ కృతమానసోల్లాస కావ్యాంతర్గత వ్యాకరణ శాస్త్రాంశాలను గురించి, తర్కశాస్త్ర చమత్కారాల గురించి చర్చ జరిగింది. రెండవ రోజు వేదాల సంఖ్యను గూర్చీ, త్రయీ రహస్యాలను గురించీ, మాతృ పితరులలో శ్రేష్ఠులెవరనే దానిని గురించి చర్చ జరిగింది. మూడవ రోజు వేద శబ్దార్థ చర్చ, పూర్వోత్తర

మీమాంసా శాస్త్రాల ఆంతర్యము, చతుస్సూత్ర సమన్వయం, తూలాగ్ని విద్యా ప్రతీకోపాసనాదులను గురించిన ప్రస్తావన చోటుచేసుకొన్నాయి. ఆ తరువాత వరుసగా 37 రోజులపాటు ధర్మజిజ్ఞాస, బ్రహ్మజిజ్ఞాస, ఉపనిషద్రహస్యాలు, ప్రస్థానత్రయం, సాహిత్యశాస్త్రం, కావ్యాత్మ, రస చర్చ, అలంకార వైవిధ్యం, లలిత కళలు, భగవంతుని ఏకవింశత్యవతారాలు, నవవిధ భక్తులు, భారతాంతర్గత రహస్యాలు, మోక్ష పురుషార్థం, మిథ్యావాద ఖండన మండనలు, స్త్రీలు – వేదాధ్యయనం, షోడశ దర్శనాలు, గాయత్రీ మంత్ర రహస్యాలు మున్నగు అనేకానేకాంశాలపై శ్రీనాథ, డిండిముల మధ్య వాద, ప్రతివాదాలు నడచి చివరదైన 40వ రోజు ఆత్మతత్త్వ విమర్శ అనే అంశంతో ఆ వాగ్యుద్ధానికి శ్రీనాథ మహాకవి విజేతగా తెరపడుతుంది. ఇలా చర్చలు జరుగుతుండగా విరామ సమయాల్లో శ్రీనాథుడి బావమరిది దుగ్గన ఆయన జీవిత చరిత్రాంశాలను ఆ సదస్సుకు వచ్చిన కవి పండితులకు వివరించడం శిల్పరీత్యా చాలా బాగున్నది. అహంకారి అయిన డిండిమ పండితుడి పాండిత్య మదాన్ని తన విద్వత్ప్రకాశనంతో అణచివేసి అతడి అహంకారంతో బాటు కంచుఢక్కను గూడా తన ఉద్భట వివాద ప్రౌఢితో శ్రీనాథుడు పగులగొట్టించిన వైనం మహాద్భుతం. రచన ప్రౌఢంగా బిగువుగా వున్నది. ఎన్నో విజ్ఞానాంశాలు శ్రీనాథ డిండిముల చర్చ అనే సందర్భాన్ని పురస్కరించుకొని రచయిత అందించారు. అటుపై ప్రభువుల ఆదరణకు దూరమైన శ్రీనాథుడు ఆంధ్రదేశాన్ని ఆక్రమించిన అరసికులైన ఒడ్డె రాజుల (ఓఢ్ర ప్రభువుల) నిరాదరణలో పడిన కష్టాలు, కృష్ణ ఒడ్డున బొడ్డుపల్లెను గుత్తకు తీసుకొని వ్యవసాయం సాగించిన వైనమూ; వరదలకూ, బిలబిలాక్షుల దాడులకూ వ్యవసాయంలో దెబ్బతిని 700 టంకాల పన్ను చెల్లించలేక ఎదురెండలో మెడలో పొగడదండ వేయించుకొని, పాదాలకు నిగళాలు తొడిగించుకొని, భుజస్కంధాన నల్లగుండు ఎక్కించుకొని, చేతులకు వెదురు గొడియలు తగిలించుకొని సిలువ మోసిన జీసస్ క్రైస్తులా ఎన్నో శిక్షలకు అగ్గమై చివరకు శాంతయ్య వచ్చి 700 టంకాల శిస్తు చెల్లించి విడుదల చేయిస్తే భార్య శ్రీలక్ష్మితో బాటు 90వ ఏట కృష్ణానదిలో మునిగి "దివజ కదివరు గుండియర్ డిగ్గురనగా" అమరపురికి చేరుకొన్న విషయమూ రచయిత శ్రీ ఆకొండి విశ్వనాథం ఎంతో హృదయంగమంగా అభివర్ణించారు. రచయితకు శ్రీనాథ మహాకవిపై గల అపరిమితాభిమానం మూలంగా ఈ రచన ఎంతో హృద్యంగా రూపొందింది. రచయిత తమ సర్వశక్తులనూ ఒడ్డి సరస్వతీ సమారాధనగా బహు విషయ పుష్టంగా ఈ రచనను రూపొందించారు. ప్రత్యక్షరంలో శ్రీనాథ మహాకవిపై ఆయనకు గల ఆరాధన అపూర్వంగా ప్రతిఫలించింది. ఈ రచన మొత్తం మీద ఎన్నదగ్గ కవి జీవితం. అరుదుగా వస్తాయి ఇలాంటి రచనలు. ఇది నోరి నరసింహశాస్త్రి గారి "శ్రీనాథ కవిసార్వభౌముడు" నవలకు సమ ఉజ్జీ అయిన ప్రౌఢ రచన. రచయితకూ, ఈ నవలను ప్రకాశింపజేస్తున్న **'నది'** యాజమాన్యానికీ శుభాభినందనలు.

ఇతి శివమ్

శ్రీ శివాలక్ష్మీ గణేశ శారదా గురుభ్యోనమః. శ్రీ మాత్రే నమః. ఓం శ్రీ సాయిరామ్

జయ గురుదేవదత్త

ముత్యాలశాల

శ్రీ విజయనగర సామ్రాజ్య మహాలక్ష్మీ శిరోమణి "ముత్యాలశాల" కర్ణాటక సార్వభౌముడగు శ్రీప్రౌఢ దేవరాయల సత్కీర్తి నేల, సనాతన సత్కళా సరస్వతీదేవి కచ్ఛపీశ్రుతి హేలగ, ఆర్ష ధర్మోద్ధరణకై వెలసినదీ దక్షిణాధీశు "ముత్యాలశాల" కర్ణాటక సింహాసన స్థాపనాచార్యులైన తెలుగు తేజః పుంజమౌ శ్రీ విద్యారణ్యస్వామి, ఆరాధించిన అంతర్ముఖ సమారాధ్య సింహపీఠి నిలయమే "ముత్యాలశాల". ఇది, విద్వత్కవీశ్వరులపాలిటి కల్పతరువు వేదవేదాంగాది సమస్త శాఖలచే విస్తరింపబడి, శాస్త్ర పుష్పసమాయుక్తమై విద్వత్భ్రమరాలచే శోభించు, ముత్యాలశాలా కల్పవృక్షము, సాహితీ ప్రియంభావుకుల నందజలధి. ఇది, అనన్వయాలంకారానికే యలంకారమైయలరారుట, ఆనంద సంధాయకమని, సంగీత సాహితీ రిరంసువులు కొనియాడుతూ, వసంతోత్సవాలను, విజయనగర వాసులే గాక, భారతదేశపు నలుమూలల నుండి విచ్చేసిన భారతులు, విదేశీయులు, అత్యంత వైభవంగా జరుపుకొంటున్న ధార్మిక ధరిత్రి.

ముత్యాలశాలలో ఎందరెందరో మహానుభావులు, తమ తమ సంగీత సాహిత్య సాంస్కృతికాది సమస్త విద్యలను ప్రదర్శించి ప్రభువుల మన్ననలను పొందుతున్నారు. జానపదులు, నర్తకీమణులు, నటవిట గాయకాది శిరోమణులు, దశవిధ రూపకాలను ప్రదర్శించి, రసహృదయ ప్రేక్షక శ్రోతలనుర్రూతలూగింపజేయు ముత్యాలశాల యందెటు

చూచినా ముత్యాల తోరణాలే! ముత్యాల చాందినీలు! నేత్రానందాన్ని కల్గించే ముత్యాల ముగ్గులు. ముత్యాలచే అలంకరింపబడిన చిత్ర విచిత్రములైన ఆసనాలు అందు వేవేల మంది ప్రేక్షకుల్ని అలరింపజేయు నిండుపేరోలగము.

ముత్యాలశాలలో, శ్రీవిరూపాక్షస్వామి దివ్యమందిరం నిత్యపూజలందుకొంటోంది. శ్రీ విద్యానగరంలో వెలసిన శ్రీ విరూపాక్షస్వామి వారి దేవాలయ ప్రతిరూపాన్నే ముత్యాలశాలలో పంచలోహాలతో విగ్రహాన్ని చేయించి రాయలవారు నెలకొల్పారు. స్వామి సన్నిధిలో, ధార్మిక చక్రవర్తి శ్రీ విద్యారణ్యస్వామి స్వర్ణ విగ్రహం మంచి ముత్యాలహారాలతో శోభిస్తూ, విశ్వమానవాళిని ఆశీర్వదించేలా రూపొందించారు. చెంతనే, శ్రీ విజయనగర మహా సామ్రాజ్య సంస్థాపకులైన సోదరుల విగ్రహాలు, వారే హరిహరరాయలు, బుక్కరాయలు, వీరి సువర్ణ విగ్రహాల ప్రక్కనే వీర కంప రాయలు, రెండవ హరిహరరాయలు, మొదటి ప్రౌఢ దేవరాయలుల కాంచన విగ్రహాలు వీరిందరూ రెండవ ప్రౌఢ దేవరాయల పూర్వీకులే! వీరంతా సంగమ వంశస్థులే! వీరందరూ, శ్రీ విజయనగర సామ్రాజ్య మహాలక్ష్మిని వజ్ర వైఢూర్యాలతో, మరకత మాణిక్యాలతో, పుష్పరాగ గోమేదకాలతో, నీలాలతో, ప్రవాళాలతో, మంచి ముత్యాలతో నిత్యాభిషేకాలు చేసినవారే!

రెండవ ప్రౌఢ దేవరాయలు, తుంగభద్రా నదీ తీరాన ముత్యాలశాలనే నిర్మించి, చతుష్షష్టి కళలను పోషిస్తూ, లలిత కళాకోవిదుల్ని మెచ్చుకొంటూ, జానపదుల జబ్బ చఱచి, ఆస్థాన నర్తకీమణుల నాట్య భంగిమలకు మైమఱచి, సంగీత సాహిత్య సంగోష్ఠులతో తాను సంతోషించడమే కాక, రసపిపాసకుల నానంద జలధిలో ఓలలాడిస్తూనే, కంటిలో నలుసులా, కాలిలో ముల్లులా, వెంటాడు నక్కజిత్తుల బహనీసుల్తానుల భరతం పట్టించి, రాజ్య రక్షణ గావించి కొల్లం, కొలికట్ దేశాలను జయించి, లక్కన్న సేనాని నాయకత్వంలో సముద్రంపై నౌకాయుద్ధం చేసి సింహళాన్ని జయించి, ఆ రాజు నుండి ధనరాశుల్ని కప్పంగా స్వీకరించి, ఆ సేనానికి "దక్షిణ సముద్రాధీశ్వర" - అనే బిరుదాన్ని ప్రదానం చేసి, ముత్యాలశాలలో ఘనసన్మానం చేసి, దుష్ట శిక్షణ శిష్ట రక్షణలను చేపట్టి ధర్మపాలన సాగిస్తూనే, సంస్కృతాంధ్ర సాహిత్యాలలో విద్వత్కవియై, సంస్కృత గ్రంథాలు రచించి, "మహానాటక సుధా నిధి వృత్తి" గ్రంథకర్తయై, వేదవ్యాస మహర్షి విరచిత బ్రహ్మసూత్రాలపై సంస్కృతంలో వ్యాఖ్యరచించి, గీర్వాణ భాషలో కృతులు విరచించి, పరమత సహనంతో అన్ని మతాలవారిని ఆదరిస్తూనే అష్టభాషా పరమేశ్వరుడైన అరుణగిరినాథుని విద్యాధికారిగా సన్మానించి, కన్నడ కవి చామరసు నాదరించి, తమిళ భాషావేత్త ముమ్మకవిని భూషించి,

వల్లభునికి మంత్రిపదవి నొసంగి సత్కరించి, వినూత్న సంస్కరణలచే విజయనగర సామ్రాజ్యానికి సాటి, విజయనగర సామ్రాజ్యమేయనిపించి, అటు అంతఃపురాన్ని ఇటు పురాన్ని ఆలనపాలనలతో మురిపించు సంగీత సాహిత్య సమరాంగణ సార్వభౌముడు.

ముత్యాలశాలలో ఎత్తైన పెద్దవేదిక కొక ప్రక్క సంస్కృతాంధ్ర, తమిళ, కన్నడ కవుల చిత్రపటాలున్నాయి. లబ్ధ ప్రతిష్ఠులైన విద్వత్కవుల చిత్రపటాల చెంతనే భాష్యకారుల చిత్రపటాలు, అక్కడే అద్వైత విశిష్టాద్వైత ద్వైత మతస్థాపకాచార్యులు జగద్గురువులైన శ్రీ మచ్ఛంకర, భగవద్రామానుజ శ్రీమధ్వాచార్యుల చిత్రపటాలు, చూపరులనాకట్టుకొంటున్నాయి.

యోధాగ్రేసరుడైన యాంధ్ర మల్లుడౌ చాణూరుని చిత్రం, వీరులకు కనువిందు చేస్తోంది. ఇంకా ఎందరో మహావీరుల చిత్రపటాలు, వివిధ రకాల ఆయుధాలతో దర్శకులనలరిస్తున్నాయి.

ఆర్థిక శాస్త్రజ్ఞుడే కాక నీతిశాస్త్రపారంగతుడైన యాంధ్ర మౌక్తికమగు, ఆర్యచాణక్యుని నిండైన చిత్రం కనులపండుగ చేస్తోంది.

ఆయుర్వేద పితామహుడైన ధన్వంతరి, శస్త్ర చికిత్స పితామహుడగు సుశ్రుతుడు, జన్యుదేహ నిర్మాణ శాస్త్రమందేకాక, యోగ శాస్త్రమందు, వ్యాకరణ మహాభాష్య రచనమందు సిద్ధహస్తుడగు చరకుడు, విమానశాస్త్ర పితామహుడు యంత్రసర్వస్వ, అంశుతంత్ర, ఆకాశశాస్త్రాది గ్రంథకర్త మంత్ర ద్రష్టయగు భరద్వాజుడు, అణుశాస్త్ర పితామహుడైన కణాదుడు, జ్యోతిషశాస్త్ర పితామహుడైన వరాహమిహురుడు, ఖగోళశాస్త్ర విజ్ఞాన ఖని ఆర్యభట్టు, గణితశాస్త్ర శిరోమణి భాస్కరాచార్యుడు మున్నగు మహనీయుల చిత్రపటాలతో ముత్యాలశాల శోభిస్తోంది.

వసంతోత్సవాలలో అంబరాన్ని చుంబించు సంబరాలతో అమందానందాన్ని పొందిన వారిలో కొందరు, ముత్యాలశాలలోని చిత్రపటాలను దర్శించారు. వారి వారి సంక్షిప్త వివరాలతో పూర్తి పేర్లు గల చిత్ర పటాలలోని మహనీయులను చూచి, తలయూచి తలయొగ్గారు. కొందరు శ్రీమన్నారాయణాంశ సంభూతుండగు శ్రీ వేదవ్యాసునకు సుమాళంబున మ్రొక్కారు. ఆదికవి ప్రాచేతసుని మనః పదవిని నిలిపారు. భాస, కాళిదాస, భవభూతి, మాఘ, శ్రీహర్ష, హర్ష, జయదేవ, మురారి మయూరాది గీర్వాణ కవులకు కైవారాలు చేసారు. మృదు మధుర వచన రచనా దురంధరుండగు బాణునకు ప్రణమిల్లారు. కవికమలరవి భారవిని కొనియాడారు. భామహ, దండి, వామనానంద వర్ధన కుంతక క్షేమేంద్ర వాగ్భటోద్భట మమ్మట రాజశేఖరాది మహాలంకారికుల చిత్రపటాలకు చేతులు జోడించారు. కోనసీమ కాంతాశిరోభూషణమగు, రసగంగాధర కృతికర్త ఉపద్రష్ట పండిత

జగన్నాధరాయుల నిలువెత్తు చిత్రపటానికి రసాభివందనం చేసారు. శబ్ద విద్యా సంప్రదాయకులైన పాణిని కాత్యాయని పతంజలి మహర్షులకు శతసహస్ర నమస్కృతులర్పించారు.

శ్రీమద్రామాయణ, భారత, భాగవతాది గ్రంథాలను తెలుగులో విరచించిన వేములవాడ భీమకవి చిత్రపటాన్ని చూచి, వాని యుద్ధండలీలలనుస్మరించి నమస్కరించారు. శ్రీమదాంధ్ర మహాభారత ప్రణేతలగు నన్నయ, తిక్కన, ఎఱ్ఱనార్య కవిత్రయాల చిత్రాలకు జోహార్లర్పించారు. తెలుగు భాషకు వన్నెచిన్నెలు చేకూర్చిన నన్నెబోడుని, నవీనగుణ సనాధుడగు నాచనసోముని చిత్ర పటాలు చూచి మ్రొక్కారు.

పద్మపురాణ సంగ్రహకర్త, వినమత్కాకతి సార్వభౌముడగు కమలనాభామాత్యుని చిత్రపటాన్ని చూచి, ప్రణవప్రణతులర్పించారు. ఇంకా ఎందరో మహానుభావుల కుడ్యచిత్రాలున్నాయి. నాట్యశాస్త్ర పితామహుడైన భరతుని మనోహర శిల్పం, మంచి ముత్యాలహారాలతో చూపరులను చకచ్చకితుల్ని గావిస్తోంది.

ముత్యాలశాలలో నొకవంక, ప్రాచీనులు రచించిన తాళపత్ర గ్రంథాలయముంది. ఓ భాండాగారంలో పురాతన వస్తువులెన్నో ఉన్నాయి. ప్రాచీన శాసనాలు, పూర్వులు వాడిన పరశువులు, కుంతములు, ఖడ్గాలు మొదలైనవి కూడ భద్రపరచారు.

ముత్యాలశాల ముఖద్వారానికిరువైపుల విఘ్నేశ్వర, విష్వక్సేనుల శిల్పాలున్నాయి. ముత్యాలశాల ముంగిటకు కొంతదూరాన కొన్ని మదపుటేనుగులు బారులుతీరి మంచి ముత్యాల హారాలతో శోభిస్తున్నాయి. ఆ మదపుటేనుగుల కుంభస్థలాల నుండి మదజలాలు కారుతున్నాయ్. తుమ్మెదలు ఝుంకారాలు చేస్తుంటే, అవి ఘీంకరిస్తున్నాయి. మరోప్రక్క పంచకళ్యాణి గుఱ్ఱాలు వరుసలు తీర్చి, అలంకరింపబడి ఉన్నాయి. కొంతదూరంలో పచ్చిక మేసే పశువుల మందలున్నాయి. చెంగు చెంగున దూకే దూడలు, తోకలాడిస్తూ, 'అంబా' అని అరుస్తూంటే, మోరలెత్తిచూచు గోమాతలు వాత్సల్య రసాధి దేవతలే.

ముత్యాలశాల ముందు, కనుచూపు మేరంతా ముచ్చటైన ఉద్యానవనాలే. వసంత ఋతువు విజృంభించింది. చెట్లు చిగిర్చాయి. వేపపూత విరగ బూసింది. బండి గురివెంద పూలతేనే త్రాగి, మత్తెక్కిన తుమ్మెదలు ఝుమ్మని నినాదాలు చేస్తుంటే విరహులకు బాధ, ప్రేయసీ ప్రియులకు సంతసం కలుగుతోంది. "వసన్తకాలే సంప్రాప్తే కాకః కాకః పికః పికః" – అన్నట్లు కూతను బట్టి కాకి పిల్ల, కాకి పిల్లయే! కోయిల పిల్ల కోయిల పిల్లయే! కూ కూయని కూయు కోయిల పిల్ల స్వరమాధుర్యాన్ని తట్టుకోలేని కాకి, తన గూటి

నుండి పిక శిశువును వెడలు గొడుతూంటే, కావ్ కావ్ అని దరిచేరిన పిల్లను కాకి ముద్దాడుతోంది. కాకి పిల్ల కాకికి ముద్దు కదాయని వసంతం సంతసిస్తోంది, సుస్వరాలను స్వాగతిస్తోంది!!

వసంత రాత్రులందు, చల్లని పిల్లవాయువులచే మల్లెపూల పరాగాలు రేగి వెదజల్లబడటంచే వెన్నెల రసం నిబిడమైంది. దాంతో దిగుడు బావులలోని ఎఱ్ఱకలువ పూలలోని మకరందం త్రాగిన తుమ్మెదలు, విరబూసిన ఎలమావి గుబుర్లలో దూరి ఝుంకారాలు చేస్తుంటే, విరహుల విలాపాలు వృద్ధిపొందుతున్నాయి. గుబుర్లలో కబుర్లు చెప్పుకొనే సరసుల సరాగాలు, అనురాగాలతో వంతపాడుతున్నాయి. మధుపాన మత్తచిత్తుల కోర్కెలు చివురులొత్తుతున్నాయి.

వాసంతిక విందున తేటులు త్రేన్చాయి. తుంగభద్రానదీ తీరమందలి ఉద్యానవనశోభ, వసంతుని రాకతో ద్విగుణీకృతమైంది. వనమందలి సరస్సులు, విరిసిన పూలతో, తామరాకులతో, శీతలసుగంధ వాయువులతో సరసులను దరికి పిలుస్తున్నాయి. పూదేనెలతో కడుపు నిండిన తుమ్మెదలు విహరించు పూదోటలు సరోవర తీరాలకు మరింత శోభను సమకూరుస్తున్నాయి. తాటితోపులు తలలూప, సాల రసాలపనస నారికేళాదితరువులు పరువాలనందిస్తున్నాయి. వేరుపనస పండి, నేల పగుళ్ళలోంచి తొంగిచూచి, చిట్లి మధుర రసాలను చిందిస్తూంటే, ఆ సుగంధ బంధురమౌ తియ్యటిరసాన్ని జుర్రిన ద్విరేఫాల ఝుంకారాలు, ప్రియ భక్తులపాలిటి ఓంకారాలు! సరోవరాలపై నుండి వచ్చు చిరుగాలుల తాకిడికి తీరాన గల కొబ్బరిచెట్లు బరువెక్కిన గెలలతో తలలూపుతుంటే, వాటినిండ నిండైన బొండాలు కదలాడుతూ, చూపరుల కనులకు పండుగ చేస్తున్నాయి. చింత చిగురు నోరూరిస్తోంది.

అనాస పునాసల సువాసనలకు ముక్కుపుటాలదురుతున్నాయి. పక్వానికి వచ్చిన ఉసిరిక కాయలగుత్తులు, జంపతుల చిత్తాల్ని దోచుకొంటున్నాయి. చింత తోపులు వింత కాముకతల్ని కల్గిస్తున్నాయి. లేలేత చిగురులు కొరికిన కోయిలల పంచమస్వరాల పిలుపు పిలుపున, ప్రియుల వలపుతలపుల తలుపులు తెఱచుకొంటూంటే రసికకిసలయపాణుల గుసగుసలతో వలపుల కిసమసలు జతకూడుతున్నాయి. దోరజామిపండ్లు కొసరి కొసరి రుచి చూచిన చిలుకల కులుకుపలుకులు వారి రసహృదయాలకు చక్కెర పలుకులై మరింత మరులుగొల్పి పరవశింపజేస్తున్నాయి.

సురపొన్న, వనమను లక్ష్మీదేవి కొప్పుపై ముత్యాల వల వలె విరిసి ప్రకాసిస్తోంది.

మదనుని నిప్పుకల బాణంలా సంపెంగలు పూచినవి.

ఇలా వసంతం, మనస్సంతా గోలచేస్తుంటే, రాజులకు ప్రీతిపాత్రములైన వసంతోత్సవాలను, జనాళి అత్యంతోత్సాహాలతో జరుపుకొంటున్నారు.

సంపన్నులు, చిరుబంతి పసుపును, గాజు కుప్పెల కస్తూరికా జలాన్ని జల్లుకొంటున్నారు. కుసుమరజాలు, పసుపు గంధాలు, ఒకరిపైనొకరు వేసికొంటున్నారు. పచ్చకర్పూరాది సుగంధ ద్రవ్యాలు, పన్నీరు, రకరకాల రంగునీళ్ళు పిచికారీలతో చిమ్ముకొంటున్నారు. ఘుమ ఘుమలాడు కస్తూరి పంకాన్ని పూయుట, కుంకుమ జల్లుట, మృదు మధురసల్లాపాలతో ఆటపాటలు సాగించుట, చిరునవ్వుల పువ్వుల రువ్వులు, వసంతోత్సవాలవేడుకలే! మీసాల కంటిన సుగంధ రజమును విదిర్చికొను రాచలెంకలు, పడతులపై పచ్చ కర్పూరాన్ని జల్లి, పన్నీరు చిలుకరించి, వారి క్రీ గంటి చూపుల తూపులకు నొచ్చుకొన్నా, గ్రచ్చుకొంటున్నారు. అప్సరసల్లాంటి అందాల రమణులు, మధురాతి మధురతరమైన ద్రాక్షా రసాన్ని సేవించి, వెన్నెలవేళ అత్యుత్సాహంగా బంగారు వీణెలను వాయిస్తూ, ముత్యాలశాల వైభవ ప్రాభవ గీతాలనాలపిస్తున్నారు.

వసంతోత్సవాలలో, భాగోతుల బుచ్చిగాడు, స్త్రీ వేషాన్ని ధరించి ఆడుతూపాడుతూంటే, 'పెండెలనాగి' చక్కగా అభినయిస్తోంది. యక్షగానాలు రక్తి కట్టిస్తున్నాయి. కొందరు స్త్రీలు గొండ్లి యాటనాడుతున్నారు.

ప్రతియేట అత్యంత వైభవోపేతంగా జరుగు వసంతోత్సవాలకు సుదూర ప్రాంతాలనుండి ఎందరో వస్తూనే ఉంటారు. వారిలో నూతనంగా వచ్చువారు, విజయనగర సామ్రాజ్యవైభవాన్ని చూచి చకచ్చకితులవుతున్నారు. ఈ సువిశాల సామ్రాజ్యానికి ఉత్తరాన తూర్పు వాహినిగా తుంగభద్రానది ప్రవహిస్తోంది. ఈశాన్యంలో శ్రీ విఠలస్వామి కోవెల, నిత్యనైవేద్యాలతో షోడశార్చనలనందుకొంటోంది. దక్షిణంగా రాజభవనాలు; ఇదంతా శ్రీ విద్యారణ్యస్వామివారి వాస్తుశాస్త్ర పరిజ్ఞానానికి మచ్చుతునక! ఇరువది యడుగుల మందంతో ముప్పది యడుగుల ఎత్తుగల కోటగోడ నాలుగు కోసుల పొడవు కల్గి, పండ్రెండు కోసులు నగరం చుట్టూరా ఏర్పాటుచేయబడింది. పరిఖ గుడివోలె, చుట్టు తిరిగి, పరుల కెవ్వరికి గ్రహణ గోచరంగాక. ప్రౌఢ దేవరాయభాషిత విషమ భాష్య ఫక్కివలె విజయనగరం శోభిస్తోంది!

వాస్తుశాస్త్ర ప్రకారమే నగరమంతా నిర్మింపబడింది. రెండువందల అడుగుల వెడల్పు కల్గిన రాజమార్గాలు. దానికిరువైపుల రాజప్రాసాదాలు, అంతఃపుర భవనాలు, జలక్రీడా

సరస్సులు, ప్రత్యేక వినోదవనాలు. ఆ పై మంత్రుల భవంతులు, పిమ్మట దండనాయకుల, చతురంగసేనాపతుల, అతిధుల భవన సముదాయాలు. ఈ భవంతులపై నెలరాజు, తారామణులతో బంతులాటలాడుచున్నాడు. తమకు విశ్రాంతి నొసంగినందులకై పయోధరాలు సౌధాలను చల్లబరుస్తున్నాయి! కోట బురుజుల గవాక్షాల నుండి యక్షులు ప్రయాణిస్తున్నారు.

విజయనగరంలో రాజమార్గానికి నాల్గుదిక్కులా చాతుర్వర్ణాల వారికి పేటలున్నాయి. చూడముచ్చటైన వీధులు, భూమిలో నుండి మురికి నీరు పోవు మార్గాలు, చెత్తచెదారాలు కంటపడకుండా, క్షణక్షణం శుభ్రపరచు వినూత్న పద్ధతులనవలంబించు రాజభటులు, చోరులనొకకంట కనిపెట్టే వేత్రహస్తులు. కొట్లాటలు, పోట్లాటలు జరుగకుండా చూచు దండనాయకులు, కఠిన శిక్షలతో ధర్మాన్ని కాపాడే ప్రభువులు, కవి పండితులకు సంగీత నృత్య కళాకారులకు ఉచితరీతిని నిర్మించిన భవనాలు, నగరానికి శోభనిస్తున్నాయి. వర్తకులకు ప్రత్యేకించి విపణి వీధులేర్పాటుచేసారు. ఆ యావీధులలో నవరత్నాలను రాశులుగా పోసి, బుట్టలతోను తట్టలతోను కొలిచి అమ్ముతుంటారు. ఈ వీధులన్నీ నగరానికి దక్షిణంగా పెద్ద పెద్ద అంగళ్ళు కల్గి విరాజిల్లుతుంటాయి. అక్కడే వారి గృహాలు; వజ్ర వైడూర్య మరకత మాణిక్యమౌక్తికాది నవరత్నాల రాశులు, పట్టువస్త్రాలు, సువర్ణాభరణాలు, విపణి వీధులలో దర్శనమిస్తున్నాయి. ఒక వంక నవధాన్యాలు, మరొక వంక తినుబండారాలు, కాయగూరలు, నిత్యావసర వస్తువులు విక్రయింపబడుతున్నాయి. ఒక వీధిలో గజశాలలు, అశ్వశాలలు, శస్త్రశాలలు, మరొకవీధిలో వైద్యశాలలున్నాయి. వాటికి అనుబంధాలుగా వైద్యకళాశాలలు, విద్యాలయాలు విద్యార్థులతో కళకళ లాడుతున్నాయి. విజయనగరమను పేర విరాజిల్లు విద్యానగరమే, సకల విద్యల నిలయమై విరాజిల్లుతోంది.

శ్రీ విద్యానగర ప్రభువులైన **శ్రీ ప్రౌఢ దేవరాయలు,** అరివీరభయంకరుడై, యాచకులపాలిటి కామధేనువై, బాంధవాళి నాదరించు కరుణాసముద్రుడై, తాను స్వయముగా విద్వత్కవియై గీర్వాణాంధ్ర భాషలలో అనేక రచనలు చేసి, పండిత మండలికి ధన కనక వస్తు వాహనాదులతో బాటు, నవరత్న రాశులను సమర్పిస్తూ, సమ్మానిస్తూ కవిపండిత పోషకుడై, కుబేరుని లజ్జితుణ్ణిజేసి, జయంత వసంత కంతుల కసూయ కల్గించు రూపసియై, సంగమ కులాన్వయరత్నదీపమై, మహేంద్ర వైభవాన్ని పొందుతూ, ముత్యాలశాలను నిర్మించి, శ్రుతి ధర్మాలను దశదిశలా విరజిమ్ముతున్నాడు.

వేదశాస్త్ర పురాణాది సమస్త విద్యలనభ్యసించి, నిత్యనైమిత్తికాది సత్కర్మలనాచరిస్తూ,

యజ్ఞ యాగాది పుణ్యకర్మల నాచరించు బ్రాహ్మణోత్తములను దైవతములుగా భావించి, గౌరవిస్తూ, వారి యాశీర్వచనములను గైకొని, వారి సూచనల మేరకు ధార్మిక చక్రవర్తియై పరిపాలన గావించు ప్రౌఢ దేవరాయల గురుబ్రహ్మ - **శ్రీ చంద్ర భూషక్రియాశక్తిరాయలు.** వీరు గీర్వాణాంధ్రాద్యనేక భాషల నాపోశనము గావించిన పుంభావసరస్వతి. వేద వేదాంగాది సమస్త వాఙ్మయము వారికి కరతలామలకమే! బహు గ్రంధ కర్తలైన వీరు, పూర్వోత్తర మిమాంసా శాస్త్రములలో నిధులు. నిత్యకర్మానుష్ఠాన తత్పరులు. శ్రీ విద్యోపాసకులు. మోచక గురువులైన వీరి వాక్కుయే ప్రభువులకు ఋక్కు. ఎక్కడైతే గోబ్రాహ్మణులు, పుణ్యస్త్రీలు పూజింపబడతారో, అక్కడే సిరిసంపదలు సుఖసంతోషాలు, దేవతల దీవెనలు తప్పక ఉంటాయని, శ్రుతులు వినబడుతున్నాయి. జగత్తంతాదైవాధీనమే! దైవము, మంత్రాధీనుడు. ఆ మంత్రము బ్రాహ్మణాధీనము. అందుకే శ్రుతి ధర్మాలనాచరించు బ్రాహ్మణోత్తముడే నాదైవమని శ్రీహరి తెల్పినట్లు రాయలవాణి!

అపరచాణక్యునిలా వెలుగు **శ్రీ చామనామాత్యులే,** శ్రీ విజయనగర మహామాత్యులు. వీరు నీతి శాస్త్రాంబుధిని ఆపోశన గావించిన అపర బ్రహ్మ. భారతీయ భాషలన్నింటిలోను దిట్ట. వీరు కలంపట్టటంలోను, కత్తి త్రిప్పటంలోను, మంత్రాంగం నడపటంలోను సాటిలేని మేటి! వీరి పరమార్థం - త్రివేణీ సంగమతీర్థాన్ని సేవించటమే! అందుకే వసంతోత్సవాలనత్యంత వైభవోపేతంగా నిర్వహించిన, శ్రీ విజయనగరాభివృద్ధి మంత్రిణి **శ్రీమతి విజయలక్ష్మి** గారికి, శత్రురాజులను చిత్తుగా నోడించి రాజ్యవిస్తరణ గావించిన సేనాధిపతి **శ్రీసాంపరాయని తెలుంగాధీశులకు,** శ్రీ విద్యానగర దళవాయి, మోపూరుపై అధికారి, నూతనంగా మంత్రి పదవినలంకరించిన **వల్లభునకు,** విద్యాలయాలన్నింటిని కంటికి రెప్పవోలె చూచు కులపతి **రాజనాధునకు,** శ్రుతివిహిత కర్మలన్నింటిని సంరక్షిస్తూ, త్రికాల సంధ్యావందనం చేస్తూ, స్వాధ్యాయ ప్రవచనాలలో జాగరూకుడై హైందవ ధర్మాలనాచరింపజేయు రాజకులపురోహితులు **బహ్మశ్రీ సుబ్రహ్మణ్యశ్రౌతి** గారికి, పంటలను బాగుగపండించు కర్షకోత్తములకు, సంగీత సాహిత్య సాంస్కృతికాది సమస్త కళలలో ప్రావీణ్యము సముపార్జించిన మహనీయులకు, ముఖ్యంగా దేశ విదేశాలలో రత్నరాశు లతో వ్యాపారం చేస్తూ, స్వదేశ రక్షణకై లక్షల దీనారాలను ధారపోయు, మిత్రులు అవచి తిప్పయ్య శ్రేష్ఠి గారికి ముత్యాలశాలలో ఘనసన్మానాలేర్పాటు గావించిన సందర్భాన, పురప్రజలు తండోప తండాలుగా వచ్చి, ముత్యాలశాలలో ఆశీనులయ్యారు. ఆహూతులైన వారంతా తమతమ ఆసనాలనలంకరించారు. ఇసుకేస్తే రాలనంత మంది జనం.

ఆ నిండు పేరోలగాన, శ్రీ విజయనగర మహామాత్యులు శ్రీ చామనామాత్యులు, తమ సువర్ణాసనంలో ఆశీనులయ్యారు. ఎత్తైన వేదికపై గల ముత్యాల స్తంభాల మధ్యగల బంగరు గద్దెపై నవరత్న ఖచిత సువర్ణ సింహాసనం మంచి ముత్యాలహారాలతో శోభిస్తూ, చూపరుల్ని అనిమిషుల్ని గావిస్తోంది. అదే ప్రౌఢరాయల సింహాసనం. దాని ప్రక్కనే రాజకులగురు బ్రహ్మల దివ్యాసనం. ఆ ప్రక్క ప్రత్యేకాహ్వానితుల మౌక్తికాసనాలు. ఈ ప్రక్క మహామంత్రి, తదితర మంత్రుల సువర్ణాసనాలు.

మహామంత్రికి నమస్కరించిన కులపతి రాజనాధుడు వారి యనుజ్ఞపై తమ ఆసనాన్నలంకరించారు. అపుడే విచ్చేసారు, నగరాభివృద్ధి మంత్రిణి. ఇంతలో వల్లభామాత్యుడు కూడవచ్చి, మంత్రి గార్కి నమస్కరించాడు. మహామంత్రి వారిద్దరిని కూర్చోమని చెప్పటంతో, వారుభయులు వారివారి యాసనాలనలంకరించారు.

ముత్యాలశాల కేవలం పండిత సదస్సుకే కాదు, రహస్యమంత్రాలోచనలు చేయడానికి, సకల కళలను ప్రదర్శించడానికి, సత్కారాలకు ప్రధానవేదిక.

శ్రీ విజయనగరాభివృద్ధికై అహర్నిశలు కృషిచేయు మహామాత్యుల అసాధారణసాధు మేధాసుధారకు ప్రజలేకాదు, మేమును అధమర్ణులమే! అని పల్కిన నగరాభివృద్ధి మంత్రిణితో, శ్రీమతి విజయలక్ష్మి గారూ! నేను నిమిత్తమాత్రుణ్ణి! అంటూనే చిర్నగవులుచిందించి, శ్రీ ప్రభువుల శౌర్యధైర్యసాహసాలే అభివృద్ధికి ప్రధాన కారణాలు. ప్రభువులు, రాజకీయమంతనాలు నెఱపుటలో సిద్ధహస్తులు. చక్రవర్తులు చారచక్షువులు; ఒంటినేతెంచి, ఇఱు చెవినెఱుగకుండ హితకార్య చర్చచేయుటలో తలపండినవారు. అందుకే వారు దక్షిణాధీశ్వరులైనారు అనిన మహామంత్రి పలుకులు విని తలయూపిన వల్లభుడు, మెల్లగా – గుప్త మంత్రతను, గూఢచారపరిరక్ష చేసిన రాజు చతుస్సముద్రముద్రిత నిఖిలోర్వినంత స్థిరంగా పరిపాలిస్తాడని విన్నానన్నాడు.

ఇది ముమ్మాటికీ నిజమన్నాడు, కులపతి రాజనాధుడు.

అంతేకాదు, అందరి సహాయ సహకారాలు లభిస్తేనే, రాజ్యం సుస్థిరంగా నిలుస్తుంది. మూడుపువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతుంది. విజయనగరాభివృద్ధికి మన ప్రజలెంతగానో సహకరించారు. రాజ్య సంరక్షణ, ప్రతిపౌరుని ప్రథమ కర్తవ్యం. విద్యాబుద్ధులతోపాటు, శౌర్యసాహసాలను, చిననాటినుండే తల్లులు ఉగ్గుపాలతో రంగరించి నేర్పాలి..... అంటూనే, రాజనాధుని వైపు చూస్తూ, ఏం కులపతీ! విద్యాలయాలలో విద్యార్థులకు కేవలం చదువు మాత్రమే కాదు, ఆటపాటలతోపాటు కత్తిసాము, కర్రసాము కూడ నేర్పిస్తున్నారు కదా!...

అంటూంటే, ఔనన్నట్లు తలాడించాడు, రాజనాధుడు.

వల్లభా! మీరు ముగ్గురూ, ప్రత్యేక శ్రద్ధవహించి పిల్లలలోను, తల్లులలోను దేశభక్తిని పెంపొందించండి. వీరపుత్రులు, వీరమాతలు, వీరపత్నులు, వీరవనితలు పుట్టిన ధరిత్రియే ఈ భరతభూమి. ఈ గడ్డపై పుట్టిన ప్రతిబిడ్డ దొడ్డవాడే! అమృతపుత్రులైన వీరికి శ్రుతిధర్మాలు బోధించి, విశ్వకళ్యాణ కారకుల్ని గావించండి!

అమాత్యుల ఆంతర్యాన్ని అర్థం చేసికొన్నారు. అలాగే మహామాత్యా! అన్నారు. వల్లభా! తప్పుచేసిన వారిని కఠినంగా శిక్షించాలి. శిక్షలను కఠినంగా అమలుచేసిననాడే, తప్పులు దొర్లకుండా ఉంటాయి. చోరుల్ని ఓ కంట కనిపెట్టాలి. బాహ్యశత్రువులనే కాదు, అంతః శత్రువుల్ని కూడ పట్టుకొని శిక్షించే బాధ్యత నీ భుజస్కంధాలపై పెడుతున్నాను. అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా చూసే బాధ్యత కూడా నీదే సుమా! అందుకు సచ్ఛీలవంతులైన అధికార యంత్రాంగాన్ని నియమించు! వారిని కూడ నీవే ఓ కంట కనిపెడుతూండాలి. ఎందుకో తెలుసుకదా! అన్నారు, ప్రధానమంత్రి!

ఊ... అంటూనే, "కంచియే చేనుమేసిన కలదెదిక్కు" అన్నాడు వినయంగా. వల్లభా, అతివినయాన్ని ప్రదర్శించే వారిని నమ్మకూడదు సుమా!... అన్నారు, నవ్వులు రువ్వుతూ. అవును ప్రధానామాత్యా! " అతివినయం ధూర్తలక్షణం" కదా!... అన్నాడు వల్లభామాత్యుడు. విన్నట్లుగా కనురెప్పలనప్పళించి, నగరాభివృద్ధి మంత్రిణితో – విజయలక్ష్మీ! విజయనగరంలోని స్త్రీలకు ధైర్యసాహసాలను మరింతగా పెరిగేలా విజ్ఞాన సదస్సులను ఏర్పాటుగావించు. గృహిణి, విజ్ఞానవంతురాలైతే ఆగృహమంతా విజ్ఞాన కాంతితో వెలుగుతుంది. అలా గృహాలన్నీ జ్ఞానకాంతులతో ప్రకాశిస్తూంటే గ్రామాలే కాంతిమంతమవుతాయి. తద్వారా దేశం విజ్ఞాన నిలయం కాగలదు. ఇది మీకు తెలియని విషయంకాదు. అలాగే భక్తి ప్రపత్తుల్ని మేల్కొల్పాలి. దంపతులకు సదస్సులనేర్పాటు గావించి, దాంపత్య ధర్మాన్ని బోధించాలి. ధర్మంతో కూడిన అర్థకామాలను కోరేవారే, కైవల్య ప్రాప్తికి అర్హులు. ఆలుమగలు–ఇంటగెలిచి రచ్చగెలవాలి. . . ఇదంతా శ్రద్ధగా విన్న మంత్రిణి – " అలాగే మహామాత్యా!" మీరు చెప్పినట్లే యధాశక్తి కృషిచేస్తాను – అనటంతో, ప్రక్కనే వింటున్న రాజనాధుడు, అమాత్యవర్యా! రక్షకభట శిక్షణాలయాలలో యుద్ధవిద్యలెన్నో నేర్పుతున్నాం. వారికి యోగాసనాలు కూడ నేర్పించాలని నా తలపు. మీరేమంటారు? అన్నాడు. మీసూచన సముచితంగా ఉంది. మన వల్లభుడు యోగదర్శనాన్ని కంఠపాఠం చేసాడు... అంటూనే ప్రధానామాత్యులు, వల్లభా! రాజనాధుని సూచన

విన్నావుగా. నీవు కులపతికి సహకరించాలి. రక్షకభటులు, సదా ఆరోగ్యవంతులై, నీతిమంతులైననాడే, దేశం రక్షింపబడి, ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తారన్నారు.

ప్రధానామాత్యా! మీ పర్యవేక్షణలో చోరులు పగటి నక్షత్రాలేకదండీ!... అనిపల్కిన వల్లభుని వంకచూసి, వల్లభా! నక్షత్రాలు గగనంలో ఎప్పుడూ ఉంటాయనేగా నీ ఉద్దేశ్యం. సూర్యప్రతాపానికి అవి కనబడుటలేదంటావ్! అంటే చోరులున్నారంటావు... అన్నారు ప్రధానమంత్రి తార్కిక బుద్ధితో! వల్లభుడవాక్కయ్యాడు.

ప్రభువుల దివ్యతేజస్సుకు, చోర నక్షత్రాలు పగలు కనబడవు, రాత్రి ప్రభువుల ప్రతాపాగ్నికి భయపడి, అవి మిణుకుమిణుకుమంటూ వణకుతున్నాయి. ప్రభువులు - పగలు సూర్యునిలా ప్రకాశించి, రేయి ప్రతాపాగ్నిలో ప్రవేశించు ధర్మమూర్తి. " దినాంతేనిహితంతేజః సవిత్రేవహుతాశనః" అంటూ, రాజనాధుడు, మహాకవి కాళిదాసు వాక్కును స్మరించి, శ్లాఘించాడు. మహామంత్రిని సంభావించాడు.

ప్రభువుల పేరు వింటే చాలు, అధర్మ దేవత-తనక్రీగంటి చూపు కూడ విసరుటకు సాహసింపదు, తేజః కీర్తుల ఛత్రమును కూడ కల్గి, జయ శ్రీ వధూటీ సమాశ్లిష్టభుజుడై, జిహ్వాగ్రమందు సమస్త విద్యలను నర్తింపజేయుచున్న ప్రౌఢ దేవరాయలు, ప్రజల క్షేమం కోరి, వేదపండితులకగ్రహారాలు దానంచేసి, వారిచే యజ్ఞాలు చేయిస్తున్నారు.

యాగాలు చేయు, ఋత్విక్కులు బ్రహ్మలు, హొతలు, అధ్వర్యులు, అందరి క్షేమాన్ని కోరు రాజకుల గురు బ్రహ్మలు, హితాన్నికోరు పురోహితులు, ప్రభువులచే నేడు సత్కారాలందుకొంటున్నారు. వారందరిని సాదరంగా ఆహ్వానించు బాధ్యత, వల్లభుడు స్వీకరించి, సన్మానితులను ప్రోత్సహించాలి. కులపతి, వారికీయవలసిన బహుమతులు సమకూర్చాలి. మీకు, విజయలక్ష్మి గారి సహకారం తప్పక లభిస్తుందన్నారు, మహామంత్రి.

ద్విజుల దివ్యాశీస్సులే విజయనగర విజయపతాకలు. నగరానికి రక్షణ-గోసంరక్షణ. గోసంపదను వృద్ధిచేయండి. పంచగవ్యప్రాశనయే - పంచ ప్రాణాలను నిలబెట్టు దివ్యౌషధం. గోపాద ధూళి, ప్రజాళిని పునీతుల్ని చేస్తుంది. పోతరించిన గిత్తలే, భూమిని దున్ని మంచి పంటలకు దోహదం చేస్తున్నాయి. వాటిని పెంచి పోషించు రైతులే రాజ్యాభివృద్ధికి ముఖ్యకారకులు. **అన్నదాత రైతన్న - దేశానికే వెన్నెముక! రైతుల యోగక్షేమాలే సామ్రాజ్యాభివృద్ధికి శ్రీరామరక్ష!...** అనిపలికే శ్రీచామనామాత్యులు, వర్ణ ధర్మాలను కాపాడాలని, కులవృత్తులను ప్రోత్సహించాలన్నారు. వింటున్న విజయలక్ష్మి - పశుసంపద గల రాజ్యమే సుభిక్షంగా ఉంటుందన్న భీష్మవచనాలను గుర్తుచేసి, గోవులతో గొర్రెలతో

మేకలతో కోళ్ళతో నెమళ్ళతో రకరకాల పక్షులతో రైతుల భవనాలు శోభిస్తున్నాయన్నారు. వీరి పెంపకంలో జంతువులు తుష్టిగాతిని, పుష్టిగా ఉన్నాయి. వరిసాగు పొలాలు, బలమైన ధాన్యపు కంకులతో రకరకాల పప్పుధాన్యాలతో కాయధాన్యాలతో కళకళలాడుతున్నాయి. కొర్రలు, జొన్నలు పుష్కలంగా పండుతున్నాయి. ఆశ్చర్యం గొలిపేటంత ప్రమాణాలతో రైతు బిడ్డలు, పంటలు పండిస్తున్నారు. శ్రేష్ఠమైన పంటల్ని పశువులకు, జంతు జాలానికి ఆహారంగా అందజేసి మేపుతున్నారు. మంచి పంట ధాన్యాలను, ఏనుగులకు, గుఱ్ఱాలకు దాణా క్రింద వేస్తున్నారు. పచ్చిగడ్డిమేసి, పశువులు చిక్కని పాలిస్తున్నాయి. తుంగభద్రా నదీజలాలు మంచి నీటినందిస్తున్నాయి. మంచి పండ్ల చెట్లు, ఫలాలనిస్తున్నాయి... అని నిజాలను చెపుతూంటే

అవునవును, అందుకే ఈ శరీరాన్ని కూడ పరోపకారార్థమే నియోగించాలి - అంటూనే, నగర వాసులందరికీ సరిపోగా మిగిలిన, ఆహార ధాన్యాలను జాగ్రత్తగా నిల్వజేసి ఉంచాం! వాటిని బాధిత కుటుంబాలకందజేయండి. కూడు, గుడ్డ, గూడు లేకుండా ఎవ్వరూ మన నగరంలో బాధపడరాదని మహామాత్యులు హెచ్చరించారు. అంతా శిరస్సులు వంచారు.

మహామాత్యులు తెలిపినట్లే, నగరానికి ఈశాన్యంలో వాస్తు శాస్త్రరీత్యా నీరుండాలి కనుక, చూడ ముచ్చటైన క్రీడా సరస్సు నిర్మింపజేశామని, వాటి తీరాలలో పూలతోటలు పెంచామని, మంత్రిణి మనవి చేసారు. టంకసాలలు నిర్మించిన విషయాన్ని కూడ తెలిపారు. బంగారం, వెండి, రాగి నాణెములు ముద్రించినట్లు వివరించారు.

వరాహ చిహ్నములతో ముద్రించిన బంగారు నాణెములను వరహాలు అనేవారు. ఇదే అన్నిటి కన్నా పెద్దది. దీనిని గద్యాణమనే పిలిచేవారు. తర్వాత ప్రతాపాలు. వీటినే మాడలంటారు. అటుపై పణాలు ముద్రించేవారు. పణములో ఆరవ భాగము తారము. తారములో మూడవ భాగము నాణెము. టంకముద్రకల బంగారు నాణెములకు విలువ హెచ్చు. 'కాసు' లు కూడ ముద్రించేవారు. వస్తు మారకాన్ని తగ్గించి, నాణెములకే హెచ్చు విలువనిచ్చారు. టంకముద్రపొందిన బంగారు నాణెములే టంకాలుగా పేరుగాంచాయి. సువర్ణ వరహాలే దీనారములు. ఈ వరహాలకే అగ్రతాంబూలమని వల్లభుడు మనములో తలచాడు.

వల్లభుని, దీనారటంకాల యోచనను గ్రహించి, మహామాత్యులు, వాని దృష్టి మరలించాలని తలచి - వల్లభా! మన సంస్కృతికి ప్రతీకలే దేవాలయాలు. నిత్య ధూపదీప నైవేద్యాలతో దేవతామూర్తులు షోడశార్చనలందు కొన్నంతకాలం, ప్రజల సుఖశాంతులకు

లోటులేదు. దేవాలయ భూములు సురక్షితంగా ఉండడానికై తగు శాసనాలు వేయించండి. ప్రతిష్ఠించిన మూర్తులకు నిత్యపూజలు జరిగేలా, అర్చక స్వాముల గృహాలను దేవాలయ ప్రాంగణంలోనే నిర్మించండి. వారికి వలసిన సంబారాలన్నీ సమకూర్చండి. ప్రతి దేవాలయంలోను నిర్మించిన సరస్సులను సంరక్షించండి. గుడి గోపురాలపై చెక్కబడిన శిల్పసౌందర్యాన్ని కాపాడండి! ప్రతి దేవాలయంలోను, దైవం ఎదుట నాట్యంచేసి పరమాత్మను మెప్పించే నర్తకీమణులకు రాయలవారొసంగిన మాన్యాల రక్షణ మీదే, అనిన మాట విన్నంతనే – ఆ విషయాలన్నీ భద్రంగానే పర్యవేక్షిస్తున్నాడీ వల్లభుడన్నాడు.

వల్లభుని ఆంతర్యాన్ని అర్థం చేసికొన్న ప్రధానామాత్యులు, చిరునవ్వులుచిందించి, వల్లభా! నువ్వు అంతటివాడవే! క్రీడాభిరాముడివి కదా! ఈ మధ్య తెలుగుభాషలో పద్యాలు వ్రాస్తున్నావని విన్నా.

తెలుగు భాష తెలివి తేటల పూదోట!

తెలుగు భాష మాతృదేవి మనకు!

తెలుగు భాష జిలుగు దేశానికే వెల్గు!

విశ్వభాషలందు వెలుగు తెలుగు!... అంటూంటే, అసంకల్పితంగా మంత్రిమండలి కరతాళధ్వనులు చేసారు.

వల్లభుని కుడిచేయి, మహామంత్రి కుడికాలుపైన, వాని ఎడమచేయి, వారి ఎడమకాలిపైన వేసి నమస్కరించాయి. అంతేకాదు, ఆనంద బాష్పాలతో వారి పాదాలను అభిషేకించిన వల్లభుడు – ఆహా! మీనోట వెలువడిన నాలుగు మహావాక్యాలు, ఆటవెలదినందించాయి! దేశభాషలన్నీ వచ్చిన మీకు, తెలుగు భాషపై మక్కువ ఎక్కువని, నేడు చెవులారా విన్నా! ప్రపంచ భాషల్లోనే తెలుగు వెలుగుతుందన్నమాట మీకే చెల్లుతుంది. మీకు ఎన్నెన్నో భాషలు నల్లేరుపై బండినడక. నాకు, తెలుగులో కవిత్వం అంతంత మాత్రంగా వచ్చు. అయినా వ్రాయుటకు సాహసంచేసాను. కవులు, సత్కావ్య రచనలు చేసి జీవిస్తారు. సత్కీర్తినిచ్చేది కవితయే! అందుకే క్రీడాభిరామాన్ని వ్రాస్తున్నా. ఈమధ్యనే వసంతోత్సవాలలో ఓ మహాకవి మిత్రుడై, ఆకావ్యరచనలో నాకెంతగానో సహకరించాడు. అతని జిహ్వాగ్రంపై సకల శాస్త్రాలు నర్తిస్తున్నాయంటూ, అతని గురించి కొంత ముచ్చటించాడు.

వల్లభా! ఆహూతులైన అతిధులు వస్తున్నారన్న వార్త, ఇప్పుడే అందినది. నీవు కులపతిని, మన మంత్రి మండలిని తీసికొని, ముత్యాలశాలకు విచ్చేయువారిని సాదరముగ

లోనికి ఆహ్వానించు... అన్నారోలేదో, అలాగేనండీ! అని వారలను తీసికొని ముత్యాలశాల ముఖద్వారం వైపు నడచాడు. అంగరక్షకులు వెంటనడచారు.

శ్రీ చామనామాత్యుల మదిలో శ్రీ ప్రౌఢ దేవరాయుల దినచర్య మెదలింది.

రాయలవారు, వఋవాతనే లేచి, కులదైవానికి నమస్కరించి, కాలకృత్యాలు తీర్చుకొని, ఒక చటాకు నువ్వులనూనె త్రాగి, బరువైన లోడీలతో వ్యాయామ పరికరాలతో, త్రాగినపప్పు నూనె జీర్ణించుకొనే వరకూ వ్యాయామం చేసేవారు. తర్వాత బలిష్ఠులైన వస్తాదులు రాయల శరీరంపై నువ్వులపప్పు నూనె వ్రాసి మర్దించేవారు. ఆపై ఓ గంటసేపు వస్తాదులతో కుస్తీ పట్టేవారు. తర్వాత రకరకాల ఆయుధాలతో సాముచేయటం, యోగాసనాలు వేయటం, నడవటం చేసేవారు. ఆపై రాయలవారి పన్నీటిస్నానం. సేవకులు, మహారాజు గారి శరీరాన్నిండా పిండిపూసి బాగా రుద్దుతూ తలంటుస్నానం చేయిస్తూంటే – వేదపండితులు స్నాన మంత్రాలు వల్లిస్తారు. స్నానం పూర్తయ్యాక, పలుచని వస్త్రాలతో తుడిచి సాంబ్రాణి పొగవేస్తారు. పట్టుపీతాంబరాలు ధరిస్తారు. ముత్యాలహారాలతో అలంకరణ, పునుగు, జవ్వాది, కస్తూరి, రాజ దుస్తులకు పూసి, కేశాలంకరణ కూడ పూర్తయిన తర్వాత దైవదర్శనం. దేవేరితో పూజలు చేస్తారు. అర్ఘ్యపాద్యాలు సమర్పించి, ఆచమనం చేసి, విరూపాక్షుని పంచామృతాలతో స్నానం చేయించి వస్త్రద్వయాన్ని యజ్ఞోపవీతాన్ని సమర్పించి, మంచి గంధాన్ని పూసి, అక్షతలతో నర్చించి, సువర్ణాభరణాలు మంచి ముత్యాలహారాలు సమర్పించి, పుష్పాలతో పూజించి, ధూపదీప నైవేద్యాల నర్పించి, కస్తూరి తాంబూలమిచ్చి, నీరాజన మంత్ర పుష్పాలతో షోడశోపచారాలు చేసి, ప్రదక్షిణ, సాష్టాంగ నమస్కారాలు పూర్తయ్యాక, బ్రాహ్మణాశీర్వచనాలు పొంది, ఆవుపాలు ఆవు నెయ్యి ఆవు పెరుగు తేనె పంచదారలతో కలసిన పంచామృతాన్ని సేవించి, తీర్థప్రసాదాలు స్వీకరించి, అర్చక స్వాములకు పట్టు పీతాంబరాలతో వరహాలతో కస్తూరికా తాంబూలములనిచ్చి, పునః దీవెనలనొంది రాజప్రాసాదానికి వచ్చే దృశ్యాన్ని తిలకించారు. జలతారుతో నగిషీ చేయబడిన పాముకుబుసంలాంటి తెల్లని పట్టు వస్త్రాలు ధరించారు. నవరత్న మాలికలు, మంచి ముత్యాలహారాలు కంఠసీమ నలంకరించాయి. ఆపై పౌష్టికాహారాన్ని భుజించి, చిక్కని పాలు త్రాగి, భట్టులు ముందు నడుస్తూ కైవారాలు చేస్తుంటే, మంగళ వాయిద్యాలు మ్రోగుతూంటే, పూర్ణ కుంభాన్ని పుచ్చుకొని వేదపండితులు స్వస్తి వచనాలు పఠిస్తూంటే, పట్టపేనుగు నెక్కి, పంట మైలారురెడ్డి వంటి సామంతులు వెంట రాగా ముకుటధారియై చతురంగ బలాల ప్రతినిధులతో రాయలవారు ముత్యాలశాలకు విచ్చేయు దృశ్యాన్ని

తిలకించిన మహామంత్రి, వారి రాకను మంత్రిమండలికి తెలియపరచారు. ఇంతలోనే అల్లంతదూరాననుండి డిండిమతాండవం వినిపించింది. శ్రీ విద్యానగరాస్థాన పండితులు, విద్యాధికారులు, విద్యావాచస్పతులైన గౌడడిండిమ భట్టారకుల వైభవప్రాభవాలను ప్రకటిస్తూ ప్రభువులైన శ్రీ ప్రౌఢ దేవరాయలవారు వేయించిన శాసనమందలి శ్లోక రత్నాన్ని పఠిస్తూ యిటే వస్తున్నారు. రానురాను మంగళ వాయిద్యాల నాదాలు తగ్గుముఖం పట్టడంతో శ్లోకం స్పష్టంగా వినబడుతోంది.

శ్లో॥ అగ్రేడిండిమ తాండవం, తత ఇతో వంది వ్రజోద్ఘోషణం,
ద్వితాశ్చిత్ర పటాఃకియన్తి బిరుద ప్రోతాని పద్యాని నః ।
ఆస్తాం తావదిదం మహేశ ముకుటీ కోటీర కల్లోలినీ,
కల్లోల ప్రతిమల్లసూక్తి విభవైః ద్వేష్యాన్విజేష్యామహే ॥

పవిత్ర గంగానదీ తీరవాసులై, సమస్త శాస్త్రాల నధ్యయనం చేసిన వారు మా పూర్వీకులు, నాన్నగారు కూడ శ్రుత్యాదులు చదివి దక్షిణ భారతదేశానికి వచ్చి, చేరచోళపాండ్యాది దేశాలలో ద్వాదశ దేశ్య వృత్తుల్ని సముపార్జించి, సమస్త శాస్త్రాలలోను పండితుల్ని ఓడించి, విజయానికి చిహ్నంగా డిండిమాన్ని స్వీకరించారు. " విద్వానేవ విజానాతి విద్వజ్జన పరిశ్రమమ్"... అన్నట్లుగా రాయలవారు గౌతమ గోత్రీయులైన మా గౌడీయ విప్రులను గుర్తించి సన్మానించుట, తండ్రి గారి విద్వత్తుకు తగినట్లుగా విద్యాధికారిగా నియమించుట, నన్ను కులపతిగా జేసి బాధ్యతల నప్పగించుట ఎంతో సంతోషంగా ఉన్నదని, చామనామాత్యులతో రాజనాధుడంటూంటే, వల్లభుడు విన్నాడు మెచ్చుకొన్నాడు. శాసనస్థశ్లోక మందలి ప్రత్యక్షరము సత్యమేనన్నాడు. వారి "యోగానంద ప్రహసనము", సరస్వతికి అమూల్యాభరణమన్నాడు. అభిరామాంబిక – రాజనాధుల పుణ్యఫలమే, డిండిమ కవిసార్వభౌమ అరుణగిరినాథ పండితులని కొనియాడాడు. ఇంతలో కంచు నగారా తాండవం సుస్పష్టంగా వినిపిస్తోంది. భట్టుల జయజయధ్వానాలు మిన్నుముట్టాయి.

వందిమాగధులు : అఖిల వేదసాగర సాంయాత్రిక బిరుదాంచితా!
మాఘాద్యతి వర్తి చిత్ర ప్రబంధ పరమేశ్వరా!
శ్రీ విజయనగరాస్థాన విద్యాధికారీ!
అరుణగిరి నాథా! జయహెూ!! జయజయ హెూ !!
అష్ట భాషా పరమేశ్వరా! షడ్దర్శన షణ్ముఖా!
అభినవ నాటక భవభూతీ ! గౌడవంశ కిరీటీ!!

శ్రౌతాచారపూతాత్మా ! యోగానంద ప్రహసన కర్తా !

గౌడ డిండిమ భట్టారకా ! జయహో ! జయజయహో ॥

అని జయజయధ్వానాలు చేస్తుంటే, గౌడ వంశోద్భవులై శివలింగారాధన వ్రతులగు శైవాగమజీవాతువులు, పరమమాహేశ్వరులు, కవిమల్ల గల్ల తాడన పటువని కీర్తింపబడు డిండిమ కవి సార్వభౌములు ముత్యాలశాల ముంగిట నున్న విఘ్ననాయకులగు శ్రీ విఘ్నేశ్వర విష్వక్సేనులకు హారతులిచ్చి, ఆహ్వానింప వచ్చిన అమాత్యులనాశీర్వదించి, ముత్యాలశాల ప్రవేశించి, మహామంత్రికి ఏటికోళ్ల నర్పించి, వారి అనుమతిపై హైమాసనమధిష్ఠించారు.

అరుణగిరినాధుల విద్యాదర్పాన్ని గమనిస్తూంటే, తెలుంగాధీశుల రాక తెలిసింది. శ్రీకాకుళాన్ని రాజధానిగా చేసికొని, వెలనాటి సీమనేలు తెలుంగాధీశులు విజయనగర దుర్గాధ్యక్షులుగా నుండి, సేనాధిపత్యం వహించి, ఈల గ్రద్దలను సంహరించి శత్రువులను తుదముట్టించి, విజయనగర సామ్రాజ్య సామంతమండలేశ్వరులుగా ఘనకీర్తి నార్జించి, రాయల కీర్తిప్రతిష్ఠలను ద్విగుణీకృతం చేసిన మహనీయుల రాక, ఈ వసంతోత్సవ సదస్సుకే వన్నె తెస్తుందంటూనే మంత్రి మండలితో ఎదురేగి వెళ్ళారు ప్రధానమంత్రి.

వందిమాగధులు : శ్రీ శ్రీ శ్రీ శ్రీమన్మహామండలేశ్వర మేదినీ మీసరగండ కఠారి

సాళువ ధరణీశా! జయహో! జయజయహో!!

కటకపాల పదవీ విరాజితా! దుర్గాధ్యక్షా!! జయహో! జయజయహో!!

సామంత మహా మండలేశ్వరా! సాంపరాయని తెలుంగాధీశా!!

శ్రీనాధ విరచిత "వల్లభాభ్యుదయ" కృతిపతీ! జయహో! జయజయహో!!

అని వందిమాగధులు కైవారాలు చేస్తుంటే, దేవసేనాని కార్తికేయునిలా తెలుంగాధీశులు దర్శనమిచ్చారు.

వీర రసావతారమే రూపుదాల్చినట్లున్న ధీర శిఖామణికి మంత్రులు స్వాగతం పలికారు. వల్లభుడు, పూలవర్షాన్ని హర్షంతో కురిపించాడు. నతులు, నుతులు చేసాడు. వారు పెద్దలకు ప్రణతులర్పించి, స్వర్ణ సింహాసనాధిష్ఠితులయ్యారు. ప్రధానామాత్యులకు, ప్రణామాలందజేసాక, వారి మంత్రాంగానికి యంత్రాంగానికి తంత్రాంగానికి పౌనఃపున్యాభి వందనాలర్పించి, ప్రత్యభివందనాలందుకొన్నారు. చామనామాత్యులు, చిర్నగవుతో ఇలా అన్నారు. సొగసులొలుకు తెలుగు పలుకులకు జిలుగుల నందింపజేయు మీ ధీశక్తికి, జోహార్లు. మీరు సాహితీరంగమునకే గాక, సమరాంగణప్రాంగణాన కూడ తిరుగులేని శౌర్య సాహసాలను చూపిన యుద్ధండులు, మీవంటి పరాక్రమశాలి, సేనాధ్యక్షులై

శత్రురాజులనోడించి, విజయనగర సామ్రాజ్య విస్తరణకు కారణభూతులగుట గర్వకారణం! నాటి సాటి లేని మేటి సాహసాన్ని తలచినకొలది, మా శరీరం గగుర్పొడుస్తోంది. శత్రువులనే వృక్షాలను, మీ కరవాలంతో నరకి, మీ శౌర్యాగ్నితో కాల్చి, శస్త్రాలనే నాగళ్ళతో రణభూమిని దున్ని, శాత్రవుల రుధిరధారలచే తడపి, వీరబీజాలు జల్లి, సత్కీర్తిసస్యాలను పండించిన తెలుంగాధీశుల సాటిలేని తేజస్సుకు నమస్సులు. తెలుంగాధీశా! ఆ సమరాంగణాన మన ప్రౌఢ దేవరాయలవారు, పర్వతాల రెక్కలను ముక్కలు చేసే దేవేంద్రునిలా విజృంభించి, శత్రువుల మదపుటేనుగుల కుంభస్థలాల్ని చీల్చిచెండాడి, దట్టమైన మబ్బులను చెదరగొట్టే పెనుతుఫానులా చెలరేగి, శత్రువుల గుర్రాల్ని చిందరవందరచేసి, అశ్వకుల్ని పరుగులుతీయిస్తూ, లేళ్ళను ఒడిసిపట్టు పెద్దపులిలా, అరివీరుల్ని వేటాడి వారి భటాళిపై అడవిని కాల్చు కార్చిచ్చులా రాయల శౌర్యాగ్ని జ్వాలలు వ్యాపిస్తూంటే, మీరాహవంలో జౌత్సాహాజ్యంపోసి, రాయల శౌర్యాగ్ని జ్వాలలను మరింత భీకరజ్వాలలను గావించి, శత్రు భటాళిని శలభాలుగా జేసి మాడిమసియైపోయేలా చేసిన విధం తలచుకొంటుంటే, మా కౌమారదశ గుర్తుకొస్తోంది. ఈ వృద్ధాప్యంలో కూడ రణరంగంలోకి దుముకాలని మనస్సు ఉవ్విళ్ళూరుతోంది - అని పలికే ప్రధానామాత్యుల వాక్చాతుర్యానికి ముగ్ధుడై, అమాత్యశేఖరా! సార్వభౌముల ప్రతాపముముందు, మా తేజము-సూర్యుని ముందు దివిటీలాంటిది. మీ అసాధారణ సాధుమేధాసుధారాస్రవంతి, మా విజయానికి మేలుబంతి!... అని వినమ్రశిరస్కుడైన సాంప రాయపుత్రుని, అభినందించాడు. ఇంతలో మంగళ వాయిద్యాలు వినిపించాయి. ఘన పాఠీల స్వరాభిషేకాలతో శ్రీ విజయనగర రాజకులగురు బ్రహ్మలు, బంగరుపల్లకీలో వేంచేయుచున్నారను వార్త విన్నవెంటనే, మహామంత్రి మంత్రి మండలితో ఎదురు వెళ్ళారు. మరికొందరు వారిననుసరించారు. వారు పల్లకీదిగారు.

వంది మాగధులు :

శ్రీ శ్రీ శ్రీ చంద్రభూషక్రియాశక్తిరాయా । విమోచక దేశికోత్తమా, జయహో । జయజయహో ॥
శ్రీ విద్యానగర రాజకుల గురుబ్రహ్మో ॥ జయహో । జయజయహో ॥
మహాదార్శనిక శిరోమణీ । విద్వన్మణీ ॥ జయహో । జయజయహో ॥
ప్రాడ్వివాక వరేణ్యా । సత్కవివరేణ్యా । జయహో । జయజయహో ॥

గురుదేవుల జయజయ ధ్వానాలు వింటూనే, ఎదురేగి, మోదుపులిడి, ముత్యాల హారాలతో సత్కరించి, ముత్యాలశాలలోనికి తోడ్కొనివచ్చి, రతనాలు పొదిగిన సువర్ణ సింహాసనంలో

కూర్చోబెట్టారు. వారా శతవృద్ధులు, జీవన్ముక్తులు, విశ్వశాంతి కాముకులు. అంతా వారికి నమస్కరించారు. దేశికోత్తములాశీర్వదించారు. ఇంతలోనే కస్తూరీవాసనలు కర్పూరపు సువాసనలు, వ్యాపించటంతో ముక్కుపుటా లెగురుతున్నాయి. మంచిగంధం, పునుగు, జవ్వాది, కుంకుమ పువ్వుల ఘుమఘుమలతో కూడిన వాయువులు ముత్యాలశాలంతా వ్యాపించాయి. ఓ వృద్ధుడు ముత్యాలశాలవైపు వస్తూనే, పన్నీటి జలాలను చిమ్ముతున్నాడు. అపర కుబేరుడిలా, సర్వాభరణభూషితుడై వస్తూ, పచ్చ కర్పూరాన్ని వెదజల్లుతున్నాడు. సుగంధద్రవ్యాలు, అడగకుండానే పంచిపెడుతూ, సంతోషంగా యధాశక్తిగ గంతులేస్తూ వందలమంది వీరభటుల సేవలందుకొంటూంటే, మంగళ వాయిద్యాలు మార్మోగాయి.

వంది మాగధులు :

కొమరగిరి నృప బహుసుగంధి శాలధ్యక్షా । జయహెూ । జయజయహెూ ॥

వీరకుమార గిర్యధిప మహాలక్ష్మీ భోగ భాగ్యోచితా ।

శ్రీ శ్రీ శ్రీ అవచితిప్పయ్య శ్రేష్ఠి నామాంకితా ।

శ్రీ శ్రీ శ్రీ కర్పూర వసంత రాయ బిరుదాంచితా ।

శ్రీనాథ విరచిత " హరవిలాస" కృతిపతీ! ధనపతీ!! జయహెూ । జయజయహెూ ॥

పచ్చకర్పూరపు గాలి సోకగానే, శ్రీచామనామాత్యులు, వల్లభునితో కూడి ముత్యాలశాల వెలుపలకు వచ్చేసి, పచ్చకర్పూరాన్ని వసంత రాయలపై చల్లడంతో వారు సంతోషాన్ని పొందారు. అవచి తిప్పయ్యశ్రేష్ఠి గారిని సగౌరవంగా లోనికాహ్వానించి, ముత్యాలశాల వేదికపై గల సువర్ణాసనంలో సుఖాసీనులను గావించారు. చెంతనే కూర్చున్న చామనామాత్యులు యోగక్షేమాలు ప్రశ్నించారు. యోగ క్షేమాలంటే ఏమిటో తెలియనట్లుగా ముఖం పెట్టడంతో, "అలబ్ధస్యలాభోయోగః, లబ్ధస్య పరిపాలనం క్షేమః" అన్నారు. విన్న తిప్పయ్యశెట్టి, మీవంటి మహనీయులు లభిస్తారా అనుకొన్నా! లభించరని అనుకొన్న మీవంటి వారు లభించటమే నాకు మహాయోగం. లభించిన మీవంటి వారిని శ్రద్ధగా సేవించుకోవటమే నాకు క్షేమం... అనటంతో, వారి వినయవిధేయతలకు కనులు ఆర్ద్రతచెందాయి. పరిపాలనకు సేవాభావమని చక్కగా సెలవిచ్చారు. పరిపాలకులు, సేవకులైననాడే రాజ్యం సుస్థిరంగా మూడు కాలాలపాటు నిలబడుతుంది... అంటూనే, తిప్పయ్యసెట్టి తండ్రి దేవయసెట్టి కూడ సుగంధ ద్రవ్యాలను దేశవిదేశాలలో విక్రయం చేసేవాడని, దేవ బ్రాహ్మణ సేవకుడని, పరమార్థనిధియని పొగడి అవచి తిప్పయ్యశెట్టి వదాన్యతను కొనియాడారు, మహామంత్రి చామనామాత్యులు.

శ్రేష్ఠిగారూ! మీరు శ్రీ మహాలక్ష్మీ భోగభాగ్యోపచితులు. వ్యాపారంలో లెక్కలేనన్ని వరహాలు సముపార్జించారు. గోవా, చీని, సింహళం, హురుముంజి మొదలైన విదేశాలతో వ్యాపారం సాగించే మీ సాహసాన్ని మెచ్చుకోవాలి. మీరు చేసే నూలు బట్టల వ్యాపారం వల్ల మన దేశంలోని వారి చెంతకు, దరిద్ర దేవతదరికి చేరడానికి భయపడేదంటే నమ్మాలి. "కదురాడిన, కవ్వమాడిన యింటికి దరిద్ర మెన్నడూ ఉండదని" పెద్దలంటున్నారు. మీ వ్యాపారదీక్షా దక్షతకో, ధనార్జనకో కాని, పల్నాటిలో రంభయైన యేకులెవడకుచున్నది కదా! నూలు బట్టలు నిండుతనాన్నిస్తాయి. పైగా ఆరోగ్యాన్ని అందిస్తాయి. ఇంతకీ మీరు సంపాదించటమే కాదు, బీదసాదల నాదుకొను కరుణార్ద్ర హృదయులు. మీవంటి దాతలుండబట్టే, ధర్మం రక్షింపబడుతోంది. ఆర్ష సంస్కృతి నిలబడింది... వింటున్న వల్లభామాత్యులు, ధర్మాన్ని ఎవరు రక్షిస్తారో వారిని ధర్మం రక్షిస్తుందంటారు **"ధర్మోరక్షతి రక్షితః"**- అంతేకాదు, ఎక్కడ ధర్మం ఉంటుందో అక్కడ విజయం తథ్యం, అనటంతో, తిప్పయ్య శెట్టి సంబరం, అంబరాన్నిచుంబించింది. ముత్యాలశాలలోని సాహిత్య సదస్సును సందర్శించాలని, రాయలవారి సాదరాహ్వానంపై వచ్చామన్నారు శ్రేష్ఠిగారు.

శ్రీ ప్రౌఢ దేవరాయల వారి ముత్తాతలు, వారి గురుదేవులైన శ్రీ విద్యారణ్య స్వామి వారి ఆధ్వర్యవంలో విజయనగరాన్ని స్థాపించి, మానవాభ్యుదయార్థం దుష్కార్యాలను చేసే దేశ విదేశీయులనుండి, శ్రుతిధర్మాలనాచరించే హిందువుల్ని సంరక్షించారు. వరివస్యామర్మజ్ఞులైన మీవంటి వారు, మహారాజులకు సహకరిస్తూ హైందవ ధర్మాన్ని కాపాడుతున్నారు. అపర కుబేరులైన మీకు క్షణం కూడ తీరిక లేకున్నా ప్రభువుల వలపుపిలుపు, ముత్యాలశాలకు రప్పించింది. మీరు, ఆర్ష ధర్మోద్ధారకులన్న మహామాత్యులతో, దుష్కార్యాలను చేయు హీనులను దూషిస్తూ, అట్టివిచేయరాదని తెలిపి, వేదాల్లో చెప్పిన మంచి పనులనాచరించి, ఆచరింపజేయించే వారే **హిందువులని**, అట్టి మనం నివసించే భారతావనియే **హిందూ దేశమని** మన పెద్దలన్నారు. అందుకే మాతృభూమిని అన్ని విధాల సంరక్షించాలనే ఈ ధనార్జన చేపట్టి, ధర్మరక్ష చేయువారందరికీ నా లాభాల్ని పంచిపెడుతున్నానన్న శ్రేష్ఠి మాటలకు మంత్రుల కనులు చెమర్చాయి. **భరతమాత**కు జోహార్లన్నారు. మన దేశానికి గల హిందూనామంతో ప్రసిద్ధి చెందిన హిందూ మహాసముద్రాన్ని స్మరించారు.

"హీనంచ దూష యత్యేవం హిందూరిత్యుచ్యతే బుధైః" అని మేరుతంత్ర గ్రంధం చెపుతోంది – అని రాజనాధ కులపతి, "హింస యాదూయతే యశ్చ సదాచరణతత్పరః

వేద, గో(ప్రతిమాసేవీ, సహిందూ ముఖ వర్ణభాక్" అని వృద్ధస్మృతిలో ఉందని వల్లభామాత్యుడు పలుకుతుంటే, **"హిమాలయం సమారభ్య యావదిందు సరోవరం, తద్దేవ నిర్మితం దేశం. హిందూస్థానం ప్రచక్షతే"** – అని బార్హస్పత్యంలో ఉన్నదని కులగురు బ్రహ్మలనటంతో, తిప్పయ్యశ్రేష్ఠి ముఖకమలం విప్పారింది. హిందూ దేశాన్ని స్మరించాడు.

శ్రుతి ధర్మాలనాచరిస్తూ, సదాచార సంపన్నులై, గోమాతల్ని పూజిస్తూ ప్రతిమామూర్తుల్ని ప్రతిష్ఠించి, షోడశోపచారాలతో సేవిస్తూ, ప్రజాక్షేమాన్ని కోరి యజ్ఞాలు చేస్తూ, గాయత్రి వంటి మహిమాన్విత మంత్రాలనుపాసిస్తూ, ధర్మ రక్ష మానవ దీక్షగా చేపట్టి **విశ్వశ్రేయస్సును కోరే వారే హిందువులు**గా కీర్తింపబడుతున్నారు వారి రక్షణకోసమే నా ధనాన్ని వెచ్చిస్తానని, ఆర్షసంస్కృతిని సంరక్షిస్తానని, ముత్యాలశాల సాక్షిగా శ్రేష్ఠిగారు మాటిచ్చినందులకు, మంత్రి మండలి కరతాళధ్వనులు చేస్తుంటే, "హిందూ సామ్రాజ్యాన్ని పెంచి పోషించే సత్య వ్రతనిష్ఠులైన ధార్మిక చక్రవర్తి, రత్నాకరుడైన రాయల సేవలముందు, మాసేవలు రవ్వంత! హనుమంతుని ముందు కుప్పిగంతులేనన్నాడు, అవచి తిప్పయ్య శ్రేష్ఠి.

ఆహా! ఎంత వినయము! ఎంత విధేయత! రాయలవారనిన ఎంత అభిమానము! మరొక అలకాపురిని నిర్మింపగల సమర్థుని మాటలాయివి? ఔనవును, కొండ అద్దమందు కొంచెమై కన్పట్టుట సహజమే!... అని చామనామాత్యుల వారూహిస్తూంటే, భేరులు, కంచు వీరణాలు మ్రోగాయి. శంఖనాదాలు వినబడ్డాయి. ప్రజల్ని అప్రమత్తుల్ని చేసేలా ఇంతలో మంగళ వాయిద్యాలు మనోహరంగా, శ్రవణానందంగావిస్తూ ముత్యాలశాల సమీపించాయి.

"ఓం అగ్నిమీళే పురోహితమ్... అంటూ, ఋగ్వేద మంత్రాలు పఠించాక", **"ఓం ఇషేత్వోర్జేత్వా వాయనః"...** అంటూ యుజుర్వేద పండితులు వల్లించారు. తర్వాత, **"ఓం అగ్న ఆయాహి వీతయే..."** అని సామవేదపండితులు ప్రవచనం చేసారు. ఆస్థానపురోహితులు బ్రహ్మశ్రీ వేదమూర్తులైన సుబ్రహ్మణ్య శ్రౌతి గారు, పూర్ణకుంభం పట్టుకొని, ముందు నడుస్తూంటే వేదపండితులు వారిననుసరించారు. "ఓషధయస్సంవదంతె, సోమేన సహరాజ్ఞా, యస్మై కరోతి బ్రాహ్మణ స్తగ్ం రాజన్పారయామసి" – అనే సంహితకు ఘన చెప్పటం పూర్తయ్యాక, మదపుటేనుగు పైనుండి దిగి, ముత్యాలశాలలో ప్రవేశించు ప్రభువుల ప్రతాపాన్ని వంది మాగధులు స్తోత్రాలు చేస్తున్నారు.

వంది మాగధులు :

జయజయ విజయనగరాధీశా! జయజయ రాజాధిరాజ పరమేశా!!

బహుపరాక్! బహుపరాక్! బహుపరాక్!

జయజయజయ శుభలక్షణోపేంద్ర! జయజయజయ ప్రౌఢరాయక్షితీంద్రా !

బహుపరాక్! బహుపరాక్! బహుపరాక్!

జయజయజయ విశ్వవిశ్వంభరా భారవిధృతదీక్షా! మౌక్తిక శాలాధ్యక్షా !

జయజయజయ ప్రౌఢ దేవేంద్ర రాయభూపాల దక్షా! సజ్జన సంరక్షా!!

బహుపరాక్! బహుపరాక్! బహుపరాక్!

రాజాధి రాజ విభవా! పరిపూర్ణ వీరరసావతారా!

జయహో! జయహో! జయజయజయహో!!

రాజాధి రాజ పరమేశా! విజయనగరాధీశా! సత్కవీశా! శ్రీశా!!

జయహో! జయహో! జయజయజయహో!!

కర్ణాటాంధ్ర రాజ్యశాసనాధీశా! అరికులవినాశా!! ధీశా!!

జయీభవ! విజయీభవ! దిగ్విజయీభవ!!

సరస సంగీత సాహితీ సమరాంగణ సార్వభౌమా! సౌందర్యాభిరామా!!

జయీభవ! విజయీభవ! దిగ్విజయీభవ!!

దీనజనపాలా! శ్రీశ్రీశ్రీ ప్రౌఢ దేవేంద్రరాయ భూపాలా!!

జయీభవ! విజయీభవ! దిగ్విజయీభవ!!

అంటూ, వినమ్రశిరస్కులై వంది మాగధులు ముత్యాలశాల వేదిక ముందు నిలబడ్డారు. వెంటనే, బ్రహ్మశ్రీ సుబ్రహ్మణ్యశ్రౌతి, వేదికపైకి వెడుతున్న రాయలవారి శిరస్సుపై మంచి ముత్యాలతో కూడిన అక్షతలు పూలుజల్లుతూ శ్రుతి సూక్తులు వల్లించారు. సభా సదులంతా వారికి ఎదురేగి స్వాగతం పలుకుతున్నారు. వేదమంత్రాలు వినబడుతున్నాయి. "రాజాధి రాజాయ ప్రసహ్యాసాహినే, నమోవయంవై శ్రవణాయ కుర్మహే, సమేకామాన్కామ కామాయుమహ్యం, కామేశ్వరోవై శ్రవణోదదాతు. కుబేరాయ వైశ్రవణాయ మహారాజాయనమః"... అంటూ అపౌరుషేయాలను స్వరయుక్తంగా పఠించిన పండితులకు ప్రణామాలు చేసి, కులగురు బ్రహ్మలకు వందనం జేసిన రాయలవారిని, "విజయోస్తు!" అని దీవించారు. పిమ్మట నవరత్నఖచిత స్వర్ణ సింహాసనం చెంతకేగి, కులపురోహితులకు చేతులు జోడించారు. రాజకుల పురోహితులు, వేద విద్యాభాస్కరులు, దైవజ్ఞులైన బ్రహ్మశ్రీ

సుబ్రహ్మణ్యశ్రౌతి, "ఆయుర్విశ్వాయుర్విశ్వం విశ్వమాయురసీ ఈ మహిప్రాజాం త్వష్టా రాజనిధేహ్యాస్మే శతం జీవే ఏ మశరదోవయంతే ఏ ఏ, శతమానం భవతి శతాయుః పురుషః శతేంద్రియ ఆయుష్యేవేంద్రియే ప్రతితిష్ఠతి"... అని సంగీతయుక్త సుస్వరాలతో సామవేదాశీస్సులనందిస్తూ, నందిస్తూ, మంత్రాక్షతలుజల్లారు. పండిత ప్రవరులు "తథాస్తు" అనటంతో, రాయలవారు సభలోని వారందరినీ కనుచూపులతోనే పలుకరిస్తూ, సన్నిహితులైన అవచితిప్పయ్యశ్రేష్ఠికి, కరచాలనం చేసి, సంగీత సాహితీ ప్రియంభావుకులకు ద్వంజలించి, సింహాసనాధిష్ఠితులయ్యారు, నిండుపేరోలగముకరతాళధ్వనులతో మార్మోగింది.

ముత్తైదువలు పాటలుపాడి, హారతులిచ్చారు. ఆస్థాన నర్తకి మెరపుతీగలా ముత్యాలశాలలోనికి మంజీర నాదాలతో ప్రవేశించి, నృత్యభంగిమలతో హారతులందజేసి, ముత్యాల మల్లెపూలు జల్లి, మనోహరంగా మయూర నాట్యాన్ని ప్రదర్శిస్తూంటే, ప్రేక్షకులు తన్మయంచెందుతున్నారు. ఆ నర్తకి చతుర్విధాభినయాలను ప్రదర్శిస్తూనే, రాయల ప్రతాపాన్ని ప్రశంసించింది. నవరసాల నభినయించి, రస ప్రధానమైన నాట్యాన్ని, భావ ప్రధానమైన నృత్యాన్ని, తాళలయాశ్రయమైన నృత్తాన్ని ప్రదర్శిస్తూంటే – అమరలోకంలోని అప్సరః కాంతలకు గుండె ఝల్లు మనటంతో అంతఃపురంలోని అభ్యంతరమందిరాలలోంచి చూస్తున్నారా అని మేషులు! అపుడే బారెడు పొద్దెక్కింది. మంజుఘోష, ముత్యాల తెరయెత్తి, మణితల్పం పైనుండే చూస్తోంది. రంభ, తన కాలిమట్టెలు ఖంగు ఖంగున మ్రోగుతూంటే బంగారు గుబ్బల పావుకోళ్ళు తొడిగికొని, గవాక్షం చెంతకేగి వంగి, నర్తకి భంగిమల్ని తొంగిచూస్తోంది. ఘృతాచి, తన చిందరవందరైన కేశపాశాన్ని సరిచేసి ముడి వేసికొని, గాజురెక్కల కవాటాన్ని తెఱచి, చూస్తోంది. ప్రమోచ, తన అలసభావాన్ని నిలువుటద్దంలో చూచుకొని, అందు ప్రతిబింబించిన నర్తకిని చూచి విస్తుపోయింది. ప్రమ్లోచన, చాంద్రిని పిండి, చేసిన యానర్తకి రూపానికి చకచ్చకితురాలైంది. హరిణి, సౌగంధిక కమల పరిమళాన్ని వెదజల్లు పట్టుచీర సవరించుకొంటూ, నర్తకి నలిన పట్టాంసుకాన్ని చూచి సిగ్గుపడింది. మేనక పైటచెంగు సరిచేసికొని, ఆమెను చూచి చిన్నబుచ్చుకొంది. నర్తకి, భ్రుకుటీ విలాసానికి, అప్పళించు కనురెప్పల చప్పుళ్ళకు తిలోత్తమ అదిరిపడింది – అని సార్వభౌములు సంభావించి, మంచిముత్యాలహారాలతో నర్తకిని సంభావించినంతనే, ఆస్థాన వైణిక విదుషీమణి వచ్చి శ్రీప్రౌఢ దేవరాయలవారు రచించిన గీర్వాణ భాషాకృతులలో నొక కృతిని వలచి, వలజిరాగంతో పల్లవి, అనుపల్లవిని ఆదితాళంతో, చరణాల్ని

రూపకతాళంతో వీణ మీటింది.

పల్లవి : శ్రీకృష్ణ రమణీ ! రాధే ! సనాతనీ !

శ్రీకృష్ణ ప్రేమవినోదినీ! హ్లాదినీ! ... ॥ శ్రీకృష్ణ...॥

అనుపల్లవి : శ్రీకృష్ణలీలా శిరోమణీ! భామినీ!

శ్రీకృష్ణ రూప విహారిణీ! కళ్యాణీ!! ... ॥ శ్రీకృష్ణ...॥

చరణాలు : వేదవేదాంత రససారవేదినీ!

విశ్వవిజ్ఞానదాయినీ! మోహినీ!

వరదాయినీ! వ్రజభూమి విహారిణీ!

ప్రౌఢ దేవరాయాది భక్త సుపోషిణీ!!... ॥ శ్రీకృష్ణ...॥

అత్తటి నత్తలోదరి వీణావాదన ప్రౌఢి, ప్రౌఢ రాయల మనస్సును రంజింపజేసింది. తొలకరి మించు మెఱపుతీవ వలెనున్న, అయ్యలికులవేణి, గాత్రసౌందర్యంలోనే కాదు, గానమాధుర్యంలో కూడ సుగాత్రియని రసజ్ఞులు భావిస్తున్నారు. వీణతంతువుల పై గల వ్రేళ్ళు గాత్ర సంగతులు నేర్పుతున్నాయా యన్నట్లుగా, వీణకు సంగీతవిద్య గాత్ర మాధుర్యం బోధిస్తోందా యన్నట్లు వీణ వాయిస్తూ సంగీత సార్వభౌముని హృదయాన్ని రంజింపజేసింది. రాయల కర్పూరతాంబూలాన్నందుకొంది. ముత్యాల హారాలతో సన్మానింపబడింది. స్వస్థానం చేరుకొంది. రాయలవారు, తమ పూర్వీకులకు రత్నాల హారాలు సమర్పించి విద్యానగర 'విద్యాధికారి', ఆస్థాన పండితులైన గౌడడిండిమ భట్టారకులకు కస్తూరికా తాంబూలమిచ్చి, ముత్యాల పట్టుబట్టలు పెట్టి, భూరిదక్షిణలతో సత్కరించి నమస్కరించారు.

డిండిమభట్టు : శ్లో॥ శ్రీరస్తు శ్రిత రక్షణ క్షణగుణ శ్రీరస్తు నిత్యోత్సవ

శ్రీరస్తు ప్రథమాన కీర్తి విభవ, శ్రీరస్తు గీరస్తుతే।

శ్రీరస్త్వితృతివేల పండితవచః, శ్రీరస్తు భూరస్త్వహో!

శ్రీ విద్యానగరోత్తమ ప్రభుమణే! శ్రీప్రౌఢరాయాధిపా!!

అని అరుణగిరినాథులు, ప్రభువుల నాశీర్వదించి, శత్రువులపై విజయాన్ని, శత్రు సంహారాన్ని సమకూర్చి శాంతిమయ సుఖజీవనానికి నాందిపలికే ఋగ్వేదాంతర్గత మన్యుసూక్తాన్ని కోప దేవతాను గ్రహార్థం, పఠించి, శాంతి మంత్రాలతో ఆశీర్వదించారు. రాజనాథుడభి నందించాడు.

శ్రీ విజయనగరాధీశుల కనుసన్నల ననుసరించి, ప్రధానామాత్యులు లేచి, ప్రభువులకు ప్రణవ ప్రణతులర్పించి, ముత్యాలశాలా సదస్సుకు నమస్సులర్పించారు.

మహామంత్రి : శ్రీ విజయనగర సామ్రాజ్యలక్ష్మికి మనః పూర్వక పరిచర్యలు. ప్రభువులకు కులగురు బ్రహ్మలకు, కులపురోహితులకు, ప్రత్యేకాహ్వానితులైన సాంపరాయని కుమారరత్నం తెలుంగాధీశులకు, ఆస్థాన విద్యాధికారి డిండిమభట్టారకులకు జోహార్లు. కులపతి రాజనాధ పండితులకు, మాన్యమిత్రులైన వదాన్యశిరోమణి, అవచితిప్పయ్య శ్రేష్ఠి గారికి, శ్రీ విజయనగరాభివృద్ధి మంత్రిణి శ్రీమతి విజయలక్ష్మి గారికి మా ప్రత్యేకాభినందనచందనాలు. విజయనగర సామ్రాజ్య విస్తరణకు సుస్థిరత్వమునకు సహకరించిన, సహకరిస్తున్న వీరాధి వీరులకు, వీరమాతలకు, వీరపత్నులకు, విజయనగర ప్రజాళికి ప్రత్యేకాభినందనలు.

సదస్యులారా! శ్రీ విద్యానగరము శ్రీ విద్యారణ్య భారతీస్వాముల నారాయణ స్మరణతో ప్రతిష్ఠింపబడి, విజయనగరంగా సకల విద్యానిలయమై సిరి సంపదలతో తూలతూగుతున్న దన్న విషయం మనందరికీ ప్రత్యక్షప్రమాణమే! దీని స్థాపకులు హరిహర, బుక్కరాయ సోదరులు. ఆ బుక్కరాయల మునిమనుమల జ్యేష్ఠ కుమారులే మన ప్రభువులు. తాతపాదుల శౌర్యపరాక్రమాలకు ఏ మాత్రమూతీసిపోని శూరాగ్రేసరులు. వీరు శాలివాహన శకం 1344 శుభకృత్తు వసంతంలో విజయనగర సామ్రాజ్యానికి పట్టాభిషిక్తులయ్యారు. పది వసంతాల నుండి ప్రజాసేవకే ప్రభువులు, అహర్నిశలు కృషిచేస్తున్నారు. క్రీ.శ.1422లో సింహాసనాధిష్ఠితులై, ఆతతాయినులనణచివేసి, అంతః శత్రువుల్ని అదిమిపట్టి, అనిలో శాత్రవుల్ని సంహరించి, విజయనగర సామ్రాజ్యాన్ని విస్తరింపజేసి, ప్రజల సుఖసంతోషాలే తమవిగా భావించి, సత్యం, ధర్మం, శాంతి, ప్రేమలతో పాలనసాగిస్తూ, "సర్వే సుజనాః సుఖినోభవంతు" అనే లక్ష్యంతో, ప్రతి సంవత్సరం ప్రజాళి ఆనందంకోసం మూడు వసంతోత్సవాలను జరుపుతున్నారు. ఇపుడు శాలిశకం 1353, అనగా విక్రమ శకం 1488, క్రీస్తుశకం 1431. ఇది విరోధికృత్తు. ఈరోజు చైత్రశుద్ధ దశమి, ఈ వసంతఋతువులో వసంత నవ రాత్ర మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుపుకొన్నాం! పచ్చకర్పూరాలు జల్లుకోవటం, కస్తూరి, పన్నీటిని చిమ్ముకోవడాలతోపాటు, ఎన్నెన్నో రకరకాల ఆటలాడుకొన్నాం, పాటలు పాడుకొన్నాం! ముత్యాలముగ్గుల సంబరాలు, మేషయుద్ధాలు, మల్లయుద్ధాలు, పగటివేషాలు, పాపద్యూతాలు, బంతి ఆటలు, తోలు బొమ్మలాటలు, మైలార వీరభటుల గొండ్లియాటలు. ఇవన్నీ పునుగు, జవ్వాది, పన్నీరుల చిలుకరింపులతో సరదాగా జరుపుకొన్నాం. 'సిడి' వంటి సాహసకార్యాలెన్నో చూశాం! ప్రజలకేమాత్రం కష్టం, నష్టం కలుగకుండా ఉండేలా మనమీ వసంతోత్సవాలు జరుపుకోవాలన్నదే మా ఆంతర్యం. దైవభక్తి ఉండాలి. కని, పెంచిన తల్లిదండ్రులపైన,

గురువులపైన భక్తి గల వారే గొప్పవారు.

దేశభక్తి చాలా గొప్పది. దేశ సంరక్షరణలోను, విస్తరణలోను మాకు సహకరించిన పరాక్రమశాలి తెలుంగాధీశులకు, శత్రు వీరుల్ని జయించి సామ్రాజ్య విస్తరణలో సహకరించిన లక్కన్న సేనానికి, సింగమ, లక్ష్మణ దండనాయకులకు జేజేలు. యుద్ధాల్లో వీరమరణం పొందిన వారి యాతనాశరీరాలకు శాంతి చేకూరాలని పరమేశ్వరుని ప్రార్థిస్తూ, కీర్తిశేషులైన వీరవరుల కుటుంబాలలో ఒక్కొక్క కుటుంబానికి లక్ష వరహాలనందజేస్తున్నాం. క్షతగాత్రుల కుటుంబాలకు, సంతాపాన్ని తెలియజేస్తూ, భిషగ్వరులచే వారల ఆరోగ్యాన్ని మెరుగుపరచేలా చూస్తామని, అంతవరకు వారి కుటుంబ ఖర్చుల నిమిత్తం ఒకొక్క క్షత గాత్రునకు లక్ష మాడలనందజేస్తున్నాం! యుద్ధవీరుల కుటుంబాలకు అన్నివిధాల సహాయ సహకారాలనందజేస్తాం! విజయనగర సామ్రాజ్యాభివృద్ధికై సహకరిస్తున్న కులగురువులు బ్రహ్మశ్రీ చంద్ర భూషక్రియా శక్తిరాయలు గారికి, సామంత మండలేశ్వరులైన సాంపరాయని తెలుంగాధీశులకు, వసంతోత్సవాలకు కర్పూరాది సుగంధ ద్రవ్యాలనందజేయు సౌగంధ్యమూర్తి కర్పూర వసంతరాయల వారికి, విద్యాధికారులగు డిండిమభట్టారకులకు, కన్నడకవి చామరసుగారికి, తమిళాంధ్రాద్యనేక భాషలలో విద్వత్కవిశేఖరులైన ముమ్మకవి గారికి, కులపతి రాజనాధులకు, మంత్రిమండలికి, చతురంగ బలాలకధిపతులైన వారలకు, వీరసైనికులకు, పాడిపంటలనభివృద్ధి పరచు కర్షక వృషభులకు వీరందరితోబాటు గీర్వాణాంధ్ర కన్నడ తమిళాద్యనేక భాషాకోవిదులకు, లలిత కళాకారులకు చక్రవర్తులు, పట్టుపీతాంబరాలతో కస్తూరికాతాంబూలములనిచ్చి సన్మానిస్తారు. తదనంతరం, సదస్యులనుద్దేశించి సార్వభౌములు సందేశాన్నిస్తారు. సావధానచిత్తులై కరతాళ ధ్వనులతో సన్మానితులను గౌరవించండి. శ్రీమతి విజయలక్ష్మి గారు, సన్మాన సభను నిర్వహిస్తారు అని మహామంత్రి పల్కినవెంటనే, మహామాత్యులు చెప్పిన వారందరికీ సార్వభౌములచే ఘన సన్మానాలు చేయించారు. ముత్యాలహారాలు, స్వర్ణపతకాలు అందజేసారు. వీరసైనికులకు ఖడ్గాలను బహూకరించారు. కొందరికి అశ్వాలను బహూకరించారు. **"యత్రనార్యస్తుపూజ్యన్తే రమన్తే తత్ర దేవతాః"** - అను స్మృతిననుసరించి, పుణ్యస్త్రీలను సాదరంగా ఆహ్వానించి, వారి పాదాలకు పసుపుపూసి, సువర్ణ కంకణాలను తొడిగి నుదుట కుంకుమబొట్టుపెట్టి, పట్టు చీరలు పట్టురవికలనిచ్చి, బంగారు కుంకుమబరిణలతో సత్కరించారు, స్వయంగా మహారాణీవారు... అంటూ మహామంత్రిణి సదస్యులకు చెప్పారు. వసంతోత్సవాలలోను, ప్రత్యేక సంగోష్ఠులలోను, అంతః పురస్త్రీలు పాల్గొంటారన్నారు.

సమ్మాన సదస్సు పూర్తయ్యాక, శ్రీ విజయనగర సామ్రాజ్య సార్వభౌములు, నవరత్న ఖచిత సువర్ణ సింహాసనం నుండిలేచి, ముత్యాలశాలకు, సదస్సులోని సదస్యుల సమ్మహస్సులందఱికి నమస్సులర్పించి, సావధానచిత్తులైన ప్రజాళికి సందేశం వినిపించారు.

శ్రీ ప్రౌఢ దేవరాయలు : శ్రీ విద్యానగరికి, శ్రీవిద్యారణ్యస్వామి వారికి, మా పూర్వీకులకు ప్రణామాంజలులు. వేద ధర్మాలనాచరించు పెద్దలకు, ప్రజలకు మా శుభాభినందనలు. మా దిగ్విజయ యాత్రలో శత్రు నిర్మూలనము గావింప సహకరించిన వారందరికీ మా కృతజ్ఞతాభివందనాలు. సేనాధిపతిగా మాకు సహకరించిన తెలుంగాధీశులకు, లక్కన్న సేనానికి, ప్రత్యేకాభినందనలు. మేం శృంగేరిలోని శారదామాత విగ్రహానికి కుంభాభిషేకం చేసి, హైందవ ధర్మోద్ధారకులైన శ్రీ విద్యారణ్యస్వామి వారి పంచలోహ విగ్రహానికి పంచామృతాలతో అభిషేకించి, కంచి కామాక్షీ దేవిని సేవించి, కంచిలో నివసించే కర్పూర వసంతరాయల వారిని కలసికొని, వసంతోత్సవాలకు రమ్మని ఆహ్వానించాం! వారు, మా ఆహ్వానాన్ని మన్నించి, వృద్ధాప్యాన్ని లెక్కచేయకుండా వచ్చి కర్పూరాన్ని వెదజల్లి వసంతోత్సవాలకు వన్నెతెచ్చారు. మాకు మీకు అన్నివిధాల సహకరించు ప్రధానామాత్యులు చామనామాత్యులు వారు జ్ఞానానుభవ వయోవృద్ధత్రయీమూర్తి. వారి స్ఫూర్తికి మూర్తికి నమోవాకములు... వింటున్న మహామంత్రి గారికి ఆనంద బాష్పాలు దొరలివచ్చాయి. అంతమాట అనకండి అంతా తమదయ, పరమేశ్వరుని కృప... అన్నట్లుగా ముఖకదలికలు తోచాయి. ప్రభువులు తమ కనుసైగలతోనే వల్లభునిచే తీసికొని రాబడిన నవరత్న ఖచిత సువర్ణ మంత్రాంగదండాన్ని, మహామాత్యులకు బహూకరించి, మౌక్తిక దుకూలశాటి ద్వయాన్ని సమర్పించి, వారి మంత్రాంగ శౌటీర్యాన్ని మెచ్చుకొని గ్రచ్చుకొన్నారు. కరతాళ ధ్వనులు మార్మోగాయి.

సకల మంత్రి సామంత పండిత కవి నటగాయక రసజ్ఞ శేఖరులారా! విజయనగర ప్రజలారా! విజ్ఞులారా! సహృదయులారా! భారతులారా! మనమందరం వేదధర్మాలను పాటించాలి. దైవాన్ని కొలవండి. జన్మను ప్రసాదించిన తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలు వారి సేవలో తరించండి. దేశభక్తి, దైవప్రీతి, పాపభీతి, సంఘనీతి - విశ్వశాంతికి మూలాధారాలు. **సత్యమే సర్వేశ్వరుడు.** ధర్మమార్గంలో నడవండి. మాతృదేవిని, మాతృభాషను, మాతృదేశాన్ని సేవించాలి. పవిత్ర ప్రేమతో సహకరించుకొని, మతసామరస్యంతో మహనీయులై మెలగండి.

దుష్టశిక్షణ - శిష్టరక్షణయే మాధ్యేయం! అధర్మాన్ని సహించం! జాతీయ సంపదలైన

జలాది వనరులను, సిరిసంపదలను ప్రాంతీయ కుల మత భేదాలు లేక ధర్మ బద్ధంగా వినియోగించుకోవాలి. ప్రజలు న్యాయబద్ధమైన కోర్కెలు తీర్చుకొనుటకు ఏ విధమైన సమస్యలున్నా, ధర్మ గంటను మ్రోగించి మాకు తెలియపరచవచ్చు. ప్రజాశ్రేయస్సే విజయనగర శ్రేయస్సు. సకల కళలకునిలయం, సిరిసంపదల కాలయం, మన విద్యానగరం. దీనిని మరింత సుందరతరంగా తీర్చిదిద్దాలని, సకల శాస్త్రాలతోబాటు ప్రకృతిశాస్త్రాన్ని ప్రత్యేకించి అధ్యయనం చేసిన విదుషీమణి శ్రీమతి విజయలక్ష్మి గారిని, మంత్రిణిగా నియమించాం. ఆమె, సమర్థురాలని నిరూపించుకొన్నారు. అందుకే మహారాణి వారే, స్వయంగా ఆమెను దుకూలశాటితో సన్మానించి, సువర్ణ కంకణాలను బహూకరించారు. విజయనగర సామ్రాజ్యంలో మహిళాభివృద్ధికే పెద్దపీట వేశాం! వారికి అనేక పదవులేర్పాటు గావించాం. మన నగరంలో భార్యాటికులు కావచ్చుకాని, భార్యాటులు కారాదని శాసిస్తున్నాం! స్త్రీ పురుషులు సన్మార్గంలో చరించాలి. దాంపత్య ధర్మాలను కాపాడాలి. స్త్రీల రక్షణయే దేశానికి సంరక్ష! **సత్యమేవ జయతే!...** అని ముగించి కూర్చున్నారు. వింటున్న ప్రజలు, కరతాళ ధ్వనులు చేసారు. వెంటనే, విజయలక్ష్మి గారు లేచారు. విజయ నగరాధీశులకు మాదొక విన్నపము.... అనటంతో, ప్రభువులు, నిస్సందేహంగా తెలుపుమన్నారు. ప్రభూ! కన్యాశుల్కములను తొలగింప ప్రార్థన... అని మనవి చేసారు. విన్నారు. ఇలా అన్నారు, చక్రవర్తి... అటులనే! మహామాత్యా! వివాహాలపై పన్ను విధించండి. కన్యాశుల్కాలను నిషేధిస్తూ శాసనాలు వేయించండి. అంతేకాదు, సాంఘిక దురాచారాలను తొలగించి, మహిళాభ్యుదయానికి తగిన ఏర్పాట్లు చేయించండి. మత సామరస్యాన్ని పాటించండి. అభిమర్శకుల్ని కఠినంగా శిక్షించండి. అత్యాచారాలను, ఆక్షారాలను, అరికట్టండి. ఆక్షికులనదుపులో ఉంచండి. అట్టడుగు వర్గాల వారినాదుకోవాలి – అంటూనే రాజనాథుని చూచి, ఏం కులపతీ! విద్యాలయాలెలా ఉన్నాయి, వైద్యాలయాలు, న్యాయాలయాలు, రక్షణాలయాలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు జాగ్రత్తగా చూడండి. అచటి విద్యార్థుల్ని, ఆచార్యవరుల్ని విజ్ఞాన సముపార్జన విషయంలో ప్రోత్సహించండి. రైతే రాజ్యానికి వెన్నెముక, రైతు క్షేమమే రాజ్యానికి క్షేమం. వ్యవసాయాన్ని అభివృద్ధి చేయండి. మతసామరస్యానికై జైనాగారాలు, మసీదులు కట్టించండి. శ్రీ విఠలస్వామి ఆలయాన్ని నిర్మించండి. మీరంతా కలసి మెలసి కృషిచేసి, విజయనగరం వంటి వైభవోపేతమైన నగరం మరొకటి లేదనిపించాలి.

మహామంత్రి : అటులనే ప్రభూ! తమ ముత్తాతగారైన రెండవ హరిహర రాయలవారు

విజయనగరాన్ని ఎంతగానో అభివృద్ధిపరచారు. తర్వాత మీ తాతగారు, తండ్రి గారు ప్రజాక్షేమం కోరి, గుడి గోపురాలు కట్టించారు. చెఱువులు త్రవ్వించారు. వనాలు వృద్ధిపొందించారు. ప్రజల సంతోషం కోసరం జానపద కళలనభివృద్ధి పరచారు....అని చెపుతూంటే, ప్రధానామాత్యుల, ఆంతరంగిక భటుడు ప్రవేశించి మహామంత్రి గారికి నమస్కరించాడు. మహారాజు వైపు చూచి, క్షమింపుమని కోరి, వాని రాకకు గల కారణాన్ని తెలిసికొన్నారు. వెంటనే, ఆ విషయాన్ని సవినయంగా మనవి చేశారు. ప్రభూ! విన్నారుగా, మీ ముత్తాతగారు ఎంతగానో శ్రమపడి ఆనాడు "హరిద్రా" నదికి కట్టించిన ఆనకట్ట, వరదలకు కొంత దెబ్బతిన్న విషయం తమకు విదితమే. అకాల వర్షాలకు, హరిద్రానది ఆనకట్ట మరింతగా దెబ్బతినటంతో ప్రజలీనాడు, బాధపడుతున్నారన్న విషయం తెలిసింది ప్రభూ!

చక్రవర్తి : వెంటనే ఆనకట్ట చక్కచేయించండి! వరద బాధితులకు యుద్ధప్రాతిపదికపై సహాయ సహకారాల నందజేయండి. గృహాలు పోగొట్టుకొన్న వారికి, మన సత్రాలలో వసతి కల్పించి వారికి నూతన గృహాలను నిర్మించి సహకరించండి.

మహామంత్రి : అలాగే ప్రభూ! అంటూనే, వరద బాధితుల సంరక్షణార్థం, ప్రత్యేక మంత్రిమండలిని నియమించి, కొంత సైన్యాన్ని, వలసిన వస్తు సామాగ్రిని తీసికొని వెళ్ళే ఏర్పాట్లు చేసారు. ఇదంతా గమనిస్తున్న సార్వభౌములు, కృష్ణానది పొంగి పొరలినపుడు, వరదల పాలైన వారికి మీరేమి సహాయ సహకారాలందించారని తెలుంగాధీశుల్ని ప్రశ్నించారు. పంటలు నష్టపోయిన వారికి, నష్టపరిహారం చెల్లించాం. ఉచితంగానే విత్తనాలనందజేసాం, భోజన వస్త్రాదులందజేశాము. అనారోగ్యంతో బాధపడేవారిని వైద్యశిబిరాలనేర్పాటు చేసి, ఆదుకొన్నాం, గృహాలు పోగొట్టుకొన్నవారికి నూతన గృహాలను నిర్మించి ఇచ్చాం. వారల పునర్వైభవానికి అన్నివిధాల సహకరించామని, మనవి చేసారు, తెలంగాధీశులు.

అమాత్యవర్యా! విన్నారుగా! ప్రజల సంతోషాలను పంచుకోవటం కన్నా వారిని కష్టాల్లో ఆదుకోవటమే మిన్న. అందుకు ప్రజలు కూడ సహకరించాలి. అదే దేశభక్తి! అని పలికిన ప్రభువుల మాటలకు స్పందించి, ప్రభూ! 'హరిద్ర' ఆనకట్ట సరిచేయటానికి వరదబాధితుల్ని ఆదుకోవటానికి, ఓ లక్ష వరహాలను, కొన్ని వస్తువుల్ని ఇస్తున్నామన్నారు శ్రేష్ఠి.

వల్లభా! అవచి తిప్పయ్యశ్రేష్ఠి గారందజేయు నిత్యావసర వస్తువుల్ని, ధనాన్ని తీసికొని, బాధితులకు సక్రమంగా అందేలా చూడండి. పంట మైలారురెడ్డి మీకు తోడుగా

ఉంటారనటంతోనే అలాగే ప్రభూ!... అన్నాడు. సామంతమండలేశ్వరుడు తెలుంగాధీశుడు కూడ బాధితులనే కాదు, బడుగు, బలహీన వర్గాల వారిని ఆదుకోవాలన్నారు. వారు, ధన్యుడను ప్రభూ! ధన్యుడను! ఆర్తులనాదుకొనే అవకాశాన్ని కల్పించారు. మేం కూడ ధనకనక వస్తువాహనాల నందజేసి, బాధితులనాదుకొంటాం! అన్ని వేళలా, ప్రజలు కూడ ప్రభుత్వానికి సహకరించినపుడే, దేశం సర్వతోముఖాభివృద్ధిని సాధిస్తుంది, అన్నారు.

నిజం చెప్పారు, మా సాంపరాయని పుత్రులు. విజయనగరాభివృద్ధికై మీరంతా ఎనలేని కృషిచేస్తున్నారని తెలుసు. వాతావరణ కాలుష్య నివారణకై ప్రాణవాయువు నందించే పచ్చని చెట్లను రహదారుల కిరువైపుల నాటించాం. పశువులు, శిశువులు వాటిని పాడుచేయకుండా ఉండేలా తగు చర్యలు తీసికొని, చెట్లు బాగా పెరిగేలా సంరక్షించాలి. **"వృక్షో రక్షతి రక్షితః"** ప్రభూ! వృక్షాలను మనం రక్షిస్తే ప్రాణవాయునిచ్చి అవి మనలను సంరక్షిస్తాయని ప్రజలకు బోధచేస్తున్నాం! చక్కని ఉద్యానవనాలు, మంచినీటి చెఱువులు, బావులు నిర్మించాం - అని నగరాభివృద్ధి మంత్రిణి తెలిపిన వెంటనే, రాజనాధుడు - "లక్షల దానం కన్నా అక్షర దానమే మిన్న"యని చాటుతున్నాం. విద్యాభివృద్ధి పథకాలు చేపట్టాం. పిల్లలందరికీ పౌష్టికాహారాన్నందజేస్తున్నాం. శుచి-శుభ్రతలు పాటిస్తున్నాం. విద్యావైద్యాది శిబిరాలు నిర్వహిస్తున్నాం. వృత్తి విద్యల్ని ప్రోత్సహిస్తున్నాం. శ్రుతులను వల్లె వేయిస్తున్నాం. గీత చదివిస్తూ నిండైన వస్త్రధారణ, స్త్రీ పురుషులకుండాలనే నియమాన్ని పాటిస్తున్నాం. కట్టు బొట్టు జుట్టు చూస్తే మన సంస్కృతి ఉట్టిపడాలి. మాతృ భాషాభివృద్ధి చెందాలంటే వారి వారి భాషలతోబాటు వారి సంస్కృతీ సంప్రదాయాలు, ఆటపాట, మాట, బాట, తిండి బట్ట, అన్నీ అభివృద్ధి చెందాలి. అందుకే ఆ దృష్టితో కృషి చేస్తున్నాం - అన్నారు.

చక్రవర్తి : చక్కగా చెప్పారు, కులపతులు - మంచిదే! మన రక్షక భట శిక్షణాలయాలెలా ఉన్నాయో చెప్పారు కాదు! అవే, దేశ రక్షణకు, న్యాయపరిరక్షణకు ప్రధానాలయాలు. భటులకు క్రమశిక్షణ, కర్తవ్య నిర్వహణ ముఖ్యం. శాంతి, భద్రతలను కాపాడండి.

రాజనాధుడు : ప్రభూ! మీ పాలనలో, అశాంతికి తావే లేదు. రక్షక భటులకు పనిలేక పోవటంచే వారికి పొట్టలు బాగా పెరిగాయి అంటూంటే, "మరి తిని కూర్చుంటే పెరగవా ఏమిటి? అన్నారు శ్రేష్ఠిగారు, వారి ఉదరాన్ని నిమురుకొంటూ! వెంటనే, రాజనాధుడు, - రక్షక భటుల కుంభోదరాలు తగ్గించాలని, వారిచే సింహగర్జనాసనాలు వేయిస్తున్నాం. నౌకాసనాలు కూడ వేయిస్తున్నాం.

చక్రవర్తి : చక్కని యోచన. ఆ ఆసనాలను సభాసదులకు చూపించండి.

మహామంత్రి : వల్లభా! సింహ గర్జనాసనమును వేసి, చూపు మన్నంతనే, వల్లభుడు - ఆసనం వేసి సింహగర్జన చేస్తుంటే, సదస్యులు ఉలిక్కిపడ్డారు. ముత్యాలశాల ప్రతిధ్వనులతో దద్దరిల్లింది. తర్వాత నౌకాసనం వేసి చూపారు. తర్వాత, ప్రభూ! భోజనం చేసిన వెంటనే, కొంతదూరం నడక సాగించి వచ్చి వజ్రాసనం వేస్తే బొజ్జరాదని తమవంటి వారికి తెలియనిది కాదు. ప్రభువులకు రాని విద్య కలదా! రాయలవారు సర్వజ్ఞులు... అన్న వల్లభుని వంక చూసి, వల్లభా, నీ వంటివానికి ఇది తగదయ్యా! సర్వజ్ఞుడు - పరమేశ్వరుడొక్కడే! **ప్రభువులు ప్రజాసేవకులు** - అన్నారు, రాయలవారు. ప్రభూ! విద్యార్థుల బుద్ధి వికాసార్థం, సరస్వతీ లేహ్యాన్ని ఇస్తున్నామన్న కులపతితో. రాజనాధా! విద్యా వ్యవస్థ సక్రమంగా ఉన్నపుడే, దేశాభివృద్ధి. వైద్యులు, రోగులను తమ సంతానంలా చూసికొని నయం చేయాలి. **"వైద్యో నారాయణో హరిః"** - అనిన ఆర్యుల వాక్కులో ఎంతో అంతరార్థం దాగి ఉంది. సాక్షాత్తు, వైద్యుడే శ్రీమన్నారాయణుడని నమ్మి రోగులు వచ్చి, తమ బాధల్ని చెప్పుకొంటారు. అందుకే, భిషగ్వరులు సచ్ఛీలవంతులై కర్తవ్య నిర్వహణలో అప్రమత్తులై ఉండేలా వైద్య విద్యార్థుల్ని తీర్చిదిద్దాలి. ఆ విద్యలను బోధించు గురువులు కూడ శిష్టాచార సంపన్నులై శీలవంతులై ఉండాలి. క్రమశిక్షణ ముఖ్యం. మంచి నడవడిక కల్గిన విద్యార్థులే మంచిపౌరులై దేశరక్షణ, సంస్కృతీ పరిరక్షణ చేస్తారు. వింటున్న కులపతి, ప్రభువుల యాజ్ఞను శిరసావహించినట్లు తలయూపి, వల్లభునితో కూడి, పంట మైలారురెడ్డిని తీసికొని, చక్రవర్తుల యనుమతితో, వరద బాధితుల సహాయార్థం, మంత్రిగారి సూచనలను గ్రహించి, శ్రేష్ఠి గారిచ్చిన వరహాలు వస్తువులు తీసికొని, కొన్ని నిత్యావసర వస్తువులతో "హరిద్ర" ప్రాంతానికి వెళ్ళారు.

అవచితప్పయ్య శ్రేష్ఠి వర్యులను, ఓ కంట కనిపెడుతూనే ఉన్నాం. మాన్యమిత్రులు, పరధ్యానంగా నుండుటకు గల కారణమేమిటో అంతుపట్టటం లేదన్నారు, రాయలు. అవచితిప్పయ్య శ్రేష్ఠి, ప్రభూ! సర్వశాస్త్ర రహస్యాలతోపాటు, పరిపాలనా రహస్యాలు నా బాల్యసఖుడైన శ్రీనాధునకు వెన్నతో పెట్టిన విద్యలే. ఆతడెక్కడ ఉన్నాడోయని యోచిస్తున్నా!

రాయలు : ఏమిటి శ్రేష్ఠి గారూ! బాలసఖుడంటున్నారు? మీ యంతటి వృద్ధుడా!

శ్రేష్ఠి : ప్రభూ! నాకన్న వయస్సులో వింశతి వసంతాలు చినవాడే! నాకు, బాలుడైన సఖుడు, తొమ్మిది పదులు దాటిన వాణ్ణి నేను. ఏడు పదులు దాటిన వాడు శ్రీనాథుడు. అతడు బాలుడైన నాటినుండి నాకు సఖుడే! అందుకే ఈ బాలసఖుని గారవించి, హరవిలాస

కావ్యాన్ని అంకితం చేసాడు, శ్రీనాథుడు. అపుడు నాకు షష్ఠిపూర్తి మహోత్సవంతో పాటు, కావ్యకాంతా పరిణయ మహోత్సవం కూడ జరిగింది.

రాయలు : మీ యంతటి మహనీయుల మెప్పు పొందిన యావిద్వత్కవిని దర్శించాలి.

మహామంత్రి : ప్రభూ! భోజనసమయం! సాయంత్రం నాలుగు గంటలకు సాహిత్య సదస్సు, పెద్దలందరూ వారి వారి విడిది గృహాలకు చేరాక, భోజనం చేసి విశ్రాంతి తీసికొని, సాయంకాలపు సదస్సుకు విచ్చేయండి. సదస్యులకు, సంభోజనం సిద్ధం. సంభోజకులు వారి వారి భోజనశాలలకు వెళ్ళి భోజనాలు చేయండి.

ఘంటారావం వినబడటంతోనే, మహారాజు గారు, మదపుటేనుగు నధిరోహించి, రాజభవనాన్ని చేరారు. హేమ పాత్రలతో భోజనం సిద్ధంగా ఉంది. భోజనం చేసి, కస్తూరికా తాంబూలం వేసి చక్రవర్తి విశ్రాంతి తీసికొన్నారు. మహారాజ్ఞి, యువరాజు మల్లికార్జునుడు భోజనం చేసారు.

వల్లభామాత్యుడు, బాధిత కుటుంబాల సంరక్షణా బాధ్యతల్ని రాజనాధునికి అప్పగించి, సదస్యుల భోజనశాలలకు విచ్చేసి, సంభోజకులకు వలసిన పదార్థాలను లేత అరటి యాకులలో వడ్డనలు చేయించాడు. పప్పు దప్పడాలు, అప్పడాలు, వడియాలు, అపూపాలు, పాయసాలు, చారులు, కూరలు, పచ్చళ్ళు, మోదకాలు గుడోదకాలు, దధి పిండఖండాలు, మీగడలు, మజ్జిగలు, పనసతొనలు, గుల్లాలు, రసగుల్లాలు, అన్నాలు, చిత్రాన్నాలతో, అప్పుడే వేసిన తిరగమోత ఘుమ ఘుమలతో వంటకాలు నోరూరిస్తూంటే ఆకలితో నకనకలాడే వరద బాధితులు తినే వైఖరిచూచి, శ్రీనాథ కవి చెప్పిన పద్యం గుర్తుకొచ్చింది.

శా॥ **ద్రాక్షాపానక ఖండ శర్కరలతో రంభా ఫల శ్రేణితో**
గో క్షీరంబులతోడ మండెగలతో గ్రొన్నేతితో పప్పుతో
న క్షయ్యంబగు నేరు బ్రాలకల మహారంబు నిశ్శంకతం
గుక్షుల్ నిండగ నారగించితిమి యక్షుద్ర క్షుదాశాంతికిన్.

వారు క్షుదాశాంతి కిట్లారగించితిమి – అని చెప్పినట్లున్నదని భావించి, యజ్ఞశాలకు వెళ్ళి, శిష్టాచార సంపన్నులకు భోజన పదార్థాలు, తానే స్వయంగా పట్టుపీతాంబరాలు ధరించి, వడ్డన చేసాడు. తృప్తిగా భోజనాలు చేయుడని కోరాడు. తిండి పుష్టి గల విప్రోత్తములను చూచి సంతోషించాడు. ఒక్కొక్కడైతే వెలక్కాయంత ముద్దలు చేసికొని తింటున్నాడు. మరొకడు తాటికాయంత ముద్దలు నోట్లోకి తోసేస్తున్నాడు. పాయసాలు జుర్రేస్తున్నారు. నేతిలో ముంచుకొని బూర్లు తింటున్నారు. వీరిని చూసి తినలేని వారు

నవ్వుకొంటున్నారు. ఉదయాన ప్రారంభించి, గణపతి నారాధించి, శ్రుతి విహితంగా హెూమాలు చేసిన ఋత్విక్కులు, వేద పండితులు, భుజించే పద్ధతిని చూస్తుంటే, వారి ఆకటి చిచ్చుపెచ్చుగానే ఉన్నట్లనిపించటంతో, శ్రీనాథ భట్టు పద్యం గుర్తుకొచ్చింది.

ఉ ॥ "పప్పును బిండి వంటలను బాయసముల్ ఘృతముల్ గుడంబులుం
గుప్పలు గాగ జుట్టునను గూర్పగ గూడిన యేరు బ్రాలతె
ల్ల ప్పుర భోగి వంటకము గమ్మని తాలిపు సొజ్జెపిండితో
నొప్పులుగా భుజించిరి బుధోత్తములాకటి చిచ్చు పెచ్చునన్".

ఆహా! శరచ్చంద్ర చంద్రికాధవళ దధి సమృద్ధంబైన భోజనోత్సవం, ఈ వసంతోత్సవాన నేత్రోత్సవమేనని తలచాడా వల్లభుడు. తర్వాత, విశ్రాంత భవనాలలోని ప్రత్యేకాహ్వానితులను కూడ పలుకరించి, తన భవనానికి వెళ్ళి, కాళ్ళు చేతులు కడుగుకొని అగ్ని కార్యాన్ని పూర్తి చేసిన తన ప్రత్యేకాతిథి, గురుపాదులైన శ్రీనాథునితో కలసి భోజనం చేసాడు. కస్తూరికాతాంబూలాన్నిచ్చి సేవలు చేసాడు. "**క్రీడాభిరామం**" – అనే 'వీధి' రూపకానికి, కృతి కర్త వంశవర్ణన శ్రీనాథ కవి చెప్పగా తానే వ్రాసికొన్నాడు. అక్కడక్కడ పద్యాలెన్నో సరిచేయటమేకాక, కొన్ని పద్యాలు కూడ శ్రీనాథ భట్టారకులే చెప్పి, మోపూరు భైరవస్వామి తిరునాళ్ళలో, ద్వారసముద్రం నుండి వచ్చిన నటులచే ఆడించి, వల్లభునికి కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిపెట్టిన శ్రీనాథుడు, గురుతుల్యుడే! శ్రీనాథునితో పరిచయం ఏర్పడినప్పటి నుండి, వారి రచనల విశేషాలు, అడిగి తెలిసికొన్నాడు. కవిత్వమే యిద్దరినీ కలిపింది. ఎన్నెన్నో సాహిత్యంలోని రహస్యాలను తెలిసికొన్నాడు. శ్రీనాథుని కోరిక మేరకు, ఈరోజే ముత్యాలశాలలో ప్రవేశం కల్పించాలి. ఎలా? అని మనస్సు మథనపడుతోంది. శ్రీనాథుడు, కవిత్వంలోని మెలకువలెన్నో తెలిపి, కవుల సరసన జేర్చిన మహనీయుడు. తొమ్మిది రోజుల్లోనే తొంభై ఏళ్ళ స్నేహ మాధుర్యాన్ని చవిచూపాడు. మంచి స్నేహితుడు దొరకడమే దుర్లభం అదృష్టంకొలదీ నాకు లభించాడు. ఈ స్నేహాన్ని కాపాడుకోవాలంటే ఎలాగైనాసరే, రాయలవారి సన్నిధికి శ్రీనాథుని తీసికొని వెళ్ళాలి. మిత్రుని కోర్కెను నెరవేర్చాలి. సత్సాంగత్యం ముక్తికి మూలాధారం! శ్రీనాథుని వాక్కులలో, విజయనగర విద్యాధికారులైన అరుణగిరి నాథులతో వాదన పెట్టుకొనవలెననే జిజ్ఞాస కనబడుతోంది. శ్రీనాథుని చూసిన తర్వాత కంటె వారి మాటలు విన్న తర్వాత ఇద్దరికిద్దరే ననిపిస్తోంది. "వివాదశ్చ వివాహశ్చ సమయోరేవశోభతే" – అంటారు. వివాదానికైనా, వివాహానికైనా సరిసమానులుంటేనే శోభిస్తుందంటారు పెద్దలు. ఇది ముమ్మాటికీ నిజం శ్రీనాథుని విషయంలో తఱచిచూడాల్సిన

పనిలేదు. స్థాలీ పులాకన్యాయాన్ననుసరించి చూస్తే శ్రీనాథుడు, శ్రీనాథుడే! ఆయన నిఃశ్వాసాలే వేదాలైనపుడు, వానికి రానిదేముంటుంది? మరి, అరుణగిరినాథులు, నడయాడు కృత్స్నవేదరాశి. ఆలోచిస్తోంటే, వీరి వాదోపవాదాలు వినాలని కుతూహలం కలుగుతూన్నది. అందుకు పూర్వ రంగాన్ని సిద్ధం చేస్తాను, అని వల్లభుడు తనలో తానే యోచన చేసికొని, శ్రీనాథుని తీసికొని, తమిళాంధ్రాద్యనేక భాషలలో మేటియనిపించుకొన్న ముమ్మకవి భవనానికి వెళ్ళాడు. దారిలో ముమ్మకవి, తనకు హితుడు, సన్నిహితుడునని పైగా రాయల వారికి ఆంతరంగిక సలహాదారుయని తెల్పినాడు. అరుణగిరినాథులు, పుంభావసరస్వతులే, అయినప్పటికి వారికి యించుక అధికార దర్పమున్నదేమోనని ముమ్మకవి గారి సంభావన. వారి పరిచయం, తప్పక రాయల దర్శనానికి నాంది, కాగలదన్నాడు. మధ్యలో, రాజకులగురుబ్రహ్మల భవనం ముందు నిలిచి, లోనికి చూశారు. వారు, మనుమలతో ముచ్చటిస్తున్నారు. మంచి సమయమని తలచి, శ్రీనాథుని పరిచయం చేసాడు. శ్రీనాథుడు, శ్రీ చంద్రభూష క్రియాశక్తి రాయల వారి పాదపద్మాలకు నమస్కరించి, త్రిమూర్త్యాత్మకునిగా స్తుతించి, దీవెనలు పొందాడు. అటుపై ముమ్మకవి భవనానికి బయలుదేరివెడుతూ, దారిలో పలుకరించిన కవి పండితులకు గాయక శిరోమణులకు, తన మిత్రులకు, బాంధవాళికి శ్రీనాథుని పరిచయం చేసాడు వల్లభామాత్యుడు.

ముమ్మకవి భవనంలోనికి అడుగుపెట్టగానే, శ్రీనాథుని రూపురేఖా విలాసాలకు, బ్రాహ్మీమయ తేజస్సుకు, ఆజాను బాహుత్వానికి, వినమ్రతాభావానికి ముగ్ధుడై ప్రథమావసథముననే పరిష్వంగం చేసి, ఇద మిద మాసనమ్మనుచు, అర్ఘ్య పాద్యాలనిచ్చి, సుఖాసీనుని గావించాడు. ఫలాలను శుభ్రంగా కడిగి, తుడిచి తానే స్వయంగా తెచ్చియిచ్చాడు. శివకేశవులే వచ్చి, పునీతుని గావించారన్నాడు. అంతటి గౌరవాన్నిచ్చి, శ్రీనాథుని అభ్యాగతిగ తలచి మర్యాదలు గావించిన ముమ్మకవిని ప్రసన్నుని చేసికోవాలనుకొన్నాడు. విజయనగర రాజధాని చుట్టుప్రక్కలనున్న ప్రకృతి రామణీయత వలె తన కవిత, సంస్కృతాంధ్రాలలో శ్రవణానందంగా ఉంటుందని, ప్రౌఢ దేవేంద్రరాయ భూపాలుని దివ్యదర్శనాన్ని ప్రసాదింపుమని, శ్రీనాథుడు ముమ్మకవిని ప్రార్థింపదలచి, సీసపద్యంలో మనవి చేసాడు.

సీ॥ పంపావిరూపాక్ష బహుజటా జూటికా
 రన్వథ ప్రసవ సౌరభ్యములకు,
 తుంగభద్రా సముత్తుంగ వీచీఘటా

గంభీర ఘుమ ఘుమారంభములకు,
కళసాపురప్రాంత కదళీవనాంతర
ద్రాక్షాలతా ఫలస్తబకములకు,
కర్ణాట కామినీ కర్ణహాటక రత్న
తాటంక యుగ ధాళ ధళ్యమునకు,

గీ॥ నిర్నిబంధ నిబంధమై నెనయు కవిత
తెలుగునను సంస్కృతంబున బలుకనేర్తు
ప్రౌఢ దేవేంద్ర రాయభూపాల వరుని
సమ్ముఖమ్మున దయజూడు మమ్మసుకవి.

ముమ్మకవి మనసు ద్రవించింది. ముమ్మకవి ఇంగితజ్ఞుడై శ్రీనాథుని కవితలోని సౌరభ్యాలు, వీచీ ఘుమఘుమలు. ద్రాక్షా ఫలస్తబకరుచులు, రత్నతాటంకయుగ ధాళధళ్యాలు చవిచూచాడు. తెలుగు, సంస్కృతాల పలుకు బళ్ళలో దర్భ పెట్టెడు వ్రేళ్ళ మాణిక్యాంగు ళీయకములమరినట్లు, గంగ మట్టియమీద కస్తూరి కల్పించినట్లు, జన్నిదంబులమ్రోల ముత్యాల సరులు సవరించినట్లు, శిఖపై చెంగల్వ చెరివినట్లు శ్రీనాథుని దివ్యస్వరూపాన్ని భావించుకొన్నాడు. వల్లభా! నీవు అదృష్టవంతుడివి. నీకు సత్పురుషుల సాంగత్యం లభించింది. ఏ మా దివ్యమంగళ విగ్రహమన్నాడు! శ్రీనాథుడు అంజలి ఘటించాడు.

విశాలమైన ఫాలభాగంలో త్రయీరూప ప్రతినిధులుగా విభూతి రేఖలు, కనుబొమ్మల నడుమ, సూర్యబింబంలా కుంకుమబొట్టు, పించెవెట్టి ధరించిన చాంద్రి వంటి పట్టుధోవతి పైని వల్లె వాటుగ రుద్రాక్షయంచుల యుత్తరీయం, మెడలో బంగరు కట్టుల రుద్రాక్షపేరులు, మౌక్తికాహారాలు, పరమ పవిత్రమైన యజ్ఞోపవీతం. తలపై గోష్పాదమంత పిలకజుట్టు. ఆ జుట్టును జారుముడి వేసికొని, ఆ ముడిలో ఓ బిల్వ దళాన్ని ఉంచి, పంచాక్షరీ మంత్ర పఠన తేజస్సుతో విరాజిల్లుట, ముంజేతులకు సువర్ణకంకణాలు, చెవులకు రత్నఖచిత సువర్ణ మకరకుండలాలు, చేతివేళ్ళకు బంగరపుటుంగరాలు, భస్మోద్ధూళిత నిర్మలావయాలు చూసి సంబరపడ్డాడు. తన కన్న కొంచెం చిన్నవాడైనా మరోసారి నమస్కరించాలని పాదాలవైపు చూసాడు. ఎడమకాలికి, నవరత్నఖచితమైన సువర్ణ గండపెండేరం కీర్తి కాంతులీనుతోంది. ఆరడుగుల ఆజానుబాహువు ముఖంలో తెలుగు తేజం ఉట్టిపడుతోంది. కస్తూరికాతాంబూలపు సువాసనలు విరజిమ్ముతున్నాయి. ప్రక్కనే కూర్చోబెట్టుకొని, కొన్ని క్షణాలు ముచ్చటించాడు. శ్రీనాథుని ఆంతర్యం గ్రహించాడు. విజయనగరంలో అతడు

పడ్డ పాట్లు విన్నాడు. ముత్యాలశాలలో ప్రవేశం తప్పక లభిస్తుందని, ఆతని కోర్కె సిద్ధిస్తుందని ఆశీర్వదించాడు. విజయానికివలసిన సూచనలిచ్చాడు. ఈ వేష భూషలు కన్నడ దేశీయాచారాలకు విరుద్ధాలని, పాండవులు - అజ్ఞాత వాసానికి వెళుతూ, వారి గాండీవాదుల్ని జమ్మిచెట్టుపై దాచినట్లు, నారివాగుకడ నీ ఆంధ్రాచారాలను గుప్తపఱచి, టోపీ పెట్టాలన్నాడు. వారు చెప్పినట్లే వేషాన్ని మార్చి వస్తానని మాట యిచ్చి ధన్యవాదాలు తెలిపి, వల్లభుని భవనానికి వస్తూ మధ్యలో చామరసు కవిని దర్శించి నమస్కరించి, తమిళ తిరునుడులందజేసి, విక్రయశాలకు వెళ్ళి, వలసిన దుస్తులను, వస్తువుల్ని కొన్నారు. ఇంటికి చేరారు. అపుడే నాలుగు గంటలు కావస్తోంది. వేషాన్ని మార్చాడు. సమఉజ్జీ దొరికిందని సంబరపడ్డాడు. ఆస్థానంలో జయపతాక నెగురవేయాలని తలచి, దక్షిణాధీశు నకు లేఖవ్రాసి వల్లభుని ద్వారా పంపించాడు.

వల్లభుడు, లేఖను తీసి చూసాడు. అది వాదపత్రిక - అని గ్రహించాడు. ముమ్మకవి సూచనపై, శ్రీనాథుడు సాహసంతో వ్రాసిన పద్యమది. అనిష్టంగానే శ్రీనాథుడు వ్రాసినట్లు, మొగము చెప్పక చెప్పుచున్నదని గ్రహించాడు. గర్జించి, పంజావిప్పిననాడే మృగరాజు విలువ తెలుస్తుంది. ఘీంకరించి గీవెట్టినపుడే మదపుటేనుగునకు గుర్తింపు. దిక్కులుపిక్కటిల్లేలా ఱంకెవేస్తేనే మహానంది, బుసకొడితేనే త్రాచు. ఆహా! వినయానికి ప్రతీక గానున్న శ్రీనాథుడు, సభాప్రవేశార్థం, సీసాన్నందించాడు. ఇలా మదిలో తలచి, వాదపత్రిక తీసికొని, ముత్యాలశాల చేరుకొన్నాడు. వారంరోజుల నుండి వల్లభుడు చేయు ప్రయత్నం నేటికి ఫలింపనుంది. అయినా ఏం జరుగుతుందోనన్న ఆందోళన, శ్రీనాథుని గుఱించి, ముఖ్యులందఱకు ముందుగానే సూచనలు చేసాడు. మూడురోజుల క్రితమే, శ్రీనాథ కవి రచించిన "మానసోల్లాస"మను సంస్కృత కావ్యాన్ని తానే స్వయముగా తీసికొనివెళ్ళి, అరుణగిరినాథుల కందజేసాడు. వారప్పుడే కొంత చదివి, తప్పులున్నా యన్నారు. వారి మాటల్లో తొంగిచూచే అసూయాద్వేషాలను గమనించాడు. ఇవన్నీ గుర్తుచేసికొని, బొజ్జగణపయ్య నొకసారి ప్రార్థించుకొని సభలోకి ప్రవేశించాడు. నమస్కరించి ఆశీనుడయ్యాడు. రాయలవారు, సాహిత్య చర్చ చేస్తున్నారు. వల్లభుడు వింటున్నాడు. రాయల వారి ప్రశ్నలకు, సంస్కృతాంధ్రాలలో ఆశువుగా అరుణగిరినాథులు సమాధానాలు చెపుతున్నారు. రాయలవారు మధ్యలో తమ ప్రశ్న పరంపరను ఆపి, ఏ భాష గొప్పది? - అన్నారు నవ్వుతూ, ఎవరికివారే తమ భాష గొప్పదంటే తమ భాష గొప్పది - అని వాదించారు. ఓ వ్యాపారి లేచి, మా బాస గొప్పదన్నాడు. అందరూ ఏమిటా బాస!... అని

ఆశ్చర్యంగా చూశారు. తిప్పయ్యశెట్టి గారు నవ్వుతూ, ప్రభూ! 'కోమటిబాస' గొప్పదే కదండీ! అది మాలో మాకే అర్థమవుతుంది. మరొకరికి అర్థం కాదు కనుకనే మా వ్యాపారాలు బాగా ఉన్నాయి, అనటంతో రాయల చిర్నగవులు చిందాయి. ఇదే సరైన సమయమని వల్లభుడేదో చెప్పబోతూ, తడబడుతూంటే, చామరసు గారు – "వల్లభా! **ఒళ్ళెయ మాతుహేళు"...** అనటంతో, ముమ్మకవిగారందుకొని, మంచిమాట చెప్పుమంటున్నారు. నీ చేతిలో ఏదో లేఖ ఉన్నట్లుంది. ఏమిటది? అన్నారు. శ్రీనాథ కవి పంపిన లేఖ అన్నాడు. ఓహో! శ్రీనాథ కవి ఇచటనే ఉన్నాడా? ఏమినా అదృష్టము – అని కలవరించారు శ్రేష్ఠిగారు.

శ్రీ కర్పూర వసంతరాయల వారి ఆందోళన అర్థమైంది. మీ బాలసఖుడు, విజయనగర రాజధానిలోనే ఉన్నారు. రాయలవారి అనుమతి కోరి, వాదపత్రిక పంపించారు. ప్రభువులు అనుమతిస్తే సభకు వస్తారు... అంటూనే, ప్రభువులతో, లేఖ విషయం మనవి చేసాడు. ముత్యాలశాలలోని సదస్యులలో సాహితీ ప్రియంభావుకులకు శ్రీనాథుని పేరు బాగా తెలుసు. కొందరు శ్రీనాథుని దర్శించినవారే. శ్రీనాథుడనగనే చాలామంది ముఖపద్మాలు వికసించాయి.

రాయలవారిది గమనించి, వల్లభునితో లేఖ చదువుమన్నారు – మంత్రిగారు చదివారు.

సీ॥ దంబు సూపి ధరాతలంబుపై తిరుగాడు
కవి మీదగాని నాకవచ మేయ
దుష్ప్రయోగంబుల దొరకని చెప్పెదు
కవి శిరస్సునగాని కాలుచాప
సంగీత సాహిత్య సరస విద్యల నేర్పు
కవుల రొమ్ముల గాని కాల్చి విడువ
చదివి చెప్పగ నేర్చి సభ యందు విలసిల్లు
కవి నోరు గాని వ్రక్కలుగ దన్న

గీ॥ దంట కవులకు బలువైన యింటి మగడ
కవుల వాదంబు వినవేడ్క గల్గెనేని
నన్ను బిలిపింపు మాస్థాన సన్నిధికిని!
లక్షణోపేంద్ర! ప్రౌఢ రాయక్షితీంద్ర!

విన్న రాయలవారి భ్రుకుటి నర్తించింది. అరుణగిరినాథుల కటములదిరాయి. కనులు

ఎఱ్ఱబడ్డాయి. ముఖంలో కోపం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. రాజనాధుడు మహోగ్రుడయ్యాడు. శ్రీనాథునికి ఇంత అహంకారమా?... అట్టి వానిని సభలోనికి రానివ్వకూడదు... అంటూ అరుణగిరినాధుల శిష్యగణం, తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేసారు. అవి ఆలాపాలా, ప్రలాపాలా అన్నాయి కొన్ని కంఠాలు. మన ముత్యాలశాలలో గల కవిపండితుల ప్రతిభావ్యుత్పత్త్యభ్యాసాల పాటవం, వానికి తెలియదేమో? రప్పించండి, శృంగభంగం చేసి పంపిస్తాం! అన్నారు శాస్త్రపండితులు, విద్వత్కవులు! విద్యానగరాభివృద్ధి మంత్రిణి, తప్పక రప్పించండి అన్నారు.

ముమ్మకవి లోలోపల నవ్వుకొంటూనే, ప్రభూ! మన ఆస్థాన కవుల ప్రతిభాపాటవాలు మీకు తెలియనికావు. వారు సకల శాస్త్రపారంగతులు. విద్యాధికారులు, కవిసార్వభౌమ బిరుదాంకితులు. వారి పుత్రరత్నం కులపతి రాజనాధులు. కన్నడ కవిచామరసు, అగస్త్యుని వలె అన్ని శాస్త్రములనాపోశన గావించిన రాజకులగురు బ్రహ్మలున్నారు. మనమున్నారము. తప్పక శ్రీనాథుని పిలిపింపుడు. ఆతని ప్రజ్ఞ పరిశీలిద్దాము... అని ముమ్మకవి పలికినంతనే ప్రధానమంత్రి చామనామాత్యులు, రాయలవారిదివరలో శ్రీనాథుని గురించి వినియున్నవారగుటచే, రావింపదలచారు. తెలుంగాధీశులు, మైలారురెడ్డి శ్రీనాథుని పాండిత్యాన్ని మెచ్చుకొంటూనే, శ్రీనాథుని సభకు పిలింపుడని కోరారు. అందరి అభిప్రాయాలను విన్న తర్వాత చాలామంది శ్రీనాథుని వాదపటిమవినాలని కుతూహలపడుతున్నారని గ్రహించారు. తెలుగు కవి సవాలు సదస్యుల కుతూహలం, ఏం జరుగుతుందోనని ఆందోళన, దక్షిణాధీశుని గొంతులో పచ్చివెలగకాయ పడినట్లైంది. ముమ్మకవి, కులగురుబ్రహ్మ మహామాత్యులతో సంప్రదించి శ్రీనాథుని ముత్యాలశాలకు తీసికొని రమ్మని, వల్లభుని పంపించారు.

అవచి తిప్పయ్యశెట్టి, బాలసఖుని చూడబోతున్నందుకు లోలోన సంతోషిస్తున్నారు. హర విలాసానికి నమస్కారం చేసాడు. పంటమైలారురెడ్డి నందనందన చరితకు వందనాలర్పించాడు. తెలుంగాధీశులు, వల్లభాభ్యుదయాన్ని శ్లాఘించారు ఇలా కృతిపతులు, శ్రీనాథకృతులను స్మరించి వారి రాకకై ఎదురుచూస్తున్నారు.

రాజదర్శనం కోసం, శ్రీనాథుడెన్ని బాధలు పడ్డాడో! చివరకు సాహిత్య సమరభేరీ నినాదం నాచే వినిపింపజేయించాడు. ఇది ఆంధ్ర సాహిత్య పౌరుషానికో ఆయుధం లాంటిది. మానసిక శాస్త్ర విశ్లేషణకో మచ్చుతునక - అని మనస్సులోనే భావిస్తూ, తన యత్నం సఫలీకృతమైనదని, శ్రీనాథునకు ముత్యాలశాలలో వాదించుటకు అనుమతి

లభించినందులకానందిస్తూ, భవనంచేరి, శ్రీనాథునికి, రాయలవారి అంగీకార వచనాలనందజేసాడు. రాయలవారి, ఆహ్వానం అమితానందాన్నిచ్చింది. వెంటనే లేచి వల్లభుని కౌగిలించుకొన్నాడు. వల్లభుని కృతజ్ఞతను కొనియాడాడు. తన నుదుట విజయతిలకాన్ని దిద్దిన వశ్య శ్రీలక్ష్మిని శ్లాఘించాడు. పరమేశ్వరుని ప్రస్తుతించాడు. జనయిత్రి పుణ్యాచార భీమాంబను, పితృమూర్తి విద్యారాజీవభవుడైన మారయామాత్యుని మనసా స్మరించాడు. విద్యా బుద్ధుల్ని నేర్పి, ఇంత వానిగ జేసిన పితామహుడు, కవితావిద్యాధర కమలనాభామాత్యుని సత్కీర్తిమూర్తిని తలచి, ప్రశంసించి, విజయనగరాస్థాన ప్రవేశార్థం, దర్బారీ వేషాన్ని ధరించాడు. పొడవైన అంగీధరించి, పొడవైన టోపీని పెట్టుకొన్నాడు. కుల్లాయిపై పెద్ద వస్త్రాన్ని చుట్టాడు. అంచుకమ్ములు లేని పలుచనైన తెల్లటి వస్త్రాన్ని మెడలో వేసికొన్నాడు. ఈ వేషాన్ని చూసిన, శ్రీనాథుని యర్థాంగలక్ష్మి. మెడలో వేసికొన్న పెద్దసెల్లా. పరమశివుని మెడలో వ్రేలాడే "అహివల్లభహారం"లా ఉందని ఈశ్వరార్చన కళాశీలుని కొనియాడింది. విజయాన్ని చేపట్టాలని కాంక్షిస్తూ, మంగళహారతినిచ్చి వల్లభునితో బయలు దేరిన పతికి ఎదురుగావచ్చి, రాయల సభకు పంపినది ధవుని విజయపథాన్ని కోరుతూ. వల్లభుని భార్యాబిడ్డలతో, తన భవన భర్త గొప్పతనాన్ని కథలు కథలుగా చెప్తూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకొంటోంది.

శ్రీనాథుడు వల్లభునితో కలసి ముత్యాలశాల చేరుకొన్నాడు. విజయనగరాభివృద్ధి మంత్రిణి శ్రీమతి విజయలక్ష్మి గారు, ముమ్మకవి శిష్యబృందం, సాదరాహ్వానం పలికారు. పచ్చకర్పూరం జల్లారు. కస్తూరినిచ్చారు. పన్నీరు చిలుకరించారు. సభావేదిక పైకి ఆహ్వానింపుమని, మహామంత్రి వర్యులే వల్లభుని ఆదేశించారు. వారు శిరసావహించి స్వాగతించారు.

వల్లభుడు : సీ॥ విచ్చేయుమయ్య! శ్రీ భీమాంబికాగర్భ

శుక్తి ముక్తారత్న సురుచిర ఘృణి!

అరుదెమ్ము! కమలనాభామాత్య దివ్య సం

శోద్భూత గీత పీయూష వర్ష!

రావయ్య! రాణ్మహేంద్రపుర రాజాస్థాన

వాసంత శాఖికాపర భృతమ్మ!

పయనమ్ము గమ్ము! మారయ మంత్రి సత్పుణ్య

పరిపక్వఫలమ! విస్ఫార కీర్తి॥

గీ॥ శాలి వాహన కథలతో సరసమహిత
నవమరుద్రాజ్య నందనన్దన చరిత్ర,
పండితారాధ్యకృతులతో, ప్రౌఢి మెఱయ,
ఆగమింపుము శ్రీనాథయోగివర్య!!

శ్రీనాథుడు, ముత్యాలశాల వేదికపైకి వస్తూనే అందరినీచూచి చేతులు జోడించాడు. **ఓం గణానాంత్వా గణపతిగ్ం హవామహే కవింకవీనాముపమశ్ర వస్తమం! జ్యేష్ఠరాజం బ్రహ్మణాం బ్రహ్మణస్పత ఆన శృ ృణ్వన్నూతిభిస్సీద సాదనం॥** అని శ్రుతిగణపతిని ప్రార్థించాడు. రాజకులగురు బ్రహ్మలకు కేల్మోగిచి, మహామంత్రి నామంత్రించి, ఆస్థాన విద్యాధికారులైన డిండిమభట్టారకులకమరదండంబు లందించి, ముమ్మకవికి వణక్కమ్ములిడి అడియేనంచుమ్రొక్కి, చామరసు కవిని చూచి తలవంచి నమస్కారగళ్ళని పల్కి, అవచితిప్పయ్య శ్రేష్ఠికి కరచాలనంబు చేసి, తెలుంగాధీశుని వెన్నెల కోలంచు సంభావించి, పంటమైలారురెడ్డికి వేవేల భవికాలంచు పలికి, మహామాత్యుని మనః పదవిని నిల్పెదనన్నాడు. సభలో తలపండిన దిగ్గంతులున్నారు, అందరికీ వందనాలన్నాడు. రాజనాథునికి వల్లభునికి, శ్రీమతి విజయలక్ష్మి గారికి అభినందనలనందించాడు.

చక్రవర్తి : శ్రీనాథ సత్కవీ! మీకివే చందన తాలంబూలాలు. సుఖాశీనులుకండి.

శ్రీనాథకవి : శ్లో॥ ప్రౌఢరాయమహీపాల! స్వస్త్యస్తు తవ బాహవే।
ఆహవే రిపుదోర్దండ, చంద్ర మండల రాహవే॥ అని స్వస్తి పలికి, **శ్రుతిసూక్తులతో** – "ధృవంతే రాజా వరుణో ధృవం దేవో బృహస్పతిః । ధృవంతే ఇంద్రశ్చాగ్నిశ్చ రాష్ట్రం ధారయతాం ధృవం"॥ అని దీవించి – **"నవోనవోభవతి జాయ మానోహ్నాం కేతు రుషసామేత్యగ్రె, భాగం దేవేభ్యో విదధాత్యాయన్ప్రచన్ద్ర మాస్తిరతి దీర్ఘమాయుః** – అను సగ్ంహితకు ఘనచెప్పి ఆశీర్వదించారు.

శ్రీనాథ కవులు, ఘనపాఠియే. శ్రవణానందంగా వినిపించారన్నారు, శ్రౌతి. రాయలవారు, లోలోన ఆనందిస్తూ, పైకి గంభీరంగా ఉంటూ, శ్రీనాథ కవీ, గీర్వాణ భాషలో మీరు పల్కిన యాసుశ్లోకం, శ్రుతులు విని, మేం ధన్యులమయ్యాం – అన్నారు. ప్రభూ! ముత్యాలశాలను సందర్శించే భాగ్యాన్ని, మీ వీరరసావతారాన్ని చూచు అదృష్టాన్ని మాకు కల్గించినందులకు మేమును ధన్యులమే – అని పల్కినంతనే, శ్రీనాథునితో, వృద్ధుడనైన నేను మిమ్మల్ని చూడగలనో లేనో అనుకొన్నాను. దైవయోగం వలన, ప్రభువులు వసంతోత్సవ సన్మానానికి ఈ బాలసఖుని రప్పించటంతో మిమ్ము దర్శింపకలిగాను. నాలాగుననే వీరంతా

మిమ్మల్ని చూడగలిగారు అన్నంతనే, నిజమే శ్రేష్ఠి గారూ! వయస్తు ధన్యాః అన్నారు శ్రీనాథ కవిరాజు.

రాయలు : శ్రీనాథ సుకవీ! మీరు బ్రాహ్మీదత్త వరప్రసాదులని, కవితా మహా సామ్రాజ్య భద్రాసీనులైన పరమపుణ్యులని విన్నాం. నేడు, కనులారా మీ శ్రుతి స్వరూపాన్ని దర్శించాం! కవులవాద ప్రతివాదాలు విని చాలా రోజులైంది. రాజ్య విస్తరణలో పడి వాదసభలను విస్మరించాం. ఇపుడు అవకాశం చిక్కింది. మీరు రావటం మేలైంది. మేమంతా కవుల వాదాలు వినాలనే కుతూహలంతో ఉన్నాం. మీరు, మా ఆస్థాన పండితులు విద్యాధికారులైన డిండిమభట్టారకులతో వాదం నేడే ప్రారంభించవచ్చు. ముందుగా మీ గురించి, రచనల గురించి పరిచయం చేయండి! విరామ సమయంలో నేరచించిన "మహా నాటక సుధా నిధివృత్తి" లోని విషయాలను ముచ్చటిస్తాను. అలాగే బ్రహ్మసూత్రాలపై సంస్కృతంలో వ్రాసిన వ్యాఖ్య కూడా వినిపిస్తాను.

శ్రీనాథ కవి : ప్రభూ! మీరు వ్రాసిన గ్రంథాలు, నాస్వాధ్వికి వినిపించాను. ఆమె చాలా సంతోషించింది. ఆమె సంస్కృతాంధ్ర భాషలలో ప్రవీణురాలు. మీ బ్రహ్మసూత్రవ్యాఖ్య మాకెంతగానో నచ్చింది. ప్రకృతమనుసరామః. నేను చిననాటి నుండి నేటికి ద్వాదశాదిత్యుల్లాంటి పన్నెండు రచనలు చేసాను. ఈశ్వర కృపాకటాక్షమే నా యీ రచనలకు ప్రేరణ.

మరుత్తరాట్చరిత్ర, శాలివాహన సప్తశతి, పండితారాధ్యచరిత, కాటమరాజుకథ, రామాయణము పాట, శృంగారనైషధం, హరవిలాసం, ధనంజయ విజయం, నందనందనచరిత్ర, వల్లభాభ్యుదయం, భీమఖండం-తెలుగు రచనలు; సంస్కృతంలో "**మానసోల్లాసమ్**" రచించాను. వింశతి వసంతాల క్రితం, కాశీ విశ్వేశ్వరుని సన్నిధిలో "కాశీఖండ" మహాకావ్యరచనకు శ్రీకారం చుట్టాను.

సీ॥ చిన్నారి పొన్నారి చిఱుత కూకటినాడు
రచయించితి మరుత్తరాట్చరిత్ర
నూనూగు మీసాల నూత్నయౌవనమున
శాలివాహన సప్తశతి నొడివితి
సంతరించితి నిండు జవ్వనంబున యందు
హర్ష నైషధ కావ్యమాంధ్ర భాష!
ప్రౌఢ నిర్భర వయః పరిపాకమునగొని
యాడితి భీమనాయకుని మహిమ.

గీ॥ ప్రాయమింతకు మిగుల గైవ్రాలకుండ
కాశికాఖండమను మహాగ్రంధమేను
తెనుగుజేయుచునున్నాడ! దేవరాయ!
పండితుడనోయి! శ్రీనాథ భట్ట కవిని!!

వేమారెడ్డి ఆస్థాన విద్యాధికారిగా ఇరవై సంవత్సరాలు సాహిత్య సరస్వతినచట సేవించుకొన్నాను. దాన శాసనాలు రచించాను. విద్యాగోష్ఠులు నిర్వహించాను. విద్వాంసుల విద్వత్తును పరీక్షించి, యథోచిత సత్కారాలు చేయించాను. ఇలా, ఇంకా ఎన్నెన్నో పుణ్యకార్యాలను, యజ్ఞాలను, తీర్థయాత్రలను చేయించినవాడా పరమేశ్వరుడే.

రాయలు : శ్రీనాథ కవీ! మీరు నిమిత్త మాత్రుడనంటారు. కురుక్షేత్ర యుద్ధంలో 39 లక్షల 36 వేల 600 మంది వీరులు పాల్గొన్నారు. ఎందరో వీరమరణం పొందారు. ఎవరు చంపి నారంటే, నేనే – అంటాడు భగవానుడు. అర్జునుడు నిమిత్తమాత్రుడే నంటాడు – గీతాచార్యుడు. "నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్" అని గీతాబోధ. మీ వినయానికి విధేయతకు, విజ్ఞానానికి మేమెంతో సంతోషిస్తున్నాం! మీ కవితా ప్రౌఢి ఎట్టిదో వర్ణించండి.

శ్రీనాథుడు : సీ॥ వచియింతు వేములవాడ భీమన భంగి
నుద్దండలీల నొక్కొక్కమాటు!
భాషింతు నన్నయ భట్టు మార్గంబున
నుభయవాక్ప్రౌఢి నొక్కొక్కమాటు
వాకృత్తు తిక్కయజ్వ ప్రకారము రసా
భ్యుచిత బంధమున నొక్కొక్కమాటు!
పరిఢ వింతు ప్రబంధ పరమేశ్వరుని తేవ
సూక్తి వైచిత్రి నొక్కొక్కమాటు!

గీ॥ నైషధాది మహా ప్రబంధములు పెక్కు
చెప్పినాడను, "వాదన జేయదలతు"!
రాజపరమేశ! రాజాధి రాజ విభవ!
లక్షణోపేంద్ర! ప్రౌఢ దేవక్షితీంద్ర!!

శ్రీనాథ కవీ, మీరాంధ్రీకరించిన నైషధ ప్రబంధాన్ని మేంచదివాం. మీరు చెప్పినట్లే మీ కవిత్వంలో భీమకవి యుద్ధండ లీలలు, త్రయీమూర్తుల హృదయాలు అందు ప్రతిబింబిస్తున్నాయి. మీ ప్రతిజ్ఞకు తగినట్లుగానే నైషధాంధ్రీకరణ చేసారు. శబ్దాన్ననుసరించి,

ఔచిత్యాన్ని ఆదరించి అశేషమనీషి హృదయంగమముగా తీర్చిదిద్దారు - అని ముమ్మకవి ప్రశంసలజల్లు కురిపిస్తూంటే, తన తండ్రి గారితో వాదింప పూనుకొన్న శ్రీనాథుని చూచి, యించుక అసూయామానసంతో మీ కవిత్వం, ఏ భాషకు చెందిందంటారు? అని ప్రశ్నించాడు రాజనాథుడు.

శ్రీనాథ కవి : మీరు కులపతులు, ఆనంద వర్ధనత్వాన్ని ఆపోశనపట్టిన వారని విన్నాను.

గీ॥ ప్రౌఢి పరికింప సంస్కృత భాషయండ్రు
పలుకునుడి కారమున నాంధ్రభాష యండ్రు
ఎవ్వరేమన్ననండ్రు నాకేమి కొరత
నా కవిత్వంబు నిజము కర్ణాటభాష!

రాయలు : శ్రీనాథ కవీ! కర్ణాట భాషయని చక్కగా చెప్పారు.

చామరసు : కర్ణాటక్షితిపాలుని మనస్సుదోచుకొన్నారు. మేం నోచుకొన్నాం!

శ్రీనాథ కవీ ! మీ కవిత్వంలోని దీర్ఘసమాసరచనా ప్రౌఢి చూస్తే సంస్కృత భాషలా ఉంటుంది. పలుకుబడులలోని నుడి కారపు సొగసులను చూస్తే తెలుగుభాషయే! ఎవరేమనుకొన్నా సరే, మీ కవిత్వం కర్ణాటభాష అనే అంటారని చిత్రంగా చెప్పారు అని పలికిన చామనామాత్యునితో, మహామంత్రీ! "కర్ణే అటతి ఇతి కర్ణాటః" - అనే వ్యుత్పత్తినిబట్టి చెవులకింపయిన భాష యనే శ్రీనాథుని యభిప్రాయం కావచ్చు అని ముమ్మకవులనటంతో, తెలుగుభాషను కర్ణాట భాష అని, క్రీస్తు పూర్వం నుండి వ్యవహారంలో ఉంది. శ్రీకాకుళాన్ని రాజధానిగా చేసికొని కొంతకాలం సాతవాహనులు పరిపాలించిననాడే, సాతవాహనరాష్ట్రమని, వారిలో కొందరు దక్షిణ భారతాన్ని మరికొందరు భారతదేశాన్ని పరిపాలించారు. శాతకర్ణులు క్రీ.పూ. 230 నుండి క్రీ.శ.225 వరకు సుమారు 456 సంవత్సరాలు పాలన చేసిన ప్రాంతం కర్ణినాడని, అదే కర్ణాటగా పిలువబడుతోంది అంటూనే సమర్థించారు తెలుంగాధీశులు.

కర్ణాట భాష - శ్రవణానందమే కదా! అన్నారు కర్పూర వసంతరాయలు, రాయలవారు, చిరునవ్వులు చిందిస్తూనే, శ్రీనాథకవీ! అన్యులకెవ్వరికీ సోకశక్యంకాని విద్వదౌషధమగు ఖండన ఖండకారుడైన శ్రీహర్షుని నైషధకావ్యాన్ని "అయమస్మి" అని నడుం కట్టుకొని, ముందుకువచ్చి స్వతంత్ర రచనాయన్నట్లాంధ్రీకరించి ఆంధ్ర నైషధాన్ని జయపతాక చేసికొని తెలుగు భాషామతల్లిని పల్లకీలో ఎక్కించి భారతదేశమంతా ఊరేగించటంలో గల మీ ఆంతర్యమేమిటి? అన్నారు.

శ్రీనాథ కవి : ప్రభూ! లోకకళ్యాణమే! తెలుగుభాషలోని మాధుర్యాన్ని చవిచూపిస్తూ, ఆంధ్ర సంస్కృతీ సంప్రదాయాలను ప్రజాళికందజేసి, వారి సుఖసంతోషాలను పెంపొందింపచేయాలనే పర్యటిస్తున్నాను. రాజ ప్రాసాదాలలో జరిగే పండిత గోష్ఠులలోని, బ్రహ్మానంద సబ్రహ్మచారియగు రసానందామృతాన్ని సామాన్య జనులకు దేశాటన చేస్తూ పంచిపెడుతున్నాను. దేశ భాషలన్నింటినీ అధ్యయనం చేసాను. అన్ని భాషలలోను గలపండితుల్ని పరీక్షించి, విద్యాధికారిగా వారిని సముచితరీతిని సత్కరింపజేయించటంలో, దేశ భాషలన్నింటిలోను అజంత భాషయైన తెలుగు భాషలోని మాధుర్యాన్ని నేను గ్రోలటమే కాకుండా పదిమందికీ పంచాలని, తద్వారా శ్రుతి ధర్మాలనాచరింప జేయించి, సంస్కృతీ సంపన్నులను కూడ గావించాలని భరత ధరిత్రిపై గల దేశదేశాలు తిరుగుతున్నాను. అంతేకాదు ప్రభూ! లక్షల దానం కన్న, అక్షర దానం మిన్నయన్న సంగతి తమకు తెలియనిది కాదు. అందుకే అక్షర పరబ్రహ్మను ప్రజలకందజేస్తున్నా! కలహాలకు యుద్ధాలకు మూలమైనవి కాంతా కనకాలు, మతద్వేషాలు. అందుకే కాంతా కనకాలపై ఆశలేనినాడే మనశ్శాంతి! అని బోధిస్తూ, మత సామరస్యాన్ని పెంచుతున్నాను. పచ్చని మొక్కలు, ఊరూరా నే నాటుతూ, ప్రజలచే నాటిస్తున్నాను. సేవలోని మాధుర్యాన్ని చవిచూస్తున్నాను. మనమంతా కలసి ఉంటేనే సుఖశాంతులుంటాయనే సత్యాన్ని చాటుతున్నాను. యథాశక్తి, బాధితుల్ని ఆదుకొంటున్నాను. సదాచారాలు పాటిస్తూ", నిరాశ్రయాఃన శోభన్తే పండితా వనితాలతా" - అను, పెద్దలన్న మాట చద్దిమూట" గ భావించి నానా రాజసందర్శనం చేస్తున్నానని మనవి చేస్తున్నాను.

ఇవి వినినంతనే రాయలవారి సంబరం, చుంబనార్థం అంబరాన్ని చుంబించింది.

మహామంత్రి, వారి కృషిని అభినందించి, నందించి వారి ప్రచారం శాశ్వతంగా ప్రజలకు తెలిసేలా పద్యరూపంలో చెప్పాలని కోరారు.

శ్రీనాథా! నీవు, సీసపద్య సింహాసనాధిష్ఠితుడవు. సీసపద్యంలో వినిపించు సంతోషిస్తాం అన్నాడు, కర్పూర వసంతరాయలు. సఖుని మాట శిరోధార్యమన్నాడు. సీసపద్యం వినిపించాడు, శ్రీనాథ సత్కవి.

సీ॥ ఆంధ్ర భాషా యోషనందలం బెక్కించి
దేశ దేశాలలో ద్రిప్పుచుంటి!
అక్షరజ్యోతిని యవనియందింటింట
గేయదీపికల వెల్గించుచుంటి!

శ్రుతి పురాణాగమ స్మృతి సాంఖ్యములనెన్నొ
తేట తెలుగులోన తెలుపుచుంటి!
మత సామరస్యము మహిలోన చాటుచు
పద్య కావ్యంబుల పలుకుచుంటి!
ఆ॥వె॥ దేశ భాషలందు తెలుగు లెస్స, యనుచు
జగతినందు తిరిగి చాటుచుంటి!
తెలుగు చాటు కవిత తెలియ పఱచుచుంటి!
దివ్య తేజ! ప్రౌఢ దేవరాయ!!

శ్రీనాథ కవుల సేవలుకొనియాడతగినవే! శ్రేష్ఠులైన మీ వంటి వారాచరించి తెలుపుటచే, అవి ఇతరులకనుసరణీయములై విశ్వ కళ్యాణానికి కారణమగునని మా భావన. మీ వంటి పుణ్యాత్ముల నడతలే, ఇతరులకు పరమ ప్రమాణాలు - అనిన రాయలవారి మాటలు విని, **"యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనః, సయత్ ప్రమాణంకురుతే లోకః తదను వర్తతే"** - అని గీతాచార్యులన్నారని వల్లభుడన్నాడు. ఇతర భాషాకవులు, ఈ మాటలు విన్నారు. ఏ భాషకు, ఆ భాషయే గొప్ప... అని గుసగుసలాడుతూంటే, సంస్కృత భాష విషయమేమంటారన్నాడు, కులపతి రాజనాధుడు. తెలుగు, తమిళ, కన్నడాది భాషామతల్లులకే తల్లి - సంస్కృత భాష అన్నాడు శ్రీనాధుడు. తెలుగు అజంతభాష అవటంచే ఎక్కువ మధురంగా ఉంటుందన్న విషయం సర్వజన విదితమే! అన్ని భాషలు మధురమైనవే! ఎవరి భాష వారికి చక్కగానే ఉంటుంది కదా! ఎవరి బిడ్డ వారికి ముద్దు. భాషలన్నింటికి, సంస్కృత భాష తల్లి, అందుకే తెలుగుభాష ఆడుబిడ్డగా భావిస్తున్నానంటూనే, ఇతర భాషల వైశిష్ట్యాన్ని వివరించి, శ్రీనాధుడిలా అన్నాడు.

ఆ॥వె॥ జనని సంస్కృతంబు సకల భాషలకును
దేశ భాషలందు తెలుగు లెస్స!
జగతి తల్లికంటె సౌభాగ్య సంపద
మెచ్చుటాడు బిడ్డ మేలుగాదె!!

ఈ పద్యాన్ని వింటూనే వల్లభుడు పరవశించాడు. ఎలాగైనా శ్రీనాధుని ఒప్పించి. ఈ పద్యరత్నాన్ని తన క్రీడాభిరామంలో, బంగారు ఆభరణంలో రత్నంలా కూర్చాలనుకొన్నాడు. సంస్కృత భాషామతల్లికి అగ్రతాంబూలాన్నిచ్చి మెచ్చుకోవటంతో సభ సద్దుమణిగింది. దాంతో శ్రీనాధుడు కాస్తంత విశ్రాంతి కోసం, సువర్ణాసనంలో చతికల పడ్డారు. ఈ

సమయంలో వల్లభుడు తన మనసులో మాటచెప్పి శ్రీనాథుని ఒప్పించాడు. ఇదంతా రాయలవారు ఓ కంట కనిపెడుతూనే, శ్రీనాథ కవీ! మీరు బాగా అలసినట్లున్నారు. పైగా మీ మనస్సులో మాతో చెప్పదలచుకొన్నదేదో దాగినట్లు, మీ ముఖము చెప్పక చెపుతోంది. మీరెలాంటి విషయాన్నైనా నిర్భయంగా తెలుపవచ్చు! "నిరంకుశాః కవయః" అన్నారు.

ముత్యాలశాలలో, స్త్రీలకు అంతఃపుర స్త్రీలకు ప్రత్యేకంగా కేటాయించిన ప్రదేశాలలో, పలుచని తెరలు కూడ కట్టబడి ఉన్నాయి. ఆ తెరల వెనుకనున్న అంతఃపుర కాంతలలో సామంతరాజుల పత్నులున్నారు. మహారాణి వారున్నారు. దాసదాసీ జనం ఉన్నారు. మంత్రుల భార్యలొక ప్రక్కనున్నారు. వల్లభామాత్యుని జాయతో కలసి, శ్రీనాథ కుటుంబిని కూడ వచ్చి, ముత్యాలశాలలో వారికి కేటాయించిన ఆసనాలలో కూర్చుని, సభని తిలకిస్తున్నారు. శ్రీనాథ కవి అలసి సొలసి ఆసనంలో చతికిలపడటం గమనించిన, వాని సీమన్తిని కొంచెం కంగారుపడింది. ఆమె శ్రీనాధుని ప్రాజ్ఞ శ్రీలక్ష్మి. ఆ పెద్ద ముత్తైదువను చెంతకువచ్చి పలుకరించిన మహారాణి, పూలుపండ్లు, ఆమెనుదుట కుంకుమ బొట్టుపెట్టి యిచ్చి, పట్టుచీరతో కాటుకబరిణి, కుంకుమ బరిణి, గాజులు, రవికెలగుడ్డ పెట్టి కర్పూర తాంబూలాన్నందించి, పాదాలకు నమస్కరించి దీవెనలు పొందారు.

ప్రభువుల మాట విన్న శ్రీనాథుడు, మహారాణి వారే, స్వయంగా తన ద్వితీయ చెంతకేతించి సత్కరించిన విధానాన్ని చూచాడు. వారి సంస్కారాన్ని మెచ్చుకొని, మంచి తీర్థాన్ని సేవించి, ప్రభూ! మీ ఆలుమగలు నిగర్వులు. మీ ఔదార్యాన్ని వదాన్యతను, సహృదయాన్ని చూచాక, మనస్సునందలి ఆవేదన నివేదన చేయదలచాను. పెద్దమనస్సుతో యోచించి తగిన న్యాయాన్ని చేయప్రార్థన. ముత్యాలశాలా వైభవాన్ని కనులారా తిలకించాలనే వాంఛ నేటికి నెరవేరింది. మీ వంటి ప్రభువుల్ని దర్శించుకోవాలనే కోరిక కూడ నెరవేరింది. డిండిమ భట్టారకులతో వాదించాలనేది నేడే ప్రారంభమవబోతోంది. ఇది ఎన్ని రోజులు జరుగునో! విద్యాధికారులు, అన్ని శాస్త్రములందు దిట్టలేనని విన్నాను. అంతటి వారితో వాదించిననాడే మాకు తృప్తి. వాదింపవలయునన్నచో, అలవాటులేని ఈ వస్త్రధారణ అవరోధమగుచున్నది ప్రభూ! శిష్టాచార సంపత్తి గల మాకు మావస్త్రధారణలోనే సభా ప్రవేశము చేయడానికి అనుమతి నీయవలసినదిగా కోరుచున్నాం! ఎన్నో కష్టనష్టాలనుభవించి, ప్రయాణించి వినుకొండ చేరాం. అచట వల్లభుని స్నేహం లభించింది. మోపూరు తిరునాళ్ళ కెళ్ళాం. అచట, 'వీధి' చూశాం. మనీషులనెందరినో దర్శించుకొన్నాం. తర్వాత ముత్యాలశాలను చూసి ముగ్ధులమయ్యాం। అంటూ పల్కిన

శ్రీనాథునితో, సత్కవీ ! వేదోదిత ధర్మకర్మానుష్ఠాన తత్పరులైన మీ వంటి ఆహితాగ్ని, ఆంధ్ర సంస్కృతిని ప్రతిబింబించే మీ వస్త్రధారణతోనే వాద సభకు రావచ్చును. మీవంటి వారికి దర్బారీ వేషంతో పనిలేదు అని పల్కిన రాయల మాటలకు, శ్రీనాథుని శరీరం పులకరించింది. ధన్యోస్మి - అన్నాడు. శ్రీనాథ సత్కవీ ! మీ బస ఈ ముత్యాలశాలలోని ప్రత్యేక మిద్దెలో ఏర్పాటుచేశాం. వల్లభుడు, సౌకర్యాలు సమకూర్చుననటంతోనే, ప్రభూ! ఆహార్యంలోనూ, ఆహారంలోనూ నిజాచారానికి దూరమైనందులకు, వెతచెంది, దయచూపి శ్రుత్యాచారాన్ని పాటించేలా చూడుమని కన్నడ రాజ్యలక్ష్మిని మాతృదేవిగా భావించి ప్రార్థించాం.

శా॥ కుల్లాయుంచితి గోక సుట్టితి మహాకూర్పాసముం దొడ్గితిన్
వెల్లుల్లిం దిలపిష్టమున్ మెసవితిన్, విశ్వస్త వడ్డింపగా
జల్లా యంబలి ద్రావితిన్ రుచులు దోసంబంచు బోనాడితిన్
తల్లీ! కన్నడ రాజ్యలక్ష్మీ ! దయలేదా నేను శ్రీనాథుడన్.

శ్రీనాథ కవీ! మీ ఆత్మాభిమానం మాకర్థమైంది. మీ ఆచారవ్యవహారాలకు ఏమియూలోటు రాకుండా చూసికొనే బాధ్యత మా వల్లభునిదే! వాద సభ కూడ, మన సంధ్యా వందనాది సత్కర్మలకు ఆటంకం కలుగకుండ సాయంత్రం రెండుగంటలు, రాత్రి రెండు గంటలు జరుగుతుంది. ఉదయం మా కార్యక్రమాలుంటాయి. మధ్యాహ్నం చారులతోను, మంత్రులతోను పరిపాలనా విషయాలు చర్చించాల్సి ఉంటుంది. ఎప్పుడైనా విరామం దొరికితే, మీ కావ్యాలలోని మధుర ఘట్టాలు వింటాం! అని రాయలవారు పల్కిన తర్వాత విజయనగరాభివృద్ధి మంత్రిణి, సంస్కృతం, తెలుగు, ప్రాకృతం, శౌరశేని, మాగధి, పైశాచి, చూళిక, అపభ్రంశం, దేశి, తమిళం కన్నడాద్యనేక భాషలలో ప్రావీణ్యాన్ని సముపార్జించి మహిళాభ్యుదయానికై కృషిచేస్తూనే తెలుగు భాషపై ఎక్కువ మక్కువతో గోష్ఠులలోను సంగోష్ఠులలోను పాల్గొని కవులకు ప్రోత్సహానిస్తూ ఉంటారని వల్లభుడు తనతో చెప్పిన మాట గుర్తుకు వచ్చిన శ్రీనాథుడు, ఆమె వైపు చూచి, తల్లీ! మీరు నన్ను ఏదో అడగాలని ప్రయత్నిస్తున్నారు. నిస్సంకోచంగా అడుగవచ్చునన్నాడు. శ్రీనాథ కవీశ్వరా! ఉల్లి చేసిన మేలు తల్లియైనా చేయదని అంటారు కదా! మరి ఉల్లి తిన్నందుకు బాధపడుతున్నారెందుకు? అని ప్రశ్నించారు మంత్రిణి. తల్లీ! నేను వేదవిహితములైన ధర్మాలను త్రికరణ శుద్ధిగా ఆచరించేవాడిని. కనుకనే బాధపడుతున్నానన్న శ్రీనాథుని చూచి, డిండిమభట్టారకులు - ఇది మాదేశాచారము. "ఆచారః పరమోధర్మః" అని -

శాస్త్రం కన్నా, ఆచారం బలీయమైనది కదా! అన్నారు. డిండిమభట్టారకులకీ విషయం తెలియనిది కాదు. వారు సకలశాస్త్ర పారంగతులు లశునం, పిశునం, పలాండు, కనకమనే నాల్గురకాల ఉల్లిపాయలను తినరాదని స్మృతులు కూడ హెచ్చరించాయి. ఇవి శ్రుతి ధర్మాల ననుసరించినవే కదా అనిన శ్రీనాథునితో "నకలంజం భక్షయేత్" - అను శ్రుతిని డిండిములు వినిపించారు. వెంటనే శ్రీనాథుడు దాని ముందొక శ్రుతి ఉన్నది, "పరదారాన్ నగచ్ఛేత్" పరదారాభిమర్శము ఎంతటి పాపమో, కలంజ భక్షణము కూడ అంతటి పాపమని తలచి, దానిని విసర్జించాం. శిష్టులైన మావంటి వారికి అది మాదేశాచారము కాదని మనవి చేస్తున్నానన్నాడు. రాజకుల గురుబ్రహ్మలు మెచ్చుకొన్నారు. వేదపండితులు, భట్టారకులు సత్యమన్నారు.

తల్లీ! మీరొక్క మాట పలికారు. ఉల్లి చేసిన మేలు తల్లి చేయదని. ఇది సత్యమే ఎప్పుడంటారా? మందువలె రోగ నివారణార్థం వాడినపుడు మాత్రమే, అంతేకాని విందు చేయుటకు కాదు. ఉల్లి తింటే వ్యర్థమైన కోర్కెలు పెరిగి, పతన మౌతాడంటారు. దీనిని తమోగుణాహారంగా చెప్పారు. సాత్త్వికాహారాన్ని స్వీకరించుటయే మేలు కదా! అని పల్కిన శ్రీనాథుని యోచనతో, బ్రహ్మశ్రీ సుబ్రహ్మణ్యశ్రౌతి, శ్రుతి కలిపారు.

ధార్మికాచార పరాయణులైన మీ వంటి సచ్ఛీలురున్నారు కనుకనే, దేశం సుభిక్షంగా ఉంది. మానగరంలో వర్ణా శ్రమ ధర్మాలకు లోటు రానివ్వము. స్వధర్మాచరణకే పెద్ద పీట వేస్తాం. అతిథుల్ని గౌరవిస్తాం. ఆతడల్పుడైనా అధికుడైనా సరే! మీరు అభ్యాగతులు, విష్ణువే అని పల్కిన చామనామాత్యుల మంచి మనస్సుకు నమస్సులర్పిస్తూ, శ్రీనాథుడు ఎప్పుడన్నాడు వాదసభకు శ్రీకారం! గౌడ డిండిమభట్టారకులు చాల కాలము నుండి దీక్షలో ఉన్నారు. అయినా మీరు ప్రభువులతో మాట్లాడు సమయాన ఇపుడే వాదం ప్రారంభించడానికి వారంగీకారాన్ని సూచించారు - అన్నారు మహామంత్రి. ప్రభూ! వాగ్యుద్ధంలో గెలుపోటములు దైవాధీనాలు. అయినప్పటికి, ధర్మనిర్ణయం చేయడానికి సర్వసమర్థులైన న్యాయాధిపతులను నియమించండి. ప్రాడ్వివాక వరులు అసమర్థులైతే ఉభయులకు కంఠశోషయే మిగులుతుంది అన్నారు, తిప్పయ్యశ్రేష్ఠి; ఉభయ భారతి వంటి అష్ట భాషా కవితా సర్వంకష మనీషా విశేష భారతీ బిరుదాంచితురాలు, వాక్చాతుర్య విశారద విజయలక్ష్మి గారు, పుంభావ సరస్వతులైన ముమ్మకవి, చామరసు గార్లున్నారు. కులగురు బ్రహ్మలున్నారు... అంటూ విద్వత్కవీశ్వరుల గురించి రాయలవారితో ప్రధానామాత్యులు చర్చించారు. వేదశాస్త్ర పురాణాది విద్యలెల్ల, శ్రీచంద్ర భూష క్రియాశక్తి

రాయలవారికి ఘంటాపథము. కృత్స్నవేద రాశి స్వరూపులు, ధార్మికులు - విజయనగర సామ్రాజ్యంలో గల ప్రధాన న్యాయస్థానానికి ప్రధాన న్యాయమూర్తి - వారిని ఈ వాదసదస్సుకు న్యాయాధిపతిగా వ్యవహరింపుడని కోరండి అన్నారు మహామంత్రి. ప్రధానామాత్యా! మీ ఆలోచన సరియైనదే కాని, వారు, మా కులగురు బ్రహ్మలు కదా! మనకే విజయం సంభవిస్తే కావలెననియే వారిని న్యాయనిర్ణేతగా కోరితిమంటారేమో, నిర్ణయం లేనిపోని అపోహలకు దారితీయరాదు. మరొకసారి యోచించండి. కులగురువులు సదసద్వివేకవంతులు, వాది ప్రతివాదులంగీకరిస్తే మాకునూ అంగీకారమే. సంధ్యాకాలం సమీపిస్తోంది. సంధ్యావందనాది కార్యక్రమాలు నిర్వర్తించడానికై ఓ గంట విరామాన్ని మహామాత్యులు ప్రకటించటంతో, రాయలవారు, వేదిక నానుకొని ప్రక్కనే గల పుజామందిరం లోనికి వెళ్ళారు. బ్రహ్మక్షత్రియ వైశ్యులు సంధ్యా వందనం చేసికోవటానికై బయలుదేరారు. మిగిలిన వారందఱూ దైవ ప్రార్థనలలో నిమగ్నులయ్యారు.

మేతలకు వెళ్ళిన పక్షులు, గగన మార్గాన బారులు తీఱి, తమతమ గూడులకు చేరుకొంటున్నాయి. సూర్య బింబపు ఎఱ్ఱని కాంతులు, మోదుగు పూల గుత్తుల రంగుతో అంతటా వ్యాపించాయి. పచ్చిక మేయు లేడి పిల్లలు, చెంగుచెంగున దూకటాన్ని ఆపి, దావాగ్నియనే భ్రాంతితో భయపడి చలించిపోతున్నాయి. అంతవరకు సూర్యరశ్మి సోకటంచే మంటలు గ్రక్కే సూర్య కాంతపు శిలలు చల్లబడ్డాయి. ఎండమావులు కనబడకుండా పోయాయి. సూర్యకాంతి క్రమక్రమంగా తగ్గడంతో మనోహరమైన సరస్సులోని తామరపూవుల గుంపులు ముకుళించుకొంటున్నాయి. ప్రొద్దుగ్రుంకటంతో చక్రవాక దంపతులకు వియోగం కలిగింది. సూర్యాస్తమయం కావటంతో, ద్విజులంతా అర్ఘ్య ప్రదానాలు చేసి, గాయత్రీ మంత్రాన్ని జపిస్తున్నారు.

ప్రభువులు, సంధ్యావందనం పూర్తి చేసికొని, గోక్షీరాన్ని సేవించి, పూజామందిరం లోంచి, ప్రక్కనే ఉన్న సమాలోచన మందిరంలోకి వచ్చారు. అపుడే మహామంత్రి చామనామాత్యులు వచ్చి పాలనా యంత్రాంగ విషయాలు చర్చించి, వాదసభకు న్యాయనిర్ణేత విషయాన్ని మనవి చేసారు. ముమ్మకవి, డిండిమభట్టారకులు సమస్కందులు. ఏ ఒక్కరూ, మరొక్కరికి తీసి పోవువారు కారు. అయినప్పటికి అదృష్టదేవత డిండిమ భట్టారకులనే వరించుటంచేత విద్యాధికారి పదవి దక్కింది. పండితమాత్సర్యంతో ముమ్మకవీశ్వరులు వాదసభకు న్యాయం చేస్తారోలేదో! సందేహమే. ఈ విషయంలో మంత్రిమండలితోను, సదస్యులలోని ముఖ్యులతోను వాది ప్రతివాదులతోను చర్చించాను అంటూ విషయాలన్నీ

తెలిపి, ప్రభువుల నిర్ణయాన్ని తెలిసికొన్నారు.

అందరికీ గోక్షీరాన్నందజేయించి, ఏడు గంటలు సమీపించటంతో తిరిగి సభప్రారంభించారు. ప్రభువులు వేదిక పైకివచ్చి స్వర్ణ సింహాసనంలో ఆశీనులయ్యారు. సదస్యులంతా వారి వారి స్థానాల్లో కూర్చున్నారు.

మంత్రి సామంత దండనాయకులు, పండితులు, సాహితీ ప్రియంభావుకులు వాద ప్రతివాదాలెపుడు వింటామా యని తహతహలాడుతున్నారు. ఇంతలో, వాద సభప్రారంభంకాబోతోందన్న విషయాన్ని ప్రకటించటంతో సదస్యుల హర్షధ్వానాలు ముత్యాలశాలలో ప్రతిధ్వనించాయి. ముత్యాలశాల మురిసింది. సాహిత్యసౌరభాలు విరజిమ్మే వాద సుమం విరిసింది. వాగమృతం కురిసింది.

1. హరిః ఓమ్! **నమో బ్రహ్మణే నమో అస్త్వగ్నయె నమః పృథివ్యై నమ ఓషధీభ్యః నమో వాచే నమో వాచస్పతయె నమో విష్ణవే బృహతే కరోమి ॥ ఓం శాన్తిశ్శాన్తిశ్శాన్తిః ॥** అని బ్రహ్మశ్రీ సుబ్రహ్మణ్యశ్రౌతి శ్రుతిసూక్తులు పఠించటంతో సభ పునః ప్రారంభమైంది.

శ్రీనాథుడు, వేదమూర్తులైన శ్రౌతి గార్కి నమస్కరించటంతో, "శుభమస్తు" అని, ఆశీర్వదించారు. వెంటనే వయోవృద్ధులైన అరుణగిరినాథులచెంత కేగి, బ్రాహ్మీమయమూర్తులైన డిండిమభట్టారక కవిసార్వభౌముల కభివందనాలు చేసారు. వారు సంతోషంతో "విజయోస్తు"! అని దీవించారు. నాన్నగారూ! ఇదేమిటి? అన్నాడు, రాజనాథుడు; నాయనా! పలికించేవాడు పరమేశ్వరుడు ఇదంతా ఈశ్వరేచ్ఛ...అన్నారు, విన్న కులగురువులు – "ఋషీణాం పునరాద్యానాం వాచమర్థోనుధావతి" అని తలచారు. శ్రీ విజయనగరాధీశులైన శ్రీ ప్రౌఢ దేవరాయలకు చేతులు జోడించిన శ్రీనాథ కవితో మీరు పండితులు, విప్రోత్తములు, మీరు ఆశీస్సులే ఇవ్వాలి – అన్నారు ప్రభువులు.

శ్రీనాథుడు : ప్రభూ! **"నా విష్ణుః పృథివీపతిః"**.... కనుక మీరూ శ్రీనాథులే! నేనూ శ్రీనాథుడను. మీరూ రారాజులు, నేను కవిరాజును. పరస్పరము వందనాలాచరించటం శాస్త్రసమ్మతమే కదా!

రాయలు : మంచిది, మీకును మాప్రణామాలు.

శ్రీనాథకవి : సమస్త సన్మంగళాని భవంతు... అని రాయల వారి నాశీర్వదించి, అరుణగిరినాథులను చూచి, మీ ప్రతిజ్ఞ ఏమిటి? ఏది మనకు ప్రమాణం? వాద సభకు అధ్యక్షులెవరు? ఈ విషయాలన్నీ చర్చించాక, మా మనోభిప్రాయం తెలియజేస్తాం అంటూనే, ఈ విషయాన్నంతా కందంలో అందంగా పొందు పఱచి వీనులవిందు చేసారు.

కం॥ వాదముల వాదియును ప్రతి
వాదియు గొందురు విపక్ష పక్షము గానన్
వాదించు మనకు దెలుపుమ
యేది ప్రతిన? యేది ప్రమాణమెవరధ్యక్షుల్?

శ్రీనాథ కవీ ! మీరు పరాజితులైనచో, మాకు శిష్యులు కావలెనన్నదే మా ప్రతిన. మనకు **వాదమున వేదమే పరమ ప్రమాణము.**

వాద సభకు, అధ్యక్షులుగా ప్రభువులు ఎవరిని నియమించినా సమ్మతమే అని పల్కిన డిండిమభట్టు సమాధానాలను శ్రీనాథభట్టు అంగీకరించటంతో సదస్యులు చప్పట్లు చరచారు. ప్రభూ! నేను, రచించిన "మానసోల్లాసమ్" – అను సంస్కృత మహాకావ్యంలో దోషాలున్నాయని, వల్లభునితో డిండిమభట్టారకులన్నారుట. వెంటనే, మా ప్రియశిష్యుడును, నాసికేతోపాఖ్యానాన్ని రచించిన కూరిమిసేయు బావమఱదిని పంపి, దోషాలను తెలిసికొనిరమ్మన్నాను. వాడు వెళ్ళి వారు తెలిపినవి దోషములు కావని నిరూపించివచ్చాడు. చూచిరమ్మంటే కాల్చివచ్చాడుట మారుతి, అలా, బావమఱది దగ్గుపల్లి దుగ్గన, నేను దోషాలను చూచి రారా అంటే తప్పులనిన వారి వాదాన్ని ఖండించి, వారికి కోపాగ్నిని రగిల్చివచ్చాడు. "శేషం కోపేనపూరయేత్" అన్నట్లు వారు కోపోద్రిక్తులైనారని విన్నాను. ఇపుడైనను, వారు మా కావ్యమందు దోషాలుంటే నిరూపించవచ్చు, లేనిచో దోషములు లేవని ఈ సభాముఖంగా ప్రకటిస్తే నా ఈ అధికరణాన్ని ఉపసంహరించుకొంటాను. ప్రభూ! మరొక్క మనవి. ధర్మాసనాన్నధిష్ఠించి, శ్రుతి సమ్మతంగా జయాపజయములు ప్రకటించు తీర్పరులను నియోగింప ప్రార్థన, అన్నాడు శ్రీనాథుడు. చామనామాత్యులేమంటారు?... అనిన రాయలవారితో,

మహామంత్రి : ప్రభూ! రాజకులగురు బ్రహ్మలే ధర్మపీఠాన్ని అధిష్ఠింప సమర్థులు అన్నారు.

సముచిత నిర్ణయమే! మరి గురుబ్రహ్మలు, ఈ వాదసభకు న్యాయాధిపతిగా వ్యవహరించి తీర్పు చెప్పాలని కోరుతున్నాం. గురుబ్రహ్మలేమంటారు? అని వినయంగా మనవి చేసిన రాయల వారితో, ప్రభువులు, మాకు పుత్రతుల్యులు. మీ మాట కాదనినదెప్పుడు, సంతోషంగా న్యాయపీఠాన్నధిష్ఠించి, ధర్మనిర్ణయము చేస్తామన్నారు, గురుబ్రహ్మ.

రాయలు : ధన్యోస్మి గురదేవా! ధన్యోస్మి!!

ప్రభువుల సూచనపై, పూలహారాన్ని వల్లభుడు తీసికొని రావటంతో, వారే స్వయంగా,

గురుబ్రహ్మల మెడలో వేసినంతనే కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి. వేదపండితులు, మంత్రాక్షతలు జల్లారు. ముత్తైదువలు హారతులిచ్చారు. శ్రౌతిగారు శ్రోత్రియాగారం నుండి అగ్నిహోత్రాన్ని తెచ్చి, అగ్నిముఖాన్ని పఠించిన తర్వాత, "అగ్నిహోత్రుని సాక్షిగా, వాద ప్రతివాదాలు విని, వివాద విషయాన్ని సూక్ష్మంగా పరిశీలించి ధర్మ నిర్ణయం చేస్తానని అందరి ఎదుట ప్రమాణం చేస్తున్నాను" అని శ్రీ చంద్ర భూష క్రియా శక్తి రాయలవారన్నారు. వాది ప్రతివాదుల చేతకూడ ధర్మబద్ధులమై వాదనలు వినిపిస్తామని, వితండ వాదనలు చేయమని, శ్రుత్యనుసారమే వాదిస్తామని, వేదమే పరమ ప్రమాణంగా స్వీకరిస్తామని అగ్నిసాక్షిగా ప్రమాణాలు చేయించారు గురుబ్రహ్మ.

ఈ వాదసభ, నలుబది రోజులుంటుందన్నారు. వేదవేదాన్త పురాణాది విద్యలు, సమస్త శాస్త్రాలు వాదించవచ్చు. గీర్వాణాంధ్ర భాషల్లోనే తమతమ వాదనలు వినిపించాలి. గద్యపద్యాల్లో గాని, శ్లోకాల్లో గాని స్వపక్షాన్ని స్థాపించుకోవచ్చు. క్రీ.శ.1431, శ్రీ **విరోధికృన్నామ సంవత్సర చైత్ర శుద్ధ దశమి** నాడు ప్రారంభమౌతున్న ఈ వాద సభ. ఈ వత్సరంలోని **వైశాఖ బహుళ పంచమి**తో పూర్తవుతుంది. నాడే ఎవరు విజేతలో నిర్ణయిస్తాం. మా నిర్ణయానికి ఉభయులూ కట్టుబడి ఉండాలి - అని గురుబ్రహ్మలు ఆదేశించారు. అగ్నిభట్టారకుని యెదుట ప్రమాణం చేసిన భట్టారకులిద్దఱూ వారి ఆదేశం శిరోధార్య మన్నారు. సభంతా కలయజూశారు. అందరూ పుంభావ సరస్వతులే.

ఉ॥ **ఎక్కడి గౌడదేశమతడెక్కడి కెక్కడి నుండి వచ్చెబే**
రెక్కిన యొక్కఢక్కను వహించి జయించుచు బండితా వళిన్
ధిక్కృతి సేయుచుండె గడు ధీరత, నీతని కంచు ఢక్కలన్
చెక్కలు ముక్కలౌనటుల సేయనిచో బరు వింక దక్కునే!

ఈ విధంగా మనములోదలచిన శ్రీనాథుడు, సాహసంతో సవాల్ విసరినందులకైనా డిండిముని చేతనే కంచు ఢక్కను ముక్కలుచేయించాలని నిశ్చయించుకొన్నాడు. శ్రీనాథ కవీ! మీ ప్రతిజ్ఞ వినిపించండి అని గురుబ్రహ్మలనటంతో, ఇలా వినిపించె.

చం. **ఇరువురిలోన వాదమున నేరు పరాజితులైరొ వారియా**
బిరుదములన్ బహూకృతులు, బేరును బెంపును సుప్రతిష్ఠలున్
తిరపడు గెల్చుకొన్న కవిధీరున కిద్ది పణంబు మాకు - నా
పరపతి నిల్ప బెట్టగల భారము నీయదె సుమ్ము భారతీ!!

డెబ్బది వసంతాలు గడచాయి. కొంత పేరు ప్రతిష్ఠలు సంపాదించాను. మనోహరములైన కావ్య గుచ్ఛాలను నీ పదపద్మాలపై ఉంచానమ్మా భారతీ! నన్నునుగ్రహించు తల్లీ!

శా॥ అటోపార భటీ కఠోర ధర సంధ్యానృత్యకేళీ నిరా
ఘాట ప్రౌఢ నిరూఢగూఢ పదరాడ్గైవేయ భాస్వజ్జటా
జూటాంతర్విలు ఠత్తరంగ సుమన స్రోతస్వినీ నిర్ఝరీ
వ్యాటీ కోత్కట చాటు వాక్యఘటితన్ వర్ణింతు నా భారతిన్.

శ్రీనాథ భట్టారకులు, సరస్వతీ దేవిని ప్రార్థించుకొన్నారు. అరుణగిరినాథులైన డిండిమభట్టారకులు వారిష్టదైవాన్ని స్మరించారు. ఇద్దఱూ వాదానికి సిద్ధమైనారు. అది **తొలిరోజు.** ఘంటమ్రోగింది. ప్రప్రథమ **వాదసభ** ప్రారంభమైంది.

శ్రీనాథుడు : శ్లో॥ సభాకల్పతరుం వందే, వేదశాఖోపజీవితమ్ ।
శాస్త్ర పుష్పసమాయుక్తం విద్వద్భ్రమరశోభితమ్ ॥ అని సభను కల్పతరువుగా భావించి నమస్కారం చేశాడు. అది వేదశాఖోప శాఖలచే విస్తరింపబడినది. శాస్త్ర పుష్పములచే సమాయుక్తమై, విద్వత్ భ్రమరాలచే శోభిస్తోందన్నాడు.

శా॥ జేజేయంచు భజింతునిష్టఫల సంసిద్ధుల్ మదింగోరి ని
ర్వ్యాజ ప్రౌఢ కృపావలంబుని గట ప్రస్యంది దానాంబు నిం
బూజాతత్పర దేవదానవ కదంబున్ బాలకేళీ కళా
రాజత్కౌతుక రంజితోరగపతి ప్రాలంబు హేరంబునిన్

మనములోగల కోరిక నెరవేరాలని, ఏ అడ్డంకులు లేకుండా చేయవసినదిగా, శ్రీనాథుడు ఆది గణపతిని ప్రార్థించాడు. జన్మనక్షత్రాన్ని తలచి, ఆకాశంలోని తారకలను స్మరించి సంధ్యా తాండవ రభసలో వేగంగా జారిపడిన శివుని హార అస్థికలని తలచి కొలిచాడు. మనములో "ఓం నమశ్శివాయ" – అను, పంచాక్షరీమంత్రాన్ని జపించాడు. తల్లిదండ్రుల్ని, అర్థవృద్ధను మనః పదవిని నిల్పాడు.

శ్లో॥ శారదా శారదాంభోజ వదనా వదనాంబుజే ।
సర్వదా సర్వదా స్మాకం సన్నిధి స్సన్నిధిం క్రియాత్ ॥

అని డిండిభట్టారకులు శారదా దేవినారాధించి, ఏమి బిరుదులున్నాయని శ్రీనాథుని ప్రశ్నించారు. బిరుదులదేమున్నది లెండి? ధర్మజుని మాటపై, అర్జునుడు తాను గాండీవాదుల్ని జమ్మి చెట్టుపై పెట్టినట్లే, నేకూడ బిరుదులు నారివాగు కడబెట్టి వచ్చాను. నేను కూడ మీ వలె సత్కవి సార్వభౌముడనే అంటూ పద్యం వినిపించాడు.

చంII తరువున గాండివం బిడదె ధర్మజు నానగిరీటి? యేను వా
క్సర సిజ నేత్ర నానతి విచారము చొప్పున గర్వహీనతన్
మరల తెనుంగుభూమి కసమానగతిన్ గొనిపోవువాడ, నే
బిరుదులు నారివాగుకడ బెట్టితి, సత్కవిసార్వభౌముడన్.

శ్రీనాథుడు, సౌమ్యంగా చెబుతూనే, గడుసుగా వినయవిధేయతల్ని ప్రదర్శించాడు, అంటూనే ముమ్మకవి **"ఎన్నాంగో - ఇంగ అరుణగిరినాథ కవిసార్వభౌమను - అంగ శ్రీనాథ కవిసార్వభౌమను, నన్నాఇరిక! నారివాగు ఎంగ"** - అన్నారు.

భాట్ట ప్రభాకర ప్రస్థాన సంవేద్యులు, భాష్య ఫక్కికా భావజ్ఞులు, కణభుజ్మత గ్రంథ గాధార్థ విదులు, బహు శ్రుత్యసంపన్నులు, వేద వేదాంత వాసనా విశ్రాంత హృదజ్ఞులు, ఉపనిషత్తత్త్వజ్ఞులు, సంస్కృతాంధ్ర తమిళ కన్నడాద్యనేక భాషా సుసంపన్నులు బలిసి కొలువున్న రాయల నిండు పేరోలగము - మౌక్తిక శాలాకాంతా కర్ణాభరణము.

శ్రీనాథుని ప్రత్యర్థి శ్రీ అరుణగిరినాథుడు. వీరు గౌడులు, గౌతమ గోత్రులు. సామవేదీయులు. ప్రపథమంలో గంగాతటవాసులు. మహా శివలింగారాధన వ్రతులు శైవాగమ జీవాతువులు, పరమమాహేశ్వర వరివస్యామర్మజ్ఞులు, శ్రౌతాచార పూతాత్ములు. వారు సకల శాస్త్రాలనధ్యయనం చేసి, గంగాతీరంలో గల అందాలరాశి కాశిలోని పండితులనోడించి, దక్షిణ భారతదేశాన అడుగుపెట్టి చేరచోళ పాండ్యాద్యనేక దేశాలలోని పండిలను జయించి, ద్వాదశ దేశ్యవృత్తులను సముపార్జించిన ధీశాలి. విద్వత్తులోను, కవితా ప్రతిభలోను, పూజ్యతలోను అధికుడుగా చండిముడుగా దర్శన మిచ్చులబ్ధ ప్రతిష్ఠుడు. దార్శనిక శిరోమణి. షడ్దర్శన షణ్ముఖుడని, అభినవ నాటక భవభూతియని, మాఘాద్యతివర్తి చిత్రప్రబంధ పరమేశ్వరుడని, కవి మల్లగల్ల తాడన పటువని బహువిధాల కీర్తింపబడిన డిండిమ కవిసార్వభౌముడౌ అరుణగిరినాథుడు.

అరుణగిరినాధునికి ప్రత్యర్థిగా వచ్చిన శ్రీనాథుడు, ఆయనకేమాత్రం తీసిపోడు. అక్షపాద పక్షిలోదీరితములైన గౌతముని న్యాయదర్శనము దానిపై వ్యాఖ్య కణాదప్రోక్తమైన వైశేషిక దర్శనము, కపిల మహర్షి ప్రోక్తమౌ సాంఖ్య దర్శనములలో కౌశల మున్నవాడు, పూర్వోత్తర మిమాంసా దర్శనములలో అపారమైన పాండిత్యం గలవాడు, పతంజలి యోగదర్శనాన్ని అనుభవం లోనికి తెచ్చుకొన్నవాడు, భాష్యాంతవైయాకరణుడు, సంస్కృత ప్రాకృత శౌరసేనీ ముఖ్య భాషాపరిజ్ఞాన పాటవం కలవాడు. అధ్వర్యుశాఖాధీతి నిష్ణాతుడు - అంటే కృష్ణయజుర్వేదాన్ని అధ్యయనం చేసినవాడు. సర్వాగమములను గాఢంగా

మథించినవాడు, ధర్మశాస్త్రాలను, అష్టాదశ పురాణాలను క్షుణ్ణంగా తెలిసినవాడు, సంస్కృతాంధ్రాలలో ప్రౌఢ కవిత్వం చెప్పగలిగినవాడు.

భట్టులిద్దఱు విద్యాధికారులే, ఇద్దరూ పాండిత్యంలోగాని, కవితా ప్రతిభలోగాని, వ్యుత్పత్త్యభ్యాసాలలోగాని, శిష్య సంతతిలో గాని, అహంకృతిలో గాని, ఒకరికొకరు తీసిపోవు వారు కారు. వివాదము సంభవించింది. ఇద్దరూ దిగ్గజాలే. సదస్యులందరికి ఉత్కంఠ కలిగిస్తోంది.

ఇద్దఱూ ఏడు పదులు దాటినవారే. శ్రీనాథుని కన్ననూ, డిండిమ భట్టారకులే వయస్సులో పెద్దవారని, శ్రీనాథుడు వారికి నమస్కరించి, ఆశీస్సులను పొందడం చేత తెలుస్తోంది. సదస్యులు "చిత్రార్పితా రంభ ఇవావతస్థౌ".

ఇద్దఱూ, ఉద్దండ పండితులే! ఎవరు విజయలక్ష్మిని పొందుతారోనని, చెవులప్ప గించారు, సదస్యులు. ప్రభూ! నా "మానసోల్లాస" మహాకావ్యంలో వ్యాకరణదోషాలేవియో కలవని డిండిమ భట్టారకులు పలికారు. అవి ఏవియో ఈ పండిత సదస్సులో నిరూపించండి. ఒక వేళ నాకు పరాజయమే ప్రాప్తిస్తే, నా కావ్యప్రతుల్ని ఈ సభాముఖంగా అగ్నిలో దగ్ధం చేసి అరుణగిరినాథులు కోరినట్లే వారికి అంతే వాసినై సేవలు చేసికొంటాను, అని వినయంగా మనవి చేసి, ఇలా అన్నాడు.

అరుణగిరినాథులు, నా కావ్యములందు కాని, శాస్త్ర వాదములందు కాని ఒక్క దోషమైనా ఋజువు చేయలేక పరాజితులైతే, తమ కవితాశయమును ప్రకటించుకొనే, కంచుఢక్కను వారే స్వయముగా పగులగొట్టాలి, వారి బిరుదులు మాకు చెందాలి. ఇది మా ప్రతిజ్ఞ - అనిన శ్రీనాథుని మాటలు, డిండిమ శిష్యాళికి తూటాలు! అవి పలుకులా? ములుకులన్నారు కొందరు, చక్కెర పలుకులన్నారు మరి కొందఱు.

శ్రీనాథుని ప్రతిజ్ఞ విన్నంతనే ప్రౌఢ దేవరాయలవారు ఉలిక్కిపడ్డారు. వచ్చే కోపాన్ని సముదాయించుకొన్నారు. క్రోధాన్ని దిగమ్రింగుకొన్నారు. కులపతి రాజనాథులు, రాయలవారు, గురుబ్రహ్మల వైపు, మహామాత్యులవైపు చూసారు. ఏమిటిది?యని కనులతోనే ప్రశ్నించారు. "శ్రీ పౌఢ దేవరాయల వారి పూర్వులైన బుక్కరాయలవారు, అరుణగిరినాథుల తండ్రి గారైన శోణాద్రినాథుల వారి పాండితీ వైభవానికి మెచ్చి వారి కుటుంబానికి అనుగ్రహించిన గౌరవ లాంఛనమే కంచుఢక్క. ఈ డిండిమమును పగులగొట్టించుట పణముగా కోరుట విచిత్రము. ఇది తగనిది. మరొకటేదైనను కోరుకోండి - అన్నారు మహామంత్రి. మాది ఒకటే మాట, ఒకటే బాట, సత్యవచస్కులమన్నారు శ్రీనా

ఘుడు. ప్రౌఢదేవరాయల వారు, గురుబ్రహ్మవైపు చూసి, న్యాయాధిపతులేమంటారన్నారు.

గురుబ్రహ్మ : వాది ఏదైనా పణముగా కోరుకోవచ్చు. అది ధర్మమా? అధర్మమా? అని రాయలవారికి తెలియనిది కాదు. వారు కోరుట ధర్మబద్ధమే.

రాయలు : మరి, ఆస్థాన కవులైన డిండిమభట్టారకులేమందురు?

డిండిమభట్టు : ప్రభూ! ఓడిన కదా, పగులగొట్టుట! మాకది అంగీకారమే!

గురుబ్రహ్మ : అయినచో వాదము ప్రారంభింపవచ్చును.

డిండిమభట్టు : మీ "మానసోల్లాస" కావ్యాన్ని చదివాము. అందలి "పణిన సూనుడు" - పాణిని యనుట ఎట్లు?

శ్రీనాథభట్టు : పణోస్యాస్తీతి పణీ, పణినః గోత్రాపత్యం పాణినః

తస్య యువాపత్యం పాణినిః ఇచట, పణనం పణః స్తుతి. పాణినుని కొడుకు పాణిని 'పణి'యను ముని ఉన్నాడు. అతని కొడుకు పాణినుడు, పాణినుని కొడుకు - పాణిని.

డిండిమభట్టు : పణి నా పత్యము కాదు "పణినాం పత్యుక్త" అను పాఠమే సరియైనది.

శ్రీనాథకవి : "తుహ్యోస్తాతఙ్"... ఇత్యాది సూత్రం పాణినీయమగుటచే,

పణినాపత్యము కాని, పణినాంపతి కాదనుట సుస్పష్టము

"పణిభవ" - అనియే కాని, ఫణి శబ్దంతో సంబంధం లేదు.

డిండిమభట్టు : గ్రహయాళు శబ్దః - కథంసిధ్యతి?

శ్రీనాథకవి : గ్రహవృదృనిశ్చిగమశ్చ (పా. 3-3-58) - ఇతి అబన్తోగ్రహః,

తతః "తత్కరోతి తదాచష్టే" - ఇతి వార్తికాత్ ణౌ.

"ప్రాతిపదికా ద్భహుల మిష్ఠ వచ్చ" - ఇతి ఇష్ఠవద్భావే" - "టేః" (పా. 6-4-155) ఇతిటిలోపాద్వృద్ధ్యభావే "సిద్ధేసతి యదాలుచంశాస్తితజ్ జ్ఞాపయత్యాచార్యః అన్యేభ్యోప్యయం భవతీతి - ఇతిభాష్యోక్తి మనుసృత్య - అలుచి కృతే, "అయామాన్తాల్వాయ్యేత్న్విష్ణుషు" (పా. 6-4-55) ఇతి ణే రయాదేశే గ్రహయాలు శబ్దః సిధ్యతి.

డిండిమభట్టు : 'గ్రహిళ' శబ్దమును, 'గ్రహిళేవమానినీ' - అనుచోట, ఆగ్రహముగల అను అర్థంలో ప్రయోగించారు. గ్రహిళా ఆగ్రహవతీమానినీవ - "విశ్వః"మతి, "ఉగ్రాసి గ్రహిళ భుజయుగళ" - అను చోట ఎలా సాధింతురు? ఒకేపదం, మీ మానసోల్లాస గ్రంథంలో రెండుచోట్ల ప్రయోగించారు. రెండవచోట "ఆగ్రహము" - అను అర్థం కుదరదు, కనుక దోషమే కదా!

శ్రీనాథకవి : "గ్రహిళ" శబ్దమునకు, "యత్నముకలది" - అను అర్థాన్నిచ్చేలా మరొక

చోట ప్రయోగించాను. "గ్రహిళైః యత్నవద్భిః", మరి, "ఉగ్రాసి గ్రహిళ భుజయుగళ" - అనుచోట "గ్రహ ఉపాదానే" - అను అర్థమును బట్టి "పట్టుకొను" - అను అర్థమున, గ్రహశబ్ధము కంటె "ఇలచ్" ప్రత్యయమురాగా "గ్రహిళ" శబ్దం సిద్ధిస్తుంది. "గ్రహిళా ఆగ్రహవతీ మానినీవ... గ్రహోనుగ్రహ నిర్బంధౌ - విశ్వః - అను సూక్తిచే, గ్రహము అనగా నిర్బంధము. తుందాదిభ్యఇలచ్చ (పా.5-2-117) చే గ్రహశబ్దం కంటె ఇలచ్, ప్రత్యయం రాగా "గ్రహిళ" శబ్దం సిద్ధిస్తోంది.

భయంకరమైన ఖడ్గమును పట్టుకొనిన భుజముల యొక్క జంటకలవాడా! అను అర్థము సిద్ధించుటచే దోషం కాజాలదు కనుక మా కావ్యం సర్వ దోషరహితమైనది. మామానసోల్లాస కావ్యంలోని "ఉగ్రాసి గ్రహిళ భుజయుగళ" - అనుసమాసంలో గ్రహిళ శబ్దము సాధువు.

గురుబ్రహ్మ : శ్రీనాథ కవి, పాణీనీయమాధారంగా శబ్దాలను సాధువులని నిరూపించారు. వారువైయాకరణులు. సందేహమే మాత్రమూలేదు.

శ్రీనాథకవి : తే॥గీ॥ వ్యర్థమగు వాద మొనరించునట్టి వారి
దంబమణగించు టాపోశనంబు మాకు!
రాజ పరమేశ! రాజాధి రాజవిభవ!
లక్షణోపేంద్ర! ప్రౌఢరాయక్షితీంద్ర!!

డిండిమభట్టు : అత్యుచ్ఛ్రయః పతన హేతుః

శ్రీనాథకవి : ధృవే అవ్యాప్తిః ।

డిండిమభట్టు : ప్రళయే తస్యాపి పతన సంభవః

శ్రీనాథకవి : తదా సర్వేషాం పతన మేవ !

గురుబ్రహ్మ : భట్టులిద్దఱూ ఘటికులే ! చక్కని ప్రశ్నలకు చిక్కని సమాధానాలు. ఈ రాత్రి భోజన సమయమైంది. నేటికి సభ ముగించి, రేపు మద్యాహ్నం కొనసాగిద్దాం. ఔనవును, అల్పారంభమే క్షేమకరమన్నారు చామనామాత్యులు. **ఓం సహనావవతు । సహనౌభునక్తు । సహవీర్యం కరవావహై । తేజస్వినా వధీతమస్తు । మావిద్విషావహై । ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః - అని అందరూ శాన్తిమంత్రం** పఠించారు.

రాయలవారు, రాజభవనానికి వెళ్ళారు. అందరూ భోజనశాలలకు వెళ్లారు. పంటమైలారురెడ్డి, తెలుంగా ధీశులు అవచి తిప్పయ్యశ్రేష్ఠి శ్రీనాథుని కలసికొన్నారు.

ఒక్కొక్కడే ఆలింగనం చేసికొని, ముచ్చట్లు చెప్పుకొన్నారు. వాదసభలు ముగిసేంత వరకూ ఉండి శ్రీనాథుని విజయవార్త విని, వెడతామన్నారు. అంతవరకూ శ్రీనాథుని రచనల్లోని విషయాలను విరామ సమయాల్లో వినిపింపుమనికోరారు. శ్రీనాథుని జీవితంలో ఇంతవరకూ జరిగిన సువర్ణఘట్టాలను కూడ చెప్పాలన్నారు.

కృతిభర్తల కోరికల్ని తీరుస్తానని మాట యిచ్చాడు. ఆకాశంలోకి చూచిన అవచితిప్పయ్యశెట్టి, శ్రీనాథా! చంద్రునిలో మచ్చకనబడుతూన్నప్పుడల్లా, అదేమిటా! యని అనేక రకాల భావిస్తుంటాను. ఆకాశం సముద్రంలా, నక్షత్రాలు సముద్రపు నురుగుతునియల్లా, చంద్రుడు, చుట్టుకొనియున్న ఆదిశేషునిలా, ఆ మచ్చ శేషునిపై పండుకొనియున్న విష్ణువులా అని నా భావన, మీరేమంటారు? అన్నాడు శ్రేష్టి.

మీ బాలసఖుడను, మీ ఊహ అద్భుతం. ఈ రోజు దశమి చంద్రుడు పూర్తిగా దర్శనమివ్వడు. దశమి చంద్రుడు కదా! మరి పున్నమి చంద్రుని చూశాక, నాకనిపిస్తుంది, మరి చీకటి ఏమైఉంటుందని! కటిక చీకటినంతా మ్రింగి కడుపులో దాచుకొన్నాడు చంద్రుడు. అందుకే కడుపులోని చీకచి, మచ్చలా కనబడుతోందని నే భావిస్తుంటాను. శ్రీనాథా! నీ యూహ కూడ నిజమేనేమో అనిపిస్తోంది. సరే, మేం భోజనం చేసి నిద్రిస్తాం. మీరు కూడ వల్లభునితో మిద్దెకు వెళ్ళి భోజనం చేసి విశ్రాంతి తీసికోండి, రేపు కలసికొందాం...అని కృతి భర్తలనటంతో అందరూ విడిది గృహాలు చేరారు. శ్రీనాథుడు కాళ్ళు చేతులు కడుక్కొని, లేజిగురరటాకులలో పెట్టిన భోజనం చేసి, మిద్దెపై పరుండిరి. శ్రీనాథుడు ముత్యాలశాలలో తన కేర్పాటుచేసిన మిద్దెపై పరుండి, ఆకాశం వైపు చూస్తూ రాయలవారి కీర్తిపుష్పాలు వెదచల్లినట్లున్న చుక్కలు చూచి, చల్లని గాలికి నిద్రలోకి జారుకొన్నాడు.

చక్రవాక దంపతులు, రాత్రి కావటంతో ఒకరికి మరొకరు ప్రక్కప్రక్కనే ఉన్నాసరే కన్నులు కనబడక వియోగంచే దుఃఖిస్తూనే ఉన్నాయి. ప్రొద్దు పొడవగానే అవి ప్రక్కనే ఉన్న విషయాన్ని గుర్తించి, అయ్యో! ఒకరి నొకరు తెలిసికోలేక పోయామే అని ఆవేదన ఆపుకోలేక ప్రేమాతిశయంచే కలసికొని, కలకలమనికూస్తూ మెడను మెడతోటి పెన వేసికొని ఆనందంతో చిందులేస్తూ, చిందరవందరపు నడకలతో ఒండొరుల దేహాలను పెనవేసికొంటున్నాయి. రాత్రంతా విరహవేదనతో కాటిన కన్నీటిని మెడలతో నొత్తుకొంటున్నాయి. రాత్రి కల్గిన యెడబాటును పొందిన దుఃఖాన్ని ఒకరికొకరు చూపులతోనే సముదాయించుకొంటున్నాయి. కాస్సేపు విరాగాన్ని, మరికాస్సేపు అనురాగాన్ని పొంది

నందిస్తున్నాయి.

తుంగభద్రానదీ ప్రహహాలలో జల పక్షులు విహరిస్తున్నాయి. ఆ నదీ జలం నిర్మలం, పవిత్రం. ఆ నదీ జలాల వలన సమీప భూములన్నీ ముక్కారు పంటలతో వర్థిల్లుతున్నాయి. మృదుమధురమైన జలప్రవాహాలతో సత్కని నిషేవితంబైనదీ తుంగభద్ర. ముక్తావళి విభ్రమాస్పదము. అందుకే ముక్తి కోరుద్విజావళి తుంగభద్రా నదీజల ప్రవాహంలో స్నానాలాచరిస్తుంటారు. శ్రీనాథుడు - అరుణోదయానికే లేచి, పరమేశ్వరుని ధ్యానించి, పంచాక్షరిని మనములోనే జపించి, కాలకృత్యాలనన్నీ తీర్చుకొని, తుంగభద్రానదీ తీరంచేరి నదియందలి మృత్తికను శరీరానికి పూసికొని మృత్తికాస్నానం చేసి, ఉదయించే బాలసూర్యునకు అర్ఘ్యప్రదానం చేసి, గాయత్రీ మంత్రాన్ని జపించి, సంధ్యావందనం పూర్తి చేసి, ఇసుక తిన్నెలయందునిల్చి సూర్యనమస్కారములు చేసి, ఉపరి వస్త్రాలను నదీప్రవాహాలలో ఉతికి, పిండి, ఒడ్డునున్న చెట్లపై ఆరవేసి, అగ్నిహోత్రానికి వలయు సమిధు లను సేకరించి, దేవతార్చనకు కావలసిన పూలుపండ్లు దర్భలు మొదలైన వస్తువుల్ని సమకూర్చుకొని, కమండలం నిండా నిర్మలోదకాన్ని నింపి, తడిసిన తలను తుడుచుకొని, శిఖను విదల్చి ఆరబెట్టి ముడివైచి అందొక పూవును తులసి దళాన్ని ఉంచి, ఆరవేసిన మడిబట్టలను తీసికొని కట్టుకొని తడిబట్టలను పిండి, బుజాన వైచికొని, వెంటవచ్చు శిష్యుడగు దుగ్గనచే వేదాలు వల్లెవేయిస్తూంటే, ఉదాత్తానుదాత్త స్వరిత స్వరాలను సరిచేస్తూ వసతి గృహం చేరాడు. తుల్యశీల తెచ్చియిచ్చిన జలంతో పాదప్రక్షాళన గావించి, దేవతార్చన అగ్ని కార్యం పూర్తిచేశాడు. నమక చమకాలతో రుద్రాభిషేకం పూర్తిచేసాడు. నూతనంగా పరిచయమైన విజ్ఞానార్థులకు వలసిన శాస్త్రార్థాలు బోధించాడు. ఎంతటి శాస్త్రపండితుడైనా అభ్యాసం చేయకుంటే వానికా శాస్త్రం విషతుల్యమేనంటూ, దుగ్గన్నకు, వల్లభునకు, హితులకు, సన్నిహితులకు, చతుస్సూత్రిని బోధించి దాన్ని అభ్యాసం చేయించాడు. చెంతనున్న సహధర్మచారిణి, "అనభ్యాసే విషం శాస్త్రం" - అన్నది. ప్రతిభ, వ్యుత్పత్తి అభ్యాసాలుంటేనే విద్వత్కవికి రాణింపు, నవనవోన్మేషశాలినీ ప్రతిభామతా" అన్నదాసాధ్వి.

శ్రీనాథునికి విడిదిలో వలసినవన్నీ సమకూర్చారు. గోక్షీరాభిషేకార్థం దూడగల ఆవును కూడ పంపటంతోపాటు, గోపాలకుల్ని కూడ పంపించారు. పరిచారికలు కారికలు పైపనులన్నీ చేస్తున్నారు. శ్రీలక్ష్మి గారే స్వయంగా గోమాతను సేవించి, పాలుపితికి తెచ్చారు. ఎక్కువపాలు దూడకేవదిలేసారు. ఆ లేగ, కడుపు నిండాపాలు త్రాగి, తోక మట్టునెత్తుకొని ఆనందంతో చెంగు చెంగున గంతులేస్తూ తిరుగుతూంటే, దాని బుజ్జి మెడలోని చిరుగంటలు

మ్రోగుతున్నాయి. దూడ అంబా అని ప్రేమతో తల్లిని పిలుస్తూంటే, తల్లి కూడ తలాడిస్తూ, మోరనెత్తి గంగడోలు కదల్తూంటే అంబా అంటూ పిల్లనొక కంట కనిపెడుతూన్న వాత్సల్యాన్ని చూచి మురిసి, ఆ గోమాతను సురభిగా తలచి, సముద్రమథనం చేస్తున్నప్పుడు, గిరగిరతిరిగే తరగలతో తిరుగుతూ అందుండి వెడలిన కామధేనువే మనదరికి చేరిందని కందంలో అందంగా చెప్పాడు శ్రీనాథ కవిరాజు.

కం॥ తరిగొండదరువ దరువం
దిరుగుడు వడు నుదధిలోన దీప్రముగా ది
ర్దిర దిరుగుచు దరగల వడి
దరతరమ సుపర్వసురభి దరికింజేరెన్.

వినినజాయ, హాయిగా నవ్వుకొని, వచ్చివిన్న వారందరికీ స్వాగతం పలికింది. శైవ ప్రబంధమగు హరవిలాసమునకు కృతినాయకుడైన అవచితిప్పయసెట్టి తన కుటుంబ సభ్యులతో వచ్చాడు. అతని విడిది గృహంలోనే అల్పాహారాలన్నీ ముగించుకొని మనుమలను కూడ తీసికొనివచ్చాడు. తెలుంగాధీశులు, పంటమైలారురెడ్డి, వారి వారి కుటుంబాలతో, శ్రీనాథుని విడిది గృహానికి వచ్చారు. సభలో పరిచయమైన వారిలో కొందరు, వల్లభుని ద్వారా విన్నవారు మరికొందరు వచ్చి శ్రీనాథ కవీశ్వరుల పుట్టుపూర్వోత్తరాలను వినాలని వారి ప్రియశిష్యుడు దగ్గుపల్లి దుగ్గన్నను కోరారు. అంతవరకు అంతేవాసులకు ఆగమ రహస్యాలను బోధించి, వచ్చిన వారిని పలుకరించిన శ్రీనాథుడు తాను నిత్యపారాయణ పూర్తి చేసివస్తానని అంతవరకు దుగ్గన్న మీతో ముచ్చటిస్తాడని చెప్పి పూజామందిరంలోనికి వెళ్ళారు. వారి కుటుంబిని వచ్చిన వారికి మర్యాదలు చేసింది. లోనికి వెళ్ళింది. వచ్చిన వారందరిని పరిచయం చేసికొన్నాడు, దుగ్గన్న. కొందరైతే తెలిసిన వారే. శ్రీనాథ కవుల గురించి కొందరికి తెలిసినా తెలియని వారందరికోసం వారి పుట్టుపూర్వోత్తరాలను సంక్షిప్తంగా చెప్పటం ప్రారంభించాడు.

శ్రీ విద్యోపాసకులైన కమలనాభామాత్యులు, ఆంధ్రతీరాన గల కాల్పట్టణాధికారి. వీరు మంచి పండితులు. కాశీ వెళ్ళి అచటి శాస్త్ర పండితుల చెంతచేరి, శుశ్రూషచేసి సకల శాస్త్రాల్ని అధ్యయనం చేసారు. వీరు, పద్మపురాణ సంగ్రహ కళా కావ్య ప్రబంధాధిపులు, భారద్వాజసగోత్రులు, ఆపస్తంబ సూత్రులు వీరి కుమారుడు మారయ. వీరు, తండ్రి చెంతనే విద్యలన్నీ నేర్చుకొన్నారు. యుక్తవయస్సు వచ్చాక, పుణ్యాచారయైన భీమాంబతో వివాహం చేసారు. వీరి దాంపత్యధర్మ ఫలంగా అమృత ఘడియలు నడువ,

చంద్రుడు, నక్షత్రాలు, బుధ సూర్యులు, బృహస్పతి, రాహు శుక్రులనే గ్రహాలు ఉచ్ఛస్థితిలో నుండగా నవమాసాలు నిండిన మా అత్తయ్య భీమాంబకు, పుత్రోదయమైంది. విద్యారాజీవభవుడైన మారయ గారెంతగానో సంతసించి, శ్రీకృష్ణుడే అవతరించినట్లు భావించారు. బ్రహ్మజ్ఞానుల వంశంలో బ్రహ్మజ్ఞాని పుట్టటం సహజం. **"బ్రహ్మవిత్కులే బ్రహ్మైవభవతి".** తియ్యమామిడి చెట్టు మామిడి ఫలాన్నే ఇస్తుంది కదా! అది శా.శ.1282 క్రీ.శ.1360 పిల్లవాడు పుట్టిన వెంటనే ఏడ్వలేదని, ఓ యవ్వవీపు తట్టిందట, దాంతో శిశువు కెవ్వుమన్నాడుట. పురిటిల్లు సందడే సందడి. ఆడవారి హడావిడి అంతా ఇంతా కాదు. ఇంతులు కొందరు తలాపి దిక్కున ధవళముద్రలు గల కుంభాన్నుంచారు. కొందఱు నారులు రక్ష కొఱకు భస్మరేఖలు వ్రాసారు. మరికొందఱు చానలు తెల్లావాలు జల్లారు. కొందరు వర్యలు సపర్యలు చేస్తున్నారు. కొందఱు వధువులు, ఉప్పు వేప చివురు త్రిప్పారు. కొందరు మగువలు మంచాన్ని సరిచేసారు. మహిళలు కొందఱు గంధ తైలాలను పూస్తున్నారు. కొందఱు కాంతలు బాలెంత కాయములందుకొంటున్నారు. కొందఱు పడతులు పరిహాసాలు చేసారు. మరికొందఱు పాటలు పాడటంతో శార్వరి వసంతపు కోయిలలు వంతపాడాయి. పిల్లల ఆటలతో తల్లుల దీవెనలతో సూతికాగృహం సందడిగా ఉంది. అన్నీశుభశకునాలే, ఆ తల్లి యదృష్టమన్నారు, ముత్తైదువలు. ఇద్దఱు బ్రాహ్మణులు పంచలో కూర్చుని స్వస్తి మంత్రాలు పఠించారు. శీతల వాయువులు వీచాయి. మంగళ వాయిద్యాలు వినబడ్డాయి. మనుమడు పుట్టాడన్న ఆనందంతో కమలనాభుడు పండితులకు పళ్ళు పంచారు. ఆ బాబునిచూచిచ తల్లి మురిసింది. పురుడైన పదకొండవ రోజునే బాలింతకు స్నానం చేయించారు. శుద్ధి అయిన తర్వాత బాబుని, శ్రీహరిగా తలచాడు తండ్రి మారయ. తల్లికి పరమేశ్వరుడుగా, తాతగారికి శ్రీవిద్యగా, ఒక్కొక్కరికి ఒక్కొక్క విధంగా దర్శన మిచ్చే బాలుని చూచి, **"ఏకంసత్ విప్రాః బహుధావదంతి"** అను శ్రుత్యర్థాన్ని తలచి, బాబుని దీవించారు విప్రవరులు అని చెప్తూంటే "యద్భావం తద్భవతి" అన్నారు తెలుంగాధీశులు. మారయ తన మనోమందిరమందలి మాధవుడే తన పుత్రునిగా అవతరించాడని తలచి, శ్రీనాథుడని నామకరణం చేశాడు. తన మనోభిప్రాయాన్ని గౌరవించిన తనయుని దీవించాడు. మనుమని లాలించాడు. బ్రహ్మతేజోభివృద్ధికై ఉపాకర్మబ్రహ్మోపదేశం చేసి త్రికాలములందు గాయత్రిని ఉపాసించేలా తీర్చిదిద్దాడు. షట్కాలలింగార్చన పరుడైన బాలకుని తన తండ్రిగారి కప్పగించాడు. ముద్దుల మనుమని తన చెంతనే ఉంచుకొని శాస్త్రాలు బోధిస్తున్నాడు. వేదపండితుల చెంతకు పంపి పదం

క్రమం సాంగముగ జదివించాడు. వేదార్థాలు చెప్పించాడు. ఘనపాఠిని చేశాడు. శ్రీనాథుడు ఏకసంథాగ్రాహి - అని అనుగుందాత తన కురువుపై కూర్చుండబెట్టుకొని విద్యలన్నీ కూరిమి మనుమనికి బోధించాడు. మధ్య మధ్య తలిదండ్రులు చెప్పిన విద్యలు నేర్చుకొన్నాడు. అమ్మ తన ఒడిని బడిగా చేసికొని నేర్పిన చదువులు జీర్ణింపజేసికొన్నాడు. చిన్నప్పటి నుండే తాతగారు నేర్పిన ఛందస్సును పునఃపునః మననం చేసికొంటూ, ఐతరేయ బ్రాహ్మణం లోని మరుత్తుని కథను, మార్కండేయపురాణం లోని మరుత్తుని కథను జీర్ణింపజేసికొని, వాటి ఆధారంగా స్వతంత్ర కావ్యంలా **"మరుత్తరాట్చరిత్ర"** రచించారు. క్రీ.శ.1372లో దానిని అనుంగుదాత కమలనాభున కంకిత మిచ్చినాడు. తాతగారు తుదిశ్వాస విడిచేవరకూ సేవలుచేస్తూనే శ్రీవిద్యా రహస్యాలను ప్రస్థానత్రయ రహస్యాలనే కాక మహాభాష్యాన్ని కూడ అధ్యయనం చేసాడు. కృతి భర్తృత్వాన్ని పొందిన రెండేండ్లకే తాతగారు విష్ణుసాయుజ్యాన్ని పొందారు. మారయ తండ్రి శరీరానికి చితిపేర్చి, అగ్నికి ఆహుతిజేసి పంచభూతాల్లోను కలిపి, పితౄణం తీర్చుకొన్నాడు. కుమారునికి షడ్విధప్రాకృత భాషల్ని నేర్పాడు. ఇంతలో నూనూగుమీసాల నూత్నయౌవనం ప్రవేశించింది. పదహారేళ్ళు నిండాయి. విభూతిరేఖా మధ్య కుంకుమ తిలక విభూషిత ఫాలభాగుడు, శిఖా యజ్ఞోపవీతాదిక పరిస్ఫుట బ్రాహ్మణ భావుడు, విద్యా తేజస్సమాలింగిత సుందరముఖుడు, యువకవియగు శ్రీనాథుడు. బాలకవిగా, పన్నెండవ ఏటనే తొలికావ్యం రచించాడు. తర్వాత మరో కావ్యానికి శ్రీకారం చుట్టాడు. ఆ యువకవి పెదాల్లోంచి యత్కించిన్మనోహర రాగ రంజిత ముగ్ధములైన పదాలు అలవోకగా కదలుతూంటే, ఆతని నూనూగుమీసాలు ఆ శబ్ద ధ్వనుల మాధుర్యాన్ని వ్యాఖ్యానిస్తున్నట్లుగా కదలుతున్నాయి. చందవోలు రాజధానిగా చేసికొని పరిపాలించే పెదకోమటి వేమారెడ్డిని దర్శించాలని ముందంజ వేసాడు. రుద్రాక్ష మాలాలంకృతిగళుడు, విస్ఫుట బ్రహ్మవర్చస్సముపేతుడు, రెడ్డి రాజ్యభార ధౌరంధర్య విభ్రాజితాజానుబాహుడు, "శ్రీహర్ష సుకవి, సుకవితా వ్యాహార కథా సుధా రసాస్వాదన సుఖశ్రీ హర్షోదయ నిత్యసమాహిత మహితాంతరంగుడైన మామిడి సింగనామాత్యుని దర్శించాడు, నమస్కరించాడు. సంస్కృత భాషలో పరిణత ప్రజ్ఞుడై "సోమసిద్ధాంత" మనే జ్యోతిష గ్రంథానికి సంస్కృత భాషలోనే వ్యాఖ్యానాన్ని రచించిన ఆ బ్రాహ్మీమయమూర్తికి మరొక్కమారు అంజలి ఘటించాడు. శ్రీహర్ష నైషధాన్ని మధురతరమైన తెలుగులో వ్రాయుమని కోరాడు. సింగయమంత్రి ధీమణికి ప్రియమైన విద్వదౌషధంబగు నైషధాన్ని, తెలిగింప నాడే, ఆతని ముందే శ్రీహర్ష నైషధాన్నర్చించి, శార్దూల వృత్తంలో "శ్రీరామా"

అంటూ తొలి పద్యాన్ని పూర్తి చేసి, **ఆంధ్రనైషధానికి** శ్రీకారం చుట్టాడు. సింగామాత్య చూడామణి పొంగిపోయాడు. పూర్తయ్యాక ఈ కృతి మీకే అంకితమన్నాడు. దాంతో సింగనమంత్రి – "సాహిత్య చింతామణి" ని రచించిన వేమారెడ్డి ప్రభువులకు పరిచయం చేసాడు. ప్రభువులు రచించిన సంగీత సాహిత్య గ్రంధాలు చూచి, ఎనలేని సంతోషంతో స్నేహాన్ని పెంచుకొన్నాడు, శ్రీనాథుడు; రాకపోకలు సాగుతున్నాయి. భారతదేశాన్నే పరిపాలించిన హాలుని గాధాసప్తశతిని చదివాడు. అది ప్రాకృత భాషలో ఉంది. ఈ సప్తశతిలోని నూరుగాధలేరి, సంస్కృతంలో సుప్తశతీసారమను పేరటీక వ్రాసిన పెదకోమటి వేమారెడ్డి పాండిత్యాన్ని మెచ్చుకొన్నాడు. వేమారెడ్డికి ఆగాధలపై గల ప్రేమను కనిపెట్టి **శాలివాహన సప్తశతి** పేర, సప్తశతిని ఆంధ్రీకరించి, సొగసులొలుకు తెలుగు పలుకుల కులుకుతనాన్ని గ్రామీణ సౌందర్యాన్ని చవిచూపాడు. వేమ ప్రభువులు తెలుగు "ప్రియ వాతెఱగంటి గంటి" ననటంతో ఆ సత్కావ్యాన్ని వారికే క్రీ.శ.1376లోనే వసంతాన అంకితం చేసి, దైవజ్ఞుడైన శ్రీనాథుడు ఆ రాజును, త్వరలోనే రారాజుగా కొండవీటి భద్రాసనంపై నధిష్ఠింపజేయిస్తానని సింగన ఎదుట ప్రతిజ్ఞ చేసినాడు. తథాస్తు – అనినాడు సింగన.

శ్రీనాథుని సాహిత్య ప్రపంచం, వర్థమానమవుతోంది. తన ఇరువది రెండవ ఏట ప్రజలంతా ప్రశంసలజల్లు కురిపిస్తూంటే మామిడి సింగన్న కోరికపై ఆతని పెద్దన్న ప్రెగడయ్యకు క్రీ.శ.1382లో తాను రచించిన నిగమార్థ సారసంగ్రహమైన **"పండితారాధ్యచరిత్ర"** నంకిత మిచ్చాడు. ఆహవ సవ్యసాచి అనవేమారెడ్డి దండనాయకుడు, విమల విద్యాభారతీ వల్లభుడౌ ప్రెగడయ్య, శ్రీనాథునకమృతాశీస్సులనందించి, ఆస్థాన మందలి విస్సనమంత్రి, రాయని భాస్కర మంత్రులను పరిచయం చేసాడు. కొలువులో ప్రవేశం కల్పించాడు. సుగంధ ద్రవ్యాల వ్యాపారి అవచితిప్పయ్య శెట్టి గారితో రెండేళ్ళ క్రితమే వసంతోత్సవాలలో పరిచయం ఏర్పడి కొలువులో బలపడింది. తనకన్న ఇరవై వసంతాల చినవాడు కావటంతో బాలుడైన సఖుడని ముద్దుగా పిలిచేవాడు తిప్పయ్యశెట్టి. తిప్పయ్యకు పద్యం వింటే పరవశమే! **"పద్యకవిత యనిన పరమాన్నతుల్యంబు, పద్య కవిత వినిన పరవశింతు"** – నంటాడు, అని దుగ్గన్న చెపుతూంటే, తిప్పయ్యశెట్టి గారికి, నాటి రోజులు గుర్తుకొచ్చాయి. కళ్ళు చెమర్చాయి. నిజమే దుగ్గన్న గారు. మా స్నేహం పాలు నీళ్ళలా, వెన్నెలా చంద్రుడిలా, కలిసింది. ఒక రోజులో వెళదామని వచ్చినవాణ్ణి, చెలికాడున్నంత కాలం నేనిక్కడే ఉంటాను. పిల్లల్ని కంచికి పంపించేస్తాను. దుగ్గన్న గారూ!

మీకు తెలియని విషయాలు చాలా ఉన్నాయి. విస్సన్న మంత్రిగారు మధ్యాహ్నం బంగారు తట్టలో భోజనం పెడితే, భాస్కర మంత్రి గారు శ్రీనాథునికి ప్రీతి పాత్రమైన అరటియాకులో భోజనం పెట్టి తృప్తి పడేవారు. మా మిత్రునికి హేమపాత్రాన్నం మరపురానిది. నాతో ఎపుడూ చెప్పేవారు, భాస్కరుని ప్రేమ కుచేలుని ప్రేమలాంటిదని; మా బాలసఖుని లేఖిని పరవళ్ళు త్రొక్కింది. **కాటమరాజుకథ** ప్రారంభం చేసారు. భీమాంబ గారికి మంచి ఆలోచన తట్టింది. సకల సద్గుణ సంపన్నురాలైన శ్రీలక్ష్మినిచ్చి వివాహం చేయాలని పెనిమిటితో చెప్పి, ఒప్పించి మాసఖునకిచ్చి అగ్నిసాక్షిగా, బ్రాహ్మీవివాహం జరిపించారు. ఆ కళ్యాణం మంగళవాయిద్యాల నడుమ వేదమంత్రాలతో ఘనంగా జరిగింది. తిప్పయ శ్రేష్ఠిగారూ, సుమారు ఏభై సంవత్సరాలమాట. ఆ దృశ్యం మాకూ గుర్తుకొస్తూనే ఉంటుంది మీరుమాత్రం బాగా గుర్తుకొస్తుంటారు. ఆనాడు మీరు పంచినకస్తూరి తాంబూలాల సువాసన లిప్పటికి మరపురాకున్నాయి. కర్పూరం వెదజల్లారు, దుగ్గన్న గారూ! ఇక్కడున్న వారికి నాటి వివాహాన్ని కండ్లకు కట్టినట్లు చూపించాలి. దంపతు లిద్దఱూ లక్ష్మీ నారాయణులేనని భావించాం. మీరు, మీ సోదరిని వివాహం చేసికొనుమని, మీ బావగారిని బ్రతిమాలిన ఘట్టం, మీ బావగారు తపోభూమికి వెడతానని పద్యాల్లో చెప్తూ బెట్టుసరిచేస్తుంటే, మీరు వారి దారికి అడ్డంగా నిలబడి గృహస్థా శ్రమంలో ఉండే గొప్పతనాన్ని పద్యాల్లో వివరించి, వంశాభివృద్ధికి వశ్యమూలాధారమని ఒప్పించి మెప్పించి వెనుకకు రప్పించి తీపి తినిపించి, మంగళస్నానాలు చేయించి, చూడముచ్చటగా అలంకరించి, మీ సోదరిచే గౌరీపూజ, బావగారిచే గణపతి పూజచేయించి, మీ తలిదండ్రులచే మీ బావగారి పవిత్ర పాదములను సప్తగోదావరీ జలాలతో కాళ్ళు కడిగించి, మహావిష్ణు స్వరూపునిగా తలంచి అగ్నిసాక్షిగా కన్యాదానం చేయించిన మధుర ఘట్టం, మరపురానిది. తర్వాత సుముహూర్తపు ఘడియలో, జీలకర్ర బెల్లం కలిపిన ముద్దను ఒకరితలపై ఒకరునిలిపి స్ప ృశించి, పారస్పరిక జీవశక్తులను పొంది, దంపతులైన పిమ్మట, శ్రీనాథుడు ధర్మ సంతాన సంపద కొఱకు ఈమెను వివాహం చేసి కొంటున్నానని తెల్పి, ధర్మార్థకామాల విషయంలో ఆమె నతిక్రమించి చరించనని అగ్నిసాక్షిగా ప్రమాణం చేసి, నా జీవనానికి హేతువైన ఈ సూత్రంచే, నేను నీకంఠమున మాంగళ్యమును కట్టుచున్నాను. నీవు నూరు సంవత్సరాలు జీవించుమని మంగళసూత్రాన్ని కట్టినపుడు వైకుంఠంలో లక్ష్మీనారాయణుల కళ్యాణమహోత్సవాన్ని చూస్తున్నామనే తృప్తి కల్గింది. తర్వాత తలంబ్రాలు. అవునండీ! తర్వాత అగ్నిసాక్షిగా ప్రదక్షిణలు చేయించారు. ఇదే సప్తపది, ఏడడుగులు కలసి నడిస్తే వారు వీరవుతారట.

సాప్తపదీనం సఖ్యం - కదా. ఎడబాటు కలుగకుండా కొంగుముడులు వేశారు. భర్తతో స్థిరంగా ఉండటానికై ధ్రువదర్శనం చేయించారు. అరుంధతీ దర్శనం కూడ చేసారు. అదే సతీత్వ సిద్ధినిస్తుంది. తర్వాత బ్రాహ్మణులు, ముత్తైదువులు సేసలుజల్లి సౌభాగ్యాశీస్సుల నందించారు. పాటలుపాడి మంగళారతులిచ్చారు. తర్వాత దంపతులచే హోమాది కార్యక్రమాలు. తర్వాత అప్పగింతలతంతు. అత్తగారింటికి పంపారు. తర్వాత దాంపత్య ధర్మనిర్వహణ. అప్పుడే మాసోదరి, బావగారిని చేపట్టి ఏభై సంవత్సరాలు, అధిక మాసాలతో నిండాయి అన్నాడు, దుగ్గన్న నవ్వుతూ. అన్నయ్యా! బావగారి పారాయణ పూర్తయ్యింది. భోజనం వేళాయే - అన్నారు శ్రీలక్ష్మిగారు, వంటిట్లోంచే! ముగిస్తున్నానన్నాడు దుగ్గన్న.

బావగారి గురించి, వివాహ ఘట్టం వరకు చెప్పుకొన్నాం. రేపు ఉదయం పదిగంటల నుండి మధ్యాహ్న భోజన సమయం వరకూ, మరికొన్ని విషయాలు, నాకు తెలిసినంత వరకు చెపుతాను. మాసోదరితో వివాహమయ్యాక మాబావగారి జీవితంలో సుఖసంతోషాలు ద్విగుణీకృతమయ్యాయి. భోగభాగ్యాలు తులతూగాయి. నైషధాంధ్రీకరణ, అలౌకికమైన శృంగార రసస్ఫూర్తితో ముందుకు సాగుతున్నా, కొంతకాలందాన్ని ప్రక్కనబెట్టి క్రీ.శ. 1384 లోనే **కాటమరాజు కథ** పూర్తి చేసారు. తర్వాత వాల్మీకాన్ని పారాయణ చేసి, పదిమంది పాడుకోవటానికి అనువుగా ఉండేలా **"రామాయణపు పాట"** - చెవులకింపుగా క్రీ.శ. 1385లో రచించి, పదిమంది చేతా పాడించారు. ఇంటింటా ఆపాటలే... అంటూంటే వంటింట్లోంచి వచ్చిన శ్రీలక్ష్మిగారు, రామాయణములోని ఓ పాట పాడివినిపించారు. అందరూ సంతోషంతో విని, ఎవరి విడిదికి వారు వారి వద్ద సెలవు తీసికొని వెళ్ళారు.

శ్రీనాథుడు, అన్న సూక్తాన్ని పఠించి, వండిన పదార్థాలపై గాయత్రీ మంత్రంతో పవిత్రమైన జలాన్ని జల్లి, చింతామణీమంత్రాధిష్ఠాన దైవానికి నివేదించారు. అనుకూలవతి వడ్డించిన అన్నానికి నమస్కరించి, గాయత్రీ మంత్రాన్ని పఠించి అన్నంపై నీరాన్ని జల్లి, పరిషేచనం చేసి శిష్టాచార సంపత్తితో భోజనం తిన్నాడు. తనతో బాటు దుగ్గన్న, ఆత్మీయులు కూడ తినిలేచారు. తర్వాత కాళ్ళు చేతులు ప్రక్షాళన చేసికొని, ఆచమనం చేసి కస్తూరి తాంబూలం వేసికొని, భారత జాతీయ సమైక్యతకు,మన సనాతన షోడశ సంస్కారాల ఆచరణలే నిదర్శనాలన్నారు, విశ్రాంతి తీసికొన్నారు.

వదిన గారికి భోజనం పెట్టిన తర్వాత శ్రీనాథుని దార భోజనం చేసి, వంటింటిని శుభ్రం చేసి, కాస్తంత నడుం వాల్చింది.

2. రెండవరోజు వాద సభ ప్రారంభమౌతోంది. ఘంటారావం వినబడింది. ముత్యాలశాల

కళకళలాడుతోంది. అందరూ తమతమ స్థానాల్లో ఆశీనులయ్యారు. శ్రీప్రౌఢ దేవరాయలవారు వారి నవరత్నఖచితసువర్ణసింహాసనంలో సుఖాసీనులై సదస్యుల నభినందించారు. ధర్మపీఠాధ్యక్షులు వాదసభను ప్రారంభింప వచ్చునని చెప్పటంతో డిండిమభట్టారకులు, శ్రీనాథ భట్టారకులు, గణపతిని ప్రార్థించి, సభా సరస్వతిని కొనియాడారు. తమ తమ యిష్టదైవాలను స్మరించుకొన్నారు. శ్రీనాథుడు శారదను ధ్యానించాడు.

శ్రీనాథుడు : సీ॥ సింహాసనము చారుసిత పుండరీకంబు
చెలికత్తె జిలువారు పలుకు జిలుక!
శృంగార కుసుమంబు చిన్ని చుక్కలరాజు
పసిడి కిన్నెరవీణ పలుకుదోడు
నలువ నెమ్మోము దమ్ములు కేళి గృహములు
తళుకుటద్దంబు సత్కవుల మనసు
వేదాది విద్యలు విహరణ స్థలములు
చక్కని రాయంచ యెక్కిరింత
గీ॥ యెపుడు నే దేవి కాదేవి యిందు కుంద
చంద్ర చందన మందార సార వర్ణ
శారదాదేవి మామక స్వాంత వీధి
నిండు వేడుక విహరించు చుండు గాత!

ధర్మపీఠాధ్యక్షులు : వేదములు మూడని కొందఱు, నాలుగని కొందఱు వాదిస్తున్నారు. ఎందుకు? అసలు వేదాలు ఎన్ని? ముందు డిండిమ భట్టు వివరిస్తారు.

డిండిమభట్టు : అధ్యక్షా! వేదములు నాలుగని, శ్రుతులు వినబడుతున్నాయి.

"అస్యమహతో భూతస్య నిః శ్వసితమేతద్ యద్
ఋగ్వేదో యజుర్వేదః సామవేదోఽథర్వాంగి రసః" ॥ అని

బృహదారణ్యక శ్రుతి ప్రకారం నాల్గువేదాలు, పరమేశ్వరుని నిఃశ్వాసరూపాలు. ఆ శ్రుతియే "త్రయోవేదా ఏవ" అని పేర్కొంది. ఋగ్యజుః సామలనెడి అవయవ త్రయముతో గలదిత్రయీ. త్రయీమంత్ర జాతంగలది – అథర్వవేదం. నాల్గువేదాలను త్రయీవిద్యగానే శ్రుతులు, భారతం పేర్కొన్నాయి. మంత్రత్రై విద్యము అథర్వవేదమందుగలదన్నారు, శ్రీ సాయణులు – తమ అథర్వవేద భాష్యభూమికలో – **"ఇతి వేదాస్త్రయస్త్రయీ"** – అనుస్మృతిననుసరించి, కొందఱు వేదాలు మూడేనని భ్రమపడ్డారు. సమన్వయ బుద్ధిచే

నాల్గువేదాలనే అందరూ అంగీకరించారు.

శ్రీనాథకవి : డిండిమభట్టారకులు శ్రుతి స్మృత్యాదులననుసరించి వేదాలు నాలుగని సుస్పష్టం చేసారు. కర్మ, ఉపాసనా, జ్ఞాన యోగత్రయ విలసితమగుటచే నాల్గువేదాలకు త్రయీత్వం సిద్ధిస్తోంది. కనుకనే వేదాలకు త్రయీవిద్య అని పేరు. ఈ విద్య తెలిసిన వారే వేదవిదులు. వీరేత్రయీ విదులని – "యమృషయ స్త్రయీవిదా విదుః" అని శ్రుతి ప్రతిపాదిస్తోంది. త్రయీ – శబ్దానికి, మంత్రత్రై విద్యము కలదనునది యేముఖ్యార్థం. వేదసామాన్య వాచకంగా కూడ త్రయీ శబ్దాన్ని గ్రహించారు. కనుక "త్రయీ" శబ్దం రెండు విధాలుగా చెప్పబడుతోంది. ఏమంటారు?

డిండిమభట్టు : శ్రీనాథ కవులు, శ్రుతి సమ్మతంగా చెప్పటం జరిగింది. "త్రయీ" శబ్దానికి ఈ రెండర్థాలే కాక ఇంకా చాలా అర్థాలున్నాయి. రక్షించునది – కనుక త్రయీ – అని, "త్రాయతే రక్షతే ఇతి త్రయీ", త్రయీవార్తాదిః – అని నీలకంఠుడే చెప్పారు. రాయలవంటి ప్రభువులు వేటిని చక్కగా రక్షిస్తే ప్రజలను కాపాడుతాయో. అవే "త్రయీ" పేరుతో పిలువబడే వేదాలు. పరాదేవతను త్రయీరూపిణిగ చెప్పారు.

శ్రీనాథకవి : డిండిమభట్టారకులు మా వాదాన్నంగీకరించి, మరిన్ని విషయాలు తెలిపారు. అవి యదార్థములే. త్రయీ – శబ్దము పరమేశ్వరునకు, వేదరాశికి కూడ పేరు. ఈశ్వర వాచకము త్రయీ. "అన్వీక్షకీ త్రయీదేవి" అని పద్మపురాణోక్తి. ఇంతకీ డిండిమభట్టారకులు వేదాలు నాలుగే అంటున్నారు.

డిండిమభట్టు : శ్రీనాథ కవీ! నేననుమాట, శ్రుతులు వినిపించిన మాట, వేదాలలో "ఋచోయజూగ్ంషి సామాని అధర్వాంగిరసశ్చయే" – అని ఉన్నది కదా.

శ్రీనాథభట్టు : నిజమే! ఆయాశ్రుతులను బట్టి, స్మృత్యాదులననుసరించి వేదాలు నాలుగని చెపుతున్నారు. ఏ వేదాలు పరమ ప్రమాణంగా గ్రహిస్తున్నామో, ఆశ్రుతులే వేదములు అనంతములని తెలిపాయి. తైత్తిరీయ బ్రాహ్మణమున సావిత్ర కాఠకచయన ప్రకరణములో – "భరద్వాజోహత్రిభిః...**అనన్తావైవేదాః** అను ఉపాఖ్యానంలో **వేదాలు అనంతములని,** భగవత్తత్త్వాన్ని బోధించు భగవత్స్వరూపాలని ఆప్తోచ్చరితత్వాది ప్రామాణ్యకారణము నపేక్షింపక పోవుటచేతనే స్వతః ప్రమాణములని శాస్త్రకారులు నిర్ణయించారు.

డిండిమభట్టు : ద్వాపర కలియుగ సంధికాలంలో జనిష్యమాణుల యొక్క సామర్థ్యాన్ని గుర్తించి, అనంతములైన వేదశాఖలలోంచి, పరిమితములైన వేద శాఖలను మాత్రమే, చతుర్వేదాలుగా వ్యాస మహర్షి విభజించించినట్లు "చతుర్ధావ్యభజన్తాం" అను శ్రీమద్భాగవత

శ్లోకమే సాక్ష్యము.

ధర్మపీఠాధ్యక్షులు: మా ప్రశ్నలకు సరియైన సమాధానాలు లభించాయి. శ్రుతులను ప్రధానంగా చేసికొని, వేదాలనంతాలని నిర్ణయించారు. ఆ వేదాలే పరమ ప్రమాణాలుగా గ్రహించి, **తల్లిదండ్రుల** యందెవరికి **అగ్రతాంబూలమో** నిర్ణయించండి. ఈసారి, శ్రీనాథభట్టు ప్రారంభించాలి.

శ్రీనాథుడు : తల్లిదండ్రులిద్దఱూ పార్వతీ పరమేశ్వరుల వంటివారు. శబ్దార్థముల వంటి తల్లిదండ్రులలో ఎవరిది ప్రథమ స్థానమనినచో, **తల్లిదనియే చెప్పాలి.**

డిండిమభట్టు : శ్రీనాథకవీ! మీరన్నట్లు, తల్లిదండ్రులని ద్వంద్వ సమాసం చేసినపుడే ఇద్దరకు సమాన ప్రతిపత్తి ఏర్పడుతోంది. ఉభయపదార్థ ప్రధానత్వాత్-ద్వందః పిల్లల విషయంలో తల్లియును తండ్రియును సమాన భాగస్వాములేనని శ్రుతిమాత ఆదేశం. "మాతాః పూర్వరూపమ్, పితోత్తరరూపమ్, ప్రజాసంధిః ప్రజననగ్ం సంధానమ్ । ఇత్యధిప్రజమ్" – అను కృష్ణ యజుర్వేదమంత్రాన్న నుసరించి పూర్వోత్తర రూపాల ప్రాధాన్యం వల్లనే శిశుజననం, కనుక ఇద్దరూ ప్రధానులేనని వేదం ప్రతిపాదిస్తోంది. ఆ వేదమందే **"పితృదేవోభవ"** – అని, శిశుబీజరూప కల్పనావస్థ ప్రథమంలో తండ్రియందేనని – శ్రుతి యందే వినబడుతోంది. విష్ణుమూర్తి, అవతారమైన పరశురాముడు, తన తండ్రి జమదగ్ని మాట శిరోధార్యంగా భావించి కన్నతల్లి రేణుక శిరస్సును తొలగించిన సందర్భాన్ని పరిశీలిస్తే తండ్రికే అగ్రతాంబూలం.

శ్రీనాథభట్టు : ధర్మ సంస్థాపనార్థం అవతరించిన పరశురాముడు, తండ్రియాజ్ఞ శిరసావహించటండంలో, జమదగ్ని తపశ్శక్తి తెలిసినవాడును, ధర్మ సంరక్షుడు కనుకనే తల్లిని బ్రతికించుకోగలిగాడు. ఆ కథా సందర్భంలో తల్లిపాతివ్రత్యాన్ని లోకానికి చాటాడు. కృత యుగంలో అవతరించిన ఆది పరాశక్తియేరేణుకయని నిరూపించిన శ్రీమహావిష్ణువే, పరశురాముడు. "కృతేతు రేణుకాదేవీం" – అని శ్లాఘించారు. ఆ శ్రీహరియే, శ్రీరామునిగా అవతరించి, కైకేయీ మాత మాటపై, పరశురాముడే నాకు ఆదర్శమని పల్కి అరణ్యాలకు వెళ్ళాడు. ఆయన ధర్మమూర్తి "రామో విగ్రహవాన్ ధర్మః" – అనిన ఆది కవి మాట కాదంటామా? వాల్మీకాన్ని బట్టి యోచనచేస్తే, తండ్రి చెప్పలేకున్నా తల్లిమాటను తప్పక పాటించే, "ఆత్మావైపుత్రనామాసి" అను శ్రుత్యనుసారం తల్లికే అగ్రతాంబూలమందించినట్లు తెలుస్తోంది. "సత్యం మాతా" – కనుక, **"సత్యమేవ జయతే".**

డిండిమభట్టు : మీరు చెప్పిన సందర్భాన్ని పరిశీలిస్తే దశరథుడిచ్చిన మాటకు కట్టుబడి,

రాముడు అరణ్యాలకు వెళ్ళినట్లు, మీ మాటలవల్లనే తెలుస్తోంది కనుక పితృవాక్య పరిపాలకుడు శ్రీరాముడని విజ్ఞులంతా జే జేలంటున్నారు. మీరు మా సిద్ధాంతాన్నం గీకరించినట్లే స్పష్టమౌతోంది. "పితాజ్ఞానం" – కనుక **"జ్ఞానమేవజయతే"**

శ్రీనాథుడు : "పితృదేవోభవ" అని, ఏ కృష్ణయజుర్వేద మంత్రాన్ని స్వీకరించి మీరు, తండ్రికే అగ్రతాంబూలమని సిద్ధాంతం చేసారో, ఆ వేదమందే, ఆ మంత్రానికి ముందే "మాతృదేవోభవ" అనియున్నది.

డిండిమభట్టు : నిజమే, ఉత్తరోత్తరము బలీయమని శాస్త్రవచనము.

శ్రీనాథుడు : అట్లయినచో, మీరు చెప్పిన మంత్రం తర్వాత "ఆచార్య దేవోభవ" అని గురువు గొప్ప కావలసియున్నది. శిశువునకు, తల్లియే మొదటి గురువు కదా! అందుకే మాతృభాష కంతటి గౌరవం. తల్లి ఒడియే మొదటిబడి. అదియే గుడి. అత్త, తాత, నాన్న.... అని పలికించు అప్పురాలు. అమ్మ మాటపైననే బాంధవాళిని గుర్తించుట జరుగుతోంది. వీరు, మీ నాన్నగారని చెప్పేతల్లి మాటకే అగ్రతాంబూలమిచ్చు సంస్కారముమనది. అందుకే దార్శనికులు ఆప్తవాక్యం ప్రమాణంగా స్వీకరించారు. అమ్మ నేర్పిన మాటలేమనకు వేదం. అన్నింటినీ తల్లిగా భావించే సంస్కృతి మనది. మాతృభాష అంటున్నాం కాని పితృభాష అనము. తల్లి ఒడి ఓచక్కని బడి, గుడి, మాతృదేశం, మాతృభూమి అలాగే రాజ్యాలను కూడ తల్లిగా భావిస్తాం. తల్లీ! కన్నడ రాజ్యలక్ష్మీ! అని సంబోధించా. పచ్చగడ్డి తిని పాలిచ్చే ఆవును గోమాత అనిపిలుస్తాం. మనకు పరమ ప్రమాణాలైన శ్రుతులను వేదమాతగా భావిస్తాం. అన్నింటిలోను తల్లిని చూసి, మాతగా గౌరవిస్తాం ఎందుకని? నవమాసాలు మోసి, కని, పునర్జన్మ పొందిన తల్లి, శిశువుకు జన్మనిచ్చి మాతృత్వాన్నిపొంది, లాలించి, పాలిచ్చి, పెంచి, పెద్దజేసి ఎన్నెన్నో విద్యాబుద్ధులు నేర్పి ఓర్పుతో భూమికన్న మిన్నయైన తల్లి గొప్పదని మహాభారతంలో "మాతాపృథివ్యా అపిగరీయసీ" కంటికి రెప్పలా కాపాడిన తల్లికే అగ్రతాంబూలం. పోగుత్రెంపగలమేమోగాని, ప్రేగు సంబంధం త్రెంపలేమంటారు. నీటికన్న, రక్తమే చిక్కన; డిండిమభట్టు గారూ! గర్భధారణ పోషాభ్యాం పితుర్మాతాగరీయసీ – అని శాస్త్రం నొక్కివక్కాణిస్తోంది. గాయత్రిని మించిన మంత్రం లేదు. తల్లిని మించిన దైవం లేదంటారు. **"నగాయత్ర్యాః పరంమంత్రం, నమాతుః పరదైవతమ్"** ॥ ఆదిశంకరాచార్యులు, తాను సన్యాసియైనా, జన్మభూమికాలటికి వచ్చి తన తల్లి శవాన్ని అగ్నికి ఆహుతిచేసి, పార లౌకిక క్రియలు నెరవేర్చి పరమపదప్రాప్తినిచ్చారు.

ధర్మపీఠాధ్యక్షులు: భట్టులిద్దఱూ చక్కగా ప్రతిపాదించారు. వాద ప్రతివాదాలు శ్రుతిసమ్మతములే!

రాయలు : శ్రీనాథ కవీ! మాతృ ప్రేమను చవిచూపునట్లొక పద్యాన్ని వినిపించండి.

శ్రీనాథకవి: గీ॥ **సర్వతీర్థాంబువుల కంటె సమధికంబు**
పావనంబైన జనయిత్రి పాదజలము!
వర తనూజున కఖిల దేవతల కంటె
జనని యెక్కుడు సన్నుతాచార నిరత!

పంటమైలారురెడ్డి: శ్రీనాథ కవీ! తల్లికి దూరమైన బిడ్డణ్ణి, ఎలా వెతజెందుతున్నానో!

శ్రీనాథకవి : చం॥ **అరుణగభస్తి బింబముద యాద్రిపై బొడతేర గిన్నెలో**
పెరుగును వంటకంబు వడ పిందియలన్ కుడువంగబెట్టు ని
ర్భర కరుణాధురీణయగు ప్రాణము ప్రాణము తల్లియున్నదే
హర హర! ఎవ్వరింక కడుపారగ బెట్టెద రీప్సితాన్నముల్.

మైలారు ప్రభువుల వెతను వోలె చక్కగా వర్ణించారు. నేటికి సభ చాలింతమన్నారు. శాంతిమంత్రం పఠించారు.

ముత్యాలశాల ముందున్న ఉద్యానవనంలో చూడముచ్చటైన సరస్సు నిర్మింపజేయించారు రాయలవారు. ఉదయాన్నే కాలకృత్యాలన్నీ తీర్చుకొని సంధ్యావందనం పూర్తిచేసి, వచ్చిన మిత్రులతోను, పెద్దలతోను, సహవ్రతులతో కలసి, ఆ సరస్సు చూసి వద్దామని దుగ్గన్న బయలుదేరి, ముత్యాలశాల ముంగిటనున్న వనాన్ని సమీపించాడు. చిటపట చినుకులు పడుతున్నాయి. అకాల వర్షానికి పురివిప్పి ఆడే మగ మయూరాలను చూసి, చెంతనే బెదురుచూపులతో చెంగు చెంగున దూకే జింకల్ని గమనించాడు. కొంతదూరం నడచి ప్రకృతి రామణీయకతకుముగ్ధుడై మెలమెల్లగా నడుచుకొంటూనే అచటి నారింజ చెట్లు, చెఱకు తోటలు, తమలపాకుల తీవెలు చుట్టుకొన్న పోకచెట్ల తోటలు, చింత తోపులు, అఱటి తోటలు, పూచిన ఎలమావి గుబుర్లు చూచి, సరోవరం చేరాడు, మిత్రబృందాలతో దుగ్గన్న. చిన్కులు తగ్గిపోయాయి. అది పెద్ద సరోవరం, క్షీర సముద్రానికి మారుపేరన్నట్లుగా ఉంది. ఆకాశ లక్ష్మికి, మణిమయమైన అద్దంలా, వెన్నెలకు పుట్టినిల్లు అనేటట్లుగా మంచుకొండ యనుంగు పెండ్లికొడుకు యొక్క పెద్ద నవ్వులా, కైలాసానికి సహ పాఠిలా, ఐరావతానికి ప్రతిబింబంలా, శరత్కాల మేఘాలకు ప్రియబంధవులా, స్వచ్ఛమైన ఉదకం కలిగి తెల్లగా ప్రకాశిస్తోంది. అందున్న జలచరాలు సంచరించుట వలన అందలి అలలు చలిస్తున్నాయి. పెద్ద పెద్ద చేపలు, తాబేళ్ళు, మొసళ్ళు చేసే అచంచల ధ్వనులతో ఆ సరస్సు చూడముచ్చటగా ఉంది.

అంతా ఆ సరోవరతీరంలో కూర్చుని అలలపై నుండి వచ్చే చల్లని గాలిలో తేలిపోతూ కొంత కాలం గడిపారు. తర్వాత, శ్రీనాథునికి వివాహం అయిన తర్వాత ఏం జరిగిందో చెప్పటం ప్రారంభించాడు, దుగ్గన. వారు కొన్ని రోజులు తీర్థయాత్రలు చేసారు. యాత్రలు చేస్తూనే శ్రీహర్షుని నైషధాన్ని, దాని వ్యాఖ్యలను, శ్రీ హర్షుని ఖండన ఖండ ఖాద్యాన్ని కూలంకషంగా బావగారు చదివారు. ఈశ్వరార్చన కళా శీలుడైన బావగారు, శ్రుతిధర్మాలను ఆచరిస్తూనే, సామాన్య ప్రజలకవి తెలిసేలా గేయరూపంలోను, పద్యాల రూపంలోను ప్రచారం చేసారు. మానవతా విలువల్ని ప్రబోధించారు. అధీతి బోధ ఆచరణ ప్రచారాలలో నిమగ్నులై గృహస్థజీవితాన్ని గడుపుతూనే, సచ్ఛీలుడై, నానా దర్శనా దర్శదృగ ధ్వనీనుండగు శ్రీనాథుడు, అన్యులెవ్వరికి సోక శక్యం కాని ఖండన ఖండకారుని నైషధ మహా కావ్యమును అయమస్మి – అని నడుము కట్టుకొని, ఇదివరలో తాను శ్రీకారంచుట్టి, తొలిపద్యం వ్రాసిన దానిని పునః పునః పఠించి, సింగన కిచ్చిన మాట ప్రకారం **ఆంధ్రనైషధమను** పేర, సర్వశాస్త్ర సముచ్చయంగా శబ్దంబనుసరించి, రసంపోషించి, ఔచిత్యాన్ని ఆదరించి, అనౌచిత్యాన్ని పరిహరించి, పండిత పరమహంసలకు ఆనందం కలిగేలా ఆంధ్రీకరించి, సింగన మంత్రికి క్రీ.శ. 1398లో అంకితమిచ్చి పున్నమి నిండు చందురుడై నిండు జవ్వనాన్ని స్మార్థకం చేసికొన్నాడు... అని దుగ్గన్న ఆంధ్ర నైషధంలోని పద్యాలను కూడ, కొన్ని చదివి వినిపించాడు. కవి కుల దృష్టాధ్వగమనాధ్వనీనుండగు శ్రీహర్షుని విద్వదౌషధమైన సంస్కృత నైషధాన్ని మా శ్రీనాథుడాంధ్రీకరించి ఆనంద మధువులొలికించాడని, సంతోషంతో పలికిన అవచితిప్పయ్య శెట్టి తానూ చెప్పటం ప్రారంభించాడు. నైషధాన్ని చదివిన తర్వాత, మా శ్రీనాథుని ఈశ్వరార్చన కళాశీలత నన్నాకర్షించింది. వెంటనే వసంతోత్సవాలకు రమ్మని ఆహ్వానించా, నా మాటమన్నించి వచ్చాడు. ద్వితీయాద్వితీయుని సమ్మానించాను. కర్పూరం, ఉత్సవాగతులపై వెదజల్లాను. దాంతో, **కర్పూర వసంతరాయలని** నన్ను కీర్తించాడు. విదేశాలతో నేను వ్యాపారంచేసే ముఖ్యమైన మోటుపల్లి రేవు పట్టణానికి శ్రీనాథ మిత్రుని, మిత్రపత్నిని తీసికొని వెళ్ళి, ఓడలు చూపించాను. వారిని కంచి తీసికొని వెళ్ళాను. కస్తూరి, పునుగు, జవ్వాది, కర్పూరాది సుగంధ ద్రవ్యాలు బహూకరించాను. అతిథుల్ని లక్ష్మీనారాయణులుగా అర్చించాను. మేమంతా, అది కార్తీకమాసం కావటంతో, శివునికి అభిషేకాలు చేసాము. హరుని విలాసాలకు ముగ్ధులమయ్యాము. మా మిత్రుడు, కార్తీక మాసమంతా, ప్రతిరోజు కొన్నిగంటలు హరుని లీలలు చెప్తూ మమ్మల్ని తన్మయుల్ని చేసాడు. శివుని మహిమలు విన్న నేను, "శైవ ప్రబంధ మొకటి అవధరింపుము నా పేరనంకితముగ"

నని బాలసఖుని నోరు విడిచి అర్థించాను. నా మాట మన్నించాడు, భక్తునికథతో ప్రారంభించి, గౌరీకళ్యాణం, దారుకావన విహారం, సముద్ర మథనం, అర్జునుని తపస్సులతో కూడిన **'హరవిలాస'** మను కావ్యాన్ని రచించి క్రీ.శ.1400 వసంతంలో నా షష్ఠిపూర్తి మహోత్సవంలో ఆ కావ్య కన్యనిచ్చి నాకు వివాహం చేసాడు. దాని సౌందర్యానికి ముగ్ధుడనయ్యాను. హరవిలాసం, అద్భుతం అన్నాడు శ్రేష్ఠి. చెవులప్పగించివింటున్న సాహితీ ప్రియంభావుకులు, ఆకావ్యంలోని మధుర ఘట్టాలు కొన్నైనా వినిపించాలని పట్టుపట్టడంతో, తిప్పయ్యశ్రేష్ఠి తనకు గుర్తున్నవి చెప్పాడు.

చిరుతొండనంబి, శివభక్తుడు. వాని కుమారుడు సిరియాలుడు. వారి కుటుంబమంతా శివభక్తులే. వారిని పార్వతీ పరమేశ్వరులు పరీక్షించిన కథంతా చెప్పాడు. కళ్ళు చెమర్చాయి. సిరియాలుడు శివనాస్మరణతో జీవించే ఉపాసకుడు. చిరుతొండనంబి భార్య తిరువెంగనాంచి, చనిన తన బిడ్డను బ్రతికి ఉన్నాడనే భ్రమతో పిలుస్తుంది. రారా! కుమార కంఠీరవేంద్ర కిశోర... రార నా చిన్నివడుగ,... రారా తనూజ! రార సిరియాళ, రార నా ప్రాణపదమ! రార నాకుఱ్ఱ నాజియ్యరారయనుచు జీరెగారాబు కొడుకు రాజీవనయన! – అని పిలువగానే సిరియాలుడు వచ్చాడు. ముసలి జోగులు, పార్వతీపరమేశ్వరులై దర్శనమిచ్చారు. వారిని కైలాసానికి రమ్మంటే, కంచిలో గల ఏడువాడలలోని వేయిగోత్రాల వైశ్యుల్ని తీసికొనివెళ్తానంటేనే వస్తామన్నారు. పరమశివుడు అలాగేనని వారందరినీ కైలాసానికి తీసికొని వెళ్ళాడని హరుని విలాసాన్ని వర్ణించాడు.

పోయిన సిరియాలుడెలా బ్రతికివచ్చాడని, వల్లభుని ఇల్లాలు ప్రశ్నించింది. సిరియాలుడు, గొప్ప ఉపాసకుడు. పంచాక్షరీమంత్రో పాసకుల ప్రాణాలు శరీరంలోంచి పోయాక, గాలిలో తిరుగుతూ ఉంటాయి. భక్తితో పిలిచిన ఉపాసకురాలు తల్లి కావటంతో, ఆ ప్రాణాలు వెంటనే వచ్చి శరీరంలోకలిసాయి. అదే హరవిలాసం! ఆతడు బ్రతికి వచ్చాడని, మా మిత్రుడే వివరించాడు. పైగా ఈ విషయం వేదాల్లో ఉందనీ శ్రుతి రహస్యాన్ని వివరించాడు.

తర్వాత గౌరీ కళ్యాణం కథకూడ చెప్పాడు. తారకాసురుని చంపాలంటే, అదొక పార్వతీపరమేశ్వరుల పుత్రునకే సాధ్యం. తారకుని దుండగాలకు ముని బృందారక బృందాలు బెదరి చెదరిన ఒకే భావాన్ని పెక్కు పదాలలో శ్రీనాథుడు భయానక రసస్పష్టి చేసాడు.

సీ॥ అనువు దప్పిరి, నొచ్చి రలసి, రుపద నొంది
రదవదలైరి, చీకాకు పడిరి

యంగలార్చిరి, విచ్చిరాఅడి బొందిరి
బ్రమసిరి, పాతిరి, పల్లటిలిరి.
బెగ్గడిల్లిరి, పికాపికలైరి, సొలసిరి
కులకుల కూసిరి, కుతిలపడిరి
గ్రగ్గుల కాత్తెరి కలగి రోటాడిరి
వెలవెల్లనైరి, నివ్వెరగుపడిరి

గీ॥ యసవుసవులైరి, గుజగుజయైరి, డస్సి
రొల్లబోయిరి, వెగ్గిరి తల్లడిలిరి
సిగ్గుపడి రొచ్చుపడిరి, యుస్సిస్సియైరి
తారకుని చేత మునులు బృందారకులును.

శాంతానికి ప్రతిరూపాలైన మునుల పరిస్థితి, దీనంగా మారింది. ఎలా ఉండేవారు - రణరణకుని జీరికింగొనరు. వారు క్రోధాన్ని దరికిరానివ్వరు, అహంకారాన్నికాని, మదమాత్సర్యాలనుకాని దరికి రానివ్వరు. నిర్మల హృదయంతో జీవించే నీ వార ముష్టింపచులు మునులు, వారికా ఈ భీతి. వారి భీతిని దూరం చేయాలంటే కుమారస్వామి పుట్టాలి. స్వామి పుట్టాలంటే పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం జరగాలి. శివుడా, తపస్సు చేసికొంటున్నాడు. పర్వతరాజు, తన పుత్రి పార్వతిని, శివుని పరిచర్యకై పంపాడు. గౌరి, కాంచీ కలాపముగా నడుమున ధరించిన పొన్నపూవుల దండ మాటి మాటికి నున్ననికటి ప్రదేశం నుండి జారిపడుతూంటే, మెలమెల్లగా నడుస్తూనే ఆ జారే దండను మరల మరల పైకెత్తి లాగికొంటూ శివుని చెంతకు చేరి, సపర్యలు చేసింది. శివానుగ్రహంతో కుమారుని కని, పెంచి, తారకుని చంపించిన కథ చెప్పాడు.

మైలారవిభుడు, క్షీరసాగర మధన కథను, సుధాగాథను వినాలని ఉందన్నాడు. ముత్యాలశాల, మనందర్నీ ఇలా కలిపిందని, శ్రీనాథుని, మన దుగ్గన్నను దర్శింపజేయించడమే కాక పూర్వ మధుర స్మృతులను జ్ఞప్తికి తెచ్చి యానందింప జేయిస్తోందని తృప్తిపడ్డాడు. అవచితిప్పయ్య శెట్టి, తెలుంగాధీశులు యానందజలధిలో ఓలలాడుతున్నారు. దుగ్గన్న భరత ఖండాన్ని స్మరించాడు.

శ్లో॥ రత్నాకరా ధౌత పదాం, హిమాలయ కిరీటినీమ్ ।
బ్రహ్మరాజర్షి రత్నాఢ్యాం, వందే భారత మాతరమ్ ॥

చలిమలవల్ల నుల్ల సిలుచల్ల దనాన్ని పొంది నందు వల్లనే, ప్రళయకాలాగ్నిచే బూడిదైన

యా పృథ్వి, మరలా వెనుకటి రూపాన్ని పొంది సమస్త ఔషధ వృక్షాలతోను, సోమలతలతోను, దూర్వారయుగ్మాలతోను, సమస్త లతానికుంజాలతోను, ఇంకా అనేక వృక్ష జాతులను మొలవజేయు సామర్థ్యాన్ని పొంది. యజ్ఞయాగాదులనందించు కర్మభూమిగ, నిష్కామ కర్మలాచరించు జ్ఞానులకు మోక్ష భూమిగ, శ్రీమత్ శంకర శ్రీమాన్ రామానుజ శ్రీ మధ్వాచార్యుల వంటి మోచక గురురత్నాలను, కశ్యప, అత్రి, భరద్వాజ, విశ్వామిత్ర, గౌతమ, వశిష్ట, జమదగ్ని వంటి ఋషి రత్నాలను గన్న భరతఖండము రత్నగర్భ. ఈ మౌక్తికశాల ముక్తిగర్భ! అనుకొంటూ ఊహాలోకాల్లో విహరించే దుగ్గన్న బుజాన్ని తట్టి శెట్టిగారు మైలార విభునికి, మాకు శ్రవణానందంగా క్షీరసాగర మధన కథా సుధ నందిచాలనటంతో – చెప్పటం ప్రారంభించాడు.

సముద్ర మధనం జరుగుతోంది. విష్ణువే కూర్మావతారం దాల్చాడు. సముద్రంలో మునిగిపోయే మందర గిరిని, తన వీపున నిలిపాడు. ఇది మహాద్భుతం, అని దుగ్గన్న చెప్తూంటే మందర పర్వతాన్ని తెచ్చిందెవరయ్యా, అన్నాడు తిప్పయ్య. ముకుందుడే ముందడుగేసి మందర మహీధరాన్ని ఎత్తి తెచ్చాడు. హరి గిరినెత్తినపుడు – ఆ పర్వతంపై గల కొమ్మల రెమ్మలపై గుంపు గుంపులుగా నున్న కొండముచ్చులు చిందరవందరై ఆకుల్లా పడుతున్నాయి. పులుల గాండ్రింపు ఘోషలు కొండ గుహల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. అడవిదున్నలు జాలిచెందుతున్నాయి. సారంగాలు సుడిగొంటున్నాయి. వరాహాలు ఘుర్ఘుర ధ్వనులతో గగ్గోలు పెడుతున్నాయి. జడల బర్రెలు బెదురుతున్నాయి. సింహాలు, ఆక్రోశంతో బొబ్బరిస్తున్నాయి. రాళ్ళు జర జర జాఱుతున్నాయి. కొండచఱియలు విరిగిపడుతున్నాయి. గిరి యందలి జంతువులు భయ భ్రాంతులవుతున్నాయి. మొత్తానికి శ్రీహరి, గిరిని ఎత్తి తెచ్చి సముద్రంలో పడేసి, అది మునిగిపోకుండా తానే ఆది కూర్మావతారుడై, వీపున మందరగిరిని మోసాడు. వింటున్న వారంతా గిరిజన్మ ధన్యమన్నారు.

ఈ కథా సుధను గ్రోలు వారంతాధ్యన్యులే! అంటూనే, వాసుకిచే చుట్టబడి కవ్వంగా చేయబడిన మందరగిరి ఉదరంపై ఏర్పడిన నొక్కులరేఖలు త్రివళులై వీరచిహ్నాలుగా ప్రకాశిస్తోంది. రెండువేల నాలుకలు కలిగిన సర్పరాజు మందరగిరిని త్రిప్పే తాడుగా చేయబడి విషాగ్ని జ్వాలలు క్రక్కుతూ కూడ మేనితోలు తునిసిపోకుండ – వాడిపోయిన పూలదండలా నలిగిన వాసుకి కి సుధావాయువు సోకినందున సుఖంగానే ఉన్నాడు. మందరగిరి, పాల సముద్ర మధనంలో కవ్వమై గిరగిర గిరగిర తిర్గినపుడు, గుహలనే నోళ్ళతో అందుండి వచ్చిన అమృతాన్నంది విందుచేసినందుకే మందరగిరి శిరోరుహ

తమాల వృక్షాల వినీలిమరేఖ ప్రకాశిస్తోంది. సముద్రుడు, ఇంద్రుని వజ్ర ఘాతానికి భయపడి తన చెంతకు వచ్చిన మైనాకుని, కడుపులో దాచుకొన్నాడు. సముద్రంలోతు పాతులన్నీ తెలిసికొన్నది మందర గిరి ఒక్కటే! మందరగిరిని భరించింది కూడ సముద్రమొక్కటే! ఆ సముద్రమే దేవేంద్రునికి ఐరావతాన్ని కల్పవృక్షాన్ని, తన కడుపున పుట్టించి బహూకరించింది. హాలాహలాన్నిచ్చి శ్రీకంఠుని చేసింది కూడ సముద్రమే! వేద వేదాంతాల్లో వెదకినా సరే చూడశక్యం కాని శ్రీహరి పాదపద్మాల ముద్రలు, పద్మశంఖాది రేఖలతో కూడియున్నట్లుగా మందరగిరికి కలుగజేసినది సముద్రుడే. శ్రీహరికి కన్యారత్నాన్నే ప్రసాదించిన సిరిమగని లెంక రత్నగర్భుడే.

ఆహా! దుగ్గన్నా! శ్రీనాథుడు కనులకు కట్టినట్లు వ్రాసినాడయ్యా! – అని పల్కిన తిప్పయ్యతో, ఇంద్రహేతుకమైన వర్షపాతాన్ని కూడ బావగారు, ధారాపాతంగా జలధారలు కారుతూంటే, తటిత్తుల తళతళలకు కన్నులు మిరుమిట్లు గొల్పుతున్నాయని, పిడుగులు ఫెటేల్ ఫెటేల్‌మని ప్రిదిలిప్రేలిపడుతున్నాయని. అపుడు కాంచీవాసుల గుండెలు ఝల్లు ఝల్లుమంటున్నాయని, వ్రాసిన వర్ష వర్ణన చదువుతూంటే **హర్షం** వర్షిస్తోందన్నారు. అపుడు అక్కడే ఉన్న వాళ్ళు మాత్రమే కాదు, చదువుతున్న మనలాంటి వాళ్ళం కూడ, అర్జున, ఫల్గుణ పార్థ కిరీటి, శ్వేతవాహన, భీభత్స, విజయ, కృష్ణ, సవ్యసాచి, ధనంజయ – అంటూ అర్జునుని పదినామాలను జపించకుండా ఉండగలమా! అని పల్కిన దుగ్గన్నతో, మా తాతలు కంచిలో గుడులు, గోపురాలు, మణిమందిరాలు, తటాకాదులు నిర్మించినట్లు చెప్పారు శ్రేష్ఠి.

తిప్పయ్య శ్రేష్ఠి గారి పూర్వీకులు భక్త్యుత్సాహాలతో చేసిన ధర్మకార్యాలను శ్రీనాథకవి హరవిలాసంలో వ్రాసినట్లు దుగ్గన్న చెప్పటమే కాదు, సీస పద్యం చదివి వినిపించాడు. అందరూ కరతాళధ్వనులు చేసారు. వారంతా లేచి భోజనాలు చేసి విశ్రాంతి తీసికొని, సాయంత్రం వాద సభకు వస్తామని చెప్పి వెళ్ళారు.

దుగ్గన్న, తన కుంకుమశోభితతో కలసి మెల్లగా నడచుకొంటూ, ముందున్న ముత్యాలశాల సమీపించి, ఓనమస్కారం చేసి అందున్న విడిది గృహాన్ని చేరి, బావగారిని పలుకరించి, వారి సరసన కూర్చుండి భోజనం చేసాడు. వారంతా విశ్రాంతి తీసికొన్నారు.

మధ్యాహ్నం, వాద సభ ప్రారంభమవుతోందనటానికి సూచకంగా ఘంటారావం వినబడింది. సాహితీరిరంసువులంతా ముత్యాలశాలకు చేరుకొన్నారు. సభ కిటకిటలాడింది.

3. మూడవరోజు వాదసభకు విచ్చేసిన సదస్యులందరకూ సమస్సులందించాడు,

వల్లభామాత్యుడు. చక్రవర్తులు, రాచకార్యాలు ముగించుకొని సభకు వచ్చి, స్వర్ణసింహాసనం అధిష్ఠించారు. రాజకులగురు బ్రహ్మలు, ధర్మపీఠాన్నధిష్ఠించారు. చామనామాత్యులు పర్యవేక్షిస్తున్నారు. మంత్రి సామంత పురోహిత దండ నాయకాదులంతా చెవులప్పగించారు. ధర్మపీఠాధ్యక్షులు, వాద సభ ప్రారంభింపవచ్చుననగానే భట్టు లిఋవురు ప్రార్థనలుచేసి, ప్రభువులకు, ధర్మాధ్యక్షులకు, ధర్మశాస్త్ర మర్మపారగులైన పెద్దలకు నమస్కరించి సౌఖశాయనిక సౌవస్తిక బుధనామసచివ సుకవి గాయక వైణిక మార్దంగిక నికరంబునభినందించిన శ్రీనాథుడు, చదువులతల్లిని స్మరించాడు.

గీ॥ కంఠ పట్టిక నోంకార ఘంటమొరయ
జెలగు గావుత మన్మనః క్షేత్ర సీమ
గవి కుటుంబంబు పాలిటి దివిజసురభి
జలజ సంభవు బోటి భాషావధూటి!

ధర్మపీఠాధ్యక్షులు: వేద శబ్దానికి అర్థం ఏమిటి ? వేదము పౌరుషేయమా ? అపౌరుషేయమా ? శ్రుతులకు ప్రమాణం ఏమిటి? ఈ విషయాలపై వాద ప్రతివాదాలు విన్పించండి. ముందుగా డిండిమభట్టారకులు ప్రారంభించండి.

రాయలు : గురుబ్రహ్మలు, తొలుపలుకులపై చక్కని ప్రశ్నలిచ్చారు. మీ శ్రౌత్రం వింటాం.

డిండిమభట్టు : వేదయతీతి వేదః – తెలియజేయునది వేదము

ధర్మపీఠాధ్యక్షులు : దేనిని తెలియజేయునది?

డిండిమభట్టు : ప్రత్యక్ష అనుమాన ప్రమాణాలచే తెలియజాలని ధర్మార్థ కామమోక్షాలనే చతుర్విధ పురుషార్థోపాయాలను బోధింపజాలినది అవటం చేత దీనికి వేదమని సార్థక నామము.

శ్లో॥ ప్రత్యక్షేణాను మిత్యేవా యస్తూపాయో న బుధ్యతే ।
ఏతం విదన్తి వేదేన తస్మాత్ వేదస్య వేదతా ॥

అట్టి వేదము, అపౌరుషేయము. ఆప్తోచ్చరితత్వాది ప్రామాణ్యకారణమును అపేక్షింపక పోవుటచే వేదాలు **స్వతః ప్రమాణములని**, అవి ప్రమాణములుగా గ్రహించిన వారే స్వతః ప్రమాణవాదులని శ్రీమచ్ఛంకరాదుల సిద్ధాంతము.

ధర్మపీఠాధ్యక్షులు : ఈ విషయాల్లో శ్రీనాథ కవులేమంటారు?

శ్రీనాథకవి : వేదాలు, పరమేశ్వరుని నిట్టూర్పులు. **"యస్య నిఃశ్వసితం వేదాః"** – శ్రుతి నిఃశ్వసిత మేత దృగ్వేదో యజుర్వేదః సామవేదః ఇత్యాదిః.

"సాహి శ్రీః అమృతాసతామ్" – వేదము అమృత స్వరూపము. ఇది శ్రుతివాణి, సత్యమును తెలియజేయునది వేదము. బ్రహ్మజ్ఞాన మొసంగునది వేదం. ఇది అపౌరుషేయమే !

"వేదోసి, యేనత్వం దేవ వేద దేవేభ్యో వేదోభవః ।

తేన మహ్యం వేదో భూయాః – "వేదమా! నీవు దేవతలకు వేదమైతివి. నాకును వేదముకమ్ము! అని ప్రార్థిస్తున్నాం. అపౌరుషేయం కనుక, అదే పౌరుషేయమైతే ప్రార్థించాల్సిన అవసరం లేదు కదా । పైగా, కృత్స్నవేద రాశిలో కొన్ని కొన్ని మంత్ర భాగాలను మంత్ర ద్రష్టలగు ఋషులు దర్శించినట్లు తొలిపలుకు ఋగ్వేదము స్పష్టం చేస్తోంటే వేదము – పౌరుషేయము కాజాలదు.

"తామన్వవిందన్ ఋషిషు ప్రవిష్టామ్" – ఋగ్వేదంలో 10–71–3 వ మంత్రం "అహే బుధ్నియ మంత్రమే గోపాయ" – అనే శ్రుతిని బట్టి, గురుశిష్య పరంపరా ప్రాప్తమైన మంత్ర జాత రూపమైన ఈ సిరిని, జగత్కారణ భూతుడవగు,

ఓ అగ్నీ! రక్షింపుమనే అభ్యర్థనలోనే వేదము అపౌరుషేయమని తెలుస్తోంది. మంత్రాలు పురుష కర్తృకములైతే ఇది పొసగదు. వేదాలు, త్రివిదులగు మంత్ర ద్రష్టల దర్శనాలు. త్రైవిదులు, ఈ అమృతంపుసిరిని ఈశ్వరానుగ్రహంతో పొంది, గోపనం చేయాలని, శ్రుతులు స్పష్టం చేస్తున్నాయి.

"న కశ్చిత్ వేద కర్తాచ" – అని పరాశరస్మృతి, పురుష బుద్ధికి అతీతమైనది తెలియజేసే మంత్ర బ్రాహ్మణాత్మకమైన మంత్ర రాశికి వేద మనిపేరు. పరమేశ్వరుడు, బ్రహ్మను సృజించి, వేదాలనను గ్రహించినట్లు శ్రుతి వినబడుతోంది. "యో బ్రహ్మాణం విదధాతి పూర్వం యోవై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై" – శ్రుతి.

గురుబ్రహ్మ: స్వాధాయమంటే ఏమిటి?

డిండిమభట్టు: "స్వాధ్యాయః వేదః" వేదాన్ని అధ్యయనం చేయాలి – అని శ్రుతి విధిస్తోంది. శ్రుతి వేదము, రాజ శాసనంలాంటిది. స్వాధ్యాయమంటే స్వశాఖారూపముగా వేదమును అధ్యయనం చేయాలనే భావాన్ని వ్యక్తం చేసారు. "స్వః స్వశాఖారూపః అధ్యాయః వేదః" – "అందుకే" స్వాధ్యాయ ప్రవచనాభ్యాంన ప్రమదితవ్యం – అన్నారు.

శ్రీనాథకవి : డిండిమభట్టారకా! ఇది అసంగతం, స్వశాఖా రూపవేదమేయని స్వాధ్యాయ శబ్దానికి అర్థం చెపితే, ఇతర శాఖలు స్వాధ్యాయములు కాకపోవలసివస్తున్నాయి. ఇతర వేదశాఖాధ్యయనంతో కూడ నిమిత్తం కలదు కాబట్టే, వేదాధ్యయ నానంతరం ధర్మజిజ్ఞాస చేయుట శ్రుతి విహితము. ఇక్కడ ఓ విషయాన్ని గమనించాలి. అధ్యయనమనలేదు. స్వ

అధ్యయనము – అనుటలో, కృత్స్నవేదాధ్యయనమే శ్రుతి సమ్మతమని సుస్పష్టమవుతోంది. నిఖిల వేదాధ్యయనము – అనియే స్వః – స్వకీయత్వేన విహితః అధ్యాయః – స్వాధ్యాయః – అని వాచస్పత్యము.

డిండిమభట్టు: పూర్వ మీమాంసా శాస్త్రాన్ననుసరించి, 'అధ' – శబ్దానికి వేదాధ్యయ నానంతరమనియే అర్థాన్ని చెపుతున్నాం. క్రతునిర్వహణార్థం చేయు వేదాధ్యయనమని, అధ్వర్యుని విషయంలో ప్రతిపాదించాం.

"యజుర్వేదేనాధ్వర్యుః" – శ్రుతి. సత్కర్మల ద్వారా భక్తి, తద్వారా జ్ఞానం. జ్ఞానం వల్లముక్తి.

గురుబ్రహ్మ : శ్రీనాథ కవీ! మీ అభిప్రాయం చెప్పండి, వారు, శ్రుత్యుక్తిసత్ కర్మలేముక్తికిమూల మంటున్నారు.

శ్రీనాథకవి : స్వం ఆత్మ విషయకం అధ్యయనం – స్వాధ్యాయః – అని, నా అభిప్రాయం. జ్ఞాన విద్యాభ్యాసం వలననే కైవల్యప్రాప్తి. దూది రాశిలో పడిన అగ్ని కణమైనా, దూదిని అంతను దహించునట్లే, జ్ఞాన విద్య అజ్ఞానాన్ని దహిస్తుంది. ఇదే "తూలాగ్నివిద్యా" తానే బ్రహ్మమనే సత్యాన్ని తెలిపేదే సరియైన విద్య. ఇది "అహంగ్రహోపాసనము" వలననే సిద్ధిస్తుంది.

డిండిమభట్టు: శ్రీనాథకవీ! బ్రహ్మము వల్ల సృష్టింపబడిన వారు ప్రతీకములగు సూర్యాదులు ఉపాసకులు, కాబట్టి, ఉపాస్యుడు ప్రతీకాలతో సమానుడవటం చేత, బ్రహ్మను – నేను, అన్నట్లు ప్రతీకములగు సూర్యాదులను "నేను" అని చెప్పుటలేదు. జీవులకు – బ్రహ్మకు భేదం లేదు కాని, ఉపాసన చేయుజీవునకు ఉపాస్య దేవతలగు ప్రతీకాలై జీవులైన సూర్యాదులకు భేదం కలదు కదా! కాబట్టి, అహంగ్రహోపాసనము ప్రతీకములందు తగదు. కాని ఆదిత్యాదులందు బ్రహ్మదృష్టినుంచుట వల్ల శ్రేయస్సు కల్గుతుందని – "బ్రహ్మ దృష్టి రుత్కర్షాత్" అనుసూత్రం స్పష్టం చేస్తోంది.

శ్రీనాథకవి : డిండిమభట్టు గారూ! ప్రతిమయందు విష్ణువని భేద దృష్టితో చేసేది ప్రతీకోపాసన. "మనోబ్రహ్మ, ఆదిత్యోబ్రహ్మేత్యాదేశః" – అంతః కరణమే బ్రహ్మ, సూర్యుడే బ్రహ్మమని చేయుట – అనిఛాందోగ్య శ్రుతిని సరిగ్గా అర్థం చేసికొనక మీరు చెప్పినట్లు చేయుటవల్ల అనర్థాలు కల్గుతాయి. శ్రుతులను సమన్వయ బుద్ధితో అర్థం చేసికొని ఆచరిస్తేనే మేలు జరుగుతుందని బ్రహ్మసూత్రం. **"తత్తు సమన్వయాత్"** – చతుస్సూత్రి–4. తాను బ్రహ్మమనే భావన అహంగ్రహోపాసన యందేకాని ప్రతీకోపాసనల యందులేదు. బ్రహ్మముకంటే భిన్నమని ఉపాసన చేసేవాడు శ్రేయో మార్గాన్నుండి తొలగి, జనన మరణాల్ని

పొందుతూనే ఉంటాడు.

గురుబ్రహ్మ : ఈవాదాన్ని, ఇంతటితో ముగించి, శాంతరస స్ఫూర్తితో శివస్తుతి చేయండి. శ్రీనాథుడు ధర్మపీఠాధ్యక్షుని మాటను శిరసావహించి, కాశీ విశ్వనాథుని స్మరించాడు. అది అర్ధరాత్రి, వెన్నెల పిండి జల్లినట్లు కాస్తోంది. సైకత వేదికలు ఆనందంతో శరీరం గగుర్పాటు చెందునట్లుగా గంగానదిలో కాశీ విశ్వనాథుని స్తోత్రం చేస్తుంటే ఉండే ఆ దివ్యానుభూతి, భవభూతి విభూతియే!

శా॥ ఆనందంబున నర్థ రాత్రముల జంద్రాలోకముల్ కాయగా
నానాసైకత వేదికాస్థలములన్ నల్దిక్కులన్ శంభుగా
శ్రీనాథున్ దరుణేందు శేఖరు శివున్ శ్రీ కంఠునిన్ బాడుదుర్
మే నెల్లం బులకాంకుర ప్రకరముల్ నిండార మిన్నేటిలోన్.

రాయలు : శ్రీనాథ కవీ! మహాశాంత రసస్ఫూర్తిని మూర్తీభవింపజేసారు.

శ్రీనాథకవి : మహాప్రభూ! ధన్యోస్మి!

మహామంత్రి : శ్రీనాథ సుకవీ! పార్వతీ పరమేశ్వరుల దివ్యస్వరూపాన్ని ఒకే సీసంలో వర్ణించండి.

శ్రీనాథకవి : సీ॥ చంద్ర బింబానన ! చంద్రరేఖామౌళి !
నీలకుంతల భార ! నీల గళుడు !
ధవళాయతేక్షణ ! ధవళాఖిలాంగుండు !
మదన సంజీవని ! మదన హరుడు !
నాగేంద్రనిభయాన ! నాగ కుండల ధారి !
భువన మోహన గాత్ర ! భువన కర్త !
గిరి రాజ కన్యక ! గిరిరాజ నిలయుండు !
సర్వాంగ సుందరి ! సర్వగురుడు !

గీ॥ గౌరి ! శ్రీ విశ్వనాథుండు ! కనక రత్న
పాదుకలుమెట్టి చెట్టలు పట్టికొనుచు
నేగు దెంచిరి యొయ్యార మెసక మెసగ
విహరణ క్రీడ మాయున్న వేది కడకు !!

ధర్మపీఠాధ్యక్షులు : ముత్యాలశాల వేదికపైనున్న మా చెంతకు పార్వతీ పరమేశ్వరులు నడచి వచ్చినట్లున్నది. దీవెనలనందించినట్లున్నది. ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః ॥ స్వస్తి.

శ్రీనాథ కవి, నిత్యకృత్యాలు పూర్తి చేసికొని, పారాయణ ప్రారంభించాడు. దుగ్గన్న

కూడ సంధ్యావందనాదులు పూర్తిచేసాడు. శ్రీలక్ష్మి గారు, మడిబట్ట కట్టుకొని పూలసజ్జతో తులసి చెంత కూర్చుని దీపారాధన చేసి పూజలు చేస్తున్నారు.

శ్లో॥ యన్మూలే సర్వతీర్థాని, యన్మధ్యే సర్వదేవతాః ।

యదగ్రే సర్వ వేదాశ్చ, తులసీం త్వాం నమామ్యహమ్ ॥

శ్రీతులసికి పూజపూర్తి చేసి, లలితా సహస్ర నామాలు పారాయణచేసి, శ్రీవారి పాదాలకు నమస్కరించి, వంట పనిలో నిమగ్నమయ్యారు, శ్రీనాథ దార.

దుగ్గన్న, విష్ణు సహస్ర నామ పారాయణ పూర్తి చేసి, పాలుత్రాగి పంచలోకి వచ్చేసరికి, సాహితీ మిత్రులు పండ్లుతిని, ఫలరసాలుత్రాగి వచ్చేసారు. వారందరూ ఈ రోజున, ముత్యాలశాలకు ఈశాన్యంలో, శ్రీ ప్రౌఢ దేవరాయలవారు త్రవ్వించిన సరోవరం దగ్గరికి వెళ్ళారు. అపుడే పదిగంటలు కావస్తోంది. అందరూ సరోవర తీరంలో గల లతానికుంజాలనీడల్లో కూర్చున్నారు. ముచ్చట్లు చెప్పుకొని, లేచారు.

సరోవరతీరంలో రకరకాల పండ్ల చెట్లున్నాయి. జామిచెట్లకు పండిన జామిపండ్లు నోరూరిస్తున్నాయి. వాటిని తినాలని వెడితే, రకరకాల పండ్లను కొరికి తింటున్న చిలుకలు, ఒక్కసారిగా రెక్కలాడించుకొంటూ ఎగిరాయి. అవి, తమ ఎరుపెక్కిన ముక్కులచే కొరికి తింటున్నప్పుడు, ఆ పళ్ళ నుండి జారిపడిన ముక్కలు, తియ్యనైన రసాలు వడగండ్ల వానలా సరస్సులో పడటం వల్ల, ఆ సరస్సులోని నీరంతా మరింత మధురాతి మధుర తరంగా మారింది. ఆ తియ్యటి నీళ్ళు త్రాగి, కాస్సేపు మైమరచారు. ఆ సరోవర తీరంలోనే ఓ ప్రక్కన మందార పారిజాత సంతాన కల్పవృక్ష హరిచందన పంచకల్పలతికాదుల బోలు వృక్షాలున్నాయి. వాటి సుమవృష్టి కురిసిన చోటు చూసారు. పూలపాన్పులా ఉందేమో అచటే అంతా కూర్చున్నారు.

దుగ్గన్నా! నిన్న మా తాతలు చేసిన ధర్మకార్యాలు చెప్పాలని ప్రారంభించి, మా మిత్రుడు మా తాతల గురించి చెప్పిన పద్యాలు చెప్పటం మరచాను. ఓ తాత తిరువళ్ళూరులో మూడు ఆమడల పొడవుగల తటాకాన్ని త్రవ్వించాడు. ఈ సరస్సు చూసిన తర్వాత, అది గుర్తుకు వచ్చింది. శ్రీనాథుడు చెప్పిన సీసపద్యం వినండి.

సీ॥ కట్టించె నొక తాత కంచి హర్మ్యంబులు

హరిణాంక మౌళి కేకామ్ర పతికి

బాలార్కమనియెడు పద్మరాగము దాచె

నొక తాత కంచి నాయకుని నాభి

నొక తాత కట్టించె యోజన త్రయదీర్ఘ
తర తటాకాంబోధి తిరువళూర
కావేరి గట్టించె గార్గా సరాసుల
నుచ్చి చోడదు మెచ్చ నొక తాత
తే॥గీ॥ ప్రతిదినమ్ముగపురపు దీపములు వేయు
వ్రతముగా నొక్క తాత యీశ్వరున కొసగె
నిఖిలలోక ప్రసిద్ధి వాణిజ్యవంశ
ధరులు మా తాత లుభయగోత్రములయందు.

ఒక తాత, శివుని గుడిలో అహరహము సహస్ర కర్పూర దీపాలు వెలిగించు వ్రతాన్ని సాగించాడు. వారానాడు, అలా చేసారు కాబట్టే మనమీనాడు ఇలా సుఖంగా ఉండటమే కాదు, పదిమందినీ ఆదుకోగల్గుతున్నాం. వారి పుణ్యఫలమిది అన్నారు అవచితిప్పయ్యశెట్టి. శ్రేష్ఠి గారూ, మీరన్నది అక్షరసత్యం. మీ పూర్వీకుడైన భక్త సిరియాళుని కథా సుధామృతాన్ని గ్రోలిన మీరేంచేసారో చెప్తారా? – అని పల్కిన దుగ్గన్నతో, భాగవతోత్తముల కథామృతాన్ని సేవించాక, అంతా హరవిలాసంగా గుర్తించి బాలసఖుని, ఏన్గునెక్కించి కంచిలో ఊరేగించి, ముత్యాల దుకూలశాటితో ఘన సన్మానంచేసా. అంతేకాదు, ఏం కావాలో కోరుకో, నీ కోర్కె తప్పక తీరుస్తానని మాట ఇచ్చాను. నా బాల సఖుడు, నిస్వార్థజీవి. తామరాకుపై నీటి బొట్టులా, ప్రయాణించే జీవన్ముక్తుడు. అందరూ సుఖంగా ఉండాలన్నదే మిత్రుని కోరిక, అయినా, ఓనాడిలా అన్నాడు, నేస్తమా! పెదకోమటి వేమారెడ్డిని, కొండవీటి సామ్రాజ్యానికి చక్రవర్తిని చేస్తానని మాటనిచ్చాను. ఆ ప్రతిజ్ఞ నెరవేర్చుకోవటం కోసం మంత్రాంగం నడుపుతున్నా, త్వరలో ప్రభువును చేస్తా. నీ సాయాన్నర్థిస్తున్నా!

శ్రీనాథుని మాట విన్నా! వెంటనే విజయపథకాన్ని సిద్ధం చేసి, అందుకు కావలసిన ధన కనక వస్తు వాహనాదులనన్నీ సమకూర్చి మరింత బలగాన్ని పెంచి మిత్రుని మనస్సు పంచుకొన్నా. శ్రీనాథ సఖుని పథకం ఫలించింది. శ్రీనాథుడే విజయముహూర్తం నిశ్చయించి, కొండవీటిని వశపరచుకొనేలా సహకరించటంతో వేమారెడ్డి సార్వభౌముడయ్యాడు. శ్రీనాథుడు చేసిన సాచివ్యానికి ప్రతిఫలంగా శ్రీనాథ కవి నాహ్వానించి, పాదపూజ చేసాడు. ఏనుగుపై ఊరేగించాడు. గజారోహణంతో తృప్తి పడక, పట్టు పీతాంబరాదులతో సత్కరించినందులకు సంతుష్టి చెందక, తన ఆస్థానానికి రప్పించినాడు. అచటి విద్వత్కవిశేఖరులతో సంగోష్ఠులేర్పాటు చేసాడు. “వేమభూపాల చరిత” రచించిన వామన

భట్టబాణుడు, సంస్కృత కవి సార్వభౌముడు. ఆతడా సభలోనున్న సాహిత్య చూడామణి, ఆతడు, శ్రీనాథుని సంస్కృతాంధ్ర పాండిత్యాన్ని కొనియాడాడు. నలాభ్యుదయం, హంస సందేశాద్యనేక కావ్యాలు రచించిన దిట్ట-వామన భట్ట బాణుడు. ఇలాంటి కవిశేఖరు లెందరున్నా, వారందర్నీ తన వాదపటిమతో ఓడించిన దిట్ట-శ్రీనాథ భట్ట కవియని, తన ఆస్థానంలో విద్యాధికారి పదవినధిష్టింప జేసాడు. నాటి మహోత్సవాన్ని కనులారా తిలకించిన వారిలో నేడు నేనూ, దుగ్గన, కవి కుటుంబం, ముత్యాలశాలలోనే ఉన్నాం. శ్రీనాథుడు-విద్యాధికారి పదవిలో రెండు దశాబ్దాలపాటు (క్రీ.శ. 1404-క్రీ.శ. 1424) అఖిలపురాణ విద్యాగమాలు, వేమ భూపాలునకు విన్పించేవాడు. బహుదేశ బుధులతో శాస్త్ర విషయాలు చర్చించేవాడు. పండిత పరీక్షాధికారిగా దానశాసనాలు రచించటం, విద్యాగోష్ఠులు నిర్వహించటం, రాజసభకు వచ్చిన విద్వాంసుల విద్వత్తును పరీక్షించి వారికి యథోచిత సత్కారాలు చేయించటం, సనాతన సంస్కృతిని రక్షించటం, మానవతా విలువలను కాపాడేలా చూడటం, విశ్వ కళ్యాణం కోరి, యజ్ఞయాగాది సత్కర్మలనాచరింప చేయించటం, రాజ్య పరిరక్షణకై తగు సూచన లివ్వటం, మొదలైనవెన్నో నిర్వహించేవాడు. కల్వపాముల, పొన్నుపల్లి, ఫిరంగిపురం, రుద్రవరం మొదలుగాగల పదునాల్గు శాసనాలు లిఖించి, శాసనకర్తగా విఖ్యాతిగడించి, అగ్రహారీకుడుగా దుర్నిరీక్ష తేజశ్శాలియై దశదిశల కర్పూరంలా ఘుమఘుమలాడే, విశదకీర్తి స్ఫూర్తులను వెదజల్లిన విద్యాధికారి శ్రీనాథుడు.

శ్లో॥ విద్యాధికారీ శ్రీనాథో వీర శ్రీ వేమభూపతేః ।
అకరో దాకరో వాచాం నిర్మలం ధర్మశాసనమ్ ॥

ఇది నందమూరు శాసనంలోని శ్లోకం. నేను, సౌగంధికుణ్ణి కదా! సౌగంధ్యాన్ని వేమారెడ్డి గారికి కూడా అందజేసేవాడిని. సుగంధ ద్రవ్యాలను వ్యాపారం చేయటం వల్ల దేశంలోనే కాక విదేశీయులతో కూడ పరిచయాలు ఏర్పడ్డాయి. మా పచ్చకర్పూరానికి అధిక లాభాలు వచ్చేవి. వేమారెడ్డి గారితో పరిచయం పెంచింది శ్రీనాథ సఖుడే. శ్రీనాథ కవి, అపరచాణక్యునిలా రాజనీతిని ప్రయోగించి, తనను చక్రవర్తిని చేసాడన్న గౌరవంతో, కొంతమాన్యక్షేత్రం కూడ, ప్రభువులందజేసారు... అంటూంటే, శ్రేష్ఠిగారూ, పొన్నుపల్లి తామ్ర శాసనంలో సీమా విభాగాన "-", **శ్రీనాథభట్టరు శాసనాచార్య దక్షిణ భాగం వకటి** "-" అని ఉందండి. ఆ అగ్రహారం ఇప్పటికీ బావగారి ఆధీన్యంలోనే ఉంది. అపుడపుడు వెళ్ళి చూసివస్తూంటారు.

దుగ్గన్న గారు, ఆ శాసనం నేను చూసాను, అంతేకాదు, ఆ సుక్షేత్రాన్ని అగ్రహారాన్ని

కూడ చూసాను. ఇంతకీ చెప్పటం మరచాను. వేమారెడ్డి గారు రాజ్యానికి వచ్చిన తర్వాత, ఐదువసంతాలు శ్రమించి రాజ్యాన్ని సుస్థిరం చేసాక, శ్రీనాథుని కుటుంబంతో సహా, నేను నాభార్యాపిల్లలు రాజు గారి కుటుంబం, వారి మహామంత్రి మామిడి సింగన్న గారి కుటుంబంతో సహా తీర్థయాత్రలకు బయలుదేరాం. ముచ్చటగా మూడేండ్లు తిరిగాం! శ్రీశైలం వెళ్ళాం, భ్రమరాంబామల్లికార్జున స్వామి ఆలయాన్ని దర్శించాం. సాక్షి గణపతినర్చించాం. స్వామిని పంచామృతాలతో అభిషేకించాం. శ్రీశైల శిఖరాన్ని చూస్తే చాలు పునర్జన్మలేదన్నారు. శిఖర దర్శనం చేసాం. భక్తులు "శ్రీశైల శిఖరం దృష్ట్వా పునర్జన్మన విద్యతే" – అని స్మరించటం విన్నాం. మేమూ అన్నాం. తర్వాత కుమారాచలం, సింహాచలం, శ్రీ కూర్మంలో వెలసిన దైవాలను దర్శించాం. అమరారామంలోని అమరేశ్వరుని, ద్రాక్షారామంలోని భీమేశ్వరుని, కుమారారామంలోని భీమేశ్వరుని, క్షీరారామంలోని రామలింగేశ్వరుని, సోమారామంలోని సోమేశ్వరుని సందర్శించాం. తర్వాత పుణ్యాలరాశి కాశీ మహానగరం చేరాం. అన్ని పుణ్యక్షేత్రాలలోనూ ప్రభువులు దానధర్మాలు చేస్తూనే ఉన్నారు. యధాశక్తిగ మేము కూడ గుప్తదానాలు చేసాం.

శ్రీనాథుడు, మేము కాశికావిశ్వేశ్వరుని దర్శించి, మహాన్యాస పూర్వకంగా అభిషేకించుకొన్నాం. శ్రీనాథుడు సుస్వరంగా నమకచమకాలు పఠిస్తూంటే, కాశీ పండితులు పాదాక్రాంతులయ్యారు. శ్రీనాథుడు, కాశీ విశ్వేశ్వరుని మహిమానుభూతి విభూతిచే, విభూతిరాయుని సన్నిధిలోనే ఆమహాదేవదేవుని మహిమలు తెల్పు దివ్యగాథాసుధను తెలిపే, అయఃపిండం లాంటి కాశీఖండాన్ని తెలుగు చేయ సమకట్టి శ్రీకారం చుట్టాడు. కొన్ని పద్యాలు రచించి అన్నపూర్ణమ్మకు అంజలి ఘటించాడు. కృష్ణ, గోదావరి, సరస్వతీ, యమున, నర్మద, సింధు, కావేరి మొదలగు సమస్త నదీమ తల్లులకు తల్లియైన గంగమ్మ తల్లికి తలవంచి నమస్కరించాడు. తర్వాత మేమంత త్రివేణి సంగమ స్థలాన్ని సందర్శించాం. స్నాన సంధ్యావందనాదులన్నీ పూర్తి చేసాం. ఎన్నో పుణ్యక్షేత్రాలు, పుణ్యతీర్థాలు, మూడు సంవత్సరాలు తిరిగి తిరిగి చివరకు కొండవీడు చేరుకొన్నాం. క్రీ.శ. 1409, 1410, 1411 – సంవత్సరాలలో మేంచేసిన తీర్థయాత్రలను రేఖామాత్రంగ ఒకే ఒక్క శ్లోకంలో విరచించి, రుద్రవర తామ్ర శాసనంలో క్రీ.శ. 1418న ప్రకటించటం జరిగింది... అని చెప్తూంటే, ఓ మధురకంఠం శ్రేష్ఠి గారూ, ఆ మౌక్తికాక్షరాభరణాన్ని శ్రవణాలంకృతి గావిస్తారా! అనటమే ఆలస్యం.

శ్లో॥ శ్రీశైలే స్థిర మూలతా ముపగతా, వృద్ధిం కుమారాచలే
పంచారామతలే ప్రతాన సుషమా సింహాచలేంద్రే తతః ।
శ్రీ కూర్మే పురుషోత్తమే కుసుమితా యద్ధర్మ కీర్తిర్లతా

కాశ్యాం విశ్వపతేః పురః ఫలవతీ నిత్యోపహారోచితమ్ ॥

అని చక్కగా వినిపించారు. కొందఱు వ్రాసి కొన్నారు కూడ. అందుకే పౌనః పున్యంగా చదివి వినిపించారు. వారి యాత్రా విశేషాలు మరిన్ని కూడ వివరించారు. శ్రీనాథుడు, మేము ఎక్కడ తిరిగినా, వారు అచటి వారితో ఆ ప్రాంతీయ భాషలోనే మాట్లాడేవారు. తెలుగు భాషలోనే చాటువులు చెప్తూనే వాటిని వారు మాట్లాడుకొను భాషలో వివరించి చెప్పి, తెలుగు భాషలోని అందచందాలనందించేవారు. మేం, భారతదేశములోని ముఖ్యప్రాంతాలన్నీ తిరిగాం. శ్రీనాథునికి రాని భాష లేదు. అన్ని భాషల వారికీ, తెలుగు చాటువులు, వాటి భావాలు చెప్పి, **'దేశ భాషలందు తెలుగు లెస్స'**యని ఎలుగెత్తి చాటి మురిపించారు. పెద కోమటి వేమారెడ్డి, సహజపాండిత్యుడు, కవిపండిత పోషకుడు, ఇతడు చాల మంచివాడు కనుకనే, ఎన్నో దానధర్మాలు చేసాడు. సంగీతంలోను సాహిత్యంలోనూ గ్రంథాలు రచించాడు. ఈ ప్రభువులు, తాము రచించిన సంగీత చింతామణి గ్రంథం గురించి చర్చిస్తూ ఉండేవారు. కొత్త రాగాలనాలపించేవారు. మరి శ్రీనాథుడో కొంగ్రొత్త భావాలను చెప్పేవాడు. అపుడపుడు నేనూవినే అదృష్టానికి నోచుకొన్నవాడినే. అమరుక శతకానికి - శృంగారదీపిక అనే వ్యాఖ్యానం రచించి విద్వాంసుల మెప్పుపొందిన సుధీమణి, వేమారెడ్డి! శబ్దరత్నాకరం, శబ్దచంద్రిక రచించిన వామన భట్టుకు అగ్రహారాలు దానం చేసాడు - క్రీ.శ. 1404లో దైవజ్ఞుడైన పెద్దియజ్వకు కల్వపాముల అగ్రహారాన్నిచ్చాడు. భూలోక ధన్వంతరి అయిన భాస్కరార్యునకు పొండుపల్లి అనే గ్రామాన్ని, ఎల్లే పెద్ది లక్ష్మణదీక్షితులకు, షడ్దర్శనాల వల్లభసోమయాజికి పెదపూడి గ్రామాన్ని దానం చేసాడు. వేమారెడ్డి, తన గురుదేవులైన శంకరమౌళి గారికి క్రీ.శ. 1405లో పిసపాడు గ్రామాన్ని దానం చేసారు. క్రీ.శ. 1408లో షట్కర్మనిరతుడైన, శ్రౌత శాఖాగ్రవర్తి పిశిపాటి రామచంద్ర సోమయాజికి పొట్లపాడు గ్రామాన్ని, సింగనార్యునికి పొన్నుపల్లి గ్రామాన్ని దానం చేసినట్లు తెలుస్తోంది. క్రీ.శ. 1409 సం॥లో పెద్దియజ్వకు మరల నందలూరు గ్రామాన్ని దానం చేసాడు. క్రీ.శ. 1413వ సం॥లో విశ్వేశ్వర పండితునికి ఆలపాడు గ్రామాన్ని, క్రీ.శ. 1415లో పెద్దియజ్వ కుమారరత్నం-రామచంద్ర జ్యోతిష్కునికి రుద్రవర గ్రామాన్ని దానం చేసారు. ఈ శాసనాలన్నీ శ్రీనాథ కవీశ్వరులే వ్రాశారు. వారి రచనలు చాలా ఉన్నాయి.

మా బాలసఖుడు, విద్యాధికారిగా ఉన్నప్పుడే, ఆతని కూరిమిసేయు మరది, దగ్గుపల్లి దుగ్గన్న - ఎవరో కాదు, వీరే వారి దగ్గర ఛందస్సునధ్యయనం చేసి, శాస్త్రాలు చదివి

ప్రియశిష్యుడై – శ్రీనాథ మహాకవీంద్ర ప్రసాద లబ్ధకవితా విశేషజ్ఞుడైనాడు. ఏమంటావు దుగ్గన్నా!, నూటికి నూరుపాళ్ళు నిజమంటాను – అన్నాడు దుగ్గన్న. విన్నారా, మా శ్రీనాథుడెంతటివాడో! క్రీ.శ.1418 సం॥లో ప్రభువుల కోర్కె తెలిసికొని దేవరకొండ రాజ్యాధిపతి మాదయలింగనానేని, ఆస్థానానికి వెళ్ళి, తన అద్వితీయ కవితాచాతుర్యాన్ని చూపి, మెప్పించి, నందికంత పోతరాజు కటారిని బహూకృతిగా పొందాడు. అది రెడ్డి రాజుల కందజేసిన ఘనుడయ్యాడు అది శ్రీనాథ కవిరాజు రాజనీతిజ్ఞత. ఆకటారి – రెడ్డి రాజుల పౌరుషమునకు ప్రతీక.

ఇలా క్షణమేని తీరిక లేకుండ అటు రాజకీయ రంగంలోను, ఇటు సాహిత్య రంగంలోను, రాణిస్తూనే, కాశీ యాత్రాఫలితంగా, అచటనుండి రాగానే, **ధనంజయ విజయమనే** పేరుతో క్రీ.శ.1412లో – కిరాతార్జునీయ గాధాసుధను హృద్యంగమముగా రచించి, పెదకోమటి వేమారెడ్డి మామయైన ధాన్యవాటీ పురాధిపతి, దంతలూరుగన్న భూపాలునకు కృతి సమర్పణ చేసాడు. కృతి సమర్పణ సభలో రత్నాంబరాలనిచ్చి ఘన సత్కారం చేసాడు వేమారెడ్డి. ఎంతో సంబరపడ్డాడు మా శ్రీనాథుడు. ఉడుతాభక్తిగ నేను కర్పూరాన్నిచ్చి, సంతోషించాను. తర్వాత వేమారెడ్డి గారు, ప్రతీసభలోను మా శ్రీనాథునకు రత్నాంబరాలిచ్చి సత్కరించటం ఆనవాయితీగా మారింది. ఇలా విద్యాధికారిగా పదహారువత్సరాలు పూర్తి చేసేసరికి, క్రీ.శ.1420 సం॥లో వేమారెడ్డి గారు కాశికావిశ్వేశ్వరుని పిలుపుపై కైలాసం చేరి హరవరివస్యావదాన్యులయ్యారు.

క్రీ.శ. 1420 నుండి వారి కుమారరత్నం – నాలుగువత్సరాలు పాలించారు. ఆ రాచవేమారెడ్డి రాజ్యాన్ని పాలించినంత కాలం, విద్యాధికారిగా శ్రీనాథులే ఉన్నారు. ఇలా రెండు దశాబ్దాలకాలం విద్యాధికారిగా ఉండి, దేశం నలుమూలలా తెలుగు సంస్కృతిని, తెలుగు భాషను పెంచి పంచారు.

కొండవీటిరెడ్డి రాజ్యభాస్కరుడస్తమించటంతో, నిరాశ్రయుడై శ్రీనాథుడు దేశాటనం చేయాల్సివచ్చింది. తర్వాత ఏమిజరిగిందో రేపు చెప్పుకొందాం! ఈ రోజున మనమంతా ఎవరి విడిదికి వారు వెడదాం. నగరి వాసులు, వారిండ్లకు వెళ్ళి బువ్వతిని, విశ్రాంతిని తీసికొని, మధ్యాహ్నం వాద సభకు విచ్చేయండి. మనమంతా అక్కడ కలసికొందాం. దేశాటనలో శ్రీనాథుడు, ఎన్ని ఆటుపోట్లు తిన్నారో – ఎవరెవరాదుకొన్నారో, ఏ ఏ గ్రంధాలు వ్రాశారో, ఎలా వ్రాశారో, ఏం వ్రాశారో దుగ్గన్ననడిగి, రేపు తెలిసికొందాం!.... అంటూ ముత్యాలశాల ముందుకు ముందంజవేసారు.

ముత్యాలశాలలోనే శ్రీనాథుని ప్రత్యేక విడిది. ఆ మిద్దెలోంచి మంత్రపుష్పం వినబడుతోంది... 'ఓం తత్పురుషాయ విద్మహే మహాదేవాయ ధీమహి తన్నో రుద్రః ప్రచోదయాత్" అను మంత్రం వింటూనే, దుగ్గన్న సదాశివ మంత్రాన్ని స్మరించాడు. **"ఈశానస్సర్వ విద్యానాం, ఈశ్వర స్సర్వ భూతానాం బ్రహ్మాధి పతిర్బ్రహ్మణోధిపతిర్బ్రహ్మాశివోమే అస్తు సదాశివోమ్". హరిః ఓం తత్సత్.**

4. ముత్యాలశాల సదస్యులతో కిటకిటలాడుతోంది. నేటికి వాదసభ ప్రారంభమై **నాల్గవరోజు,** ప్రౌఢదేవరాయలు, నిండుసభలో స్వర్ణసింహాసనాసీనుడై ఉన్నాడు. ఇటు డిండిమభట్టు, అటు శ్రీనాథ భట్టు. ఎవరి పట్టు, ఉడుంపట్టో, ఎవరి పట్టు పొందుంపట్టో తేల్చుకోలేకున్నారు. సమఉజ్జీలుగానే ఉన్నారని కొందరి భావన, పండిత ప్రకాండులు, కవిపుంగవులు బారులు తీర్చికూర్చుని – ఎవరికి తోచినట్లు వారు ముచ్చటించుకొంటున్నారు. వాదసభ ప్రారంభం కాలేదు. ధర్మపీఠాధ్యక్షులు, న్యాయమూర్తులతోను, రాయలవారితోను మాట్లాడుతున్నారు. మరికొన్ని నిమిషాల్లోనే సభ ప్రారంభమౌతుందని మహామంత్రి చామనామాత్యుల వారు ప్రకటించారు.

ఓరేయ్! శాస్త్రీ! కోయిల–కాకి రూపంలో ఒకలాగే ఉన్నా నోరువిప్పితే చాలు, స్వరభేదంచే ఏది కోయిల, ఏది కాకి అని చెప్పవచ్చు. కాని, వీరి విషయంలో రూపభేదంలో కాని, స్వరభేదంలో కాని తేడా కనపడటం లేదురా, అన్నాడు శర్మ.

ఔనవును! స్వరూపాల్లో ఉప్పు కప్పురం ఓలాగే కనబడినా, రుచి చూస్తే చెప్పవచ్చు. కాని, ఆ రుచిచూచి చెప్పే సామర్థ్యం మనకుండాలిగా.

నిజమే! హంస, బకం వర్ణం చేత ఒకే విధంగా ఉన్నా, నడకచే భేదం చెప్పవచ్చు నంటారు. ఎందుకంటావా? హంసను చూస్తేగా, నడక తెలియడానికి, స్ఫటిక–వజ్రం, రంగు చేత ఒకే విధంగా దూరానికి కనబడినా, బరువుచేత ధాళధళ్యంచేత వజ్రాన్ని చెప్పవచ్చు. అలాగే వీరిద్దఱిలో ఎవరు గొప్పవారో తేల్చిచెప్పాలంటే, మన రాజ కులగురు బ్రహ్మలే సర్వసమర్థులని అందరి అభిప్రాయం. మనం కూడ ఏదో కాస్తంత చదువుకొన్నవాళ్ళమే! ఆలోచిస్తే, శ్రీనాథుడే కొంచెం శాస్త్ర పటిమ చూపుతున్నట్లనిపిస్తోంది. ఓరేయ్! శాస్త్రీ, గురువు గారి శాస్త్ర పాండిత్యం ముందు, శ్రీనాథుడెంత? పిచిక మీద బ్రహ్మాస్త్రమెందుకా, అని యోచన చేస్తున్నట్లనిపిస్తోంది. వారు శాస్త్ర సింధువుని ఈదిన మహనీయులు, తక్కువ అంచనా వేయకు. శర్మా! నువ్వు చెప్పింది వింటూంటే, నవ్వు తన్నుకొస్తోంది. సముద్రాన్ని ఈదటం సాధ్యమంటావా? దానికి ఆవలి దరిలేదే! అపారమైంది

కదా! ఎలా? అందులో క్రకచాలు, తిమింగలాలు... అంటూంటే, వాద సభప్రారంభమౌతోందన్నారు. అంతా నిశ్శబ్దం.

ధర్మపీఠాధ్యక్షులు, ఈనాటి వాద సభలో **ప్రపాఠకాల** గురించి ప్రశ్నించారు. అవి ఎన్ని? ఏమిటవి? అని అడిగిన ప్రశ్నలకు, ఉభయులు చక్కని సమాధానాలిచ్చారు. ప్రపాఠకమునే **పన్నము** - అని అంటారని, సంహిత - నలుబది నాల్గుపన్నాలు, బ్రాహ్మణములు ఇరువది ఎనిమిది, ఆరణ్యకాలు ఆరు, ఉపనిషత్తులు నాలుగు, వెరసి, **ఎనుబది రెండు పన్నాలని** వివరించి, ఆ ఎనభై రెండు పన్నాలు వ్యాప్తిలో నున్న కృష్ణయజుర్వేద వ్యవహారమన్నారు. ఏ మంత్రం ప్రారంభం చెప్పినా పూర్తిగా ఇద్దఱూ చెప్పారు. పన్నాల్లో ఏపదం చెప్పినా, ఎక్కడుందో చెప్పారు. మంత్రార్థాలు కూడ చెప్పటం విశేషం. వేదాల్లో యజుర్వేద స్థానం ఏమిటని శ్రీనాథుని ప్రశ్నిస్తే – యజుర్వేద శబ్దంలోనే అది ఉందన్నారు. కర్మమంత్రాలకు ప్రధానమైందని డిండిమభట్టారకులు వివరించారు. ఇలా గురుబ్రహ్మలు, వారిద్దఱిచే ఎనభై రెండు పన్నాల్లోను అవధానం చేయించారు.

"కామాయపుగ్గ్ంశ్చలూమ్। అతి క్రుష్టాయమాగధమ్।" ఈ మంత్రం దేంట్లో ఉందన్నారు, డిండిమభట్టు యోచిస్తూంటే...

ఇది సున్నాలపన్నం లోని ప్రథమానువాకం లోని దన్నారు, శ్రీనాథుడు. డిండిమభట్టారకులతో ప్రారంభిద్దాం. ఒకరు చెప్పకపోతే మరొకరు చెప్పవచ్చు. "త్రిపాదస్యామృతందివి" ఎందులోనిది? పురుష సూక్తంలోనిదన్నారు డిండిమభట్టు. "దివీవచక్షురాతతమ్" - నారాయణ సూక్తంలోనిదన్నారు, శ్రీనాథ కవి. పూర్తి పాఠం "తద్విష్ణోః పరమంపదగ్ం సదాపశ్యన్తి సూరయః, దివీవచక్షు రాతతమ్" అని శ్రీనాథుడు పూర్తి మంత్రాన్ని చెప్పి, – వేదాంతులు, ఆవరణం లేని ఆకాశాన ప్రసరింపచేయబడిన నేత్రం వలె వ్యాపకమైన విష్ణువు యొక్క సర్వోత్కృష్ట రూపాన్ని సర్వదాస్మరిస్తున్నారని, వేదమంత్రార్థాన్ని వివరించాడు శ్రీనాథుడు.

"సోమగ్ం రాజానం వరుణ మగ్నిం అన్వారభామహే" । మంత్రం ఎక్కడిది? ఈ మంత్రం నీళా సూక్తంలోనిది, సోముని, రాజును, వరుణుని, అగ్నిని అనుసరించాక ఈపని ప్రారంభించాము అని మంత్రార్థం వివరించారు డిండిమభట్టు. ఈ ప్రకారంగా వేదాంత విషయాలు చర్చించిన తర్వాత, వేదశాఖలు, వేదాంగాలలో గల విషయాలలో వాదోపవాదాలు శ్రుతి సమ్మతంగా జరిగాయి.

ధర్మపీఠాధ్యక్షులు : పూర్వోత్తర మీమాంసాశాస్త్ర రహస్యాలను చర్చించండి.

జిజ్ఞాసా హృదయులకు రెండు శాస్త్రాలు రెండు నేత్రాల్లాంటివి... అనిన శ్రీనాథునితో, ధర్మమీమాంసాశాస్త్రమే ముఖ్యమని నా అభిప్రాయం. మానవాభ్యుదయానికి సత్కర్మాచరణమే ముఖ్యం. కనుక కర్మఫల ప్రధానమైన పూర్వమీమాంసాశాస్త్రమే ప్రధానము. అందుకే జైమిని మహర్షి, **"అథాతో ధర్మ జిజ్ఞాసా"** - అని ధర్మమీమాంసాశాస్త్రం వ్రాశారు. అథ - అంటే వేదాధ్యయనానంతరం ధర్మజిజ్ఞాసచేయాలంటారు. మానవులు, ఆచరింపవలసిన యజ్ఞయాగాది క్రతువులు, వాటి ఫలితాలు ధర్మాలు నిత్యనైమిత్తికాది సత్కర్మలన్నింటినీ తెలిపిన ధర్మమీ మాంసాశాస్త్రమే గొప్పది... అనినారు డిండిమభట్టు.

ధర్మాలు తెలిపిన గ్రంథమని డిండిమభట్టారకులు నొక్కివక్కాణిస్తున్నారు, అది నిజమే. మేముకాదనము, కాని, శ్రుతులే ఆధారాలు కనుక, అశ్రుతులలోకాని, శాస్త్రాల్లో కాని ఎన్నో అధర్మాలు కూడ చర్చింపబడ్డాయి. కనుక మీరేది ధర్మ జిజ్ఞాస అంటున్నారో, దానిని అధర్మజిజ్ఞాస అని కూడ అనవచ్చునేమో? అని పల్కిన శ్రీనాథునిపై ఆగ్రహం వచ్చినా నిగ్రహించుకొని, అదెట్లు? శ్రీనాథ కవీ! అథ+అతః+ధర్మజిజ్ఞాసా అని స్పష్టంగా జైమని మహర్షి తెల్పియున్నారు. మీరు అధర్మమీమాంసయని పల్కుటను మేము సహింపము అనినారు. అధర్మజిజ్ఞాసా - అని చెప్పకూడదా? ధర్మాధర్మాలు తెలిసినకాని ఉత్తముడు, ధర్మములు ఆచరింపలేడు. ఏది తప్పో, ఏది ఒప్పో తెలిస్తేనే కదా, ఒప్పుచేసేది. అది బురదనీరు, ఇది స్వచ్ఛమైన నీరు - అని తెలిసినపుడే మంచి నీటిని త్రాగుతాం! ఉప్పునీరు, మంచినీరు చూడటానికి పైకి ఒకేలా ఉంటాయి. రుచి చూస్తేనే ఏది మంచి తీర్థమో తెలిసేది లేదా, రుచి చూసిన వారు చెప్పిననూ మంచిని స్వీకరిస్తాం. ఏదైతే మనం ప్రమాణంగా తీసికొంటున్నామో, ఆ శబ్దమే ధర్మాధర్మాలు తెలియజేస్తుంది. "శ్రద్ధయాదేయం - అశ్రద్ధయా అదేయం, యాన్యనవద్యాని కర్మాణి, తానిసేవి తవ్యాని - నో ఇతరాణి" - అని శ్రుతి హెచ్చరిస్తోంది కదా। ఎలాంటి కర్మలు చేయాలో, ఎలాంటివి చేయవలదో శ్రుతిమాత చెపుతోంది. అన్నం పారవేయరాదని, అది వ్రతమని చెప్పింది. "అన్నం న పరిచక్షీత తద్వ్రతమ్" - శ్రుతి, అని శ్రీనాథ పండితుడు వాదిస్తోంటే, ధర్మస్థాపన విషయంలోనే అవన్నీ ప్రతిపాదింపబడ్డాయి. అందుకే అది ధర్మజిజ్ఞాస, అంతేకాని అధర్మ జిజ్ఞాస అనడానికి వీల్లేదు. ఈ శాస్త్రాన్ని అలా అంటే శ్రుతులలోని విషయాలను బట్టి, దానిని కూడ మీవంటి వారలు, అలాగే అంటే, ఎలా? కనుక ధర్మ జిజ్ఞాసచే పుణ్యాన్ని సముపార్జించి, తద్వారా స్వర్గాది పుణ్యలోకాలు పొందవచ్చు అని డిండిమభట్టారకు లెపుడైతే చెప్పారో, మీ దృష్టిలో ధర్మమంటే పుణ్యకర్మలనుచేసి పుణ్యాన్ని పొంది, తద్వారా స్వర్గం

పొందటం అని చెప్తున్నారన్నాడు శ్రీనాథుడు.

ధర్మజిజ్ఞాసా – అంటే వేదాలు క్షుణ్ణంగా అర్థంతో సహా తెలిసికొన్నాక, ధర్మం అంటే ఏమిటో తెలిసికోవాలనే ఇచ్ఛ కలగటమన్నమాట. ఈ శాస్త్ర మర్యాదననుసరించి ధర్మం – అంటే **"యాగాది రేవ ధర్మః"** । జ్ఞాతుమిచ్ఛా జిజ్ఞాసా... అని డిండిమభట్టారకులు సూత్రాన్ని వివరించి చెప్పటంతో, యజ్ఞయాగాదులు చేయుటయే ధర్మమని మీరంటున్నారు. నేననటం కాదు, శాస్త్రం చెపుతోంది. శాస్త్రం మనకు ప్రమాణం. **"జ్యోతిష్టోమేన స్వర్గకామోయజేత"** – ఇత్యాతి మంత్రాలచే, జ్యోతిష్టోమాది క్రతువులు చేయటం వలన, స్వర్గం ప్రాప్తిస్తుంది. ఎవరికి?... స్వర్గాన్ని కోరి ఈ యాగం చేసిన వానికి, పుత్రుని కోరినవారు, పుత్రకామేష్టియాగం చేస్తారు... అంటూ డిండిమభట్టారకులు వాదించారు.

జ్యోతిష్టోమాది యాగాలు చేసి స్వర్గం సంపాదించి, సుఖాలన్ని పొందిన తర్వాత, వాడు సంపాదించిన పుణ్యం పూర్తయిపోతే, వాడు మరలా ఈ భూమిలోనే – మరలా ఏదో ఒక ప్రాణిగా పుట్టాల్సిందే కదా!... ఈ విషయాన్ని కూడ శ్రుతులే చెపుతున్నాయి. పది లక్షలెక్కడో, రెక్కలు ముక్కలు చేసికొని సంపాదించి, సుఖాలు పొందాలని, ధనం తీసికొని ఎక్కడికో వెళ్ళి ఖర్చు పెట్టేస్తాడు. అది అయిపోయాక మళ్ళీ ఇంటికే రావాలి కదా? మళ్ళీ ధనం సంపాదించాల్సిందే కదా! ఖర్చు పెట్టేస్తే క్షీణించిపోయే పుణ్యధనం మనకెందుకండీ!... అని శ్రీనాథ కవి చెప్తూంటే, స్వర్గ సుఖాలు పొందడానికయ్యా... అన్నారు డిండిములు. సంపాదించిన పుణ్యం వల్ల వచ్చిన స్వర్గసుఖాలు, పుణ్యం క్షీణించాక ఉండవు కదా!

"క్షీణే పుణ్యేమర్త్యలోకే విశన్తి" అని వేదం శాసిస్తోంది. సంపాదించుకొన్న పుణ్యం క్షీణించాక దాని వల్ల ప్రాప్తించిన స్వర్గం పోతుంది. మళ్ళీ భూలోకంలో పుట్టాల్సిందే. శాశ్వత సుఖాల్ని ప్రసాదించని పుణ్యం మనకెందుకంటారు – డిండిమభట్టారకా; – అని ప్రశ్నించారు శ్రీనాథుడు.

నిత్యనైమిత్తికాది కర్మలు చేయుటయందే నీ కధికారమున్నది కాని, ఫల ప్రాప్తినియోచించి కర్మలు చేయరాదని భగవంతుని వాక్కు.

"కర్మణ్యేవాధికారస్తే, మాఫలేషు కదాచన"... అని నిధిధ్యాసాప్రస్థానరహస్యం. డిండిమభట్టారకా! గీతావాణి మాకును శిరోధార్యమే. ఆ గీతాచార్యులే, సర్వధర్మాన్ పరిత్యజ్య, మామేకంశరణం వ్రజ... అని కూడా అన్నారు. అందుకే సమన్వయ బుద్ధితో యోచించాలి. కర్మ ఫలం – అనిత్యమని తేల్తోంది. "కర్మణా జాయతే భక్తిః భక్త్యాజ్ఞానం ప్రజాయతే,

జ్ఞానాదేవహి కైవల్యమ్ - అని పల్కిన సద్గురువుల వాక్యాన్ని శిరాధార్యంగా భావించి, బ్రహ్మజిజ్ఞాస చేసిననాడే కైవల్య ప్రాప్తియని ఉత్తరమీమాంసాశాస్త్ర హృదయం - అన్నాడు శ్రీనాథుడు. మీరు చెప్పినట్లే, అథబ్రహ్మజిజ్ఞాసా అని అంటారా! అది అక్కడ ఇక్కడ ఎక్కడ కుదరదు. ఇక్కడ అథ శబ్దానికి వేదాధ్యయనానంతరం అని కూడ అర్థం ఉందికదా అని పల్కిన డిండిమభట్టారకులతో -

ఇచ్చట, వేదాధ్యయనానంతరం కన్న మిన్నయైన సాధన చతుష్టయ సంపత్యనంతరం, బ్రహ్మణః జిజ్ఞాసా కర్తవ్యా ...అని చెప్పితీరాలి. నిత్యానిత్యవస్తువివేకము - అంటే ఏది సత్యమో, ఏది అసత్యమో తెలిసికోవాలి. ఇహాముత్ర ఫలభోగ విరాగము - ఇహపరలోకాలకి సంబంధించిన సుఖాలందు విరక్తి. శమదమాది షడ్గుణసంపత్తి. ముముక్షుత్వం - ముక్తి పొందాలనే ఆకాంక్ష. బాహేంద్రియ, అంతరేంద్రియ నిగ్రహం, సహనం, భగవంతునియందే మనస్సును లగ్నంచేసి, వేదమందు గురువాక్యాల యందు విశ్వాసంతో సత్యమందే మనస్సును స్థిరంగా నిల్పి, పరబ్రహ్మను తెలిసికోవాలనే ఇచ్ఛ ఉంటే తప్పక ముక్తిలభిస్తుందని, ముక్తి లభించాక మరల పుట్టుక లేదని - "న చ పునరావర్తతే" - అను శ్రుతి ప్రతిపాదిస్తోందని, ఇది ఉత్తర మీమాంసాశాస్త్ర రహస్యమన్నాడు శ్రీనాథుడు.

ధర్మమీమాంసాశాస్త్రాధ్యయనము వలన కూడ ముక్తి లభిస్తుంది. "శ్రేయాన్ స్వధర్మోవిగుణః" - నీ ధర్మాన్ని కొంచెమైనా ఆచరించటం మేలు - అని గీతావాణి. ధర్మమే విశ్వానికి ఆధారమని - శ్రుతి ప్రతిపాదిస్తోంది. "ధర్మోవిశ్వస్య జగతః ప్రతిష్ఠా - శ్రుతి.

"సర్వభూతానాం ధారణాత్ ధర్మః" - శంకరభాష్యం. ధర్మస్వరూపుడే పరమేశ్వరుడని ఋగ్వేదఋక్కు. ధర్మమే సరియైన మిత్రమని స్మృతి. ధర్మసంస్థాపన చేయడానికే ప్రతీయుగంలోను అవతరిస్తున్నాడని భగవంతుని వచనం. వేద వేదాంతాది ధర్మశాస్త్రాలన్నీ ధర్మాన్ని ఆచరించు - అని బోధిస్తున్నాయి. కనుకనే ధర్మ జిజ్ఞాస చేయాలనేదే పూర్వమీమాంసాశాస్త్ర ప్రతిపాదన. ధర్మ రక్ష, మానవ దీక్ష కాగలిగితే - అదే మోక్షం.

శ్లో॥ ధర్మ ఏవ హతో హంతి, ధర్మోరక్షతి రక్షితః ।

తస్మాత్ ధర్మో నహంతవ్యో, మానోధర్మోహతోఽ వధీత్ ॥ మనుస్మృతి.

ధర్మం కొట్టబడిందా, అది మనలను ముంచేస్తుంది. రక్షింపబడిందా, మనలను రక్షిస్తుంది. అందుకే మానవుడు ధర్మాన్ని ఆచరించాలి. ధర్మాన్ని ఉల్లఘింప రాదు. ధర్మమే తోడు నీడ. శ్రుతిధర్మాలను ఆచరించాలి. **సత్యం, సర్వోత్తమ ధర్మం,** సత్యంవద, ధర్మంచర అని శ్రుతిశాసిస్తోంది. కనుక ధర్మజిజ్ఞాస అత్యంత ఆవశ్యకం. ధర్మమొక్కటే సరైన మిత్రమని,

మరణానంతరం కూడ విడిచిపెట్టకుండా వచ్చేది ధర్మమని స్మృతి, "ఏక ఏవసుహృద్ధర్మో నిధనేపి... అంటూ చెప్పిన ధర్మ శాస్త్రాదులన్నీ శ్రుతి ధర్మాలనాచరించాలని చెప్తున్నాయి. యజ్ఞ యాగాది క్రతువులన్నీ సువృష్ట్యాదులను కోరిచేసే సత్కర్మలు. దేవతలనుద్దేశించి, చేసే క్రతువులు, మానవధర్మాలకు ప్రతీకలని శ్రుతులు విధించాయి. "యాగాదిరేవ ధర్మః" యాగమంటే, దేవతోద్దేశేన ద్రవ్యత్యాగో యాగః – ఇత్యాది నిర్వచనాల ద్వారా, సత్కర్మలా చరించి, శ్రుతి ధర్మాలను పాటించాలని, ధర్మ స్వరూపులైన శ్రీరామ, ధర్మరాజాదులాచరించి చూపారు.

ధర్మపీఠాధ్యక్షులు : ధర్మమీమాంస – బ్రహ్మమీమాంస, – విషయచర్చ అంతంలేనిది. బ్రహ్మధర్మమీమాంసాశాస్త్రాలు గురు శిష్యులిద్దఱు, రచించిన వేదాన్త శాస్త్రాలు. విద్యాధికారులిద్దఱు స్వతః ప్రమాణవాదులే. వేదాలలో గల మంత్రాలు, ఏవి విధాయికాలు, ఏవి కర్మ శేషత్వబోధకాలు, ఏవి బ్రహ్మసంపత్తి ప్రబోధకాలో విచారణ చేయాల్సి ఉంది. వేదాంత వాక్య సమన్వయం వల్ల బ్రహ్మ ప్రతిపాదింపబడతాడనేది సత్యం. ఈ వాదాన్ని ఇంతటితో ఆపుదాం.

ఉపనిషత్సుచ, "సదేవసోమ్యేద మగ్ర ఆసీత్, ప్రజ్ఞానం బ్రహ్మ"... ఇత్యాదీని పరశ్శతాని వివిధాని వచనాని దృశ్యన్తే। తేషాంచ సర్వేషాంతాత్పర్య నిర్ణయః కర్తవ్యః । కి మేతాని వాక్యాని విధాయకాని? అథవా, కర్మ శేషత్వ బోధకాని? యద్వా, బ్రహ్మసంపత్తి ప్రబోధకాని? – ఇతి విచారణా కర్తవ్యా! అత్రచ శంకరాచార్యైః సుదీర్ఘం విచార్య, సర్వాణ్యేతాని వాక్యాని బ్రహ్మప్రతిపాద కాని, నాన్య విషయప్రతిపాదకాని ఇతి ధృఢం నిర్ధారితమ్ । తస్మాత్ శంకర మతానుసారేణ వేదాంత వాక్య సమన్వయాత్, బ్రహ్మైవ ప్రతిపాద్యతే ఇతి జ్ఞేయమితి ఫలతి । ఇతి శమ్॥ – అని పలికినారు, కులగురు బ్రహ్మలు. వారు సంస్కృతంలో ఉపనిషద్వాకాలను సమన్వయ బుద్ధితో యోచించాలని చక్కగా వివరించారు... అంటూనే ముమ్మకవి, "మూడు పూలారుకాయల్లా ఉన్నారంటాం! ఈ సామెతను దుగ్గన్న కవిగారు శృంగార రసస్ఫూర్తితో, ఔచిత్య విలసితంగా పద్యాల్లో చెప్పాలి – అన్నారు.

గీ॥ మాలిక **దశరథుడు సతుల వలపు తలచి పలికె,**
ఓ తనూలతలార! మీ జాతి పూయ
లతకు నొక్కొక్క పూగుండె లభ్యమాయె !
గుండె పూవుకు కాయలు రెండు కాయ
ముగ్గురు సతుల గుండెల మూడు పూవు

లారు కాయలగుచును నేడందమొదవె ।

ననగ, నగిరి ముగురు సతులంత, చెంత

మూడు పూలారు కాయల ముచ్చటరసి ॥ అని దుగ్గన్న చెప్పటం; శ్రీనాథుడు, పూరణ నాస్వాదించిన సదస్యులు – కరతాళధ్వనులు చేయటంతో, మహామంత్రి, శాంతి మంత్రం పలికించారు. స్వస్తి.

తెలతెలవారబోతోంది. దిశలు తెలుపెక్కుతున్నాయి. పిట్టలు కూస్తున్నాయి. నక్షత్రకాంతులు తగ్గుముఖం పట్టాయి. చక్రవాక దంపతులకు సంతోషం కలిగింది. చకోర పక్షులకు భయంపట్టుకొంది. తుంగభద్రానదీ తీరాలలోని స్నాన ఘట్టాల్లో సుప్రసిద్ధాఘమర్షణ సూక్తరవాలు శ్రావ్యంగా వినబడుతున్నాయి.

పొద్దుపొడవటంతో, మేల్కాంచిన మనుజులంతా సంతోషంతో ఎవరి పనులలో వారు మునిగారు. ముత్యాలశాల అతిధులతోను, అభ్యాగతులతోను, అందున్న స్థానికులతోను, విచ్చుకొంటున్న పూవుల్లా కళకళలాడుతోంది.

శ్రీనాథుడు, నిత్యనైమిత్తి కాది సత్కర్మలలో నిమగ్నుడయ్యాడు. మిద్దె ముంగిట కసవుచిమ్మి కళ్ళాపి జల్లి, రంగురంగుల ముగ్గులు తీర్చిదిద్ది, గదులన్నీ శుభ్రం చేసిన శ్రీనాథుని ఇల్లాలు, తన పనిలో నిమగ్నురాలైంది. సోదరుని సతి, సహకారం ఉండనే ఉంది. ఆమె పిల్లల పిల్లలతో సతమతమవుతోంది.

దగ్గుపల్లి దుగ్గన్న గారి నిత్యార్చనలు పూర్తయ్యాయి, మా పూజలు పూర్తయ్యాయి అంటూ మిత్రులు వచ్చారు, ముత్యాలశాలకు. పెద్దముత్తైదువ ఇచ్చిన ఆవు పాలు పుచ్చుకొన్నారు. అప్పటికే తొమ్మిది గంటలు దాటిందేమో, వారంతా ముత్యాలశాల ముంగిటనున్న సుందరోద్యానవనానికి బయలుదేరారు. దారిలో తిప్పయ్యశెట్టి గారు, కొత్తగా పరిచయమైన కవిమిత్రులతో కలిసాడు. వారు, వీరు, పూలతోటలు చూసి ముచ్చటపడి, ఒక్కొక్క రొక్కొక్క పువ్వు, తోటమాలి అనుమతితో కోసికొని, సౌగంధ్యాన్ని నాసిక కప్పగించి, లతాని కుంజాల చెంత చతికిలపడ్డారు. దుగ్గన్న, శ్రేష్ఠి గారి వైపు చూస్తూ – ఈ రోజున మైలారురెడ్డి గారు రాలేదు... అంటూంటే, వల్లభుడు వచ్చి, దుగ్గన్న గారూ, మంత్రిమండలి ప్రత్యేక సమావేశం ఉంది. సామంత మండలేశ్వరులు కూడ ఈ సమావేశానికి రావాలని, రాయలవారు పిలుపునిచ్చారు. సాయంత్రం వాద సభకు, మేమందరం వస్తాం, అని చెప్పి వల్లభామాత్యుడు సెలవు తీసికొన్నాడు. తెలుంగాధీశులు కూడ రారు, అని తలచిన దుగ్గన్న, శ్రీనాథుని దేశాటనలో సాహిత్యసేవ ఎలా కొనసాగిందో చెప్పటం ప్రారంభించాడు.

శ్రీనాథుడు కుటుంబంతో బ్రతుకు తెరువుకు బయలుదేరదాన్న విషయం కర్ణా కర్ణికగా విన్న విస్సన్నమంత్రి. శ్రీనాథుని తన చెంతకు పిలిచాడు. యథాశక్తిగ హేమ పాత్రాన్నంతో వారి కాతిథ్యాన్నిచ్చాడు. అప్పటికే వృద్ధుడై ఉన్న విస్సన్న మంత్రి కొంతకాలానికి స్వర్గస్థుడు కావటంతో, వేరే దారి లేక బ్రతుకుబాట పట్టిన శ్రీనాథుని వైదుష్యాన్ని విన్న, పంటమైలారురెడ్డి, ఆశ్రయమిచ్చాడు. దినవెచ్చమిచ్చి మెచ్చుకొన్నాడు. ఒకనాటి ఉదయగిరి మంత్రిగా ఖ్యాతిపొందిన విస్సన్నమంత్రి, తన పంక్తిలో హేమపాత్రాన్నమిడినాడే! ఈ రోజున ఆతడు లేడు. రత్నాంబరాలనిచ్చిన రాయడు లేడు. వరహాను మించిన తరహాలో మంత్రి రాయని భాస్కరుడు నన్ను గ్రచ్చుకొని మెచ్చుకొనిన రోజులు, సమ్మానాలు కాలగర్భాన కలసి, వైశాఖాలు గతించాయి. సిరిసంపదలు ఎలా వచ్చాయో, అలాగే పోయాయి. అగ్రహారాలు, నామమాత్రావశిష్టాలు, నేతి బీరకాయ. నేడు దిన వెచ్చాన్ని తీసికొంటూ బ్రతకాల్సివచ్చింది... అని ఓ ప్రక్క మనముతలపోస్తుంటే, దీన్ని విశ్వేశ్వరుని విలాసగా భావించి, తాళపత్రాలు తీసాడు. ఘంటం కదలింది. బాలకృష్ణుని చూడటానికి వెళ్ళి, కన్నయ్యను దర్శించిన శివయ్య ఆనందానికి తట్టుకోలేక, తాను కూడ ఆదివ్యాను భూతిలో **"నంద నందనుని చరిత్ర"** వ్రాశారు. ఆ కథా సుధను గ్రోలిన విష్ణుభక్తుడగు మైలారురెడ్డికే క్రీ.శ. 1426లో ఆ గ్రంథాన్ని అంకితమిచ్చి, శ్రీనాథుడు - అధమర్ణత్వాన్ని తొలగించు కొన్నాడు. ప్రౌఢ రాయల సామంత రాజు మాత్రం ఎంతకాలం దినవెచ్చమిచ్చి పోషిస్తాడో తెలియని స్థితిలో, రాజాశ్రయాన్ని కోరి పల్నాడు పయనమయ్యాడు - శ్రీనాథుడు.

దుగ్గన్నగారూ! శ్రీనాథుడు, రాజాశ్రయాన్ని పొంది సంపాదించిన ధనమంతా ఏమైందంటారు?...వారపుడిచ్చిన వరహాలను దాచుకొని ఉంటే, ఇపుడీ పరిస్థితి వచ్చి, దినవెచ్చంకోసం వెతచెందాల్సిన అవసరముండేది కాదు కదా! అని అడిగిన సందేహాల సదాశివశాస్త్రి గారి వంక చూసి, శాస్త్రి గారూ, శ్రీనాథుడు, శ్రౌతి. ధర్మశాస్త్ర మర్మపారగుడు, దైవజ్ఞుడు, పంచాంగ స్థిర మంత్రరక్షణ కళా ప్రౌఢుడైన **మామిడి సింగనామాత్యునిచే, "అనఘు"** డని పిలిపించుకొన్న బ్రహ్మజ్ఞాని, కనుకనే, ధనాన్ని దాచుకోక, ప్రభువులిచ్చిన ధనాన్నంతా, బీదలకు దానం చేసేసారు.

శ్లో॥ యాత్రా మాత్ర ప్రసిద్ధ్యర్థం స్వైః కర్మభిః అగర్హితైః ।

అక్లేశేన శరీరస్య కుర్వీత ధనసంచయం ॥ మొదలుగాగల్గిన స్మృతి రహస్యాలను పరిశీలిస్తే, ఏ రోజుకారోజే వలసినధనాన్ని మాత్రమే బ్రాహ్మణుడు సముపార్జించాలి. శరీర ధారణకు, కుటుంబ పోషణకు నిత్యకర్మానుష్ఠానానికి వలసినది మాత్రమే విప్రుడు

ధనార్జన చేయాలని చెప్పిన ధర్మశాస్త్రం, భోగాల కొఱకు సంపాదింపరాదంటూ శాసించిందన్న విషయం తమకు తెలియనిది కాదు. అందుకే శ్రీనాథ కవి చెంత మీరనుకొన్నది, చిల్లిగవ్వ కూడలేదు. కాని, విద్యాధనం అపారమైనది ఉన్నది - అనినాడు దుగ్గన్న. క్షమించాలన్నాడా శాస్త్రి గారు! తలదించుకొని మెల్లిగా "విద్యాధనం సర్వధన ప్రధానమ్" - అన్నారు. వెంటనే శ్రేష్ఠి గారు, శాస్త్రిగారూ! విద్వాన్ సర్వత్రపూజ్యతే" - అన్నారు నవ్వుతూ. దేశవిదేశాల్లో కూడ పూజింపబడేలా చేసేది "పాండిత్యమే" అంటారు. శ్రీనాథుడు, తన సుచరిత్రతో కూడి పలనాడు సందర్శించాడు. ప్రకృతిని చూస్తోంటే అసంకల్పితంగా పద్యాలు పెదాల్లోంచి దొర్లాయి. అలవోకగా పలికిన పద్యాలకు కొందరు సంతసించారు, మరికొందఱు పైపైకి మొగాలు చిట్లించినా, లోలోన నవ్వుకొన్నారు. అక్కడ కూడు, గూడు, నీడ, నీరు సరైంది లభించలేదని, చెవుల చేటల్లో చాటువుల్ని చెఱిగి పారేసాడు. నిరాశ్రయుడైన శ్రీనాథుడు - పల్నాడు నుండి ద్రాక్షారామానికి బయలుదేరాడు. మధ్యలోగల గుళ్ళు గోపురాలు దర్శించి, కృష్ణానదీ తీరంచేరి, కృష్ణానదీ జలాలలో శిరఃస్నానం చేసాడు. మనః కాంతతో కనకదుర్గమ్మను దర్శించి, నమస్కరించి, కృష్ణవేణీ నదీమతల్లి తల్లి గంగమ్మను స్మరించి, సప్తగోదావరీ సందర్శనార్థియై ద్రాక్షారామానికి బయలుదేరిన శ్రీనాథుడు, శ్రీకాకుళాంధ్రవల్లభుని దర్శించాడు. ఆంధ్ర వల్లభుని దర్శించే శ్రీనాథ కవిని చూచి, సాదరంగా సాంపరాయని తెలుంగాధీశుడు కస్తూరికాదానం చేసి వరహాలిచ్చి తన కొలువున కాహ్వానించాడు. మన్నించాడు. ఆంధ్రవల్లభుని ఆలయమే - శ్రీనాథుని కరుణాలయం, పరమప్రేమైకరసానంద వలయమగు, ఆ ముక్త్యాలయం, ఆనంద వల్లభుని సౌభాగ్యాన్ని తిలకించి పులకించి, ఆనంద వల్లభుని అభ్యుదయాన్ని "కృతిగా మలచి" ఆ **వల్లభాభ్యుదయ"** కృతిని క్రీ.శ. 1428 సం॥లో తెలుంగాధీశునకంకిత మిచ్చినాడు.

తెలుంగాధీశుని కస్తూరీ పరిమళాన్ని కొంతకాలమాఘ్రాణించి, సెలవు తీసికొని, ద్రాక్షారామ భీమేశ్వరుని దర్శించడానికి బయలుదేరాడు. మధ్యలో తీర్థాలు సేవిస్తూ, ఎట్టకేలకు ద్రాక్షారామం చేరాడు. భీమనాయకుని మహిమలు వర్ణించాడు. భీమేశ్వరుని సేవలో ఆనందించే శ్రీనాథుని రాక, అన్నయ మంత్రికి తెలిసింది. ఇతడూ పాకనాడింటివాడే! బెండపూడి అన్నయ మంత్రికి బంధువు కావటంతో, వెంటనే ద్రాక్షారామం వెళ్ళి శ్రీనాథుని దర్శించి, రాజమహేంద్రవరం రమ్మని వినమ్రపూర్వక నివేదన చేసాడు. తాను రాజమహేంద్రవర రాజ్యపాలకులైన అల్లాడ వేమ వీరభద్రారెడ్లకు మహామంత్రినని, వారు

తనను రాజ కులగురువుగా భావిస్తున్నారని చెప్పి, తమ ఆస్థానంలో తనకు సముచిత స్థానం కల్పిస్తానని మాటఇచ్చాడు. బంధుత్వానికి, వలపు పిలుపునకు, ప్రస్తుత పరిస్థితులను బట్టి అంగీకరించి, రాజమహేంద్రవరం చేరాడు. అచటానాడు పండిత మాత్సర్యం అంబరాన్ని చుంబిస్తోంది. శ్రీనాథుని చూసి, కొందఱు ఓర్వలేకపోయారు. కొందరైతే వాగ్యుద్ధాలే చేసారు. శ్రీనాథుని పాండిత్యాని కసూయ చెందినా, కవితాదిత్యుడైన శ్రీనాథుని ముందు వారంతా దివిటీలే! ఎవ్వరేమనుకొన్నా వారందరికి సమాధానం చెప్తూనే, సచ్ఛీలుడైన శ్రీనాథుడు, భీమనాయకుని మహిమలను వర్ణిస్తూనే, **ఆంధ్రదేశాన్ని**, దేశమందలి పుణ్యతీర్థాల్ని సప్తగంగా స్వరూపాన్ని వర్ణిస్తూ **భీమేశ్వర పురాణాన్ని** రచించి, తన కాశ్రయమిచ్చిన అన్నయామాత్యునకు, క్రీ.శ. 1430 సం॥లో అంకితం చేసాడు. ఆ కృతి ఆకృతిని సుకృతిగా స్వీకరించిన బెండపూడి అన్నయమంత్రి సహకారంతో, వీరభద్రారెడ్డి ఆస్థానంలో, "సాధారణ" వసంతంలోనే ప్రవేశించాడు.

కాశీలోనే శ్రీకారం చుట్టిన అయఃపిండం లాంటి కాశీఖండాన్ని, ప్రాయమింతకు క్రైవాలకుండా, కమనీయమైన కావ్యంగా సంతరింప పూనుకొన్నాడు. అపుడపుడు భీమఖండంలోని మధుర ఘట్టాలు వినిపించేవాడు. **కాశీ ఖండంలో** తాను వ్రాస్తున్న ఘట్టాలను కూడ, సదస్యులకు వినిపించేవాడు. సాహిత్య కళాసంగీత లక్ష్య లక్షణ భంగీసర్వజ్ఞుడు విమలపాండిత్యుడు, కళాభోజుడు, ధారాధర ధారాధర ధారాధర వాహదాన ధారానిధియైన కారుణ్యపోథోనిధానుడైన వీరభద్రారెడ్డి విద్వాంసుడే శ్రీనాథ వైదుష్యాన్ని మెచ్చుకొని సత్కరించాడు, **అని చెప్పిలేచాడు. అంతా భోజనాలకు** వెళ్ళారు.

5. ముత్యాలశాలలో **ఐదవరోజు** వాదసభా ప్రారంభానికి సూచనగా ఘంటారావం మ్రోగింది. నాలుగు రోజుల నుండి ముత్యాలశాలలో, డిండిమభట్టు - శ్రీనాథభట్టు వాదోపవాదాలు చేస్తున్న విషయం నలుమూలలకు పాకింది. అటు రాజమహేంద్రవరం నుండి కూడ పండితులు వచ్చారు. ఇద్దఱికిద్దఱే, తప్పక వారి వాదనలు వినాలనే కోరికతో చాలామంది ముత్యాలశాలకు రావటంతో, ఇసుకేస్తే రాలనంత జనంతో ముత్యాలశాల నేత్రోత్సవముగా ఉంది. వందిమాగధులు జయజయధ్వానాలు చేస్తోంటో ప్రౌఢ దేవరాయలు ముత్యాలశాల వేదికపైకి వచ్చి తమ సువర్ణ సింహాసనంలో ఆసీనులయ్యారు.

సాహిత్య పోరాటపటిమను సందర్శించాలని పండిత ప్రకాండులు, కవిపుంగవులు, శాస్త్రజ్ఞులు, భిషగ్వరులు, ఇంకా ఎందరో మహానుభావులు బారులుతీరి కూర్చున్నారు.

సచివ సైన్యాధీశ సామంత నృపవర సీమంతినీ జనశ్రేణి సదస్సును తిలకిస్తున్నారు.

డిండిమం మ్రోగుతుంటే, కైవారాలు పల్కుతుంటే, ధీమాగా డిండిమభట్ట కవిసార్వభౌముడు వచ్చి స్వర్ణసింహాసనంలో కూర్చున్నాడు. గీర్పతి వచ్చి కూర్చున్నట్లున్నది. పుంభావ సరస్వతిలా వచ్చి శ్రీనాథుడు కూర్చున్నాడు. ధర్మపీఠాధ్యక్షులుగా చంద్రభూష క్రియాశక్తి రాయలవారాశీనులైయున్నారు. సాక్షాత్తు వారు న్యాయదేవతాస్వరూపులు. డిండిమభట్టు ప్రజ్ఞాపాటవాలు చూసి, వాదం పెట్టుకొంటే, ఇలాంటి విద్వత్కవితోనే, ఇలాంటి వైభవోపేతమైన ముత్యాలశాలలోనే, రాయలవంటి రసజ్ఞ శేఖరుల సన్నిధిలోనే ఇంతటి ఛాందసుల, శ్రోత్రీయుల, సరసరసజ్ఞులైన సదస్యుల సన్నిధిలోనే వాదం పెట్టుకొని, విజయ దుందుభి మ్రోగించాలి. నాల్గురోజుల నుండి వాదసభ జరుగుతూనే ఉంది. వేదాలు, వేదాంగాలు, ప్రస్థానత్రయ రహస్యాలు, ఒకటేమిటి చాల విషయాల్లో తమకున్న దిటవు బలుపును చూపుకొంటున్నారు. వ్యాకరణాంశాలు, శ్రుతి రహస్యాలు, పూర్వోత్తం మీమాంసాశాస్త్ర హృదయాలు, వాడిగా వేడిగా చర్చించారు. వారికి ఖండన మండనాలు కండఖాద్యాలు. అహమహమికతో అహోపురుషికతో ఒకరిపైన ఒకరు వాదాస్త్రాలు ప్రయోగించుకొంటున్నారు. గిరి గిరిపైబడినట్లు, కరి కరిపై మకరి మకరిపై తలపడినట్లు వారి చర్చా సమరం, రసవత్తరంగా సాగుతోంది.

ధర్మపీఠాధ్యక్షులు, డిండిమభట్టారకుని చూచి, **"కిమీశ్వర స్వరూపమ్? కింవాతద్వాచకమ్?** అనటంతోనే, "క్లేశ కర్మ విపాకాశాయై రపరామృష్టః పురుష విశేషః – ఈశ్వరః" ॥ "నిత్యజ్ఞానాధి కరణమితినైయాయికాః అని తెలిపి, వాటిని వివరించి, వానిని తెలిపే వాచకము "ఓం" కారమని వివరించెను. అదే ప్రశ్నకు సమాధానంగా అంతటా ఎల్లప్పుడూ ఉండే ఈశ్వరుడే పరమాత్మయని, ఆ పరమాత్మను అధర్వణ వేదమంత్రం చక్కగా వివరించిందని, మంత్రాన్ని మంత్రార్థాన్ని వివరించాడు, శ్రీనాథభట్టు. "ఓం" – అయమాత్మా బ్రహ్మ – ప్రణవస్వరూప పరబ్రహ్మ ఆత్మ స్వరూపమే. "ఓమ్ – ఖం – బ్రహ్మ" అని యజుర్వేదము – అని డిండిములు వివరించారు. "ప్రణవం హి ఈశ్వరం విద్యాత్, సర్వస్యహృది సంస్థితం। సర్వ వ్యాపిన మోంకారం మత్వాధీరోనశోచతి । – ఓంకారం – సమస్త ప్రాణుల హృదయాలలోనున్న ఈశ్వరునిగా తెలిసికొన్నవాడే ధీరుడు. వాడు దుఃఖించడు. ఓంకారాన్ని జపించుటయే ఈశ్వరభావన, "తస్యవాచకః ప్రణవః " – అని – పతంజలి యోగ దర్శనమున పలికినాడు. నాంతః ప్రజ్ఞంన బహిష్ ప్రజ్ఞం నోభయతః ప్రజ్ఞం, నప్రజ్ఞాన ఘనం, న ప్రజ్ఞం నాప్రజ్ఞం, అదృష్ట మవ్యవహార్య

మగ్రాహ్య మలక్షణ మచింత్య మవ్యపదేశ్యమేకాత్మ ప్రత్యయసారం ప్రపంచోపశమం శాన్తం శివం అద్వైతం చతుర్థం మన్యన్తే స ఆత్మాసవిజ్ఞేయః - అని పరమాత్మని, అధర్వణవేద మంత్రం నిర్వచించినది. ఓంకార వివరణ కలది మాండూక్యశ్రుతి. వేదాలు ఓం కారమే మొదటివిగా గలవి. ప్రణవం చేతనే వేదాలు సమాప్తి చెందుతున్నాయి. సమస్త వాఙ్మయం, ఓంకార స్వరూపమే ప్రణవజపమే పరమేశ్వర సాక్షాత్కారానికి మూలాధారమని శ్రీనాథుని చిక్కని వక్కణ పరమేశ్వర సాక్షాత్కారానికి ప్రణవ జపమే ప్రధానమని వివరించారు. గీతాచార్యులు, "ఓం" కారం గురించి ఏమని చెప్పారు? అని గురుబ్రహ్మ ప్రశ్నిస్తే **"ఓమ్ ఇత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహరన్ మామనుస్మరన్ యః ప్రయాతి త్యజన్దేహం సయాతి పరమాం గతిమ్"** - అని పల్కిన డిండిములు. ఓమ్ - అనే ఏకాక్షరమైన ప్రణవ మంత్రాన్ని జపిస్తూ, ప్రణవార్థమగు పరబ్రహ్మను ఎవడు బాగుగ చింతిస్తూ ఉంటాడో, అట్టివాడు మోక్షాన్ని పొందునని గీతాచార్యులు వివరించారు. అందువలన ప్రణవ జపమే ముక్తికి మూలమన్నారు డిండిమభట్టు.

డిండిమభట్టు గారు, జపం చేస్తే ముక్తియని చెప్పినంతమాత్రం చేత ముక్తిరాదు. త్రికరణ శుద్ధిగా విషయ వాంఛలను విడనాడి నిష్కామ బుద్ధితో ధ్యానించాలనే రహస్యాన్ని మామ్, అనుస్మరన్ - అనే పదాల ప్రయోగం వలన చెప్పటం జరిగింది. నిధి ధ్యాసి తవ్యమే ప్రణవము.

"ఆత్మావాఽ రే ద్రష్టవ్యః శ్రోతవ్యోమన్తవ్యోనిధి ధ్యాసి తవ్యః" - అను శ్రుతి వలన, శ్రవణ మనన నిధిధ్యాసా ప్రస్థానత్రయమే, ఆత్మ దర్శన హేతువని సుస్పష్టమౌతోంది. కనుక కేవల జప, తపాదుల వలన ముక్తిసంభవింపదనుట నిశ్చయమని శ్రీనాథ పండితుడు డిండిమ భట్టారకుల సిద్ధాంతాన్ని ఖండించాడు.

శ్రీనాథ కవీ! యుద్ధం చేయటానికే కౌరవపాండవులు కురుక్షేత్రానికి వచ్చారు. కౌరవ సేనావాహినిని, భీష్మాది కురువృద్ధుల్ని చూచి అర్జునుడు యుద్ధం చేయను, వీరిని చంపి, ఈ రక్తపుకూడు తినటం కంటే, భిక్షాటన చేసికొని బ్రతుకుటమేలన్నాడు. ఆ సమయంలో చేతిలోని గాండీవం జారింది. నోరుపిడచకట్టుకుపోతూంటే, చతికిలపడ్డ అర్జునునికి, కర్మచేయుట యందేనీకధికారముంది, ఎపుడూ ఫలాన్ని ఆశించకంటూ, నీ కర్మ నీవు చేయుమన్నాడు. అనటమే కాదు, యుద్ధ కర్మ చేయించాడు - ఒకరోజా, రెండు రోజులా పద్దెనిమిది రోజులు యుద్ధం చేయించి, రాజ్యాన్నిప్పించాడు. కనుక గీతాసందేశం కర్మానుష్ఠానమేనని యుక్తి యుక్తముగా వాదించారు డిండిమభట్టారకులు.

"**కర్మణ్యేవాధికారస్తే మాఫలేషు కదాచన,** మా కర్మఫల హేతుర్భూః మాతే సంగోస్త్వకర్మణి" - అని పల్కిన అరుణగిరినాథులు - అర్జునా! నీకుకర్మ చేయుటయందే అధికారం ఉంది, కర్మఫలాన్ని ఆశించటంలో నీకు అధికారం లేదు అని చెప్తూనే, కర్మలు మానుటయందు నీకు ఆసక్తి కలుగకుండా ఉండాలి అని వివరించి, "కురు కర్మాణి" కర్మలను చేయుము, అని క్షత్రియ ధర్మాన్ని గుర్తుచేసి యుద్ధ కర్మ చేయించాడు. ధ కారంతో ప్రారంభించిన గీత, మ కారంతో పూర్తయింది. ఇది "ధమ" గ్రంథం - అంటే ధర్మగ్రంథమే. స్పష్టత కోసం - "ధర్మ" శబ్దంతోనే గీత ప్రారంభమైంది. అర్జునుని స్వధర్మం క్షత్రియ ధర్మం. అధర్మాన్నుండి కాపాడుట క్షత్రియ ధర్మం కనుక "శ్రేయాన్ స్వధర్మో విగుణః" - అనటమేకాదు, "పరధర్మం భయంకరమైనదన్నాడు". "స్వధర్మేనిధనం శ్రేయః - అని కన్నయ్య, క్షత్రియోచిత కర్మను చేయించాడు. కనుక కర్మానుష్ఠానమే గీతాలక్ష్యమని, ఇది ధర్మజిజ్ఞాస గల గీతా శాస్త్రమని డిండిమభట్టారకుడు వాదించెను.

శ్రీకృష్ణుడు, అర్జునుని యుద్ధము చేయుమని, కురుక్షేత్రానికి తీసికొని రాలేదు. యుద్ధం చేయాలని తానే నిశ్చయించుకొని శ్రీకృష్ణుని మందిరానికి వెళ్ళి, పాదాలాశ్రయించి, సారధిగా రమ్మని ప్రార్థించినాడు. ఊరక చూచుదునన్నవానిచే సారధ్యం చేయించినవాడు అర్జునుడే! యుద్ధభూమిలో అందరినీ చూడగానే, అందరినీ చంపి రక్తపు కూడు తినుటకంటె భైక్ష్య మేమేలనుకొనిన అజ్ఞాని. ఆత్మలన్నీ నశిస్తాయి, నేను చంపనని చతికిలపడ్డవాడర్జునుడే! - ఆ సమయంలో మబ్బుగా వచ్చిన అర్జునుని అజ్ఞాన మోహాన్ని పోగొట్టినవాడు శ్రీకృష్ణుడు. మోహంపోయాక తనంతట తానే యుద్ధం చేసాడు. కృష్ణుడు చేయుమని చెప్పలేదు. నీటి తూములో రాయి అడ్డుపడితే, నీటి ప్రవాహం ఆగిపోతుంది. వెంటనే మనం అడ్డుపడ్డ రాయితీసేస్తాం, దాంతో నీరు ప్రవహిస్తుంది. ఇచట మనం నీటిని ప్రవహింప చేయటం లేదు. అడ్డుమాత్రమే తొలగిస్తున్నాం. అర్జునుని అజ్ఞానమనే అడ్డుని తొలగించాడు కృష్ణుడు, దాంతో పార్థుడు యుద్ధం చేసాడు.

"కార్పణ్యదోషోపహత స్వభావః, పృచ్ఛామిత్వాం ధర్మసమ్మూఢ చేతాః, యచ్ఛ్రేయ స్యాన్నిశ్చితం బ్రూహి, తన్మే, శిష్యస్తేహం, శాధి మాం త్వాం ప్రసన్నమ్" ॥ - అజ్ఞానం ఆవరించటంచే ధర్మం ఏమిటో తెలీక మోహం కలిగింది. నేను నీశిష్యుణ్ణి! మోహంపోయేలా బోధించి, శాసించు అని, మోహం ఆవరించిందని, శాసింపుమని కోరాడు. గీతాబోధ విన్నతర్వాత "**నష్టోమోహః స్మృతిర్లబ్ధ్వా త్వత్ప్రసాదాన్మయాచ్యుత**" - అని పార్థుడు శ్రీకృష్ణుని బోధ వలన, తనకు మోహం పోయిందని, ఆత్మజ్ఞానం కలిగినదని స్పష్టం చేసాడు.

అజ్ఞాన మోహాన్ని పోగొట్టేది - జ్ఞాన బోధయే కాని మరొకటేదీ కాదని ధర్మశాస్త్రజ్ఞులకు తెలియకపోదు. కనుక గీతాబోధ, కర్మ చేయించటం కాదు. భగవానుడే స్వయంగా తాను చేసిన బోధ - జ్ఞానమేనని, - "ఇతి తే జ్ఞానమాఖ్యాతం గుహ్యాత్ గుహ్యతరంమయా! విమృశ్యైతదశేషేణ, **యథేచ్ఛసితథాకురు"** - రహస్యాతి రహస్యమైన ఈ జ్ఞానాన్ని ఉపదేశించాడని, దానిని విమర్శించి అర్జునుడు తనకిష్టమొచ్చినట్లు ప్రవర్తింపవచ్చునని స్పష్టమవుతోంది. యుద్ధం చేస్తావో? - భిక్షాటన చేస్తావో, నీకేది యుక్తమని తోస్తే దానినే చేయుమని చెప్పాడే కాని, యుద్ధము చేయుమని ఆదేశింపలేదు. పార్థుడు తనంతట తానే యుద్ధం చేసినాడు - అని చెప్తూంటే, శ్రీనాథ కవీ! శ్రీకృష్ణుడు, అర్జునునితో యుద్ధము చేయుము - "యుద్ధస్వ" - అని పలుమార్లు చెప్పిన విషయాన్ని విస్మరిస్తున్నారేల? అని పల్కినంత, డిండిమభట్టారకా! "యుద్ధస్వ" - యుద్ధము చేయుము - అనిన మాట యదార్థమే, కాని, ఆ శ్రీకృష్ణుని బోధ అనువాదమే కాని, విధికాదు. ఒకడు త్రోవలో వెళ్తూ, కొంతదూరం వెళ్ళాక రెండు మార్గాలు కనబడితే, ఏమార్గాన వెళ్ళాలో సందేహం కల్గినపుడు - ఏ త్రోవలో వెళ్ళాలని అచటి వారినడిగితే వారు, ఈ త్రోవవనిపో - అని సందేహ నివారణ చేసినట్టిది. ఇచట పోవుటను విధిగా బోధించలేదు. అది అనువాదము మాత్రమే. పరధర్మమైన భిక్షాటనం తప్పు, స్వధర్మమైన యుద్ధమే శ్రేయస్కరం - అను శ్రీకృష్ణుని జ్ఞాన బోధ వలన, అర్జునుడు నిశ్చయించుకొని యుద్ధం చేసాడు. నీకు అజ్ఞానం వల్ల కలిగిన మోహం పోయిందా - కశ్చిత్ అజ్ఞాన సమ్మోహః ప్రణష్టస్తే ధనంజయ! - అని అడిగిన కృష్ణునితో, నామోహం పోయింది. ఆత్మజ్ఞానం కలిగింది - నష్టోమోహః, స్మృతిర్లబ్ధ్వా - అని సమాధానమిచ్చాడు. కనుక పూర్వాపరాలనన్నీ యోచన చేస్తే - కర్మానుష్ఠానం కాదని, జ్ఞాన బోధయే గీతాలక్ష్యమని తేట తెల్లమవుతోంది. డిండిమభట్టుగారు, ఇచట మరొక విషయాన్ని గమనించాలి. భగవద్గీతలో గల ఏడువందల శ్లోకాల్లో ఎక్కడా కూడా శ్రీకృష్ణ ఉవాచ - అని అనలేదు. భగవాన్ ఉవాచ - అని చెప్పటంలోని ఆంతర్యం, జ్ఞాన స్వరూపుడే భగవంతుడు కనుకనే "భగవాన్" అని తెల్పినారు, భగవాన్ వ్యాసమహర్షి తమ శతపర్వసంహితలో భీష్మ పర్వము నందలి భగవద్గీతలోనని అస్మదాదుల యభిప్రాయం.

మరొక్క విషయాన్ని కూడ, గమనించాలి. సాక్షాత్తు కర్మానుష్ఠానం వల్లనే మోక్షం సిద్ధించదు. అలాగని కేవలం భక్తి ప్రబోధం వల్ల ముక్తిరాదు. భక్తి యొక్క ఫలం, జ్ఞానోదయమే కాని సాక్షాత్తు కైవల్యం కాదని గ్రహించాలి. - "భక్త్యా మామభిజానాతియావాన్ యశ్చాస్మితత్త్వతః (18-55) - భక్తిచే నేనెంతటివాడనో, నేనెట్టివాడనో, నాప్రభావం

తాత్వికంగా తెలిసికొంటున్నాడని చెప్పుటవల్ల జ్ఞానానికి భక్తి సాధనమేనని తేలుతోంది. అలాగే కర్మకూడ జ్ఞానమునకు సాధనం. కర్మవలన భక్తి, తద్వారా జ్ఞానం కల్గి - జ్ఞానం వల్లనే మోక్ష ప్రాప్తి - అనేది సుస్పష్టం. అందువల్లనే శంకర భగవత్పాదులు, **"జ్ఞానాదేవహికైవల్యం".** - అన్నారు, అని శ్రీనాథభట్టు, డిండిమభట్టారకుల కర్మానుష్ఠాన వాదాన్ని త్రోసిరాజన్నారు. వినిన విజ్ఞులంతా కరతాళధ్వనులు చేసారు. సభ ముగించే ముందొక పద్యమన్నారు, సదస్యులు.

శ్రీనాథ కవీ! మనం సదస్యుల కోర్కెను మన్నించాలి. మీరు, భీమేశ్వర పురాణంలో వర్ణించిన **ఆంధ్రమండలాన్ని** దర్శింపజేయండి.. అంటూ మహామంత్రి పలికిన పలుకుల్లోని ప్రేమానురాగాలు, శ్రీనాథుని హృదిని దోచుకొన్నాయి. శ్రీనాథుడు సీసపద్య సింహాసనాధిష్ఠుతుడయ్యాడు.

సీ॥ ఆంధ్రభూభువన మధ్యము పుండరీకంబు
సప్త గోదావర జలము తేనె,
బ్రహ్మసంవేద్యాది బహు తీర్థములు రేకు
లకరులు చారుదివ్య స్థలములు
నాళంబు లవణాబ్ధి వేలా విభాగంబు
కళ్యాణ భోగ మోక్షములు తావి,
దక్షవాటీ మహాస్థానంబు కర్ణిక
హంసంబు భీమనాయకుడు శివుడు
తే॥గీ॥ గౌతమీసింధు కౌంతేయ కణ్వనదులు
తుల్య భాగయు నేలేఱు దుమ్మికొనలు
భువన సంభావ్యమైన యీ పుణ్యభూమి
యనఘ ! సంసార తాప శాంత్యౌషధంబు ।

భీమఖండం-3-50

ఆంధ్ర భూమండల మధ్యము - తెల్లని శతపత్ర పద్మం. సప్తగోదావర సరస్సులో గల జలమే. ఆపద్మంలోని మకరందం, బ్రహ్మసంవేద్యం వంటి అనేక తీర్థాలు ఆ పద్మానికి గల రేకులు. పవిత్రమైన పుణ్యక్షేత్రాలే కింజల్కాలు. లవణ సముద్రము, తామర కాడ. మంగళకరములైన భోగ, మోక్షాలే అందలి సుగంధం। ద్రాక్షారామమే దాని మధ్యన గల దుద్దు। భీమేశ్వరస్వామియే రాజహంస। గోదావరి కౌంతేయ కణ్వనది తుల్యభాగ, ఏలేరు,

అనునదులు ఆ పద్మం చుట్టూగల శైవాలలతా సముదాయం. సమస్తలోకాలచే పూజింపతగిన పుణ్యప్రదేశమౌ ఈ **ఆంధ్రదేశము** - జనన మరణాది రూపమగు సంసారంలో కలిగే ఆధ్యాత్మిక, ఆధిదైవిక, ఆధి భౌతికాలను తాపత్రయం, ఉపశాంతమగుటకు ఔషధమన్నాడు శ్రీనాథుడు.

ఈ భీమమండలాన్ని భోగ మోక్ష నిలయం చేసిన మంగళోత్సంగ గౌతమీ గంగ. ఆ గోదావరీ నది త్ర్యంబకాచల శిఖరాగ్రాన జన్మించి, క్రమంగా వృద్ధి చెంది ఆర్యావర్తం సమీపించి, అటనుండి తిరిగి దండకారణ్య మధ్య భాగంలో గల పాపికొండల్ని ఒరసికొంటూ ప్రవహించి, పట్టిస పర్వతంపై నెలకొన్న శ్రీవీరభద్రేశుని సేవించి, తిలసోమనాధస్వామి వారి ఆలయాన్ని సమీపించిన ఆ గోదావరీ నది అనంత భోగేశ్వరస్వామి చెంతకు విజృంభించివచ్చి, అట నుండి రుద్రపాదాలపై త్రోవగా ప్రవహించి, కోటి జన్మల పాపాన్ని పోగొట్టి, కోటి ఫలాలనిచ్చే సోమేశుని మృదు పాదాలకు మ్రొక్కి, కుండలాముఖ తీర్థంలో గల కుండలేశ్వరుని అభిషేకించి, భీమమండలం ప్రక్కగా వెళ్ళి సముద్రుని కౌగిలించుకొంది.

అదిగో అదే పట్టిస పుణ్యక్షేత్రం. అదిగో చూడండి, అక్కడే శశిరేఖ శిరస్సున వీరభద్రేశ్వరస్వామి ఉన్నాడు అదే పద్మాద్రి. దానిపై మార్కండేయ మహర్షి ఇలువేల్పగు శివుడు పూర్వం వెలసెనండీ! అదిగో అదే, కుమారారామం. ఆ భవన సముదాయమే చాళుక్య భీమేశ్వరస్వామి ఆలయం. ఆ కనబడేదే కుక్కుటేశ్వరం. దాని సమీప భవనమే హుంకారిణీ దేవి సభా భవనం. తర్వాత వచ్చాం, చూసారా అదే, పలివెల కొప్పులింగేశ్వరస్వామి ఆలయం. అదే గౌతమీగంగ, సాగరసంగమ సమీపాన గల బ్రహ్మాసంవేద్య పుణ్యక్షేత్రం. ఆ దెస చూసారా, అదే కోటిపల్లి అదిగదితో ఆ కనబడేదే ద్రాక్షారామ పట్టణం, అదిగో చూడండి - ఆ ఆలయాల్లో మిక్కిలి ఎత్తైన భీమేశ్వర లింగం ఎలా విలసిల్లుతోందో। ఆ దేవాలయం గల పర్వతం ఇదే। ఇదిగో చూడండి - ఏకాగ్రతతో. ఇదియే **సప్తగోదావరీ ప్రవాహం...** అంటూ నేత్రానందం గావించాడు అని భావించిన సదస్యులు, శ్రీనాథుని యసాధారణ ప్రజ్ఞకు జోహార్లర్పించి, పద్యం విన్నారు.

మ॥ అదె సం వేద్యము, కోటిపల్లియదె, దక్షారామ మన్పట్టణం
బదె, యభ్రంకష సౌధ కూట ఘన హేలావాస, ముచ్ఛాయసం
పద, సొంపారెడు భీమలింగము, మహాప్రసాద భూమీ ధరం
బిది, సప్తర్షినదీ ప్రవాహమిదె, సంవీక్షింపు మేకాగ్రతన్ ॥ -3-54

సదస్యుల కరతాళధ్వనులతో ముత్యాలశాల మురిసింది. శాంతి మంత్ర సుమం విరిసింది.

శ్రీనాథ బుధోత్తముడు, వఱువాత మేల్కొంచి కాలకృత్యాలు తీర్చుకొన్నాడు. ముత్యాల జాలీల ముద్దుగుల్కు ముత్యాలశాలకు మోదుపులిడి, నిండు చందురుని వెన్నెలవంక తొలకరి మబ్బును మెఱుపుతీగవలె కలసి మెలసి కాపురం చేసే అనుకూలవతి ఇచ్చిన పంచపాత్ర గ్రహించి సంధ్యావందనాదులలో నిమగ్నమయ్యాడు.

ముత్యాలశాల ముందరి వంకనున్న ఉద్యానవనం నందనోద్యానవనంలా ఆకర్షిస్తోంది. అందున్న సరస్సులో పక్షులు మునిగి తేలుతూ, జలచరాలను భక్షిస్తూ, కేరింతలు కొడుతూంటే, వాటి రెక్కల చప్పుళ్ళకు సంగీత స్వరాలు వినబడుతూంటే జలజలమంటున్న జల, జలజ ధ్వనులు రవ్వంత కవ్వింత చేస్తుంటే, నీటి తుంపర్లు జలకాలాడే జలజాంగనల క్రీడా వినోదాల నందిస్తూంటే, అందున్న తామరపూలలోని మకరందాన్ని గ్రోలి మత్తెక్కి ఝుంఝుం ఝుంమ్మను తుమ్మెదల నాదాలు, వేదాలు వల్లిస్తున్నట్లు హాయిగొలుప, ఎగిసి ఎగిసి పడుతూ, ఈతలాడు బేడిస చేపల్లా, సారసాంగనలు ఈదులాడి సువాసనలతో రాణిస్తూ, కర్పూరాన్ని పరస్పరం జల్లుకొని, రకరకాల పూలు కోసికొని, దండలు గ్రుచ్చి, కొప్పున దాల్చి, వెళ్ళిన యడుగు జాడలను గమనిస్తూ, కర్పూర సౌగంధ్యాన్నా ఘ్రాణిస్తూ, దుగ్గన్నతో కలసి శ్రోతవ్యులైన ఆశుతోషులంతా, ఆ సరోవర తీరం చేరి ఆశీనులయ్యారు.

కొంత తడవు వారంతా సాహిత్యపు ముచ్చట్లు చెప్పుకొన్నారు. శ్రీనాథుడు, "ముక్కంటీ! నీకు మ్రొక్కెదను! శివా! నీకు నవాంజలి! భవా! నీకు నభివాదనంబు! పాండురాంగా! నీకు దండంబు! రాజశేఖరా నీకు జేజే! హరా, నీకు జోహారు, గిరీశా నీకు వరివస్య, గౌరీ మనోహరా నీకు నమస్కారంబు... అని ఎన్నోవిధాల గద్యపద్యాలలో శివభక్తి చూపి, యోగ నిద్రనుండి మేల్కొనే మహా విష్ణువును – "వర్ణించి"... నేను విష్ణుండ... నాకు విష్ణువునకు భేదంబు లేదు" అని శివునిచే ప్రకటింపజేయించి. హరిహరా భేద తత్వాన్ని స్పష్టం చేసిన కవీశుడని చెప్పాడు దుగ్గన. శ్రీనాథ కవికి హరిహరా భేదం లేదు. కాని, **"తథాపి భక్తి స్తరుణేందు శేఖరే"** యన్న ఆదిశంకరుల బాటయే శ్రీనాథునికి పూలబాటయై **ఈశ్వరార్చన కళాశీలుడైనాడన్నాడు.**

శ్రీనాథుడు, శైవ వైష్ణవ క్షేత్రాలన్నింటినీ సమ దృష్టితో దర్శించిన మహాకవి. కోటిపల్లి, కుండలేశ్వరం, పలివెల, ఏడిద, తాళ్ళపూడి, పట్టిసం, పాలకొల్లు, గుడుపూడి, భీమవరం, అమరావతి, శ్రీశైలం, ద్రాక్షారామం, కుమారారామం, కాశి వంటి శైవ పుణ్యక్షేత్రాలతో బాటు, శ్రీకృష్ణుడు వెలసిన క్షేత్రాలను, శ్రీకూర్మం, సింహాచలం, పిఠాపురం వంటి క్షేత్రాలలో

వెలసిన వైష్ణవ మూర్తుల్ని దర్శించి కీర్తించాడు... అంటూ శ్రీనాథుని భక్తి తత్పరతను మంచినడవడిని వివరిస్తూ, శ్రీమద్రామాయణాన్ని చదివాను, శ్రీనాథుడు రచించిన "రామాయణము", పాట కూడ చదివాను, రెండూ ధర్మా ్యమృత కలశాలే! శ్రీరాముడు ఏకపత్నీవ్రతుడు, సీతాదేవి మహాసాధ్వి - వారిద్దరినీ మనం చూడలేదు, కాని వారి గుణగణాలు విన్నాం. నిజంగా, వారే శ్రీనాథుని గాను, శ్రీలక్ష్మిగాను, ఈ కలిలో మన కండ్ల ఎదుటనే అవతరించారు. ధర్మపరాయణులై, మానవ ధర్మాలను బోధించాలని గ్రంథాలు రచిస్తూ, వారు ధర్మాలనాచరిస్తూ సంచరిస్తూ, మనకు దర్శన భాగ్యాన్ని కల్గిస్తున్నారు. అజ్ఞానంతో, ఈ ఉదంతాన్ని తెలిసికోలేక, అసూయతో కొందరు, రాజమహేంద్రవరంలో వాచాలురై పలికితే, వారిని కూపస్థమండూకాలన్నారు.

గీ॥ "నికటమున నుండి శ్రుతిపుట నిష్ఠురముగ
నడచి కాకులు బిట్టుపెద్దఱచినప్పు
డుడిగి రాయంచయూరకయుంటలెస్స !
సైప రాకున్న నెందేని జనుట యొప్పు ॥ 1-14

గీ॥ బోధ మల్పంబు గర్వమభ్యున్నతంబు
శాంతి నిప్పచ్చరంబు, మచ్చరము ఘనము
కూప మండూకములు బోలెగొంచెమెఱిగి
పండితంమన్యులైన వైతండికులకు । 1-13

రాజమహేంద్ర పురంలోని కవిపండితులకు శ్రీనాథుని పేరు వింటే చాలు, వారి గుండెలు దిగ్గురంటున్నాయి. వారిని చూస్తుంటే జాలిపుడుతోంది. వీరభద్రారెడ్డి కొలువులోనే ఉండి, ఆతని మంత్రి శివదీక్షా దక్షతను కొనియాడిన రోజులు, ఆతని కోరిక మన్నించి, భీమేశ్వరపురాణాన్ని అంకితం చేసిన మధురస్మృతులు గుర్తుకొచ్చాయి. ఒక్కసారి రాజమహేంద్రవర వైభవాన్ని తలచి వినిపించాడు.

సీ॥ కమలాచలాగ్ర మార్కండేయ శివశిర
శ్శశిచంద్రి కా ధౌత సౌధవీధి
గోదావరీపుణ్య కూలంకషాజల
స్ఫాలిత శ్రీ రుద్ర పాదయుగళి
బలవదభ్యున్నత ప్రాకార పరివేష
గండూషితా జాండ మండలంబు

గంధ దంతావళ గ్రైవేయ ఘంటికా
ఠంకార ముఖర ఘంటాపథంబు

తే॥ గీ॥ రాజ బింబాననా నూత్న రత్నపేటి
వీర రాహుత్త సుభట కంఠీరవాద్రి
వేమ భూపాల రాజ్యాభివృద్ధి కరము
సాంద్ర విభవంబు రాజమహేంద్రవరము 1-43

సమస్త విద్యలకు నికషస్థానమైనట్టిది. గీర్వాణ వాగ్విలాసానికి కళాపోషణకు విడిది పట్టగు రాజమహేంద్రపురంలోని రాజాస్థానంలోనే, శ్రీనాథకవి ఉండి, అటు ద్రాక్షారామ భీమేశ్వరుని సందర్శించుకొంటూ, ఇటు మార్కండేయ స్వామిని అభిషేకించుకొంటూ, కాశీ ఖండమహాకావ్యాన్ని రచించుకొంటున్నాడు. ఈశ్వర సంకల్పంతో పదకొండవ శతాబ్దిలో, రాజమహేంద్రపుర రాజ్యాన్ని పరిపాలించిన రాజరాజ నరేంద్రుని యాస్థానంలో పంచమవేదమైన వ్యాస మహాభారతాంధ్రీకరణకు శ్రీకారం చుట్టి, కొంత భాగాన్ని రచించి, తిక్కన ఎఱ్ఱనలకు దారి చూపిన నన్నయభట్టును మన శ్రీనాథ భట్టు, కందంలో కొలిచి వినువిందుచేసాడు.

కం॥ నెట్టుకొని కొలుతు నన్నయ
భట్టోపాధ్యాయ సార్వభౌముని కవితా
పట్టాభిషిక్తు భారత
ఘట్టోల్లంఘున పటిష్ఠగాధ ప్రతిభున్.

ప్రౌఢ నిర్భర వయః పరిపాకంతో భీమనాయకుని మహిమను కొనియాడిన శ్రీనాథునకొక ఆలోచన తళుక్కున మెరసింది.

శ్రీ విద్యానగర ప్రభువులైన ప్రౌఢ దేవరాయల యాస్థాన విద్యాధికారి, గౌడ డిండిమభట్టు భరతం పట్టించి, సకల కళా నిలయమైన ముత్యాలశాలలో సకల శాస్త్రాలలో అతనిని ఓడించి, కనక స్నానం చేయాలనే జిగీష పొడమింది. అదే సమయాన సాహిత్య జ్ఞాతులకు కన్నులెఱ్ఱబడ్డాయి. "జ్ఞాతిశ్చేదనలేనకిమ్" – అనుకొన్నాడు. పండితప్రభువులకే అసూయతాండవించటంతో, వారి వెక్కిరింపులు, ఇగివింతలు, లెక్కచేయని శ్రీనాథుడు తన ఛలోక్తులతోను చటూక్తులతోను, ధిక్కరించాడు. విద్వత్కవి సింహమై గర్జించాడు. కుకవి మత్తేభాలకు సింహస్వప్నమై భాసిల్లాడు. తనంతటి వాడైన అరుణగిరినాథుని ఓడించిన గాని తృప్తి లేదని భావించి విజయనగరానికి కుటుంబినితో పయనమై వస్తూ, దారిలో

వినుకొండ చేరి, సత్రంలో బసచేసాడు. ఆతనిరాక వల్లభుడు విన్నాడు. శ్రీహరి మిశ్రాచార్యుల చెంత షడ్దర్శన మర్మాలనధ్యయనం చేసిన సహపాఠి శ్రీనాథుని రాకను విని, సత్రానికేగి, సాదరంగా తన మిద్దెకాహ్వానించాడు. అర్ఘ్యపాద్యాలనిచ్చి సత్కరించి, షడ్రసోపేత భోజనం పెట్టి సంతుష్టి పఱచాడు. చెదురు మదురుగా పడివున్న పద్యాల నేర్చికూర్చి శ్రీనాథునికి వినిపించాడు. వల్లభుడు సహపాఠియైనా వృత్తి రీత్యా కవితకు దూరమైన విషయాన్ని గ్రహించాడు. తానే ఆతని పద్యాలను సరిచేసాడు. కొన్ని పద్యాలు చెప్పి, అందు చేర్పించి **"క్రీడాభిరామం"** అను పేరు పెట్టినాడు. ఇది సంస్కృతంలోని ప్రేమాభిరామానికి అనుసరణలాంటిదేనన్నాడు. నాటి ఓరుగల్లు ప్రకృతి కొక కాశీపటం లాంటిదని ప్రశంసించాడు. దాంతో "శిష్యస్తేహం, శాధి మాం"...అంటూ కవితలోని మెలకువలను మరి కొన్ని తెలిసికొని మరికొన్ని మెఱుగులు దిద్దించుకొని, మెచ్చుకొని గ్రచ్చుకొన్నాడు. కవికి, తన కవిత విని మెచ్చుకొనేవారు దొరికితే మురిసిపోవటమే కాదు, వానికి భోజనం పెట్టి సన్మానం కూడ చేస్తారు. అలాంటివాడే వల్లభుడు, ప్రౌఢరాయల కొలువులో పలుకుబడి గల పెద్దమనిషి వల్లభుడని, మోపూరుపై అధికారియని, కొంగ్రొత్తగా మంత్రి పదవిని పొందిన మహనీయుడని తెలిసికొని, క్రీడాభిరామానికి కొన్ని పద్యాలు బహూకరించాడు. దాంతో క్రీడాభిరామం వింత చెలువాన్నేపొందింది. దాంతో తిరునాళ్ళలో క్రీడాభిరామాన్ని వీధిగా ప్రదర్శించటంతో, అదిరక్తి కట్టింది. వల్లభుని యానందానికి యవధుల్లేవు. మురిసిన వల్లభుడు, కంచుఢక్కయన్న మండిపడు ముమ్మకవిని శ్రీనాథునకు పరిచయం చేసాడు. వారి సూచనలు విన్నాడు. తర్వాత కన్నడకవి చామరసు గారితో పరిచయం ఏర్పడింది. వారు మరికొన్ని సూచనలిచ్చారు. తర్వాత రాజకులపురోహితులైన శ్రౌతి గారి పరిచయం.

వల్లభామాత్యుని సాంగత్యంతో ముత్యాలశాల నలరించు మనీషుల నెందరినో మచ్చిక చేసికొన్నాడు. క్రొత్త రాజ్యంలో అడుగు పెట్టాలంటే, అచటి మనీషుల మన్ననలే మహితసాధనాలు. తర్వాత రాయల కొలవులోని దిగ్గజాలతో కరస్పర్శలు, సంభాషణలు. వల్లభుడొకనాడు మహామంత్రి చామనామాత్యుల చెవిన, శ్రీనాథుని రాకను చేరవేసాడు.

శ్రీ విజయనగరాన్ని దర్శించిన శ్రీనాథుడు, సంస్కృతంలో "మానసోల్లాసమ్" - అను కావ్యాన్ని రచించి, ఓ శుభముహూర్తంలో వల్లభుని చేతికిచ్చి, అరుణగిరినాథునికి పంపి, తన కావ్యము నిర్దోషమని సవాల్ విసిరినాడు. వారు తప్పులున్నవని చెప్పి పంపితే తన శిష్యుడైన ఈ దగ్గుపల్లి దుగ్గన అను పేరుగల నన్ను పంపాడు. నేను వెళ్ళి వారు చూపినవి ఒప్పులేనని వినయంగా చెప్పాను. వారింకనూ కొన్ని వ్యాకరణ కార్యాలు చూపి,

వీటికి శ్రీనాథుడే సమాధానం చెప్పాలన్నారు. తర్వాత, శ్రీనాథుడు వాదపత్రిక పంపటం, కొలువుకి శ్రీనాథుని రాయలవారు పిలవటం, వారు డిండిమభట్టారకులడిగిన వ్యాకరణరూపాలను సాధువులేనని నిరూపించటంతో శ్రీనాథుని మానసోల్లాస కావ్యం నిర్దుష్టమనటానికి ముత్యాలశాలయే సాక్ష్యం.

ఔనౌను, ఐదురోజుల నుండి వాదోపవాదాలు వింటున్నాం. మాలాంటి వారిని దృష్టిలో పెట్టుకొని, వారిద్దఱు శాస్త్ర చర్చలను లోతుగా పోనీయక అర్థమగునట్లుగానే చెపుతున్నారు. ఇప్పటికీ ఐదురోజుల నుండి వాదోపవాదాలు చక్కగా సాగుతున్నాయి. ఎన్ని రాచకార్యాలు ఉన్నా, వాటిని సరిదిద్దుకొంటూనే, సంగీత సాహిత్య సమరాంగణ సార్వభౌములు, సమయానికే ముత్యాలశాలకు విచ్చేయుట మనవంటి శాస్త్ర సమర రిరంసువులకు సంతోష సంధాయకం! దుగ్గన్నా! శ్రీనాథులవారు పల్నాడులో పర్యటించినపుడు పలికిన చాటువులను వినాలని ఉంది. నేటికొక్కటి వినిపించండి... అన్నాడో అభినవ కవి బ్రహ్మ. దుగ్గన్న వినిపించాడు.

ఉ॥ దోసెడు కొంపలోఁబసుల త్రొక్కిడి మంచము, దూడ రేణమున్
బాసిన వంటకంబు, పసిబాలుర శౌచము, విస్తరాకులున్
మాసిన గుడ్డలున్ దలకు మాసిన ముండలు, వంటకుండలున్
రాసెడు కట్టెలుందలపరాదు పురోహితులింటి కృత్యముల్.

6. ఆరవరోజు వాదసభ, ఆరంభానికి ముందు ఘంటారావం మ్రోగింది.

ఎన్ని పనులున్నా, ప్రక్కకునెట్టి రాయలవారు సభకు విచ్చేసారు. సదస్యులంతా తమతమ స్థానాల్లో ఆశీనులయ్యారు. ముత్యాలశాల, విరిసిన శాస్త్రపుష్ప సౌరభాలతో, ముక్కుపుటాలెగరేస్తోంది. చర్చా సమరభేరి మ్రోగింది.

శ్రీ చంద్ర భూషక్రియా శక్తి రాయలవారు, గజాననుని ప్రార్థించి, శివా శివులకంజలి ఘటించి, **సాహిత్యశాస్త్ర చర్చ** ప్రారంభించండి అన్నారు.

సాహిత్యశాస్త్రం - అంటే అలంకారశాస్త్రం, ఇదే శబ్దార్థ రూపమగు కావ్య విద్య. దీన్ని తప్పక పఠించితీరాలి. సాహిత్యశాస్త్రం చదువనివాడు ఎంతటి దిగ్గంతి వంటి పండితుడైనా, వ్యాసుడైనా, గౌతముడైనా పతంజలియైనా, మరెవ్వడైనా సరే వానికి నా శిరస్సు తిరస్కరింపదు, పురస్కరింపదు - అంటే గౌరవింపదని భావం.

శ్లో॥ వ్యాసతు సతు గౌతమతు వ్యాళేంద్రతు యస్య నాస్తి సాహిత్యం ।
తంప్రతి, సంప్రతి కంప్రతి శిరోమమ తిరశ్చన పురశ్చన ॥

సాహిత్య నిర్వచనం చెప్పి, **కావ్య లక్షణ చర్చ** గావించండి... అన్నారు ధర్మపీఠాధ్యక్షులు.

డిండిమభట్టు : రస యుక్తమైనదే - సాహిత్యం.

"సహితం రస సంయుక్తం, తదేవ సాహిత్యమ్" ॥

శ్రీనాథ కవి : నిరతిశయ ప్రేమాస్పదమైన రసముతో కూడినదే సాహిత్యము.

"హితేన, నిరతిశయ ప్రేమాస్పదేన రసేన సహితం తదేవ సాహిత్యమ్" ॥

డిండిమభట్టు: 'కవి' శబ్దం పరమాత్మపరంగా వైదిక మంత్రాల్లో మొదట కనబడుతోంది. "కవింకవీనాం" - శ్రుతి... క్రమంగా, పరమాత్మ సాక్షాత్కారం పొందిన ఋషిని కూడ "కవి" గా చెప్పారు. ద్రష్టలైన వైదిక ఋషులు కవులు వారి కావ్యాలు, ఉపనిషత్తులు, వాల్మీకి, వ్యాసాదులు లోకోత్తర వర్ణనా నిపుణులైన కవులు కనుక **"నానృషిఃకురుతేకావ్యం"** - అన్నారు. ఋషి కాని వాడు కావ్యాన్ని నిర్మింపలేడు. లోకోత్తర వర్ణనా నిపుణుడగు కవి యొక్క కర్మమే కావ్యము. ఇట్టి నైపుణ్యం ప్రతిభాలభ్యం, ప్రతిభ దైవాను గ్రహ సంసాద్యం. దేవతాను గ్రహము, తపస్సంపాద్యం. తపస్సు - ఋషి కర్మ. అందుకే, **ఋషి కల్పుదే మహాకవి.**

శ్రీనాథుడు : 'కవి' శబ్దం పరమాత్మ పరంగా కనబడుతోందంటున్నారు డిండిమభట్టు గారు. కనపడటం కాదు, సృష్టికర్త బ్రహ్మయే "కవి" శబ్దవాచ్యుడు. **"కవిర్మనీషీ పరిభూః స్వయంభూః"** అను శ్రుతిని బట్టి ప్రపంచానికీ కవియే బ్రహ్మ. ఆయన వర్ణించాడు, సృజించాడు. ఆయనను ఆయనే సృజించుకొన్నాడు. ఆయనను వారే వర్ణించుకొన్నారు. స్వయంభువు అపారమైన కావ్య ప్రపంచానికీ కవియే బ్రహ్మ.

"అపారే కావ్యసంసారే కవిరేవప్రజాపతిః "-" యథాస్మై రోచతేవిశ్వం

తథేదం పరివర్తతే - ఆయన ఇచ్ఛానుసారంగా లోకాన్ని మారుస్తాడు.

చేతనాలను, అచేతనాలుగాను, అచేతనాలను చేతనాలుగాను స్వతంత్రంగా

కవి వ్యవహరిస్తాడు. అందుకే ప్రతిభావంతుని వల్లనే మహాకావ్యం ఉదయిస్తుంది. అందుకే కవులు క్రాంత దర్శినులు. ఈ ప్రకారంగా కవి శబ్ద చర్చసాగుతూంటే, "కావ్యాలాపాంశ్చ వర్జయేత్" - అన్నారు కదండీ... అని సదస్యులలోనుండి మెల్లగా ఓ కంఠం పలికింది. వెంటనే శ్రీనాథ కవి; ఆ వాక్యం అసత్కావ్యాల విషయంలో. అసత్కావ్యాలాపాలను విసర్జించాల్సిందే, సత్కావ్యాల నాదరించాలి. అవి విశ్వకళ్యాణ కారకాలన్నారు శ్రీనాథ, డిండిమభట్టులు "విశ్వశ్రేయః కావ్యమ్" కదా అన్నారు. "ఇష్టార్థ వ్యవచ్ఛిన్నా పదావళీ కావ్యం, అని పల్కిన దండి నిర్వచనంతో మేం ఏకీభవిస్తున్నాం...

అని డిండిమభట్టారకులు పల్కి, దాన్ని వ్యాఖ్యానించారు. మనోహరమగు, అర్థంతో అలంకృతమైన పద సముదాయమే – కావ్యము.

కావ్యంలో అల్పమగు దోషాన్ని కూడ ఉపేక్షింపకూడదు. శరీరం ఎంత అందంగా ఉన్నా సరే, ఒక్క శ్వేత కుష్ఠం ఉంటే ఎంతో అసహ్యంగా కనబడుతుంది. ఔచిత్యం కూడ ప్రధానంగా ఉండాలన్నారు డిండిమభట్టు.

డిండిమభట్టు గారూ! సర్వథా దోష స్పర్శలేని కావ్యం ఉండదు. రసాప కర్షకములు కాని దోషాలు, దోషాలు కావు. మీరు కావ్యాదర్శాన్ని ఆదర్శంగా తీసికొన్నారు. రస గంగాధరమే మాకు శిరోధార్యం. **"రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్యం"** – అని శ్రీనాథుడు ప్రతిపాదించెను.

శబ్దం – కావ్యశరీరం. రమణీయార్థం, కావ్యాత్మ, ఆత్మ విశిష్ట మగునదియే శరీరం అయి నట్లే రమణీయార్థ విశిష్టమగుశబ్దమే కావ్యశరీరం. రమణీయః – అను పదం చేతనే, నిర్దోషత్వ, సగుణత్వ, సాలంకారత్వాలు కూడ భాసిల్లుతూంటాయి – అనిన శ్రీనాథునితో –

ఇష్టార్థమంటే రమణీయార్థమే కదా! వ్యవచ్ఛిన్నం అంటే భూషితమని భావం. మనోహరార్థంతో భూషితమైన పదసంఘాతమే కావ్యమని మేం చెప్పిన లక్షణం. మీరు చెప్పిన లక్షణం సమానమేగదా! అని డిండిమభట్టారకులు వాదించారు.

ఈ ప్రకారంగా భట్టులిద్దఱూ తమతమ లక్షణాలను వివరిస్తూ వాద ప్రతివాదాలు చేసారు. కావ్యస్యాత్మాధ్వనిరితి – బుధైః యస్సమామ్నాత పూర్వః...అను ధ్వన్యాలోక సూత్రాన్ననుసరించి, కావ్యమున కావ్యాత్మధ్వనియని, విచారించి, రసధ్వని ధ్వనియే ప్రధానంగా కావ్యాత్మయని నిర్ధారించాడు.

రసేనైవ సర్వంజీవతి కావ్యం, నహిరస శూన్యం కావ్యం కించిదస్తి, రస ఏవ వస్తుతః ఆత్మా. వస్త్వలంకార ధ్వనీతు సర్వథా రసం ప్రతి పర్యవస్యతే – రసం చేతనే కావ్యం జీవిస్తుంది. రస శూన్యమగు కావ్యం ఉండడానికి వీల్లేదు. వస్తు, అలంకార, రస ధ్వనులలో రసధ్వనియే – కావ్యాత్మ, వస్త్వలంకార ధ్వనులు కూడ రసపర్యవసాయులు కావాలనేది సిద్ధాంతం.

విశ్వనాథుడు – వాక్యం రసాత్మకం కావ్యం అన్నాడు. శబ్దార్థౌ సహితౌ కావ్యం – అని భామహుడు, నను శబ్దార్థౌ కావ్యం – అని రుద్రటుడు "తద దోషౌ సగుణావనలంకృతీ పునః క్వాపి" అని మమ్మటుడు – తెలిపిన లక్షణాలను వివరించినాడు. రసస్వరూపం గల వాక్యమే కావ్యమన్న లక్షణంలో విషయాలనులోతుగా విమర్శించి, మమ్మటుని లక్షణ

వాక్యంలో "అదోషౌ" అని ఉండరాదన్నాడు. ఏదోష స్పర్శ లేని కావ్యం ఉండటం దుర్లభం కనుక, ఈ లక్షణం నిర్దుష్టంకాదు. సగుణౌ – అను పదం వ్యర్థమే – అని వివరించి, మమ్మట విశ్వనాథులు ధ్వని సిద్ధాంతానికి అనుకూలవాదులేనని తెల్పి, భవభూతి, ఉత్తర రామచరితలోని "రాత్రిరేవ వ్యరంసీత్"... అను దానిని వివరించి, అందలి రసధ్వనియే, ఆ కావ్యానికి ఆత్మ – అన్నారు. అంతేకాదు, డిండిమభట్టు వాదాన్ని ఖండిస్తూ, "ఇష్టార్థ వ్యవచ్ఛిన్నా పదావళీ" – చెప్పదలచిన అర్థంతో అలంకృతమగు శబ్దం – వివక్షితార్థ వ్యవచ్ఛిన్నః శబ్దసందర్భః – అని, కావ్యాదర్శ వ్యాఖ్యాత తరుణవాచస్పతి పలికాడు. హృదయంగమ వ్యాఖ్యానంలో – "వివక్షితార్థస్య అన్యూనాతిరేకతా స్వరూపేణ ప్రతిపాదన సమర్థాపదావళీ" – అని అర్థం వ్రాయబడి ఉంది. వీటిని బట్టి యోచన చేస్తే మీరు చెప్పిన లక్షణం, మా రస గంగాధర లక్షణం సమానార్థకాలు కావు.

రమణీయార్థక ప్రతిపాదక శబ్దమే కావ్యమని, కావ్యాత్మ రసధ్వనియేయని శ్రీనాథుడు – ఆది కవి వాల్మీకి తొలుదొల్త పలికిన "క్రౌంచద్వంద్వ వియోగోత్థ... శ్లోకమే రసధ్వనికి లక్ష్యంగా ఉదాహరించి, వ్యాఖ్యానించి సిద్ధాంతీకరించాడు.

ఉద్భటుడు కూడ, ఇష్టార్థ వ్యవచ్ఛిన్న పదావళియే కావ్యమని పౌనః పున్యంగా సిద్ధాంతీకరించి, జగన్నాథుని లక్షణంతో సరితూగగలదని నిర్ధారించి కావ్యాత్మ రసధ్వనియేనని, రస హీనమై ఏ అర్థము ప్రవర్తింపదని" నహి రసాదృతేతే కశ్చిదప్యర్థః ప్రవర్తతే" – అని వివరించారు. "రసేనైవ సర్వం జీవతికావ్యం, నహిరస, శూన్యం కించిదస్తి, రసఏవ వస్తుతః ఆత్మా! వస్త్వలంకార ధ్వనీం సర్వధారసంప్రతి పర్యవస్యేతే – ఇతి వాచ్యాత్ ఉత్కృష్టౌతా విత్యభిప్రాయే ధ్వనిః కావ్యస్యాత్మేతి సామాన్యేనోక్తమ్" నిజానికి రసమే కావ్యాత్మ, వస్త్వలంకార ధ్వనులు వాచ్యార్థం కంటె, ఉత్కృష్టాలనే అభిప్రాయంతో కావ్యానికి ఆత్మధ్వనియని, సామాన్యంగా చెప్పబడుతోంది. నిజానికి రస ధ్వనియందే అంతర్భూతమౌతోంది – అని ఉద్భట వివాద ప్రౌఢితో డిండిమభట్టారకులు వాదిస్తే, విన్నాడు శ్రీనాథుడు. ఇలా, అన్నాడు – ఈ కావ్యగత రసానందం, బ్రహ్మానంద సబ్రహ్మచారి మాత్రమే! నిజానికి శాశ్వత బ్రహ్మానందాన్ని శబ్దాలు నిర్వచింపలేవు, మనస్సు ఊహింపజాలదు. "యతో వాచోనివర్తన్తే, అప్రాప్యమనసాసహ, ఆనందం బ్రహ్మణోవిద్వాన్. నబిభేతి కుతశ్చన" – అను శ్రుతి వలన, అవాఙ్మానసగోచరమైన ఆ బ్రహ్మానందం తెలిసికోవటానికే, బ్రహ్మానంద సబ్రహ్మచారియగు నీ రసానందాన్ని చవిచూడాలి. "రసోవైసః", రసగ్గ్ం హేవాయంలబ్ధ్వానందీ భవతి" అను శ్రుతిచే, రసానందం బ్రహ్మమే!

అని సిద్ధాంతం చేసాడు, శ్రీనాథ సుకతవి. శాంతి మంత్రం పఠించారు.

7. **ఏడవరోజు** న వాద సభ ప్రారంభమైంది. కంచుఢక్క మ్రోగింది.

డిండిమభట్టారకులు, **"వాక్యం రసాత్మకం కావ్యం"** - రసాత్మకమైన వాక్యము - కావ్యమని వాదించారు. తర్వాత రసమే కావ్యమునకాత్మ - అన్యము కాదని వాదించారు. రసేనైవ సర్వం జీవతి కావ్యం, నహిరస శూన్యం కించిదస్తి, రసఏవవస్తుతః ఆత్మా, వస్త్వలంకార ధ్వనీతు సర్వథారసం ప్రతిపర్యవస్యేతే - రసముచేతనే కావ్యం సర్వం జీవిస్తుంది. రసశూన్యమగు కావ్యం ఉండదు. నిజానికి రసమే కావ్యానికి ఆత్మ. వస్త్వలంకార ధ్వనులు సర్వథా రసపర్యవసాయులవతాయి అని పల్కిన వాదంతో ఏకీభవిస్తూ, "వస్త్వలంకార ధ్వనులు వాచ్యర్థం కంటె ఉత్కృష్టాలనే అభిప్రాయంతోనే కావ్యానికి ఆత్మధ్వని - అని సామాన్యంగ చెప్పబడింది. నిజానికి అవన్నీ రసధ్వనియందే అంతర్భవిస్తాయి - అంటూ శ్రీనాథుడిలా అన్నాడు - ఇతి వాచ్యాద్యుత్కృష్టౌతా విత్యభిప్రాయేణ, ధ్వని: కావ్యస్యాత్మేతి సామాన్యేనోక్తమ్ ॥ అని వివరించి, రస, అలంకార, గుణ, రీతి, వక్రోక్తి, అనుమానాది సంప్రదాయాల్ని పేర్కొంటూ క్షేమేంద్రుని ఔచిత్యవిచారచర్చ చేసి, రస సిద్ధమగు కావ్యానికి ఔచిత్యమే జీవితమన్నాడు.

"ఔచిత్యం రససిద్ధస్య స్థిరం కావ్యస్య జీవితమ్" ॥

డిండిమభట్టారకులు ప్రతిపాదించిన కావ్యలక్షణం మాత్రం సరికాదని వాదించాడు. రసాత్మకమే కావ్యము, అన్యము కావు అని చెప్పినట్లయినచో వస్త్వలంకార ప్రధానములగునవి కావ్యాలు కాకపోవలసి వస్తున్నాయి.

గౌః చలతి, మృగోధావతి - గోవు కదలుచున్నది. లేడి పరిగెత్తుచున్నది - అను వాక్యాలు కూడ కావ్యాలనే అంగీకరించాల్సి వస్తోంది. ఈ లక్షణం, అవ్యాప్తి, అతివ్యాప్తి దోషాలతో దూషితము కావల్సివస్తోంది. కావున రమణీయమగు అర్థమును ప్రతిపాదించు శబ్దమే కావ్యమని శ్రీనాథుడు చెప్పిన సిద్ధాంతాన్ని విన్న డిండిభట్టారకులు అతి వ్యాప్తి, అవ్యాప్తి దోషాలు చెప్పి రమణీ, రమణీయ కటాక్షాదికములు కూడ రమణీయార్థ ప్రతిపాదకములేకదా! అది అనురాగాద్యర్థమును ప్రతిపాదించును, కనుక కావ్యమా అని నిలదీసారు.

అది శబ్దము కాదు, కావున కావ్యము కాదు.

"శబ్దం" అను పదంచే ఇందలి అతివ్యాప్తి వారింపబడుతోంది. వ్యంగాది సంగ్రహార్థం - "ప్రతిపాదక" శబ్దం ప్రయోగింపబడింది. అందుచే, మీరన్నట్టి అవ్యాప్తి దోషం కూడ

వారింపబడింది. వ్యాకరణం – రమణీయ శబ్ద ప్రతిపాదకము కాని, రమణీయార్థ ప్రతిపాదకము కాదు. కాబట్టి అది కావ్యం కాదు. ఇట మీరు వాదించినట్లు అతివ్యాప్తి దోషం కూడ లేదు – అని డిండిమభట్టు ఖండనను ఖండించి, ఉద్భట వివాద ప్రౌఢి చూపి, ఏది రమణీయార్థ ప్రతిపాదక శబ్దము కాదో అది కావ్యం కాదని, చెప్తూనే, తర్కమువలె – అను లక్ష్యాన్ని చూపిస్తూ, ఏది రమణీయార్థ ప్రతిపాదక శబ్దం అవుతోందో అది కావ్యమని సిద్ధాంతీకరించి, లక్ష్యంగా రఘువంశ మహాకావ్యాన్ని ఉదాహరించి, **రమణీయార్థః** ప్రతిపాదక శబ్దః కావ్యమ్ – అను నిర్దుష్ట లక్షణాన్ని నిరూపించాడు, శ్రీనాథుడు. తర్వాత శబ్దార్థాలకు సౌందర్యాన్ని కూర్చునది ధ్వని యగునో కాదో వివరించాడు. వెంటనే, ధ్వని అనుమానాంతర్గతమని డిండిమభట్టారకులు, ఉదాహరణలతో సహా వాదించి, తమ వాద పటిమ చాటటంతో, సదస్యులు కరతాళధ్వనులు చేసారు.

"పర్వతో వహ్నిమాన్, ధూమవత్త్వాత్, యోయో ధూమవాన్ సోగ్నిమాన్ యధా మహానసః – పర్వతము అగ్ని కలది, ఎందుకంటారా, పొగయున్నది కనుక పర్వతం అగ్ని కలది అంటున్నాం. ఏది ఏది పొగకల్గి ఉంటుందో అది అది అగ్నికలది, మహానసము వలె – ఎక్కడ పొగ ఉంటుందో అక్కడ నిప్పుంటుంది – అను వ్యాప్తిని గ్రహించి, పర్వతం దగ్గరకు వెళ్ళి అక్కడ అగ్ని ఉన్నదని సందేహించి, అక్కడి పొగను చూచి, ఎక్కడ పొగ ఉంటుందో, అక్కడ నిప్పుంటుందను వ్యాప్తిని స్మరించినంతనే, ఈ పర్వతం నిప్పుతో వ్యాప్తిని కల్గిన పొగను కల్గి ఉంది – అను జ్ఞానం కల్గుతుంది కదా! ఈ లింగ పరామర్శ వల్ల పర్వతం వహ్నిమంతం – అను అనుమితి తనకు పుట్టుతుంది కనుక ఇది స్వార్థానుమానం, తను అనుమానించాక దాన్ని ఇతరులకు బోధించు పంచావయన వాక్యం – పరార్థానుమానం అంటూ వాదించి, ఈ ప్రమాణాలననుసరించిన ధ్వని, అనుమానాంతర్గతమే! తర్కశాస్త్రాన్ననుసరించి "భ్రమ ధార్మికవిస్రబ్ధం సశునకోఽద్య మారితస్తేన, గోదావరీ కచ్ఛకుడుంగ వాసినా దృప్త సింహేన – గోదావరీనికుంజం భీరు భ్రమణా యోగ్యం. ఉపలభ్యమాన భయకారణం, సింహం కలది యగుట వలన కదా! అది అన్వయవ్యాప్తి. ఏది ఏది ఉపలభ్యమానభయకారణ వంతమో అది అది భీరు భ్రమణాయోగ్యం, మహారణ్యం వలె – వ్యతిరేక వ్యాప్తి. ఏది ఏది భీరు భ్రమణాయోగ్యం కాదో, అది అది ఉపలభ్యమాన భయకారణ వంతం కాదు. గృహం వలె కనుక, ఈ గోదావరీనికుంజం, భీరు భ్రమణాయోగ్యం. ఈ అనుమానం చేత అభిలషితార్థ సిద్ధి కలుగుతోంది కనుక ఇది వ్యంజన అని వృత్యంతరాన్ని అంకీకరింపనక్కరలేదు.

అనన్యలభ్యమైన అర్థంలోనే వృత్యంత కల్పన యుక్తమని డిండిమభట్టు, తార్కిక పట్టు బిగించారు.

శ్రీనాథుడీ పట్టు సడలించుట ప్రారంభించాడు. అనుమానానికి ప్రవేశం లేని చోట కూడ వ్యంజనకు ప్రవేశం ఉంది. సద్ధేతు వున్నచోటనే అనుమానానికి ప్రసక్తి. అపుడే హేతువుకి సాధ్యంతో వ్యాప్తి ఉంటుంది. ఇలా నియత సాహచర్యం ఉంటుందని తమకు తెలుసు. అన్యత్ర హేతువు వ్యభిచరితమౌతుంది. ప్రకృతోదాహరణమున వ్యభిచరితమైంది హేతువే! ఉపలభ్య భయకారణమైన సింహం ఉన్నా గురు రాజాద్యాదేశమున్నప్పుడు, నిధిలాభ నిశ్చయమున్నప్పుడు లేదా కాంతాను రాగమున్నప్పుడు, అది భీరు భ్రమణాయోగ్యం కాకపోవును కదా! కాబట్టి హేతువు, అనైకాంతికం, ఇక్కడ, ధార్మిక సంపత్తి కలవానికి, దేవపూజార్థం పూవులు కోయువానికి, కుక్క కరచుననే భయంకాక తాకుతుందేమోనన్న పాపభయం ఉంటుంది. వీరుడైన వానికి భయం ఉండదు, వాడు సింహానికి జంకక, వేటాడాలనే ఉత్సాహం చూపుతాడు కదా! అలాంటప్పుడు, గోదావరీ నికుంజములో సింహమున్నదను హేతువుచే, వాడికి భ్రమణాయోగ్యం కాకపోవును, కాబట్టి, సాధ్యంతో కాక, సాధ్యాభావంతో వ్యాప్తి కలుగుతోంది కనుక ఇంతటి హేతువు విరుద్ధమని, ప్రత్యక్షం చేగాని, అనుమానం చేగాని గోదావరీ నికుంజంలో సింహం ఉండుట నిశ్చయం కాదు కేవలం స్వైరిణి మాటలవల్లనే నిశ్చితం కావలెను. శాబ్దజ్ఞానం, వక్త – ఆప్తుడనే దృఢనిశ్చయం ఉన్నప్పుడే ప్రామాణికమౌతుంది. అప్తత్వం, సందిగ్ధమైతే, అది అప్రామాణ్యమే! ప్రకృతస్వైరిణీ మాటలు శంకాస్కందితమౌటచే హేతువు – అసిద్ధం. అప్రామాణ్యశంకాస్పదమగు, అసద్ధేతువు ఉంటూంటే, అనుమానం, సంచారణాయోగ్యత ఎలా ఉపలబ్ధమౌతా యంటారు? అక్కడ సింహంలేదనేది నిజం. కాని, ఆ నెఱజాణమాటకు, తన ప్రియసమాగమ సంకేతమైన ఆ ప్రదేశంలో తిరగవలదనేది తాత్పర్యం, విదగ్ధులగువారలకి అర్థానుభవమే. ఇటు వ్యంజనావృత్తిచే వ్యంగార్ధ గ్రహణం సిద్ధం, వ్యంజనా పక్షవాదులమగు, అస్మదాదులకు వ్యాప్త్యాద్యను సంధానం అపేక్షణీయం కాదు.

సహృదయుల మనః ప్రీతి కోసం, ధ్వని స్వరూపం చెప్తున్నాం. అది సకల సత్కవికావ్యోపనిషద్భూతం. అతి రమణీయం. చిరంతన కావ్యలక్షణ విధాతల అణీయసములగు బుద్ధులచే అనున్మీలిత పూర్వం, రామాయణ భారతాదులందంతటను లక్ష్య వ్యవహారమైన ధ్వని స్వరూపాన్ని లక్షణ పురస్సరంగా చూచే సహృదయుల మనములందు ఆనందం ప్రతిష్ఠితం కావాలనే ఉద్దేశ్యంతో దాని స్వరూపాన్ని

ప్రకాశింపజేస్తున్నానని చెప్తూ శ్రీనాథుడు ధ్వని సిద్ధాంతాన్ని విపులీకరించాడు. ధ్వని లక్షణాన్ని వివరించి సిద్ధాంతీకరించాడు శ్రీనాథుడు.

"సహృదయ మనః ప్రీతయే తత్స్వరూపం బ్రూమః, తస్యహి ధ్వనేః స్వరూపం సకలసత్కవి కావ్యోపనిషద్భూత మతిరమణీయ మణీయసి భిశ్చిరంతన కావ్య లక్షణ విధాయినాం బుద్ధిభిరనున్మీలిత పూర్వమ్. అధచరామాయణ మహాభారత ప్రభృతీని లక్ష్యే సర్వత్ర ప్రసిద్ధ వ్యవహారం లక్షయతా సహృదయానాం ఆనందో మనసి లభతా – ప్రతిష్ఠాం ఇతి ప్రకాశ్యతే". **"యత్రార్థః శబ్దోవాతమర్థముపసర్జనీకృత స్వార్థౌవ్యంక్తః కావ్య విశేషః సధ్వనిరితి సూరిభిః కథితః"** – అను ధ్వన్యాలోక లక్షణాన్ని వివరించాడు. ఏకావ్యంలో అర్థం అప్రధానంగా జేసి స్వస్వరూపవ్యంగార్థాన్ని వ్యంజింపజేసే శబ్దం, అర్థాన్ని అప్రధానంగా చేసికొని వ్యంగార్థాన్ని అభివ్యంజనం చేయు కావ్య విశేషమే ధ్వనియని, పండితాభిప్రాయమని శ్రీనాథుని చిక్కని వక్కణ.

శ్లో॥ దశానన కిరీటేభ్యః తక్షణం రాక్షసశ్రియః ।
మణివ్యాజేనపర్యస్తాః పృధివ్యామశ్రుబిందవః ॥

ఆ క్షణంలో రావణుని కిరీటం నుండి మణిమిషతో రాక్షస శ్రీ అశ్రుబిందువులు నేలపై రాలినవి – అను కవి వాక్యంలో – ప్రౌఢోక్తి సిద్ధమైన అపహ్నుత్యలంకారంచే, భవిష్యద్రాక్షస శ్రీ వినాశరూప వస్తువు – వ్యంజింపబడుతోంది – ఇది అలంకారకృత వస్తుధ్వని.

"ధమ్మిల్లేనవమాలికా..... విగ్రహే" .... అను శ్లోకంలో అలంకారకృత అలంకార ధ్వని ఉంది.

శ్లో॥ "కిమపి కిమపి మందం మందమాసత్తి యోగాత్.
అవిరళిత కపోలం జల్పతోర క్రమేణ
అశిథిల పరిరంభ వ్యావృతైకైక దోష్ణో
రవిదిత గతయామా రాత్రి రేవ వ్యరంసీత్" – అనుశ్లోకార్థాన్ని వివరించి, ఇందు రసధ్వని గలదని, ఇది భవభూతి విరచిత ఉత్తర రామచరితంలోనిదని తెలిపాడు శ్రీనాథుడు. శ్రద్ధగా వింటున్న సదస్యులలోంచి, జిజ్ఞాస శాస్త్రి గారు, భవభూతి అనేది పేరా, బిరుదా? అన్నారు, "భవభూతి" బిరుదమే, వాని పేరు శ్రీకంఠుడని డిండిమ భట్టారకులు తెలిపారు. బిరుద మెందుకొచ్చిందో, వివరంగా చెప్పండి... అన్నారు, వినయంగా... శాస్త్రిగారు.

శ్రీకంఠుడు, చక్రవర్తి సభలో – తపస్సు చేసికొన్న పరమేశ్వరునికి ముక్తి లభించాలి కాని, ఈ పరిస్థితి ఏర్పడిందేమిటా? అని, శివుని కౌగిలివలన వారి హృదయవిభూతి స్పర్శచే తెల్లనైన పార్వతీదేవి ఉరసిజాలు నవ్వుతున్నాయా అన్నట్లున్నాయి; చిరునవ్వులు! భవభూతి విభూతి స్పర్శచే చిరునవ్వులు చిందించు గిరిజాదేవి ఉరసిజాలకు వందనమన్నారు! అని శ్లోకంచదివాడు డిండిమభట్టు! **"తపస్వీ కాంగతో వస్థామితిస్మేరాననావివ, గిరిజాయాః స్తనౌవందే భవభూతి సితాననౌ!"**, దీనికా అంతభావం అని విన్నవారు, శ్రావ్యంగా కంద పద్యంలో తెలుపుమనగా, శ్రీనాథుడు వినిపించాడు.

కం॥ అవురా! తాపసికెట్టిది
యవస్థ కల్గి నదిరయని యసియించుచును
న్నవన "భవభూతి" ధవళ
చ్ఛవియగు శ్రీపార్వతీకుచద్వయి దలతున్ – అని ఆశువు గా నాంధ్రీకరించిన శ్రీనాథునికి జేజేలు పల్కినంత, **నాటి సదస్సుకు శాంతి పలికారు.**

8. ముత్యాలశాల, ఉద్భట వివాదాల సాహిత్యశాస్త్ర సమరశాల! **ఎనిమిదవ** రోజు వాద సభ ప్రారంభం కాబోతోందన్న ఘంటారావం విన్నవారంతా ముత్యాలశాలా సదస్సుకు విచ్చేసారు. సదస్సు కిటకిటలాడుతోంది. సాహితీరసజ్ఞులు పండిత పరమహంసలు, సుకవి మత్తేభాలు, శాస్త్రవృషభాలు, దైవజ్ఞులు, చెవులప్పగించారు. ధర్మపీఠాధ్యక్షులు, తమకుడుగరలందజేసే వాది ప్రతివాదులిద్దరినీ అభినందించారు. నేడు, **"రసముకిన్నిష్ఠము"** అను విషయమున గల అభిప్రాయ భేదాన్ని చర్చించాలి. రసం – అనుకార్యనిష్ఠమా? అను కర్తృనిష్ఠమా? సామాజిక నిష్ఠమా? మీరుభయులు తేల్చి చెప్పాలి. ఈ వాదాన్ని ప్రారంభించే ముందుగ శ్రీనాథ కవి ఓ విషయాన్ని తేల్చి చెప్పాల్సి ఉంది. కర్ణాకర్ణికగా మేం విన్న విషయమిది. శ్రీనాథ సుకవి, పలనాడులో పర్యటిస్తూ, చిన్నికృష్ణునిపై ఓ సవాల్ విసిరారట, ఏమిటది? అంతవరకూ, ఏమిటదియని ఉత్కంఠతో నున్న శ్రీనాథుడిది వినగానే, – ఏ మున్నది గురుబ్రహ్మా! పలనాడులో పర్యటిస్తూంటే, ఓ రోజున, ఓ విప్రశిఖామణి మమ్మల్ని భోజనానికి పిలిచారు, జొన్నన్నం పెట్టారు. చింతచిగిరు కలిపి వండిన వేడి బచ్చలి కూరపప్పు వడ్డించారు. వేడి వేడిగా ఉందేమో, ఆకలిగా ఉన్నమేం నోటపెట్టాం నోరుగాల చేయిగాల ముద్ద లోపలికి పోతే ఒట్టు. గొంతుకు మండింది. నా బాధ ఎవరికి చెప్పాలో తెలీక, చిన్నికృష్ణునకు చెప్పుకొన్నా! కన్నయ్యా, నీవేమో దావవాగ్నినే మింగేశానంటావ్, పూతన ఇచ్చిన చేదుపాలు త్రాగి నానంటావ్, గొప్పలు చెప్పకయ్యా! వాటికన్న

భయంకరమైన ఈ తిండి తినిచూడు. అంతెందుకయ్యా! ఒక్క ముద్ద దిగమ్రింగవయ్యా! నీ గొప్ప తెలుస్తుందన్నాను... అంటూనే, నాడు పల్కిన పద్యం వినిపించాడు.

ఉ॥ "ఫుల్ల సరోజ నేత్ర! యలపూతన చన్నుల చేదు ద్రావి నా
దల్ల దవాగ్ని మ్రింగితి నటంచును నిక్కెదవేల? తింత్రిణీ
పల్లవయుక్తమౌ నుడుకు బచ్చలి శాకము జొన్న కూటితో
మెల్లన నొక్క ముద్ద దిగమ్రింగుము నీపస కాననయ్యెడిన్.

ఆహా! కాలకూట విషాన్ని, కారుచిచ్చుని మ్రింగి పొంగి పోకు, జొన్న కూటితో ఈ బచ్చలి శాకం కలిపి ఒక్క ముద్ద మ్రింగు, నీ బండారం బయటపడుతుందని, కన్నయ్యతో పల్కిన నిందాగర్భిత వ్యాజనిందకు, జోహార్లంటూంటే, కరతాళధ్వనులు, ముత్యాలశాలలో ప్రతిధ్వనించాయి.

రసము కిన్నిష్ఠము? అను కార్యనిష్ఠమా? అను కర్తృ నిష్ఠమా? లేక సామాజిక **నిష్ఠమా? అను విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి అంటూ డిండిమభట్టు** ప్రారంభించారు. భట్టలోల్లటుడు, శ్రీ శంకుకుడు, భట్టనాయకుడు, ఈ విషయంలో భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేసారు. కారణములగు ఆలంబనోద్దీపన విభావాలచే హాసాదికములగు భావాలు పుడతాయి. కార్యములగు అను భావాలచే ప్రతీతి యోగ్యమవుతాయి. సహకారులైన వ్యభిచారీ భావాలచే ఉపచితమై, ముఖ్యవృత్తిచేత నలాద్యను కార్యులలో తద్రూపతాను సంధాన బలాన నర్తకుని యందు రసం ప్రతీయ మానమవుతుందన్నాడు భట్టలోల్లటుడు.

త్రాడును చూచి పాము అని భ్రాంతి పడినపుడు, సర్పావలోక జనిత భయోద్రేకాదులు కలుగుతున్నాయి కదా! నటుని యందు నిజంగా లేక పోయినా సరే, నటుని అభినయకౌశలంచే అతనియందున్నట్లే కనబడి, సామాజికునికి చమత్కారం పుడుతుంది. అది రసపదవి నధిరోహిస్తుంది, ఆ స్థాయీ భావమే, విభావానుభావ వ్యభిచారీభావాలచే ఉపచితమై రసమవుతోందని భట్టలోల్లటుడన్నాడు. ఈ ఉత్పత్తివాదం, చమత్కార హేతువు కాదు. నటుని యందే ప్రకారంగాను అనుభూతి కలుగదు. చందనారోపణం - చమత్కారహేతువు కాదు, వాస్తవ చందనాలేపన సంబంధమే చమత్కార హేతువు. సుఖం, ఆరోప్యమాణం కాదు, విద్యమానం.

భట్టలోల్లటుని కార్యకారణ భావం, రసానికి విభావానుభావాదులకు గల సంబంధాన్ని స్థిరపరచలేదు. విభావాదులు నాశనమైతే, రసానుభవం నష్టమౌతోంది - ఈ వాదాన్ని శ్రీ శంకుకుడంగీకరింపక, ఏకీభవించలేదు.

ముఖ్యరామాది గతమగు రతి, హాసాదులునటుని యందు అనుమితమై రసవ్యపదేశం పొందుతాయని శ్రీ శంకుకుడభిప్రాయపడ్డాడు. విభావాదులచే ఉపచితమైన స్థాయీ భావమే రసమన్న భట్టలోల్లట వాదం, ఉపచిత స్థాయీ భావమే రసమన్న శ్రీశంకుకుని అనుమితివాదం కూడ సరికాదు. సామాజికులందు, అనుమిత్స ధారావాహికంగా కొనసాగుతూనే ఉంటుంది. కనుక విభావాదులభినీతం అగుచున్నంతకాలం, అనుమితి సామాజిక హృదయానజనిస్తుందని, అది నిరవచ్ఛిన్నమని, క్షణికం కాదని శ్రీ శంకుకుని సిద్ధాంతం.

రస్యతే ఆస్వాద్యతే ఇతి రసః, రస, ఆస్వాదనే, ఆస్వాదింపబడునది రసము. ఇది ఆనందాన్ని కలుగజేస్తుంది. ఈ రసానందం అసలైన నలాది వ్యక్తులందుకాని, నటుల యందు కాని ఉండదు. ఎందుకంటే రామాదులు సుఖదుఃఖాలననుభవించారు. అవి స్థాయీ భావాలే. లౌకికములైనవి దుఃఖభాజనములే, సుఖహేతువు కాని శాశ్వతానంద హేతువులు కావు. రసానందం, అలౌకికమైంది. అది సామాజి కనిష్ఠము.

కావ్య నాట్యాలలో అభిధావ్యాపారంతో పాటు వ్యాపారాంత రాలైన భావక భోజకత్వాలున్నాయి. విభావాది సాధారణీకరణయే భావకత్వం. అభిధావ్యాపారం వల్ల మొదట సామాజికులకు జ్ఞానం కలుగుతుంది. తర్వాత భావకత్వం ప్రవర్తించి శకుంతలాది నాయికలు కేవలం ప్రత్యేక నాయికలుగా కాక, సాధారణ కాంతాత్వం పొంది, శృంగారాది రసాలను సామాజికులకు సాధారణంగా జనింపజేస్తారు. తర్వాత భోగీకృతి, దానిచే సామాజికునిలో సత్త్వగుణం వల్ల హృదయం కరగటం, తమోగుణం వలన విస్తరణ, సత్త్వగుణం వలన వికాసం పొంది, భావకత్వ భోజకత్వ వ్యాపారమహిమచే స్థాయీభావాలు భుజ్యమానమవుతాయి. స్థాయీ భావాలు భోగాలకు విషయాలైనపుడు అది రసమవుతుంది. ఇదే భుక్తివాదము. దీనినే నేను సమర్థిస్తున్నాను - అని డిండిమభట్టు, సామాజికుని యందు రసానందము పుట్టునని, దానిచే ఆతడానందించుచున్నాడని వాదించిరి. రామ, కృష్ణాదులయందు రసానందం పుట్టుటకు వీలులేదు - అలాగే నల హరిశ్చంద్రాదులందున్నది స్థాయీ భావాలే కాని రసంకాదు. వారు దుఃఖాలే అనుభవించారు. వారేనాడో పాలించిన ధీరులు, పోనీ పాత్రధారుల యందు రసానందమున్నదాయనినచో వారు నటులే, ఈనాటి వారు, అల్పులు, అయినా ఆనందమను భవించువారు కారు. నటన వృత్తిగా కలవారి యందు రసానుభూతి ఎలా ఉంటుంది. కనుక రసము సామాజిక నిష్ఠమనియే చెప్పాలి.

శకుంతల, దుష్యంతాదులు, సామాజికులకు విభావాలు కారు. పోనీ వారిని వీడితే రసాదులు స్ఫురింపవు. నటికాంత కనుక, విభావాది విషయాల్లో సృజనంగా ఊహింప వీలులేదు... అంటూనే, "స్వాత్మని దుష్యన్తా ద్యబేధ బుద్ధిరేవ తథేతి చేత్‌న, నాయకే ధరాధౌరేయత్వధీరత్వాదేః, ఆత్మనిచ. ఆధునికత్వకాపురుషత్వాదేః వైధర్మ్య స్యస్ఫుటం" - అని తెలిపి, సామాజికుడే రసానందమొందుననార్రు డిండిమభట్టు.

శ్రీనాథుడు, డిండిమభట్టారకుని ప్రతివాదనను ఖండించి, **రసము - సహృదయ సామాజిక నిష్ఠమని,** ఆ ఖ్యాతినార్జించిన అభినవగుప్తుని శ్లాఘించి, సిద్ధాంతీకరించెను.

డిండిమభట్టారకులు, రసము సామాజిక నిష్ఠమే యని వాదించిన విషయంలో, అభిధాతిరిక్త భావకత్వ భోజకత్వ వ్యాపార మహిమచే రామాది గత స్థాయిని ఆత్మసాధారణంగా చేసికొని, సామాజికుడానందిస్తున్నాడని చెప్పటం విశేషమే, కాని, రత్యాదికి పరగతత్వ దోషం కనబడుతోంది. అది సరస సహృదయగతమే!

రసానుభవంతో సమాన యోగ క్షేమమగు బ్రహ్మానుభవమందు కూడ భావనను దోషమే అనాలి. అది "మన్తవ్యోనిధి ధ్యాసితవ్యః" - అను శ్రుతికి విరుద్ధమై భావాన్ని ప్రతిపాదించారు డిండిమభట్టారకులు. శ్రుతి, దోషమొనర్పుము - అనదు కాబట్టి అది అస్వారస్యము. వారు రసాను భవం ఎట్టులాయని మాత్రమే విచారించుట విచార్యము.

వీరి భావకత్వ, భోజకత్వ వ్యాపారాలనంగీకరించడానికి తగిన ప్రమాణం గాని, ప్రయోజనం గాని కనబడటంలేదు. వీరి, భోగీకరణ వ్యాపార కావ్యాత్మక రస విషయ ధ్వన్యాత్మక రూపమే కాని, అన్యం ఏమాత్రమూ కాదు. గుణాలంకారాలను సముచితంగా పరిగ్రహిస్తే, శబ్దార్థాల వ్యంజనా వ్యాపారమూలమగు రసస్ఫూర్తి కల్గుతుంది. భావకత్వం సాధారణ ధర్మం, రసాభివ్యక్తిని కలిగించు ముఖ్యార్థమే కావ్యార్థం. స్థాయి, వ్యభిచారాదులు కూడ భావములే! వాని యందున్న భావుకత్వ మూలమున, అలౌకిక రసాస్వాదనానందం భావుకులకుదయిస్తుంది. అలాంటప్పుడు, కాంతాత్వరత్యాది సాధారణాంశములు, అప్రయత్నంగానే లభిస్తాయి. కాబట్టి భావనను వ్యాపారాంతరమున అంగీకరించుట అనావశ్యకం.

"విభావాను భావ వ్యభిచారి సంయోగాద్రస నిష్పత్తిః" - ఆలంబన ఉద్దీపన విభావాలు, అనుభావాలు వ్యభిచారీభావాల సంయోగమున రసము నిష్పన్నమగునని సూత్రార్థం. ఇందలి నిష్పత్తి శబ్దానికి అభివ్యక్తియని అర్థము. సంయోగ శబ్దానికి వ్యంగ్యవ్యంజక భావము. వ్యంజకాలైన విభావానుభావ వ్యభిచారీ భావాలచే సహృదయ నిష్ఠమైయున్న

స్థాయీ భావం వ్యంగ్యమై రసమవుతుందని చెపుతూ, సామాజిక నిష్ఠమగు వాసనయే మా సిద్ధాంతానికి ప్రాణమన్నారు.

డిండిమభట్టారకుల వాదనలో సామాజిక నిష్ఠమగు వాదనను అంగీకరించినట్లులేదు, చిత్తము – అనాది వాసనాయుక్తమై యుండుననుటకు పతంజలి యోగ సూత్రమే ప్రమాణం. చిత్తం అనాది వాసనావాసితం – కాబట్టి రామాది చరిత్ర విషయంలో సహృదయునకు హృదయసంవాదం కలుగవచ్చునని తెలుస్తోంది. రత్యాదివాసనలే లేకుంటే రసాస్వాదం కలుగదు – "నజాయతే తదాస్వాదో వినారత్యాది వాసనామ్" అను సాహిత్యదర్పణ వాక్యమే ప్రమాణం.

వాసనాయుక్తులగు సభ్యులకే రసాస్వాదన కల్గుతుంది. వాసనలేనివారు రంగమందలి కాష్ఠ కుడ్యశిలా సన్నిభులనుట సుస్పష్టం.

శ్లో॥ "సవాసనానాం, సభ్యానాంరసస్యాస్వాదనం భవేత్ ।

నిర్వాసనాస్తు రంగాంతః కాష్ఠకుడ్యాశ్మసన్నిభాః" – అన్నాడు, ధర్మదత్తుడు.

"వాసనాచ సూక్ష్మ సంస్కార ఇతికేచిత్" – ఈ సూక్ష్మ సంస్కారమైన వాసన – ఇదానీంతని, ప్రాక్తని అనిద్వివిధము. కావ్య నాట్య శ్రవణావలోకన కాలవర్తి – ఇదానీంతని. పూర్వ కాలవర్తిని – ప్రాక్తని. ఈ రెండూ కలసియే రసాస్వాదన హేతువు అవుతాయని" వాసనా చేత్ ఇదానీంతనీ ప్రాక్తనీచ రసాస్వాదన హేతుః – అను ఈ నిర్వచనంలో ఏది లోపించినా రసాస్వాదన కలుగదని, సాహిత్య దర్పణంలో కనబడుతోంది. కనుక, రత్యాదివాసనలు కల సహృదయుడే రసాస్వాదనమునకు అర్హుడు కావున, రసము వాసనలు కల సహృదయనిష్ఠమని తేలుతోంది. మరి అలాంటి సహృదయుడెవడంటే – ఎవరికి కావ్యానుశీలన వశాన మనో దర్పణము విశదం కాగా, అంటే మాలిన్యశూన్యం కాగా, కావ్యములందు వర్ణింపబడిన అర్థాలతో తన్మయీభవన యోగ్యత కలుగుతుందో, ఆ హృదయ సంవాద భాక్కులే – సహృదయులు. "యేషాం కావ్యానుశీలన వశాత్ విశదీ భూతే మనో ముకురే, వర్ణనీయ తన్మయీ భవన యోగ్యతా, తే హృదయ సంవాద భాజః సహృదయాః" – అని ధ్వన్యాలోక లోచనం. సహృదయత్వమే హృదయ సంవాదము. ప్రేక్షక శ్రేష్ఠుడే – సహృదయుడు, నాయకుడుతుష్టి పొందితే తానూ తుష్టి పొందేవాడు, శోకం పొందితే శోకించేవాడు, క్రోధం పొందితే క్రుద్ధుడగువాడు, భయం పొందితే భయపడేవాడు ప్రేక్షక శేష్ఠుడు – అంటూనే ముగిస్తూ శ్రీనాథుడిలా అన్నాడు. అట్టి సహృదయుడే రసమునాస్వాదించును. **ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.**

9. ముత్యాలశాలలో జరిగే **తొమ్మిదవరోజు** వాద సభా ప్రారంభానికి ఘంటారావం మ్రోగింది. మౌక్తిక కీర్తి మూర్తి శ్రీ ప్రౌఢ దేవరాయలవారు, తమ సువర్ణ సింహాసనంలో కూర్చుని సదస్యుల్ని అభినందించారు. ముత్యాలశాల రోజురోజుకీ మరింతగా అందచందాలు చిందిస్తోంది. దేశం నలుమూలల నుండి వివిధ కళలలో లబ్ధప్రతిష్ఠులైన వారెందరో వాద సభను దర్శించాలని వచ్చారు. శ్రీరాయలవారు, శ్రీ చంద్రభూష క్రియాశక్తి రాయలవారు, నేటి, మేటి నిండు పేరోలగాన్ని చూసి ఎంతగానో సంబరపడ్డారు.

"మృదుమధుర చిత్ర విస్తర కవితా విలాస వాగీశ్వరులగు కవీశ్వరులును, పతంజలి కణదాక్ష చరణ పక్షిలాది శాస్త్ర సిద్ధాంత కమల వన హంసులగు విద్వాంసులును, భరత మతంగ దత్తిల కోహలాంజనేయ ప్రణీత సంగీత విద్యారహస్య విజ్ఞాన వైజ్ఞానిక స్వాంతులగు కళావంతులును, శక్తిత్రయ చతురుపాయ షాడ్గుణ్య ప్రయోగయోగ్య విచారులగు రాయబారులును, నిఖిలపురాణేతిహాస సంహితా తాత్పర్య పర్యాలోచనా ధురంధర ధిషణా సముత్సాహంబగు పౌరాణిక సమూహంబును, ఆ సరస సాహిత్య శాస్త్ర వాదగోష్ఠీ ప్రసంగంబున శ్రీనాథకవి – ఏనాడో వర్ణించినది మనంబునందు దర్శించాడు.

ధర్మపీఠాధ్యక్షులు శ్రీనాథుని చూచి, కవిగారు ఏదో ఊహిస్తున్నట్లున్నారు, అనటంతో – గురుస్వామీ! ప్రత్యక్షంగా కనిపించే ఈ కొలువు కూటానికి సాటియైన నాటి కొలువు కూటాన్ని ఏనాడో గద్యంలో సద్యోహృద్యమగురీతి వర్ణించి సహృదయ నైవేద్యం చేసాను. అదియే స్మరించానని ఆవర్ణన వినిపించుటతో, గురుబ్రహ్మ సంతోషంతో, శ్రీనాథకవీ! మీరు, శ్రీకాకుళాంధ్ర వల్లభుని దర్శించినపుడు, మా సాంపరాయని కుమారులు మిమ్మల్ని సాదరంగా ఆహ్వానించి, కస్తూరి సౌరభాన్ని ప్రసరింపజేస్తే, నాడు మీరు వారి ఆహ్వానాన్ని మన్నించి, వారి భవనానికి వెళ్ళి వారి నాశీర్వదించి పల్కిన మధుర సన్నివేశాల నొక్కసారి వినిపించాలని మా కోరిక, అనటంతో సరేనన్నారు. సదస్సులోని స్వర్ణాసనంలోనున్న తెలుంగాధీశులు, మరలా శ్రీనాథుని నోట వినబోతున్నందులకెంతగానో సంతోషిస్తున్నారు. నేను, తెలుంగాధీశుల్ని ఏనాడో చూడటమే కాదు, వారి శౌర్య పరాక్రమాదుల్ని విన్నాను. శ్రీ ప్రౌఢ దేవరాయల సేనాధిపతులుగా యుద్ధాలు చేసి విజయ శంఖారావాన్ని పూరించటం విన్నా!

సాంపరాయని తెలుంగాధీశుడు, అరివీర భయంకరుడై యుద్ధం చేస్తూంటే, వారి అశ్వరత్నాలు శత్రుపక్షంలోని గుర్రాలపై దాడి చేస్తుంటే, వాటి పొడవైన జీనులు, ఒండింటిని రాపాడ, ఘంటాఠంకారాలు రేగుతున్నాయి. శత్రుశిరః ఖండనాలు జరుగుతున్నాయి.

శిరస్సులమీది కిరీటాలు, పర్వత శిఖరారణ్య ప్రదేశాల్లో పొరలాడుతున్నాయి. అంతటి శౌర్యాటోపం గల కర్ణాటాంధ్రాధిపా! తెలుంగురాయా! నీకు బ్రహ్మయువగుగాత – అని దీవించాను.

> శా॥ ధాటీఘోటక రత్న ఘట్టన మిళ ద్ధ్రాఘిష్ఠపకల్యాణ ఘం
> టా ఠంకార విలుంఠ లుంఠన మదోన్మత్తాహి తక్షోణి భృ
> త్కోటీ రాంకిత కుంభినీధర సమిత్కూటాటవీఝాట! క
> ర్ణాటాంధ్రాధిప! సాంపరాయని తెలుంగా! నీకు బ్రహ్మాయువౌ ॥

ఆహా! శార్దూలమే! రౌద్రరసోచిత పదబంధంతో ఆరభటీ వృత్తిలో నడపించిన మీ పులి వేటలా తెలుగురాయని సమర శూరత్వాన్ని కండ్లకు కట్టినట్లు చూపారని ముమ్మకవి మహదానందం వ్యక్తం చేసారు. "శతమానం భవతి" అని ఆశీర్వదించారు. మరి కస్తూరిని కోరిన పద్యం కూడ వినిపించండి అని ముమ్మకవి ప్రేమగా పలుకుతూంటే, తెలుంగాధీశుడు ముసిముసి నవ్వులు రువ్వాడు.

సాంపరాయని తెలుంగురాయా! సత్కవీంద్ర దేవతా బృందానికి కస్తూరీ భిక్షాదానము సేయుమయ్యా! నీ విచ్చిన ఈ కస్తూరీ పరిమళాలు, దక్షారామపురీ విహారుడైన భీమేశ్వరుని సేవించు గంధర్వాప్సరోజాతి వనితల హృదయాలపై గుబాళించునన్నాను, అలా, తలచాను కనుకనే, వారు సమ్మోదంతో కస్తూరిని భీమేశ్వరున కర్పించారు. రంభాద్యప్సరసలు సంతోషంతో భీమేశ్వరునకు సేవలు చేసికొన్నారన్నాడు... ఆ పద్య రత్నాన్ని వినిపించాడు శ్రీనాథుడు.

> శా॥ అక్షయ్యంబుగ, సాంపరాయని తెలుంగాధీశ! కస్తూరి కా
> భిక్షా దానము సేయురా సుకవిరాడ్బృందారక శ్రేణికిన్
> దక్షారామ పురీ విహార వర గంధర్వాప్సరో భామినీ
> వక్షోజద్వయ కుంభి కుంభములపై వాసించు దద్వాసనల్.

ముత్యాలశాల, కరతాళ ధ్వనులతో మురిసింది. ఇంతలోనే చప్పట్ల సందడి ఒక్కసారిగా ఆగింది. ఏమిటా, అని అందరూ ఆశ్చర్యంగా, వేదికవైపు చూస్తున్నారు. నలుగురు పండితుల్ని సంకెళ్ళతో బంధించి, వేదిక చెంతకు తీసికొనివచ్చాడు, వల్లభుడు. పండితుల్ని బంధించారేమిటి?.... అని భావిస్తూంటే, ప్రభూ! వీరు మన విజయనగరం ప్రవేశించి నాల్గురోజులైంది. మన, నిత్యాన్నదాన సత్రంలో భోజనం ముప్పూటలా చేస్తూ, తాళ పత్రాలు చేత్తూ పుచ్చుకొని తిరుగుతూ, వాటిపై ఏవేవో పద్యాలు లిఖించి, ఈ సదస్సుకు

వచ్చిన వారినిపిలచి, ఆ పద్యాలు చదివి వినిపించి, ఇవి శ్రీనాథ కవులు వ్రాసిన పద్యాలేనని నమ్మించి, వారిపై లేనిపోని కాకదంత కథలు చెప్పి, వారిపై మచ్చరంతో, వారిని చెడుగా చిత్రీకరించాలని ప్రయత్నిస్తూంటే, వీరిని మనవారు పట్టి బంధించి తీసికొని వచ్చారు. ఇప్పుడే శ్రీనాథ కవీంద్రులు చదివిన పద్యాన్ని కూడ, కొన్ని పదాలతో మార్చి వ్రాసిన పద్యం వీరి చెంత ఉంది, చూడండి - అంటూ వారి చెంతనున్న తాళపలాశ రేఖల్ని చూపాడు, వల్లభుడు. శ్రీచామనామాత్యులది అందుకొని, చదివి రాయలకంద జేశారు. వారది చదివి, ఆదుష్టచతుష్టయవైతండికులపై మండిపడ్డారు.

వీరికి, శాంతి నిప్పచ్చరం, మచ్చరం ఘనం. అభ్యున్నత గర్వం. వీరి పద్యాలు చూస్తుంటే, అనఘులు పుణ్యాత్ములైన శ్రీనాథ సుకవులపై బురద చల్లడానికే, వీరిచటకు వచ్చినట్లున్నది. వీరెక్కడి నుండి వచ్చారన్నారు. వీరిది రాజమహేంద్రవరము. శ్రీనాథుల వారి పాండిత్యాన్ని కవిత్వాన్ని విని తట్టుకొనే శక్తి లేక, అసూయతో, వారు భక్తి భావంతో చెప్పిన పద్యాల్లోని కొన్ని పదాలు మార్చి, వారిపై చెడు భావం కలిగేలా ప్రచారం చేస్తున్నారని విన్నవించారు.

శ్రీనాథ కవి, ఈ పద్యాన్ని నాలుగేళ్ళ క్రితం పలికిన వారు. దీనిలో 'శ్రేణికిన్' - అను చోట "స్వామికిన్" అని, "పురీవిహారవర" అను చోట "చళుక్య భీమవర" అని మార్చి, ద్రాక్షారామ భీమవర గ్రామంలోని వేశ్యల యొదళ్ళ పూయడానికి తెలుంగు రాయని కస్తూరీ భిక్షాదానము సేయుమని యాచించినట్లు ప్రచారం చేయటం నేరం, ఘోరం. దీనికి తగిన కఠిన శిక్ష, కారాగారమే - అన్నారు రాయలవారు. విన్న పండితంమన్యులు, వేదిక ముందే మోకాళ్ళపై కూర్చుని తలబాదుకొని ఏడ్చి, ఆపుణ్యాత్మునిపై గల మాత్సర్యంతో తప్పుచేసాం. ఇంకెప్పుడూ ఇలా ప్రవర్తించం, క్షమించండి... అంటూ మొరపెట్టుకొన్నారు. ఈ మార్పు విన్న తెలుంగాధీశుడు, నొచ్చుకొని - ప్రభూ! ఇలాంటి వారిని విడిచిపెట్టకూడదు. ఈ పదాల మార్పు వల్ల భావసమన్వయం కుదరదు. అతికినట్లే మచ్చరం వీరి ముఖంలో కనబడుతోంది! భీమేశ్వర సేవకై సముపలబ్ధ జన్మగల దేవగంధర్వాప్సరోజాతి వనితా సమితి, కస్తూరి గుబాళింపుతో సంతసించడానికే కస్తూరి విబుధుల కందజేయుమన్న శ్రీనాథుని ఈశ్వరార్చన కళాశీలతను శంకింపజేయ సాహసించు, పండితబ్రువులను శిక్షింపవలసినదే నన్నారు. సత్రంలో భోజనం చేస్తూ మఠంలోనిద్రిస్తూ వీరు చేసే దుశ్చర్యకు దండన విన్న శ్రీనాథ కవి మనస్సు మంచులా ద్రవించింది.

ప్రభూ! పశ్చాత్తాపం కన్న శిక్ష యేముంటుందంటారు! వారిని కారాగారం పాలు

చేయకండి. వారెంత దూరం నుండో వచ్చారు. పైగా విప్రులు – వారలీ సభలు చూసేలా కనికరించండి... అని పల్కిన శ్రీనాథ పలుకులకు సంతసించారు, మహామంత్రీ! వీరు, శ్రీనాథ కవి విడిది గృహంలోనే ఉండి, వారికి సేవలు చేసికొనేలా శిక్ష విధిస్తున్నాం. సభలు చూడడానికి అనుమతినిస్తున్నాం. వీరినొక కంట కనిపెట్టేలా వేత్రహస్తులిద్దఱిని నియమించండి. మీ అనుమతి లేకుండా వీరీ నగరం నుండి వెళ్ళడానికి వీల్లేదని శాసిస్తున్నాం!.... అని పల్కిన రాయలవారి తీర్పుకు, సదస్యులు కరతాళధ్వనులు చేసారు. వీరికిదే పెద్ద శిక్ష.... అన్నాయి కొన్ని కంఠాలు. సచ్ఛీలుడైన శ్రీనాథుని చాటువులు ప్రకృతిలోని అందచందాలకు, స్త్రీ ప్రకృతిలోని వైవిధ్యానికి ముకుర ప్రాయాలు. పండితమాత్సర్యమే, మమ్మీస్థితికి దిగజార్చినది. శ్రీనాథ కవిని శృంగారిగ చిత్రింప జూచి, భంగపడ్డాము. మావంటి వారికీ శిక్ష చాలదు. ప్రభువులు, మాకు మంచి అవకాశాన్ని కల్పించారు. వారి సేవలో పునీతులం కాగలం. శ్రీనాథకవి, ప్రకృతి రామణీయక పిపాసువే కాని, ప్రద్యుమ్నతంత్ర రిరంసువు కాడని నొక్కివక్కాణించి, చెంపలేసికొని, చెవులు పట్టుకొని, స్వరపేటిక తాకి, ప్రణమిల్లారు... ఆ పండితబ్రువులు.

ఇప్పటికే ప్రొద్దుగ్రుంకుతోంది, పక్షులు గూళ్ళు చేరుకొంటున్నాయి. గగనయాన కడుపునిండా గ్రోలిన కమల మధువు గ్రక్కిందా, అన్నట్లుగా గగన మార్గంలో భానుబింబం రక్తాతపంబు గాసెనేయని, కమలనాథుడు శ్రీనాథుడు తలచాడు.

ఇతః పూర్వమే, అనుకొనిన విధంగా విరామం. అందరూ వారివారి స్వధర్మాచరణ పరాయణులయ్యారు. ద్విజుల సంధ్యావందనాలు పూర్తయ్యాయి.

వాదసభ పునఃప్రారంభమైంది. **రసములెన్ని?** వివరంగా చెప్పండన్నారు. అధ్యక్షుల వారి ఆదేశానుసారం, రసాలు తొమ్మిదేనని, శృంగార హాస్యకరుణ రౌద్రవీర భయానక బీభత్సాద్భుత శాంత రసములని, రతి, హాసము, శోకము, క్రోధం, ఉత్సాహం, భయం, జుగుప్స, విస్మయం, శమము స్థాయిభావాలని వివరించి, భరతుడు, శాంతరసాన్ని చెప్పక మిగిలిన ఎనిమిది రసాలే చెప్పినట్లు డిండిమభట్టారకులు వివరించి, శాంతరసం, భరతునికి సమ్మతం కాదని తోస్తోందన్నారు.

డిండిమభట్టారకుని వాదాన్ని త్రోసిరాజని, భరతునకు శాంతరసం కూడా సమ్మతమేనని వాదించారు, శ్రీనాథ భట్టు.

".....అష్టౌనాట్యే రసాః స్మృతాః" – అని రసాలు ఎనిమిదేని స్పష్టం చేస్తూ భరతుడు వాటికి ఎనిమిది స్థాయీ భావాలనే నాట్యశాస్త్రంలో వివరించిన విషయాన్ని డిండిమభట్టార

కులు విశద పఱచారు. అంతే కాకుండా తొమ్మిది రసాలని చెప్పలేదన్నారు.

డిండిమభట్టారకా! భరతుడు తొమ్మిది రసాలని చెప్పకపోయినా సరే తొమ్మిది రసాలే వారికి సమ్మతమని వారి నాట్య శాస్త్ర గ్రంధం ద్వారా విశదమౌతోంది. భరతముని, ఋజు మార్గంలో తెలుపకపోయినా, మరో మార్గంలో తెలియజేసారు. మొట్టమొదట "వాసుకి" శాంతరస ప్రస్థావన చేసినట్లు, తర్వాత కోహలుడు – ఆ శాంతరస సిద్ధాంతాన్ని బలపఱచినట్లు తెలుస్తోంది.

"క్వచిద్ధర్మః క్వచిత్క్రీడా, క్వచిదర్థః క్వచిచ్ఛమః,
దుఃఖార్తానాం శ్రమార్తానాం, శోకార్తానాం, తపస్వినామ్"
విశ్రాంతి జననం కాలే నాట్యమేతత్ భవిష్యతి,
బ్రహ్మర్షీణాంచ విజ్ఞేయం నాట్యం వృత్తాంత దర్శనం ॥ ...

దుఃఖార్తులకు ధర్మోపదేశం చేస్తూ, శ్రమార్తులకు వినోదాన్ని కలిగిస్తూ, శోకార్తుల కర్థోపదేశం చేస్తూ, తపస్వులకు ప్రశాంతిని కూరుస్తూ ఆయా కాలాల్లో నాట్యం విశ్రాంతి కారణమవుతోంది. ఇదంతా బ్రహ్మర్షులకు కూడ తెలుసు అని భరత మహర్షి అనటంలోనే, భరతునికి కూడ శాంతరసం అంగీకారమేనని తెలుస్తోంది.

అయితే, భరతుడు "క్వచిచ్ఛమః, తపస్వినాం" అని చెప్పటం చేతనే, అభినవ గుప్తుడు – శాంత రసాన్ని స్థాపించు ఘట్టంలో – "మునినాప్యంగీ క్రియతే క్వచిచ్ఛమ ఇతి వదతా" – భరతముని, క్వచిచ్ఛమః – అని చెప్పటంచే భరతముని శాంత రసాన్ని అంగీకరించినట్లు స్పష్టం చేసారు.

భరతముని, – "తుష్యంతి తరుణాః కామే విదగ్ధాః సమయాశ్రితే... మోక్షేష్వథ విరాగిణః – అను శ్లోకంలో – విరాగులు శాంత రసాస్వాదులని తెలియజేసాడు.

"నానాభావోప సంపన్నం, నానావస్థాంతరాత్మకం,

లోకవృత్తాను కరణం, నాట్యమేతన్మయా కృతం... అంటూ, తన నాట్య శాస్త్రంలో భరతుడు, సప్త ద్వీపానుకరణమగు నాట్యాన్ని ప్రతిష్ఠించానని చెప్పటం చేతనే, భరతముని శాంతరసాన్ని అంగీకరించినట్లు తెలుస్తోంది.

"నతత్ జ్ఞానం.... నాట్యేస్మిన్‌యన్న దృశ్యతే" ... అని, భరతముని నాట్యాంగము కానిదేదియులేదని తెలుపుట చేత, శాంత రసం, వాని కంగీకారమే!

రసము, సహృదయ సామాజిక నిష్ఠం కనుక ఆతని యందు నటుని నాట్యంచే వాసనారూప స్థాయీ భావాలు అభివ్యక్తములై ఆస్వాదింపబడి, అలౌకిక చమత్కారాన్ని

కల్గించి రసాస్వాదకుని చేస్తాయి. అందుకే శాంతరసం, సహృదయ సామాజికనిష్ఠమై ఆస్వాద యోగ్యమౌతోందన్న సత్యాన్ని భరతుడు, తన నాట్య శాస్త్రంలో చెప్పక చెప్పాడు.

శాంతరసమునకు, "నిర్వేదము" స్థాయీ భావమని భరతముని అభిప్రాయం. "తత్త్వజ్ఞానతో నిర్వేదోస్య స్థాయీ" - అని కదా.

భరతముని, స్థాయీ భావాల ఎనిమిదింటిని చెప్పిన తర్వాత, తన నాట్య శాస్త్రంలో వ్యభిచారీ భావాలను గణిస్తూ ప్రప్రథమంలోనే "నిర్వేదము" ను పేర్కొన్నాడు. నిర్వేదము - అమంగళ ప్రాయం! వ్యభిచారీ భావాలను పేర్కొంటూనే - "మంగళాదీని మంగళ మధ్యాని మంగళాంతాని శాస్త్రాణి ప్రథంతే" - అను న్యాయాన్ని అనుసరించి, చెప్పవలసిన భరతమహర్షి, అమంగళ ప్రాయమైన నిర్వేదమును మొట్టమొదటనే ఎందుకు చెపుతాడు? ఆలోచించాల్సిన విషయమిది. ఇది అమంగళప్రాయమైన స్థాయీభావాల వెంటనే దీనిని చెప్పటాన్ని బట్టి స్థాయీభావంగాను, వ్యభిచారీ భావం గాను కూడ దీనిని ఉద్దేశించినట్లే తెలుస్తోంది. అసలు భరతమునికి ఈ ఉద్దేశ్యమే లేకుంటే, దీనిని స్థాయీ భావాల వెంటనే, వ్యభిచారీ భావములకు మొదట చెప్పడు. అగ్రస్థానంలో పఠించటం చేతనే, శాంతరసాన్ని, దాని స్థాయీభావాన్ని నిర్వేదాన్ని ఆతడు, నాట్యశాస్త్రంలో చెప్పినట్లే సుస్పష్టమౌతోంది. నిర్వేదం - దారిద్ర్య, వ్యాధి, అవమాన, క్రోధ, అధిక్షేప, ఇష్టజన వియోగ తత్త్వ జ్ఞానాది విభావాదుల వలన కలుగుతున్నా, తత్త్వజ్ఞానం వల్ల కలిగిన నిర్వేదమే శాంత రసమునకు స్థాయీభావం అని, శ్రీనాథ కవి, తన ఉద్భట వివాద ప్రౌఢిచే డిండిమభట్టు వాదాన్ని ఖండించాడు.

రసపిపాసకులైన శ్రోతలు, రసానందలహరిలో ఓలలాడుతున్నారు. శాంతము, భిత్తి వంటిది, స్థాయీ భావాలు, భిత్తిపై వ్రాయబడిన చిత్తరువుల్లాంటివి. చిత్తరువులు అస్థిరాలు. ఒకదాన్ని చెఱిపి మరొకటి వ్రాయవచ్చు. భిత్తి స్థిరంగా ఏకరూపంగా నిలుస్తుంది కదా! కాబట్టి శాంతరసం నుండియే - నిమిత్తాన్ని బట్టి, ఇతర రసాలన్నీ వెలువడతాయి. నిమిత్తమడగగానే, శాంతమే నిలుస్తుంది. సమస్త శాస్త్రాలు, శమం కొఱకే విద్వాంసులు నిర్మించారు. కాబట్టి, ఎవని మనస్సు శాంతంగా ఉంటుందో వాడే సర్వశాస్త్రజ్ఞుడని శ్లోకం పఠించి, రసతత్త్వ ద్రష్టల సిద్ధాంతమిదేనన్నాడు శ్రీనాథుడు.

శ్లో॥ **"శమార్థం సర్వశాస్త్రాణి నిర్మితాని మనీషిభిః ।**

తస్మాత్స సర్వశాస్త్రజ్ఞః యస్యశాంతం మనస్సదా ॥ ... శాంతి మంత్రం పఠించారు.

10. ముత్యాలశాలలో పదవరోజు వాద సభా ప్రారంభానికి ఘంటారావం మ్రోగింది.

శ్రీ ప్రౌఢ దేవరాయలవారు స్వర్ణ సింహాసనాధిష్ఠితులై తిలకిస్తున్నారు. సదస్యులను అలరింపజేయాలనే సదుద్దేశ్యంతో, రాయల మనమెఱింగిన గురుబ్రహ్మ వారికి చక్కని ప్రశ్నలిచ్చారు. వారుభయులు చక్కగా పూరించారు. ఒకరిని మించి మరొకరు సమాధానాలు సరసమగు రీతిలో చెప్తున్నారు. ఉద్భట వివాదాలనాస్వాదించి సదస్యులు, ఈ ప్రశ్నోత్తరాలను పరమాన్నంలో జీడిపప్పు తిన్నట్లానందించారు.

ఇంతలో మహామంత్రి చామనామాత్యుల వారొక ప్రశ్నను శ్రీనాథున కివ్వాలని తలచారు. రాయలవారి అనుమతిని తీసికొన్నారు.

శ్రీనాథ కవీ! మా రాయలవారికి ఇద్దఱు భార్యలున్నారు. వారు, ఇద్దఱు భార్యల్ని సమానంగానే ప్రేమిస్తున్నారు. వారిద్దఱి యందు కూడ చక్కని సంతానాన్ని కన్నారు... అనటంతోనే, కులగురు బ్రహ్మలు, ముమ్మకవి, చామరసు మున్నగు వారంతా చకచ్చకితులయ్యారు. సదస్యులలో గుసగుసలు చెలరేగాయి. మన ప్రభువులకు మహారాణి గారొక్కరే కదా! ఇద్దఱెవరు? – అని కొందఱు సన్నిహితులు మధనపడుతున్నారు. మఱికొందఱు, రాజులు నవప్రియులు కదా! యని మనస్సులోనే భావిస్తున్నారు. ఏమో? అని కొందఱు భ్రుకుటి నెగరేసారు. రాయలువారు మాత్రం గంభీరంగానే స్వర్ణ సింహాసనంలో దర్శనమిస్తున్నారు.

ఇవన్నీ గమనించిన మహామంత్రి గారు, శ్రీనాథ కవీ వింటున్నారా! అంటూంటే, విజయనగరాస్థాన విద్యాధికారులు చిఱునవ్వులు చిందించారు. కులపతి రాజనాధుడు, మా రాయల వారిని పదివసంతాల నుండి చూస్తున్నాం. వారు ఏకపత్నీవ్రతులు. మహారాణి వారొక్కరే! వారినీ విధంగా పలుకుట న్యాయమా? అన్నారు గంభీర స్వరంతో.

చామనామాత్యులు, మందస్మిత వదనంతో శాంత స్వరంతో, రాజనాధా! నేనూ ఆ మాటే చెప్తున్నాను. మా రాయలవారు ఏకపత్నీవ్రతులై ఇద్దఱు రాణులను ఏలుకొంటున్నారని, ఈ విషయంలో శ్రీనాథ కవి ఏమంటారని? – అన్నారు.

భార్య లిద్దఱి యందును సంతానం కనిన వారు, ఏకపత్నీవ్రతులెట్లా అవుతారు? ఇద్దఱు భార్యలుంటే ఏకపత్నీవ్రతుడెలా? ఏకపత్నీవ్రతుడైతే ఇద్దఱు భార్యలెట్లుంటారు? ఇదంతా అస్తవ్యస్తంగానే ఉంది.... అన్నారు, చామరసు కవి.

వెనుకటికి ఎవడో ఎద్దు ఈనింది, దూడను గుంజకు కట్టేయుమన్నాడుట. అట్లా ఉంది ఈ ప్రశ్న! అని బుర్ర గోక్కుంటున్నాడు వల్లభుడు.

ఇందు, "స్వవచో వ్యాఘాతము"న్న దన్నాడో పండిత శిఖామణి. మీరందఱూ మీమీ

అభిప్రాయాలు చెపుతున్నారు. మరి శ్రీనాథ కవీశులేమంటారో విందాం, అని ప్రేమతో పలికిన మహామంత్రికి, మోదుపులిడి, గురుబ్రహ్మకు గోపులని, చామరసుకు చెంగనాలంచు పల్కి, ముమ్మకవికి పల్లాండులర్పించి - ప్రధానామాత్యా! నేటికి చిక్కని ప్రశ్న చిక్కింది. మీరన్నది నూటికి నూరు పాళ్ళు యదార్థమేకదా, అనిన శ్రీనాథ కవితో - నిజమని చెప్పుట కాదు, సత్యనిరూపణ గావించాలన్నారు, మహామంత్రి.

శ్రీనాథుడు: గీ॥ రాజ్యలక్ష్మియు, గృహలక్ష్మి రాణులగుచు
రాయల మదిని రంజింపగా యశంబు,
మల్లికార్జును లు గలుగ, మహిని రాయ
లేక పత్నీవ్రతుడగుచు నేలు చుండె ॥

కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి. **ముత్యాలశాల** మురిసింది. ఆనంద సుమం విరిసింది. ఆహా! రాజ్యలక్ష్మి, గృహలక్ష్మి - మా రాయలవారి భార్యలా? రాజ్యాన్ని గృహాన్ని రంజింపజేసే రాయలవారికి, కీర్తిపుత్రుడు, యువరాజు మల్లికార్జునుడు పుట్టారు. అయినా రాయలవారు ఏకపత్నీవ్రతులుగా ఉండి, ఇద్దఱు రాణులను ఏలుతున్నారనే భావంతో అత్యంత మనోహరంగా తెలిపిన శ్రీనాథ కవికి ఏమిచ్చి విజయనగర ప్రజలం ఋణం తీర్చుకోగలం, ప్రేమతో త్రికరణశుద్ధిగా నమస్కారం చేసికొంటాం... అంటూ సదస్యులంతాలేచి శిరస్సు వంచి వేనోళ్ళ, కమలనాథుడైన శ్రీనాథుని కొనియాడారు.

రాయలవారు, శ్రీనాథుని సాహిత్యలాస్యలాహిరిలోనానందిస్తున్నారు.

ముత్యాలశాల వాగ్వివాద సదస్సులో **ఆలంకారిక చర్చ** సాగుతోంది. ఉక్తి వైచిత్రియే అలంకారమని, చమత్కారత్వమే అలంకారము అని, అనేక నిర్వచనాలతో శ్రీనాథ భట్టు, డిండిమభట్టు లిరువురూ నిర్వచనాంతర్గత విషయాలు వాదించారు.

శ్లో॥ "అంగీకరోతి యః కావ్యం శబ్దార్థావనలంకృతీ ।
అసౌ నమన్యతే కస్మాదనుష్ణ మనలంకృతీ ॥

అనలంకృతాలైన శబ్దార్థాలను కావ్యముగా అంగీకరించిన వాడు అనలముననుష్ణముగా భావింపదేల? యని జయదేవుడు ప్రశ్నించాడు.

కావ్యకాంతకు శబ్దార్థాలంకారాలే శోభనిస్తాయంటూ, శబ్దార్థాలంకారాలు రెండూ చర్చించి, అతిశయోక్తి సర్వాలంకారబీజమని పల్కిన ముమ్మకవి అభిప్రాయాన్ని సమర్థిస్తూ, అభేదరూపమైన ఆరోపణతో దాపరికంచేసి వర్ణిస్తే, అది "రూపకాతిశయోక్తి" అని, అతిశయోక్తిలోని ప్రధానములైన ఎనిమిది భేదాలను వివరించి - నల్లకలువల జంట

నుండి వాడియైన బాణాలు వెలువడుచున్నవి, చూడు - అను లక్ష్యం, రూపకాతిశయోక్తి లక్షణానికి చెప్పి, అవాంతరభేదాలలోని వైవిధ్యాలను వివరించి, "ఉపమ మాత్రం చెప్పి, ఉపమేయాన్ని మరుగుపరచి చెప్పేది అతిశయోక్తియని సాధారణ ధర్మంగా తెలిపి, అతిశయంగా పలికే పలుకుల్లోని ఆంతర్యాన్ని వివరించారు డిండిమభట్టారకులు.

అతని శత్రవులతో పాటు, అతని కీర్తి దిగంతాలకు వెళ్ళెను - అనే లక్ష్యం, కీర్తి ప్రధాన విషయం. వెళ్ళెనను క్రియతో అన్వయం కల్గి ఉంది. సహార్థకం ఉపాదానం చేయటంచే అప్రధానమగు శత్రువులకు కూడ క్రియాన్వయం పొందుతోంది. శత్రుపలాయనం - నిజానికి కారణం కాగా తత్ఫలంగా యశోవ్యాపనం జరుగుతోంది. కారణ కార్యాలు రెండూ సమకాలంలో జరుగుచున్నాయి - అనటంచేత, ఇది అక్రమాతిశయోక్తియని చెప్పవచ్చునని ఎప్పుడైతే డిండిమభట్టారకులు పలికారో, వెంటనే శ్రీనాథకవి, "తస్యకీర్తిః ప్రత్యర్థిభిస్సహా" - అను లక్ష్యం సహార్థక శబ్దోపాదానంచే ప్రకృత లక్ష్యం "సహెూక్తి" కే సరిపడుతోంది. ఇటు అప్రధాన విషయం, ప్రధాన విషయానికుత్కర్షను చేకూర్చటంచే జనరంజన సామర్థ్యం స్పష్టం. డిండిమభట్టుగారన్నట్లు, "అక్రమాతిశయోక్తి" కది లక్ష్యమగునని అనిపించవచ్చునేమోగాని, సహార్థక శబ్దోపాదానం అతిశయోక్తి యందు జరుగదు కనుక వారి వాదం నిలచుటకేమాత్రం అవకాశం లేదు.

"మధ్యః కిం కుచయోర్ధృత్యైబద్ధః కనకదామభిః" - ఇటను బంగారు గొలుసులచే బంధింపబడిన దన్నపుడు - ప్రకృతమైనవళి త్రయాన్ని నిగరణముచేసి అప్రకృతాన్ని మాత్రమే చెప్పినట్లు తలచవచ్చును. వళులన్న బంగారు గొలుసులచే నడుము బంధింపబడినదనుటచే - ఇది రూప కాతిశయోక్తియని పల్కిన డిండిముల వాదాన్ని ఖండిస్తూ, ఇచట ప్రాధాన్య వివక్షచేత, మొత్తం వాక్యమందు విస్తరించియున్న ఫలోత్ప్రేక్షను చెప్పుటయే సమంజసమని, శ్రీనాథ కవి నొక్కివక్కాణించారు. తర్వాత శబ్దాలంకార చారుత్వాన్ని చవిచూపారు.

సర్వాలంకారాలు, అతిశయోక్తికి అన్వయం చేసి చూప ప్రయత్నిస్తూ సర్వాలంకార బీజభూతమే - అతిశయోక్తియని వాదించు వారి వాదమేఘాల్ని, శ్రీనాథ కవి తమ వాదవాయువులచే తరిమికొట్టారు. పైగా ఉపమ, సర్వాలంకార **భీజభూతమనే** వామన మతాన్ని సమర్థించారు.

"ఉపమాలంకారిణి" ఒక నటి. ఆ **నటి**, చిత్ర విచిత్రాలైన ఆహార్యాలను ధరించి, కావ్యరంగాన లాస్యమాడుతూ, ఆ కావ్యవేత్తల హృదయాలను రంజిల్లచేస్తోంది. ఓ **గాజును**,

చేతికి వేసి కొంటే **గాజు,** అదే చెవికి పెడితే కర్ణాభరణం, మెడలో ఉంటే కంటె, కాలికి పెట్టుకొంటే కడియం, నడుము - సన్నగా ఉంటే, అస్తి నాస్తి విచికిత్సాహేతుశాతోదరికి అదే ఆభరణం పెడితే వడ్డాణం, వేలికి పెడితే ఉంగరం, ఇలా ఒకే ఆభరణాన్ని విభిన్న ప్రదేశాలలో కొంచెం మార్పులు చేర్పులతో ధరిస్తే ఆభరణాల పేర్లు మారినట్లే, ఉపమా లక్ష్యాన్ని అలతి అలతి మార్పులు, చేర్పులు కూర్పులు చేస్తే మరొక అలంకారం దర్శనమిస్తుందని వివరించారు, శ్రీనాథ సుకవి.

సాదృశ్య శ్రీప్రధానమైంది ఉపమాలంకారము. ఉపమానమునకు ఉపమేయమునకు సామ్యమైన సౌందర్యం సహృదయరంజకంగా ఉండేది **"ఉపమాలంకారం"**. ముఖము చంద్రుని వలె ఉన్నది అని సాదృశ్యాన్ని వర్ణిస్తే **ఉపమాలంకారం** ముఖము చంద్రుని వలెనున్నది - చంద్రుడు ముఖమువలె ఉన్నాడు - అని చెపితే **ఉపమేయోపమా**లంకారం. చంద్రుడు ముఖమువలె ఉన్నాడు - అన్నచో **ప్రతీపాలం** కారము. ముఖము ముఖమువలె ఉన్నది - అని పలికిన **అనన్వయా**లంకారము. చంద్రుని చూచి ప్రియా ముఖమును స్మరింతును - అన్నచో **స్మరణా**లంకారం ముఖమే చంద్రుడు - అని వర్ణిస్తే **రూపకాలం**కారం.

ఇది ముఖమా? చంద్రుడా? అని పలికితే **సందేహా**లంకారం. ముఖచంద్రునిచే తాపము శమించును - అనినచో **పరిణామా**లంకారము. చంద్రుడని చకోరాలు, నీ ముఖమును గూర్చి పరుగెడుతున్నాయి - అని భ్రాంతి చెంది పలికిన **భ్రాంతి మద**లంకారం. చంద్రుడని చకోరాలు, కమలమని తేంట్లు నీ ముఖాన్ని చూచి మోదించుచున్నాయి - అంటే **ఉల్లేఖా**లంకారం. ఇది చంద్రుడు కాబోలు - అని పల్కిన **ఉత్ప్రేక్షా**లంకారము. "ఇది ముఖం కాదు, చంద్రుడు" - అనినచో **అపహ్నవా**లంకారం. "ఇది చంద్రుడే" అనిన **అతిశయోక్త్య**లంకారం. చంద్రుడును, నీ ముఖమును నిశియందు ప్రకాశించును - అనిన **దీపకాలం**కారము. ముఖము చంద్రపద్మాలను జయించింది - అని వర్ణించిన **తుల్యయోగితాలంకారం** నీ ముఖమునందే నేను సంతోషిస్తా - చంద్రునియందే చకోరాలు సంతోషిస్తాయి - అనిన, **ప్రతివస్తూ**పమాలంకారం. "ఆకాశమున చంద్రుడు, భూమియందు నీ ముఖము - అన్నచో **దృష్టాంతా** లంకారం. ముఖం చంద్రశ్రీని భరిస్తోంది - అనిన **నిదర్శనాలం**కారము. నిష్కళంకమగు ముఖం, చంద్రునతిక్రమిస్తోంది అని చమత్కరిస్తే **వ్యతిరేకా**లంకారం. నీ ముఖముతో కూడ చంద్రుడు, రాత్రి ప్రకాశిస్తున్నాడన్నచో **సహోక్త్య**లంకారము. ముఖము స్మిత చంద్రికల తిలక కళంకంతో శోభిల్లుతోంది - అనిన **సమాసోక్త్య**లంకారం. ముఖము నందు చంద్రుడు నిష్ప్రభుడు - అని పల్కిన

అప్రస్తుత ప్రశంసాలంకారం. బ్రహ్మజ్ఞానం వల్ల సమస్త ప్రపంచం తెలియబడే విధంగా, ఉపమాజ్ఞానం వల్ల సమస్తాలంకార జ్ఞానం సిద్ధిస్తుందని, శ్రీనాథ కవి లక్ష్య లక్షణ సమన్వయంతో నిరూపించారు. శ్రోతల చప్పట్లు మార్మోగాయి. శాన్తిమంత్రం పఠించారు.

11. ముత్యాలశాల, లాసకలాస్య హాస్యహాసన హాసనాసన హాసన హేల! రసలీల! **పదకొండవరోజు** వాద సభ ప్రారంభం కాబోతోంది. ఘంటారావం మ్రోగింది. సాహిత్యాభిలాషులు సభనలంకరించారు. పెద్దలంతా తమ తమ స్థానాల్లో ఆశీనులయ్యారు. వంది మాగధులు జయ జయ ధ్వానాలు చేస్తూంటే, శ్రీశ్రీశ్రీ ప్రౌఢ దేవరాయలవారు ముత్యాలశాలకు విచ్చేసి, వేదికపై నున్న నవరత్నఖచిత స్వర్ణసింహాసనంలో ఆశీనులయ్యారు. ధర్మపీఠాధ్యక్షులైన రాజకులగురు బ్రహ్మలు ధర్మపీఠాన్నధిష్ఠించారు. ఉపమాలంకార వైభవ ప్రాభవాన్ని సోదాహరణంగా వినిపింపుమనటంతో, శ్రీనాథ కవి, మహాకవి కాళిదాస కవీశుని మనఃపదవిని నిలిపి, ఆది దంపతులైన పార్వతీపరమేశ్వరులను స్మరించాడు.

శ్లో॥ వాగర్థా వివ సంపృక్తౌ వాగర్థః ప్రతిపత్తయే ।
జగతః పితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ ॥

రఘువంశం 1-1

వాగర్థ ప్రతిపత్త్యర్థం, శబ్దార్థములవలె సంపృక్తులైన ప్రపంచమాతా పితరులౌ పార్వతీపరమేశ్వరులకు నమస్కరిస్తున్నానని, మహాకవి పల్కిన ఈ తొలిపలుకులో పూర్ణోపమాలంకారం, దానికదే సాటి లేని మేటిగా దర్శనమిస్తోంది. దాంపత్య ధర్మానికి ప్రతీకలు పార్వతీపరమేశ్వరులు. ప్రతి కుటుంబం వారిలా ఉంటే, వారికి సంతోషం కొంగుబంగారమే. కాళిదాసాదులు, వ్యాసవాల్మీకాదులు వాడిన ఉపమాలంకారాల వల్లనే వారి కీర్తి ప్రతిష్ఠలు, అంబరచుంబితాలు. ఉపమాలంకారాన్ని వేయటంలో అందెవేసిన చేయి కాళిదాసు. అందుకే "ఉపమాకాళిదాసు" గా ప్రసిద్ధిచెందాడు. **"ఉపమాకాళిదాసస్య భారవేరర్థ గౌరవమ్, దండినః పదలాలిత్యం, మాఘేస్సంతి త్రయోగుణాః"** - అనే శ్లోకం గీర్వాణాంధ్ర సాహితీరిరంసువుల జిహ్వాగ్రంపై నర్తిస్తోంది. నీలి పుట్టంమీది ముత్యాల తావళములవలె, అంధకారంలో నక్షత్రాలు, కాంతులు విరజిమ్ముతున్నట్లున్న "పూర్ణోపమ"ను వినిపించాడు, శ్రీనాథుడు.

గీ॥ ప్రబలమై యంధకారంబు బలిసియుండ
దారకంబులు కాంతినెంతయు బెరసె
నీలి పుట్టంబుబఱచి పై నిలిపినట్టి

వలుద ముక్తా ఫలముల తావళములట్ల.

- భీమఖండం 2-36

మగువా! నీ పగడాల కెమ్మోని మీది చిరునవ్వు పుట్టిన విధంలా, నీవు పెంచిన లత చిగురున మొగ్గలుల్లసిల్లునే... అంటూ శ్రీనాథుడు తాను వర్ణించిన పద్యం వినిపించాడు. ఆ వర్ణించిన పద్యంలోని పూర్ణోపమయిది.

కం॥ మగువా! నీ పెంచిన లత
చిగురున ముకుళంబులుల్లసిల్లునె చెపుమా!
పగడపు గెమ్మోవి పయిన్
నగవుదయించిన విధంబునం బ్రస్ఫుటమై.

లత చిగురున మొగ్గలు ఉపమేయం. మగువ పగడాల కెమ్మోవి మీది చిరునవ్వు ఉపమానం. విధంబున - ఉపమావాచకం. ఉల్లసిల్లుట - సమానధర్మం. ఇది పూర్ణోపమ. ఈ విధంగా ఉపమాలంకార సౌందర్యాన్ని లక్ష్యలక్షణ సమన్వయం చేసి చెప్పాడు. మిగిలిన అలంకారాల వైభవాలను, వారుభయులు వాద ప్రతివాదాలతో విన్పించారు.

మహేశ్వరుని తపస్సును భంగం చేయాలని, వసంతునితో మన్మధుడు వచ్చాడు. శివతపోవనమంతా నవనవోన్మేషమైంది. అప్సరసలు హిందోళరాగం పాడారు. ప్రకృతి పులకించింది. సృష్టి సింగారించింది. అయినా శివుని తపోనిష్ఠ చెక్కుచెదరలేదు. జితేంద్రియులైన యతీంద్రుల్ని అంతరాయాలేమీ చేయలేవన్నాడు.

గీ॥ అచ్చరలు పాడు హిందోళ మాలకించి,
యిందుమౌళి ప్రసంఖ్యాన మెడలడయ్యె
నిర్జితేంద్రియులైనట్టి నియమ పరుల
నంత రాయంబు లేమి సేయంగ గలవు?

అప్సరల హిందోళరాగంచే శివుని ఏకాగ్రత భంగం కాలేదు - అనేది విశేషం. జితేంద్రియులైన యతీంద్రులను అంతరాయాలేమీ చేయలేవనేది సామాన్యం. ఇచట, సామాన్యంచే విశేషం సమర్థింపబడింది కనుక, అర్థాంతర న్యాసాలంకారమని వివరించాడు. తపస్సు చేసికొనే పార్థుని చెంతకు, ఊర్వశి వస్తే - నేనే నీ దర్శనానికి రావాలనుకొంటున్నా. ఆడబోవు తీర్థమెదురైనట్లు నీవే వచ్చావు - అంటూ ప్రహర్షణాలంకారం వినిపించాడు. చండ గాండీవ తాడిత ఖండ పరశు"... అంటూ వృత్త్యనుప్రాస, "మున్నీటి నడునీట... అంటూ ఛేకానుప్రాస మున్నగు శబ్దాలంకార వైభవాన్ని విన్పించాడు శ్రీనాథుడు. తర్వాత

వారుభయులు, ఉద్భట వివాద ప్రౌఢిమీర, ఆలంకారిక చర్చా సమరం సాగించారు. ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

ప్రతిరోజు, సాహితీ రిరంసువులందరూ, ఉదయమే ఉద్యానవనంలో సమావేశమై దుగ్గన్న సన్నిధిలో, వాదాంశాల్ని శ్రీనాథ భారతిని స్మరించుకొంటూ ఆనందిస్తున్నారు.

12. ముత్యాలశాలలో పన్నెండవరోజు వాద సభ ప్రారంభ సూచకంగా ఘంటారావం వినబడింది. సంగీత సాహిత్య రిరంసువుల యంఘ్రిరజోలేశం సోకినా పునీతులం కాగలమనే భావంతోను, శాస్త్రచర్చా వాయువులచే శ్రవణాలు పునీతమవుతాయనే సత్సంకల్పంతోను దేశం నలుమూలలనుండి రసజ్ఞ శేఖరులు, ముత్యాలశాలకు విచ్చేసారు. దాంతో ముత్యాలశాల, ఆనందలహరిలో ఓలలాడుతోంది. చతుష్షష్టి కళలలో ప్రావీణ్యాన్ని సంపాదించిన, మహనీయులంతా, తమ తమ పనులకు స్వస్తి చెప్పి, ముత్యాలశాలను మురిపిస్తున్నారు. నేటి సభలో సదస్యులతో పాటు సభికులు కూడ వచ్చి కూర్చున్న దృశ్యాన్ని తిలకించిన ధర్మపీఠాధ్యక్షులు, వాగ్వివాద వరేణ్యులతో, – "చతుష్షష్టి కళలలో ఉత్తమోత్తమ కళయేదో నిరూపించాలన్నారు". రాయలముఖ కమలం మరింతగా వికసించింది.

అరుణగిరినాథుడు, శ్రీనాథుడు సద్గురు ప్రార్థనలు చేసారు.

కం॥ వాణికి జరణా నతగీ
ర్వాణికి నేణాంక శకల రత్న శలాకా
వేణికి బుస్తక వీణా
పాణికి సద్భక్తితోనుపాస్తియొనర్తున్ ॥ అని శ్రీనాథ కవి భారతిని నుతి చేసి, నతులర్పించాడు. చతుష్షష్టి కళలలోను లలితకళలు నాలుగు. అవి, చిత్ర లేఖనం, శిల్పం, సంగీతం, సాహిత్యం. ముఖ్యంగా చతుష్షష్టి కళలు, వృత్తికి సంబంధించినవైతే వాటిలో శిల్పాదులున్నాయి. వృత్తి, విద్యా, ఉపచార కళలని – ఒకొక్కదాంట్లోను అఱువదినాల్గు వంతున చెప్పబడ్డాయి. ఇవి వెరసి నూట తొంభైరెండు. అన్వీక్షకీ, త్రయీ, వార్త దండనీత్యాదులు విద్యాకళలు. సేవ, సమ్మానం, చికిత్స, అర్ఘ్యపాద్యాది చతుష్షష్టి కళలు ఔపచారిక కళలు. వాత్స్యాయన మహర్షి చెప్పిన అరువది నాల్గు కళలయందు, అయిదు వందల పదునెన్మిది అవాంతర కళలు కలవన్న విషయాన్ని యశోధరుడు చెప్పాడు. ఉపాయముతో కూడుకొన్న ఔపయిక కళలలో కవితాప్రసక్తియుంది. సమస్యాపూరణాది కవితా వినోదాలందున్నాయి – అంటూ జయ మంగళ వ్యాఖ్యాంతర్గత కళారహస్యాలను, అరుణగిరినాథులు వివరిస్తూంటే, ఔపయిక కళా హృదయాన్ని శ్రీనాథ కవి ఆవిష్కరించారు.

వాత్స్యాయన మహర్షి, మానసవాభ్యుదయాన్ని కోరి ఈ కళలను వివరించారు. కళా ప్రయోజనం, ఆనందమే, వశీకరణానికి కళలెంతగానో తోడ్పడతాయి. స్త్రీ, పురుషులలో ఒకరినొకరు వశపరచుకొనుట పరమప్రయోజనం. అది ధార్మికమైనపుడే ఉభయతారకం. పతి వియోగంలో స్త్రీ, ఈ కళాపరిజ్ఞానంతో సుఖంగా జీవింపవచ్చు. వేశ్య కూడ, వెలవెలది కాకుండా, శీలరూప గుణాన్వితయై రాజాదరణ పొంది సుజన శ్లాఘ్యమైన సుఖ జీవనాన్ని గడుపవచ్చుటకే కళ ఎంతగానో సహకరిస్తుంది అని శ్రీనాథ కవి కళా ప్రయోజనాన్ని వివరిస్తే – కొందరు కళాకారులు, వేశ్యలలో, కొందఱు ఈ కళలను స్వప్రయోజనానికి, అధర్మ మార్గంలో ఉపయోగించుకొనుట శోచనీయమని అరుణగిరినాథులావేదన వ్యక్తం చేసారు.

కళను కళగా గౌరవించాలని, కళాకారునికి గౌరవమిచ్చిననాడే సమాజం తేజోవంత మౌతుందని శ్రీనాథ కవులు వాదించారు. తర్వాత చిత్రలేఖనం, శిల్పం, సంగీతం, సాహిత్యం – లలిత కళలుగా గుర్తిస్తున్నారని తెలియజేస్తూనే, చతుష్షష్టి కళలలో కవిత్వం చేరదని, ఒకవేళ చేరుతుందన్నా, అది చిత్ర కవిత్వమేనన్నారు. చిత్రాలు కాలగర్భంలో కలసిపోతున్నాయి. కుడ్యచిత్రాలు, చెరిపి, మరలా చిత్రింప వచ్చు. మరి శిల్పాలో రూపాన్ని ఒడ్డు, పొడుగు, లావు, మున్నగునవి చూపవచ్చు. ఎచటికైనా తీసికొని వెళ్ళవచ్చు. కాని, అవి కూడ కాలగర్భంలో కలసిపోవచ్చు. సంగీతం, సాహిత్యం వినడానికి మనోహరంగా ఉంటాయి. గురుముఖతః వేదాలవోలె వ్యాప్తి చెందుతాయి. నారద, తుంబుర, విశ్వావసు, మున్నగు వారు సంగీతాన్ని ప్రచారం చేసారు. హనుమంతుడు, చెంతకు వచ్చిన నారద, తుంబురులు తమలో సంగీత కళా ప్రవీణులెవరో తేల్చుమన్నారు. రామనామాన్ని జపించు, మారుతి, – వారి వీణెలను తన ప్రక్కనున్న రాతిపై నుంచుమని చెప్పారు. వారలాగే ఉంచారు. అంత సుందరుడు రామనామాన్ని గ్రహించి, గుండ క్రియారాగాన్నాలపిస్తే, ఆ బండరాతిపై నున్న వీణెలు రెండూ హనుమంతుని గానానికి కరిగిన రాతిలో అతుక్కున్నాయి. వెంటనే ఆంజనేయుడు, ఎవరు తమ సంగీత కళచే రాయిని కరగించి వీణె తీసికొంటారో వారే ప్రవీణులన్నారు. ఇద్దరూ ప్రయత్నించి విఫలులయ్యారు. రామబంటే పాడి, రాయిని కరగించి, వారి వీణెలిచ్చారు.

సంగీత మహిమను చాటి చెప్పిన పింగాక్షుని, వారుభయులు శ్లాఘించి, వారి ఉపదేశంతో ద్వాపరంలో నేర్చుకొని సంగీత విద్వాంసులయ్యారు. సంగీతానికి పరవశించని ప్రాణిలేదన్నారు. కవిత్వమున రూపచిత్రణము సాధ్యంకాదు. అలంకారాది సాధన సామాగ్రిచే

ఆ రూపాన్ని సూచిస్తాడేకాని, చిత్రింపలేడు. ఒకవేళ ఆతడు చిత్రించినా, ఆతని అక్షర రూపము, శబ్దార్థము తెలిసిన వానికి మనోనయన గోచరమేకాని, చర్మచక్షుర్గోచరం కాదు. చదువు రానివాడైనా విని ఆనందించేది సంగీత విద్యయే! అందుకే, **"శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తిగాన రసంఫణిః"** – అన్నారు, సంగీత కళారహస్యజ్ఞులు... అని డిండిమభట్టు పలికారు.

అరుణగిరినాథులు చేసిన స్వరాభిషేకానికి సాగింతయనిన శ్రీనాథ కవి, కవితాసాహచర్యములేని వట్టి నాద రూప సంగీతానికి శాశ్వతత్వం లేదు. అది గాలిలో కలసిపోతుంది. కవితా సాహచర్యం ఉంది కాబట్టే, జయదేవుని గీతగోవిందాన్ని పాడుకొంటున్నాం. అష్టపదులలోని అందచందాలను మనసాదర్శించి వాచాస్మరించి, కర్మణా కరతాళ ధ్వనులు చేస్తూ ఆనందిస్తున్నాం – అన్నారు. సంగీతం – సకల ప్రాణి కోటిని రంజింపజేస్తుందనే మాట యధార్థం. సంగీత మాహాత్మ్యాన్ని ప్రశంసించుట రెండు వేల నాలుకలున్న ఆదిశేషువునకైన శక్యం కాదు...."ధర్మార్థ కామమోక్షాణాం ఇదం ఏకైక సాధనం" – అని సంగీత రత్నాకరం, దీని గొప్పతనాన్ని తెలిపింది. సంగీతానికి శిలలు కరుగుతాయన్న విషయాన్ని కథారూపంలో వివరించారు, అరుణగిరినాథులు. మేఘాలు వర్షిస్తాయి అని భోజుని ఆస్థాన సంగీత విద్వాంసులు, అమృతవర్షిణీ రాగాన్ని ఆలపించి అమృతవృష్టిని కురిపించారు. క్రీస్తు పూర్వమే భారతదేశాన్ని పరిపాలించిన కుంతలశాతకర్ణి – ఆస్థాన సంగీత విద్వాంసుడు, సంగీతాన్నాలపిస్తే విన్న చేలు బాగా పండినవని, దీపక రాగంతో దీపాలు వెలిగాయని విన్నాం. సంగీత ప్రభావంతో కొన్ని రకాల వ్యాధులు కూడ తగ్గుముఖం పడతాయి. పద్మినీ జాతి స్త్రీల సంగీతం వింటే సురపొన్న వికసించి సౌరభాల్ని విరజిమ్ముతుంది. ప్రియాళువు కూడ సంగీతంచే వికసిస్తుంది. నాద బ్రహ్మాన్ని సాక్షాత్కరింపజేసే సంగీత కళ ఉత్తమమే. ఏ మాత్రం సందేహం లేదు. వినినంతనే హృదయాన్ని పరవశింపజేసే శక్తి గలది సంగీతమేనని వాదించిన డిండిమభట్టారకుల యభిప్రాయాన్ని గౌరవిస్తూ దానికి కవితజోడైతేనే రాణింపు అనిన శ్రీనాథుడు, **సువర్ణానికి తావి అబ్బినట్లే...** కదా అన్నారు.

సంగీతము, శిల్పము, చిత్రలేఖనాలలో మొదటిది బధిరునకు, మిగిలిన రెండు అంధునకు ఆస్వాద్యములు కావు. చిత్రలేఖనం, శిల్పం, కాలగర్భంలో కలిసిపోయేవే, కనుక, సంగీత కళ ఉత్తమమైనదే కాని, కవిత్వంలా ఉత్తమోత్తమమైనది కాదు. కవిత్వం శ్రవ్యకళయైనా, బధిరునకు కూడ ఆస్వాద్యమవుతోందంటే, అది లేఖ్యమగుటయే కారణం వ్రాయబడిన కావ్యాన్ని చూచి చదివి ఆనందించే వీలుంది. లిఖితం కాకుండా, ఆశు

రూపంలోనున్న కవిత్వం వల్ల చెవిటి వానికి ఆనందం కలుగదు. అంధత్వం, బధిరత్వం – రెండూ కలవానికి కళాజనితమగు అనుభూతియే ఉండదు కదా!

కాబట్టి కవితా సాహచర్యం కల్గిన నాదరూప సంగీతం శాశ్వతం.

శ్లో॥ "సంగీతమపి సాహిత్యం, సరస్వత్యాః స్తన ద్వయమ్ ।

ఏక మాపాత మధురం, అన్యదాలోచనామృతమ్ ॥ – అని పెద్దలన్నారు. సంగీతం – అపాత మధురం, సాహిత్యం – ఆలోచనామృతం. కవితాజనితమగు ఆనందం, శాశ్వతం – అని శ్రీనాథ భట్టారకులు వాదిస్తూంటే,

శ్రీనాథ కవీ! కావ్య జనితమగు రసానందం కూడ శాశ్వతం కాదు. విభావానుభావాది చర్వణ ఉన్నంత వరకే, ఆ రసానందం ఉంటుంది. అది ముగిసి పోయినంత ఈ రసానందం కూడ ముగిసిపోతుంది. ఈ విషయాన్ని తరచిచూస్తే రసానందం కూడ శాశ్వతం కాదని, శ్రీనాథ వాదాన్ని, డిండిమభట్టారకులు ఖండించారు.

'విభావానుభావాది" శ్లోకమును బట్టి పల్కిన స్థాయీ భావము రసము కాదు. భావాలన్నీ చిత్త వృత్తి విశేషాలు. స్థాయికూడ ఒక భావమే. అంతఃకరణ ధర్మమైన ఈ స్థాయి జడం. రసము – చిద్ఘనం, ఆత్మస్వరూపం. అందుకే భరతమహర్షి రస సూత్రంలో స్థాయిని గ్రహింపలేదు. రసము – అలౌకికం. రసం జ్ఞాప్యం కాదు, నిత్యం కాదు, భావి కాదు, వర్తమానం కాదు, సహృదయుల అనుభవమే – రసానంద విషయంలో ప్రమాణం. "నాటకాన్తంహి సాహిత్యం" – అను అభిజనోక్తి వలన, "సందర్భేషు దశరూపకం శ్రేయః" – అను వామనోక్తి వలన, చాక్షుష క్రతువు – అను కాళిదాసు వచనం వల్ల – నాట్యఫలం రసానందమే కనుక ఇది దృశ్యకావ్యమగుట వల్ల రసానందం "రసోవైసః" – అను శ్రుత్యనుసారం, సహృదయుని యందు – బ్రహ్మానంద సహోదరమని అంగీకరించా లన్నారు, శ్రీనాథుడు.

చిత్రలేఖనం, కేవలం దృశ్యకళ, ఇది చూసి ఆనందించాలి. ఇది అంధుడు చూడలేడు. ఇందలి ఆకృతుల్ని స్పృశించి తెల్సికోలేము. శిల్పాన్ని చేతితో తడివి అంధుడు దాని నిమ్నోన్నత భాగాలు గుర్తింపవచ్చు. ఇది దానికన్న మిన్న! చిత్రం శిల్పం హసింపవు, వీక్షింపవు, భాషింపవు. వీటికి కన్నులున్న చాలును. మరి సంగీతమునకు సాహిత్యము తోడుండవలె. కవిత్వం స్థాణురూపమే కాదు, చల ద్రూపం కూడ. ఇది మనోగోచరం కావింప గలది.

ఉపమాది సాధన సామాగ్రిచే అక్షర శిల్పి, చలద్రూప చిత్రానికి ప్రాణం పోస్తాడు.

కృతికి చక్కని ఆకృతిని, కల్పించే కవిత్వం ఆ చంద్ర తారార్కంగా వినబడుతూనే ఉంటుంది. భీమన, నన్నయ, తిక్కన, ఎఱ్ఱనార్యుల కవితలు, నేటికీ ఉన్నాయంటే కవితాశక్తికున్న గొప్పతనమే. నాటి రాజ్యాలు లేవు, నాటి చిత్రాలు, శిల్పాలు లేవు. నాలుగు వందల ఏభై సంవత్సరాలు, భారతావనిని ఏలిన శాతవాహనుల బీటలు వారిన కోట గోడలు కూడ నేటికి లేవంటే, ఏది శాశ్వతమనాలి? నాటి ఆంధ్రుడైన విప్రశిఖామణి హాలచక్రవర్తి, అఖండ భారతదేశాన్నేలుతూ, రచించిన శాలివాహన సప్తశతి మాకు లభించిందంటే, కవిత శాశ్వతమని తెలుస్తోంది. ఆది కవి వాల్మీకి నుండి నేటి వరకు గల మహాకవుల తాళపత్ర గ్రంథాలు, కొన్ని శిలా, తామ్ర, సువర్ణ శాసనాలు మన భాండాగారాల్లో భద్రంగా ఉన్నాయి. వాటి వల్ల నాటి కవుల కీర్తి భారతాన పతాకయై నిలిచినా, ఆనాటి రాజుల, రాజ్యాల, ప్రజల వైభవాల ప్రతీకలైన వారి కావ్యగానాల వల్లనే మనకు తెలుస్తోంది.

కనుక, లలిత కళలలో గల సాహిత్యంలో వివిధ మనస్తత్వాలు కల్గిన పాత్రలను సృష్టించి, సృష్టికి ప్రతిసృష్టి చేసి, జీవిత సంఘటనలతో విశ్వశ్రేయస్సును కల్గించేలా తీర్చి దిద్దవచ్చు. కనుకనే చిత్రలేఖనం కన్న శిల్పం కన్న ఉత్తమమైన సంగీత కళ కన్న ఇవన్నీ కల్గిన సమాహార కళయౌ దృశ్య రూపకమందలి కవిత్వమే ఉత్తమోత్తమమైనది. అలాగే శ్రవ్యరూప సాహిత్యం కూడ ఉత్తమోత్తమమైనదేనని, మొత్తం మీద కవిత్వమునకే అగ్రతాంబూలమని శ్రీనాథ కవి నొక్కివక్కాణించాడు. నాటి సభ ముగిసింది.

సదస్యుల కరతాళ ధ్వనులతో ముత్యాలశాల మురిసింది. "రసోవైసః, రసగ్గం హ్యేవాయం లబ్ధ్వా నందీ భవతి" - అను శ్రుతి శ్రోత్రపేయంగా వినబడింది. ఓం సహనావవతు, సహనౌ భునక్తు సహవీర్యం కరవావహై, తేజస్వినావధీతమస్తు మావిద్విషావహై ॥ **ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః హరిః ఓం తత్సత్ స్వస్తి.**

13. ముత్యాలశాలలో పదమూడవరోజు వాద సభకు ముందు ఘంట గణ గణ మ్రోగింది. విద్వత్కవి శేఖరులు, కవితా భూషణులు, దైవజ్ఞులు, తార్కికులు, నైయ్యాయికులు, దార్శనికులు ఇంకా ఎందరో మహానుభావులు, ముత్యాలశాల సభ నలంకరించారు. రాయల వారు గురుబ్రహ్మలకు నమస్కరించి, స్వర్ణ సింహాసనాధిష్ఠితులయ్యారు. కవయిత్రులున్నారు. సకల కళాకోవిదులున్నారు. జానపద నృత్యకళాకారులున్నారు. నాట్య కళాకోవిదులున్నారు.

వారంతా దివ్యతేజస్సుతో ప్రకాశించే డిండిమభట్టారకులను, శ్రీనాథ భట్టారకులను చూచి చేతులు జోడించారు. వారు ఆశీర్వచనములనందించారు.

విశాలమైన ఫాలభాగం అందు మూడు రేకలు తేరునట్లు విభూతి ధరించాడు, నుదుట కుంకుమబొట్టు, బాలసూర్యబింబంలా ఫాలభాగంలో ప్రకాశిస్తోంది. మెడలో బంగారపు తీగెతో చుట్టిన రుద్రాక్షమాల! మెడ నిండ మంచి ముత్యాలహారాలు ఎడమబుజంపై నుండి కుడి చేయి క్రిందకు వ్రేలాడు యజ్ఞోపవీతం. రెండు చెవులకు రతనాలు పొదిగిన మకరకుండలాలు. వ్రేలికి నవరత్నాలు పొదిగిన దర్భముడి గల బంగారపుటుంగరం, పట్టుధోవతి, బుజాన పట్టు కండువా ధరించిన ఆరడుగుల బ్రాహ్మీమయమూర్తిని చూచారు. ఆరోజున క్రొత్తగా వచ్చిన పండిత బృందాలు ఏమావర్చస్సు – అని తలచి, వారే శ్రీనాథ కవినాథులని తెలిసికొని, ఆ పరమపుణ్యునకు ప్రణామాంజలులు సమర్పించారు. రాయలవారు, వారు కోరినట్లే వారి సంప్రదాయానుసారం, వేషధారణలోను, ఆహారపుటలవాట్లలోను స్వేచ్ఛను ప్రసాదించారని విన్నవారు రాయల ఔదార్యాన్ని మెచ్చుకొన్నారు. క్రొత్తగా వచ్చినవారు జరిగిన విషయాలు తెలిసికొంటున్నారు. ఇంతలో వాదసభను ప్రారంభించే ముందుగా శ్రీనాథ కవిని చూచిన రాయలవారు, పలనాటిసీమలో మంచి నీరు దొరకలేదని మీరు చాలా బాధపడ్డారని విన్నాను. ఆ బాధలో కూడ మీరు పలికిన ప్రియవచనాలు, చాటువులే. ఒక్కటి చెప్పండి, అన్నారు.

కం॥ సిరిగలవానికి జెల్లును
తరుణుల బదియాఱు వేల దగ బెండ్లాడన్
దిరిపెమున కిద్దరాంద్రా
పరమేశా! గంగ విడుము పార్వతి చాలున్.

సిరి కలవాడు శ్రీహరి, వాని అవతారమే శ్రీకృష్ణుడు. ఆతనికి సిరిసంపదలున్నాయి కాబట్టి పదహారు వేలమంది భార్యలను పెండ్లాడినా చెల్లుతుందన్నాను. పరమేశ్వరా! బిచ్చమెత్తుకొనే వాడివి నీకు ఇద్దఱు ఇల్లాండ్రు కూడానా? ప్రక్కనున్న పార్వతి నీకు చాలునయ్యా! గంగను వదిలివేయుమని పలికాను.

శాస్త్రయుక్తంగా పెండ్లాడిన యర్థాంగిని దూరముసేయుట మహాపాపము. అర్థనారీశ్వరుడైనా గంగాదేవిని భార్యగా తెచ్చికొని తలపైకెక్కించుకొన్నాడు. తానా బిచ్చమెత్తుకొని జీవించువాడు. ఇద్దఱు భార్యలనెలాపోషించగలడు? తలకెక్కించుకొన్న గంగమ్మను వదలుమనినాడు. తలమీది భారమూ తగ్గుతుంది. తనకు దాహార్తిని తీర్చుటకై మంచినీరు దొరుకుతుంది. విశుద్ధజలప్రాప్తి పరమేశ్వరానుగ్రహ లభ్యమే! ఆహా! ఈ విధంగా వక్రోక్తి భంగిలో నర్థించుట శ్రీనాథునకే చెల్లినదని ముమ్మకవి మెచ్చుకొనినాడు.

సవ్యసాచియైన అర్జునుడు అనిలో పుంఖాను పుంఖాలుగా శస్త్రాలను ప్రయోగించినట్లు, శ్రీనాథ కవి, చాటువులను పలుకుతారని వల్లభుడు తెలిపాడు.
ధర్మపీఠాధ్యక్షులు : "శ్రీకృష్ణుడు – బ్రహ్మచారి, అని అంటారే, మరి ఈ పదహారు వేల మంది తరుణులు ఎవరో తేల్చండి? అని మిన్నకున్నారు.

గురుబ్రహ్మ! శ్రీకృష్ణ పరమాత్మ, స్వయంగా భక్తుల్ని ఆనందరసాన మునకలు వేయించాలని, గోపికల యందు శృంగార రసానందాన్ని చిలుకరించాడు. పదహారు వేల మంది గోపికలకు, పదహారు వేల మంది శ్రీకృష్ణులుగా కనబడి దివ్యమైన ఆలింగనాన్ని ప్రసాదించి ముక్త్యానందాన్ని ప్రసాదించాడు. భూతత్త్వమే 'ధరా' దేవి. ఆమెయే రాధ. ఈ పదహారు వేలమంది రమణులు, మహర్షులు. శ్రీరాముడు అరణ్యవాసం చేస్తూంటే, పురుషులకే వ్యామోహాన్ని పుట్టించే రూపాన్ని ఒకసారి కౌగిలించుకొంటామని, నాటి ఋషులు కోరితే ఏకపత్నీవ్రతుడైన శ్రీరాముడు వారి ఆలింగనాన్ని అంగీకరించక, శ్రీకృష్ణావతారంలో మీరు తరుణులై పుట్టండి, అపుడు మీరు కోరినట్లే నన్నాలింగనం చేసికొందురు గాని, అని పలికాడు. ఆ ప్రకారంగానే శ్రీకృష్ణుడు ఆ పదహారు వేల మంది గోపికల రూపంలోని మహర్షులకు తన దివ్య స్పర్శ సుఖాన్నందించి, తన చెంతకు చేర్చుకొన్నాడు. ఆయన పరమాత్మ, వీరందరూ జీవాత్మలే. నిర్గుణ పరబ్రహ్మ కనుక శ్రీకృష్ణుడు బ్రహ్మచారియే!... అంటూ అరుణగిరినాథులు శ్రీకృష్ణ పరమాత్మ బ్రహ్మచారియేయని, ఆ పదహారు వేలమంది గోపికలు మహర్షులని శ్రీమద్భాగవతాంతర్గత రహస్యాలను వెల్లడించారు.

గురు బ్రహ్మలు, వివాదాస్పదమైన అంశాన్ని ఇచ్చారు. ఇవ్వడంలో కూడ చాలా దూరాలోచనతో చిక్కని ప్రశ్న మా ముందుంచారు. శ్రీకృష్ణుడు బ్రహ్మచారి అయితే పదహారు వేలమంది తరుణులు ఉండటానికి వీల్లేదు. పదహారు వేల మంది భార్యలుంటే, శ్రీకృష్ణుడు బ్రహ్మచారి అనడానికి వీల్లేదు. బ్రహ్మచారికి పదహారు వేలమంది భార్యలనటంలో స్వవచోవ్యాఘాతం, ఉంది. వెంకయ్య గుర్విణి – అన్నది స్వవచో వ్యాఘాతానికి లక్ష్యం. వెంకయ్య మగవాడు కనుక గర్భవతి కావటానికి వీల్లేదు. గర్భవతియైతే వెంకమ్మ అయి ఉండాలి కాని వెంకయ్యకాదు. కనుక శ్రీకృష్ణుడు బ్రహ్మచారి అనటం వలన, ఆయన పరమాత్మ, పదహారు వేలమంది జీవాత్మలని తెలుస్తోంది. గురుబ్రహ్మలు, స్వవచో వ్యాఘాతానికి లక్ష్యం కాకుండా ప్రశ్న ఇచ్చారు.

డిండిమభట్టారకులు, శ్రీకృష్ణుడు పరమాత్మయని చెప్పారు. గోపికల్ని తమచెంతకు చేర్చుకొన్నారని, పదహారు వేలమంది తరుణులు, మహర్షులని చక్కగానే చెప్పారు కాని,

ఆ మహర్షులు ఎవరో చెప్పలేదు. శ్రీకృష్ణుడు పరమాత్మయైతే మాత్రం వారిని చెంతకు చేర్చుకొన్నారనటంతోనే సామీప్యముక్తి అని భావించాలా? మరి వారి బ్రహ్మచర్య దీక్ష ఏమైనట్లో చెప్పలేదు. శ్రీకృష్ణుడు బ్రహ్మచారి అంటారని గురుబ్రహ్మలన్నారంటే, ఇందేదో నిగూఢ రహస్యం ఉండి తీరాలి. కనుక వారి బ్రహ్మచర్యాన్ని గురించి, డిండిములు ప్రస్తావించనే లేదు. వీటన్నింటికీ తగిన సాక్ష్యాధారాలను చూపి, స్వపక్షాన్ని స్థాపన చేయలేదు. కనుక వారి వాదనను పూర్తిగ ఏకీభవించలేక పోతున్నాను.

అనంత వేదాలలోని కొన్ని శాఖలలో పదహారు వేల మంత్రాలున్నాయి. ఆ పదహారు వేలమంత్రాలు పరమాత్మనే స్తుతిస్తుంటాయి. పరమాత్మ శ్రీరాముడుగా అవతరించగానే ఆ మంత్రాలు, ఋషిరూపాలు ధరించాయి. ధర్మమూర్తి, శ్రీ సీతారామచంద్రమూర్తి స్పర్శకోరి, శ్రుతులలోని మంత్రాలు మహర్షులై త్రేతాయుగంలో "పుంసాం మోహన రూపాయ, పుణ్యశ్లోకాయ మంగళం" - అంటూ శ్రీరాముని నుతించాయి. శ్రీరాముని ఏకపత్నీవ్రతం, భంగం కాకుండా ద్వాపరయుగంలో ద్వారకలో ఆ పదహారు వేల మంత్రరూప మహర్షులే గోపికలు గా అవతరించి, గోవిందునితో ఆడి పాడి, ఆయన, నిఃశ్వసితాలయ్యారు. "యస్యనిః శ్వసితం వేదాః" - శ్రుతి రహస్యం.

పదహారు వేలమంది భార్యలతో, శ్రీకృష్ణుడు ఎట్లా కాపురం చేస్తున్నాడని నారద మహర్షి యంతటి వానికే సందేహం వచ్చి, ద్వారక వచ్చి, శ్రీకృష్ణుని రుక్మిణి దేవి మందిరంలో దర్శించారు. శ్రీకృష్ణుడు, రుక్మిణీ దేవి పాత్రతో జలం తెచ్చి పోస్తోంటే మహర్షి పాదాలను కడిగి, తన కండువాతో పాదాల తడి యొత్తి వారిని సత్కరించాడు. తర్వాత వరుసగా పదహారు వేల భవనాలు సందర్శించాడు. ప్రతీగృహంలోను శ్రీకృష్ణుడు వారికి పాదపూజ చేసాడు. తిరిగితిరిగి అలసి సొలసి సోలి శ్రీకృష్ణుని ఒడిలో వాలి ఇదంతా విష్ణుమాయగా తెలిసికొని, సర్వాంతర్యామియౌ శ్రీకృష్ణుని, స్తుతించే శ్రుతి కన్యలుగా దర్శించి నమస్కరించాడు. "పతిం విశ్వస్యాత్మేశ్వరగ్ం శాశ్వతగ్ం శివ మచ్యుతమ్"... పరమాత్మ ప్రపంచానికే పతి. జీవాత్మల కధిపతి. శాశ్వతుడు మంగళ స్వరూపుడు, అని శ్రీనారాయణ సూక్తం స్పష్టం చేస్తోంది. "తత్పురుషస్య విశ్వమాజాన మగ్రే"... ఆ పురుషోత్తమునిచే సృష్ట్యాదిలో సమస్త ప్రపంచం రచించబడెను అని వివరిస్తూ ఆతడే సకల దేహాల్లోను జీవరూపంలో ఉంటున్నాడని పురుష సూక్తం వివరిస్తోంది. "ఈశావాస్యమిదం సర్వం... ఈ ప్రపంచంలోని చరాచర వస్తు సముదాయమంతా భగవంతుని సర్వస్వమేనని శ్రుతులు విని, ఈ గోపికలు ఆయనేయని గుర్తించి, శ్రీకృష్ణుడే అస్ఖలిత బ్రహ్మచారియని కీర్తించాడు.

భగవద్గీతలోని విభూతియోగంలో, "యద్యద్విభూతి మత్సత్త్వం శ్రీమదూర్జితమేవవా, తత్త దేవావగచ్ఛత్వం మమ తేజోంశ సంభవమ్" – ఈ ప్రపంచంలో గల వన్నీ, ప్రాణికోటితో సహా నా తేజస్సు యొక్క అంశం వలన కలిగినవేనని శ్రీకృష్ణ భగవానుడే తెలిపాడు. మగనెమళ్ళు పింఛాలు విప్పి, కృష్ణుని చెంత ఆడాయి. శారీరక సంబంధం లేకనే పవిత్ర ప్రేమతో సంతానంకనే నెమలిని దీవించిన శిఖిపింఛమౌళి దివ్యదర్శనం లభించింది మహర్షికి. మయూరము నాశీర్వదించిన శిఖిపింఛమౌళి స్వరూపమే సర్వస్వమని తెలిసికొనినవాడే అరుదు – అనిన భగవానుని శ్రుతి – "వాసుదేవ స్సర్వమితి సమహాత్మా సుదుర్లభః" – అర్థం చేసికొంటే నిష్కామభక్తికి ప్రతిరూపాలే గోపికలని తెలుస్తుంది. "గోభిః ఇంద్రియైః భక్తిరసం పిబతీతి – గోపీ" – భక్తి రసాన్ని గ్రోలే వారే గోపికలు.

స్త్రీ, పురుష భేదాతీతుడైన పరమాత్మ శ్రీకృష్ణునికి జగత్తంతాస్వాంగమైయుంటే, ప్రాకృతిక రాగాదుల యందు ప్రసక్తియే లేదు. అది అమలినం, గోపికలు ఎన్నివేల మంది ఉన్నా, మరెంతమంది అనుకొన్నా అవన్నీ ఆయన శరీరంలోని అవయవాలు, అణువులు, ఆయన అణువులనే ఆయన తాకితే శృంగారమా?. అప్పుడు రాగాదులకే ప్రసక్తిలేదని, సాక్షాత్తు శ్రీమన్నారాయణాంశ సంభూతుడైన వేద వ్యాస భగవానుడే, పంచమ వేదమైన శతపర్వ సంహిత యగు **జయం**లో వ్రాశారు.

శ్లో॥ స్వశరీరే షరిష్వంగ భేదోనాస్తి శుభాననే ।
సర్వం జగచ్చతస్వాంగం పృథగత్ర న విద్యతే ॥

శ్లో॥ స్వాంగా లింగే రతిర్నస్యాత్ అంగనాలింగనేరతిః ।
యస్యాంగం జగదీశస్య తస్య రాగాదయః కుతః? ॥

సాక్షాత్తు శ్రీకృష్ణ భగవానుని కులగురు బ్రహ్మలైన శ్రీగర్గా చార్యుల వారే, పదహారు వేల మంత్ర రూప ఋషి గోపికలు కన్యలైయుంటే, భూమి యొక్క బలాన్నుండి వరాహావతారుని దివ్యాశీస్సులతో పుట్టిన భూపుత్రుడైన భౌమాసురుడు, ఆ శ్రుతి కన్యల నపహరించి, వారిని బాధిస్తూ నరకాన్ని సృష్టించి నరకాసురునిగా వారిచే పిలువబడే వానిని, వాని తల్లియగు ధరాదేవియౌ సత్యభామ చేతనే సంహరింపజేయించి, వారిని ముక్తులను గావించిన పురుషోత్తముడొక్కడే బ్రహ్మచారియని, శుకమునీంద్రుడు కొనియాడి నమస్కరించాడు. "శాన్తం శివం అద్వైతం" అని శ్లాఘించిన అధర్వణ శ్రుతి, పరమాత్మను అగ్రాహ్యునిగాను, ఏకాత్మునిగాను వర్ణించింది. ఏకమేవాఽ ద్వితీయం బ్రహ్మ – అనిన

శ్రుతిలో "సాహిశ్రీః అమృతాసతాం" అని అమృతత్వమైన ఆ ఆత్మ, శక్తిగా వినబడుతోంది. కనుక శ్రీకృష్ణుడు మన చర్మచక్షువులకు పురుషుడుగా కనబడుతూ కవ్విస్తూ నవ్విస్తున్నాడే కాని, హ్లాదినీ శక్తియౌలలిత, అన్నాడు శ్రీనాథుడు.

ఆ చిచ్ఛక్తియౌ లలిత యే శ్రీకృష్ణుడనే పురుష దేహాన్ని ధరించి వేణునాద వినోదంచే ప్రపంచాన్నంతనీ మోహపెట్టినదని త్రిపురతాసినీశ్రుతి, వివరిస్తోందన్నారు.

శ్లో॥ కదాచి దాద్యా లలితా పుంరూపా కృష్ణవిగ్రహా ।

వంశీనాద వినోదేన కరోతి వివశం జగత్ ॥ అని, శ్రుతిరహస్యాన్ని వివరించినది శ్రీ దేవీ భాగవతం.

ధరా, పదాన్ని తిరగేస్తే రాధ. రాధ, భూదేవియే కదా। ఆత్మనుండే ఆకాశాదులుత్పన్న మైనట్లు "అద్భ్యః పృధివీ" అని కృష్ణయజుర్వేద మంత్రం స్పష్టం చేస్తోంది. ధరా – మృణ్మయి. 'ధరా' తిరగబడి రాధయై, మృణ్మయికానిదై చిన్మయిగా రూపుదాల్చింది, శ్రీ కృష్ణ పరమాత్మ తలచినలీల, అష్టవిధ ప్రకృతులను", ప్రకృతిరష్టధా" అవ్యక్తము, మహత్తు, అహంకారం, పంచతన్మాత్రలు గలది ప్రకృతి అంటూ శ్రుతి స్మృతి పురాణాదులతో పాటు కాళిదాసాది కవులు కూడ వర్ణించి తరించారు. ఆ అష్ట విధ ప్రకృతులు పరమాత్మయే. ఆ అష్టవిధ ప్రకృతులే చలించి, ప్రేమ ముద్దలై ముద్దుల గుమ్మలై ఒప్పులకుప్పలై వయ్యారి భామలై, "రసోవైసః"–అని పల్కిన రసశ్రుతి స్వరూపుడై వెలసిన ఆ నందనందన పట్టిని చెట్టపట్టిన వారే – రుక్మిణి, జాంబవతి, మిత్రవింద, లక్షణ, సత్య, కాళింది, భద్ర, నాగ్నజితి. ఇది పరబ్రహ్మానంద లీలగా గుర్తించిన వారే ధన్యులని సాక్ష్యాధారాలతో నిరూపించినాడు శ్రీనాథుడు.

అందర్నీ పవిత్రులను చేసే తల్లి గంగ, ఆ గంగ విష్ణువు పాదంలోంచి పుట్టింది. "విష్ణుపాదోద్భవా గంగా" అంటాం. విష్ణువు పాదోద్భవమైన గంగమ్మను తలపై పెట్టుకొని, శ్రీహరి గొప్పతనాన్ని లోకానికి చాటి ఆ పాదమస్తక పర్యంతం–తానేనని, ఇదే ఆసాంత యోగ విద్యారహస్యమని మహాదేవుడే హరిహరులకు భేదం లేదని "ఏకంసత్" ఉన్నది ఒక్కటేనని చెప్పారు. "విశ్వం విష్ణుః" అంటూనే, శ్రీకృష్ణ పరమాత్మను నృసింహావతారుని చిదాత్మగా గుర్తించి వర్తింపుడని, ప్రణవోపాసనచే సత్యాన్ని తెలియుమని, మహామాయా స్వరూపిణియౌ జగన్మాత అనుగ్రహంచే జనులందరికి ముక్తి సుఖము లభిస్తుందని – యోగ మాయా ప్రసాదేన సర్వేషామస్తు తత్సుఖం" – అను రహస్యాన్ని దత్తాత్రేయ యోగశాస్త్రం, ఆ మూలాగ్ర రహస్యాన్ని చెప్పినట్లు గంగలో మున్గి పవిత్రులగుటకై గంగమ్మను

పిల్చి పునీతులు కావాలని విన్నవించాడు, శ్రీనాథుడు. కరతాళధ్వనులు మ్రోగ, శాంతి మంత్రం పఠించారు.

14. ముత్యాలశాలలో పదునాల్గవ వాదసభ ప్రారంభ సూచకంగా ఘంట మ్రోగింది.

ముత్యాలశాల సద్వంద్యులతో శోభిస్తోంది. శిష్య ప్రశిష్య బ్రహ్మ సంఘాలతో, డిండిమ్మంచు డిండిమం మ్రోగుతూంటే, అంతే వాసి దుగ్గన్నతో శ్రీనాథ కవి, డిండిమంతో వచ్చు డిండిమ భట్టారకుని చూచి నమస్కరించాడు. వారాశీర్వదించారు. దుగ్గన్న చూపులన్నీ కంచుఢక్కా మీదనే ఉండటాన్ని గమనించిన శ్రీనాథుడు, "ఒడలెల్ల కన్నులై దాన్ని చూస్తున్నావు. చూపు పడింది. అదినట్టేట మునగటం ఖాయం" అన్నాడు ఛలోక్తిగా, మెల్లగా. ఇది, డిండిమభట్టు ఛాత్రుని చెవిలో పడిందేమో పండ్లు కొఱుక్కొన్నాడు. దుగ్గన్న ఏమీ అనలేక, ముక్కుమొగం చూచుకొని, సదస్యుల్లో కూర్చున్నాడు. శ్రీనాథుడిది గమనించాడు. దరహాసం ఱెప్పల తొంగలింప దోయిలించి, పలుచని తెర వెనుక నుండి నమస్కరించు సతిని – "దీర్ఘాయురస్తుమే పతి ర్జీవాతు శరదః శతమ్" అని దీవించాడు. వేదిక కొక ప్రక్కగా పలుచని తెరల వెనుక స్త్రీలు, రాణి వాసపు స్త్రీలు, సాహిత్య పిపాసతో ఆశీనులయ్యారు. పెద్దలంతా తమ తమ స్వర్ణ సింహాసనాల్లో కూర్చున్నారు. ఎపుడెపుడా వాద ప్రతివాదాలని సదస్యులున్నారు.

ధర్మపీఠాధ్యక్షులు, శ్రీనాథ కవిని, అరుణగిరినాథ కవిని తిలకించి, కవీశులారా! మీకు శుభ స్వాగతం. వితండవాదాలు చోటుచేసి కోకుండా, వేద వేదాంత ధర్మ శాస్త్ర పురాణాది విద్యలు, వాటిలోని మర్మాలను చక్కగా పూర్వపక్ష, పరపక్ష సిద్ధాంతాలతో రాద్ధాంతం చేయక సైద్ధాంతికంగా ఖండన మండనాలు చేయుట ముదావహం. శ్రీనాథ కవి గంగమ్మ తల్లి ఒడిలో దప్పిక తీర్చుకొని, "దప్పిగొన్నట్టి వారికా దప్పిదీఱ, సలిల పూరంబు హితవొ! యాజ్యంబు హితవొ" అను ప్రశ్నకు సమాధానం చెప్పకనే చెప్పి, గంగనుపిలచి వాత్సల్యాన్ని చవిచూపారు. అంతకుముందే పలనాటిలో మీకు సరియైన అన్నపానాదులు లభింప లేవని వెతచెందిన పద్యం వినిపించండన్నారు.

శ్రీనాథుడు : ఉ॥ **అంగడి యూరలేదు, వరియన్నము లేదు, శుచిత్వమేమిలే**
దంగన లింపులేరు, ప్రియమైన వనంబులు లేవు, నీటికై
భంగపడంగ బాల్పడు కృపాపరులెవ్వరు లేరు, దాత లె
న్నంగను సున్న! పలనాటికి మాటికి పోవ నేటికిన్ ॥

పలనాటిలో పండ్లు ఫలాలు తిందామంటే, ఒక్క అంగడీ ఉన్న ఊరే కన్పించలేదు.

నచ్చిన వరియన్నం దొరకలేదు. శుచి శుభ్రతలు లేనేలేవు. స్త్రీలు సంతోషంగా లేరు. సుందర నంద నోద్యానవనాలు లేవు. మంచి నీళ్ళు దొరకనే దొరకవు. దాతలసలే కనబడలేదు. పలనాటిలో నేను వెళ్ళిన చోటు అలా ఉందని, బాధ పడ్డానని శ్రీనాథుడు తన ఆవేదన నివేదించాడు.

విసిన రాయలవారు, ఇంత ముద్దపప్పులో అంత నెయ్యిపోసికొని ఇంతంత ముద్దలు కలిపి తింటూ మధ్య మధ్య ఆ క్రొన్నేతి పప్పు ముద్దలో ఆవపిందెలు నంచుకొని తింటూండే, మీ వంటి వారికి జొన్న కూడు, ఏం రుచిస్తుంది? పైగా కన్నడ రాజ్యలక్ష్మినే తల్లిగా భావించే మీరు, పలనాటిలో వాత్సల్యంగా పలకరించే అంగనలే ఆనందంగా లేక బాధ పడుతూంటే, సంతోషంగా పలుకరించే తల్లులెవ్వరని వాపోయిన దృశ్యం కనబడుతోం దన్నారు. మీ మాతృభావనకు జోహార్లన్న రాయల వారు, – మీరా పలనాటి క్షేత్రాన్ని సందర్శించారు. మరి కురుక్షేత్రాన్ని సందర్శింప జేయించు సంజయునితో ధృతరాష్ట్రుడే మన్నాడో తెలియజేయండి... అన్నారు. **ధృతరాష్ట్రుడెవరో చెప్పాలి** – అన్నారు గురుబ్రహ్మ.

ధృతరాష్ట్రుడు జన్మతః అంధుడు వాని సంతానమే కౌరవులు. వానితమ్ముడైన పాండు మహారాజు పుత్రులే పాండవులు. వీరు అయిదుగురు. కౌరవులు నూర్గురు, వీరి చెల్లెలు దుస్సల, జయద్రథుని భార్య. శ్రీకృష్ణుడు రాయబారిగా వచ్చినా, యుద్ధం తప్పలేదు. కౌరవ పాండవులు, ముప్పై తొమ్మిది లక్షల ముప్పై ఆరువేల ఆరువందల మంది గల చతురంగ బలాలతో బయలుదేరి, యుద్ధ భూమి ధర్మక్షేత్రానికి వెళ్ళారు. మహాభారత యుద్ధం ప్రారంభమై పదిరోజులు గడచింది. భీష్ముడు, రణరంగంలో కూలిపోయాడు, ఆ విషయాన్ని గురుకృప వల్ల దివ్యదృష్టి పొందిన సంజయుని వలన విని, శోకించిన ధృతరాష్ట్రుడు యుద్ధం మొదలు పెట్టిన నాటి నుండి నేటి వరకు జరిగినది తెలుపుమన్నాడు – నా వారు పాండవులు యుద్ధం చేయాలనే కుతూహలంతో కురుక్షేత్రం చేరి, ఏం చేసారు? అని ధృతరాష్ట్రుడు ప్రశ్నిస్తే విషయమంతా సంజయుడు చెప్పాడు. శ్రీకృష్ణుడు, పార్థునకు గీత బోధించాడు. కర్మ భక్తి జ్ఞానాలనుపదేశించి, అర్జునా నీకెలా చేయాలంటే అలాగే చెయ్యి అన్నాడు. పార్థుడు యుద్ధంచేసి, విజయుడయ్యాడు – అని కథంతా చెప్పి, గీత ముఖ్యోద్దేశ్యం, మనకు బోధించడమే. మనమే ధృతరాష్ట్రులమన్నాడు శ్రీనాథుడు. అర్జునుడు నిమిత్తమాత్రుడు. గీతసుధీర్ఘోక్తం.

శ్రీనాథ కవీ! అర్జునునితో "నిమిత్త మాత్రం భవసవ్యసాచిన్" – నీవు నిమిత్తమాత్రుడవు చేయించేదంతా 'నేనే'! ఆత్మకు ఛావు పుట్టుకలులేవు. శాశ్వతుడు. శరీరం చంపబడినా,

ఆత్మ చంపబడటం లేదు అని పలికి, స్వధర్మాన్ని ఆచరించి, ధీరుడవనిపించుకో! భీరుడవు కారాదన్నాడు. కష్టంగా తోచినా స్వధర్మాచరణమే శ్రేష్ఠమైంది. సుఖంగా తోచినా పరధర్మం భయంకరమైంది. స్వధర్మపాలనలో మరణం తటస్థించినా శ్రేయస్కరమే! పరధర్మాచరణ దుఃఖాన్ని, అవమానాన్ని కలుగజేస్తుంది - అని బోధించి, క్షత్రియోచితమైన యుద్ధం చేయించాడు. ఈ విషయం స్పష్టంగా గీతలో తెలుస్తోంటే మన కోసరం బోధించారని, మనకు చెప్పడానికే అర్జునుని అడ్డం పెట్టుకొన్నట్లు చెప్తున్నారు. పైగా ధృతరాష్ట్రులం మనం అని, మానవుల్ని గ్రుడ్డివాళ్ళను చేస్తున్నారు. పండితులున్నారు, కవులున్నారు, కళాకారులు, శాస్త్రజ్ఞులు, దైవజ్ఞులు, ఎందరో విజ్ఞులున్న సభలో మానవజాతినే అంధులనటం ధర్మమా? మీవంటి వారికి న్యాయమా? అంటూ డిండిమభట్టారకులు ధర్మక్షేత్రమే, నాడు ధర్మనిర్మయం చేసి, పాండవులదే ధర్మమని, విజయాన్నిచేకూర్చి పెట్టిన పుణ్యభూమియని ఆ కురుక్షేత్ర ప్రాధాన్యాన్ని భగవానుని ప్రస్థానత్రయమందలి రహస్యాలను సవివరంగా తెలిపారు.

డిండిమ భట్టారకులు, ప్రస్థానత్రయ భాష్యాలనాపోశన గావించిన వారు. భగవద్గీత, జ్ఞానులకు మోక్ష ప్రదమైనదన్న సత్యాన్ని, ఆచార్యత్రయం అంగీకరించారు. అయితే, ఆ త్రయీమూర్తుల మార్గాలు వేరు, కాని గమ్యస్థానం ఒక్కటే. సంసారమనెడి భవ బంధాల నుండి విముక్తి కల్గించేది గీతామాత.

ఉపనిషత్తులన్నీ గోవులుగా అవతరించాయి. విష్ణువే, కృష్ణుడై పుట్టి గోపాలకు డయ్యాడు. అర్జునుని దూడగా గ్రహించి, వత్సచేపుట అయిన తర్వాత, తాను జయమను పాత్రలో పిండిన గీతామృత క్షీరాన్ని సుధీర్భోక్తమన్నాడు. ఆ జ్ఞానామృతాన్ని జనకాది మహర్షులు సేవించి ముక్తి పొందారు. సద్బుద్ధి గల జిజ్ఞాసువులు గీతామృతాన్ని త్రాగి శాశ్వతానందం పొందుతున్నారు. ఈ రహస్యం అరుణగిరినాథులకు తెలియనిది కాదు.

ఇంతకీ దుర్యోధనాది ఏకోత్తర శతానికి తండ్రి ధృతరాష్ట్రుడని భారతీయులందరికీ తెలుసు. ఓ ఇంటికి వచ్చిన యతిగార్కి భోజనం పెట్టి వారు తిని, నిద్రించి లేచాక గీత పుచ్చుకొంటారా? అనిన యజమానితో, నిండుగా భోంచేశా, ఇంకతినలేనన్నాడా కపటయతి.

అలాంటి వారికి ధృతరాష్ట్రుడెవరో తెలియక పోవచ్చు. ఏమాత్రం భారత భాగవతాలు తెలిసినవారైనా, ధృతరాష్ట్రుడనగానే పుట్టి గ్రుడ్డి వాడని చెప్పేస్తారు. మరి అలాంటి ప్రశ్న వేద స్వరూపులైన గురుబ్రహ్మలడిగారంటే ఏదో అంతరార్థం ఉండే ఉండాలి. అందుకే

నేనలా అన్నాను. ధృత రాష్ట్రుడు, రాయబారిగా వచ్చిన శ్రీకృష్ణుని విశ్వరూపాన్ని దర్శించాడు. భూత భవిష్యత్ వర్తమానాలన్నింటిని చూచి, సత్యాన్ని గ్రహించాను. అజ్ఞానాంధకార బంధురమైన ఈ లోకాన్ని చూడను. మళ్ళీ నన్నంధుణ్ణి చేయుమన్నాడు. దివ్యనేత్రాలు తొలగడంతో ధృతరాష్ట్రుడు మామూలువాడయ్యాడు. కాని, విషయ జ్ఞానం పోలేదు. అట్టివానికెందుకీ కురుక్షేత్రం సంగతి, వెళ్ళినవాడా శ్రీకృష్ణుడు. ఎలాగున ధర్మమే జయిస్తుంది. అర్జునునికి ఏడువందల శ్లోకాలు శ్రీకృష్ణుడు చెపితే కాని, నిజం తెలిసికొని నిష్కామకర్మయోగియై యుద్ధం చేసి విజయాన్ని పొందడంటామా? శ్రీకృష్ణుడు, దివ్యజ్ఞానాన్ని క్షణంలో అనుగ్రహిస్తే చాలదా? మరి ఎవరి కోసం ఈ భగవద్గీత? ధరింపబడిన శరీరం గల మానవాళి కోసమే, భగవంతుడుపదేశించిన జ్ఞానామృతమే ఈ భగవద్గీత! ఈ మానవ శరీరమే ధర్మక్షేత్రం. అజ్ఞానంతో కూడిన ధృతరాష్ట్రులం మనమే.

ధృతరాష్ట్ర ఉవాచ :- శ్లో॥ ధర్మక్షేత్రే కురుక్షేత్రే

సమవేతా యుయుత్సవః ।

మామకాః పాండవాశ్చైవ

కిమకుర్వత సంజయ ?

ధృతరాష్ట్రుడు పలికెను, ఓ సంజయా! నా వారలగు దుర్యోధనాదులును, పాండుకుమారులగు ధర్మరాజాదులును, యుద్ధం చేయాలనే కుతూహలంతో ధర్మభూమియైన కురుక్షేత్రాన్ని చేరి ఏమి చేసిరి? – ఇది శ్లోకానికి తాత్పర్యం మాత్రమే.

సత్యాన్వేషణ చేస్తే, మానవ శరీరమే ధర్మక్షేత్రమని, దీనిని తెలిసికొన్నవాడే క్షేత్రజ్ఞుడని – "ఇదం శరీరం కౌన్తేయ! క్షేత్ర మిత్యభిధీయతే" – అని గీతాచార్యుని బోధ. ప్రపంచమానవులందరి అభివృద్ధి కోరి, భగవంతుడనుగ్రహించిన అనుపమాన ప్రసాదమే భగవద్గీత, ఇది వేదమంత్రాల మ్రోత, దివ్యజ్ఞాన ప్రదాత, ఆధ్యాత్మికదృష్టికి మాత, స్వధర్మాచరణకు ఊత, వ్యాసమహర్షి వ్రాత, ముక్తిదాత. సృష్టిలో ప్రతి దానిలో "సత్" పదార్థం ఉంది. అది చైతన్యంతో ఉంటే శివం. అది ఆనందం పొందితే సుందరం. ఈ సత్యాన్ని తెలిసికోవాలంటే సద్గురువును, ఆశ్రయించాలి. ఆ గురువు తత్త్వదర్శి అయి ఉండాలి అతనిని సేవించి, నమస్కరించి, అంతర్యామిని దర్శించి తరించాలి. ఎలా దర్శించాలి?

మనం అజ్ఞానంతో కూడిన గుడ్డి వాళ్ళం అంటే ధృతరాష్ట్రులమన్నమాట. ఈ శరీరంలోనే కామం, క్రోధం, లోభం, మోహం, మదం, మాత్సర్యం – అనేవి చంచలమైన

మనస్సుతో కూడి ఉన్నాయి. ఈ క్షేత్రంలోనే వినయవిధేయతలు, భక్తి శ్రద్ధలు బుద్ధిని ఆశ్రయించి ఉన్నాయి. ధర్మమార్గంలో నడు - అని నిశ్చయాత్మకమైన బుద్ధి హెచ్చరిస్తున్నా, చపలమైన మనస్సు మాటే వింటున్నాం, దుఃఖాలననుభవిస్తున్నాం. మంచి - చెడ్డల మధ్య నలిగిపోతున్న మానవునకు - ఏం చేయాలో చెప్పేవాడు, ఒక్క మోచక గురువు. ఆతడే జితేంద్రియుడైన సంజయుడు ఆతడు జగద్గురువు చెప్పినది తెలియజేస్తాడు.

దుర్లభమైన నరజన్మ, వరజన్మగా పొందాం! ఇది పరమాత్మ ప్రసాదం. నిన్ను నీవు తెలిసికొంటే, అదేసనాతన సత్యమని శాశ్వతానందం పొందుతావు. అంటే శోకరాహిత్యమే. దాంతో ఆనందం ప్రాప్తిస్తుంది. ఇదే మానవుని జీవిత పరమావధి, అదే ముక్తి.

ఇది తెలియజేయడానికే, శ్రీకృష్ణుడు, గీతను బోధించాడు. అది మనవంటి బుద్ధిమంతులు తరించడానికే. అర్జునుడు, వత్స, మనకూ, వాత్సల్యం కావాలి. క్షేత్రమనగా, శరీరమని ధర్మాన్నాచరించే శరీరమే ధర్మక్షేత్రం అని గీతావాణి. ఈ శరీరమనే ప్రమిదలో భక్తి తైలం పోసి ప్రేమ అనే వత్తి వేసి జ్ఞాన జ్యోతి వెలిగిస్తే, అజ్ఞాన తిమిరం నశించి పోతుంది. నిజం తెలిసి సంతోషిస్తారు.

ఈ శరీరమనే ధర్మక్షేత్రంలో - మమకారాదులైన కౌరవులకు, వినయవిధేయతలు, భక్తి శ్రద్ధలు, బుద్ధి అనే జ్ఞానంతో కూడిన పాండవులకు, పుట్టినప్పటి నుండి యుద్ధం జరుగుతూనే ఉంది. ఆ నిజాన్ని చూడలేని ధృతరాష్ట్రులం మనం, అంటే ధరింపబడిన శరీరం గల గ్రుడ్డి వాళ్ళమనే కదా! బహువ్రీహి సమాసంలో ధృతరాష్ట్రులు అన్యపదార్థ ప్రధానులే! శరీరమే మనది కాదు. మనదైతే ధరించటం దేనికి? ఈ శరీరంలో దుర్యోధన దుశ్శాసనుల వంటి కామక్రోధాదులు మనస్సుతో చేరి ఒకవైపున - మరోవైపున పాండవులవంటి వినయ విధేయతాదులు బుద్ధితో కూడి స్వచ్ఛమైన తెలుపులా ఉన్నాయి. అటు మమకారాదులు గల మనస్సు - బుద్ధితో యుద్ధం చేస్తోంది. ఏం చేయాలో తోచని గ్రుడ్డి వాళ్ళం.

మనస్సునకూ - బుద్ధికీ ఎప్పుడూ ఈ శరీరమనే ధర్మక్షేత్రంలో యుద్ధం జరుగుతూనే ఉంటుంది. ఏం చేయాలో తోచని స్థితిలో అజ్ఞానమనే గ్రుడితనాన్ని పోగొట్టుకోవాలంటే, జ్ఞానమనే వెలుతురు కోసం, సద్గురువును ఆశ్రయించాలి. ఆయన జ్ఞానం ప్రసాదిస్తాడు కదా. సద్గురువును ఆశ్రయించి అజ్ఞానమనే గ్రుడ్డివాడు - అడుగుతున్న ప్రశ్న - భగవద్గీతలోని మొదటి శ్లోకమే దాని సమాధానమే భగవద్గీతలోని సప్తశతి దీని హృదయం - స్వధర్మాచరణ.

ఈ శరీరంలో శోక రాహిత్యం కోరేవాడు, ధర్మాన్ని ఆశ్రయించాలి. ఇది క్షేత్రం కనుక ధర్మాన్ని ఆశ్రయిస్తేనే ధర్మక్షేత్రం అవుతుంది. ఆనంద విజయం వరిస్తుంది, ముక్తి మురుస్తుంది. ఈ శ్లోకంలో మరో రహస్యం కూడ దాగి ఉంది. ఈ క్షేత్రంతో ధర్మం చేయి అనటంతోపాటు, రెండుసార్లు క్షేత్ర శబ్దం వాడటం వలన, "క్షేత్రే క్షేత్రే ధర్మం కురు" - అని మానవాళికి హితబోధ చేసారు. గీతాబోధ విన్నాక అర్జునుడు తన ధర్మాన్ని తెలిసికొని క్లీబత్వాన్ని పొందక, తాను నిమిత్తమాత్రుడనన్న విషయాన్ని గ్రహించి మాయతొలగ, విషాదం వీడిపోగా స్మృతిని పొంది, యుద్ధం చేసి, అధర్మాన్ని తొలగించి, ధర్మం చేపట్టి విజయుడయ్యాడు. మనమైనా సద్గురువునాశ్రయిస్తే చిత్త వృత్తిని నిరోధింపజేసి, జ్ఞానం పొంది, మమకారాదుల్ని జయించి ధర్మ పథంలో పయనించి ముక్తి ధామం చేరగలం.

డిండిమభట్టు గారూ, ఇపుడేమంటారు? ధృతరాష్ట్రుడెవరంటారు? అజ్ఞానాంధుడే కదా! అందుకే గురుబ్రహ్మలు చిక్కని ప్రశ్న అడిగినా, చిక్కని సమాధానం చెప్పాం! - అంటున్న శ్రీనాథునితో అర్జునుడు నిమిత్తమాత్రుడన్న సత్యాన్ని ముందే మేం నిరూపించాం. గీతా బోధ స్వధర్మాచరణ లక్ష్యంగా సాగింది. విశ్వమానవాభ్యుదయానికందించిన పవిత్ర గ్రంథం - అని అరుణగిరినాథులు సమర్థించుకొంటూంటే, మానవులంతా అజ్ఞానాంధులేనా? అని ప్రశ్నించాడు, అనుమానాల ఆంజనేయశాస్త్రి. శాస్త్రి గారూ! అసలు "అజ్ఞానం" - ఉంటేగా, అంధత్వం రావటానికి! హే అమృతపుత్రాః - అని శ్రుతి పిలుస్తోంది. అందరూ జ్ఞానులుగానే పుడతారు. వెలుతురు ఎపుడూ ఉంటుంది. నిజానికి చీకటి లేదు, ఉంటే చూపించండి ! చూపలేరు, లేదు కాబట్టి. వెలుతురు లేక పోవటమే చీకటి - "తేజోఽ భావస్తమః" - అన్నారు తార్కికులు. అలాగే. జ్ఞానం లేకపోవుటే అజ్ఞానం కదా!

జ్ఞానా భావమే అజ్ఞానం. అందుచేతనే, నష్టోమోహః - మాయ తొలగింది, అన్నాడు అర్జునుడు. లేనిది ఉన్నట్లుగా భ్రాంతి చెందటం, "యా మా, సా మాయా" మాయావరణ తొలగితే, మనలోనున్న సత్యాన్ని దర్శిస్తాం. అదే జ్ఞానం - "సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ" అని శ్రుతి స్పష్టం చేసింది. కనుక మనమంతా జ్ఞానం అనే వెలుతురు కోసం, అన్వేషిస్తున్నాం. మనం, సత్యాన్వేషణ తత్పరులం. ఆ సత్ నే మనం తెలిసికోవాలని, అదే తత్. అందుకే శ్రౌతి, ఓం తత్ సత్ - అంటారు. కనుక భగవానుడు ఆ జ్ఞానాన్ని తత్త్వవేత్తలగు జ్ఞానులకు సాష్టాంగ నమస్కారం చేసి, సమయం చూచి తత్త్వార్థియై ప్రశ్నించి, సేవించి తెలిసికో అన్నాడు. తత్త్వజ్ఞానం తప్పక తత్త్వ దర్శినులు నీకు ఉపదేశిస్తారని శ్రీ కృష్ణుని చిక్కని వక్కణ... కనుక మనం అజ్ఞానాంధుల మంటారా! జ్ఞానాన్వేషకులం అన్నారు

శ్రీనాథ కవి.

సంతోషంతో సదస్యులంతా కరతాళధ్వనులు చేసారు.

శ్రీనాథ కవి సద్భావనకు ముమ్మకవి మంగళా శాసనముల నందించారు.

దక్షారామము, కైలాసము కంటెను పరమపవిత్రమైన దివ్యక్షేత్రంగా మీరు వర్ణించినట్లు వల్లభుడు తెలుపగా విన్నాం. ఒక్క పద్యం వినిపించండి... అని మనవి చేసారు.

శ్రీనాథుడు: ఉ॥ ఏ దెస జూచిన న్విబుధు లేదెస జూచిన మౌని మండలం
బే దెస జూచిన న్హరి దధీశ్వర వర్గము వాసవాది యం
దే దెస జూచిన న్నవ మహేశ్వర మూర్తులు శ్రీనికుంభ కుం
భోదర తండు భృంగిరిటి హాహాహూహులు దక్ష వాటికిన్.

ఆహా! ఈ **ముత్యాలశాల** కూడ, ఆ రీతిగానే భాసిస్తోంది. **ముత్యాలశాల**లో ఏ దెస చూచినా పండితులే!... అంటూ చప్పట్లు చరచారు. సదస్యులు. నేటికి వాద సభ ముగిసింది. శాంతి మంత్రం పఠించండి – అన్నారు గురుబ్రహ్మ. **ఓం** తచ్ఛం యోరావృణీ మహే, గాతుం యజ్ఞాయ గాతుం యజ్ఞ పతయే దైవీ స్వస్తిరస్తునః, స్వస్తిర్మానుషేభ్యః, ఊర్ధ్వం జిగాతు భేషజమ్, శం నో అస్తు ద్విపదే. శంచతుష్పదే ॥ ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః ॥

15. ముత్యాలశాలలో పదునైదవ వాద సభ ప్రారంభ సూచకంగా మ్రోగింది ఘంటారావం.

ముత్యాలశాలలో జరుగుతున్న పండిత వాగ్వాద సభకు కవి పండితులు తండోప తండాలుగా వస్తున్నారు. రసజ్ఞ శేఖరులైన సదస్యుల సన్నిధిలో సంగీత సాహిత్య సమరాంగణ సార్వభౌముని ఎదుట ముత్యాలశాలలో సమస్కంధుడైన అరుణగిరినాథుని కంచుఢక్క పగులు గొట్టించాలనే అహమహమికతో మేషయుద్ధాన్ని, మల్లయుద్ధాన్ని తలదన్నే విధంగా వాగ్యుద్ధాన్ని ప్రారంభించాడు శ్రీనాథ సుకవి.

భాగవతం గురించి భగవంతుని ఏకవింశత్యవతారాల పూర్వాపరాలు చర్చించారు. ఐశ్వర్యం, వీర్యం, యశస్సు, శ్రియం, జ్ఞాన వైరాగ్యాలు కల షడ్గుణ సంపన్నుడే భగవంతుడని డిండిమభట్టారకులు వివరించారు.

జగదుత్పత్తి వినాశములను, ప్రాణుల రాక పోకలను, విద్యా విద్యలను తెలిసినవాడు భగవంతుడని తెలియజేస్తూ షడ్గుణ సంపత్తి, భగవత్ స్వరూపము వివరించి, పరమాత్మ స్వయంభువు అని "ఆత్మా స్వయంభూః" – అను శ్రుతి రహస్యాన్ని అధికంగా విశ్లేషించారు శ్రీనాథ భట్టు.

ప్రాణానికి శరీరానికి ప్రభువు – పరమాత్మ **"ప్రాణశరీరనేతా"** – శ్రుతి, ఆయన

ప్రేమ స్వరూపుడు, అని – ప్రియ మిత్యేన దుపాసీత – బృహదారణ్యక శ్రుతి ప్రతిపాదిస్తోంది. "తస్యోపనిషత్ సత్య స్య సత్యమ్" అని అదే శ్రుతి కేవలం పరమాత్మ సత్యస్వరూపుడనియే ప్రతిపాదిస్తోంది. ఆయన పాపరహితుడు పవిత్రుడని – "శుద్ధమపాపవిద్ధమ్" – శ్రుతి, ధర్మనిలయునిగాను, గుర్తించి పరిపూర్ణ జ్ఞానంచే ఉపాసించి ధీరులగు వారు అమృత మయుడగు ఆనంద స్వరూపుని దర్శించి తరిస్తున్నారు. పరిపూర్ణ జ్ఞానం పొందాలంటే సత్కర్మాచరణయే మార్గం. తద్వారా భక్తి లభిస్తుంది. ఈ భక్తి, వైరభక్తి కూడ కావచ్చు. వైరంతో కంస, హిరణ్యకశిపాదులు ముక్తిపొందారు. భగవద్వైభవాన్ని విని, పరీక్షిత్తు, శుకమహర్షి కీర్తించి, ప్రహ్లాదుడు స్మరించి శ్రీలక్ష్మి భజించి, పృధువు పూజించి, అక్రూరుడు నమస్కరించి, మారుతి దాస్యంచేసి, అర్జునుడు స్నేహంచే, బలి ఆత్మార్పణంచే ముక్తి పొందారు.

భగవద్భక్తుల వృత్తాంతాలను తెలిపి, మానవులకు భక్తిని ప్రబోధించటమే భాగవత లక్ష్యమని డిండిమ భట్టారకులు వివరించారు. అంతే కాదు బలి దాన గుణం చేత, విశేష ఖ్యాతిని పొంది ఆత్మార్పణ బుద్ధితో పరమాత్మను దర్శింప కలిగాడు, అంటూ బలివదాన్యతను శ్లాఘించి, "హస్తస్యభూషణం దానం" – చేతికి అలంకారం దాతృత్వమేనని నిర్ధారించారు డిండిమభట్టారకులు.

'బలివదాన్యత' – ప్రకృత వాదాంశము, డిండిమభట్టారకులు మహా బలుడైన బలిచక్రవర్తి మహా దాతయని, శ్లాఘించారు. ఆ దాతృత్వమే ఆతని కొంప ముంచిందన్న విషయాన్ని వారు విస్మరించారు. ధర్మగ్లాని జరుగుతూంటే, తనను తాను సృజించుకొని, శిష్ట రక్షణ, దుష్ట శిక్షణ చేస్తానని ప్రమాణం చేసిన శ్రీహరి, బలిచక్రవర్తియే మహాదాతయైతే అవతరింపవలసిన అవసరం ఏముంది? పైగా బలి చక్రవర్తి వారి కుటుంబమంతా విష్ణుభక్తులే! భగవంతుని ప్రతీ అవతారానికీ ప్రయోజనం ఉంటుంది. మందుడైనాసరే ప్రయోజనం లేకుండా ప్రవర్తించడని ఆర్యోక్తి. "ప్రయోజన మనుద్దిస్య నమందోపి ప్రవర్తతే" – మరి సర్వజ్ఞుడైన భగవంతుడు, అవతరించడానికి ఏదో మహత్తర ప్రయోజనం ఉండి తీరుతుంది. పైగా ధర్మగ్లాని సంభవిస్తేనే గాని అవతరించడాయె! ధర్మగ్లాని ఏం జరిగిందో డిండిమభట్టారకులు నిరూపించకుండానే, వారి వాగ్ధాటితో పౌరాణికులై భాగవత రహస్యాన్ని తెలుపక మండూక ప్లుతి చేసారు.

శ్రీనాథా! కప్పదాటుడు వ్యవహారం కాదు. బలిచక్రవర్తి ముత్తాతలు హిరణ్యాక్ష హిరణ్యకశిపులు. వారిద్దరిని శ్రీహరి, దివ్యావతారాలెత్తి సంహరించారు. ఆ రాక్షస వంశంలో

పుట్టి, స్వర్గాధిపతియైన దేవేంద్రుని భయభ్రాంతుల్ని చేసాడు, త్రిలోకాధిపతి మహాబలియే! ప్రహ్లాదుడు, మనుమని భక్తిని శ్లాఘించినట్లు భాగవతమే ప్రమాణము. ఆతనిని శ్రీహరియే మెచ్చుకొని, ఆతని ఆత్మార్పణకు సంతసించి, సేవకుడైనాడని, బలిని పునః పునః శ్లాఘించి, బలిచక్రవర్తి వలె దానము చేయువారు మరొకరు లేరని వాదించిరి. ఆతడే "మహాదాత" అని బలిచక్రవర్తి వదాన్యత విలువైనదని, సోదాహరణముగ, డిండిమభట్టారకులు వాదించారు.

వైరభక్తితో నిరంతరం శ్రీహరినే స్మరించి, ముక్తి పొందిన హిరణ్యకశిపుని పుత్రరత్నమే ప్రహ్లాదుడు. ఈ శ్రీహరి భక్తుని భార్య దేవి. వీరి దాంపత్యఫలమే విరోచనుడు, విరోచనుని భార్య అశన. ఈ విష్ణు భక్తుల కుమారుడే బలి. జన్మతః విష్ణుభక్తుడైన బలి, పట్టమహిషి వింధ్యావళి, వీరుభయులూ శ్రీహరిభక్తులే. అంతే కాదు వీరి సంతానం కూడ హరి భక్తులే. "వీరి కుమార్తె రత్నమాల, కుమారులలో బాణాసురుడు, పరమశివభక్తులు. బలిచక్రవర్తిది భక్త కుటుంబం. భక్తుడు తప్పు దారిలో వెళుతున్నాడని, భగవంతుడే స్వయంగా అవతారమెత్తి రక్షించిన సంఘటన, భాగవతంలో వ్యాసమహర్షి చక్కగా తెలిపారు.

"యద్ యద్ వటో వాంఛసి తత్ ప్రతీక్ష మే",... బ్రహ్మచారి ఏది ఏది కోరితే దానిని నెరవేరుస్తాం. గోవులా, బంగారమా... అంటూనే గ్రామాలా, గుఱ్ఱాలా, ఏనుగులా రథాలా... అని పలికే సందర్భంలో, బ్రాహ్మణ కన్యలను కోరినా ఇస్తాం అని దానగర్వంతో పలికినట్లు శ్రీమద్భాగవతమే సాక్ష్యం." గాం కాంచనం... విప్రకన్యాం గ్రామాన్ సమృద్ధాం స్తురగాన్ గజాన్వా రథాంస్తథార్హత్తమ సంప్రతీచ్ఛ" అనే సందర్భాన్ని సునిశితంగా పరిశీలన చేస్తే దానమదం, అధికార మదం, ఐశ్వర్య మదం, వయోమదం దర్శనమిస్తున్నాయి.

ఎంతటి భక్తుడైనా ఇంత గర్వం పనికిరాదు. పైగా నేనిచ్చేవాడిని, ఆతడు తీసికొనేవాడు అనే భావన కలిగినవాడు బలి. సమస్త సంపదలు "యద్యత్ విభూతి... శ్రీమదూర్జితమేవవా" – అన్నట్లుగా ఆ పరమాత్మ యిచ్చినవే. చెఱువులో నీళ్ళు దోసిలితో తీసికొని, ఓ చెఱువా, ఈ నీళ్ళతో నీ దాహం తీర్చుకో – అని చెఱువులో పోసినట్లున్నది, బలిదానం! పైగా ఎవరేది కోరితే దానినే దానం చేస్తున్నాడు. యోగ్యతా యోగ్యతలు పరిశీలించటం లేదు. అపాత్రదానాలు కూడా చేసాడు. ఇలా అధర్మం పెరిగిపోతూన్నది. ధర్మగ్లాని సంభవించింది.

అందుకే శ్రీహరి, వామనావతారం దాల్చి, ముల్లోకాలను దానంగా స్వీకరించి, పాతాళానికి బలి శిరసున పాదం మోపి అణగద్రొక్కాడు. శ్రీహరి పాదస్పర్శతో పునీతుడయ్యాడు, బలి. అతిదానం వల్ల బలి, బద్ధుడయ్యాడు. స్వాభిమానంతో దుర్యోధనుడు,

స్త్రీలోలత్వంతో రావణ బ్రహ్మ నశించారు. అతి ఏ విషయంలోను పనికిరాదని **"అతి సర్వత్ర వర్జయేత్"** – అను "చాణక్య" నీతిశాస్త్రంలోని రహస్యాన్ని తెల్పి, స్వపక్ష స్థాపన చేసాడు, శ్రీనాథ భట్టారకుడు. సదస్యుల చప్పట్లతో ముత్యాలశాల మురిసింది. నాటి సభ ముగిసింది. శాంతి మంత్ర సుమం విరిసింది.

16. ముత్యాలశాలలో పదహారవరోజున జరిగే వాదసభ ప్రారంభ ఘంటారావం మ్రోగింది.

ముత్యాలశాల, నేడు డిండిమభట్టు, శ్రీనాథ భట్టుల విద్యా వివాదాల కాట పట్టు. యోగానంద ప్రహసన కర్త, విజయనగరాస్థాన విద్యాధికారి గౌడడిండిమభట్టు – కవి మల్లగల్ల తాడన పటువు. ప్రతి భట కవి కుంజర పంచాననుడు. ఈతడే అరుణగిరినాథుడు. ఈతనిపై సవాల్ చేసిన శ్రీనాథుడు విద్యాధికారియే! ఇద్దఱూ పాండిత్యంలోను, కవితా ప్రతిభలోను ఒకరినొకరు తీసిపోవువారు కారని పండిత కవుల మనోభిప్రాయము.

రాయలవారి ఆనతిపై శ్రీనాథ కవి – పలనాటి సీమ పల్లెటూళ్ళలో చిన్నచిన్న రాళ్ళు, చిల్లర చిల్లర దేవతావిగ్రహాలు హెచ్చు. కారెమపూడి పరిసర ప్రాంతాలలో ప్రవహించే నాగులేటి నీళ్ళే, అక్కడ దొరికే జలం – అన్నారు. నాగులేటి ప్రవాహానికి అడుగున నాప రాళ్ళు హెచ్చు. ఆహారించుటకు సన్నన్నం, జొన్నన్నం మాత్రమే లభిస్తుంది. పాములు, తేళ్ళు కూడ అక్కడ ఎక్కువగానే ఉంటాయి... అంటూ, ఆట వెలది నదందించారు.

ఆ॥ వె॥ చిన్న చిన్న రాళ్ళు చిల్లర దేవుళ్ళు
నాగు లేటి నీళ్ళు నాపరాళ్ళు ।
సజ్జ జొన్న కూళ్ళు సర్పంబులును దేళ్ళు
పల్లె నాటి సీమ పల్లెటూళ్ళు ॥

విద్వత్కవులారా! ముప్పది మూడు కోట్ల దేవతలున్నారంటారు. శివుడు, విష్ణువు, బ్రహ్మ, పార్వతి, లక్ష్మి, సరస్వతి, గణపతి, కార్తికేయుడు, శక్తి, సూర్యచంద్రాది దేవతలెందరో ఉన్నారు. పైగా చిల్లర దేవుళ్ళున్నారంటున్నారు. వీరంతా ఎవరో తెలియపరచటమే నేటి వాదాంశమన్నారు, ధర్మపీఠాధ్యక్షులు.

ఉన్న పరమాత్మ ఒక్కడే. "ఏకంసత్", **"విప్రాః బహుధావదంతి"** – ఉన్నదొక్క సత్యమే. ఆ సత్యమే పరమాత్మ. ఆ పరమాత్మనే బుధులు, అనేక రూపాలుగా భావించి సహస్రనామాలతో కీర్తిస్తున్నారు. రాళ్ళని రప్పల్ని, గుట్టల్ని, పుట్టల్ని, చెట్లు చేమల్ని, అన్నింటినీ దేవుని ప్రతినిధులుగా భావించే సంస్కృతి మనది. గ్రామదేవతల్ని పూజిస్తాం. "పూర్వులను, ప్రతిభావంతులను, గురువులను కూడ శిలావిగ్రహాలుగా మలచి పూజిస్తాం. ఇలా ఏర్పడిన

వారే చిల్లర దేవుళ్ళు.... అంటూ చతుర్విధ ముక్తులను, త్రిమూర్తులను శ్రుతి, స్మృతుల సాక్ష్యాధారాలతో ధారాళంగా వాదించారు డిండిమభట్టు.

శ్రీనాథభట్టు "ఏకమేవాఽ ద్వితీయంబ్రహ్మ" - బ్రహ్మ మొక్కటే! రెండవది లేదు. అదే "ఆత్మ". ఆత్మ ఆనంద స్వరూపం. "రసోవైసః" శ్రుతి. రస్యతే ఆస్వాద్యతే ఇతి రసః - ఆస్వాదించబడునది - రసం, పరమాత్మ రసానంద స్వరూపుడు "ఏషాంభూతానాం పృధివీ వసతి పృధివ్యా ఆపో రసః - అని ఛాందోగ్యశ్రుతి. ఆత్మయే సత్యం, జ్ఞానం, అనంతం, బ్రహ్మ - త్రికాలాబాధ్యమైంది - సత్యం. సత్+తి+యం. సత్ = అమృతమును, తి=మర్త్యాన్ని, యం = రెండింటిని నియమించే బ్రహ్మయే సత్యం - ఆయనే సత్యం శివం సుందరం. ఆది మధ్యాంత రహితమైన సత్య స్వరూపుడే పరమాత్మ. ఒక్కడే! **"ఏకంసత్"** - శ్రుతి.

మంత్రం: **ఇంద్రం మిత్రం వరుణం అగ్నిం ఆహుః**
అథోదివ్యః స సువర్ణో గరుత్మాన్
"ఏకంసత్ విప్రాః బహూధా వదన్తి"

అగ్నిం యమం మాత రిశ్వానం ఆహుః - అని ఋగ్వేద మంత్రం పరమాత్మ ఒక్కడేనని, వివేకవంతులైన విప్రులు పలు విధాలుగా పల్కుతున్నారని తెలుపుతోంది. వారు కూడ ఉన్న ఒకే పరమాత్మను - ఇంద్రుడు, సూర్యుడు, వరుణుడు, అగ్ని, గరుత్మంతుడు, యముడు వాయువు అని అనేక నామాలతో, రకరకాల రూపాలను సృష్టించి పిలుస్తున్నారు. విజ్ఞానులైన వారు, తత్త్వదర్శినులు, విద్యావినయ సంపన్నులైన విప్రుల యందు, గోవులందు, ఏనుగులందు, శునకములందు, మరి అన్నింటి యందు, అన్ని ప్రాణుల యందున్న పరమాత్మ ఒక్కడేనని సమదర్శినులై గ్రహిస్తున్నారు. మరికొందఱు వారి కాలమందు కాని, వారికి ముందు కాని, ఇంకాముందు కాని పుట్టి మహిమలు చూపిన వారిని, జ్ఞాన బోధచేసిన వారిని కూడ శిలల రూపమున కొలుస్తున్నారు. ఇంకామరికొందఱు, కొయ్యలను, బొమ్మలను, పసుపుపూసి, కుంకుమ బొట్లుపెట్టి పూజలు చేస్తున్నారు. ఎవరేయే భావాలతో పూజించినా, వారికి ఆ విధంగానే దర్శనము కల్పిస్తానన్న పరమేశ్వరుని వాక్కు అమోఘము. అలాగే ముక్తి ఒక్కటేనని, డిండిముని చతర్విధ ముక్తులను ఖండించారు. మూఢ భక్తితో రాళ్లను రప్పలను కొయ్యలను జియ్యలను కూడ పూజించటంతో చిల్లర దేవుళ్ళు ఎక్కువయ్యారు అన్నారు. వివిధ ఆభరణాలుగా భాసించే వస్తువుల్లో బంగారం ఒక్కటే. గోవు లెన్ని ఉన్నా అవి ఇచ్చే పాలు ఒక్కటే, అలాగే జీవులందరిలోను, కొలిచే

దైవాల్లోను ఉన్న పరమాత్మ ఒక్కడే అని పల్కిన శ్రీనాథుని, పండితులు శ్లాఘించారు. శాంతి మంత్రం పఠించారు. ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః

17. ముత్యాలశాలలో పదునేడవ వాద సభ ప్రారంభానికి ఘంటారావం స్వాగతం పలికింది.

పండిత బృందాలతో విదుషీమణులతో కవయిత్రులతో ముత్యాలశాల మురిపిస్తోంది. సార్వభౌములు, స్వర్ణ సింహాసనాధిష్ఠితు లయ్యారు. ఎవరి స్థానాల్లో వారు కూర్చున్నారు.

వాగ్వాద సభా ప్రారంభానికి ముందుగా, శ్రీనాథ కవీ! పల్నాడు ప్రాంతంలో కొంత భాగాన్ని చూచి, వెత చెంది, పల్కిన పద్యాలు విన్నాం. అచటి అంగనలు సంతోషంగా కనబడలేదని, ఓ తాతలా వెత చెందారే, మరి మురిపించే మనుమరాలు వంటి ఇల్లాలే పలనాటి సీమలో కనబడలేదా? అని ప్రశ్నించిన రాయలవారితో, ప్రభూ! మురిపించే కుటుంబాలు కూడ ఉన్నాయి. నే పర్యటించిన రోజుల్లో కరువు కాటకాలేర్పడ్డాయి. తిండిలేక కటకటలాడే రోజులవి. నన్ను పిలిచిన వారింట్లో బియ్యం నిండుకొన్నాయి. నేనా వసారాలో సంధ్యావందనం చేసికొని కూర్చుని చూస్తున్నా! మగవారికి వ్యవసాయం పనుల్లేవు. ఆ ఇంటి యజమాని, ఊరంతా తిరిగి వట్టి చేతుల్తో వచ్చాడు. ఉస్సురుమని నడుము గోడ కాన్చి కూర్చున్నాడు. ప్రక్కింటి పార్వతినడిగి, సరిగా పొట్టుపోని బియ్యం తెచ్చింది. బియ్యానికి చేట పట్టుకొని వెళ్తూ, పూలదండ పట్టుకొని వెళ్ళి పార్వతికిచ్చి, కొన్ని పూలు కొప్పులో తుఱిమింది. ఆ పొట్టున్న బియ్యాన్ని రోటిలో పోసింది. పని తొందరగా తెమలడం కోసం, చంకలో నున్న పిల్లవాడిని నేలమీద పడుక్కో పెట్టింది. అలసిసొలసి సోలి వాలిన భర్తను చూస్తూ, బిడ్డను కూడ చూసింది. రోకలి తీసికొని నడుంముందుకు వెనక్కు కదులుతూంటే, చెవ్వన పాదాన్ని ముందుకు సాచి, చిరునవ్వులు చిందించు మొగంతో పాటపాడుతూ, తన బిడ్డ నూరడిస్తూ, కవ్వించే చూపులతో నాథుని అలసటను దూరం చేస్తూ, సువ్విసువ్వియని ఊతపల్కుతూ తన అలసటను పోగొట్టుకొంటూ, ముంగిలి వాకిటిలో ఓ సుందరి బియ్యందంచుతోంది. భార్య వయ్యారానికి భర్త, పాటలకు పిల్లవాడు, బియ్యందంచే యోగాభ్యాసనాట్యానికి ఆ సుందరి మురిసిపోయారు. నందన నాథుల నకనకలాటలు ఆమె ఆటపాటల వయ్యారాలతో దూరములయ్యాయి. ఎవ్వరికీ ఇబ్బంది లేకుండా యంత్రాంగం నడిపిన యాపె, తర్వాత వంట చేసి పెట్టి భర్తను, పాలిచ్చి బిడ్డను మురిపించింది. ముందుగానే ఈ తాతయ్యకు వడ్డించింది. ఆ ముచ్చటైన కుటుంబ చిత్రణ వినండి.

ఉ॥ పుప్వులు కొప్పునం దుఱిమి, ముందుగ గౌనసియాడు చుండగా
జెవ్వున జంగ సాచి యొకచేతను రోకలి బూని యొయ్యనన్

నవ్వుమొగంబుతోడ దన నందను బాడుచు నాథు జూచుచున్
సువ్వియ సువ్వియంచు నొక సుందరి బియ్యము దంచె ముంగిటన్

తీయని తెలుగు నుడులు గల సుకుమారమైన రచన, మనోహరమైన దృశ్యమే! ఆమె వింత యొయారములు, అక్షర చిత్రమాయె! అలాంటి వయ్యారాలు గల దివ్యసుందరి ద్రౌపది. ఆమె సౌందర్యాగ్ని సెగలకే కీచక సైంధవాదులు పంచత్వం పొందారు. ఆద్రౌపది **కన్యయా?...** అనునదియే నేటి వాదాంశము - అనినారు రాయలు.

ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని, నీతి విచక్షణులు నీతిశాస్త్రమని తలచు మహాభారతాన్ని విశ్వజనీనమై వ్యాస భగవానులు వ్రాసారు. ఆ మహాభారతంలో ప్రధానమైన స్త్రీ రత్నం ద్రౌపది. ద్రౌపది యంత యందగత్తె మరొకరులేరని భారతం చెపుతోంది. ఆమె, పాంచాలనృపతి ద్రుపదుడు, సంతానాన్ని కోరి యజ్ఞం చేస్తే, అగ్నిగుండం నుండి ధృష్టద్యుమ్నునితో పాటు పుట్టిన కుమారి. ఈమె యాజ్ఞసేనిగా కృష్ణగా ద్రౌపదిగా పిలువబడింది. ఈమె, మత్స్యయంత్రాన్ని కొట్టిన అర్జునుని వివాహమాడినది. కుంతీవచానానుసారం, పంచ పాండవులకు, నారదుడు చెప్పిన ప్రకారం నియమ నిష్ఠలతో ఒక్కొక్క వత్సరం ఒక్కొక్కనికి భార్యయై. ఈశ్వర వరప్రభావంచే కన్యగానే ఉంటూ, సతీధర్మాన్ని నెరవేర్చిన మహాసాధ్వి. భార్యగా నున్న వత్సరాంతమందు, కన్యాత్వం సిద్ధిస్తుంది. ఈ నియమానుసారం, అయిదురు పతులందు వరుసగా ప్రతివింధ్య శ్రుతసోమ, శ్రుతకీర్తి, శతానీక, శ్రుతసేనాదులు జన్మించారు. వీరు ద్రౌపదీయులు.

ద్రౌపది, దివ్యతేజంతో పుట్టిన కులపవిత్రయని నన్నయ వక్కణ. నారద మహర్షి చెప్పిన నియమము కనుక ధర్మమే! పైగా అగ్నిజ - కనుక పవిత్రురాలు. అగ్నికి చెదలంటునే! అగ్ని స్వరూపిణి, సామాన్య చక్షువులకు పాంచభౌతిక దేహంతో దర్శనమిచ్చే దివ్యాంగన - ద్రౌపది, కన్య, ఆమె స్మరణమే పాపహరణం.

శ్లో॥ "అహల్యా ద్రౌపదీ తారా, సీతా మందోదరీ తథా,
పంచకన్యాః పఠేన్నిత్యం సర్వపాప ముదాహృతే । అని, డిండిమభట్టారకులు వివరించారు.

అరుణగిరినాథులు, ద్రౌపది అగ్నిజయని, కన్యయని చెప్పటం సంతోషం. వారు సత్యాన్నే చెప్పారు, కాని, లక్ష్యాలనుదహరింపలేదు. **"కన్యాత్వంబు దూషితంబు కాకుండ ఈశ్వరువరంబునన్ కౌమారంబు వడసిన, అక్కన్యక...** అని ఆంధ్రమహాభారతంలో నన్నయ భట్టారకులు, మూలభావాన్ని స్పష్టం చేసారు. పుత్ర కామేష్ఠి చేసిన ద్రుపదునకు అగ్నిదేవుని

వలన అగ్నికుండ సముద్భవయైన దాని నయోనిజ నగణ్యపుణ్య లావణ్య గుణసమన్విత అని వివరించారు. కృష్ణద్వైపాయనుడే ద్రుపదునకు, దివ్య దృష్టినొసంగి కొన్ని సంఘటనలు చూపాడు. వ్యాసభగవానులు, ద్రౌపది, పూర్వమందు స్వర్గలక్ష్మియని, వారు స్వర్గాధిపులైన పంచేంద్రులని, ద్రౌపదికి ప్రతిదిన కన్యాత్వం – ఈశ్వర వర ప్రాప్తమని ద్రుపదునకు బోధించటమే కాక, తాను చెప్పిన సత్యాన్ని, ప్రత్యక్షం చేసిచూపాడు. ఆ దృశ్యాన్ని దర్శించిన ద్రుపదుడు – ఈశ్వర నిర్ణయం, అనుల్లంఘనీయ మనినాడు.

ఇంద్రసేన, పరమపతివ్రతా శిరోమణి. ఈమెను మౌద్గల్యుడు వివాహమాడాడు. ఆతడు ఐదుగురైనాడు. ఇంద్రసేన, కాశీ రాజు కుమార్తెగా పుట్టి – పరమేశ్వరుని గూర్చి తపస్సు చేసి వరాలు పొందింది. ఐదుసార్లు భర్త కావాలన్నది కనుక దేహాంతరంలో అలాగే పొందుతావన్నాడు శివుడు.

ఆమె తపో నిరతికి సంతోషించిన, ధర్మవాయు వాసవాశ్వినులు ప్రీతులైవచ్చి దానినాత్మదేహాంతరమున బత్నిగా గోరి రధిక సౌబాగ్య యుక్తి" అన్నారు – ఆంధ్రమహా భారతం – 1-7-260. ఈ సందర్భంలో "రుద్రుడిట్లనియె" నా వచనంబున నీకయ్యేవురు పతులందు ధర్మ మెడపక యుండున్, గావున నిట్టివరం బిందీవరదళనేత్ర యిచ్చితిని దయతోడన్" – అట్లేని అయ్యేవురు పతులయందును, ప్రత్యేక సంగమంబునను నాకు కౌమారత్వంబును పతి శుశ్రూషాసిద్ధియు సౌభాగ్యంబును ప్రసాదింపుమనిన, రుద్రుండు, దాని కోరిన వరంబు లెల్ల నిచ్చె–నని, పంచేంద్రోపాఖ్యానంలో స్పష్టంగా, ఆమె కన్యయని ఉంది.

ధర్మానిల శక్రాశ్వినులు – ఆధార కర్తలుగా ధర్మజ భీమార్జున నకుల సహదేవులనంగా బుట్టినట్లున్నది. యజ్ఞవేదిని పుట్టిన యాజ్ఞసేనికి పాండవ పంచకంతో వివాహం ఈశ్వర విహితమని – "ద్రౌపద్యా దేవ విహితో వివాహశ్చా ప్యమానుః" – ఆమె "అమానుషః" – మనుష్యులకు చెందినది కాదని జయవాణి. కనుక "ద్రౌపది" కన్యయే, అనిన శ్రీనాథుని వాదాన్ని విని, కరతాళధ్వనులతో జేజేలు పల్కి శాంతి మంత్రం పఠించారు.

18. ముత్యాలశాలలో పదునెనిమిదవ వాద సభ ప్రారంభానికి ఘంటారావం పిలుపునిచ్చింది.

సాహితీ ప్రియంభావుకులతో ముత్యాలశాల కళకళలాడుతోంది. రావలసిన పెద్దలంతా వచ్చి, వారివారి సముచిత స్థానాలనలంకరించారు. రసజ్ఞులైన రాయలవారు స్వర్ణసింహాసనాధిష్ఠితులై, ఎపుడెపుడు విందామని ఎదురుచూస్తూంటే, కులగురు బ్రహ్మలు,

నాథులిద్దఱు, **'తురీయపురుషార్థం'** గురించి, వాదనలు చేస్తుంటే, వింటాం - అన్నారు.

తురీయ పురుషార్థం - మోక్షం । ధర్మార్థ కామమోక్షాలు పురుషార్థాలు. పురుష శబ్దాని కర్థం - పురమందు శయనించు ప్రాణి, కనుక మానవులంతా, అంటే స్త్రీ, పురుషులందరూ పురుషులే. వీరంతా ధర్మంతో కూడిన అర్థకామాలనాశ్రయిస్తే జ్ఞానం ప్రాప్తిస్తుంది. దాంతో స్వస్వరూపజ్ఞాన ప్రాప్తి. దాంతో ముక్తి లభిస్తుంది, అనిన శ్రీనాథ కవితో - వేద విహిత కర్మలను, ఆచరించటమే ధర్మం అన్నారు డిండిమభట్టు. శ్రీరామచంద్రుని ఆచరణలే ధర్మాలు. శ్రేష్ఠులు ఏఏ కర్మలు చేస్తారో, వాటినేతక్కినవారు ఆచరిస్తారు. అవే వారికి ప్రమాణాలు. వేద విహితములైన సత్కర్మల నాచరించుటచే ధర్మం వృద్ధి పొందుతుంది. కామ్యకర్మలను ఆచరింపక, నిత్యకర్మల నాచరిస్తే పాపం నశిస్తుంది. దాని మూలంగా ధర్మాధర్మాలు పోతాయి. కర్మ ఫలానుభవంతో ఈ శరీరం నశిస్తే, ధర్మాధర్మాలు లేవు కనుక, మరో శరీరం ఆత్మకు సంక్రమింపదు. ఈ విధంగా ఆత్యంతిక శరీర సంబంధ రాహిత్యమే మోక్షం. ఇది నివృత్తి ధర్మం వల్ల సిద్ధిస్తుంది. ప్రవృత్తి ధర్మం వల్ల స్వర్గాద్యభ్యుదయం ప్రాప్తిస్తుంది. ఆత్మజ్ఞానాశ్రయం కాని, జ్ఞానాశ్రయం కాని, జ్ఞాన రూపం కాదని శ్రీనాథ కవి సిద్ధాంతాల్ని త్రోసిపుచ్చారు.

మనస్సంబంధంతో బుద్ధి ఇచ్ఛ ద్వేష రాగాదులను తొమ్మిది గుణాలు ఆత్మకు కలుగుతాయి. ఆ గుణాలు, మోక్ష దశలో మనస్సంబంధం లేనందున నశిస్తాయి. మోక్ష దశలో ఆత్మజడ రూపమే - "ఆత్మావారే ద్రష్టవ్యః", "అవినాశీనాఽ రేఽ యమాత్మా" - మున్నగు శ్రుతులచే ప్రతిపాదింపబడిన ఆత్మతత్త్వం క్రతువులను ఆచరించుటకు మోక్షమును పొందుటకు కూడ ఉపయోగపడుతుంది. నాశనం లేని ఆత్మ పారలౌకిక ఫలాలను పొందుతుంది. కనుక, ధర్మమార్గంలో యజ్ఞయాగాది సత్కర్మలాచరించి నిత్యకర్మలాచరించి పాపాన్ని పోగొట్టుకొని, ధర్మంతో కూడిన ధనాన్ని సముపార్జించి, ధర్మంతో కూడిన కోరికలను తీర్చుకొన్నవారే స్వర్గసుఖాదులు పొందడానికి, సామీప్యాదిముక్తులకు అర్హులవుతారని, శ్రుతి, స్మృతి, పురాణాదులాధారంగా వాదించారు డిండిమభట్టారకులు.

డిండిమభట్టు గారూ! మా వచోవ్యాఘాతాలు, మీ స్వవచో వ్యాఘాతాలకు, ఆఘాతాలే. స్వర్గాది సుఖాలు కూడ ముక్తేనంటారు. సారూప్యం పొందటం ముక్తేనంటారు. ఇది స్వవచో వ్యాఘాతం కాదా? స్వరాది సుఖాలు అనిత్యాలు. అవి ఇహలోక సుఖం కన్నా కొన్నిరెట్లు అధికం కావచ్చు. స్వర్గాది సుఖాలు, స్వర్గ కాముకుడు చేసే జ్యోతిష్టోమాది యజ్ఞాల వల్ల లభించేవి. అవి అశాశ్వతమని శ్రుతి ప్రతిపాదిస్తోంది. "తద్య దేహ కర్మచితో

లోకః క్షీయత, ఏవమేవా ముత్ర పుణ్యచితో లోకః క్షీయతే" – అనువేద వాక్కు వల్ల, "క్షీణేపుణ్యే మర్త్యలోకే విశన్తి" – అను స్మృతి ప్రమాణం చేత, పుణ్యం క్షీణించిన వెంటనే ప్రాణి మరల పృధ్వీపై పుట్టటం జరుగుతోంది. అర్థం అంటారా, మనం ఎంత సంపాదించినా అది ద్రవించి పోతూనే ఉంది. అందుకే అది ద్రవ్యం. సంపాదించిన వాడెవ్వడూ ధనాన్ని కాని వస్తు వాహనాదుల్ని గాని పట్టుకొని వెళ్ళటం లేదనే సత్యం మనకు ప్రత్యక్ష ప్రమాణమే. పైగా కూర్చునితింటే బంగరు కొండలైనా కరిగిపోతాయి. మరి, కామమంటారా? అది ఆంధ్యం, అదీ క్షీణించేదే! అర్థ కామాలు, భ్రాంతితో కూడిన ఐహిక సుఖమాత్ర సాధనాలు. ఆ అనుభవం అత్యల్పం. దుఃఖమిశ్రితం. మాయాకంచుక నిర్మితం. అవి అనిత్యాలని మనకు తెలుసు. నిత్య సత్యమైంది మోక్షం ఒక్కటే. మరల పుట్టుక లేనిది మోక్షం.

మోక్షం – నిరతిశయ నిరవధికానంతాఖండైక రసాత్మకమైంది.

జనన మరణ రూపమగు ఈ సంసారం, అజ్ఞాన కారణమని తెలియడమే – జ్ఞానం. ఈ జ్ఞానం వంటి పవిత్రమైన వస్తువు ఏదీలేదు. "నహి జ్ఞానేన సదృశం పవిత్ర మిహ విద్యతే" – అని గీతాస్మృతి బోధిస్తోంది. ఈ భవబంధం నుండి నివృత్తి పొందడమే – మోక్షం. దీని వలన మరల పుట్టుకలేదని, శ్రుతులు వినబడుతున్నాయి. "యద్గత్వా న నివర్తంతే" – గీతాస్మృతి.

"నచ పునరావర్తతే" – శ్రుతి, ఇంతటి పరమ పురుషార్థమగు మోక్షసాధనకు బ్రహ్మజ్ఞానం అత్యంత ఆవశ్యకం. బ్రహ్మమీమాంస వలన దృశ్యమాన ప్రపంచమంతా దుఃఖ కారణమని తెలుస్తుంది. అంతేకాదు, జనన మరణ రూప సంసార మూలకారణ నాశన జ్ఞానం కూడ కల్గుతుంది. దాంతో మోక్షరూప శాశ్వత బ్రహ్మానంద ప్రాప్తి సిద్ధిస్తుంది. అశాశ్వత బ్రహ్మానందాన్ని పొందాలనే జిజ్ఞాస కల్గించడానికి రుచి చూపించేదే, బ్రహ్మానంద సబ్రహ్మచారియౌ రసానంద స్వరూపిణియగు సత్కావ్యం. ఈ సత్కవితా సంగోష్ఠులు కాని, వాద ప్రతివాద సదస్సులు గాని రసానందాన్ని గ్రోలుటకేనన్నారు చిరునవ్వులతో శ్రీనాథుడు. కరతాళ ధ్వనులు మార్మోగాయి. శాంతి మంత్రం పఠించారు.

అసతోమా సద్గమయ ! తమసోమా జ్యోతిర్గమయ !
మృత్యోర్మా అమృతంగమయ ! ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః !!

19. **ముత్యాలశాలలో పంతొమ్మిదవరోజు** వాద సభ ప్రారంభానికి ఘంటారావం పిలిచింది.

సాహితీ రసరిరంసువులు తమ తమ స్థానాలలో సుఖాశీనులయ్యారు. రాయల వారి యాజ్ఞానుసారం, వాదం ప్రారంభించిన అరుణగిరి నాథులు, **ముక్తి** నాల్గు విధాలని

సాలోక్య, సామీప్య సారూప్యసాయుజ్యాలని, సిద్ధాంతం చేసారు. ముక్తుడైన జీవుడు, ఆ భగవంతుని లోకంలో ఆయన సమీపంలోనే ఉండి సేవించుకొంటూ ఆనందం పొందుసన్నారు.

అంతే కాకుండా, భగవంతుని సారూప్యాన్ని పొంది, ఆయనను సేవిస్తూ ఆయన చెంతనే, ముక్తుడైన వాడుంటాడని, సోదాహరణంగా నిరూపించి, శ్రీనాథుని సిద్ధాంతాన్ని త్రోసి రాజన్నారు డిండిమభట్టారకులు.

వారి చతుర్విధ ముక్తుల్ని విన్న శ్రీనాథ పండితులు - అద్వైత సిద్ధాంతరీత్యా, ముక్తుడైనవాడు తానే బ్రహ్మ. అజ్ఞాన దశలో తాను బ్రహ్మ కంటే భిన్నుడు అని తలచిన జీవుడు. జ్ఞానోదయం అవగానే, తాను ఆ "బ్రహ్మమే" అని తలచి అభేదాన్ని సాక్షాత్కరించుకొంటాడు. బ్రహ్మ, సచ్చిదానంద స్వరూపం కనుక అద్వైతముక్తుడు సచ్చిదానంద స్వరూపుడు కనుక, సచ్చిదానంద స్వరూపుడవుతాడు.

డిండిమభట్టు గారూ! మీ సిద్ధాంత ప్రకారం ముక్తులైన వారు, దైవం కన్న భిన్నులుగ ఉంటారు కదా! సారూప్యంలో ఉంటారన్నారు. కనుక జీవుని కంటే ఆ దైవమే ఉత్కృష్టత కలవాడని తెలుస్తోంది. అతడు, దైవము కాడు, దైవము వలె కనబడతాడు. అంటే దైవం కన్న తక్కువే కదా. కాబట్టి ముక్తజీవునికి భయం ఉంటుంది అంటే అభయస్థితి కలుగదు. మనకంటె గొప్పవానిని చూచినపుడు, మనకు భయమే కలుగుతుంది. ఇది సహజం. ఆ భావాన్నే - "ద్వితీయాద్వై భయం భవతి" - అని శ్రుతి ప్రతిపాదిస్తోంది. ఇది యుక్తిని బట్టి కూడ తెలుస్తోంది.

కాబట్టి డిండిమ భట్టు గారూ! ముక్తి స్థితి యందు కూడ భయపడే అవకాశం ఉంటే ఆ స్థితిని ముక్తి, మోక్షము - అని ఏ విధంగా వర్ణించడానికి వీలౌతుందంటారు? - మోక్షం - అంటే అభయస్థితియే కదా! తనకంటే వేరే వస్తువులేకుండా తాము సర్వ వ్యాపకుడైన సచ్చిదానంద బ్రహ్మమైతేనే అభయస్థితి కల్గుతుంది. మరోలా కుదరదు కనుక, ముక్తి స్వరూప స్వభావాన్ని పరిశీలిస్తే, అద్వైతమే శిరోధార్యమని డిండిమభట్టు వాదాన్ని ఖండించాడు శ్రీనాథుడు. ముత్యాలశాలలో కరతాళ ధ్వనులు ప్రతిధ్వనించాయి. ఓం శాన్తి శ్శాన్తి శ్శాన్తిః.

20. ముత్యాలశాలలో ఇరవైయవ రోజు వాద సభ ప్రారంభానికి శ్రీకారం ఘంటారావం ॥

పండిత పరమహంసలతో, ముత్యాలశాల సరోవరం, సోహంకార ధ్వనిత హంసధ్వని రాగతరంగనాదాల నందిస్తోంది. రాయలవారి చిర్నగవుల నందించే అంగీకారంతో

వాదసదస్సు ప్రారంభమైంది. **"బ్రహ్మసత్యం, జగన్మిథ్యా"** – అను విషయంలో మిథ్యావాదాన్ని భట్టులిద్దఱూ ఖండన, మండన ఖండన, ఖండన మండనలతో పటుపటాంగంగా వాదిస్తున్నారు. సదస్యులంత, ఉత్కంఠతో వాదోపవాద రసపానమత్త చిత్తులై, సాహిత్యశాస్త్ర లాహిరిలో తేలిపోతున్నారు.

"సర్వ శాస్త్ర రస జ్ఞానాత్, ఆహారోపి నరోచతే... అని పండితులు ఆనంద లహరిలో ఓలలాడుతున్నారు.

శ్రీనాథుడు, పర పక్ష వాక్యములనే తామరతూండ్లను కొరికే విషయంలో హంసల వంటి శతాధికయుక్తులతో డిండిమభట్టు సిద్ధాంతాల్ని చిందరవందర చేసేస్తున్నారు.

శ్రీనాథుని వాగ్ధాటి సామాన్యమైంది కాదు. అరుణగిరి పక్షాలను సునాయాసంగా ఛేదించేవి, శ్రీనాథ వాగ్వజ్రాయుధ ప్రహారాలు! – అని అద్వైత వాదులైన బ్రహ్మమీమాంసా శాస్త్రజ్ఞులు, హెూ హెూ; హై సరే!యని శ్లాఘించారు. సాహిత్యపు హెూంతకాడని ముమ్మకవి తలచాడు. డిండిమభట్టు, హ్రీతముఖుడైనాడు.

జగత్తుసత్యము, పరమేశ్వరుడొక్కడే సర్వోత్తముడు. జీవ, ఈశ, జడులలో భేదాలున్నాయి. జీవులు – పరమేశ్వరుని సేవకులు. అమలమైన సుఖానుభూతియే ముక్తి. దానికి సత్కర్మాచరణ ముఖ్యం. తద్వారా భక్తి ఏర్పడుతుంది. ప్రత్యక్షానుమాన శబ్దాల ద్వారా పరమేశ్వరుని పొందు విషయాన్ని తెలిసికోవచ్చు. సమస్త వేదరాశికి శ్రీ మహావిష్ణువే వేద్యుడు. పరతత్త్వం పరమేశ్వరుడే! ఆతనిని సేవించి తరించాలి. స్వర్గాది సుఖాలు పొందాలంటే, యజ్ఞయాగాది క్రతువులు చేయాలి... "బ్రహ్మ శబ్దశ్చ విష్ణ్వాదేవ" అని హరివంశ సూత్ర భాష్యం వివరిస్తోంది.

"వేదే రామాయణే చైవ పురాణే భారతే తథా ।
ఆదావంత్యేచ మధ్యేచ విష్ణుః సర్వత్ర గీయతే" ॥

వేదాల్లోను, శ్రీమద్రామాయణం లోను, పురాణాల్లోను, మహాభారతంలోను, ఆది మధ్యాంతాల్లోను విష్ణువే సర్వత్ర కీర్తింపబడుచున్నాడని, హరివంశం స్పష్టం చేసింది. "సృష్టి స్థితి సంహార నియమన జ్ఞానా జ్ఞాన బంధ మోక్షాయతః" ఎవని వలన, సృష్టి స్థితిలయాలు జ్ఞానాజ్ఞానాలు బంధ మోక్షాలు జరుగుతున్నాయో ఆతడే విష్ణువు, సర్వవ్యాపి, సర్వోత్తముడు, పురుషోత్తముడు... ఆతడే పరమాత్మ ఆతడే సృష్టి స్థితి సంహార కారకుడు. బ్రహ్మరుద్రులు, ఆయన కధీనులు వీరు నిమిత్తమాత్రులు.

త్రిలోకాల్లోను అస్తిత్వం కల్గి ఉండేది సత్యం. బిడ్డ పుట్టటం సత్యం, ఉండటం,

మార్పు చెందడం, పెరగడం, తరగడం, మరణించటం సత్యం. ఒకప్పుడు ఉండి, మరొకప్పుడు నశించే జగత్తు సత్యమే! పరమాత్మ స్వతంత్రుడు - జీవుడస్వతంత్రుడు పరమాత్మదోష రహితుడు. జీవాత్మ దోష సహితుడు. భయబంధితుడు, భవరోగి।

జీవేశ్వర భేదం పారమార్థికంగా ఉంది. జీవుడు - పరమాత్మ యొక్క ప్రతిబింబం. పరమాత్మ వలన పుట్టిన జీవుడు నిత్యుడే. కనుక జీవేశ్వర భేదం భ్రాంతి కాదు. ప్రత్యక్ష అనుమాన శబ్ద ప్రమాణముల వల్ల జీవునికి జీవునికి కూడ భేదం ఉంది. ఆ భేదం సత్యం. ముక్తిలో జీవునికి దేవునికి కూడ కొన్ని సాదృశ్యాలున్నా అవి పరమాత్ముని కన్న తక్కువే! జీవుడు, ముక్తి యందు కూడ భగవదధీనుడే. దయగల్గిన యజమానికి, భక్తి శ్రద్ధలు, వినయ విధేయతలు కల సేవకునికి గల సంబంధం లాంటిదే - జీవేశ్వర సంబంధం. భేదమే లేకుంటే భక్తి ఎందుకు? ఈ కర్మలన్నీ ఎందుకు? యజ్ఞయాగాది క్రతువులెందుకు? "ఆచార్యః పూర్వరూపమ్, అంతే వాస్యుత్తర రూపమ్, విద్యా సంధిః, ప్రవచనగ్ం సంధానం ఇత్యధివిద్యమ్" అనే కృష్ణయజుర్వేద మంత్రం ఏం కావాలి? గురు శిష్యులున్నారనేది శ్రుతుల వల్ల స్పష్టమే. మాత, పిత - వీరిద్దరూ సంతానానికి పితరులని, "మాతాః పూర్వరూపమ్ పితోత్తర రూపమ్ ప్రజాసంధిః, ప్రజననగ్ం సంధానం ఇత్యధిప్రజమ్" అంటూ తెలిపిన శ్రుతులు పురుషోత్తముడని ప్రశంసించుటలోనే పురుషుడు వేరని, పురుషోత్తముడు వేరని చెప్తోంది.

"జగత్ ప్రవాహం సత్యోయం... జీవేశయోఃభిదాచైవ జీవ భేదః పరస్పరం... ముక్తానాంచ న హీయంతే తారతమ్యం చసర్వదా... అని మహాభారత తాత్పర్య నిర్ణయానుసారం, జీవేశ్వరులకు భేదం ఉందని స్పష్టమౌతోంటే, ఉన్నదంతా ఒక్కటే, అనే మీరున్నారు. వినే, నేనున్నాను. ఇక్కడే ద్వైతం కనబడుతూంటే "మిధ్య" అని, లేదంటే ఎలా? అని శ్రీనాథ భట్టు వాదాన్ని ఖండించి, శాస్త్రోక్తులుదహరించారు డిండిమభట్టు.

డిండిమభట్టు గారూ! మీరు జగత్తు సత్యం, జీవుడు సత్యం, అంటూ భాష్యాలుదహరించి చక్కగా వాదించారు. మీ వాద పటిమ మెచ్చుకోతగినదే! కాని, జగత్తు సత్యమా? లేక మిధ్యయా? ఆత్మను "సత్" - అని వర్ణించిన గీతయే, జగత్తును - మాత్రా స్పర్శాస్తుకౌంతేయ... అను శ్లోకంలో, 'అనిత్యాః" అని "అసత్" గ నిరూపించింది. "నాసతో విద్యతే భావః నా భావో విద్యతే సతః, ఉభ యోరపి దృష్టోన్త స్తనయోః తత్త్వదర్శిభిః" - సత్‌కు అసత్‌కు భావం లేదు. సత్ ఎప్పుడూ సత్తే, అసత్ ఎపుడూ అసత్తే. నేతి నేతివాదం వలన, ఇది కాదు ఇది కాదు - అని యోచన చేయగా మిగిలినదే సత్-ఉంది.

ఉన్న వస్తువు ఎపుడూ ఉంటుంది. లేని వస్తువు ఎపుడూ ఉండదు. సత్ - అంటే ఆత్మ. అసత్ అంటే జగత్తు. కనుక, ఆత్మకు నాశనం లేదు. జగత్తుకు ఎపుడూ ఉనికి లేదు. ఉన్న వస్తువు ఎపుడూ ఉంటుంది! లేని వస్తువు ఎపుడూ ఉండదు. ఇది అందరికీ తెలుసు! ఈ తెలిసిన విషయాన్ని భగవానుడు పార్థునికి బోధించడం దేనికి? - అలా బోధించాడంటే ఏదో భావం ఉండి తీరాలి. ఇది నిషేధం కనుక ప్రసక్తమైన దానికే చేయాలి. సత్ కనబడుట లేదు కనుక, లేదేమో అని భ్రమపడటానికి అవకాశం ఉంది. జగత్తు కనబడుతోంది కనుక సత్యమైనదని భ్రమ పడటానికి, అవకాశముంది.

"నచేన్న బాధ్యేత, అసచ్చేన్న ప్రతీయేత, తస్మాత్ జగత్ సదసద్విలక్షణం అనిర్వచనీయం" - సత్ - ఉన్న వస్తువా? అంటే నిద్రలో సమాధిలో కనబడకపోవటంచే ఎప్పుడూ మారడం చేత సత్ కాదు. పోనీ శశిశృంగంలా, 'అసత్' లేని వస్తువా అంటే, కనబడుతోంది కనుక అసత్ కాదు. కనుక జగత్ సత్తు కాదు, అసత్తు కాదని, ఇది అనిర్వచనీయమని, మిథ్య అని అంటారు. కాబట్టి మిథ్య - అని తేలింది. "జగత్తు". మిథ్య - అంటే లేదని అర్థం కాదు. ఉన్నదని కాని, లేదని కాని నిర్వచించడానికి సాధ్యం కానిది "మిథ్య" - అని భావం.

ఏది, అయితే వస్తుత్వం లేకుండా కంటికి కనపడుతుంతో అదంతా "మిథ్య". త్రాడు చూచి, పాము - అని భ్రమపడినప్పుడు, వస్తుత్వం లేని 'సర్పం' కనబడుతోంది. కనుక ఆ పాము మిథ్య. అలాగే స్వప్నంలో కనబడే దృశ్యానికి వస్తుత్వం లేదు కనుక ఆ దృశ్యమంతా మిథ్యయే కదా! ఒక వస్తువు మరొక వస్తువుగా కనబడడమే భ్రాంతి. అసలు వస్తువును 'అధిష్ఠాన' మని మరో వస్తువుగా కనబడే దానిని 'ఆరోపిత' మని అంటారు. అసలు వస్తువు మార్పు పొందదు. నిర్వికారంగానే ఉంటుంది. అలా మారకుండానే మరో వస్తువులా కనబడుతుంది. భ్రాంతిపోగానే అసలైన వస్తువు యొక్క జ్ఞానం కల్గిన వెంటనే ఆరోపితం నశిస్తుంది. జగత్తు మిథ్యయని తేలిన జగత్తు ఆరోపితం. దీని కధిష్ఠానం బ్రహ్మ. బ్రహ్మ మార్పు నొందక, నిర్వికారుడై జగత్తుగా భాసిస్తాడు. అధిష్ఠానమైన బ్రహ్మజ్ఞానం కలుగగానే, జగత్తు జగత్తుగా కనబడక బ్రహ్మగానే దర్శనమిస్తాడు. త్రాడు, పాముగా కనపడినప్పుడు, రజ్జువని ఒక వస్తువు, సర్పమని ఇంకో వస్తువుగా రెండు వస్తువులు లేవు. భ్రాంతి ఉన్నంత కాలం, పాము ఒక్కటే కనబడింది. భ్రాంతి తొలగగానే, అంతవరకూ ఏది పాముగా కనపడిందో అదే త్రాడుగా తేలింది. అజ్ఞాన దశలో పాము ఉంది. జ్ఞాన దశలో త్రాడు మాత్రమే ఉంది. జ్ఞాన దశలో ఈ కనబడే జగత్తు బ్రహ్మగా తేలి, బ్రహ్మ ఒక్కటే ఉంది.

అసలు వస్తువు ఏమార్పు లేకుండా మరో వస్తువుగా కనబడటమే 'వివర్తం' అంటారు. అసలు వస్తువు మరో వస్తువుగా వాస్తవంలో మారినప్పుడు, అంటే పాలు పెరుగుగా మారినప్పుడు, దానిని పరిణామం అంటారు. ఇపుడు, జగత్తుకు - ఈశ్వరునకు ఉన్న సంబంధం వివర్తం కాని, పరిణామం కాదు. ఇలాంటి, వివర్త దృష్టితోనే ఆరోపిత వస్తువును "మిథ్య" అని అంటారు. ఇదే "రజ్జుసర్ప భ్రాంతి". "మయాతీత మిదం సర్వం జగదవ్యక్త మూర్తినా", "నచమత్ స్థాని భూతాని పశ్యమే యోగమైశ్వరం" అను భగవానుని వాక్యాలను అర్థం చేసికొంటే, ఈ జగత్తు అవ్యక్తరూపంగ నాచే వ్యాప్తమై ఉంది, ఈ భూతాలు నాయందే ఉన్నాయి. నేను భూతములయందు లేను, "అనే విషయాలు తెలియుట వలన బ్రహ్మఒక్కటే సత్యమైంది. జగత్తు మిథ్య, జీవుడు వాస్తవంలో బ్రహ్మయే" - "ఏకవిజ్ఞానేన సర్వవిజ్ఞానం" అను శ్రుత్యర్థంచే అద్వైత జ్ఞానం సిద్ధిస్తుందని శ్రీనాథుడు డిండిమభట్టు వాదాన్ని ఖండిచారు. "మిథ్య" ను నిరూపించాడు. చప్పట్లు మార్మోగాయి. ఓం శాంతిః శాంతిః శాంతిః.

21. ముత్యాలశాలలో ఇరవై ఒకటవ రోజు వాదసభ ప్రారంభానికి శ్రీకారం ఘంటా శింజితం.

ముత్యాలశాల, కవి పండితులతో, సాహితీ ప్రియులతో కళ కళ లాడుతోంది. గురుకుల బ్రహ్మ, **"ధర్మఫలం"** గురించి వాదోపవాదాలు వింటున్నారు. ధర్మం వలన సమస్త సంపదలు లభిస్తాయి. సుఖసంతోషాలు, సమస్తమూ లభిస్తాయి. ధర్మమే ఈ జగత్తుకు ఆధారం.

శ్లో॥ ధర్మాదర్థః ప్రభవతే, ధర్మాత్ ప్రభవతే సుఖం ।

ధర్మేణ లభతే సర్వం 'ధర్మసారమిదం జగత్" ॥ అని సీతాదేవి, శ్రీరామునితో తెలిపిన ధర్మసారం. శరీరం అశాశ్వతం. సంపదలు అస్థిరాలు, మృత్యువు పొంచి ఉంటుంది. కనుక ధర్మాన్ని సంగ్రహించాలి. ధర్మాన్ని మనం రక్షిస్తే తప్పక అది మనలను సంరక్షిస్తుంది. సత్యం పలకాలి. అది ప్రియంగా పలకాలి. సత్యమైనా అప్రియాన్ని పలుకరాదు - అని స్మృతి. శ్రుతి సమ్మతమైన ధర్మాలు ఆచరిస్తే పుణ్యం లభిస్తుంది. తద్వారా స్వర్గ ప్రాప్తి. అంతేకాదు స్వధర్మాచరణ వల్ల ముక్తి లభిస్తుంది. సుక్షేత్రంలో వేసిన విత్తనం, వృక్షమై ఫలాలనిచ్చినట్లే, ధర్మ బీజాలు, పుణ్యఫలాలనిస్తాయి. చేసిన పుణ్యం వల్ల ఈ జన్మలోనే సుఖం అనుభవింపవచ్చు. సత్యంతో కూడిన జపతపాలు చేయాలి. సత్యహీనమైన పూజ వ్యర్థం, అవి ఊషర క్షేత్రంలో చల్లబడిన బీజముల వంటివే - అని ఆర్యోక్తి.

"సత్యంవద ధర్మంచర, స్వాధ్యాయాన్మాప్రమదః" - సత్యం పలుకు. ధర్మంగా

ప్రవర్తించు. అప్రమత్తుడవై వేదాధ్యయనం చేయుము - అని కృష్ణయజుర్వేద మంత్రం శాసిస్తోంది. "ధర్మో భ్రాతా" - ధర్మమే సోదరుడని మహాభారత ప్రవచనం. **"సత్యమేవజయతే నానృతం"** - సత్యమే జయిస్తుంది, అసత్యం పరాజయం పాలౌతుంది - అని శ్రుతి రహస్యం. యజ్ఞ దాన తపః కర్మాత్మకమైన ధర్మం - స్వర్గ కాములకు మాత్రమే కాక, మోక్ష కాములకు కూడ అనుష్ఠేయమేనని భగవద్వాణి.

స్వర్గాది సుఖాలనిచ్చి సంసారంలో నిలబెట్టునవి ప్రవృత్తి కర్మలు. ముక్తి నిచ్చేది నివృత్తి కర్మ! "సుఖాభ్యుదయికం చైవనైశ్శ్రేయసిక మేవచ॥ గీతలో, కర్మలు ఇహపరలోక సుఖాలనిస్తాయని శ్రుతి స్మృత్యాదులు ధర్మ ఫల రహస్యాన్ని వివరించాయి. మంచి నడవడిక కల్గి, శీలవంతులైన స్త్రీలను గౌరవిస్తూ, తల్లిదండ్రుల్ని గురువుల్ని పూజించుచూ ధర్మాలనాచరించువాడు, బ్రతికినంతకాలం సుఖసంతోషాలు పొందునన్నదే ధర్మఫలం. ధర్మం చేసికొన్న వారికి చేసికొన్నంత ఫలం లభిస్తుంది. ఇహంలో సుఖసంతోషాలు, పరంలో స్వర్గలోక ప్రాప్తి, లేదాముక్తి లభిస్తుందని, ధర్మఫల రహస్యాన్ని శ్రుతి స్మృత్యాదులాధారంగా శ్రీనాథ భట్ట కవితో డిండిమభట్టారకులు వాదించారు.

డిండిమభట్టారకా! మీరు ధర్మఫలాన్ని, ధర్మం చేసికొన్న వాడే పొందుతాడని చెప్పారు. మరొక విషయమేమంటే, ధర్మాన్ని ఆచరించేవాడు దుఃఖాన్ని, అధర్మం ఆచరించే వాడు సుఖాన్ని పొందటాన్ని చూస్తున్నాం. ఇది నిజం కాదు. నరులు ఆచరించే ధర్మాధర్మాలకి ఫలం ఈ జన్మలో లభించకపోవుచ్చు. పూర్వజన్మలో చేసిన పుణ్యం వల్ల ఇపుడు సుఖాలను పొందవచ్చు. పూర్వం జల్లిన విత్తనాలకి ఫలంనేడనుభవిస్తున్నాం - అని ధర్మశాస్త్ర రహస్యం. పైగా మనం చేసిన ధర్మఫలంగాని, అధర్మఫలం గాని మన వంశంలోని వారు కూడ అనుభవింపవచ్చు.

శ్లో॥ యది నాత్మని పుత్రేషు నచేత్ పుత్రేషునప్తృషు,
నత్వేవతు కృతో ధర్మః కర్తుర్భవతి నిష్ఫలః ... అని ధర్మశాస్త్రం నొక్కివక్కాణిస్తోంది.

కొందరు విత్తనాలు వేసి, దాని ఫలితాన్ని అనుభవించకుండానే పోతారు. ఆ ఫలితాన్ని వారి కొడుకులో మనుమలో అనుభవిస్తారు. అధర్మం చేసిన వారికి దాని ఫలితం వారి విషయంలో కాకపోయినా, కుమారుని విషయంలోకాని మనుమని విషయంలో కాని అనుభవం లోకి వచ్చి తీరుతుంది. అంతేకాని వృధాగా పోదు. కనుక, తాత్కాలిక సుఖసంతోషాల కోసం అధర్మాన్ని చేయకూడదు.

పుట్టేటప్పుడు, పోయేటప్పుడు మానవుడొక్కడే. పుణ్యపాపాలు కూడతానొక్కడే

అనుభవిస్తాడు. పరలోక సహాయం కోసం, తలిదండ్రులు, భార్యా బిడ్డలు, బాంధవాళి ఎవ్వరూరారు. కనీసం పెంచుకొన్న ఈ శరీరమే రాదు. కేవలం ఇహలోక పరలోక సహాయకారి ధర్మఫలం ఒక్కటే. అందుకే ధర్మాన్ని, ఉన్న క్షణం నీదిగా భావించి సంపాదించాలి. మరు క్షణం నీది అవునో కాదో, తెలీదు. ఇల్లు అంటుకోవటం ప్రారంభించాక, నీటికై నూతిని త్రవ్వటం ప్రారంభించేవాడిలా, ముసలితనం వచ్చాక ధర్మం చేయుట ప్రారంభింపక వెంటనే ధర్మం చేసి ఫలంపొందు అని శ్రీనాథుడు వాద పటిమ చూపించారు. చప్పట్లు మార్మోగాయి. శాంతి మంత్రం పఠించారు.

22. ముత్యాలశాలలో ఇరవై రెండవ రోజు వాద సభకు ఘంటారావం పిలిచింది.

ముత్యాలశాల, పండిత పరమహంసలతో ముచ్చటగా ఉంది. వేదశాస్త్ర పండితులంతా చేరారు. సదస్యులు సకాలంలో చేరటంతో సర్వత్ర హర్షం వ్యక్తమౌతోంది.

రాయలవారి హస్త సంజ్ఞాదర లీల గ్రహించిన గురుబ్రహ్మ - సభకు మంగళా శాసనములనందించి, **శ్రీ వేంకటేశ్వర స్తోత్రం** లోని తొలి శ్లోకానికి భావం తెలుపుమని కోరడంతో, అరుణగిరినాథులు చెప్పటం ప్రారంభించారు.

వేంకట శైలపతే విజయీభవ! ఆయన విశాలనేత్రుడు, జగన్నాథుడు. శ్రీలక్ష్మి ఉరసిజాంత మందలి కుంకుమ పూవు రంగు, నీలతనువుకు తగులుటచే, ఎల్లప్పుడు ఎర్రగా చేయబడిన శరీరం గల వేంకట పతికి విజయము కలుగుగాక! - అని ప్రతివాది భయంకర స్వామి స్తోత్రం చేసారు. ఓ చమత్కారాన్ని కవి తెలుపుట విశేషం. కుంకుమ రంగు, వేంకట శైలపతికి, లక్ష్మీదేవి సమాశ్లేషం వలన లభిస్తోందని, కవి ఉక్తి వైచిత్రిని కొనియాడారు.

డిండిమభట్టారకా! ఇలాంటి భావాలను తెలియజేయటం, మీ వంటి వారికి తగదు. స్తోత్రాంతర్గత శబ్ద, అలంకార, రసధ్వనుల నర్థం చేసికొని చెప్పాలి - అంటూ శ్రీనాథుడిలా వివరించాడు.

శ్లో॥ కమలాకుచ చూచుక కుంకుమతో
నియతారుణితాతుల నీలతనో,
కమలాయతలోచన లోకపతే ।
విజయీభవ వేంకట శైలపతే ॥

కమల=పద్మము యొక్క, ఆకుచ=బీజకోశముల మీద నున్న, అంటే పద్మమందలి దుద్దుపై ఉన్న, చూచుక=కింజల్కములమీద కల, కుంకుమతః=ఎర్రని పుప్పొడి రజము వలన,

నియత=ఎల్లప్పుడూ, అరుణిత=ఎఱ్ఱగా చేయబడిన, అతుల=సాటిలేని, నీలతనోః=నీలిమ వర్ణంతో ఉన్న శరీరం కలవాడా!... అనే అర్థాన్ని చెపితేనే ఔచిత్యం.

శ్రీదేవి, ఉరోజాంత మందలి కుంకుమ పూవు రంగు ముఖానికి, వక్షస్థలానికి, హస్తతలాదుల మీద అంటుకోవటానికే అవకాశం ఉంటుంది కాని, ఉదరం ఊరువులు పాదాదులపై అంటుకొనే అవకాశం ఎంతమాత్రం ఉండదు. ఇట నీలతనువంతా ఎఱ్రగా కనబడుతోందనటంచే, పద్మమందలి దుద్దుపై గల పుప్పొడి, భక్తులు ఎల్లప్పుడూ పూలతో పూజ చేయుట వలననే అంటుకొంటుంది.

శ్రీ వేంకటేశ్వరుని నీలతనువంతా అరుణ వర్ణంగా మారిందనటంలోనే పూజా పుష్పపరాగ ధూళి ధూసరమైనపుడే సాధ్యం. భక్తులెల్ల వేళలా, సహస్ర కమలాలతోనో, లక్ష కమలాలతోనో, లెక్కలేనన్ని పద్మాలతో పూజ చేస్తూంటే, ఆ పూవులలోని పుప్పొడి శరీరమంతా పడుతుంది. దాంతో నీలమేఘశ్యాముని శరీరం, అరుణితం కావటానికి అవకాశముంటుంది. కనుక, కవి హృదయాన్ని గ్రహించి అనౌచిత్యాన్ని పరిహరించి అర్థ వివరణ చేయాలి. ముఖం ఎంత సుందర తమంగా ఉన్నా సరే, ఒక్క బొల్లి మచ్చ పెదవిపై ఉంటే, ఆ అందమంతా ఏమౌతుంది? ఎన్ని అలంకారాలున్నా ఏం ప్రయోజనం?

"ఔచిత్యం రససిద్ధస్యస్థిరం కావ్యస్య జీవితమ్" - రససిద్ధమగు కావ్యానికి ఔచిత్యమే జీవితము - అని క్షేమేంద్రుడు ఔచిత్య విచార చర్చ చేసాడు. ఔచిత్యం పాటించాలి.

లక్ష్మీదేవి జగజ్జనని, ఆ తల్లి హృదయమందలి కుంకుమపూవు రంగు వేంకటేశ్వరుని హృదయానికి తాకుటచే హృదయం మాత్రమే ఎరుపు రంగుతో ప్రకాశించాలి కాని, ఇటు నీలతనువంతా ఎఱ్రగా చేయబడుట అనేది, పద్మాల పుప్పొడి శరీరం అంతటా తాకే అవకాశం, పుష్పార్చనవలననే సుసాధ్యం. అందుకే, ఆకుచ చూచుక కుంకుమతః - అని కవి చమత్కరించాడు. ఈ యదార్థాన్ని చెప్పటం వలన భక్తులకు దైవం మీద ప్రేమానురాగాలు పెరుగుతాయి. మరింత మంది పుష్పాలతో అర్చిస్తారు.

మనం చెప్పే అర్థాలు, భావాలు భక్తిని పెంచేవిగా ఉండాలి గాని చెడు భావాలు కలిగించేవిగా ఉండరాదని శ్రీనాథుడు, డిండిమభట్టువాదాన్ని ఖండించారు.

అరుణగిరినాథుల కావేశం కట్టలు త్రెంచుకొంది. మీరు నైషధంలోను భీమేశ్వర పురాణంలోను స్త్రీలను వర్ణించిన చోట, స్త్రీల కచకుచాలను వర్ణించలేదా? అని ప్రశ్నించారు! డిండిమభట్టు గారూ! మీ ప్రశ్నలోనే సమాధానం ఉంది కదా! స్త్రీలను వర్ణించేటప్పుడు, కచకుచాలను వర్ణింపక, శ్మశ్రువర్ణన చేస్తారా స్వామీ! మీసాలు గడ్డాలు వర్ణిస్తేనే పురుషుడని

తెలిసేది, కచకుచాలు వర్ణిస్తేనే స్త్రీ అని తెలిసేది. కొన్నిచోట్ల మాతృవాత్సల్యాన్ని తెలియజేయడానికి, రసస్ఫూర్తికి వర్ణించాను. కామిలా వ్యాధి కన్నులకు గ్రంథ స్థములైన భక్తి పూరిత గాథలు కూడ వేరు విధంగా కనబడ్డం విరుద్ధం కాదు గదా – అని చెప్పటంతో సభ్యులు కరతాళధ్వనులు చేసారు. శ్రౌతి, శాంతి మంత్రం పఠించారు.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

23. ముత్యాలశాలలో ఇరవై మూడవ రోజు వాద సదస్సుకు ఘంటారావం పిలుపునిచ్చింది.

సాహిత్యశాస్త్ర ప్రియంభావుకులంతా సదస్సుకు విచ్చేసారు. ప్రభువులాసీనులయ్యారు. ధర్మపీఠాధ్యక్షులు, వాదిప్రతివాదు లిద్దర్నీ ఉద్దేశించి, వాదనలు శాంతియుతంగా కొనసాగాలని, కామక్రోధాలకు చోటివ్వరాదనే విషయం విద్వత్వరేణ్యులకు తెలిసిన విషయమేనంటూనే, ఈ రోజున **మానవావతార** రహస్యాన్ని అంశంగా ప్రతిపాదించారు. ముందుగా శ్రీనాథ సత్కవి మాట్లాడుతూ, దశావతార రహస్యాన్ని వెల్లడించారు. శిష్టరక్షణ, దుష్ట శిక్షణయే పరమార్థంగా దైవం, అవతారాలెత్తుతూ ఉంటారని, ఒక్కొకసారి, మనీషిగా రావచ్చునని, లేదా తన అంశనే నరుని యందు ప్రవేశపెట్టవచ్చునని ఉదాహరణలతో తెలిపారు. డిండిమభట్టారకులు, ధర్మగ్లాని సంభవించినపుడు ధర్మసంస్థాపనార్థం, నారాయణుడే నరుడుగా అవతరిస్తాడని గీతా శ్లోకాలనుదాహరించి పల్కడంతో, శ్రీనాథులు వారి వాదాన్ని పూర్తిగా ఏకీభవింపక, మత్స్యకూర్మవరాహావతారాదులు నరరూపాలు కావని, జంతు రూపాలు కూడ ధరించి, ధర్మాన్ని నిలబెడతారని వాదించారు. పరమాత్మ ఏ రూపాన్నైనా ధరింపవచ్చని, భక్తులు కోరేవరాలను బట్టి వారతరిస్తారని, కొంతమంది వరాలను స్వార్థంకోసం వాడుకొంటే, పరమాత్మ తదనుగుణంగానే వారిని మట్టు పెట్టడానికి అనేక రూపాలు ధరిస్తారని డిండిమభట్టు గట్టిగా వాదించారు. పురాణాలు ప్రమాణంగా చూపారు.

నీటిలో మునిగిపోయే మనిషిని రక్షింపదలచిననాడు, మనిషిగానే నీళ్ళలో దుమికి, వాడిని ఒడ్డుకు జేర్చి రక్షిస్తాడు. అంతేకాని వచ్చి గట్టుపై కూర్చుని ఉపన్యాసం చెప్పడు. జంతువుగా అవతరించి, వానిని రక్షిస్తానని నీటిలో దుమికితే, వాడు జంతు భయంతో ప్రాణాలు వదిలేయవచ్చు. అందుకే దుష్టులకు రాక్షసులకు, జంతు రూపాలు ధరించే సంహరించాడు అని నరసింహావతారం, వరాహావతారాదులుదహరణలుగా చెప్పి నొక్కివక్కాణిస్తుంటే, శ్రీనాథుని మాటకు, అడ్డు వచ్చి, బలి రాక్షసుడే కదా, రావణాసురుడు రాక్షసుడే కదా – మరి వామనునిగా, శ్రీరామునిగా అవతరింపలేదా! అని ప్రశ్నించారు.

బలి రాక్షసుడైనా శ్రీహరి భక్తుడని, వానిననుగ్రహించి చిరంజీవిని చేసాడని, రావణ బ్రహ్మ, తన ద్వారాపాలకుడని, వేదానికి ఘన చెప్పిన ఘనపాఠియని, అందుకే వారలననుగ్రహించడానికే నరునిగా అవతరించి, ధర్మాన్ని ప్రబోధించినట్లు వివరించటంతో చప్పట్లు మ్రోగాయి. శాంతి మంత్రం శ్రవణానందమైంది.

24. ముత్యాలశాలలో ఇరవై నాల్గవరోజు వాద సభకు రమ్మని ఘంటారావం పిలిచింది.

ముత్యాలశాలలో వాద ప్రతివాదాలతో ఖండన మండనములతో మార్మోగుతోంది. సదస్యులంతా చెవులప్పగించారు. గురుబ్రహ్మ - నేటి అంశం - **'కరదర్శన రహస్య'** మన్నారు.

శ్లో॥ కరాగ్రే వసతే లక్ష్మీః, కరమధ్యే సరస్వతీ ।

కరమూలే భవేద్గౌరీ, ప్రభాతే కరదర్శనమ్ ॥

అరచేతియందు చివర లక్ష్మి, మధ్య సరస్వతి, మూలమందు పార్వతి - ఉంటారు కనుక, ఉదయాన్నే లేస్తూ అరచేతులు చూసికొని, కనుల కద్దుకొని దైవాలను స్మరించాలి - అని శ్రుతి స్మృతి పురాణాదుల్లోని విషయాలను వివరించారు డిండిమభట్టారుకులు. నిండు నూరేళ్ళు సుఖంగా జీవించాలంటే, చేతులారా మంచి పనులు చేయాలని చెప్పడమే పరమార్థమన్నారు. శ్రుతి స్మృతులాధారంగా వాదోపవాదాలు రసవత్తరంగా సాగాయి.

చేతలు బాగా ఉంటేనే తలరాతలు బాగుంటాయి. సత్కర్మలు చేయాలని డిండిమభట్టారకులు చెప్పింది వాస్తవమే కాని, నిష్కామ కర్మలు చేయాలి, ఎవరోవచ్చి ఎవరినీ ఉద్ధరించరు. **మనలను మనమే ఉద్ధరించుకోవాలి**. అలా లేకపోతే, మనకు మనమే శత్రువులము. మనలను తీర్చిదిద్దుకొంటే, మనకు మనమే బంధువులము. అందుకు చేతులు సహకరించాలి, నిజానికి అనాసక్తమైన మనస్సే ముక్తికి మూలం - **"మన ఏవమనుష్యాణాం కారణం బంధ మోక్షయోః** - అను శ్రుతి ననుసరించి, మనస్సును మంచి మార్గంలో నడిపించడానికి, మంచిగా ధనం సంపాదించడానికి ఉపయోగించాలనే సదుద్దేశ్యంతోనే, అరచేతులను దర్శించి సత్కర్మాచరణ చేయండి, అని శ్రీనాథులు వివరిస్తూంటే, డిండిమభట్టు - శ్రీనాథా! కరదర్శన రహస్యాన్ని స్పష్టంగా చెప్పలేదు, మంచి బలం సంపాదించాలంటే, చేతులు పుష్టిగా ఉండాలి, బాహుబలం ముఖ్యం. మంచి చదువులు చదవాలన్నా చేతులు కావాలి. అపుడు బుద్ధిబలం వస్తుంది. దాంతో బాగా సంపాదిస్తాం. ఇది ధన బలం. కనుక, లక్ష్మి సరస్వతి పార్వతి - ధనానికి చదువుకి బలానికి ప్రతిరూపాలు. ఈ మూడు శక్తులు మన అరచేతుల్లోనే ఉన్నాయన్నారు డిండిములు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందంటూనే, చరక సుశ్రుతాది రహస్యాలను భిషగ్వరుడై

వివరిస్తూ, చేతులు చూసికొంటూ కూర్చుంటే లాభం లేదు – చేతులారా కష్టపడి పని చేయాలి. వచ్చిన ధనంతో తృప్తిగా తిని, బుద్ధి బలంతో జ్ఞానాన్ని పొంది ముక్తిని వరించాలి. పని చేయాలన్నా, పుస్తకంచదివి వ్రాయాలన్నా, సిరిసంపదలననుభవించాలన్నా, దానం చేయాలన్నా నమస్కరించాలన్నా త్రిశక్తులు నెలకొని ఉన్న చేతుల్లోనే ఉందని శ్రీనాథులన్నారు. శాంతి మంత్రం పఠించారు.

25. ముత్యాలశాలలో ఇరవై ఐదవ రోజు వాద సభకు ఘంటారావం పిలుపు నందించారు.

ముత్యాలశాల, సాహితీ రసజ్ఞుల సల్లాపాలతో కళకళలాడుతోంది. రాయలవారు రత్న సింహాసనాధిష్ఠితులై, కుతూహలంతో కవుల వాదాలు వింటున్నారు. సకల శాస్త్రాలు గురుబ్రహ్మలయానతిపై చర్చిస్తున్నారు. అశ్వశాస్త్రం, గజశాస్త్రం, సాముద్రికా శాస్త్రం, శిల్పశాస్త్రం ఒకటేమిటి సకల శాస్త్రాలు పటుపటాంగంగా వాదోపవాదాలు జరుగుతున్నాయి.

శకునానికి ఉన్న ప్రాధాన్యతపై వాగ్వివాదాలు తారాస్థాయి నందుకొన్నాయి. శకున శాస్త్ర రహస్యాలు వింటూంటే శ్రోతలానందం మిన్నుముట్టింది. శకునం రాబోవు సుఖదుఃఖాలకు సూచనగా భారతీయులు విశ్వసిస్తారని ఉభయులు తేల్చేసారు.

శుభశకునాలకు సుఖం, అశుభశకునాలకు దుఃఖం సంభవిస్తుందన్నారు. ప్రభువులు కూడ శకునాలకెంతో ప్రాధాన్యం ఇస్తున్నారని, ఎవరైనా ఒక పనికై బయలు దేరినప్పుడు, వెనుక నుండి పిలువరాదన్నారు. ఎక్కడకు? ఎపుడు వస్తావు? నేను రానా? అని ఎవరూ అడుగరాదు – అవి అపశకునంగా భావిస్తారు. పరామర్శ అనంతరం వెళ్ళొస్తా, మళ్ళీవస్తానని చెప్పరాదు. వెళుతూంటే ఏడ్పులు, వెళ్ళవద్దని పలకడం, భోజనం చేసి వెళ్ళండి అనటం, కొత్తకుండలు, కట్టెలు, బ్రాహ్మణుడు ఎదురురావటం దుశ్శకునాలని, ముత్తైదువ, కన్య, పెళ్ళి ఊరేగింపు, మంగళవాద్యాలు, పండ్లు, పూలు, పూర్ణకుంభాదులు ఎదురువచ్చుట మంచి శకునాలని – శకున శాస్త్ర రహస్యాలెన్నో డిండిమభట్టారకులు వివరిస్తూంటే, కొన్నింటిని శ్రీనాథ కవి ఖండించారు.

మంచి మనస్సుతో, పని జరుగుతుందనే పరిపూర్ణ విశ్వాసంతో వెడితే విజయం తథ్యమన్నారని – "మనోజయంతు మాండవ్యః" – మాండవ్యుని అభిప్రాయాన్ని తెలియజేసిన శ్రీనాథుడు – ప్రయాణమై వెళ్ళిన వెంటనే, ఇల్లు కడుగుట, ఇల్లాలు తలస్నానం చేయుట దరిద్రహేతువులని, సహేతుకంగా డిండిములతో వాదించారు. ఇంటికి వచ్చేవారిని సంతోషంతో ఆహ్వానించటం శుభశకునమే నన్న డిండిమభట్టారకునితో, వచ్చేవారు చోర జారులైతే ఆహ్వానింపరాదని, వారిని రానీయరాదని, కారణాలు చెప్పి వారి వాదాన్ని

ఖండించారు. మంచి మిత్రులను, మన మంచి కోరే బాంధవాళిని మాత్రమే సగౌరవంగా పిలచి సత్కరించుట మేలన్నారు.

డిండిమభట్టారకా! బ్రాహ్మణుడు, ఎదురురావటం - దుశ్శకునమంటున్నారు. ఇది మీలాంటి దైవజ్ఞులనవలసిన మాట కాదు, అని శ్రీనాథ కవి, వారి వాదాన్ని ఖండించారు. తిథి వార నక్షత్ర యోగ కరణములతో కూడిన పంచాంగ వేత్తలందరూ ఒంటి బ్రాహ్మణుడు ఎదురువస్తే చెడ్డ శకునమనే వ్రాశారు. పైగా ఇద్దరు బ్రాహ్మణులు ఎదురైతే శుభమేనని కూడ వ్రాసిన విషయాలను ప్రస్తావిస్తూ డిండిమభట్టారకులు శకున శాస్త్రజ్ఞుల వాక్యాలను వివరించారు. ఒంటి బ్రాహ్మణుడు ఎదురువస్తే కార్యహాని అని కూడ నొక్కివక్కాణించారు.

డిండిమభట్టు వాదాన్ని ఖండిస్తూ, ఇవి, పూర్తిగా శకున శాస్త్ర పరిజ్ఞానం లేని వారలంటున్న మాటలు. కృపణ బ్రాహ్మణ విషయంలో మీరన్న మాట యధార్థమే! దరిద్ర బ్రాహ్మణుడు, లోభి, కుత్సిత విప్రుడు, వివేకం లేనివాడు, వీరెదురు పడి వస్తే అనర్థాలే! కాని, విశిష్ట బ్రాహ్మణుడు, శిఖా యజ్ఞోపవీతాలు కలిగిన వాడు, సంతుష్టిగా భోజనం చేసిన బ్రాహ్మణుడు ఎదురు వస్తే వెళ్ళినవారికి విజయపరంపరలే వరిస్తాయని వసంత రాజీయంలో ఉన్నదని, గ్రంథస్థసాక్ష్యాధారాలతో స్వపక్షస్థాపన చేసారు శ్రీనాథుడు. చక్కగా గొడుగు వేసికొని వచ్చే విప్రుడు, మంచి తెల్లని నూలు చీరలు ధరించినవారు ఎదురువస్తే సర్వసిద్ధియన్నారు - శ్రీనాథ కవి. అంతేకాదు, ఇలా వివరించారు.

"నను యాత్రాయాం కనక పాత్రాది మంగళ ద్రవ్య దర్శనం కార్య సిద్ధికరమస్తు, కింతు, ఏకస్మిన్ బ్రాహ్మణే దృష్టే కార్యహానిరితి కిం వదంత్యాః కాగతిరితి చేత్, నైవ దోషః । తస్యాః కృపణ బ్రాహ్మణ విషయత్వాత్ । విశిష్ట బ్రాహ్మణ దర్శనే మహాఫలస్మరణాత్ - వసంత రాజీయేప్యుక్తమ్ - ధృతాత పత్రః శుభ శుక్ల వాసాః పుష్పార్చితశ్చందన చర్చితాంగః, విప్రశ్శిఖావాన్ కృత భోజనశ్చదదాతి దృష్టః పథి సర్వసిద్ధి మితి" ॥ అని వివరించి - డిండిమభట్టు వాదాన్ని ఖండించారు. దైవజ్ఞులీ రహస్యాన్ని తెలిసికొని, పఞ్చాఙ్గములందీ విషయాన్ని సరిచేసి కొనాలని సూచిస్తూ, అరుణగిరినాథులికపైన ఈ విషయాన్ని బోధించాలన్నారు. సహృదయులైన డిండిమభట్టారకు లంగీకరించటంతో, శ్రౌతి-శాంతి మంత్రం పఠించారు.

26. ముత్యాలశాలలో ఇరవై ఆరవరోజు వాదసభకు పిలుపుగా గంట గణగణ మ్రోగింది.

ముత్యాలశాల నిండ, పండిత మండలి పరమానంద భరితాంతర రంగులై, రోజూ జరిగే వాద ప్రతివాదాంశాలను తర్కించుకొంటూ, ఔత్సాహికులై, వారిని ప్రోత్సహిస్తున్నారు.

రాయలవారితో సహా అందరూ తమతమ స్థానాల్లో శ్రద్ధగా కూర్చున్నారు. ధర్మపీఠాధ్యక్షులైన రాజకులగురు బ్రహ్మల హస్తసంజ్ఞాదర లీలా విలాసలాస్యంతో, శాస్త్ర వాదాన్ని ప్రారంభించి, **మహిళాభ్యున్నతి** మరింతగా అభివృద్ధి చెందాలంటే శ్రుతి రహస్యాలను స్త్రీలు తెలిసికోవాలని, శాలి శకమారంభమై పదమూడొందల ఏభై మూడు సంవత్సరాలైనా స్త్రీలు మరింతగా ఆగమ రహస్యాల నర్థం చేసికోలేకపోతున్నారని, వారిలో కొందరైనా వేదాల్లోని విజ్ఞానాన్ని తెలిసికొని మరింతగా ఉత్తమోత్తమమైన సచ్ఛీలసంపత్తితో వాటి నాచరింపగలిగితే మరింతగా సమాజం వికసిస్తుందని, శ్రుతి స్మృతి పురాణేతిహాసాల వివరణలిచ్చారు. నేటికీ సమాజం ఇంత చక్కగా ఉందంటే, ఆ తల్లుల మంచినడవడియేనన్నారు శ్రీనాథ కవి. నేటి స్త్రీల గొప్పతనాన్ని చెపుతూ వారూ బ్రహ్మవాదినులు కావాలన్నారు. శ్రీనాథ కవీ! స్త్రీలు వేదాలు చదువరాదని ఆ స్మృతి పురాణాలే హెచ్చరించాయి కదా! – అంటూనే, డిండిమభట్టారకులు భారతాది గ్రంథాల్లోని వివిధ సంధర్భాలను సాక్ష్యాలుగా నుదహరించారు.

శ్వాసను బిగపట్టి చదువు మంత్రాల జోలికి పోకుండా, తగు శ్రద్ధ తీసికొని సద్గురువుల యాదేశుసారం తగిన సమయాలలో గ్రహించటం మంచిది కనుకనే, ఉభయభారతి సమస్త విద్యల్ని ఆపోశన పట్టిన బ్రహ్మవాదినిగా ఆదిశంకరాచార్యులవారే అంగీకరించారు. మండన మిశ్రులతో వారికి జరిగిన వాదసభకు, ఆమెయే న్యాయనిర్ణయాధికారిణి, ఆమెకు రాని శాస్త్రం లేదు. స్త్రీల శారీరక తత్వాన్ని బట్టి, నాటి కాలాన్ని బట్టి వారి పరిస్థితులను బట్టి, వారు చెప్పి ఉండవచ్చును. ఋగ్వేద సూక్త దర్శినులైన బ్రహ్మవాదినులు, ఇరవై నాలుగు మంది ఉన్నారంటే, నాడు మన నాగరికత ఎంత గొప్పగా ఉండేదో ఊహించండి. స్త్రీల విద్యాభివృద్ధికి ఇంతకంటే సాక్ష్యం ఏం కావాలి? "గోధా, ఘోషా, విశ్వవా, రాపా... శ్రద్ధా, మేధాచ దక్షిణా, రాత్రీ సూర్యాచ సావిత్రీ బ్రహ్మవాదిన్య ఈరితాః । అని అపాలోపనిషత్తులో గోధ, ఘోష, విశ్వవా, రాప, శ్రద్ధ, సూర్య, లోపాముద్ర, అదితి, వాగ్దేవి, యమి, శచి, ఇంద్రాణి, ఊర్వశి, దక్షిణాది స్త్రీలలామలెందరో సూక్తములను దర్శించి, ఆర్ష సంస్కృతిని అభివృద్ధి చేసినారని, సాధ్వీమ తల్లుల దీవెనలే మనకు కొండంత అండయని శ్రీనాథుడు వాదించినంత, శ్రౌతి శాంతి మంత్రం పఠించారు.

27. ముత్యాలశాలలో ఇరవై ఏడవరోజు వాదసభకు ఘంటారావం పిలుపునిచ్చింది.

ముత్యాలశాల కవిపండిత ప్రకాండులతో కళకళలాడుతోంది. గురుబ్రహ్మల వచనానుసారం, వాదనలు తీవ్రస్థాయిలో జరుగుతున్నాయి. **స్త్రీలకు శాస్త్ర పరిజ్ఞానము** అత్యంతావశ్యకమని, అయితే స్త్రీ, పురుషులలో సచ్ఛీలత ఉన్నప్పుడే సద్విద్యరాణిస్తుందని,

నేడు మంచి తలకెక్కుట తగ్గుముఖం పట్టిందని డిండిమభట్టు వాదిస్తూ, కావ్య శాస్త్రాద్యలంకార గ్రంధాలనెన్నింటినో పురుషపుంగవులే రచించిన విషయాలను వివరించారు.

నోటిలో గల దంతాల మధ్య పడిపోకుండా, నాలుక శ్రద్ధ వహించినట్లుగా స్త్రీలు, సమాజం అనే నోటిలోని దుష్ట సమజం వంటి దంతాల మధ్య పడి నలిగి పోకుండా, నాలుకవలె శ్రద్ధ వహిస్తే, మహిళామతల్లులు విద్యను జీర్ణిం చేసికొని విద్యావంతులై, కుటుంబాన్ని, సమాజాన్ని తీర్చిదిద్దగలరని శ్రీనాథ కవి వాదిస్తూనే - యజుర్వేదాంతర్గత రహస్యాలను వెల్లడించారు.

మంత్రం : "ఇడేరన్తే హవ్యే కామ్యేచన్ద్రే, జ్యోతే అదితే సరస్వతి మహి ।
విశ్రుతి ఏతాతే అఘ్నేనామాని దేవేభ్యో మా సుకృతం బ్రూతాత్" ॥

ఈ మంత్రం, స్త్రీల ఉజ్జ్వల భవిష్యత్తును తెలియజేస్తుంది. నిఃశ్వసిత శ్రుతిమూర్తి స్త్రీ మూర్తులను రామణీయకంగా చిత్రించాడు, కీర్తించాడు. స్వధర్మాలను శాస్త్ర బద్ధంగా ఆచరించే మహోన్నతమైన స్త్రీలను గౌరవించే సమాజం, సమున్నత మార్గంలో పయనిస్తుందని శ్రీనాథుడు నొక్కి వక్కాణిస్తూ, ఇడా-ఉత్తమమైన వాణిని కల్గిన స్త్రీ. రన్తా - కుటుంబానికి, సమాజానికి సుఖశాంతుల్ని చేకూర్చే స్త్రీ, హవ్యే, కామ్యే - వంశసంరక్షకులు, గృహలక్ష్ములు. గృహంలోని వారికి సామరస్యాలను ప్రసాదించే స్త్రీ చన్ద్రి జ్యోతి - ఇంటికి దీపం ఇల్లాలే - అని నిరూపించే స్త్రీ రత్నం. అదితిః - ధైర్యంగా, ఆత్మగౌరవంతో వ్యక్తిత్వ వికాసం గల స్త్రీ. సరస్వతి - ఆత్మ - పరమాత్మల జ్ఞానం పొంది, ముక్తి కోరి తపస్సు చేసే స్త్రీ, మహి-ఓర్పుగల స్త్రీ, విశ్రుతి-శ్రుతి ధర్మాలను, సంప్రదాయాలను, శీల సంపదను కాపాడే స్త్రీ. ఈ లక్షణాలనన్నింటినీ కల్గిన స్త్రీలను నిందించకుండా, అఘ్నా-కొట్టక తిట్టక, అవమానింపక గౌరవించే పురుషునికి శాంతి సౌఖ్యాలు కరతలామలకాలు. అలాంటి స్త్రీలవల్లనే, సంతానానికి సంస్కారం, సద్గుణాలు సుఖశాంతులు లభిస్తాయి - అని, వేదమంత్రాలు వినవస్తునట్లు శ్రీనాథ కవి వాదించారు. స్త్రీ పురుషుల మంచి నడవడికలే, సమాజాభ్యున్నతికి విజయపతాకలన్నారు. శాంతిమంత్రం పఠించారు.

28. **ముత్యాలశాలలో ఇరవై ఎనిమిదవరోజు** వాద సభకు రమ్మని ఘంటారావం ఆహ్వానించింది.

ముత్యాలశాల, మంచి ముత్యాల మాటల మూట లూటరూరుతోంటే దప్పిక తీర్చుకొంది. సంహితాతాత్పర్య పర్యాలోచనా దురంధరుల ధిషణా సముత్సాహంతో,

పంచలక్షణ సమన్వితమైన **అష్టాదశ పురాణాంతర్గత రహస్యాలను,** గురుబ్రహ్మల దివ్యాశీస్సులతో ప్రారంభించినంత – ఆ బ్రహ్మానంద హృదయాన్ని సదస్యులు ఆలకిస్తున్నారు. "ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్,... తద్విజిజ్ఞాస స్వ, తత్ బ్రహ్మేతి" అను శ్రుత్యర్థాన్ని పూర్వజన్మ సుకృతం వల్ల గ్రహించిన మకరి – శ్రీహరి సుదర్శన స్పర్శచే ముక్తి పొందినది – అని శ్రీనాథుడు, వ్యాసమహర్షి విరచిత భాగవతాంతర్గత రహస్యాన్ని వెల్లడించాడు. అది **గజేంద్ర మోక్షం** కాని, **మకరీంద్ర మోక్షణం** కాదని, గజేంద్రుడికి దిక్కులేక, శ్రీహరిని ప్రార్థించాడని, శ్రీహరి–గజేంద్రుని మొరనాలకించి, వచ్చి తన సుదర్శన చక్రంచే మొసలిని చంపి, గజేంద్రునికి మోక్షాన్ని ప్రాప్తింప జేసాడని డిండిములు వాదించారు.

డిండిమభట్టారకుల వాదన్ని ఖండిస్తూ, మోక్ష ప్రాప్తి మకరికేనని, గజేంద్రునికి రక్షణ కల్పించాడని, చెప్తూ – మకరి పూర్వజన్మలో హూహూ అనే గంధర్వరాజు – అని, ఆతడు తన భార్యతో కలసి త్రికూట పర్వత ప్రాంతంలో తిరుగుతూ, దేవల మహర్షికి తపోభంగం కలిగిస్తే – ఆయన శాపానికి గురై – మకరిగా మారి, అంతర్యామిని ధ్యానించి – దప్పిక తీర్చుకోవటానికి వచ్చిన, గజమును దైవంలా భావించి ఆ గజరాజు, పదాన్ని బట్టి, శ్రీహరి సు"దర్శనం"చే ముక్తి పొందాడని – శ్రీనాథ కవి, బ్రహ్మానంద ముక్తిని వివరించాడు.

శ్రీహరి, మకరి బారి నుండి రక్షించి, గజేంద్రునికే ముక్తిని ప్రసాదించినారని వాదించే డిండిమవాదాన్ని పునః ఖండిస్తూ – "అంతర్యామ్యమృతః" – అనే శ్రుత్యార్థాన్ని గ్రహించిన ద్రవిడదేశాధిపతి 'ఇంద్రద్యుమ్నుడు' – శ్రీహరినే ధ్యానిస్తూ యాగం చేయు సమయాన, అతిధిగా వచ్చిన అగస్త్యుని చూడక గౌరవించకపోవటంతో, వారి శాపానికి గురియై గజేంద్రుడుగా పుట్టి – ఏషసర్వేశ్వరః ఏషసర్వజ్ఞః, ఏషఅంతర్యామిః ... " అని తలచి, శ్రీహరినే వలచి పిలచి కొలిచి నంతనే శ్రీహరి వచ్చి, గజరాజును రక్షించాడు. గజరాజు సంసార జలధి లహరి లాహిరిలో ఓలలాడి, చిరకాలం జీవించి, తర్వాత ఎప్పటికో శ్రీహరిని ప్రార్థించి కైవల్యం పొందాడు. మకరికే, శ్రీహరి ముక్తి నిచ్చాడు. చిత్త వృత్తి నిరోధాన్ని చేసిన మకరివలె యోగీంద్రులైనపుడే ముక్తికి అర్హులౌతారనే సత్యాన్ని మకరీంద్రమోక్షణమే నిర్ధారించిందని శ్రీనాథుడు నొక్కివక్కాణించాడు. సత్యాన్ని గ్రహించిన సదస్యుల చప్పట్లు మార్మోగ్రాయి. శ్రౌతి, శాంతి మంత్రం పఠించాడు.

29. ముత్యాలశాలలో ఇరవై తొమ్మిదవరోజు వాద సభకు పిలుపుగా గంట మ్రోగింది.

ముత్యాలశాల సందడే సందడి. సమస్త కవితావిలాస వాగీశ్వరులగు కవీశ్వరులును,

సర్వశాస్త్ర సిద్ధాంత కమల హంసలగు విద్వద్దేశీయులును, సంస్కృతాంధ్ర తమిళ కన్నడాద్యనేక భాషా సంపన్నులును గల సదస్సులో వాక్పతి గీర్పతుల్లా గురుబ్రహ్మల యాజ్ఞతో శాస్త్రవాదాలు చేస్తున్నారు. శాస్త్రార్థాలు తర్కిస్తున్నారు. **శుక్లాంబర** శ్లోకార్థాన్ని వివరిస్తూ ఆ సేతు హిమాచల పర్యంతం జాతీయ సమైక్యతను చాటు, శ్లోకం విఘ్నేశ్వరుని ప్రార్థనయని డిండిమ భట్టారకులు, శబ్దార్థాలతో సహా వ్యాఖ్యానించారు.

స్వచ్ఛమైన చంద్రకాంతి వంటి కాంతి కల తెల్లని వస్త్రాన్ని ధరించి, నాల్గు భుజాలతో ప్రసన్నవదనం కల్గి సర్వవ్యాపియైన విఘ్నేశ్వరుని, అడ్డంకులు తొలగించుటకై ధానిస్తున్నానని చెప్పటంతో, డిండిమభట్టారకుల యభిప్రాయాన్ని ఏకముఖమన్నాడు శ్రీనాథుడు.

శ్లో॥ శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం ।
ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోపశాంతయే ॥

ఆకాశమే వస్త్రంగా కలవాడనుట చేత, అంబరం - శబ్దగుణము కలది. శబ్ద బ్రహ్మ కనుక అంతట వ్యాపించిన పరమాత్మయని భావం. ఆత్మనుండే ఆకాశముత్పన్న మైనదని - "ఆత్మన ఆకాశః సంభూతః! - అని కృష్ణ యజుర్వేదం స్పష్టం చేసింది - "శబ్దగుణకమాకాశమ్" - అని, తర్కశాస్త్రం, ఆ శాస్త్రమే "తచ్చైకం, విభుః నిత్యంచ" అని, అంతట వ్యాపించిన విభువు నిత్యమని, విష్ణుం = సర్వవ్యాపి అని తెలుస్తోంది. నాలుగు వేదాలే భుజములుగా గలవాడు. ప్రసన్నమైన ముఖముతో చిరునవ్వు లొలికించువాడు, సిరివెన్నెలలు చిందించు పరమాత్మను సమస్త అడ్డంకులను శాంతింపజేయుటకై ధ్యానం చేస్తున్నానని చేసే ప్రార్థన అయినా, పలువురాడు మాట పాడియై ధరజెల్లును కదా! ఈ భావంతో డిండిమభట్టు గారు గణపతి ప్రార్థనగా వాదిస్తున్నారు. విఘ్నోపశాంతయే - అనుటచేత, విఘ్నములను తొలగించేవాడు విఘ్నేశ్వరుడు. లోకం, బొజ్జ గణపయ్య ప్రార్థనగా స్వీకరించటం కూడ మాకూ శిరోధార్యమే. శుక్లాంబరిగ సరస్వతిని కూడ చెప్పవచ్చు. "సర్వశుక్లా సరస్వతీ" - అని సరసవతి యౌ శుక్లయే పరమాత్మ స్వరూపిణిగా కీర్తింపబడుతోంది. ఈ శ్లోకాన్నే స్త్రీ మూర్తిగా భావించి సరస్వతిని ఆరాధించారు. ఆమెయే విఘ్నములను రాకుండా తొలగించే శారదాగణేశి!

శ్లో॥ చతుర్ముఖ ముఖాంభోజ వనహంసవధూర్మమ ।
మానసే రమతాం నిత్యం, సర్వ "శుక్లా" సరస్వతీ ॥

సోऽహం స్వరూపిణియైన హంస వాహినియే శుక్లాంబరిగా పూజలందుకొంటోంది. ఆమె వైష్ణవి, ఆమెయే పార్వతి. త్రిశక్తి రూపిణి. సర్వవిఘ్నాలను తొలగించే ఆది

పరాశక్తియని, హంసమంత్రార్థమే శుక్లాంబరశ్లోక రహస్యమని శ్రీనాథుడు వాదిస్తూంటే, అది మంత్రశాస్త్ర రహస్యమని హకారః పురుషః ప్రోక్తః 'స' - ఇతి ప్రకృతిర్మతిః పుం ప్రకృత్యాత్మకోహంసస్త దాత్మక మిదం జగదితి - అని ఈ పురుష ప్రకృత్యాత్మకమైనదే 'హంస'మంత్రమని, ప్రకృతి-పురుషుల విషయాన్ని, ఇట చెప్పుట చెల్లదని డిండిమభట్టులు వాదించారు. మంత్రశాస్త్ర రహస్యాలెన్నో చూపి, తమ వాదాన్ని బలపరచారు.

"హంసహంసేత్యముం మంత్రం జీవో జపతి సర్వదా"... అంటూనే, "ఏషచింతామణి ర్నామ మంత్రః సర్వార్థ సాధకః జగన్మాతుః సరస్వత్యాః రహస్యం పరమంమతం" అను పారమేశ్వరాన్ననుసరించి, "ప్రణోదేవీ సరస్వతీ వాజేభిః వాజినీవతీ..." అనుశ్రుత్యనుసారం, "వాగ్వైగాయత్రీ" - అను శ్రుతి ననుసరించి, వాగధిష్ఠాత్రియౌ సరస్వతీ శక్తియే ఈ శ్లోకమందు దర్శనమిస్తోంది. నిజానికి వాణియే పురుష రూపంలో విశిష్టనాయకునిగ దర్శనమిచ్చి విఘ్ననాయకునిగ ప్రసిద్ధి చెందినది.

శ్లో॥ వర్ణానాం అర్థ సంఘానాం రసానాంఛందసా మపి,
మంగళానాంచ కర్తారౌ వందే వాణీ వినాయకౌ ॥

అక్షర గణపతి, రసగణపతి, లక్ష్మీగణపతి, శ్రుతి గణపతి, మంగళ గణపతి - శుక్లాంబరధారియే కదా! శబ్దగణాలన్నింటికీ అధికారిణి యౌగణేశియే శుక్లాంబరధారిణియని -

అకారాది షోడ శాక్షరాత్మక తార్తీయాక కామనువాగ్భవైః
ఘటితాచ పరాది వాగ్గణైరితి విద్యాపి గణేశ రూపిణీ ॥ - వరివస్యా రహస్యం.

"సర్వం విష్ణుమయం జగత్" సమస్త గణాలకు, సర్వవ్యాపియైన అమృత స్వరూపిణియౌ సరస్వతిని ఆరాధిస్తే ఏ అడ్డంకులు కలుగవు. అన్నీ విజయపరంపరలే "ఏకమేవాద్వితీయం" అను శ్రుతిని పరిశీలించి, ఆ బ్రహ్మనే నిరామయునిగా దలచి నామరూప లింగరహితమౌ", "నచస్త్రీ నచపుమాన్" - అను శ్రుత్యనుసారం పరమాత్మగా ఆరాధించాలని శ్రీనాథుని చిక్కని వక్కణ ! ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

30. ముత్యాలశాలలో ముప్పదియవ రోజు వాద సభకు రమ్మని ఘంటారావం పిలిచింది.

ముత్యాలశాల, బహుశ్రుత్య సంపన్నులతో, సర్వోపనిషత్తత్త్వజ్ఞులతో, సుకవులతో విరాజిల్లుతోంది. సదస్యులు, వాద తీర్థార్థులై యుండగా, రాజకులగురు బ్రహ్మలు, పల్కు "శుక్లాంబర" శ్లోకాంబుధి మధనం చేయు మీరుభయులు సమర్థులే ! మాకు జ్ఞానామృత కలశాన్నందజేయనున్నారు. సంతోషం. ప్రస్తుతం - **ఏకదంతుని** రహస్యాన్ని ప్రబోధించండన్నారు.

శ్లో॥ అగజానన పద్మార్కం గజానన మహర్నిశం

అనేక దంతం భక్తానాం, ఏకదంతముపాస్మహే ॥ అని పఠించిన డిండిమ భట్టారకులు, పార్వతీదేవి ముఖపద్మాన్ని వికసింపజేసే బాలసూర్యుని వంటి గజముఖుని, ఏకదంతుడిని, భక్తులమగు మాకు అనేక వరాలను ప్రసాదించుట కోసం, ఉపాసిస్తున్నాను... అని తెలిపి గణపతి ఏకదంతుడని, ఒక దంతాన్ని విరగకొట్టి, మహాభారతాన్ని వ్యాసభగవానులు చెప్తూంటే వ్రాసినాడను కథను వివరించారు. అనేక విశేషార్థాలు చెపుతూ, గజాననుడు, ఏకదంతుడైనను అనేక వరాలను ప్రసాదిస్తాడని, బుద్ధి ప్రచోదకునిగా వర్ణించారు. శ్రీనాథుడు - ఏకదంతుడంటే, ఒకే దంతం కలవాడయినప్పుడు, అనేక దంతములు కలవాడెట్లా? అనేక దంతుడైతే ఏకదంతుడెట్లా? - ఇది దోషం కాదా? .... అని ప్రశ్నించాడు.

అనేక వరాలను ప్రసాదించే వాడనే చెపుతున్నాం కాని, అనేక దంతాలు కలవాడు కాడని డిండిములు, తమ వాదాన్ని బలపరచారు. మరి దానికలా అర్థం చెప్పినపుడు ఏకదంతం - అను దానికి కూడ, ఒకే వరాన్ని ఇచ్చేవాడని చెప్పక, ఒక దంతాన్ని విరగగొట్టి భారతలేఖకుడైనట్లు కథ చెప్పారెందుకు? అని మరలా శ్రీనాథుడు, వాదించటంతో, ఈ కథ లోకప్రసిద్ధిమైనదని, సోదాహరణంగా వాదించారు. కాని, శ్రీనాథుని ప్రశ్నకు సమాధానం సరిగ్గా చెప్పకపోవటంతో, "జ్ఞానార్థవాచకోగశ్చ, "ణ" శ్చ నిర్వాణవాచకః, తయోరీశం పరబ్రహ్మ గణేశం ప్రణమామ్యహమ్" ॥ అను శ్లోకాన్ని చెప్పి, అష్టసిద్ధుల్ని సద్బుద్ధిని ప్రసాదించటంతోబాటు, ముక్తిని ప్రసాదించే దైవం గజాననుడొక్కడే! పరమ పురుషార్థం మోక్ష మొక్కటే "గ జ ం" అంటే గమనం వలన పుట్టే ద్రవ్యవేగం. నడచే ప్రపంచాన్ని నడిపించే వాడే గజముఖుడు. ఆయన్ని మనం కోరవలసింది ఒకే ఒక్కటి - అదే ముక్తి. ఆ ఒక్కటే **ఏకం** - సత్, కనుక, ఆ ఏకత్వ మోక్షాన్ని, దం - ఇచ్చేవానినే ఏక, దం-తం = పరబ్రహ్మయౌ గణేశుని, భక్తులకనేక వరాలను ప్రసాదించే పరమాత్మనే ఉపాసించాలనే తత్త్వ రహస్యాన్ని తమ వాదంతో స్థాపించాడు శ్రీనాథుడు. ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

31. ముత్యాలశాలలో ముప్పై ఒకటవ రోజు వాద సభ ప్రారంభానికి శ్రీకారం ఘంటారావం.

ముత్యాలశాలలో వాద సంబరాలు, అంబరాన్ని చుంబిస్తున్నాయి. సదస్యులంతా రసజ్ఞులే! బహు శ్రుత్యసంపన్నులు, విద్వత్కవీశ్వరులు, విదుషీమణులు, ఉత్కంఠతో పూర్వపక్ష పరపక్ష సిద్ధాంతాలు వింటున్నారు. రాయలవారి కెన్ని పనులున్నా, సమయానికి వాద సదస్సుకు వచ్చి, వేడ్కతో వింటున్నారు. గురుబ్రహ్మ మాట్లాడుతూ కృష్ణయజుర్వేదాంతర్గత

రుద్రాధ్యాయమే నేటి వాదాంశమన్నారు.

పరబ్రహ్మ ఫాలభాగంలోంచి పుట్టినవాడే రుద్రుడు. ఈ ఉద్భవం స్వయం భువత్వానికి నాంది. ఆయన పుట్టటమేమిటి? ఆయనే రుద్రుడుగా దర్శనమిచ్చాడు. "ఆత్మాస్వయంభూః" – శ్రుతి – ఆయన మాయా సమేతుడు, సర్వజ్ఞుడు. పృధ్విపై నిలబడి ఏ ప్రక్క నుండి ఆకాశం వైపు ఏ ప్రక్కకు చూచినా, శివలింగాకారంలోనే కనబడుతుంది. ఈ సృష్టిలోని సమస్త జీవరాశిని, తనలో లీనం చేసికొనే వాడు కనుకనే లింగ స్వరూపునిగా తలచి అభిషేకిస్తాం. "లింగ్యతే అనే నేతి లింగమ్" – అన్ని జీవారాశుల్ని తనలో యిముద్చుకొనేది, అంతేకాని రుద్రుడు సంహారకారకుడన కూడదు. ఆయన లయ కారకుడు" లీయతే అనేన ఇతిలయమ్" – కనుక రుద్రుడు, జీవాత్మ పరమాత్మలనైక్యం చేయువాడని, ఆయన, అభిషేక ప్రియుడు కనుక మనం పంచామృతాలతోను, పవిత్రజలంతోను నమక చమకాలు చెప్తూ అభిషేకించి పూజలు చేస్తాం – అంటూనే – నమకం చమకం చైవ పౌరుషం సూక్త మేవచ, నిత్యంత్రయం ప్రయుంజానాం, బ్రహ్మలోకే మహీయతే" నమక చమక పురుష సూక్తాలను నిత్యం పారాయణ చేసేవాడు బ్రహ్మలోకాన్ని పొందుతాడని శ్రీనాథుడు, శ్రుత్యుక్తులతో వివరించాడు.

శ్రీనాథ కవి, నమక చమకాల రహస్యాలను పూర్తిగా వివరింపలేదని, నమస్కారం చేస్తూ, పరమేశ్వరుని నామాలను స్మరిస్తూ, నీళ్ళతో కాని పంచామృతాలతో కాని శివుని అభిషేకించాలి. నమః – అంటే నమస్కారం. దానితో కూడినది చమకం... అయితే వీటికి చాలా అర్థాలున్నాయి... అంటూ అరుణగిరినాథులు శాస్త్రవివరణలనిస్తూ, రుద్రం చేస్తే భద్రం అన్నారు. "సతతం రుద్ర జాప్యోసౌ పరాంముక్తిమవాప్స్యతి" – నిరంతరం రుద్రాధ్యాయం జపించే నరుడు ముక్తి పొందుతాడనే స్మృతి రహస్యాన్ని బోధించారు. పంచాంగ న్యాసాలను వివరిస్తూ, భగవాన్ బోధాయనోక్త సంప్రదాయ రహస్యాలు వెల్లడించారు.

ఓం నమస్తే రుద్రమన్యవ ఉతోత ఇషవే నమః నమస్తే అస్తు ధన్వనే బాహుభ్యాముతతే నమః... అంటూ రుద్రాభిషేకం చేస్తుంటాం. డిండిమభట్టు గారూ! నమస్కారం, మన సంస్కారానికి, ఓ చక్కని పురస్కారం! నమస్తే – అనటమే మన సంప్రదాయం! తే=నీకు, నమః అని శ్రీనాథులవారు చెప్తూంటే, యోగాభ్యాసంలో మొదటి భంగిమ 'నమస్తే' – అని యోగ రహస్యాన్ని డిండిమభట్టారకులు వివరించి, నమస్కారం చేస్తున్నాం – అంటే ఈ చేతులతోనే సత్కర్మలు చేయాలని, కర్మ ప్రాధాన్యాన్ని చెప్పటానికే నమక చమకాలని

డిండిమలు వివరిస్తూంటే వారి వాదనలకు, ఏకపక్షమేనని వాదించి – జీవాత్మ – పరమాత్మ ఒకటే నన్న సత్యానికి ప్రతీకయే నమస్తే! – తత్ – త్వం – అసి.... ఆ చేయి ఈ చేయి కలిపితే నువ్వే రెండూ నీవే, నీవే పరమాత్మ... రెండు విడిగా కనబడుతున్నా, రెండు ఒకటేనన్న భావనకు, చంద్రచంద్రికల్లా భార్యాభర్తలున్నా – ఒకటేనని, "తత్త్వమసి" మహావాక్యానికి పతాక, ఈ "నమస్తే" – అన్నారు.

'నమస్తే' – అని రెండు చేతులు కలిపే ముందు, రెండూ వేరుగానే ఉన్నాయి. వేరుగా ఉన్నాయి కాబట్టే కలిపాము. రెండు చేతులు వాస్తవానికి సత్యాలేనని శ్రీనాథుని అద్వైతాన్ని ఖండించి, అధికులైన వారికి ఎదురుగావెళ్ళి నమస్కరిస్తే, ఆయుర్విద్యాయశో బలాలు వృద్ధిపొందునన్న సత్యాన్ని, స్మృత్యనుసారం వాదించారు – డిండిమభట్టారకులు.

కుడిచేయి, ఎడం చేయి – అని చంద్రచంద్రికల్లా నామభేదమే కాని, వాస్తవ భేదం లేదు. సత్యానికీ రూపం కల్పితం. నిర్గుణమందు నామరూపాలే లేవు. అయితే సగుణ మూర్త్యుపాసన వలన సగుణలోక ఫలప్రాప్తి, తద్వారా జ్ఞాన సిద్ధి. జ్ఞానం పొందిన తర్వాత ముక్తి లభిస్తాయి. జ్ఞానప్రాప్తి కొఱకే ఈ ప్రయత్నాలని తెలిపిన శ్రీనాథులు – పాదనమస్కారం చేసే సమయంలో పెద్దవారి కుడిపాదాన్ని చేసేవాడి కుడి చేత్తోను, వారి ఎడమ పాదాన్ని, వాడి ఎడమ చేతితోను తాకుతూ నమస్కరించాలని స్మృతిచెప్తోంది. కుడి చేయి ఎడమ చేయిపైగాను, ఎడమచేయి కుడిచేయి క్రిందుగాను ఉంచి వారి కుడి ఎడమ పాదాలమీద స్పృశించి నమస్కరించాలి. దేవుని విగ్రహాలకు కూడ ఇలాగే చేయాలి. "వ్యస్తస్త పాణినాకార్యం, ఉప సంగ్రహణం గురోః, సవ్యేన సవ్యః స్పృష్టవ్యో దక్షిణేనచ దక్షిణః" – అనే స్మృతి రహస్యాలతో రుద్రాధ్యాయ వాదనలకు స్వస్తి పలికారు. శాంతి మంత్రం జపించారు.

32. ముత్యాలశాలలో ముప్పై రెండవ రోజు వాద సభకు ఘంటారావం మ్రోగింది.

శ్రీనాథ భట్టు, గౌడ డిండిమభట్టుల వాదోపవాదాలు చదువరులకు సంతోషాన్ని కల్గిస్తున్నాయి. వాదసుమ సౌరభాలు నాల్గుదిక్కులు వ్యాపించటంతో పండిత ప్రియంభావుకులు ముత్యాలశాలకు చేరుకొన్నారు. దాంతో ఇసుకేస్తే రాలనంతమంది జనంతో నేత్రోత్సవంగా ఉంది. మంత్రులు, సామంతులు, సీమంతినులు, విద్వద్వేశ్యులు దంత వస్త్రపుమాట నేర్పరులు, సభోచితులు, వీనులవిందుకై ఎదురుచూస్తున్నారు.

వంది మాగధులు జయజయధ్వానాలు చేస్తుంటే, మంగళ వాయిద్యాలు మ్రోగుతూంటే, రాయలవారు ముత్యాలశాల వేదికపైకి వచ్చి, స్వర్ణసింహాసనాధిష్ఠితులయ్యారు.

ధర్మపీఠాధ్యక్షుల యానతిపై, "దేహత్రయాతి రిక్తోహం శుద్ధ చైతన్యమస్మ్యహమ్. బ్రహ్మాహమితి యస్యాంత స్సజీవన్ముక్త ఉచ్యతే" ॥ అను శ్రుతిననుసరించి, సమ్యక్‌దర్శన క్షణప్రభృతి వర్తమానారబ్ధ దేహ నాశపర్యంతం - **జీవముక్తి**యని, తర్వాత నిరవధికంగా విదేహముక్తి యని శ్రీనాథ కవి, జీవన్ముక్తిని వివరించాడు. అహంకార మమకారాలు లేని నిర్వికారస్థితియే జీవన్ముక్తి అని శ్రుత్యుదాహరణలెన్నో వివరించి - సామాన్యులకు కూడ అర్థమవటం కోసం జనక, శుకాదులెందరో జీవన్ముక్తులని చిక్కని చక్కని ఉదాహరణలతో చెప్పారు డిండిములు. ఏకపక్షంగానున్న కొన్ని డిండిమవాదాల్ని ఖండించారు, శ్రీనాథభట్టు.

కొరిడి కొబ్బరి కాయలోని కొబ్బరి, వెనుకటి మాదిరిగా ఆ కొబ్బరి, టెంకాయచిప్పతో సంలగ్నం కాదు కదా! సంసారజలం ఇగిరిపోతే, వాడు కొరిడి కొబ్బరిలా సంసారంతో సంలగ్నం కాడు. తామరాకుపై నీటిబొట్టులా ఉండే స్థితి జీవన్ముక్తి. పాలను మథించగా వేరైన వెన్న, ఆ పాలలో వేసినా, వెనుకటి మాదిరిగా ఆ పాలలో కలిసిపోదు. కాబట్టి ఇట్టి దృక్ దృశ్య వివేకపూర్వక దృగాత్మానుభూతి స్థితియే జీవన్ముక్తి. జీవన్ముక్తుడు - సాంఖ్యయోగిలా కేవలం యౌక్తికమగు దృక్ దృశ్య వివేకం మాత్రమే కలవాడు కాడు, ఔపనిషదమగు సదసద్వివేకం కలవాడై ఉంటాడు. కాబట్టి 'దృక్' రూపమౌ అఖండ చిదాత్మ ఒక్కటియే సత్యమని, దృశ్య ప్రపంచమంతా స్వప్నదృశ్యంలా, ఆ దృగాత్మయందే మాయా కల్పిత మవటంచే మిథ్యయే గాని, దృక్ కంటె వేరుగా స్వతంత్రంగా దృశ్యమెన్నడూ లేదనే అద్వితీయా ఖండ దృగాత్మానుభూతి స్వరూపుడే జీవన్ముక్తుడని శ్రీనాథ వాణి.

ఆదిశంకరులు, ఓనాడు శిష్యులతో కాశీలో ఒకవీధిలో వెళ్తున్నారు. ఓ వృద్ధ పండితుడు - సంస్కృత వ్యాకరణ సూత్రాలు, వారి శిష్యులచే వల్లెవేయిస్తున్నారు. వీరు, వారి చెంతకేగి, మరణం దగ్గర పడ్డప్పుడు ఈ వ్యాకరణ సూత్రాలు కాని, ఈ శాస్త్రాలు కాని పనిచెయ్యవన్నారు. బుద్ధిని గోవిందుని భజనవైపు మరల్చుమని ఉపదేశించారు. అవి, అతిమెత్తని సుత్తి దెబ్బల్లాంటివి, అందుకే అవి మోహముద్గరం పేరుతో ఖ్యాతిపొందాయని భజగోవింద శ్లోక రహస్యాలను వెల్లడించి, సకల వేదవేదాంతసారాన్ని బోధించారని శ్రీనాథుడు చెప్తూంటే -

భజగోవిందం భజగోవిందం, గోవిందం భజమూఢమతే ।

సంప్రాప్తే సన్నిహితే కాలే, నహినహి రక్షతి డుకృఞ్ కరణే - అని చదివిన డిండిమభట్టారకులు, గోవిందుని భజింపుమని, చెప్పటంలోనే శ్రవణం కీర్తనం స్మరణం పాదసేవనం, అర్చనం వందనం దాస్యం సఖ్యం ఆత్మనివేదనం - అనే తొమ్మిది భక్తి

మార్గాలున్నాయి. అంటే విష్ణువుని సేవించి నట్లైతే ఇహంలో జీవన్ముక్తి లభిస్తుందని, పరంలో సామీప్య సాలోక్యాది ముక్తులు వరిస్తాయని, భగ్యంతరంగా సిద్ధాంతం చేసారు.

గౌడ డిండిమభట్టు గారు, త్వగర్థాన్నే చెప్పారు గాని తత్త్వార్థమది కాదని, భజగోవిందం – అంటే గురువులను సేవించిన, ఇహంలో జీవన్ముక్తులు కాగలరని వివరించారు. బ్రహ్మ, జీవుల నుదుట వ్రాసిన వ్రాతను మార్చలేరుగాని, గురువులు, మార్చగలరని బ్రహ్మదేవుని కన్న, గురుబ్రహ్మలే మిన్నయని నిరూపించారు.

డిండిమభట్టు, శ్రీనాథుని వాదాన్ని ఖండిస్తూ, గోవిందం గోవిందం అంటూ విష్ణుస్మరణ చేస్తూనే, గురువులను సేవించాలంటున్నారే, అని హేలావంతపు చూపు విసిరారు.

వయోవృద్ధులు హేలగా చూస్తే ఎలా? ఆదిశంకరుల గురు దేవులు గోవిందాచార్యులు గారు వారిని భజించి జీవన్ముక్తుడనై స్వానుభవంతో చెప్పిన మాటలివి – అన్నారు. మోచక గురువు ఈ స్థితి కల్పింపగలరని, "తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా, ఉపదేక్ష్యన్తి తేజ్ఞానం జ్ఞానినః తత్త్వదర్శినః – అను భగవానుని శ్లోకాన్ని వివరించి – జీవన్ముక్తికి సత్సాంగత్యమే తొలిమెట్టు. సత్య స్వరూపుని తెలిసికోవాలనే జిజ్ఞాసతో ఉంటే నిస్సంగత్వం ఏర్పడుతుంది. దాని ద్వారా నిర్మోహత్వం ఏర్పడి, నిశ్చలతత్త్వం కలుగుతుంది. అదే జీవన్ముక్తి అని ఆదిశంకరుల వాణి.

శ్లో॥ సత్సంగత్వే నిస్సంగత్వం, నిస్సంగత్వే నిర్మోహత్వం, నిర్మోహత్వే నిశ్చలతత్త్వం, నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః – అని శ్రీనాథుడు సిద్ధాంతం చేసాడు. చప్పట్లు మ్రోగాయి. శాంతి మంత్రం పఠించారు.

33. ముత్యాలశాలలో ముప్పైమూడవ రోజు వాదసభకు రమ్మని పిలిచింది ఘంటారావం.

ముత్యాలశాల విరిసిన మల్లెపూల పందిరిలా పండిత సుమాలతో విరిసింది. వాదసుమ సౌరభాలు దశదిశలా గుబాళిస్తున్నాయ్. శ్రోత్రియ మధుపాలాఘ్రాణిస్తున్నాయి. శ్రౌతి, శ్రుతిప్రతిపాదన వాదాలు – శ్రుతిప్రతిపాదనలని, వారల శ్రౌత్రమునభినందించారు. తళుకు దుకూలశాటి కటి దాల్చిన, ఏకపత్నీకుడౌ శ్రీనాథుని ఏకపాత్తుగా ఏలిక గుర్తించి నందించారు. శ్రౌత శాఖాగ్ర వర్తియని వాని వాదము శ్రోత్రపేయమని శ్రోత్రియుల భావన.

గురుబ్రహ్మల యాదేశానుసారం వేదమాత గాయత్రీ మంత్రాక్షరాల అంతరార్థాన్ని, వివిధ దృక్కోణాలలో వాదిస్తున్నారు. తీవ్రస్థాయిలో వాద ప్రతివాదనలు సాగుతున్నాయి.

"గయాన్ త్రాయతే ఇతి గాయత్రీ - ప్రాణులను రక్షించేది గాయత్రియని శ్రీనాథకవి - శంకరభాష్యాన్నుదహరిస్తే, తనను గూర్చిస్తుతించు వానిని రక్షించేది -- "గాయంతం త్రాయతే యస్మాత్ గాయత్రీతేనకథ్యతే" అని డిండిమభట్టు వాదించారు. ఉచ్ఛ్వాస నిఃశ్వాసములనే ప్రాణస్పందనలకు హంసలని పేరు. ఇది అజపగాయత్రీ రహస్యమని, హంసయన ఆదిదేవుడని వివరించి, హం - గతి, శివాశివ స్వరూపమని - సంవిద్రూప శక్తుల శివశక్త్యాత్మక మంత్రరాజమే హంసఃసోహం - అని ఋగ్వేదమంత్రార్థ రహస్యాన్ని వివరించిన శ్రీనాథ పండితుడు, హంసస్సోహం - అని, "హం సశ్శుచి షద్వసురంత రిక్ష సద్ధోతావే దిష దతిథిర్దురోణసత్, నృషద్వర సదృత సద్వ్యోమ సదబ్జాగోజా ఋతజా అద్రిజా ఋతమ్" అను ఋగ్వేద మంత్రానికి, మంత్రార్థం వివరించారు. "హకారః పురుషః ప్రోక్తః స ఇతి ప్రకృతిర్మతా పుంప్రకృత్యాత్మకో హంసః తదాత్మకమిదం, జగదితి" - అని శివశక్త్యాత్మక ఆత్మతత్త్వాన్ని తెలిపి సత్యత్వ నిరూపణ చేసే ధీశక్తిని ప్రసాదించు గాయత్రి కి ఇరువది నాల్గు మంత్రాక్షరాలు గలవని, ఇది త్రిపాద గాయత్రియని శ్రీనాథులు వివరించారు. ఓంకారంతో కలిపినపుడే ఇరువది నాల్గక్షరాలున్నాయని, ఓంకారం, అన్ని మంత్రాలకు మొదట చెప్పి తీరాలని, డిండిమభట్టారకులు-శ్రీనాథ సిద్ధాంతాన్ని కొట్టి పారేసారు. ఓంకారం వినా ఇరువది నాల్గక్షరాలే ఉండాలని, ఇతః పూర్వం ఉండేవని, ధార్మికనిష్ఠ తగ్గుముఖం పట్టడంతో శక్తివంతములైన **'వరేణియం'** అను అక్షర సంపుటిని **'వరేణ్యం'**గా పల్కుటచే, గాయత్రీ మంత్ర మందు, ఇరువది మూడు మాత్రమే అక్షరాలున్న సంగతిని శ్రీనాథుడు వ్యక్తం చేసాడు. గాయత్రిని మించిన మంత్రం లేదని సోదాహరణంగా నిరూపించిన శ్రీనాథుడు గాయత్రీ మంత్ర ద్రష్ట బ్రహ్మర్షి విశ్వామిత్రుడని సిద్ధాంతం చేసారు. శాంతి మంత్రం పఠించారు.

34. ముత్యాలశాలలో ముప్పై నాలుగవ రోజు వాదసభ ప్రారంభ సూచకంగా ఘంటారావం మ్రోగింది.

ముత్యాలశాల, శ్రుతి స్వరాలతో ప్రతిధ్వనిస్తోంది. గురుబ్రహ్మలు మాట్లాడుతూ జపగాయత్రీ మంత్రంలో "వరేణియం" - అను మంత్రాక్షరాలను 'వరేణ్యంగా' పలుకుట జరుగును. "ఇయాది పూరణః" - అను పింగళి ఛందాన్ననుసరించి 'రే' పై దీర్ఘస్వరితోచ్చారణచే ఇరువది నాలుగు మంత్రాక్షరాలుగా సరిపోవునని, సామవేదగానంచే 'వరేణియం' అని చదివినా సరిపోతున్నదని నిర్ధారించారు. **చతుష్పాద గాయత్రీ** మంత్రార్థ రహస్యాన్ని నేటి వాదాంశంగా, ప్రతిపాదించటంతో, "పరోరజసే సావదోమ్" - అని

త్రిపురాతాపినీ శ్రుతిలో గలదని, దీనినే తురీయగాయత్రీ మంత్రమని బ్రహ్మవిదులు జపించి ముక్తి పొందుతారని వివరించాడు శ్రీనాథుడు. ఇది మోక్షగాయత్రి యని, అస్తిత్వం కన్న అతీతమైనదని, అస్థిత్వం రజస్సుతో కూడినదని, రజస్సు కన్న పరమైనది తురీయమని వాదించిన శ్రీనాథుడు - పరోరజసే - సా అవతు - ఓం, అని విభాగం చేసి వివరించటంతో, డిండిమభట్టు, "పరోరజసే-సా-వద ఓం - అని విభాగం చేసి వ్యాఖ్యానించారు. అంతేకాదు, పరోరజసే పంచమః పాదః - అను ప్రమాణంచే 'పరోరజసే' - ఏకపాదంగానే గ్రహించాలన్నారు. నిర్మలం, నిర్గుణమైనది 'రజోతమమన్నారు. శ్రీనాథుడు, వారి వాదాన్ని కూడ, అంగీకరిస్తూనే, సవదశ్చ అవదశ్చయః ఓం సఃసావదోమ్ - అని సమాసం చెప్పి, చెప్పుటకు శక్యం, అశక్యమైంది, శబ్ద శక్తికి లొంగనిది, లక్షణావృత్తిచే తెలియనిది, త్రిమూర్త్యాత్మకమైన పరతత్త్వమే ప్రణవమన్నారు. సవదోవదశ్చ - ప్రణవః - ఈతురీయధ్యానంలో దర్శించేవాడు దర్శింపబడేది ఏకమై దివ్యానుభూతి కల్గుతుంది. అదే బ్రహ్మానందానుభూతి. వాడే జీవన్ముక్తుడు. "యతోవాచో నివర్తన్తే..." వేదైశ్చ సర్వ రహమేవ వేద్యః", "లక్ష్యార్థాలక్షణగమ్యా" అను శ్రుతిస్మృతులే చతుష్పాదగాయత్రీ దివ్యాను భూతికి ప్రమాణాలని, తన సిద్ధాంతాన్ని స్థాపించారు శ్రీనాథ కవి.

డిండిమభట్టారకులు, "పరో రజసి సావదోమ్" - అని బృహదారణ్యా కోపనిషత్‌లో గల రహస్యాన్ని వివరించారు. అయితే, పరో రజసి", పరోరజసే", - అనునవి రెండూ శ్రుతులలో ఉన్నవే కనుక స్వస్వగురు సంప్రదాయానుసారం ఏదైనా గ్రహింప వచ్చునన్నారు. "పంచ పదావై... పరోరజాః పాదః"... అని అరుణోపనిషత్తులో గలదని చెప్తూనే, పరోరజాః - అను పదం, పరోరజసిలేక పరోరజసే అని మారుట కవకాశముందని, అర్థం పరమార్థం మారవన్నారు.

"పరో రజసి-సా-వద-ఓమ్" అని పదచ్ఛేదం చేసి, బ్రహ్మయజ్ఞ భాష్యముదహరించారు. అస్యాః అర్థః - రజో గుణాత్మకస్య సంసారస్య పరస్తాత్ బాహ్యేయేయం చిదాత్మని పర్తతేనేయం పరోరజసీ తస్యాః సంబుద్ధిః హే పరోరజసీ గాయత్రీ! ఓంకార స్వరూపిణి సాత్వం మాంవద! అనుగ్రహ బుద్ధ్యా శుభం వద అని - వివరించారు డిండిమభట్టు.

"తస్యవాచకః ప్రణవః" - అను బ్రహ్మసూత్రాన్ని వివరిస్తూ తురీయ పాదార్థ రహస్యంతో వివరించి, పరపక్షాన్ని అంగీకరిస్తూనే, స్వపక్షాన్ని సుస్థిరం చేసారు, శ్రీనాథ సుకవి.

కొందరు, సద్గురు ముఖతః ఈతురీయపాదోపదేశాన్ని కూడ పొంది జపించి, పూర్ణ

గాయత్రి యందు శ్రీ విద్యను దర్శించి, ఇహంలో జీవన్ముక్తిని పరంలో ముక్తి పొందుతారు - అనిన శ్రీనాథుడు - **కఏ ఈల హ్రీం, హసకహలహ్రీం సకల హ్రీం** - అను శ్రీచక్రమూల మంత్రమగు పంచదశికి, **"శ్రీం"** - జేర్చి షోడశీ మంత్రంగా దర్శించిన వాడే శ్రీవిద్యోపాసకుడని, వానికి ఈ పూర్ణగాయత్రీ దర్శనం సులభతరమని శ్రుతి హృదయాన్ని సదస్యులకు నివేదించారు. చతుష్పాద గాయత్రి, చతుర్వేదాల సారమని, శ్రీవిద్యాస్వరూపమని, దీనిని సన్యాసాశ్రమంలో నున్నవారే జపిస్తూంటారని, ఆ స్థితిని పొందిన దీక్షా దక్షులు, దీనినుపాసింప వచ్చునన్నారు. గాయత్రీ మాతను సేవిస్తే ముక్తి మీ అరచేతిలో ఉంటుందన్నారు, మహర్షి భాస్కర రాయలని చెప్తూ "శ్రీసుందరీ సేవన తత్పరాణాం భోగశ్చమోక్షశ్చ కరస్థఏవ" - అని వివరించిన శ్రీ విద్యోపాసకుడగు శ్రీనాథుడు - ఉపాసకులు, గృహస్థుడైతే ఏకపత్నీవ్రతుడై ఉండాలన్నారు. జీవితంలో మంచి నడవడిక కలిగి ఉన్నవాడికే చెప్పే అర్హత ఉంటుందన్నారు, ఏకపత్నీకుడైన శ్రీనాథుడు. వారు, తమ వాదాన్ని బలపరుస్తూ మంత్రం చెప్పారు. ఓం తత్స వితుర్వరేణ్యం భర్గో దేవస్య ధీమహి ధియో యోనః ప్రచోదయాత్ - ఇది జపగాయత్రీ మంత్రం. ఈ మంత్రార్థం చెపుతూ, తత్ సవితుః భర్గః - ఆ శక్తియే శివుడని శివశక్తులే మంత్ర స్వరూపమన్న శ్రీనాథుని వాదాన్ని ఖండిస్తూ, తత్ సవితుః - ఆ ఆదిత్య శక్తియే నన్న రహస్యాన్ని వెల్లడించారు డిండిమభట్టు. సవితుః - అనినపుడు, సహితేన విత్ - సవితుః - ప్రాణిప్రసవ కారణమే, వరేణ్యం=శ్రేష్ఠమని "సవితుర్వరేణ్యమితి-షూఙ్ ప్రాణిప్రసవే సూతే ఇత్యుపక్రమ్య...." అను శ్రుతిని విశ్లేషించి - "ఋతంభరా ప్రజ్ఞ" చేతనే ఈ రహస్యం సిద్ధిస్తుందని, "బ్రహ్మకల" నుదహరించి - "సైషాషోడశీ శ్రీవిద్యా" అని శ్రుత్యంతర్గత విషయాలను వివరించి, అనంత వేదవేదాంత రససార కిరీటమే ఓంకారమని, తత్ స్వరూపులే సీతారాములని, వారిగాథయే గాయత్రీ రామాయణమని మనవి చేసారు శ్రీనాథుడు. కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి. శాంతి మంత్రం పఠించారు. ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

35. ముత్యాలశాలలో ముప్పై ఐదవరోజు వాదసభకు పిలుపుగా గంట గణగణగణ మ్రోగినది.

"ముత్యాలశాల" ముంగిటనున్న పండితులంతా, ముత్యాలశాలలో ప్రవేశించి తమతమ స్థానాల్లో ఆశీనులయ్యారు. ప్రతిరోజు వాదనలు వినటమే కాదు, మిద్దెలకు వెళ్ళి తిన్నదంతా అరిగేవరకూ పదిమంది విద్వత్కల్పులు సమావేశమై, ఉద్దికాదుల వాదోపవాదాంశాలను తర్కించుకొనేవారు. అపారమైన వారి వాదనలు, వీరు తర్కించుకొంటూంటే వారి మాటలను, సూర్యుని ముందు దివిటీల్లాంటి వని, వారి ప్రాజ్ఞులు నవ్వుకొనేవారు.

వారు సహృదయులైన విద్వద్వేశ్యులు కనుక, కొండ అద్దమందు కొంచెమై కనపడదా?... అని సర్దుకు పోయేవారు. ఇతః పూర్వం, ఇలాంటి వాదోప వాదాలు వినలేదని వీరుభయులు సమస్కంధులని, వీరల వాగ్యుద్ధం, విద్వదౌషధమేనని తలపోసారు. ఒకటా రెండా సమస్త శాస్త్ర వాద సముచ్చయమిది!... అని చకచ్చకితులౌతున్నారు. వేదాలు వేదాన్తాలు, ఉప వేదాలు, వేదాంగాలు, వేద భాష్యాలు, ప్రస్థాన త్రయ రహస్యాలు, ఆరణ్యకాలు, బ్రాహ్మణాలు, మంత్రాలు, మంత్రార్థాలు, చతుష్షష్టి కళారహస్యాలు, లలితకళలు, సాహిత్యశాస్త్రాలు, కావ్య రహస్యాలు, రససిద్ధాంతాలు, శబ్దార్థాలంకారమర్మాలు, మహావాక్యార్థాలు, ధర్మ-బ్రహ్మమీమాంసా శాస్త్ర రహస్యాలు, పురాణాల సమన్వయం, సాధ్వీమ తల్లుల వరివస్య, స్తోత్ర రహస్యాలు - బ్రహ్మవాదినుల ప్రాధాన్యం, రుద్రాధ్యాయ మహిమలు వింటూంటే, "అనంత శాస్త్రం, బహువేదితవ్యం, అల్పశ్చకాలో బహవశ్చ విఘ్నాః" అనునది సత్యం అనిపిస్తోంది. వీరెంతో చెప్తున్నా మనం గ్రహించేది చాల తక్కువే! మనం విమర్శించుకొనేది-స్థాలీపులాకన్యాయమే! అని మెల్లిగా చర్చించుకొంటూంటే. **ధర్మపీఠాధ్యక్షులు** - సభలకు నిర్విఘ్నంగా సహకరించు వారందరికీ శుభాకాంక్షలు తెలిపి, రాయలవారి నాశీర్వదించి, వాది ప్రతివాదుల ఖండన మండనాలనభినందించి, **షోడశ దర్శనాంతర్గత రహస్యాలను,** ఉపాలంభ వాగ్జాల రహితంగా శ్రుతి సమ్మతంగా నిర్ణయింపుమని ఆదేశించారు. శ్రీనాథ భట్టు మాట్లాడుతూ, దుఃఖాలను పోగొట్టి, ఆనందాన్ని కలిగించే ఉపాయాలను బోధించేవి దర్శనాలన్నారు. దృశిర్-ప్రేక్షణే- అను ధాతువుపై గణార్థం ల్యుట్ ప్రత్యయంచేరి - "యువో ర నా కౌ" - అను సూత్రంచే ననాదేశం వచ్చి "దర్శన" శబ్దం ఏర్పడుతోంది. "పశ్యార్థైశ్చానాలోచనే" - దర్శనమ్ - పశ్యః - అను సూత్రంచే ల్యుట్ అపవాదమైనా 'అదర్శనంలోపః" - అను సూత్రంచే సాధువైంది. దర్శనం - అంటే చూచునది - అని అర్థం - 'అన్నారు. దర్శన శాస్త్రంలో జ్ఞానార్థ వాచకం. ప్రత్యక్షా ప్రత్యక్షాలనన్నింటిని తెలియజేసే శాస్త్రమే దర్శన శాస్త్రం. "అస్తి నాస్తి దిష్టమ్ మతిః" అను పాణినీయ సూత్రంచే - **ఆస్తికులు, నాస్తికులు, దైష్టికులు** - అను వారు మూడు విధాలుగానున్నారు. శబ్ద ప్రమాణాన్ననుసరించి దైవం కలడనేవారు ఆస్తికులు, నాస్తికులు వేదనిందకులు, దైవపరాయణులు దైష్టికులు. పరలోకం లేదనే బుద్ధి గలవారు నాస్తికులు. పరలోకమున్నదనే బుద్ధి కలవారు - ఆస్తికులు, వీరు భగవంతుడున్నాడంటూనే, వేదాలను ప్రమాణాలుగా విశ్వసిస్తారు. చార్వాక, జైన, బౌద్ధ, ఆర్హత, దిగంబర, సౌమ దర్శనాలు వేద ప్రామాణ్యాన్ని అంగీకరింపని వారిచే వ్రాయబడిన నాస్తిక దర్శనాలన్నారు.

చార్వాకులకు ప్రత్యక్షమే ప్రమాణం. బ్రతికినంత కాలం సుఖంగా అప్పు చేసి నేతి కూడు తినాలి అనే వీరూ, బౌద్ధులు - దేహమే ఆత్మ అంటారు. వీరికి నరకమే లేదు. బౌద్ధులకు మరణమే మోక్షం. ఈ ప్రకారంగా నాస్తిక దర్శనాల గురించి ప్రస్తావించి, వాటిని శ్రుత్యుక్తులచే ఖండించాడు శ్రీనాథభట్టు.

డిండిమభట్టారకులు, నాస్తిక సిద్ధాంతాలను కొట్టిపారేసారు. దైవమున్నాడని శబ్దం చెప్తూంటే లేదనటం సాహసమన్నారు. ప్రత్యక్షమే ప్రమాణమంటే వీడి కంటికి కనబడు తాత లేడని చెప్పాల్సివస్తుంది. తాతలేనప్పుడు, వీడి తండ్రి ఎక్కడి నుండి వచ్చాడనేది ప్రశ్న? దీనికి వారి దగ్గర సమాధానం ఉండదు. ఆప్త వాక్యం కూడ వారికి ప్రమాణం కానప్పుడు, మనం వారిని పట్టించుకోవటం అనవసరమన్నారు. ఆస్తిక దర్శనాల విషయాన్ని ప్రస్తావిస్తూ, వైశేషిక, సాంఖ్య, పూర్వమీమాంసా దర్శనాలు నిరీశ్వరాలని, న్యాయ యోగోత్తర మీమాంసా దర్శనాలు సేశ్వరములని వివరిస్తూనే, న్యాయ యోగ దర్శనాలు - ఈశ్వరుడు నిమిత్తకారణమని తెలుపుచున్నట్లు వాదించారు. ఈ వాదాన్ని శ్రీనాథుడు ఖండిస్తూ, ఈశ్వరుడు ఉపాదాన కారణమని నొక్కివక్కాణించి, నిమిత్తకారణం కూడ కావచ్చునన్నారు.

కణాద, గోతమ, కపిల, పతంజలి, జైమిని దర్శనాలు - ఆత్మ బహుత్వాన్ని జగత్తుకు సత్యత్వాన్ని ప్రసాదిస్తున్నాయని స్వపక్షాన్ని స్థాపిస్తూనే, ఉత్తర మీమాంసా దర్శనం జగన్మిథ్యాత్వాన్ని చూపుతున్నాయని సిద్ధాంతం చేసారు - శ్రీనాథుడు.

ఇవి కాక, రామానుజ, పూర్ణప్రజ్ఞ, నకులీశ పాశుపత, శైవ, ప్రత్యభిజ్ఞ రసేశ్వరాది దర్శనాలను కూడ విమర్శించి వాదోపవాదాలు చేసి, వీటిని మాధ్యమిక దర్శనములుగా తేల్చారు. డిండిమభట్టారకుల కర్మసిద్ధాంతాన్ని ఏకముఖంగా ఖండిస్తూ - నిష్కామకర్మ సిద్ధాంతాన్నంగీకరించారు, శ్రీనాథభట్టు.

డిండిమభట్టారకుల సిద్ధాంతాలలో అక్కడక్కడ ఈశ్వర నిరీశ్వరత్వ వాదనలు ఓతప్రోతమన్నారు శ్రీనాథ కవి. కర్మ సిద్ధాంతాన్ని తప్పనము "వేదోనిత్యమధీయతాం, తదుదితం కర్మ స్వనుష్ఠీయతాం... అని పల్కి, శంకర భగవత్పాదుల సిద్ధాంతాన్ని సరిగా అర్థం చేసికొనిన పుట్టుకకు పరమార్థమైన ముక్తి లభిస్తుందన్నారు. అవగాహనా రాహిత్యం వలననే అనేక అనర్థాలు జరుగుతున్నాయని, తప్పుగా అర్థాలు చెప్పటం, చీకటి తప్పులు చేయటం, వ్యసనపరులై దుఃఖాలననుభవించటం జరుగుతున్నాయని, దేవతలు శరీరములేని వారన్న విషయాన్ని మరచి, మనలా ఉన్నారనే భ్రమతో పరాశక్తి స్వరూపిణియైన రేణుకాదేవిని తప్పుగా అర్థం చేసికొన్నారని, దేవేంద్రుడు స్వర్గాధిపతియని, అలాగే యమ

వరుణ, అశ్వనీ దేవతలు, వాయు దేవుడు, సూర్యభగవానుడు దివ్య శరీరులని, వారికి మనవలె దేహం పాంచభౌతికం కాదని వివరించారు. ద్రౌపది, అగ్నిజ - **యాజ్ఞసేని** యని అగ్నికి చెదలంటవని, అహల్య, తార, మండోదరి సీత వీరంతా కన్యలని, తెలిసికొని, దైవశక్తులను పొందిన సాధ్వీశిరోమణులుగా గుర్తించాలని, శ్రీనాథ కవి, తన ఆవేదనను సప్రమాణంగా నిరూపించాడు.

దాంపత్య ధర్మాలను ప్రస్తావిస్తూ, సోముడు - స్త్రీకి మొదటి భర్తయని, గంధర్వుడు రెండవ వాడని, తృతీయుడు అగ్నియని కృష్ణయజుర్వేద మంత్రం తెల్పుచున్న విషయాన్ని డిండిమభట్టు ప్రస్తావిస్తే - లోకుల చెడుభావాలను ఖండిస్తూ, వారు దేవతలని పాంచ భౌతిక దేహాన్ని పొందిన కన్యకకు, చంద్రుడు శీతలత్వాన్ని, గంధర్వుడు - అనురాగాన్ని అగ్ని పవిత్రతను ప్రసాదిస్తారనే మంత్రార్థాన్ని శ్రీనాథుడు వివరించారు. అందుచేతనే, స్త్రీ వివాహమైన తర్వాత నూతన దంపతులు మొదటి మూడు రాత్రులు సాత్త్వికాహారం తింటూ, క్రిందనే పరుండి ఉండాలన్నారు. - అంటే, దర్భాసనంపై పరుండి బ్రహ్మచర్య దీక్షాదక్షులై దంపతులుండాలనే శ్రుతి రహస్యాన్ని శ్రీనాథుడు తెలిపి, అందుకే కాళిదాసు కుమారసంభవ కావ్యంలో....క్షితి విరచితశయ్యాం కౌతుకాగారమాగాత్" అని వ్రాసినారన్నారు. ఈ రహస్యాన్ని ఆపస్తంబ సూత్రకారులు, వాత్స్యాయనీ మహర్షులు వివరించిన విషయాలన్నీ తెలిపి, శ్రుతి ధర్మాన్ని సుస్థాపితం చేసారు. "త్రిరాత్ర ముభయో రధ శ్మయ్యా బ్రహ్మచర్యం క్షార లవణ వర్జనంచ" - అనే శ్రుతి నుదాహరించారు, శ్రీనాథ శ్రౌతి.

సమస్త దర్శనముల యొక్క హృదయం, మానవులు సుఖంగా ఉండాలనే కదా! శతమానం, ఆరోగ్యంగా అన్ని అవయవాలు ఉండేలా నడచుకొని ముక్తి పొందండన్నారు శ్రీనాథుడు. ముత్యాలశాల, **సంతోషంతో మురిసింది.** ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

36. ముత్యాలశాలలో ముప్పై ఆరవరోజు వాద సభకు రమ్మని ఘంటారావం పిలిచింది.

వాద సుమసౌరభాల నాఘ్రాణించాలని సాహిత్య ప్రియంభావుకులు, కవి వృషభాలు, విద్వాంసులు, రసజ్ఞులు, విజ్ఞులు సదస్సునలంకరించారు. రాయలవారు వారి కులగురుబ్రహ్మలు తమతమ స్వర్ణ సింహాసనాలలో సుఖాసీనులయ్యారు. ధర్మపీఠాధ్యక్షులు మాట్లాడుతూ, నేడు చారిత్రాత్మకాంశాన్ని యిస్తున్నాం. **శక నిర్దేశకులెవరో తేల్చండి,** అన్నారు. ఇంతలో ముమ్మకవి గారు, గురుబ్రహ్మల వైపు చూశారు. దాంతో, వారేదో ప్రశ్నించాలని భావించి, ముమ్మకవీశ్వరా, మీరేదో అడగాలనుకొంటున్నారు. మీకు సమాధానం చెప్పిన తర్వాతనే వాదం ప్రారంభిస్తారన్నారు.

శ్రీనాథ కవీ! మీకు షడ్విధ ప్రాకృత భాషలు కరతలామలకములే కదా! అంతే కాదు, తమకు భారతీయ భాషలన్నియు, వచ్చునని విన్నాం,... అంటూనే ముమ్మకవి...

శ్లో॥ కపిణుజ్జలోయ రేహాయి వేణీదండో నియంబ బింబమ్మి ।

తుహ సుందరి సురయ మహాణిహాణరక్ఖాభుయంగవ్వ ॥

అను ప్రాకృత శ్లోకాన్ని చదివి, దీన్ని సంస్కృత భాషలోకి మార్చి చెప్పి, అందరికీ అర్థమయ్యేలా, నిరుపమానమైన ఇందలి కవితా సౌందర్యాన్ని విశదీకరింప కోరిక, అన్నారు. ఆ శ్లోకాన్ని విన్న ప్రాకృత విద్వత్కవి, సంతోషిస్తూ సదస్యులలోంచి లేచి - **"పరుయ స్సక్కయ బందో, పావుయ బందుస్తు సువుమారో"** - అన్నాడు. విన్న ప్రాకృత కవులు కరతాళ ధ్వనులు చేసారు. ఏమి శృంగారోద్గార సౌరభమని మెచ్చుకొన్నారు. నిజానికి సంస్కృత మహావటచ్ఛాయలో పడి పైకి లేవలేని ప్రాకృత భాషా సుందరి ఆవేదనమును, అభిమానమును, ఆ వాక్యంలో ఎంతో స్ఫుటంగా ప్రతిధ్వనిస్తోంది. సంస్కృత పద బంధం పరుషమా? ప్రాకృత బంధం సుకుమారమా? ప్రాకృత కవులకెంత స్వాభిమానము ఎంత ఆత్మవిశ్వాసము, శృంగారము ప్రాకృత కవుల సొమ్ము కాబోలు. ముమ్మకవీంద్రా! స్త్రీవేణీ బంధ రామణీయకమును ఎంతో సొగసుగా కవి ఉత్ప్రేక్షించాడు - రమణీమణి నల్లని పొడవైన వాలు జడ పిఱుదులపై జీరాడుచు సురత మహానిధి నితంబసీమను కాచుచున్న కాలసర్పంలా ఉన్నదని కవి సంభావన - యని సంస్కృతమున నిట్లు చదివెను.

శ్లో॥ కృష్ణో జ్జ్వలశ్చ రాజతే, వేణీ దండో నితంబ బింబే ।

తవ సుందరి సురత మహా నిధాన రక్షాభుజంగ ఇవ ॥

విన్న సదస్యులు కరతాళధ్వనులు చేసారు - ముమ్మకవికి కృతజ్ఞతలు పలికి, ప్రాకృత భాషను రాజభాషగా తీర్చి దిద్దిన, **ఆంధ్ర శాతవాహనులను** స్మరించి, సుమారు నాలుగు వందల యాభైయారు సంవత్సరాలు, క్రీ.పూ. 253 నుండి క్రీ.శ.225 వరకు శాతవాహన ప్రభువులు భారతదేశంలో పరిపాలన సాగించారు. వీరిలో కొందరు భారత దేశాన్నంతా పరిపాలించారు. క్రీ.శ.ఒకటవ శతాబ్దిలో హాలుడు రాజై, భారతావనినే పరిపాలించి, "గాధాసప్తశతి"ని ప్రాకృత భాషలో రచించి విశేష ఖ్యాతినార్జించాడు. శాతవాహన ప్రభువులు సూర్యదేవుని అనుగ్రహంతో వారి అంశతో పుట్టినవారు. ఏడు గుఱ్ఱాలు వాహనములుగా గల సప్తవాహనుని వంశంలో పుట్టిన **ఆంధ్రబ్రాహ్మణులు** కనుక సప్తవాహనులని, వారే సాతవాహనులుగా ప్రసిద్ధికెక్కారు. గోదావరీ తీరప్రాంతంలో శాలిధాన్యం - అంటే వరి విరివిగా పండేది. ఈ వరి సిరిని తెలియజేయడానికే శాలి పోసిన బండిని ధ్వజంగా

కలిగిన వారై శాలివాహనులయ్యారు. వీరిలో శ్రీముఖుడు తొలి ప్రభువు. భరతమాత ముద్దుబిడ్డల్ని సుఖసంతోషాలతో ఉండేలా చూడాలని, ఆసియాలోని సర్దేరియా నుండి వచ్చిన శకుల్ని వారి దుండగాల్ని భరింపలేక, ఆ ఆతతాయినులైన శకుల్ని శాతవాహన ప్రభువులు ఎదిరించారు. వారు భారతదేశాన్ని కొల్లగొట్టడమే కాదు, అన్ని విధాల భారతీయుల్ని హింసలు పెడుతున్నారు. అట్టడుగున ఉన్న స్త్రీ, పురుషుల్ని చిత్ర హింసల పాల్జేస్తూంటే వారిని, బీదసాదల్ని కాపాడాలని, భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడాలని తలచి, **భారతదేశాన్ని పరిపాలించే కుంతలశాతకర్ణి** క్రీ.పూ. 57వ సంవత్సరంలో అధికార మదమత్తచిత్తులై అక్రమాలు చేసే శకుల్ని చిత్తు చిత్తుగా ఓడించి తరిమి తరిమికొట్టి పాటలీపుత్రం రాజధానిగా భారతదేశపు చక్రవర్తిగా పాలించి, మహాకవి గుణాఢ్యునిచే బృహత్కథ రచించేలా చేసిన మహావీరుడు కావటంతో, విక్రముడని కీర్తించారు. నాటినుండే విక్రమ శకం ప్రారంభమైంది. విక్రమాదిత్య బిరుదాంచితుడై విక్రమశకాన్ని నిర్దేశించాడు. ఆతడే కుంతల శాత కర్ణి, నాటి నుండే శక శబ్దం వెలుగు చూసిందని, వారు యజ్ఞాలు చేసారని శ్రీనాథుడు చెప్పిన తర్వాత, క్రీ.శ.78లో – విక్రమాదిత్యునిచే తరిమికొట్టబడిన శకులు 135 సంవత్సరాలు గుహల్లో తలదాచుకొని, పుంజుకొని మరలా ఆగడాలు సృష్టిస్తూ, సౌరాష్ట్ర మాళవ సామ్రాజ్యాలు పాలిస్తూ విజృంభించారు, భారతీయుల్ని వేధించారు. దాంతో, ఆ ఆతతాయినుల మదాన్ని అణచాలని శకనృపుడగు 'భూమకుని' చంపి, బలమైన శకసేనను వశం చేసికొన్న భారతదేశపు చక్రవర్తి మాఠరీపుత్ర శివస్వాతి, ఈతడే శాలివాహన వంశ వారసుడు, తెలుగు జాతి జ్యోతి, మహాశూరుడు. ఈతడే, అరివీరభయంకరుడైన భూమకుని సంహరించి శక సేనుడై క్రీ.శ.78లో శక నిర్దేశకుడయ్యాడు. నాటి నుండి శాలివాహన శకం ప్రారంభమైందని చెప్తూంటే, క్రీ.పూ. 57న స్థాపింపబడిన విక్రమ శకమే, శాలిశకంగా గుర్తించాలని, తగినన్ని కారణాలు డిండిమభట్టారకులు చూపించారు. శకుల అరాచకాల కట్టుకట్ట వేసి తరిమికొట్టిన తొలివీరుడని విక్రమాదిత్యుని కొనియాడిన డిండిమ వాదాన్ని ఖండిస్తూ, ఏకచ్ఛత్రాధిపతిగా **భారతదేశాన్నే పరిపాలించిన, శివస్వాతి**, శకుల్ని వశం చేసికోవటమే కాకుండా, శకనృపుడైన భూమకునే సంహరించి **శాలిశక నిర్దేశకుడై** నాడని వాదించారు. కుంతలశాత కర్ణి విక్రమ శకం కన్నా, **శివస్వాతి** పరాక్రమాదులు మిన్నయని శ్లాఘించి – శాలిశకం అనటమే మేలని దైవజ్ఞులు నిర్ణయించడానికి తగినన్ని కారణాలు వినిపించాడు, శ్రీనాథుడు. అంతేకాదు, యజ్ఞయాగాదులు చేసిన సోమయాజియని, **"ఆంధ్ర సూర్యుడని"** శూరుడని, కొనియాడాడు.

మూలపురుషుడైన విక్రమాదిత్యుని విస్మరింపరాదని డిండిమభట్టు వాదించారు. ఆతడే మొదట శకుల్ని జయించిందన్నారు. వినిన శ్రీనాథుడు, అది యదార్థమే, కాని, విక్రమాంక బిరుదాంకితులు చాలామంది ఉన్నారు. (1) శకారి యై తన పేర ఒక శకాన్ని స్థాపించిన విక్రమాదిత్యుడొకడు (2) గర్దభిలుని ఓడించి శకుల్ని ధ్వంసం చేసిన విక్రమాదిత్యుడొకడు - అని జైనుల గాథలో ఉన్నదన్నాడు. (3) గాథాసప్తసతిననుసరించి, మహాదాత గా వర్ణింపబడిన విక్రమాదిత్యుడొకడు (4) గుప్త చక్రవర్తులలో ఒకడైన చంద్రగుప్త విక్రమాదిత్యుడొకడు (5) విషమశీలుడనే పేరుగల విక్రమాదిత్యుడొకడున్నాడని కథా సరిత్సాగరంలో ఉంది. ఇలా ఎందరో విక్రమాదిత్యులున్నారు. విక్రమ శకం అంటే ఎవరిదనే ప్రశ్న రావటానికి వీలుంది! కాని, శాలివాహనశకం అంటే వారిద్దరినీ మనం స్మరించుకోవచ్చు! వారిని గౌరవించినట్లే కదా! అందుకే జ్యోతిశ్శాస్త్రజ్ఞులు శాలిశకానికే ప్రాధాన్యమిచ్చారు. మన ప్రభువులు కూడ శాసనాలపై శాలిశకాన్నే లిఖింపజేసారు. విక్రమశకం అంటే శివస్వాతిరాడు పైగా ఎవరో తేలదు! అందుకే తెలుగు వారి శౌర్య ప్రతాపాలకు చిహ్నంగా నిలిచిన శాలివాహన శకాన్నే శాలనాలన్నింటి మీద ప్రభువులు ముద్రించాలని శ్రీనాథుడు మనవి చేసాడు. శక నిర్దేశకులిద్దరైనప్పటికీ **అగ్రతాంబూలం శివస్వాతి**కే నన్నారు శ్రీనాథ కవి. పైగా వీరంతా గోదావరీ ప్రాంతమందు పుట్టిన ఆంధ్ర **వీరులని** యజ్ఞయాగాదులు చేసిన ధనుర్ధారులని **"ఏకబ్రాహ్మణస్య"** అనియున్న నాసిక శాసనాన్ని బట్టి సాటిలేని మేటి బ్రాహ్మణ శ్రేష్ఠులని నొక్కివక్కాణించాడు శ్రీనాథ సుకవి. సదస్యుల హర్షధ్వానాలు, అంబరచుంబితాలు. ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

37. **ముత్యాలశాలలో ముప్పై ఏడవ రోజు** వాద సభకు పిలుపు నిచ్చింది, ఘంటారావం.

ముత్యాలశాల రసశేఖరులైన విద్వాంసులందరితో చూడ ముచ్చటగానుంది. విభూతి రేఖా మధ్య కుంకుమ తిలక విభూషిత ఫాలభాగులు, శిఖాయజ్ఞోపవీతాదిక పరిస్ఫుట బ్రాహ్మీమయమూర్తులు, విద్యా తేజస్సు మాలింగిత సుందరముఖులైన శ్రీనాథ డిండిమభట్టారకులకు శుభ స్వాగతాన్ని పల్కుతూ కొందరు విద్వద్దేశీయులు తళుకు దుకూలశాటి కటిదాల్చి బుజముపై నొక దుకూలాన్ని వైచి, చేత కమండలాన్ని దాల్చి ఏకపాత్తువోలె ఏతించుచున్న ఏకపత్నీకుడైన శ్రీనాథుని చూచి, ఆతని పద్యాన్నే స్మరించారు.

శా॥ **బ్రాహ్మీదత్త వర ప్రసాదుడవురు ప్రజ్ఞా విశేషోదయా**
జిహ్మాస్వాంతుడ వీశ్వరార్చన కళాశీలుండ వభ్యర్హిత
బ్రహ్మాండాది మహాపురాణ చయతాత్పర్యార్థ నిర్ధారిత
బ్రహ్మజ్ఞాన కళా నిధానమవు నీ భాగ్యంబు సామాన్యమే ॥

- ఆంధ్రనైషధము **1-13**

సంస్కృత భాండారాన్ని రెండు చేతులతో దోచి, తెలుగు భాషామతల్లి ఇంటిని సుసంపన్నంచేసి, గీర్వాణి భద్రసింహాసనం ప్రక్కనే తెలుగురాణికి తీసిపోని స్వర్ణపీఠాన్ని ప్రతిష్ఠించిన శ్రీనాథుని రచనలు, వాదనలు వాగ్దేవీదరహాసములని, అవి మాకంద మంజరీ మధురఝరీ మాధుర్య రచనా విశేషాలని విద్వత్కల్పుల చిక్కని వక్కణ. సదస్యులలో ఎవరి నోటవిన్నా వీరి సాహిత్య చర్చలే. ఇంతలో గురుబ్రహ్మలు – స్పర్థులనుద్దేశించి, **తొలి మానవుని పుట్టుక ఎక్కడనే** విషయాన్ని శ్రుతి ప్రమాణాలతో వాద ప్రతివాదనలతో, నిరూపించాలని, సృష్టి రహస్యాన్ని, షడంగ పరిజ్ఞానంతో తెలియజేయాలన్నారు. ఇంకేముంది, వారలకీ విషయాలన్నీ నల్లేరుపై బండినడకలే! శిక్షా, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం, ఈ ఆరుషడంగాలని, వేదాంగాలంటారని, తొలిఛందస్సు వేదమేనని, అది కూడ, **ఓం అగ్నిమీడే పురోహితం...** అనే ఋక్‌తో తొలుత సప్త గోదావరీ తీరాన ఋషులకు వినబడిన విషయాన్ని శ్రీనాథుడు వెల్లడించారు. గో – అంటే వేదవాక్కులు **"గో భూమి వేద విదితో వేదితా"** గోపథ బ్రాహ్మణం. గో భూమివేద విదితః" అని నారాయణ విరచిత దీపికావ్యాఖ్య! వేదాలు వెలసిన ప్రదేశమే గోద. గోపదాలను అంటే శ్రుతులను ప్రసాదించిన పుణ్యస్థలి గోప్పాదక్షేత్రం, గోదా వారి – గోదావరి పక్కనే ఉన్నది. "ఛందాంసివై గోస్థానః" శ్రుతిని బట్టి, తొలుపలుకు వినబడిన ప్రాంతమే, తొలి మానవుని పుట్టుకన్నారు శ్రీనాథుడు. సప్త సింధు ప్రాంతంలోని సరస్వతీనదీ తీరమే తొలి మానవుని పుట్టుకయని డిండిమభట్టు వాదించారు.

ఆర్యులు నివసించింది, ఉత్తర భారతాన గల సింధు నదీ ప్రాంతమేనని, అతి ప్రాచీనతమమైన సంస్కృతి కల ప్రాంతమదేనని, ప్రాచీనం నుండి కర్ణా కర్ణికగ వింటున్నాం. ఋగ్వేదమే తొలి శ్రుతి. ఆ వేద వాక్కులననుసరించి, "విజానీహ్యార్యాన్ '," జ్యోతిశ్చక్రధురార్యాయ" – అను శ్రుతుల నాధారంగా, ఆర్యులచటి వారేనని, సప్త సింధునదీ తీరాన గల, ఆర్యుడైన విశ్వామిత్రుడు తన కుమారులలో కొందరిని "ఆంధ్రు"లై జీవింపుమని శపించిన శునశ్శేఫ వృత్తాంతాన్ని వినిపించారు. అంధకరట్టులు కండి! అని అన్నారని, ఐతరేయ బ్రాహ్మణాన్ని వివరించి, తొలిప్రాణి, తొలి మానవుడు పుట్టింది, సప్తసింధువు నందలి సరస్వతీ తీరమని వాదించారు డిండిమభట్టారకులు.

డిండిమభట్టారకుల వాదాన్ని వారు చూపిన ఉదాహరణలతోనే శ్రీనాథుడు ఖండించటం ప్రారంభించాడు. ఆర్యులని ఋగ్వేదంలో ఉందన్నారు కదా! అరకలు కట్టి, పొలాలుదున్ని అన్నాన్ని అంటే అంథస్సు / అంధను సంపాదించే అరకాడులే ఆర్యులు గా

పిలువడిన ఆంధ్రులు. వీరు అగ్న్యారాధకులు, వారు చూపిన శ్రుతులనుసరించే, "తేన దేవా అజయన్త...తస్మాత్ యజ్ఞాత్ సర్వహుతః ఋచ స్సామాని జజ్ఞిరే..." అను యజుర్వేదమంత్రాన్ని బట్టి, అగ్నిని అరణిమథనం చేసి స్థాలీపాకంచే అంధస్సుతో హోమాలు చేసింది అంధకులేనని, అన్నాన్నే హవిస్సు అంటారని, హవిర్దాతలగు ఆంధ్రులు కండని విశ్వామిత్రుడు, తన కుమారులను దీవించిన కథయే శునశ్శేఫవృత్తాంతమని, అదిశాపం కాదని, "ఏతే ఆంధ్రాః - ఇత్యుదన్యా బహవోభవ - అని, సృష్టికే ప్రతిసృష్టి చేసిన బ్రహ్మర్షి వరమని నిర్ధారించాడు శ్రీనాథుడు. వేదాల్లో, **"ఋషయోవై సరస్వత్యాం సత్రమాసత"** - ఐతరేయ బ్రాహ్మణ మంత్రాన్ని పరిశీలిస్తే సరస్వతీ నదీ తీరంలోనే ప్రాణి సృష్టి ప్రారంభమైనట్లు స్పష్టమౌతోంది. ఋగ్వేదంలోని కొన్ని మంత్రాలను పరిశీలిస్తే, సరస్వతీనది, సప్తగోదావరీ నదియేనని స్పష్టమౌతోంది. గోదావరికి గౌతమీ నదియని పేరు. "కృష్ణవేణీచ గౌతమీ" పంచ గంగల్లోను గౌతమీ నదియే సప్తపాయలుగా ప్రవహించింది. ఇదే సప్త గోదావరీ నదియని, దీనినే సరస్వతీనదియని; "గౌతమీ తత్రపావనీ" అని మహర్షులు కీర్తించారన్నారు. దీనినే సప్తసింధు - అని అంటారని, ఈ **గోదావరియే ఏడు పాయలు**గా ప్రవహించి, సముద్రంలో కలిసిందని, దక్షిణ కాశిగా పేరుపొందిన ద్రాక్షారామ క్షేత్రంలో సప్తగోదావరీ తీర్థం లభించిందని, ఈ సప్త సింధు, సాగర సంగమం చేసిందని, ఈ రహస్యమంతా ఋగ్వేద మంత్రంలో స్పష్టంగా దృష్టమగు విషయాన్ని వివరించాడు శ్రీనాథ భట్టు.

శ్లో॥ త్రియంబక జటోద్భూతే గౌతమ స్యాఘనాశినీ ।
సప్తధా సాగరం యాంతి గోదావరి నమోస్తుతే ॥

శ్లో॥ దేవీ మానస సంభూతే సరస్వత్య ఘనాశినీ ।
గృహాణార్ఘ్యం మయా దత్తం గౌతమ్యాం సన్నిధిం కురు ॥

సప్తసింధువుగా ప్రవహించి, సముద్రంలో కలసిన ప్రాంతంలోనే తొలిప్రాణి, మానవులు జన్మించి యజ్ఞ యాగాది క్రతువులాచరించారని, వారికి సముద్రఘోష వినిపిస్తూండేదని ఋగ్వేదమంత్రం స్పష్టంగా చెప్తూంటే, ఇలాంటి సప్తసింధు భారతదేశంలో మరే ప్రాంతంలోను లేదన్నది సత్యం. డిండిములు చెప్పినట్లు, ఉత్తర భారతాన ఏడునదులు ఒకే నదిపాయలుగా గల ప్రాంతం లేనేలేదు. వారు చెప్పిన ప్రాంతంలో 'పంజాబ్' - అంటే ఐదు నదులు కలసిన చోటని, పంచనదులు కలదనియే అర్థము. పంచ+అప్ - పంచాప్‌నే, బగా కూడ కొందరు పల్కటంతో, పంజాబ్ అంటున్నారు. "సరస్వతీతు పంచధా,

సోదేశో భవత్ సరిత్" - అని వాజపనేయ సంహిత వివరించింది. దీనికి మరో రెండు నదులను కలిపి సప్తసింధు - అని అన్నారు. అదెలా సాధ్యం? మరలా తొలుపలుకులో ఆర్యులు గానం చేస్తుంటే వారికి దక్షిణంగా సముద్రం ఉండేదని ఋగ్వేదమంత్రం వినిపిస్తోంది. **"ఏకా చైతత్ సరస్వతీ నదీనాం శుచిర్యాత్ గిరిభ్య ఆ సముద్రాత్"**-ఋగ్వేదం 7-95-2 అని వివరించి, ఋగ్వేద మందలి ద్వితీయ మండలంలోని 41వ సూక్తంలో గల 61వ ఋక్కునీ పరిశీలిస్తే ఈ ఆంధ్ర ప్రాంతమందు గల సరస్వతీ నదీ తీర ప్రాంతమే తొలిప్రాణి సృష్టికి మూలాధారమని వినబడుతోంది. కనుక, శ్రుతి ప్రమాణాలను బట్టి, తొలిప్రాణి సృష్టి సప్తగోదావరీ తీరంలోనేనని, తొలు పలుకులు కూడ గోష్పాదక్షేత్రంలోనే వినబడినవని, ఋగ్వేద కాలం నాటి నుండి, ఐతరేయబ్రాహ్మణాన్ని బట్టి, విశ్వామిత్రుల వరప్రభావాన్ని బట్టి నాటినుండి ఆంధ్రులున్నట్లు ఆంధ్రభాషా సంస్కృతులున్నట్లుగా స్పష్టమవుతోందని, శ్రీనాథకవి, డిండిమభట్టారకుల పక్షాన్ని ఖండించి, స్వపక్షాన్ని స్థాపించారు - మనం ఏవైతే ఋషుల శాపాలను కొంటున్నామో, అవి వారొంగిన వరాలేనని శ్రీనాథుడు నొక్కివక్కాణించారు. "ఓం ఋతం చసత్యం చాభీ ధాత్తపసోధ్యజాయత, తతోరాత్ర్యజాయత... అను ఋగ్వేదమంత్రం వినిపించి సృష్ట్యారంభ క్రమాన్ని వ్యక్తం చేసారు. ఆత్మ నుండే సృష్టి పుట్టిందని నిరూపించారు. హేమాద్రి జ్యోతిష గ్రంథాన్ని ఆధారంగా చేసికొని, చైత్రమాసపు శుక్ల పక్షాన మొదటి రోజున సూర్యోదయ కాలాన బ్రహ్మ సృజించెనని నిరూపించారు. ముత్యాలశాల మురిసింది, హర్షవర్షం కురిసింది. గురుబ్రహ్మలయాదేశానుసారం, శ్రౌతి గారు శాంతి మంత్రం పఠించారు.

38. ముత్యాలశాలలో ముప్పై ఎనిమిదవ రోజు వాద సభకు రమ్మని ఘంటారావం పిలిచింది.

ముత్యాలశాల, ముకుందుని కంఠ మందలి ముక్తావళిలా తళతళ మెరిసింది. సదస్యులానందించి నవ్వుల పువ్వులు రువ్వుతున్నారు. ధర్మపీఠాధ్యక్షులగు, రాజకుల గురుబ్రహ్మలు, రాయలవారి నాశీర్వదించి, వాది ప్రతివాదుల నుద్దేశించి - నేటి వాదాంశం **"గర్భస్థ శిశు వాదం"** ఈ వాదాన్ని శ్రుత్యుక్తులతో సమాజ శ్రేయస్సుకోరి, సామాన్యులకి కూడ అర్థమయ్యేలా మీ మీ వాదనలు వినిపిస్తూ, ఖండన మండనాలు వినిపించండన్నారు.

పురుషుడు - పురుషార్థ సిద్ధికై, గృహస్థుడు కావాలి. పితృఋణ విముక్తికై సంతానవంతుడు కావాలని శ్రుతి ప్రతిపాదిస్తోంది. "ప్రజాయై గృహమేధినాం" - శ్రుతి, "గృహిణీ గృహముచ్యతే" కనుక భార్యయే గృహం. గృహం కలవాడే గృహస్థుడు అంటే భార్య కలవాడు. అంతేకాని మిద్దెకలవాడు కాదు. భార్యాభర్తలు పూవు తావిలా కలసి

ఉండాలి. మానసిక శక్తి సంపన్నులైతే సంకల్పం మాత్రం చేతనే సంతాన వంతులౌతారు. ఇది కృతయుగ ధర్మం. త్రేతాయుగంలో దర్శనం వలననే సంతానవంతులయ్యారు. ద్వాపరంలో స్పర్శవల్ల సంతానం కలిగేది అని విష్ణుపురాణం చెపుతోంది. **"సంకల్పాత్ దర్శనాత్ స్పర్శాత్ పూర్వేషాం అభవన్ప్రజాః"** కలియుగంలో కూడ శక్తి సంపన్నులైతే సంతానం కల్గుతుంది అని శ్రుతి రహస్యాలను వెల్లడించిన శ్రీనాథుని మాటపై, ఏకముఖుడైన డిండిమభట్టారకులు – "తథా కలియుగే రాజన్, ప్రజాః మైధున సంభవాః – అని భారతంలోని వ్యాసవాణి వినిపించి, గర్భధారణ పోషణచేసి నవమాసాలు మోసి కనిపెంచు తల్లియే గొప్పదని, గర్భస్థ శిశువుని జాగ్రత్తగా పెంచటంలోనే తల్లి గొప్పదనం ఉందని పురాణోక్తులనుదహరించి, శిశువు పెరుగుదలకు తల్లియే కారణ భూతురాలని చక్కగా వాదించారు, డిండిమభట్టారకులు. వారి వాదన ఏకపక్షంగానే ఉందంటూ శ్రీనాథుడు, తన వాదం వినిపించారు.

సంతాన బీజం, పురుషునిలో ఉత్పన్నమై మూడు మాసాలు ఉన్నత బీజంగా తయారవుతుందని, ఆ కణమే స్త్రీ యందు ప్రవేశిస్తోందని – పూర్వమందు శక్తిపాతం వలన స్త్రీ గర్భాన్ని ధరిస్తుందని తర్వాత తొమ్మిది మాసాలు, తలిదండ్రుల ప్రవర్తనలను బట్టి శిశువు తల్లి గర్భంలో రూపుదిద్దుకొంటుందన్న శ్రుతి రహస్యాన్ని వెల్లడించారు. స్త్రీ, పురుషులు పుట్టినప్పటి నుండి మంచి నడవడిక కల్గి ఉండాలని చెప్తూనే, వివాహం జరిగిన నాటి నుండి దంపతులు ధర్మబద్ధులై ప్రవర్తించాలన్నారు.

"గర్భోప పత్తౌతు మనః స్త్రియా యం జంతుం వ్రజేత్, తత్సదృశం ప్రసూతే" – అని చరకసంహితలో, పతంజలి మహర్షి గర్భప్రాప్తిని గురించి వివరిస్తూ – గర్భధారణ వేళలో స్త్రీ యొక్క మనస్సు ఏప్రాణిని పొందునో ఆ ప్రాణితో సమానమగు బిడ్డను కనునని స్పష్టంగా చెప్పారు. మాతృగర్భంలోనుండి ,కడుపులో బిడ్డ, బయట నుండి విన్న కంఠధ్వనిని శ్లోకాలను పద్యాలను అన్నీ గుర్తించగలడనడానికి, గర్భస్థ శిశువైన అభిమన్యుడే సాక్ష్యం. కడుపులో బిడ్డ ఉండగానే, అర్జునుడు – సుభద్ర ప్రక్కన కూర్చుని, పద్మవ్యూహంలోకి ఎలా ప్రవేశించాలో చెపితే వాడన్నీ విన్నాడు కదా! స్త్రీ సంకల్ప సిద్ధికి ప్రతిరూపాలే శిశువులు. సంతాన ప్రాప్తికి, భార్యా భర్త లిద్దఋా ప్రధాన కారణాలైనా, స్త్రీ మనోభావాలను బట్టే సంతానం కల్గుతుందని జ్యోతిశ్శాస్త్రం స్పష్టం చేస్తోంది. "మనోబుద్ధి ప్రసాదంతు, మాతృచింతాచ చంద్రమాః – "చంద్రుడు మనః కారకుడు, ఇంద్రియాలు ప్రవర్తించటంలో మనస్సే ముఖ్య కారణం. "మన ఏవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయోః" – అని

భగవద్వచనం. స్త్రీకి వివాహం అయినప్పటినుండి తన మనస్సులో ఏఏ భావాలు వికారాలు ఆలోచనలు ఆహారాదులు చోటు చేసికొంటాయో ఆయా లక్షణాలు గల పిల్లలే పుడతారు. దేవకీ వసుదేవులు, శ్రీహరి నే స్మరించారు. ఆయనే కుమారుడై పుట్టాడు. రేణుకాదేవి, శ్రీహరియే బిడ్డడుగా పుట్టాలనుకొన్నది. పరశురామునిగ అవతరించాడు. దుష్టభావాలు కలిగినపుడు పుట్టే బిడ్డలు కూడ దుష్టులుగానే పుడతారనటానికి సాక్షి కంసుడు, శిశు పాలాదులు. ద్రామిళ రాక్షసుని దౌష్ట్యం వల్ల, వైదర్భికి పుట్టే బిడ్డపై ద్వేషం పుట్టింది. పుట్టేవాడు ద్వేష భావంతోనే పుట్టాడు. వాడే పద్మావతి క్షేత్రజుడగు కంసుడు. అలాగే ధార్తరాష్ట్రులు. భార్యాభర్తల చేష్టలు కూడ కడుపులోని బిడ్డపై ప్రభావం చూపుతుంటాయి. పరిసరాల ప్రభావం కూడ బిడ్డపై పడుతుంది. నారదముని ఆశ్రమంలో శ్రీహరి నామమే వినపడుతూండటం వలన కడుపులోని పసికందుపై శ్రీహరి నామమే నిలబడింది. పుడుతూనే ప్రహ్లాదుడు శ్రీహరినామాన్ని స్మరించాడు. కృష్ణయజుర్వేద మంత్ర రహస్యాన్ని చెపుతూనే గర్భస్థుడైన బిడ్డ పెరుగుదలకు పూర్వోత్తర రూపాలైన తలిదండ్రులు - మాతా పూర్వ రూపం, పితోత్తరరూపం, ప్రజాసంధిః, ప్రజననగ్ం సంధానం, ఇత్యధి ప్రజం - అను శ్రుత్యనుసారం వారే తగినన్ని జాగ్రత్తలు తీసికొంటే మంచి సంతానం కల్గుతుంది. వారు, మంచి పౌరులై విశ్వ కళ్యాణ కారకులౌతారు.

గర్భోపపత్తి సమయంలో తల్లి సంగీతాధ్యయనం చేస్తే పుట్టే బిడ్డ సంగీత విద్వాంసుడౌతాడు అంటూంటే, పండిత పుత్రులు కొందరు శుంఠలవుతున్నారన్న విషయాన్ని మరచారు శ్రీనాథులన్నారు. స్వామీ, కొందరు పండిత పత్నులకు పాండిత్యంపై కాని, సంగీత సాహిత్యాలపై కాని అభిరుచి లేకపోవటమే కారణం కావచ్చు. సత్సంతాన ప్రాప్తికి మగువమనస్సే ప్రధానపాత్ర - అన్నారు శ్రీనాథుడు. ముత్యాలశాల హర్ష ధ్వానాలతో మార్మోగింది. శాంతి మంత్రం పఠించారు. ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

39. ముత్యాలశాలలో ముప్పై తొమ్మిదవ రోజు వాద సభకు రమ్మని ఘంటారావం పిలిచింది.

ముత్యాలశాల, బ్రహ్మాదినుల యంఘ్రిరజోలేశ స్పర్శచే పులకరిస్తోంది. విద్వత్కవి శేఖరులు, కవితా విభూషణులు, సకల కళా కోవిదులు, వివిధాధ్వర నిర్మల ధర్మ కర్మ దీక్షా పరతంత్రులు, మంత్రులు, సామంతులు, సైన్యాధీశులు, రసజ్ఞులు, విజ్ఞులు, సదస్యులైనారు. ముత్యాలశాల మురిసింది. రాయల మనసు విరిసింది. వేదిక పైకి వస్తూనే సదస్యుల నాశీర్వదించారు, రాజ కులగురువులు బ్రహ్మశ్రీ చంద్రభూష క్రియాశక్తి రాయలవారు. శ్రీనాథ-డిండిమభట్టారకుల నుద్దేశించి, **భారతదేశమనే పేరు, ఎలా వచ్చిందో**

శాస్త్రీయ దృక్పథంతో తెలియజేయాలన్నారు, గురుబ్రహ్మ.

మానవాభ్యుదయ కాంతి ప్రసారార్థం, ఈ భరత భూమిలోనే వేదాలు వినబడినవి, సకల శాస్త్రాలు మహర్షులు విరచించారు. విశ్వానికి విజ్ఞానాన్నందించే వేదనాదాలు తెలిసికొంటే ముక్తి - అరచేతి ఉసరికకాయయేనని చెప్తూ, భరతభూమి పుణ్యభూమి, కర్మభూమియని దుష్యంతుని కుమారుడు భరతుడు పరిపాలించిన కారణంగా, భారత దేశమనే పేరు వచ్చిందని, ఇట నివసించే ప్రజలకు "భారతీ ప్రజ"యని, భారతీయులని వచ్చినట్లు తెలుస్తోందని, పురాణ ప్రవచనాలు వినిపించారు డిండిమభట్టారకులు.

శ్లో॥ భరతాత్ భారతీ కీర్తిః యేనేదం భారతం కులం ।
అపరేయేచ పూర్వే వై భారతా ఇతి విశ్రుతాః ॥

శ్లో॥ చక్రవర్తీ తతోజజ్ఞే దుష్యంతాత్స మితం జయః ।
శకుంతలాయాం భరతో యస్యనామ్నాతు భారతాః ॥ - అని మత్స్యపురాణ వచనము నుదాహరించారు.

డిండిమభట్టారక మహోదయా! భరతుడు పుట్టిన క్రితం కూడ భారత వర్షమని భరత ఖండమని సంకల్పం చెప్పారు కదా! భరతునికి పూర్వం కూడ, తర్వాత కూడ చాలా మంది భరత శబ్దవాచ్యులున్నారు కదా! మరి మీ వాదానికి న్యాయం చేకూరదన్నారు, శ్రీనాథుడు. ఋషభపుత్రుడు "భరతుడు" వలన "భారతవర్షం" పేరు వచ్చిందంటున్నారు. భరతవర్షం పూర్వపు పేరు "అజనాభ" మన్నారు. చాలా పురాణాల్లో ఈ కథ ప్రసిద్ధమే!" భరతాచ్చ ప్రజానాం, వై మనుర్భరత ఉచ్యతే । నిరుక్తవచనాచ్చైవ వర్షం తద్భారతం స్మృతమ్ - వాయుమత్స్య పురాణాల్లో మనువు వలననే ఈ దేశానికి భారత వర్షం వచ్చినట్లు తెలుస్తోంది.

మీరు దుష్యంతుని పుత్రుని వలనని పల్కుతున్నారు. ఇంకా చాలా మంది భరతులున్నారు. శ్రీరామచంద్ర మూర్తి తమ్ముడు భరతుడు పాలించిన రాజే! వివిధ వృత్తుల్లో రాణించిన భరతులున్నారు. జడభరతుడు, నాట్య శాస్త్ర కర్త భరతుడు మున్నగువారెందరో ఉన్నారు. మరి ఏ భరతుని వలన ఈ దేశానికాపేరు వచ్చిందంటారు కనుక మీ వాదాన్ని మేం అంగీకరించము. మరి భారతాది పురాణ వచనాలు అసత్యాలంటారా! వ్యాసో నారాయణోహరిః - అనిన మాట సత్యం కాదా? సాక్షాత్తు భగవంతుడే వ్రాసిన పంచమ వేదంలోని మాట నీటి మూటంటారా? అని డిండిమభట్టు నిలదీసి ప్రశ్నించారు.

డిండిమభట్టు గారూ! ఋషుల వాక్కులు సత్యదూరాలు కావు. మనం అర్థం

చేసికోవటంలో లోపం ఉంటుంది. సృష్ట్యాదినుండే, వేదం వినబడిన భూమి కనుక దీనికి "భారతీమహీః" - అని దీనికి 'భారతీః' అని, "ఇడా సరస్వతీ భారతీ మహీః" -అని వినబడిన ప్రదేశమే భారతీ ప్రజ కల్గి. భారతదేశంగా ప్రసిద్ధి చెందింది. తొలిపలుకు వేదం/భారతి వినబడిన నాటి నుండి భరతవర్షే, భరత ఖండే... అని సంకల్పం చెప్పటం, నాటి నుండే మహర్షులు ప్రారంభించారు.

వ్యాసాది మహర్షులు, సుప్రసిద్ధులైన రాజులు, అంటే భరతుడు వంటి వారలు పరిపాలించినపుడు, మరింత వెలుగుచూసినది కనుక "భారతదేశం" సుప్రసిద్ధమైందన్నారు. భరత దేశమనటానికి వేవేల కారణాలున్నాయి. ఒకటీ రెండూ కాదు, సహస్రాధికములు.

ఈ పృథ్వి సప్త ద్వీపాలతో కూడి ఉంది. అందులో ఒకటి జంబూద్వీపం. ఇది నవవర్ష విభాగంగా భాగవతం చెపుతోంది. అందు భరత వర్షం ఒకటి కదా "తేషు హైమవతం వర్షం భారతం నామవిశ్రుతం" - అని మత్స్యపురాణంలో ఉంది. యాస్కమహర్షి నిరుక్తంలో కూడ వివరించారు. "ఉత్తరం యత్ సముద్రస్య హిమాద్రేశ్చైవ దక్షిణం, వర్షం తత్ భారతం నామ నవసాహస్ర విస్తృతమ్" - అని అగ్నిపురాణం, తెలిపింది. ఇది యజ్ఞ భూమి "అమందిష్టాం భారతా రేవ దగ్నిం" - అని ఋగ్వేద మంత్రాన్ననుసరించి, యజ్ఞాలు నిర్వహించేవారు భరతులని, అగ్నికార్యాలుచేసే కర్మభూమి కనుక ఇది భారతదేశంగా కీర్తి పొందిందని, ఈ గడ్డపై పుట్టిన ప్రతిబిడ్డ భారతుడేనని శ్రుతిస్మృతి పురాణాదులన్నీ ప్రశంసిస్తున్నాయి. "యదాయదాహి ధర్మస్య... భవతి భారత" - అని గీతాచార్యులన్నారు. **"ఉత్తిష్ఠత! మాస్వప్త, అగ్నిమిచ్ఛధ్వం భారతాః"** అని శ్రుతి - భారతులారా! లెండు నిదురింపకుడు. అగ్ని స్వరూప పరమాత్మ నారాధింపుడని వాగ్రూప భారతి, హెచ్చరిస్తోంది.

"వేదభారతి" అవతరించిన కర్మభూమి మన భరత భూమి. "భరతా" - ఋత్విజః - అని సాయణభాష్యం వలన - యాగాది సత్కర్మలను నిష్కామంగా ఆచరించాలని, అవి అగ్న్యారాధన చేసినందువలన, **వేదభారతిని సేవించు మనము భారతులు గాను, మనము వసించు దేశమే భారత దేశం** గాను, వేదకాలం నుండే ప్రసిద్ధి చెందింది. ఈ గడ్డపై పుట్టిన భారతుల కధలు కలది కనుకనే భారతమైంది. ఆసేతు శీతాచల పర్యంతం షోడశ కర్మలలో ప్రధానమైనది అగ్ని. అగ్ని సాక్షిగానే ఏ కర్మయైనా, చేయాలి, ఇది మన భారత జాతీయ సమైక్యతకు చిహ్నము. అగ్నియే పరమేశ్వరుడని తొలి శ్రుతి "అగ్నిమీళే పురోహితం" - అంటూ అగ్న్యారాధతోనే ఋగ్వేద శ్రుతి వినబడింది. **"అగ్నిర్భారతః"** - అను ఋగ్వేద శ్రుతి, మనమంతా అగ్నిని ఆరాధించే భారతులమని పేర్కొన్నది. "అగ్నిర్వై

సర్వాదేవతాః" - అని శ్రుతి స్పష్టం చేస్తోంది. "అం, గతి సర్వత్ర గచ్ఛతీత్యగ్నిః" - అంతటా ఉండే అగ్ని రూపపరమేశ్వరారాధనయే ముక్తినొసంగును. ప్రాణులలో జఠరాగ్ని రూపంలో, అరణ్యాలలో దావాగ్ని రూపంలో, సముద్రాలలో బడబాగ్ని రూపాంలో అగ్ని ఉన్నదనుట సుస్పష్టము. లోపాముద్ర శ్రద్ధాది బ్రహ్మావాదినులు వేద భారతిని దర్శించారు. అగ్ని స్వరూపిణిగా ఆరాధించారు. ఈ పుణ్యధాత్రిని "భారత భారతిగా" ఆరాధించారు. వేద భారతియే "సరస్వతి" - వాగ్దేవతలుగా శ్రుతి ప్రతిపాదిస్తోంది. **విశ్వానికే జ్ఞాన జ్యోతిని ప్రసాదించు వేదభారతి వెలసిన పుణ్యధాత్రియే, మన "భారతదేశం".**

వేద భారతిని స్వాధ్యాయ ప్రవచనాలతో సత్కరించు స్వాములను, భారతీ, సరస్వతీనామాలతో స్వాగతం పలికే భారత భూమి మనది. అందుచేతనే మనం అగ్ని కార్యాలు చేసి సనాతన ధర్మాన్ని కాపాడాలని శ్రుతి శాసిస్తోంది. కాశీ వెళ్ళి అన్నపూర్ణా విశ్వేశ్వరులను చూసి రావాలంటే పది రోజుల ముందుగానే మూట ముళ్ళు సర్దుకొంటాం. దారిలో తినడానికి పృధక్ తండులాలు, పండ్లు ఫలాలు జాగ్రత్త చేసికొంటాం. కాని, ఇంట్లో ఉన్న బల్లుల్ని పిల్లుల్ని చంకన బెట్టుకొని బయలు దేరము కదా! మరి శాశ్వత యాత్ర ఎపుడో ఒకప్పుడు తప్పక చేయాలి. ఆ సమయం మనకు తెలియదు. ముందుగానే పాపపుణ్యాలు మూట కట్టుకోం కదా! పుణ్యకార్యాలు చేసి సత్కర్మల ఫలితాలను జాగ్రత్త చేసికోండి. మంచి నడవడిక కల్గి, దైవనామస్మరణ చేస్తూంటే పండిన దోసపండు ముచికనుండి ఊడినట్లు అనాయాసమరణంచే ముక్తులు కాగలరని, తెలిపి, పండిత పరమహంసలు నే ప్రతిపాదించిన సిద్ధాంతాల్లోని గుణలేశాన్నే గ్రహించాలని శ్రీనాథసుకవి మనవి చేసారు. సదస్యులు కరతాళ ధ్వనులు చేసారు. గురుబ్రహ్మల శుభాశీర్వచనాలతో, శ్రౌతి గారు శాంతి మంత్రం పఠించారు.

40. ముత్యాలశాలలో నలభైయవ రోజు వాద సభకు ఘంటారావం పిలుపునిచ్చినది.

ముత్యాల తోరణాలతో మంచి ముత్యాల చాందినీలతో ముస్తాబైన ముత్యాలశాల, సమస్త కవితా విలాస వాగీశ్వరులగు కవీశ్వరులతోను, సర్వశాస్త్ర సిద్ధాంత కమల హంసులగు విద్వాంసులతోను, సంగీత విద్యా రహస్య విజ్ఞాన వైజ్ఞానిక స్వాంతులగు కళావంతులతోను, ప్రభావ మంత్రోత్సాహ శక్తిత్రయ చతురుపాయషాడ్గుణ్య ప్రయోగ యోగ్య విచారులగు రాయబారులతోను, నిఖిల పురాణేతిహాస సంహితాతాత్పర్య పర్యాలోచనా ధురంధర ధిషణా సముత్సాహంబగు పౌరాణిక సమూహాలతోను, బహుశ్రుత్య సంపన్నులతోను, వేద వేదాంత వాసనా విశ్రాంత హృదయజ్ఞులతోను, సర్వోపనిషత్తత్త్వజ్ఞులతోను, ఆలంకారిక

శిరోమణులతోను, రసరహస్యజ్ఞులతోను, సంస్కృతాంధ్ర తమిళ కన్నడాద్యనేక భాషా సుసంపన్నులతోను, విదుషీమణి బృందంబులతోను కళకళలాడుతూ, వాదసుమసౌరభాలను విరజిమ్ముతోంది.

అది విద్వత్కవిశేఖరులు బలిసి కొలువున్న ప్రౌఢదేవరాయల నిండు సభ. శ్రీ ప్రౌఢ దేవరాయల వారు, నవరత్న ఖచిత స్వర్ణసింహాసనంపై కూర్చున్నారు. న్యాయనిర్ణేతగా శ్రీ చంద్ర భూష క్రియాశక్తి రాయలవారు ధర్మపీఠాన్నధిష్ఠించారు. శ్రీ విజయనగర సామ్రాజ్య మహామాత్యులు, శ్రీ చామనామాత్యులు, శ్రీ విజయనగర విద్యాశాఖామాత్యులు, శ్రీరాజనాధ కులపతులు, వల్లభామాత్యులు, శ్రీవిజయనగరాభివృద్ధి మంత్రిణి శ్రీమతి విజయలక్ష్మి గారు, తదితర మంత్రులు, సామంత మండలేశ్వరులు శ్రీ సాంపరాయని తెలుంగాధీశులు, శ్రీ పంట మైలారురెడ్డి ప్రభృతులు, రాజకుల పురోహితులు బ్రహ్మశ్రీ సుబ్రహ్మణ్యశ్రౌతి, బ్రహ్మశ్రీ సీతారామశాస్త్రి ఘనపాఠి, వేదపండితులు, సరస సాహితీరిరంసువులు, రసజ్ఞులు, శ్రీ విజయనగర పౌరులు తమతమ స్థానాల్లో ఆశీనులయ్యారు. వాది ప్రతివాదులైన శ్రీవిజయనగర విద్యాధికారులు, అరుణగిరినాథులిటు, శ్రీనాథ భట్టారకులటు అహమహమికతో అహోపురుషికతో వాదాస్త్ర ప్రయోగ సంసిద్ధులైనారు. శ్రీ విజయనగర సార్వభౌములు చిర్నగవుతో సభ ప్రారంభించండన్నారు.

శ్రీ విరోధికృన్నామ సంవత్సర వైశాఖ బహుళ పంచమి తిథిలో నేడు వాద సభ ముగియనుంది. ఇది, విక్రమ శకం, 1488. శాలివాహన శకం 1353వ వసంతం క్రీ.శ.1431. ఈ విద్వత్కవుల వాదసభ, ప్రారంభించి నేటితో నలభై రోజులు. ఈ సదస్సు చైత్ర శుద్ధ దశమినాడు వాగ్వాదాలతో ప్రారంభమైంది. శ్రీ విజయనగరాస్థాన విద్యాధికారుల ప్రతిభా పాటవాలకు ప్రతీక ఈ కంచు ఢక్క. దీనిని కైవసం చేసికొన్న నాటి నుండే అరుణగిరినాథులే డిండిమభట్టుగా ప్రసిద్ధిచెంది, కీర్తిసౌరభాలను దశదిశలా విరజిమ్మారు. మరి, శ్రీనాథ భట్టు వాగ్ధాటి, పాండిత్య ప్రతిభ మీరు వింటున్నారు. భట్టులిద్దఱూ దిట్టలే. లబ్ధప్రతిష్ఠులే. ఇద్దఱూ ఉద్భటులే! ఉద్భట వివాదాలే! కావ్యాలంకారాద్యనేక శాస్త్రాల వివాదమే, ఉద్భట వివాదమని పండిత మండలికి తెలిసిన విషయమే! శాస్త్ర వాదాలలో పటిమగల వారు ఉద్భటులు. వీరి వివాదం విద్వాంసులకు వీనులవిందు. వీరి గుఱించి ఎంత చెప్పినా తక్కువే.

వేద వేదాంతాలు, ఉపవేదాలు, వేదాంగాలు, ఆరణ్యకాలు, బ్రాహ్మణాలు, షోడశ దర్శనాలు, శ్రవణ మనన నిధిధ్యాసా ప్రస్థాన త్రయం, స్మృతులు, పురాణాదులు,

వ్యాకరణాంశాలు, మంత్ర స్వరూప స్వభావాలు, చతుష్షష్టి కళా స్వరూప రహస్యాలు, గీత, సంగీతాలు, ఆచార్యత్రయభాష్యాలు, నాట్యశాస్త్రమర్మాలు, తార్తీయశాస్త్ర రహస్యాలు, సాహిత్య శాస్త్రాంతర్గత ధ్వని విశేషాలు, శబ్దార్థాలంకార సౌందర్యాలు, కావ్య ప్రయోజనాలు, అశ్వ, గజ, అక్ష వృక్ష పక్షి ఉష్ట్ర జంతుజాల విశేషాలు, నీతిమంత్రరత్న శకున జ్యోతిష శిల్పసాముద్రి కాద్యనేక శాస్త్రహృదయాలు వీరి వాదాలలో చోటుచేసికొనుట విజ్ఞులకు వీనుల విందు.

శ్రీనాథుని ప్రత్యర్థియౌ అరుణగిరినాథుల పూర్వీకులు ప్రపథమంలో గంగాతటవాసులు, గౌడవంశోద్భవులు. వీరు, శాలిశకం 1272లో జన్మించారు. అంటే క్రీ.శ.1350, - వికృతినామ సంవత్సరం వీరు కాశీ పండితులు మరి శ్రీనాథ కవి కాల్పట్టణంలో శా.శ.1282 జన్మించారు. అంటే క్రీ.శ.1360, శార్వరినామ సంవత్సరం, వీరు, అధ్వర్యుశాఖాధీతి నిష్ణాతులు, అఖిల వేదసాగర సాంయాత్రికులు, తెలుగు భాషామతల్లిని అందలమెక్కించి, భారత దేశమందలి ముఖ్య నగరాలలో యూరేగించి **"దేశ భాషలందు తెలుగు లెస్స"**యని ఎలుగెత్తి చాటిన **యాంధ్ర భాషోద్ధారకులు.** వీరిద్దరి ఉద్భట వివాదాలు, నేటితో పూర్తి అయిన తర్వాత తీర్పు చెప్పటం జరుగుతుంది.

"ఆత్మతత్వ" విమర్శయే నేటి వివాదాంశమన్నారు, ధర్మపీఠాధ్యక్షులు.

ఓం దే వీం వా చ మజన యంత దేవాస్తాం విశ్వరూపాః పశవోవదంతి సానో మంద్రేష మూర్జం దుహానా ధేనుర్వాగస్మానుపసుష్టు తైతు ॥ అని సరస్వతీ సూక్తం లోని మంత్రాన్ని అరుణగిరినాథులు పఠించారు. సరస్వతీ దేవికి నమస్కరించారు.

ఓం ప్రణోదేవీ సరస్వతీ వాజేభిః వాజి నీ వతీ ధీనామ వి్త్ర్యవతు - అని శ్రీనాథ సత్కవి సరస్వతీ సూక్తం స్మరించి, నమస్కరించాడు. సభా సరస్వతిని సంభావించారు.

సభకు నమస్కారం చేసి, ధర్మపీఠాధ్యక్షులకు దోయిలించి, రాయలనభినందించి, ముత్యాలశాలకు మ్రొక్కి, కంచు ఢక్కకు మంగళంబు పలికి, మహావాక్య విచారణ ప్రారంభించారు, అరుణగిరినాథులు. చతుర్వేదాలలోను 1008 మహావాక్యాలున్నాయి. ఇందు 38 మహావాక్యాలు దేవునికి, బ్రహ్మకు గల సంబంధం అభేదాన్నే తెలియజేస్తున్నాయి. కొన్ని మిథ్యాత్వమును, సుమారుగ శతాధిక మహావాక్యాలు బ్రహ్మమొక్కటే సత్యమైనదని, మరికొన్ని భేదాన్ని బంధ మోక్షాల గురించి, మరికొన్ని జీవన్ముక్తి గురించి బోధిస్తున్నాయి. ఆచార్యత్రయం, అంతకు ముందుగ కొందఱు మహర్షులు, నాలుగు మహావాక్యాలను నాలుగు వేదాల్లోంచి గ్రహించి, మనకను గ్రహించారు. అవి ద్వైత, విశిష్టాద్వైత, అద్వైత

పరంగా ఉన్నట్లు ఆచార్యత్రయం భాష్యాలు వ్రాసి ప్రచారం చేసారు. ఇవన్నీ ఆత్మతత్త్వాన్నే వివరిస్తున్నాయి, అంటూనే మహావాక్యాలు నాల్గింటిని తెలిపి జగత్తు సత్యమని, జీవుడు సత్యమని, జీవ పరమాత్మల భిన్నత్వాన్ని, శ్రుతుల ప్రమాణాలతో నిరూపించారు - అరుణగిరినాథులు.

"జీవోమృతస్య చరతి స్వధాభిః అమర్త్యో మర్త్యేనా సయోనిః" - అని ఋగ్వేద మంత్రాన్ననుసరించి, అమర్త్యుడగు జీవుడు, మృతదేహాన్ని విడిచి స్వధలతో చరిస్తూంటాడని, జీవుడు సత్యమని చెప్తూన్నది. "సదేవసోమ్యేద మగ్ర ఆసీత్", "యతో వా ఇమాని భూతాని జాయన్తే", "ప్రియమిత్యేన దుపాసీత" - ప్రేమస్వరూపునిగా ఉపాసించాలి, "పుణ్యేన పుణ్యలోకం నయతి, పాపేన పాపం" - శ్రుతి... జీవాత్మ పుణ్యకార్యాలు చేసి మంచి జన్మలను, పాపకార్యాలు చేసి హీనజన్మలను పొందుతోంది. "సప్రాణమసృజత", ఆత్మన ఆకాశః సంభూతః... అద్భ్యః పృధివీ, పృధివ్యా ఓషధయః..." ఇత్యాదిశ్రుతులు జీవబ్రహ్మల భిన్నత్వాన్నే ప్రతిపాదిస్తున్నాయని వాదించారు.

"స ఆత్మా తత్త్వ మసి శ్వేత కేతో" - అను శ్రుతిని పరిశీలిస్తే, నీవు పరమాత్మకంటె భిన్నుడవై ఉన్నావు. పరమాత్మ కంటే జీవుడు భిన్నుడని శ్రుతులు స్పష్టంగా ప్రతిపాదిస్తున్నాయి. జీవుని దివ్యత్వాన్ని కూడ సూచిస్తున్నాయి. జీవ - బ్రహ్మల భిన్నత్వాన్ని శ్రుతులు ప్రతిపాదిస్తున్నాయి - అనడానికి ఈ మహావాక్యమే పరమ ప్రమాణమని వాదించారు, డిండిమభట్టారకులు.

శ్రీనాథ కవి నివ్వెరపడి, అరుణగిరినాథా! ఆ మహావాక్యం జీవేశ్వరుల ఐక్యత్వాన్నే ప్రతిపాదిస్తోంది. మీరు భిన్నత్వాన్నెలా ప్రతిపాదిస్తున్నారు! అన్నారు.

నేను, నా వాదాన్ని వినిపిస్తూనే ఉన్నా,పెడచెవిని పెట్టారు. శ్రుతులు భిన్నత్వాన్ని చెపుతున్నట్లు, ప్రత్యక్షమే ప్రమాణం! మీరున్నారు, నేనున్నాను, ప్రకృతి పురుషులున్నారు. ఇదంతా భిన్నత్వమే కదా!

స+ఆత్మా+అతత్+త్వం+అసి - అనియే ఛాందోగ్యశ్రుతి రహస్యం. త్వం, అతత్ అసి = నీవు ఆ పరమాత్మ కంటె భిన్నుడవై ఉన్నావు. నీవు ఆ పరమాత్మ యొక్క అధీనడవై ఉన్నావు - అని శ్రుతి హృదయం.

ఈ శ్రుతి జీవ పరమాత్మల భిన్నత్వాన్నే సూచిస్తోంది... అని వాదించే అరుణగిరినాథుల కది మిధ్యయని, రజ్జుసర్ప భ్రాంతియని పదేపదే చెప్పి, జగత్తు సత్యం కాదని శ్రీనాథ కవి అద్వైత పరంగా వాదిస్తూంటే "విశ్వం సత్యం, తదే తత్ సత్యం" -

జగత్తు సత్యమని, వేదాలు నొక్కివక్కాణిస్తూంటే, స్వతః ప్రమాణవాదులమైన మనమే విశ్వసత్యత్వాన్ని అంగీకరించకుంటే ఎలా? వేదం మనకు పరమప్రమాణం... అంటూ పరశ్శతాధిక శ్రుతులతో అరుణగిరినాథులు, శ్రీనాథ భట్టు వాదాన్ని ఖండిస్తున్నారు. మరల వీరు వారి వాదాన్ని ఖండిస్తున్నారు. వారి వాదోపవాదాలు పండిత ప్రకాండులకే శిరః కంపన కల్గిస్తున్నాయి.

స్థావర జంగమాత్మకమైన ప్రపంచమే – జగత్తు. అతిశయేన గచ్ఛతీతి జగత్ – జగత్తు సత్యం కాదు, "మాయ" – అవిద్య రెండురకాలు సత్వశుద్ధ్య. శుద్ధిభ్యాం మాయా అవిద్యేచతేమతే, అవిద్యేతిచ మాయేతి ప్రకృతిర్మల కారణం – సాత్వికమైంది మాయ. మలినమైంది అవిద్య – అని శ్రీనాథుడు వాదించాడు. 'మీయతే అనయా ఇతిమాయా' – దేని ద్వారా వస్తువులు కొలవబడునో అది మాయ. సత్యం కాని దానిని నిజమని నమ్ముతున్నారు. ఇదే అపహ్నవం. ఇదమిత్థమని నిరూపించడానికి అవకాశం లేని మిథ్య అనిర్వచనీయం. తాడునే పాములా భ్రాంతిపడినట్లు జీవుని సత్యంగా భ్రాంతి చెందటం అజ్ఞానం. ఇది మాయికమల దోషం. బ్రహ్మసత్యం. జగత్తు మిథ్య అని వాదించే శ్రీనాథ కవితో – అధిక మాసాలతో సహస్ర మాసాలు నిండిన వృద్ధత్రయీ మూర్తి ఇలా వివరించాడు. "మాయామయంవిష్ణుం" – విష్ణువు మాయామయుడు – తానే జగత్కర్త. మాయ – అంటే, "మాయావయునం జ్ఞానం" – విష్ణువు జ్ఞాని, శక్తి కలవాడు. శ్రీహరియే సృష్టికర్త. "లోకే వేదేచ ప్రథితః పురుషోత్తమః!" – అని క్షర స్వరూపుని కంటె మించిన వాడిని, జీవుని కంటె శ్రేష్ఠుడను – వేదాల్లో పురుషోత్తమునిగా ప్రసిద్ధి చెందారని గీతాస్మృతి స్పష్టం చేస్తోంది. శ్రీహరి యందు పూర్ణ భక్తితో సేవిస్తే అది అమల భక్తిగా రూపొంది ముక్తికి సాధన మౌతుందని – ఈ రహస్యాన్ని యోగ్యత కల్గిన వాడు కనుక, అర్జునకు బోధించానని, బోధవిన్న తర్వాత ఆ మనిషి, మనీషియై కృత కృత్యుడు కాగలడని భగవాను ఫలశ్రుతి అని తమ వాదాన్ని బలపరుస్తూనే,

"ఏత త్ బుద్ధ్వా బుద్ధిమాన్ స్యాత్ కృతకృత్యశ్చ భారత" – అని గీతాస్మృతి అంతేకాదు, "ఇంద్రియాణి పరాణ్యాహుః ఇంద్రియేభ్యః పరం మనః మనసస్తు పరాబుద్ధిః యోబుద్ధేః పరతస్తుసః – అని, దేహాదుల కంటె ఇంద్రియాలు, వాని కంటె మనస్సు, దాని కంటె బుద్ధి, ఒకదానికంటే మరొకటి ఉత్తరోత్తరం శ్రేష్ఠములైనవి, బుద్ధి కంటె గొప్ప వాడెవడో అతడే పురుషోత్తముడు, అతడే స్వతంత్రతత్త్వమని, శ్రీనాథ కవితో వాదించారు. వారి మాయా వాదాన్ని ఖండించారు. "పురుషాన్నపరం కించిత్, సాకాష్ఠా సా పరాగతిః –

సమస్త శ్రుతి స్మృత్యాదులు సర్వశాస్త్రాలు శ్రీహరి పురుషోత్తమత్వాన్నే ప్రతిపాదించాయి. ఈ సత్యాన్ని గ్రహించటమే ఆత్మతత్త్వం. స్వరూప సుఖానుభూతియే ముక్తి...అని, శ్రీనాథుని శ్రుతి స్మృతి ప్రమాణాలకు, శ్రుతి స్మృతి ప్రమాణాలు చూపి వారి వాదాలను ఖండించి – అరుణగిరినాథులు, జగత్తు సత్యం, పరమాత్మ సత్యం – ఇదే ఆత్మతత్త్వం – అన్నారు.

డిండిమభట్టు గారూ! జీవ బ్రహ్మలకు చంద్ర చంద్రికల వలె భేదంలేదు నామభేదమే. ఇది అవిద్యాప్రభావం. సామవేదం, "తత్త్వమసి", అధర్వణవేదం "అయమాత్మాబ్రహ్మ", యజుర్వేదం – "అహం బ్రహ్మాస్మి", ఋగ్వేదం "ప్రజ్ఞానం బ్రహ్మం అనే నాలుగు శ్రుతులు, ఆ పరమాత్మయే జీవాత్మయని బింబ ప్రతిబింబ భావంతో బోధిస్తున్నాయి. బింబమే పరమాత్మ. ఆయనే సూర్యుడు, సూర్యకిరణాలు తద్భిన్నాలుకావు కదా.

అథాతో బ్రహ్మ జిజ్ఞాసా, జన్మాద్యస్యయతః, శాస్త్ర యోనిత్వాత్, తత్తు సమన్వయాత్ – అను సూత్రాల నర్థం చేసికొని సమన్వయ బుద్ధితో యోచించాలని శ్రీనాథుడు శ్రుతులను సమన్వయం చేసి ఆత్మతత్త్వాన్ని విపులీకరించాడు. శ్రుతులే, పరమాత్మను అవాఙ్మానసగోచరుడని, నిర్గుణ పరబ్రహ్మయని చెపుతున్నాయి. "యతో వాచో నివర్తన్తే అప్రాప్యమనసా సహ, ఆనందం బ్రహ్మణోవిద్వాన్ నబిభేతి కుతశ్చన" – అనే శ్రుతులను బట్టి, నేతి నేతి వాదం వలననే ఆత్మతత్త్వం అర్థమవుతుంది.

"తత్త్వమసి" – నీవు బ్రహ్మమనియే శ్రుత్యర్థంకాని, మరొకటి కానేరదు. నీవు బ్రహ్మమై ఉన్నావు. "తత్+త్వం+అసి" – అదే ఆత్మ తత్, ఆత్మాత్వమని. ముముక్షువైన శిష్యుడు, శ్రవణ మనన ధ్యాసములను సాధనములచే, తత్త్వమసి – శ్రుతినివిని, మనన చేస్తాడు. ఏమని? "ఆయ మాత్మాబ్రహ్మ" – ఈ ఆత్మయే బ్రహ్మమని భావిస్తారు. దాంతో నిశ్చిత భావం ఏర్పడి "అహం బ్రహ్మాస్మి" – నేను బ్రహ్మనే – అని ధ్యానం చేస్తాడు. ధ్యానంలో వరిష్ఠుడు కాగానే, ఇది అంతా చైతన్యమే అను బ్రహ్మానుభవం కలగటంతో "ప్రజ్ఞానం బ్రహ్మ" – అనే దివ్యానుభూతి కల్గుతుంది. ఇది సమన్వయ బుద్ధి కర్థమవుతుంది.

"తత్త్వమసి" – అనే శ్రవణ వాక్యం, మధ్యమ పురుషలో ఉంది. "అయమాత్మాబ్రహ్మ" – అనే మనన మహా వాక్యం ప్రథమపురుషలో ఉంది. అహంబ్రహ్మాస్మి – అను ధ్యానవాక్యం ఉత్తమపురుషలో ఉంది. "ప్రజ్ఞానం బ్రహ్మ" – అనే అనుభవ మహావాక్యం ఏ పురుషలోనూ లేక అంతకీ సంబంధించి ఉంది. కనుక, ఉపనిషత్తులు బోధించు సత్యం – జీవ బ్రహ్మైక్యమే ! బ్రహ్మసత్యం, జగత్తుమిధ్య, జీవుడు వాస్తవంగా బ్రహ్మమే. నిరాకారుడైన పరమాత్మ, సాకారుడై నటునివలె మాయామయుడై అనేక రూపాలు ధరించి భిన్నరుచులు కల్గిన భక్తులందరికి

తరుణోపాయం చూపి, ముక్తుల్నిచేయుతత్త్వమిదియే, నన్నారు... శ్రీనాథభట్టు.

వేదవ్యాస విరచితములైన ముప్పది యారుపురాణాలు తిరగేస్తే తేలే సత్యం "బ్రహ్మసత్యం జగన్మిథ్యా". విష్ణుపురాణంలో, జడ భరతుని వల్ల జీవేశ్వరుల ఐక్య స్థితిని తెలిసికొన్నాడో మహారాజు. భాగవతంలో "సత్యం పరంధీమహి" – అనే ప్రారంభ శ్లోకంలో "జగత్తు మిథ్య" అని చెప్పి, చివరి శ్లోకంలో కూడ, సత్యం పరంధీమహి" అని ముగించాడు. "ఆత్మమాయావృతే రాజన్!... అని తెలిపి జీవేశ్వరులకు ఎవడు భేదం చేస్తాడో వాడిని మృత్యువు తీక్షమైన భయాన్ని కలిగిస్తుందంటాడు వ్యాసమహర్షి! వైష్ణవ మాయచే యశోద బాలకృష్ణుని నోట విశ్వం దర్శించింది. బ్రహ్మ – ఆవు దూడలను గోపబాలురను దాచేస్తే, దూడలు బాలురు తానై అన్ని ఆకారాలతో సంవత్సర కాలం గడపినాడంటే. జగన్మిథ్యాత్మతత్త్వ లక్షణమైన అద్వైతమే! అలాగే స్కాందపురాణంలో – "నజీవో జీవవత్ భాతి సాక్షాత్ బ్రహ్మైవ కేవలం" – అద్వైతం సర్వదా సత్యం భేదా భావాత్ కథంచన" – వంటివెన్నో జగన్మిథ్యాత్వాన్ని జీవేశ్వరుల అభేదాన్ని చూపుతున్నాయని, యోగవాసిష్ఠ, త్రిపురారహస్యాది గ్రంథాలలోనివి, వాల్మీకం, భారవీయం, మాఘం, వంటిఎన్నో గ్రంథాలలోనివి భాస కాళిదాసాది మహాకవుల కావ్యాలలోని మధుర ఘట్టాలనుదహరించి, అద్వైత సిద్ధాంతాన్ని స్థాపనం చేసి, ఆత్మతత్త్వాన్ని నిర్ధారించారు.

పరమాత్మ పుట్టుక కలవాడైతే అవయవాలు కలవాడై ఉండాలి కదా. అలాంటివన్నీ నశిస్తున్నాయి. కనుక, దైవం నశించేవాడవ్వాలి. ఇందుకు ఎవ్వరూ అంగీకరింపరు. నశించే దేవుని ఆశ్రయిస్తే, మనకేం ప్రయోజనం ఉండదు. కనుక దేవుడు, నిత్యుడై ఉండాలి. ఆయన అపరిచ్ఛిన్నుడు, సర్వవ్యాపకుడు. దుఃఖాలు పోగొట్టే ఆనందమయుడు కనుక, వానిని సేవించి మనమూ ఆనంద రూపులమై తరిస్తాం. కనుక దేవుడు లేని ప్రదేశమే లేదు. మరి జగత్తు ప్రత్యేక వస్తువు అయి నిత్యమైనదయితే అది ఎక్కడ నిలవడానికి అవకాశముంది? ఆయన సర్వవ్యాపకుడు కనుక, జగత్తు ఉండడానికి వేరే ప్రదేశం ఉండాలి. అలాలేదు, పోనీ జగుత్తు లేదని అందామా? ప్రత్యక్షంగా కనబడుతోంది. కనబడేది ఎలా లేదంటాం? జగత్తు వేరేగా ఉందనడానికి, వేరే ప్రదేశం లేదే! కాబట్టి దేవుడు ఉన్నచోటనే జగత్తు కూడ ఉందన్నమాట! అపుడూ రెండూ సత్యవస్తువులే అయితే ఆ రెండూ ఒకేచోట, ఒకే కాలంలో ఉండటం అసంభవం. దేవుడు నిత్యమైన వస్తువు కనుక, జగత్తు సత్యవస్తువు కాకుండా ఉండితీరాలి. అలాంటి సత్యవస్తువు కాకుండా కనబడే దానినే చెప్పేపదం – మిత్ కాబట్టి జగత్తు 'మిథ్య' అని తేలింది. స్వప్నదృష్టాంతం

వల్ల కూడ మిధ్యయని తెలిసికోవచ్చు. మేం కలలో చూచాము - అంటున్నారు. చూచేది గ్రహించేది, ఈ దేహేంద్రియాదులు మనస్సు కాక ఆత్మయే కనుక, పరమాత్మ - ప్రతి జీవునిలోని ఆత్మయని, జీవ బ్రహ్మలకు అభేదం తెలుస్తోంది.

అరుణగిరినాథా! బాగా ఆలోచించండి. ఆత్మ సగుణుడని మీరంటున్నారు. దైవమే సగుణుడే - అయితే, సగుణ శబ్దార్థం ఏమిటి? గుణంతో కూడుకొన్నవాడని కదా। ఇంటితో కూడుకొన్నవాడు ఇల్లుతాను కాడు. చొక్కా కలవాడు, తాను చొక్కాకాడు. వారు వేరుగా నున్నట్లే గుణంతో కూడుకొన్న దైవం, గుణం కాక గుణం కంటే వేరుగా ఉన్నాడు. మరి, ఆత్మ నిర్గుణుడే కదా! గుణం, నిర్గుణ వస్తువును అంటలేదు. బురద ఆకాశన్నంటు తుందంటారా? కనుక ఆత్మ సంగములేనిది నిర్గుణుడు పరమాత్మ. గ్రంథాల్లో కనబడే సగుణ వర్ణనలన్నీ సామాన్యుల కొఱకే కవులచే కల్పింపబడినవి. వ్యాహారిక సత్యమేకాని, పారమార్థిక సత్యం కాదు. అరుణగిరినాథా! ద్వైతమనే శబ్దం - యుక్తికి నిలబడలేదు. ద్వైతం - అంటే రెండుగా ఉండటం. రెండింటికి బేధం కొంచెమున్నా అంటాం. ఆ భేదం ఎపుడూ ఉంటుంది. అంటే రెండు వస్తువులు ఉన్నప్పుడే భేదం - అనే శబ్దం ప్రయోగించాలి కాని, రెండు వస్తువులు లేనప్పుడు కాదు కదా! ఉంటేనే భేదం - ఇట అన్యోన్యాశ్రయ దోషం - కనబడుతోంది కనుక, శబ్దం యుక్తికి నిలవటం లేదనాలి. "ద్వే ఇతే గతే యస్మిన్ తత్ ద్వీతం, ద్వీతమేవ ద్వైతం" - అనువ్యుత్పత్తిని చూస్తే అద్వైతమే!

స్వప్నంలో ఇంద్రియాలు పనిచేయవు. మనస్సు పనిచేస్తోంది. కనుక కలలు కంటున్నాం. సుషుప్తిలో మనస్సు పనిచేయదు. జగత్తు కనబడదు. కాబట్టి మనస్సు ఉన్నపుడే జగత్తు కనబడుతోంది. లేనప్పుడు లేదు. "యత్ సత్త్వేయత్ సత్త యద భావే యద భావః" - అను న్యాయాన్ననుసరించి, జగత్తంతా కల్పితమని మనః కల్పిత మంతా మిధ్యయని అది సత్యం కాదని తేలుతోంది.

కలలో కాంతి చూస్తాం. ఆ వెలుతురు బయట కనబడదు. కలలో కనబడే ఆ కాంతి ఆత్మతేజస్సే! అదే స్వయం ప్రకాశమై సుషుప్తిలో ఆత్మానందాన్నిస్తోంది. ఆ స్థితిలో కనబడని జగత్తు - ఆదావంతేచ యన్నాస్తి వర్తమానేన తత్తథా" అను న్యాయానుసారం, వాస్తవంగాలేని కలల ప్రపంచం - "మిధ్య"గా స్పష్టమౌతోంది కదా!

జాగ్రత్ స్వప్న సుషుప్త్యావస్థలలోని దృశ్యాలు - తురీయాస్థలో కనబడవు. ఆ సమాధి స్థితిలో, జీవుడు - సచ్చిదానంద స్థితిలో ఉంటాడు. జీవుడు - ఈ నాలుగు అవస్థలలోను నిర్వికారుడే కాని, అవస్థలు మారుతున్నా, అవి సత్యాలు కాక మిధ్యలుగ భాసిస్తూ, మార్పులు

లేకుండా భాసించేది ఆత్మ ఒక్కటేనని అది నిత్యమని, జగత్తు మిధ్య అని, జీవుడు బ్రహ్మ కన్న భిన్నుడు కాడని – ఆత్మ తత్త్వమిదేని చెప్పి తీరాలి. కనుక, బ్రహ్మసత్యం, **జగన్మిధ్యా జీవో బ్రహ్మైవ నా పరః"** – అను అద్వైత సిద్ధాంతరీత్యా **ఆ బ్రహ్మవు నీవే** – "ఆత్మాతత్త్వమసి" – అని శ్రీనాథుడు, పరపక్షాన్ని ఖండించి స్వపక్షాన్ని స్థాపించాడు. ఆధ్యాత్మిక రస రిరంసువులు కరతాళ ధ్వనులు చేసారు.

ముత్యాలశాల మురిసింది. సుమవృష్టి కురిసింది. ఆనంద సుమం విరిసింది. శ్రీ చంద్ర భూష క్రియా శక్తి రాయల ముఖారవిందం నుండి సుశ్లోక సౌరభం వ్యాపించింది.

శ్లో॥ అసినా "తత్త్వ మసి"నా, పరజీవ ప్రభేదినా ।
అరుణగిరి శిఖరం, శ్రీనాథ కవిరచ్ఛినత్ ॥

"తత్త్వమసి" – అనే ఈ పదునైన ఖడ్గంచే, అరుణగిరి శిఖరాన్ని శ్రీనాథ సుకవి నరకి వేసినాడని, సభాసదులు హై హై శ్రీనాథా!, హై హై హై "కవిసార్వభౌమ" శ్రీనాథా !! – అని పండిత పరమహంసలు, పల్కుతుంటే, సదస్యులు తమ అంగీకారాన్ని చిరునగవుల నందించిన రాయలవారికి జేజేలు పలికారు.

శ్రీ విజయనగర సామ్రాజ్య సార్వభౌముల హస్త సంజ్ఞాదర లీలచే మహామంత్రి శ్రీ చామనామాత్యులవారిలా అన్నారు:– శ్రీ విజయనగర ప్రజలకు ముత్యాలశాలలో నలభై రోజల నుండి జరిగిన కవుల వాదసభకు విచ్చేసిన కవిపండితులకు, సాహితీ ప్రియంభావుకులకు, కళాకారులకు, వారు వీరననేల అందరకు మా అభినందనలు, విజయనగరాస్థాన కవిపండితులైన విద్యాధికారి అరుణగిరినాథులకు, రాజ కులగురుబ్రహ్మలకు ప్రత్యేక ప్రమాణాలు. సదస్సు నందు పాల్గొనిన వారందరినీ నగరాభివృద్ధి మంత్రిణి శ్రీమతి విజయలక్ష్మి గారు ముత్యాల జరీ కల్గిన పట్టు వస్త్రాలతో సత్కరిస్తారు. వరహాలతో పండిత కవుల్ని సన్మానిస్తాం.

శ్రీనాథ కవిరాజు దేశ దేశాలు పర్యటించి, "దేశ భాషలందు తెలుగు లెస్స"యని చాటిచెప్పి, మన ముత్యాలశాలలో నలభై రోజులపాటు, మన విద్యాధికారులతో వాదించి, తమ వాద పటిమ చూపి మనలను మెప్పించి, తెలుగు భాషలోని మాధుర్యాన్ని తమ గద్యపద్య విద్యలచే చవిచూపినందులకు వారిని అభినందిస్తున్నాం. పుణ్యస్త్రీలు గౌరవింపబడే సమాజమే అభివృద్ధి చెందుతుందని, "సత్యమేవ జయతే" – అని పల్కి, పరమత సహనం జాతీయ సమైక్యతాభావాలు, దేశభక్తి కల్గి మాతృభాషానురక్తి ఉండాలని బోధిస్తూ, సేవాభావాన్ని తాము ఆచరించి చూపుతూ, స్వధర్మాచరణ సుమసౌరభాల్ని వెదజల్లుతూ,

తెలుగుభాషా వ్యాప్తికై అహర్నిశలు కృషి చేయు మహా తపస్వి, వర్చస్వి, మనస్వి, యశస్వి, శ్రీనాథసత్కవి. వారి రాకచే దక్షిణాధీశు ముత్యాలశాల_ధన్యమైనది. ఈ నలభై రోజుల నుండి జరిగిన ఈ వాద సభలలో వాది ప్రతివాదులైన శ్రీనాథ, అరుణగిరినాథులు కవితా ప్రతిభలో గాని, పాండిత్యంలో గాని, ఒకరి కొకరు తీసి పోవు వారు కారని మా అభిప్రాయం. వారల ఉద్భట వివాద ప్రౌఢి మనందరికి ఉత్కంఠ కల్గించింది. ఈ విషయంలో, ప్రాడ్వివాక వరేణ్యులు, శ్రీ విజయనగర రాజకులగురుబ్రహ్మలు, శ్రుతి స్వరూపులైన ధర్మపీఠాధ్యక్షులు శ్రీ చంద్ర భూషక్రియా శక్తిరాయల వారు తీర్పు చెప్పవలసినదిగా కోరుతున్నాం. వారి తీర్పు శిరోధార్యం. శ్రద్ధగా విందాం, అన్న వెంటనే, ధర్మపీఠాధ్యక్షులు, రాయలవారి వైపు చూసి, వారినాశీర్వదించి, వారి అనుమతిని పొంది, తమ తీర్పు వినిపించారు.

సదస్సుకునమస్సులు. శ్రీనాథ భట్టు, డిండిమభట్టులు వాది ప్రతివాదులు. ఇరువురి వాదోపవాదాలు నలభై రోజుల నుండి శ్రద్ధగా విన్నాం! కవుల వాదనలు రాయలవారికి, అంతఃపురానికి, మహిళామతల్లులకు మనకు వేడుక కలిగించాయి. మరింతగా జ్ఞానోపదేశం చేసాయి. వారుభయులు, ఉద్భటులే! వివాద ప్రౌఢిలో శ్రీనాథునిదే పైచేయి. వీరు, వేదములనంతములని శ్రుతి ప్రమాణం చూపారు. తల్లికే అగ్రతాంబూలము నందించారు. విశ్వశ్రేయస్సు కోరి కావ్యాలు రచించాలని, సచ్ఛీలురై తాము రచించినవి చూపారు. సాహిత్య శాస్త్ర సింధువుని మధించి రసామృతాన్ని అందించారు. శబ్దాలంకార సౌందర్యాన్ని శ్రవణానందం గావించారు. తెలుగు కవిత్వంలోని మాధుర్యాన్ని చవిచూపారు. మానవుని లక్ష్యం మోక్షం - అందుకు - అర్థకామాలను ధర్మంతో ఆచరించి తరించాలన్నారు. బ్రహ్మసత్యం, జగత్తుమిధ్య - అనే సత్యాన్ని నిరూపించి, తత్త్వామృతము నందించి విబుధ శ్రీనాథులయ్యారు. వారి "మానసోల్లాసమ్" - అను సంస్కృత మహా కావ్యాన్ని పరిశీలించి పండిత పరిషత్తు, అది నిర్దుష్టమైనదని యోగ్యతా పత్రమందజేయుటయేగాక, మన విద్యాధికారులే సమ్మతించారు. వాద ప్రతివాదనలు పండిత మండలి, మీరు విన్నారు స్వతః ప్రమాణమైన శ్రుతి ప్రమాణాన్ననుసరించి వాదించి, తమ ఉద్భట వివాద ప్రౌఢిచే మించిన శ్రీనాథ సత్కవులకే విజయమని, ధర్మాసనం నిర్ణయించినది. వాదారంభంలో ఉభయ వాదులు కావించుకొనిన ప్రతిజ్ఞాపణముల ననుసరించి, శ్రీ విజయనగర విద్యాధికారులగు అరుణగిరినాథులు, తమ కంచుఢక్కను వారే తమ స్వహస్తాలతో పగులగొట్టాలి. వారి "కవిసార్వభౌమ", "అష్టభాషాపరమేశ్వర" ఇత్యాది బిరుదములు నేటి నుండి శ్రీనాథ కవులకే చెల్లును. శ్రీనాథ మహాకవి కవిత్వము, అంధ్రులకొక మధురాతి

మధుభావ సమన్వితమైన పవిత్రస్రవంతి, ఉద్భట వివాదప్రౌఢికి మేలు బంతి ॥

శ్రీనాథుడు, తెలుగు జాతీయ మహాకవి ! తెలుగు వెలుగులనందించు **విశ్వసుకవి.** శ్రీనాథ సత్కవి అప్రతిమాన ప్రతిభను గుర్తించి, ఈ విజయపత్రిక శ్రీనాథ భట్టునకు, శ్రీ విజయనగర సామ్రాజ్యసార్వభౌములే, శ్రీ విరోధికృన్నామ సంవత్సర వైశాఖ బహుళ పంచమి తిథి నాడు, శాలి శకవత్సరం 1353, క్రీ.శ.1431వ వసంతమున ఈ ముత్యాలశాలలో అందజేయుదురని ధర్మాసనము తీర్పు చెప్పడమైనది... అని, తమ తీర్పు చదివి వినిపించిన విజయపత్రికపై, రాజకులగురు బ్రహ్మలు చేవ్రాలు చేసి, ప్రభువుల కందజేసారు. వారు, చేవ్రాలు చేసారు. సదస్యుల కరతాళధ్వనుల మధ్య, శ్రౌతి గారి శ్రుత్యాశీర్వచనాలతో, మంగళ వాయిద్యాలు మ్రోగుతుంటే, పండితుల సమక్షంలో ముత్యాలశాలలో, మంచి ముత్యాలహారాలు మహామాత్యులే తీసికొనిరాగా, మంచి గంధమలంది, నుదుట కస్తూరి తిలకందిద్ది, పచ్చ కర్పూరపు పొడి చల్లి, ముత్యాలహారాలు మెడలో వేసి, పట్టు పీతాంబరాలు పెట్టి, "కవిసార్వభౌమ" బిరుదపత్రాన్ని, రాజముద్రిక నిడిన విజయ పత్రికను శ్రీనాథుని చేత పెట్టి, రాయలు నమస్కరించారు. "శతమానం భవతి శతాయుః పురుషః శతేంద్రియ ఆయుష్యేవేంద్రియే ప్రతి తిష్ఠతి" – అని వైదికాశీస్సులతో మౌక్తికాక్షతలు చక్రవర్తి శిరస్సుపై చల్లి హ్లాదిని దీవించారు. తండ్రిని మించిన తనయుడని ఖ్యాతిగొన్న కులపతి రాజనాథుడు, శ్రీనాథుని అప్రతిమాన ప్రతిభను ప్రకటించిన ప్రాడ్వివాక వరేణ్యుడని, ధర్మ పీఠాధ్యక్షులు రాయల సన్నిధిలో కొనియాడారు.

హ్రీతముఖులైన అరుణగిరినాథులు, సువర్ణ పత్రములపై లిఖింపబడిన తన బిరుదములు గల పత్రాలను, శ్రీనాథ కవి చేతికి అందజేస్తూంటే, తీసికోలేదు పైగా, ప్రభూ! అరుణగిరినాథులు, నాకన్నను పదేళ్ళు పెద్దవారు. వయోవృద్ధులు, జ్ఞాన వృద్ధులు, అనుభవ వృద్ధులు. ఈ వృద్ధ త్రయీమూర్తి బిరుదములు వారికి తగినవే! వాదబలము కన్న, వాది బలమువిన్నయని తమకు తెలియనిది కాదు. శ్రుతి శారద నన్ను కటాక్షించినది. పైగా అదృష్టం నన్నే వరించినది. గురుశిష్యులుంటేనే విద్య రాణిస్తుంది. తల్లిదండ్రులుంటేనే బిడ్డలు, "ఆత్మావై పుత్రనామాసి" – అను శ్రుతి రహస్యం, ప్రభువులగు మీకు, కులగురు బ్రహ్మలకు తెలియని సత్యం కాదు. రెండు, అనే భావం లేకుంటే, ప్రభువు – సేవకుడు ఒక్కడే అవుతారు. ఇదే ద్వైతం. ఇద్దరిలో ఉన్న దైవం ఒక్కడే అనుభావనయే విశిష్టాద్వైతం. ఒక్కడేనన్నది సత్యం. ఇదే అద్వైతం. ఈ భావనకు ద్వైత విశిష్టాద్వైతాద్వైతాలు సోపానాలు. బ్రహ్మసత్యం, జగత్‌మిధ్యా, జీవోబ్రహ్మైవనాపరః – అనే సత్యాన్ని తెలిసికోవాలంటే,

అరుణగిరినాథుల వాదం మూలాధారం కదా ప్రభూ! వారు వాదించడం వలననే నా కీ విజయపతాక లభించింది. ఈ సమున్నతికి కారణభూతులు, అరుణగిరినాథులే! వారి బిరుదాలు వారినే వరించేలా, మీరే అనుమతివ్వాలని కోరుతున్నాను! అని వినయంగా నివేదించిన శ్రీనాథుని ఆంతర్యాన్ని అర్థం చేసికొన్న ప్రభువులు – శ్రీనాథా! మీ మాటలు, మా ముత్యాలశాలకే మంచి ముత్యాలహారాలు! మీ ఇద్దఱి యందును మాకు, మరింత గౌరవం పెరిగింది. మీ ఉభయుల వాదనలు, శారదాదేవి దరహాస చంద్రికలు, శ్రీ అరుణగిరినాథుల, డిండిమభట్టు బిరుదాన్ని, కవిసార్వభౌమబిరుదాన్ని వారికి స్థిరపరస్తున్నాం. మీరుభయులూ సత్కవి సార్వభౌములే! అని చక్రవర్తులు ప్రకటించటంతో వారి తీర్పునకు సదస్యులు జోహార్లర్పించారు. శ్రీనాథుడు, వృద్ధత్రయీమూర్తులైన శ్రీ ముమ్మకవీంద్రులకు, శ్రీ చంద్రభూష క్రియాశక్తి రాయలవారికి, శ్రీ "గౌడ డిండిమభట్టు" అరుణగిరినాథ కవిసార్వభౌముల వారి పాద పద్మములకు ప్రణామాలు చేసి, వారి మహదాశీస్సులనంది, సుశ్లోకించారు.

కులపతి రాజనాథుని ఆనతిపై, కంచుఢక్క ముత్యాలశాల వేదిక నలంకరించింది. ఆ కంచుఢక్కను, ఓరగంట చూచిన అరుణగిరనాథులు, శ్రీనాథ కవితో – కవి సార్వభౌమ శ్రీనాథా! ఈ కంచు ఢక్కయే మాలో లేని, అహంకారాన్ని పెంచింది. దానికి అధికార ఘృత ధార పడ్డంతో కామాగ్ని జ్వాలలు ఎగసిపడ్డాయి. దాంతో క్రోధ ధూమం వ్యాపించి కనులు కప్పేసింది. కోరికలే సర్వానర్థాలకు మూలమని తెలిసే లోపున వృద్ధాప్యం ముగిసిపోతున్నది... అని భాష్పసలిల నేత్రాలతో, నొచ్చుకొని, శ్రీనాథుని గాత్రాన్ని గ్రచ్చుకొని మెచ్చుకొన్నారు. మా అహంకారానికి మూలకారణమైన ఈ కంచుఢక్కముక్కలైన గాని అహంకారం చెక్కలవదుకదా... అని పలికి, ప్రతిజ్ఞా నిర్వహణకై ప్రభువుల యనుమతిని కోరుతున్నానని, యా సహస్ర మాస జీవి కోరటంతో, రాయల వారనుమతించారు. ధర్మపీఠం తీర్పును గౌరవించిన రాయలవారికి కృతజ్ఞతా పూర్వకాభినందనల నందించి డిండిమభట్టారకులే, స్వహస్తాలతో డిండిమాన్ని పగులగొట్టారు. గౌడ డిండిమభట్టు కంచుఢక్క చెక్కముక్కలవటంతో, అహంకారం పటాపంచలైంది. గౌడ డిండిమభట్టు కంచుఢక్క ముక్కలను, శ్రీనాథుని యనుమతితో, ముత్యాలశాల భాండాగారంలో భద్రపరచారు. సభావేదికపై పవిత్రమైన కంచుఢక్క ముక్కలు కావటం, చేత, అశౌచనివృత్తికై గోమయంచే శుద్ధి చేయించి, గణపతి పూజచేసి, పుణ్యాహవాచనోదకాల్నిజల్లిన శ్రౌతి గారు, ఛాత్రులచే పవిత్రోదకాన్ని సదస్యులపై జల్లించి, శాంతిమంత్రాలు పఠించి,

ఆశీర్వదించారు. భట్టారకులిద్దఱు, ఆచమించి, మన్యుసూక్తం పఠించారు. శ్రౌతి – "బ్రహ్మణే బ్రాహ్మణ మాలభతే, క్షత్రాయ రాజన్యమ్"... అంటూ, సున్నాల పన్నం వల్లించారు. మంత్రోదకాలను సంప్రోక్షించాక, చెంత చేరిన రాజనాధుడు, శ్రీనాథ సత్కవి సార్వభౌమా! అహంకార పూరిత కంచుఢక్కను వదలించినందులకు మా తాత పాదులును మేమును కృతజ్ఞులము. మీ వైదుష్యానికి నమోవాకములని, పాదాభివందనం చేశాడు. విద్వజ్జన పరిశ్రమ, విద్వాంసునికే తెలుస్తుంది. ప్రసవ వేదన వంధ్యకు తెలియదు కదా. కనుక, నీవును విద్వాంసుడవే, ఏడేళ్ళ చినవాడివి కదా! ... అని శ్రీనాధుడు, రాజనాధుని శ్లాఘించాడు, సరిగ్గా చెప్పారు, 49 ఏళ్ళ వాడినే. మీరు దైవజ్ఞులని శ్లాఘించాడు. రాయలవారనుమతితో, అంతా భోజనశాలలకు బయలుదేరారు. రేపు సాయంత్రం ఈ ముత్యాలశాలలో శ్రీనాథునితో సాహిత్య గోష్ఠి నిర్వహిస్తారని, అందరికీ, స్వాగతమని పల్కిన నిర్వాహకులు శాంతి మంత్రం పఠించారు. ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః

ముత్యాలశాల, వేదనాదాలతో సంగీత గానాలతో కవిపండిత సంవాదాలతో మంగళ వాయిద్యాలతో శ్రీనాథుని విజయగాధను నెమరువేసికొంటూ, మగువల ముసిముసి నగవుల మురిసింది. రసభోజ్యమైన శ్రీనాథుని కవితా సామ్రాజ్యం దిగంతాల నొరసింది శ్రీనాథుని రమణీయ సాహిత్య శాస్త్ర వైభవ శ్రీ, గీర్వాణాంధ్ర ప్రియంభావుకుల హృదంతరాల మెరసింది. శ్రీనాథుని సత్కీర్తి కోరకం, ముత్యాలశాలలో విరిసింది. శ్రీనాథావజితికి అవచి కర్పూర పరాగవృష్టి **కురిసింది**. శ్రీనాథుని విజయవాద నదీ తరంగ ఘోష విబుధ లోకాన ఒరసింది.

ముత్యాలశాల, సాహితీ మూర్తుల ముసి ముసి నవ్వులతో, కీరవాణుల కిలకిల నవ్వులతో, కళాకారుల కలకల నవ్వులతో, కళ కళ లాడుతోంది. అంతేవాసి దుగ్గన్నతో శ్రీనాథుడు ముత్యాలశాలలో అడుగుపెట్టాడో లేదో తిప్పయ్యశెట్టి, తెలుంగాధీశులు, పంటమైలారురెడ్డి పట్టేసి చుట్టేసికొన్నారు. అందరూపలుకరించే వారే! అందరికీ కృతజ్ఞతాభినందనలు చెప్తూంటే, మంత్రి సామంత, పురోహితులతో వంది మాగధులుకై వారాలు చేస్తూంటే రాయలవారు, ముత్యాలశాల వేదిక పైకి వచ్చి, స్వర్ణ సింహాసనాధిష్ఠితులయ్యారు. లేచి నమస్కరించిన సదస్యులు వారి వారి స్థలాలలో కూర్చున్నారు. మహామాత్యులు లేచి, శ్రీనాథ కవిని ప్రశంసించి, డిండిమభట్టారకులకు నమస్కరించి, గురు బ్రహ్మలకు కృతజ్ఞతాంజలులు సమర్పించారు. సంగీత సాహితీ సమరాంగణ సార్వభౌములైన కర్ణాట క్షితిపాలుని ఓర్పుకు, నేర్పుకు తీర్పుకు కూర్పుకు జేజేలు పల్కి, సదస్యుల నభినందించారు.

శ్రీనాథ కవి, పెద్దలకు కేల్మోగిచి, రాయలవారికి మనఃపూర్వక పరిచర్యలు తెల్పి, "ఓం మహెూ అర్ణ స్సరస్వతీ ప్రచేతయతి కేతునా, ధియో విశ్వ విరాజతి" అని శారదను స్మరించి, - సంత్వాసించామి యజుషా ప్రజామాయుర్ధనంచ" । దీర్ఘమాయురస్తు, శాంతిరస్తు... ఆయుష్యమస్తు... ఆరోగ్యమస్తు స్వస్తి శివం కర్మాస్తు, కర్మ సమృద్ధిరస్తు.... ధన ధాన్య సమృద్ధిరస్తు... అని ఆశీర్వదించారు. ఆశీస్సుల నంది, శ్రీనాథా! మీరు రచించిన గ్రంథ కుసుమ సౌరభాల నాఘ్రాణించాలని నేడు సభను, ఏర్పాటుచేసాం. శ్రవణానందం గావింపుమన్నారు. ప్రభూ, శారదాంబకృపా కటాక్షంచే, నేటికి పన్నెండు కావ్యాలు రచించాను. తెలుగు సంస్కృతిని తెలుగుభాష ద్వారా ప్రజలకందజేసి, వారి అభ్యుదయాన్ని కోరుతున్నాను. నిరాశ్రయాన శోభన్తే పండితాః వనితాలతా - అనిన ఆర్యోక్తి ననుసరించి, పండితులు, వనిత, లత ఆశ్రయం లేకపోతే రాణించవని తలచి, తమ వంటి రాజులనాశ్రయించి, తెలుగు భాషామతల్లి ఋణం తీర్చుకొంటున్నాను. భాష, అభివృద్ధి చెందాలంటే వారి ఆటలు, పాటలు, వంటలు, వార్పులు, చేతలు, కట్టు, బొట్టు, జుట్టు, జానపదకళలు, ఒకటేమిటి వారికి సంబంధించినవన్నీ అభివృద్ధి చెందినపుడే భాషాభివృద్ధి. అందుకే వాటినన్నింటిని నా కావ్యాలద్వారా, తెలియజేస్తూ యధాశక్తి మంచి మార్గంలో శ్రౌతినై తమ వంటి వారి అండదండలతో జీవన యాత్ర సాగిస్తూ ఏడు దశాబ్దాలు గడపాను. తమరు నిర్మించిన ఈ ముత్యాలశాలలో నలభై రోజులు వాదించే అదృష్టాన్ని తమరు కల్పించారు. వివాదానికైనా వివాహానికైనా సమఉజ్జీ ఉన్నపుడే రక్తి కడుతుంది. అరుణగిరినాథులతో పోటీపడటం, వాదంలో వారిని ఓడించి కంచుఢక్కను వారిచే ముక్కలు చేయించటం, మీ నుండి కవిసార్వభౌమ బిరుదాన్ని పొందడం, దేవీ కటాక్షమే! ఈ మధురాను భూతి విభూతి మరువరానిది.

కవిచేత ప్రభువు ప్రకాశిస్తాడు. ప్రభువుచేత కవి ప్రకాశిస్తాడు. ఇది లోక సహజం. కాని ఇక్కడ ముత్యాలశాల ప్రకాశిస్తోంది. ఈ సదస్సు చరిత్ర పుటల్లో సువర్ణాక్షరాలతో లిఖింపబడి, ఆ చంద్రతారార్కం ప్రకాశిస్తూనే ఉంటుంది. ఇట కవి చేత ప్రభువుచేత ఈ ముత్యాలశాలా సదస్సు శోభాయమానంగా ప్రకాశిస్తోంది. మణిచేత కంకణం ప్రకాశిస్తుంది. కంకణం చేత మణి ప్రకాశిస్తుంది. మణి, కంకణం చేత ముంజేయి ప్రకాశించినట్లే ఈ ముత్యాలశాల యశశ్చంద్రికలు విబుధలోకాన ప్రకాశిస్తాయి.

శ్లో॥ కవినాచ విభుః, విభునా చ కవిః
కవినా విభునా చ విభాతి సభా ।

మణినా వలయం వలయేన మణిః
మణినా వలయేన విభాతి కరః ॥

అను శ్లోకాన్ని శ్రీనాథుడు పఠించటంతో కవి పండితుల కరతాళధ్వనులు, ముత్యాలశాలలో ప్రతిధ్వనించాయి ప్రభూ! విద్వదౌషధమగు, శ్రీహర్ష నైషధాన్ని, "అయమస్మి" - అని నడుంబిగించి, తెలుగులో విద్వదమృతంగా ఆంధ్ర నైషధాన్నందజేసాను. నలదమయంతుల కథ వింటే కలిదోషం నశిస్తుంది. నలకీర్తనం కలినాశన మని వ్యాసమహర్షి మహాభారతంలో చెప్పారు. నలదమయంతులు పుణ్య శ్లోకులు. జీవాత్మ దమయంతి, పరమాత్మ నలమహారాజు. వీరిద్దఱిని ఐక్యం చేసింది హంస దౌత్యం. హంసయే "సోహం". హినస్తీతి సింహః - వలె సోహం, హంసగా రూపుదాల్చింది - అంటే శ్రుతిమాతయే హంస. ఈ కథ, అద్వైత సిద్ధాంతానికి ప్రతీక, ఈశ్వరార్చనకు పతాక !

ప్రభూ! మీకు, వీరికీ ఓ చక్కని కథ చెపుతా. అది వ్యాసమహర్షి "శివపురాణం" లోనిది, అది, అర్బుదాచలం. అక్కడ భిల్ల దంపతులు కాపురం చేస్తున్నారు. వారు శివభక్తులు. వారి పేర్లు ఆహుకి, ఆహుకుడు. వారిద్దఱు పరమ పుణ్యులు. వారు నిరంతరం పంచాక్షరీ మంత్రాన్నే జపిస్తూ, శుద్ధ సాత్త్వికాహారాన్నే తింటూ, శివసేవలో కాలం గడపుతున్నారు. ఓ రోజు సాయంకాల వేళ, ఆ పుణ్య దంపతుల యింటికి, ఓ మహాయోగి అటుగా వచ్చాడు. ఆ యోగి వచ్చిన సమయంలో, ఆ ఇంట్లో ఆహుకి ఒక్కతియే ఉంది. ఆమె ఆ అతిధిని గౌరవించింది. అర్ఘ్యపాద్యాలిచ్చింది. ఇంతలో ఆహుకుడు వచ్చాడు. భార్యను అభినందించాడు. ఆ దంపతులిద్దఱూ ఆ వచ్చిన యోగేశ్వరునికి ఆప్యాయంగా భోజనం పెట్టారు. తిని, నడుం వాల్చాడు. సేవలు చేసారు. ఆ సౌఖశాయినికులు, పంచాక్షరి జపిస్తున్నారు. ఇంతలో చీకటి అలముకొంది. ఆ అతిధి, ఆ రాత్రి అట నిద్రించడానికి చోటు చూపాలి. ఇంట్లో ఇద్దరికి మాత్రమే సుఖంగా పరుండటానికి చోటుంది. ఇంటిలోన ఓ ప్రక్క ఆ అతిధి నిద్రిస్తున్నాడు. ఇంటావిడ ఓ ప్రక్కనున్నది. ఇంటాయన, ఇంటి బయటనే ఉండి, రాత్రంతా జంతువులు రాకుండా కాపలాకాస్తున్నాడు. ఘాతుక మృగాలను పారద్రోలుతున్నాడు. ఏ మూలనుంచి వచ్చిందో, ఓ సింహం వానిపైపడి, చంపింది. వాడు శివైక్యం చెందాడు. భళ్లున తెలవారింది. ఆమె బయటకు వచ్చి చూసింది. నిర్ఘాంతపోయిందా సాధ్వి. ఆహుకి, పంచాక్షరి జపించింది. పరమయోగినియై ప్రాణం వదలింది. ఆ యోగి చకచ్చకితుడయ్యాడు. ఆమె పతి భక్తికి చలించాడు. అన్యోన్య దాంపత్యాన్ని శ్లాఘించాడు. ధర్మమూర్తుల్ని కొనియాడి, వారి అతిధి సేవకానందించి,

శివా శివులను స్మరించి దేహం చాలించాడు.

పరమశివుడు, ఆ త్రయీమూర్తుల్ని కరుణించాడు. ఆ పుణ్యదంపతులే నలదమయంతులుగాను, ఆ మహా యోగి - హంస గాను అవతరించి, వారు తరించి, తరింప జేయించినట్లు పురాణ గాథ - అని శ్రీనాథ కవి వివరిస్తూ తన వలన విడిపోయిన వారే నలదమయంతులుగా పుడితే, వారిని కలుపుటకై ఆ యోగి హంసగా పుట్టి, జీవ బ్రహ్మైక్యాన్ని చూపిన పుణ్య గాథయే నైషధమన్నాడు.

అష్టాభిర్లోక పాలానాం మాత్రాభిః నిర్మితో నృపః - అనే స్మృత్యనుసారం, ఎనమండ్రు దిక్పాలుర అంశలచే రాజు సృజింపబడతాడు. ఇంద్ర వహ్నియమ నిర్యృతి వరుణ వాయు కుబేర ఈశానులు - అష్టదిక్పాలురు. ఈశానాంశతో పుట్టిన వాడే నలమహారాజు. త్రినేత్రుని అపరావతారం ఈతని మూడవకన్ను వేదమే. నలుడు సాంగ నిఖిల వేదవేత్త, పురుషోత్తముడు.

భీమరాజు పుత్రి దమయంతి. సరస్వతియే హంస. భారతీదేవి ముంజేతి పలుకు జిలుక సబ్రహ్మచారియని వేద పురాణాది విద్యలెల్ల ఘంటా పథమని, సమస్తలోకాలు, ఆటపట్టులని దమయంతితో పలికిన హంస, నలుని గుణగణాలు చెప్పి, ఆతడే నీకు తగిన వరుడని చెప్పటంతో ఆమె అనురాగాన్ని వ్యక్తం చేసింది. నలుని నఖ చిత్రాన్ని తామరాకుపై వేసి చూపింది. నన్ను తిర్యక్ జాతి మాత్రంగా చూడకని, బ్రహ్మముఖం నుండి వచ్చిన శ్రుతిస్వరూపాన్నని తెల్పి, "నన్నుంబని గొమ్ము", ఈ శరీరం పరోపకారార్థమే నని, జ్ఞానాన్ని ఆశ్రయిస్తే ముక్తేనని పల్కింది.

నల దమయంతులు శివశక్తి స్వరూపులుగా హంస పల్కింది. ఇలా మీరు నైషధంలో చక్కగా విపులీకరించారు. మరి మూడు మతాలను, ఎలా సమన్వయం చేసారో చెప్తారా, అని కులపతి రాజనాధుడు, రాయల సన్నిధిలో ప్రశ్నించాడు.

రాజనాధా! విను. నలదమయంతులు - అనటంచే ద్వైతం కనబడుతోంది. ఇద్దరు కలరు కదా! వారిని లక్ష్మీనారాయణులతో పోల్చటంతో విశిష్టాద్వైతం సూచింపబడింది. మరి గౌరీవృషభాంకుల పట్టునంబోలె మీ యెడ పరస్పర యోగ్య సమాగమంబునకుం పొల్పడునని చెప్పడంలోనే వారే వీరను అద్వైతభావాన్ని వ్యక్తం చేసి, ఇది చక్రఘోషమున వింటినని హంసచే చెప్పించాను. ఇది చక్రసూక్త రహస్యం. ఇలా శ్రుతి రహస్యాన్ని వివరించానన్నారు.

దిక్పతులు పంపగా వచ్చిన రాయబారి నలుడు. తిరస్కరణీ విద్యాప్రభావంచే ఎవరికీ

కనబడకుండా, దమయంతి అంతఃపురంలో ప్రవేశించి, ఆమెకు కనపడ్డాడు. ఆమె అతిధి మర్యాదచేసింది. దేవరహస్యం చెప్పాలి, వింత వారలు లేరు కదా! ఉన్నవారు మనవారేనా? అన్నాడు. అమరపతిని వరిస్తావా! అగ్నిదేవునినా? శమను నినా? వరుణదేవునినా? ఇంద్ర, అగ్ని, యమ, వరుణ దేవుళ్ళలో ఒకరిని పెండ్లాడుమని వారి గుణగణాలను చెప్పించాను.

ఆతనిపేరడిగితే, తన పేరు తాను చెప్పుకోకూడ దంటాడు. అయితే అన్యపురుషులతో, అంతఃపురంలోపలి నగళులలో కుల కన్యను, రూపమహనీయులతో మాట్లాడవచ్చా! అన్నది. నయతత్త్వవిధికి ఈ మాత్రం తెలియదా? అది, కులాబలాచార సహసనాస హాతి సాహస కౌతూహలా వసధ మన్నది. ఆమె వాక్చాతుర్యానికి నలుడు, చకచ్చకితుడయ్యాడు. సమాధానం దొరక్క, నాక విభులను నాకు గానుద్ధరింపుమన్నాడు. పలుక కుంట తిరస్కారమని పల్కి, నేను నైషధేంద్రు నవశ్యంబు వరింతునన్నది. ఆతడే అంగీకరింపకుంటే – సద్భక్తిన్ అనలోద్బంధన వారి మజ్జన విధా వ్యాపార పారీణతతో నావిభునకు ప్రాణాలర్పిస్తానన్నది. నలుడు, ప్రయోగించిన సామదాన భేదోపాయాలు వ్యర్థం కావటంతో దండో పాయం ప్రయోగింపక తప్పలేదు... అని శ్రీనాథుడు చెప్తూంటే, భేదోపాయాన్ని వివరింపుమన్నారు శ్రోతలు.

ఉరి వేసికొని మరణిస్తే, ఇంద్రుడు వరిస్తాడు. అగ్నికి ఆహుతి అయ్యావా – అగ్ని దేవుని పంటపండిదన్నమాటే! సలిల ప్రవేశంచేశావా, వరుణుని పుణ్యం ఫలిస్తుంది. మరి నీవు, ఏవిధంగా మరణించినా యమధర్మరాజు వాంఛ నెరవేరుతుంది. ఘట్టకుటికా ప్రభాతంబు క్రమమునంది, వారిలో ఎవనినైనా పొందక తప్పదని భేదోపాయం ప్రయోగించానన్నారు.

అయినా దమయంతి నలునే వరిస్తానన్నది. దాంతో, ఈటెలలాంటి మాటలతో దండోపాయాన్ని ప్రయోగించాడు. కల్పవృక్షాన్ని, ఇంద్రుడే నిన్ను తెమ్మని కోరితే వెంటనే ఇస్తుంది. ఇలా దేవతలు నిన్ను పొందడం చాల తేలిక... కామధేనువుని కోరితే నిన్ను వారికి అందజేస్తుంది. అనే మాటలు విని ఏడ్చింది దమయంతి. దాంతో దేవ కార్యం మరచిన నలుడు, తానే నలుడనని చెప్పాడు. దమయంతి ముఖ కమలం విప్పారింది. సిగ్గు మొగ్గతొడిగింది దైవగతిదాట వచ్చునే... అన్నాడు నలుడు. ఈ విధంగా నలదమయంతుల వాక్చాతుర్యంలో తాను చెప్పిన శ్రుతి రహస్యాలను వివరించాడు. తర్వాత దమయంతీ స్వయంవరం. స్వయంవరంలో ఆ నలుగురు దేవతలు నలుని రూపాలతో వచ్చారు. ఈ అయిదుగుర్ని చూచిన దమయంతి దైవాను గ్రహంతో నలుని

మెడలో దండవేసి వివాహ మాడింది. దేవతలాశీర్వదించారు... తర్వాత అగ్నిసాక్షిగా మంగళ వాయిద్యాలు మ్రోగుతూంటే, వేదపండితులు శ్రుతులు వల్లించారు. శాస్త్రోక్తంగా కళ్యాణం జరుగుతోంది. "మాంగళ్యం తంతునానేన మమ జీవన హేతునా! కంఠే బధ్నామి సుభగే । త్వంజీవ శరదశ్శతమ్ ॥ నా జీవితానికి హేతువైన ఈ సూత్రంచే, నేను నీ కంఠాన మాంగళ్యమును కడుతున్నాను. నీవు నూరు సంవత్సరాలు సౌభాగ్యవతిగ జీవించుమని నలునిచే, బ్రహ్మగారు చెప్పించి, పెళ్ళి జరిపించారు.

నలదమయంతుల కళ్యాణ మహోత్సవాన్ని కన్నులకు కట్టినట్లు వర్ణించి వివరించిన శ్రీనాథుడు, రాయలవారి చిర్నగవులుచిన్న బోవటం గమనించాడు. "యద్భావం తద్భవతి" – కదా! నిజానికి శ్రీనాథునికి ఇంకా కొంత చింత మిగిలిఉంది.

ప్రభూ! మీ వంటి సార్వభౌముల్ని స్తోత్రం చేయాలని ఉన్నా, చేయలేని స్థితిలో ఉన్నా! ఇంతకు ముందు ఎందరినో స్తుతించాను. కాని వారితో బాటుగ కొంతమంది కున్నృపులను స్తోత్రం చేసి, నా వాణి దోషభూయిష్ఠమైంది. ఇపుడు కనకాభిషేకం జరిపినచో నా వాణి, దోషరహిత కాగలదు. అప్పుడు కాని, శ్రీ మహావిష్ణు స్వరూపుడవై అవతరించిన జననాథోత్తముడవగు నిన్ను పొగడలేనయ్యా, అన్నాడు వినయంగా శ్రీనాథయ్య! విన్నాడా దేవయ్య! ఈ విధంగా, కర్ణాట క్షితిపాల మౌక్తిక సభాగారాంతరాకల్పిత స్వర్ణ స్నాన కుతూహలాన్ని భగ్యంతరంగా ప్రకటించిన శ్రీనాథుని ధీశక్తిని గ్రహించిన రాయలు, తమ అంగీకారాన్ని హస్త సంజ్ఞాదరలీలచే అవలీలగా ప్రకటించారు. ప్రౌఢదేవరాయల ఆస్థానం ఆశ్చర్యపోయింది. సదస్యులు దిగ్భ్రాంతి చెందారు. అరుణగిరినాథులు, శ్రీనాథుని వాక్చాతుర్యాన్ని మనములో మెచ్చుకొన్నారు.

చామనామాత్యా! శ్రీనాథ కవిసార్వభౌముని కనకాభిషేకానికి రేపే యోగ్యమైనది. వైశాఖ బహుళ సప్తమి తిథి. రాయలవారి అభ్యుదయానికి శ్రీనాథుని యశోవికాసానికి మంచి ముహూర్తమిది – అని ఆస్థాన పురోహితులు శ్రౌతిగారనటంతో, రాయల వారలాగేనన్నారు. శుభస్య శీఘ్రమన్నారు గురుబ్రహ్మలు.

ముత్యాలశాలలో శ్రీ రాయలవారి చేతుల మీదుగా శ్రీనాథ కవికి జరుగబోయే కనకాభిషేక మహోత్సవానికి, ప్రత్యేకించి సువర్ణ ఫలకంపై "కవిసార్వభౌమ" బిరుదాన్ని చెక్కించి, రాయలవారొసంగు బిరుద ప్రదాన మహోత్సవానికి, విబుధ లోకమంత విచ్చేసి, కర్పూర కస్తూరికా తాంబూలాది సత్కారాలు పొంది, షడ్రసోపేత భోజనం చేసి, శ్రీనాథ దంపతుల నభినందించాలని, పుర ప్రముఖులందరూ తమ తమ కుటుంబాలతో

విచ్చేయాలని, రాయలవారి మాటగా వల్లభామాత్యుడు తెలిపాడు. అందరూ రాయలవారికి జయజయ ధ్వానాలు పలికారు. శాంతి మంత్రం పఠించారు.

ముత్యాలశాల, శ్రీనాథుని కనకాభిషేక మహోత్సవ వేదికగా ముస్తాబైంది.

శా.శ.1353వ వసంతం శ్రీ విరోధి కృన్నామ వత్సర వైశాఖ బహుళ సప్తమి క్రీ.శ.1431. శ్రీనాథుని బంగారులాల పండుగ కనులార చూడాలని శ్రీవిజయనగర పుర ప్రముఖులు, కుటుంబాలతో తరలివచ్చారు. విబుధలోకం వీక్షిస్తోంది. శ్రీనాథ భట్టు సుకవీంద్రులకు కనకాభిషేకము చేయుటకై వలయు సర్వసన్నాహములు శ్రీచామనామాత్యుల వారే దగ్గరుండి నిర్వహిస్తున్నారు. ముమ్మకవీంద్రులు సహకరిస్తున్నారు. "కవిసార్వభౌమ" బిరుదాంచితులు శ్రీనాథ భట్టు అని, సువర్ణాక్షరముల చెక్కించి దాని క్రింద వరుసలో, "బిరుద ప్రదాత శ్రీ ప్రౌఢ దేవరాయలు, శ్రీ విజయనగర సామ్రాజ్య చక్రవర్తి" అని చెక్కించి, దాని క్రింద వరుసలో, శా.శ.1353, శ్రీ విరోధికృన్నామవత్సర వైశాఖ బహుళ సప్తమి అని తయారు చేయించిన సువర్ణ ఫలకాన్ని, బిరుదాంచిత స్వర్ణ పతకాన్ని తీసికొని వల్లభామాత్యులు, ముత్యాలశాలకు వేంచేసారు. శ్రీ విజయనగరాభివృద్ధి మంత్రిణి, మెరుంగుల పిండులా తరలివచ్చే రమణులచే కుంకుమ కస్తూరి కర్పూరం మంచి గంధం గులాబీపూలు, రకరకాల పూలతో తీర్చిదిద్దిన దండలు, కర్పూర తాంబూలాలు, పట్టు పీతాంబరాలు అరటిపళ్ళు, కొబ్బరి కాయలు మొదలైన పూజాద్రవ్యాలతో వచ్చారు. దీనారాల చేత, టంకాల చేత నింపబడిన బంగారు నాణెములు గల బిందెలను తీసికొని వచ్చు కాంతలతో కులపతి రాజనాధుడు ముత్యాలశాలలో ప్రవేశించాడు. స్వర్ణ పాత్రలనిండా బంగారు నాణెములే! వాటి తళతళలు చూచి సంబరుపడ్డారు సదస్యులు. ముత్యాలశాల వేదికపై కనకాభిషేకం చేయటానికై మంచి ముత్యాలచే అలంకరింపబడిన మౌక్తిక స్వర్ణాసనం సిద్ధం చేయబడింది. ఆ పవిత్రాసనంపై వజ్రాలతో తాపడం చేయబడిన "ఆనంది" అను పేరున్నది. ఆ "ఆనంది" ముద్దొస్తోంది.

మంగళవాయిద్యాలు మార్మోగుతున్నాయి. ఢక్కలు, మురజులు, డంకాలు, కాహళులు, బాజాలు, భజంత్రీలు, డోళ్ళు, తమ్మటలు, కంచుమద్దెళ్ళు మున్నగు వాద్యవిశేషాలరావాలు శ్రవణానందంగా వినపడుతూంటే, పునుగు జవ్వాది కస్తూరి సువాసలు గుప్పుమంటూంటే వేదపండితులు శ్రుతి సూక్తాలు వల్లెవేస్తుంటే, పూర్ణ కుంభంతో బ్రహ్మశ్రీ శ్రౌతి గారు ఎదురేగి మదపుటేనుగు అంబారీ నుండి ముత్యాలశాల ముఖ ద్వారాన దిగిన రాయలకు స్వాగతం పలికారు. శిష్యసమేతంగా వచ్చిన శ్రీనాథ దంపతులను తోడ్కొని, రాయలవారు

ముత్యాల వేదికపైకి వేంచేసి, తమ నవరత్న ఖచిత స్వర్ణ సింహాసనంలో ఆశీనులయ్యారు. శ్రీనాథ చిరంటిని, స్త్రీలకు కేటాయించిన ప్రదేశానికి, అంతఃపుర స్త్రీలు తీసికొని వెళ్ళారు.

శ్రీనాథుని, అభిషేకాసనం 'ఆనంది'పై ఆశీసునులను గావించారు. శ్రీనాథ కవి, చిరునవ్వులు చిందిస్తూ పై దుకులాన్ని సరిచేసికొని పవిత్రాసనంలో పరమేశ్వరునిలా ప్రకాశిస్తున్నారు. పై దుకూలం శేషాహిలా శోభిస్తోంది. శ్వేతశిఖ, గంగాలా కదలుతూంది బ్రహ్మతేజస్సు. నుదుట మూడు విభూతి రేఖలు, మధ్య కుంకుమబొట్టు, యజ్ఞోపవీతం, ఆహా! అపర రుద్రుడులా భాసిస్తుంటే, శ్రౌతి – తనలోని శ్రుతిమూర్తికి నమస్కరించిన, శ్రీనాథుని "సత్కీర్తి ప్రాప్తిరస్తు" అని దీవించారు. శ్రీనాథునిచే సంకల్పం చేయించి, ఆది గణపతినారాధించి, వేదికపై గల అగ్నిస్థాపన ప్రదేశంలో, పునః శ్రోత్రియాగారం నుండి ఆవు పిడకపై అగ్నికణావాల నుంచి దానిపై పిడకను మూతపెట్టి తెచ్చి, తత్ ప్రదేశంలో "ఏహ్యగ్న ఇహహొూతా... అంటూ మంత్రాలను చదువుతూ ఆగ్న్యాహ్వానం చేసి అగ్నిముఖాన్ని పఠిస్తూ శ్రీనాథునిచే హొూమం చేయించారు. ఆవు నేతిలో ముంచిన సమిధలను వ్రేల్చి, టెంకాయి నివేదించి, అగ్ని నారాధించిన శ్రీనాథుడు, అగ్నికి ప్రదక్షిణలు చేసి, వేద పండితుల శ్రుత్యాశీస్సుల నంది, ఆనందిపై ఆశీనులయ్యారు. రాయలవారు, శ్రీనాథుని చెంతకేతెంచి మంచి గంధం పూసి, కస్తూరిని దుకూలమునకు వ్రాసి, నుదుట కస్తూరి తిలకందిద్ధి, పన్నీరు చిలకరించి, కర్పూరం జల్లి పళ్ళు పూలు కర్పూర తాంబూలాదుల పట్టు పీతాంబరములు చేతికిచ్చి సత్కరించారు.

మహారాజ్ఞి శ్రీనాథ కులసతి పాదాలకు పసుపు పూసి, హృదయానికి మంచి గంధమలదినది, మొదటనే నుదుట తాను కుంకుమ ధరించి, వేదపురాణ శాస్త్ర పదవీనదసీయసియైన యా పెద్దముత్తైదువ నుదుట కుంకుమబొట్టు పెట్టి, ఆ పుణ్యస్త్రీ కొప్పులో పూలదండ తురిమినంత, గంగాయమునా సంగమ తీర్థంలో అంతర్వాహినిలా నున్న పూలదండను తలచి, త్రివేణీ సంగమ తీర్థంబని యా కొప్పును తిలతండులాన్వయ శ్రీ గంగనుగ స్మరించి నమస్కరించి పట్టుచీర పట్టు రవికలతో పండ్లుపూలు స్వర్ణ కుంకుమ పేటికను కస్తూరి కాకర్పూర తాంబూల కరండములనిచ్చి సత్కరించిరి. శ్రీనాథుని తుల్యశీల, శ్రీలక్ష్మి, యామహారాజ్ఞికి సౌభాగ్యాశీస్సుల నందించిరి.

శ్రీనాథుడు, ఋగ్వేదోక్తరీత్యా అగ్నిముఖ మంత్రాలతో హొూమం చేసినందున, తెలిసీ తెలియక చేసిన పాపములనుండి విముక్తుడై, మహాపాతకముల నుండి విముక్తుడగుటకై, తుంగభద్రానదికేగి అఘమర్షణ స్నానం చేసి, పునీతుడై, రాయల వారిచ్చిన క్రొత్త

పట్టుబట్టలను ధరించి, త్రిపుండ్ర ధారియై, కస్తూరీ తిలకం ధరించి ముత్యాలశాల వేదికపైకి వచ్చి, ఆనందిపై ఆనందంగా ఆశీనుడయ్యాడు.

శ్రీనాథుని దివ్యమంగళ విగ్రహాన్ని చూచిన వారిలో కొందరు సాక్షాత్తు ఆ శంకరులే అన్నారు. మరికొందరు శ్రీ మహావిష్ణువే అన్నారు. హరిహరులొక్కటే భూపైన అవతారపురుషుడన్నారు. వేదోదిత ధర్మకర్మానుష్ఠాన పరుడైన ఆహితాగ్ని – అని అందరూ ముక్త కంఠంతో పలికారు. సాక్షాత్తు పరమశివునిలా బ్రహ్మతేజస్సుతో ప్రకాశించే శ్రీనాథ కవీశ్వరుని చెంతకేతెంచిన రాయలవారు, శ్రీనాథుని లలాట రేఖల మధ్య కస్తూరీ తిలకం దిద్దారు. కుంకుమబొట్టు పెట్టి నమస్కరించారు. శ్రౌతి గారు, వేదపండితులు – ఓం నమోభగవతేరుద్రాయ । ఓం భూర్భువస్సువః అని పల్కి, శ్రీప్రౌఢ దేవ రాయలవారి ప్రవర చెప్పించి, వారి స్వహస్తాలతో ముత్యాలశాలయందు, దక్షిణాధీశులు, భారద్వాజ బార్హస్పత్య ఆంగీరస – త్ర్యార్షేయ ప్రవరాన్విత భారద్వాజస గోత్రోద్భవులు, పుణ్యాచార భీమాంబ – విద్యారాజీవభవుడైన మారయ పుణ్య దంపతుల కుమారరత్నము, తుల్యశీలయౌ శ్రీలక్ష్మీపతి శ్రీనాథునకు శ్రీ విరోధికృన్నామ సంవత్సర మందలి ఉత్తరాయణ పుణ్యకాలంలో వసంత ఋతువు నందు వైశాఖ బహుళ సప్తమి తిథియందు దీనారటంకాల తీర్థ మాడిస్తున్నట్లు సంస్కృత భాషలో తదుక్త రీతిలో సంకల్పం చెప్పించి, దీనారాలను టంకాలను ముందుగా రాయలవారి దోసిళ్ళలో పోసి, శ్రీనాథుని శిరస్సుపై **బంగారు లాల**పోయించారు. తర్వాత **దీనారటంకాలు**గల కలశాలతో పోసి అభిషేకించారు. వేదపండితులు "నమస్తే రుద్ర మన్యవ ఉతోత ఇషవేనమః"... అంటూ నమక పారాయణ చేస్తున్నారు. శ్రౌతిగారు "ఓం నమస్తే అస్తు భగవన్, విశ్వేశ్వరాయ మహాదేవాయత్ర్యంబకాయ త్రిపురాంతకాయ త్రికాలాగ్ని కాలాయ, కాలాగ్ని రుద్రాయ నీలకంఠాయ మృత్యుంజయాయ సర్వేశ్వరాయ సదాశివాయ శ్రీమన్మహా దేవాయనమః... అంటూ నమక చమకాలతో కనకాభిషేకం చేయించారు. వరుసగా శ్రీవిజయనగర రాజ కులగురు బ్రహ్మలు, మహామంత్రి శ్రీ చామనామాత్యులు, ముమ్మసుకవీంద్రులు, చామరసుకవి, అవచితిప్పయ్యశెట్టి, డిండిమభట్టారకులు, రాజనాథుడు, శ్రీమతి విజయలక్ష్మి, సాంపరాయని తెలుంగాధీశులు, పంటమైలారురెడ్డి, వల్లభామాత్య ప్రభృతులు సువర్ణ కలశాలలోని దీనారటంకాలను, శ్రీనాథుని శిరమున పోసి, పరమేశ్వరుని అభిషేకించినట్లు భావించారు. పుర ప్రముఖులు, లబ్ధప్రతిష్ఠులైన కవిపండితులు కూడ కనకాభిషేకం చేసారు. ముత్యాలశాల మురిసింది. హర్షం వర్షించింది.

రాయలవారి, ఆధ్వర్యవంలో బంగారు నాణెములతో అభిషేకం జరగడమే కాదు, రాయలే స్వయంగా, తన ముత్యాలశాలలో దీనారటంకాల దీర్ఘమాడించిన విధివిధానాన్ని చూస్తుంటే, ఉండబట్టలేక రాయలవైపు చూచిన శ్రీనాథుడు, ప్రభూ! ఏదో మాటవరుసకు, కనకాభిషేకం చేస్తే గాని నా వాణి పవిత్రురాలు కాజాలదని అన్నాను. తమరు నిజంగానే నాయూహ కందని రీతిలో కనకాభిషేకం చేసి, నా వాణిని పవిత్రురాలిని గావించారు. నేను పలికిన మాటలు తలచుకొంటూంటే, అవి పద్యరూపాన్ని దాల్చాయి. కనక స్నానంతో పునీతమైన నా వాణి పద్యరూపాన సాక్షాత్కరించినది.

చం॥ జననాథోత్తమ ! దేవరాయనృపతీ! చక్రేశ ! శ్రీ వత్సలాం
ఛన సంకాశ ! మహాప్రభావ ! హరిరక్షాదక్ష ! నా బోటికిన్
కు నృప స్తోత్ర సముద్భవంబయిన వాగ్దోషంబు బోనాడగా
కనక స్నానము చేసి గాక పొగడంగా శక్యమే దేవరన్ !

పద్యామృతాన్ని గ్రోలిన ప్రభువులు, మహామంత్రి వైపు చూశారో లేదో, బంగారు పళ్ళెరంతో, శ్రీ విజయనగర మహామంత్రిణి, రాయల చెంతకు వచ్చారు. బ్రహ్మశ్రీ శ్రౌతి గారు, ముత్యాల అక్షతలతో దరిచేరారు. రాజ కులగురు బ్రహ్మలు శ్రీనాథుని చెంతనున్నారు. రాయలవారు, ఆ బంగరు పళ్ళెరం పైనున్న మంచిముత్యాల పట్టు వస్త్రాన్ని తొలగించారు. ధగధగ నవరత్నాలతో మెరసిపోతోంది. సదస్యులు కొన్ని క్షణాలు అనిమేషులయ్యారు. అది మౌక్తిక మకుటం. నవరత్నాలతో కూడినది. శ్రీప్రౌఢ దేవరాయలవారు శ్రీ విజయనగర సామ్రాజ్యానికి సార్వభౌములు. గీర్వాణాంధ్ర సాహిత్య ప్రపంచానికే సార్వభౌముడు, శ్రీనాథుడు - అని తలచిన రాయల భావనకు ప్రతిరూపమది! "సామ్రాజ్యం భోజ్యం స్వారాజ్యం వైరాజ్యం పారమేష్ఠిగ్ం రాజ్యం, మహారాజ్యమాధిపత్యమ్, యశస్కరం బలవంతం ప్రభుత్వం, త్వమేవ"... సుకవితా సామ్రాజ్యాధిపతిర్బభూవ ॥ అని రాజకులపురోహితులు, బ్రహ్మశ్రీ వేదమూర్తులైన శ్రౌతిగారు వేదమంత్రాలు పఠిస్తూంటే, రాయలవారు మౌక్తిక మకుటాన్ని ప్రేమతో శ్రీనాథుని శిరస్సుపై ఉంచారు. భారతదేశమందలి నదీమతల్లుల పవిత్ర జలములతో "అపోహిష్ఠామయోభువః" అను పవిత్ర జలప్రోక్షణ మంత్రాలు చదువుతూ, శ్రీనాథుని జూచి, **మౌక్తికమణి మకుటమౌళి** యని శ్లాఘించి, మౌక్తికాక్షతలు జల్లారు... పెద్దలు దీవించారు.

రాయలవారు, సువర్ణాక్షరాలతో చెక్కబడిన బిరుదముగల సువర్ణ ఫలకాన్ని శ్రీ విజయనగర రాజకులగురు బ్రహ్మలైన శ్రీ చంద్ర భూషక్రియాశక్తి రాయల వారి చేతికిచ్చారు.

ఆ స్వర్ణ ఫలకంపై "కవిసార్వభౌమ శ్రీనాథ భట్టు" – అనే బిరుదాన్ని చూచి సంతోషించారు. రాయలవారి కోరికపై గురుబ్రహ్మలు, "కవిసార్వభౌమ" బిరుదఫలకాన్ని శ్రీనాథుని రెండు చేతులందు పెట్టి, శాశ్వత యశస్సంపన్నుడవు కాలగలవని దీవించారు. రాయల ఆంతర్యాన్నర్థం చేసికొన్న రాజకులగురు బ్రహ్మలు, శ్రీనాథ పాణేశ్వరిని, ముత్యాలశాల వేదికపైకి పిలచి "ఆనంది" ప్రక్కనే గల స్వర్ణసింహాసనంలో, ఆ ప్రాజ్ఞను ఆశీనురాలిని గావించి శ్రీనాథునితో కృతాభిషేకను గావించారు శ్రీప్రౌఢ దేవరాయల వారు చూపిన ఆదరాభిమానాలకు, సంతసించి కృతజ్ఞతల నందించి, వారిని శ్రీనాథ కవి ప్రశంసించాడు.

శా॥ జోటీ భారతి యార్భటిన్ మెఱయుమీ ! చోద్యంబుగా నేను క
ర్ణాటాధీశ్వరు బ్రౌఢ దేవనృపతిన్ నాసీర ధాటీ చమూ
కోటీ ఘోటక ధట్టికాఖురపుటీ కుట్టాక సంఘట్టన
స్ఫోటీ ధూత ధరా రజశ్చుళుకి తాంభోటిన్ ప్రశంసించెదన్.

శ్రీప్రౌఢ దేవరాయలవారు, శ్రీనాథుని ఆశు కవితాధారకు సంతోషంతో, **స్వర్ణపతకాన్ని** వారి మెడలో వేసి, మహారాణితోను పుత్రునితోను కలసి ఆ పుణ్యదంపతుల పాదాలపై పూలు జల్లి, నమించినంత, ఆ రాజకుటుంబమును వారలాశీర్వదించారు. వారల దివ్యాశీస్సులనంది, ఆనందించిన రాయలు, ఆంతరంగిక గూఢచారుల రాకవిని అత్యవసరమైన రాచకార్య ముండుటచే, వారలకు తెలిపి రాజభవనానికి వెళుతూ, సభా నిర్వహణ బాధ్యత కులగురు బ్రహ్మల కప్పగించారు. రాయలవారితో మహామాత్యులు కూడ, శ్రీనాథ కవి చెంత సెలవు తీసికొని, సమావేశ మందిరానికి వెళ్ళారు. అవచితిప్పయ్య శెట్టి, పంటమైలారురెడ్డి, తెలుంగాధీశులు, ముమ్మకవి, చామరసుకవి రాజకుల పురోహితులు, శ్రీనాథ దంపతులను, శ్రీలక్ష్మీ నారాయణులుగా తలచి కొలిచారు.

ఆహూతులైన ముసలి **జంపతులు** వారినాశీర్వదించారు. కొందఱు **ఆలుమగలు**, వారినభినందించారు. కొన్ని జంటలు, సిరుల పంటలు పొందాలని కొలిచారు. కొందరు **స్త్రీలు** సేసలు జల్లారు. కొందరు **యోషితలు** పాడారు. మరికొందరు **యోషలు** ఆడారు. కొందరు **దంపతులు** దండాలన్నారు. కొందర**బలల**లారాధించారు. కొందరు **కాంతలు** వాని కాంత చెంత కేతించి, కవనాలు చెప్పారు. **సారసలోచనలు** కొందరు నవరసాలొలికించు నాట్యాలు చేసారు. కొందరు **జోషలు** సేవించారు. కొందరు **సీమన్తినులు** వాని సతి పాపిడి సరిదిద్దారు. కొందరు **వధువులు** వజ్రపుటుంగరాలు తొడిగారు. **ప్రతీపదర్శినులు** కొందరు పారాణి పూసారు. కొందరు **నారులు** బారులు తీరి బంగరు గాజులు తొడిగారు.

కొందరు **వనితలు** వస్త్రాలిచ్చారు. కొందరు **మహిళలు** మర్యాదలు చేసారు. కొందరు **మత్తకాశినులు** వాని మనఃకాంత మనస్సును దోచారు. **కులకాంతలు**, కురులు సవరించారు. కొందరు **సుందరులు** సొగసులొలికించారు. కొందరు **కూతురులు** కూర్మిచూపారు. కొందరు **భామలు** వయ్యారాలొలుకపోసారు. కొందరు **అంగనలు** ఆట పాటలతో అలరించారు. **భీరులు**, సరులు సవరించారు. కొందరు **కామినులు** వారి వర్యను కౌగిలించుకొన్నారు. మరికొందరు **వామలోచనలు** వాని వశ్యను వాటేసికొన్నారు. వాని ప్రాణేశ్వరికి, కొందరు **ప్రమదలు**, పట్టు చీరలిచ్చారు. **భావినులు** కొందరు వాని భార్యకు బంగరు వంకీలు తొడిగారు. **భామినులు** కొందరు భజించారు. **రామలు** కీర్తించారు. **మానినులు** మణిహారాలర్పించారు. కొందరు **హెగ్గడి కత్తెలు** స్వర్ణ కంకణాలు తొడిగారు. **లలనలు** లాస్యమాడారు. **నితంబినులు** నీతులు పల్కారు. **సుందరీమణులు** విందులు చేసారు. **ఆడకూతుళ్ళు** అలకలు దిద్దారు. **రమణులు** రవ్వల గాజులు తొడిగారు. **అభిరామలు** రాగాలాపనలు చేసారు. **నవలలు** నర్తించారు. **కోపనలు** భామాకలాపాలు ప్రదర్శించారు. కన్యలు కవ్వించారు. **కుమారీ** రత్నాలు కులుకులొలుకపోసారు. **తరుణులు** హారాలు వేసారు. **పడతులు** పట్టీలు పెట్టారు. **సుదతులు**, సున్నుండలు తినిపించారు. ఓ **పెంటి**, జంటతో ఆడింది. **ముదితలా**ముదితకు ముద్దులిచ్చారు. **నాతులు**, పూతరేకులిచ్చారు. **జలజాక్షులు**, జాతి రత్నాలు బహూకరించారు. **ముద్దియ**కా ముగుదలు దుద్దులిచ్చారు. **ఇంతులు** పూబంతులు చేతులకందించారు. **చానలు** పానకాలిచ్చారు. **నెలతలు**, నేత్రాల కాటుక దిద్దారు. **బాలలు** బంగరులాలపోసారు. **ముద్దరాండ్రు** ననువెన్నను గోరు ముద్దలుగా తినిపించారు. **తెఱవలు** తేనీరు పంచారు. **అతివలు** కొందరు అరిశలందించి నందించారు. **ఇల్లాండ్రు**, రసగుల్లాలు ఉల్లాసంతో తినిపించారు. **గృహిణులా** తల్లి ఎదకు సువర్ణ శ్రీఖండం పూసారు. **కుంకుమ శోభితలు** పసుపు కుంకుమలిచ్చారు. **పుణ్యస్త్రీలు** పుష్పాలు జల్లారు. **శ్యామలు** శాలువలతో సత్కరించారు. **నెఱజాణలు** వీణెలు మీటారు. **చామలు**, చామంతులిచ్చారు **లేమలు**, తమలపాకుల నందించారు. **చెలులు** ఏలకులు **వామాక్షులు** వక్కపొడి **కరభోరులు** సున్నం, **ఉత్తమలు** కస్తూరి ఇచ్చారు. **పోరీలు** పూరీలు పంచారు. **ఉవిదలు**, ఉతప్పాలందించారు. **చిన్నారులు** పచ్చళ్ళు పంచారు. **గోలలు**, ఈలలు వేశారు. **విరిబోడులు**, వింజామరలు వీచారు. **కూనల** కోలాటాలు, **సారసాంగనల** సరససల్లాపాలు, **ఒజ్జసానుల** ఒయ్యారాలు, **మిటారుల** భ్రూ విలాసాలు, **దొరసానుల** విచిత్ర వేషాలు, లేడి పిల్లల్లాంటి **ఆడపిల్లల** అభినయాలు, **సానుల** గీతాలు, **షండుల** చప్పట్లు, **కన్నెల** వన్నె

చిన్నెలు, సదస్యుల నలరించాయి. **భారంగి** భామాకలాపంలో ఓ **భామ** గీతాలు పాడింది. ఓ **భీరువు** భజన చేసింది.

ప్రీతువులు ప్రీతాలు, **సాగరపుత్రి**కలసంతోషాలు, **గువ్వల** నవ్వుల రువ్వులు, **వామల** మంజీరనాదాలు, **మీనాక్షుల** రెప్పల చప్పుళ్ళు, **అవ్వల** రవ్వలగాజుల సవ్వడులు సందడి చేసాయి. **రసిక కిసలయపాణుల** వలపుల కిసమసలు గుసగుసలాడాయి.

గుంటలు, గంటలు వాయిస్తూంటే **కులాంగనలు** మంగళారతులిచ్చారు. **పురంధ్రీలలామలు** అక్షతలు జల్లారు. **అపలా**శీర్వదించారు. **అమలా** నందించారు. **అప్పలు** దీవించారు. **ఆయమలు** నందించారు. **మందగమనలు** చిరునగవు లొలికించారు. **స్వయంవరలు** సంతసించారు. **పతింవరలు** ఫలాల నందించారు. **వర్యలు** సపర్యలు చేసారు. **కులపాలికలు** పరమాన్నాలు పంచారు. **మందస్మితలు** మంచి తీర్థాలు పోసి దాహార్తిని తీర్చారు. **కులస్త్రీలు** కుంకుమ పంచారు. **పాపలు**, పచ్చకర్పూరం పంచారు. **కొమ్మలు** కమ్మలు సరిచేసారు. అమ్మలు అరచేతుల గోరింటాకు రూపుచూసారు. కొందరు **తల్లులు** తనివితీరా దిష్టితీసారు. కొందరు **భవతులు** బంగరు ఆభరణాలిచ్చారు. **పూబోడులు** పూలదండలు పంచారు.

పుష్పవంతులు పూలు జల్లారు. **మాతంగులు** మధుర గానాల మురిపించారు. **పేరంటాండ్రు** వాయనాలు స్వీకరించారు. **రాణులు మహారాణులు** నవరతనాలు బహూకరించారు. ఓ **వేనలి** వణక్కమంటే, మరో **తాయి** శుభాశయగళు అన్నది ఓ **తంగై** మోర్ ఇచ్చింది. కొంద**రాడువారు**, ఆడువారిని, పాడువారిని కొనియాడారు. ఓ **చాని** మరో సానితో కలసి యాడిపాడింది. కొందరు **వశినులు** వంకీలు సవరించుకొన్నారు. ఓ **వరవర్ణిని** వడ్డాణం సవరించుకొంది. ఓ **చిరంటి** జారుపైట సరిచేసికొంది. ఓ **ఇచ్ఛావతి** రవ్వల గాజుల సవ్వడితో సందడిచేసింది. ఓ **పలిక్ని** కొప్పులో నాగరం చూపింది. కొందరు **కుటుంబినులు** ఒరిగలన, మరికొందరు **సుచరిత్రలు** గోపులన్నారు. **మంగిడీలు** మంగిడీలంటూ **చెంచెతలు** కర్రలతో నృత్యం చేసారు. **ఎఱుకెతలు** తేనెలు పంచారు. ఓ **పావని** పల్లాండు పలుక, మరో **ప్రాజ్ఞ** పాశురం పాడింది. **కాముకల** లాస్యాలు, **హరిణుల** హాస్యాలు, **వృషస్యన్తుల** వేషాలు, **ప్రేమికుల** పారస్పరిక క్రీ గంటిచూపులు చూపరులను అలరించాయి. **సానులు**–సారంగి పాడుతూ, ఓరచూపులతో చేసిన భ్రూ విక్షేపాలు, ఒరిగల నందించాయి.

సభికులు కొందరు, తమ జూద నైపుణ్యాలు చూపుతూ, ఓ ప్రక్క **ప్రజ్ఞల** ప్రజ్ఞలను

తిలకిస్తున్నారు. **అర్థవృద్ధలు** ముగ్ధలతో ముచ్చట్లాడుకొంటుంటే, ఓ **చార్వి** చప్పట్లు కొడుతూంది. **ముత్యాలశాల** ముసిముసినగవుల మురిసింది.

శ్రీనాథుని ధర్మగేహినియైన సోమిదమ్మ శ్రీలక్ష్మి, కొందరిని పలుకరిస్తూ, మరి కొందరికేసి చూస్తూ, కులసతులను కొలిచింది. అనుకూల వతులకు అమరదండములిడి, కరభోరులకు కరచాలనాలు చేస్తూ, సౌభాగ్యవతులకు స్వాగతాలు చెపుతూ, గుర్విణులకు చేయూతనిచ్చి సుఖాసీనులను గావిస్తూ, స్తనంధయులను లాలిస్తూ, శిశువులను పలుకరిస్తూ, పసికందులను కవ్విస్తూ, కూనలను ప్రజాతలను గౌరవిస్తూన్న హిరణ్మయిని దీవించాడు శ్రీనాథుడు. గురుబ్రహ్మలాశీర్వదించారు.

ముత్యాలశాలలో అత్యంత వైభవంగా జరిగిన శ్రీనాథుని కనకాభిషేకాన్ని కనులారా తిలకించిన పండిత పరమహంస లందరికీ, తనకు కనకాభిషేకం చేయబడిన ధీనారాలను టంకాలను శ్రీనాథుడు పంచిపెట్టించారు. ఒక్క బంగారు నాణెమైనా వారు మిగుల్చుకోలేదు, ఏమిటిది? అని ఎవరో దుగ్గన్న గారినడిగితే, దేవునికి పూజచేసిన పూలను మరలా దేవునికి పూజచేస్తామా? వాటిని మరునాటికి నిర్మాల్యమంటాము. ఈ దీనారాలుటంకాలు నిర్మాల్యాలే శ్రీనాథుడు గ్రహించడు. నేడవి పూజలందుకొనిన సువర్ణ ప్రసాదాలు, అందుకే ఈ ప్రసాద వితరణ, అందుకే, వారికెవరిచ్చినా వాటిని తర్వాత అందరికీ పంచేస్తారన్నారు.

ముత్యాలశాలలో, తన మనోభీష్టాన్ని నెరవేర్చిన చింతామణీమంత్ర స్వరూపిణి షోడశియై భాసింప, శ్రీనాథుడు – ఆ శారదనారాధించి, శ్రీవిద్యనుపాసించి, పదహారు బీజాక్షరాల దండకం పఠించాడు.

ఓం కార **ఐం** కార **హ్రీం** కార **శ్రీం** కార రూపంబు నీవమ్మ! కల్యాణివే తల్లి! ఏకాక్షరీ! **ఈ**శ్వరీ! **ల**క్షణా గమ్యవే! రాజరాజేశ్వరీ దేవి! **హ్రీం**కార మంత్రాక్షరీ **హ**ర్షిణీ ! సర్వమాత్రే ! **క**లా హర్షిణీ ! **హ**ంస మంత్రార్థ రూపంబ ! **ల**బ్ధా ! లకారార్థలావణ్య లభ్యేతరా! **హ్రీం** కలా ! సచ్చిదానంద ప్రేమైక రాసా! **క**కారార్థ కామేశ్వరీ! **ల**బ్ధ కామంబ ! **హ్రీం** కార వేద్యా ! లసత్కల్ప వల్లీ మతల్లీ రసానందమా ! కాది విద్యా స్వరూపంబ ! **శ్రీం**కార రూపంబ ! శ్రీ చక్ర తల్పాల్ప హాసంబ ! ముమ్మారు గాయత్రివే ! ముక్తి మార్గంబు జూపింపవే ! స్వాగతం బమ్మా ! గాయత్రి, సావిత్రి, శ్రీదేవి, భూదేవి నీవమ్మ ! పూతాత్మునింజేయవే ! దోషపుంజంబులన్ ద్రుంపవే ! నింపవేదివ్య భావంబుతో నామనంబున్ సదా మ్రొక్కెదన్ షోడశీ ! వేదమాతా నమస్తే నమస్తే నమస్తే నమః ! అని **షోడశియౌ సరసవతిని** ఆ మంత్రించి, శిష్య చూడామణి దుగ్గన్నను శ్లాఘించిన శ్రీనాథుడు

– వల్లభుని వాల్లభ్యాన్ని వేనోళ్ళకొనియాడి, కొన్నిరోజులు దినవెచ్చమిచ్చి పోషించిన పితృతుల్యుడౌ పంటమైలారురెడ్డి వాత్సల్యాన్ని నుతించాడు.

శా॥ కర్ణాట క్షితి పాల మౌక్తిక సభాగారాంత రా కల్పిత

స్వర్ణస్నాన జగత్ప్ర సిద్ధ కవిరాట్సంస్తుత్య చారిత్ర ! దు

గ్ధా ర్ణోరాశి గభీర! ప్రాహ్ణముఖ మధ్యాహ్నోపరా హ్ణోర్చి తా

పర్ణావల్లభ ! రాజశేఖర మణీ ! పంటాన్వయ గ్రామణీ ॥ అని ఆశ్లేషించాడు. దీనారటంకాల తీర్థమాడించిన ఘనత శ్రీప్రౌఢ దేవరాయలకే దక్కింది. దక్షిణాధీశు ముత్యాలశాల ధన్యమైనది.

శ్రీనాథుని వాణి, అన్నపూర్ణమ్మ ప్రసాద పాణి. శ్రీనాథుని కావ్య రసాస్వాదన మంటే – మధుర పాయసాపూపసంపన్నం, కలమాన్నపూర్ణం, రంభానారికేళ ఫలశాకసాకల్యం, ఆజ్యధారా ఘుమం ఘుమితం. శరచ్చంద్ర చంద్రికాధవళ దధి సమృద్ధం. ఒక్క మాటలో వారి కావ్యం సాహితీ రసరిరంసువుల పాలిటి కామధేనువే.

కవిసార్వభౌమ బిరుద విభ్రాజితుడై, దక్షిణాధీశుని ముత్యాలశాలలో దీనారటంకాలతో తీర్థమాడిన కర్ణాట దేశ కటక పద్మవన హేళి శ్రీనాథ భట్ట కవిరాజు, ఇంతటి గౌరవాన్నిచ్చిన రాయలవారికి, గురుబ్రహ్మలకు, చామనామాత్యులకు, ముమ్మకవికి, వల్లభామాత్యాది సహృదయులందరికీ కృతజ్ఞతలు పౌనఃపున్యంగా తెలిపి, వారి చెంత సెలవు తీసికొని, దుగ్గన్నకు సెలవొసంగిన శ్రీనాథ సుకవి, పాణి గృహీతతో గోదావరీ తీరానికి పయనమయ్యాడు. మధ్య మధ్య మజిలీలు చేస్తూ పండితులతో సంభాషిస్తూ, పవిత్ర గోదావరీ తీరం చేరాడు. కాశీయాత్రను గుర్తుకు తెచ్చుకొన్నాడు. డుంఠి విఘ్నేశ్వరుని, విశాలాక్షిని, విశ్వనాథుని స్మరించాడు. స్కాందపురాణం పారాయణ చేసాడు. రెడ్డి రాజులిచ్చిన అగ్రహారాన్ని సందర్శించి, అచటివారితో భాషించి రాకపోకలు సాగించాడు. అయః పిండమైన కాశీఖండాన్ని అభ్యుదయ ప్రాప్తికై పయః పిచ్ఛలంగా తెలుగువారికి నందించి నందించాలని రెండేళ్ళు శ్రమపడ్డాడు. ఈశ్వరార్చన కళాశీలుడై, లోకానికి కనువిప్పు కల్గించేలా శివలీలామృతాన్నందించాడు. దేహం, అస్థిరం కనుక కాలుసేయాడు కాలంలోనే తీర్థయాత్రకు బయలుదేరి దేవుని సేవలు చేయాలన్నాడు. శివశర్మ, నిగమశర్మల కథలలో ఎన్నెన్నో నీతులున్నాయి. అగస్త్యునితో ప్రారంభమైన కావ్యం, వ్యాసుని కథతో పూర్తిచేయబడి, ఇద్దఱూ ఒక్కటే అని నిరూపిస్తుంది. ఈ కాశీ ఖండంలోని ఘట్టాలు, గోదావరీ లహరీ శీతల గంధ వాహ పరికోమలమైన మనస్సుతో శ్రీనాథుడు చిత్రీకరించి,

అచటి పండితులకు వినిపించాడు. శ్రీ విజయనగరాన, ముత్యాలశాల నుండి శ్రీనాథుని దయతో బ్రతికి బయటపడి, రాజమహేంద్రవరం చేరిన పండితులు, శ్రీనాథుని కనకాభిషేక వైభవాన్ని, అచటి వారందరికీ జేరవేయటమే కాక, శ్రీనాథుని రాకతో వారి చెంత చేరి, వారి కాశీఖండంలోని పద్యాలను విని ప్రచారం చేయటం మొదలుపెట్టారు. ఈ పద్యసౌరభాలు, రాజ ప్రాసాదంలో గుబాళించాయి. దాంతో రాజమహేంద్రవర రాజ్యాధిపతుల నుండి త్రైలోక్య విజయ మహాసభకు రమ్మని వర్తమానం అందింది. అల్లాడ వేమారెడ్డి, వీరభద్రారెడ్డి సోదరులిద్దఱూ చక్రవర్తులే! ఇద్దఱూ వదాన్యులే! ఇద్దరూ విద్యావేత్తలే ॥

ముత్యాలశాల గుర్తుకొచ్చింది. అచటి విజయమే, ఈవలపు పిలుపుకు గొప్పమలుపుగా భావించటంతో గౌతమీ గంగ, ముత్యాల కంఠహారంగా సాక్షాత్కరించింది - కళకళలాడే కొలువులో ప్రవేశించిన శ్రీనాథ కవిసార్వభౌమునకు, సోదర ప్రభువులు ఘనస్వాగతం పలికారు. వేమ భూపాలుడు, తన తమ్ముడు వీరభద్రయ్య, శ్రీనాథుని కవితా సుందరిపై మోజు పడ్డాడని విని కాశీ ఖండ ప్రబంధాన్ని మా వీరభద్రయ్య పేర అంకితం చేయుమయ్యా! శ్రీనాథయ్యా! - అని పల్కటంతో, తాంబూలమందుకొన్నాడు. శ్రీనాథుడు సాహిత్య త్రివిక్రముడయ్యాడు. శారదాంబ పాదనూపురం తళుక్కున మెరసింది. కంఠపీఠిక నోంకార ఘంట మొరసింది. కమనీయ కాశీ ఖండ కవితామృత ధారాసారం కురిసింది. పండిత పరమహంసల మానససరోవర కుసుమం విరిసింది. "త్రైలోక్య విజయ" సభా మంటపంలో **కాశీఖండ కృతి** సమర్పణ మహోత్సవం సర్వాంగసుందరంగా హృదయానందకరంగా మంగళవాయిద్యాల మధ్య పండితుల శుభ్యాశీస్సులతో అత్యంత వైభవోపేతంగా జరిగింది. సన్మానం జరుగుతున్నంతసేపు ముత్యాలశాల శ్రీనాథుని మదిలో వెలసింది. అది ముక్తావళిగా ఎపుడో కంఠాన అలంకరింపబడినట్లనుభూతి చెందాడు. క్రీ.శ. 1433లో, కాశీఖండ కావ్యాన్నిచ్చి, వీరభద్రారెడ్డి విద్యాంసు ముంజేత వియ్యమందినాడా శ్రీనాథుడు. వారి ఆస్థానంలో సముచిత స్థానాన్ని సంపాదించి, శారదా విధేయుడై, శారదాభాగధేయునికి, "కాశికాభర్త మనపాలి కల్పతరువని", కాశీఖండ కావ్య విశేషాలు, బోధిస్తూండేవాడు. "కాశి కైవల్యఫలదాన కల్పవల్లి" యని కాశీ క్షేత్ర మహిమలు వినిపిస్తూ కోటిలింగాల రేవులో స్నానం చేసి వస్తూంటే, ముత్యాలశాలలో ఒకనాడు, వాదసభ పూర్తయ్యాక, రాచకొండ నుండి అచటకు వచ్చిన పండితులు శ్రీముమ్మడి సింగభూపాలుని పాండిత్యాన్ని గురించి ముచ్చటించిన విషయం గుర్తుకు వచ్చింది. ఆతడు రసార్ణవ సుధాకర గ్రంథ కర్త, శ్రీ పద్మనాయక సామ్రాజ్య సార్వభౌముడు వారిని దర్శించి తన వాణి వినిపించి,

తెలుగు భాషామతల్లి వైభవ ప్రాభవాలను మరింతగా ప్రసరింపజేయాలని తలచి, రాచకొండకు పయనమయ్యాడు. ఇదే సమయంలో, కాకతాళీయంగా, సింగభూపాలుని చెంత నుండి వర్తమానం వచ్చింది. తన సంస్థానానికి వచ్చి, వారి పాండిత్యం కవిత్వం వినిపించి, సంతసింప జేయాలని కోరినట్లు, సింగభూపాలుని ఆంతరంగికుడొకడు వచ్చి చెప్పాడు. ఇంకేముంది, ఏపాటి శ్రమ లేకుండా రాచకొండ జేరుకొన్నాడు. సింగభూపాలు దేర్పాటు చేసిన విడిది మిద్దెలో బసచేసాడు.

పిట్టలు కూస్తున్నాయి. చీకట్లు చితికి పోయాయి. రిక్కల కాంతులు వెలవెల బారాయి. దిశలు తెలుపెక్కాయి. తెలతెలవారు తోంటే, శ్రీనాథుడు ప్రభాతవేళ తన నిత్యనైమిత్తిక కర్మలన్నీ పూర్తి చేసికొన్నాడు. సర్వశత్రు సంహారకమైన మన్యుసూక్త మంత్రాలను పఠించాడు. క్రోధాభిమాన దేవుని శాంతింపజేసాడు. ఆదిత్య హృదయాన్ని ముమ్మార్లు పఠించాడు. ప్రభాకరునికి ప్రణామాలు చేసాడు. ఆగమోక్త ప్రకారం శంభులింగానికి అభిషేకం చేసాడు. ఫలాలు నివేదించి హారతిచ్చాడు.

మడిబట్టల స్థానంలో పట్టుధోవతీ ధరించాడు. పైన పట్టు కండువా వేసికొన్నాడు. ముత్యాలశాలయే నన్నిటకు రప్పించుటకు కారణమని తలచాడు. సింగభూపాలుడు గీర్వాణాంధ్ర భాషలలో ఉద్దండపండితుడు. తనంతటి పండితుడు, ఎవరూలేరని యించుక గర్వరేఖ ఉన్నట్లు విన్నాడు. లేకుంటే ప్రౌఢ దేవరాయల ముత్యాలశాలలోని వాదసభకు వచ్చేవారే! "ప్రజ్ఞాబలార్జితాన్వర్థ సర్వజ్ఞ బిరుద భూషితుడు", "దేశాంతరాళ విశ్రాంత యశస్కర పరాక్రముడు" – అని శాసనాలు పలవరిస్తున్నాయి. అంతటి మహనీయుని సాదరాహ్వానంపై రాచకొండ చేరిన శ్రీనాథునకు వైభవంగా ఆతిధ్యమిచ్చారు. ఇంతలో దర్బారుకు సగౌరవంగా, శ్రీనాథుని తీసికొని వెళ్ళారు. వెలమ ప్రభువుల చెంతకు వెళ్ళటం రెండవసారి. ఈ పర్యాయం, "పుంభావభారతి"యని సర్వజ్ఞుడని పేరు పొందిన సర్వజ్ఞ సింగభూపాలుని నిండు కొలువులో అడుగు పెడుతూనే, రెడ్ల ఆస్థాన విద్వాంసుడనని, నన్నుమానింతురో, అవమానింతురో అని సందేహింపక, ఆహ్వానించిరి కదాయని సంతోషిస్తున్నా, విశ్వేశ్వర కవి చంద్రాది సమాశ్రయణీయుడైన సింగభూపాలుని మెప్పించెదనో లేదో యని తలచి తడబడుతూనే వేదిక చెంతకేతెంచు శ్రీనాథుని కెదురేగి, చేతులు చాపి, సువర్ణాసనం చెంతకు ఆహ్వానించి నమస్కరించి హస్త సంజ్ఞాదర లీలలచే కూర్చోమన్నాడు. సర్వజ్ఞుడు. శ్రీనాథుడు – "ఓం ద్రవిణోదా ద్రవిణసస్తు రస్య ద్రవిణోదా స్సనరస్య ప్రియం సత్, ద్రవిణోదా వీరవతీ మిషం నో ద్రవిణో దారా సతే దీర్ఘమాయుః" !

అని దీవించి, "ఓం రాయెబుధ్నస్సంగమనో.." అను మంత్రాన్ని పఠించి ఋగ్వేదాశీస్సుల నందించారు. "విశమై షాం..." అంటూ యజుర్వేదాశీస్సులు, "ఆయుర్విశ్వాయుర్విశ్వం విశ్వమాయుః...అంటూ సామవేద ఆశీస్సుల నందజేసారు. శ్రీనాథ కవి సార్వభౌమా! మేము, చారచక్షువులం, మీకవితా వైభవాన్ని విన్నాం ! ముత్యాలశాల మీకిచ్చిన గౌరవాన్ని విని, మీ కవిత వినాలని ఆహ్వానించాం.

ముత్యాలశాలలో నలభై రోజులు, మీ వాద పటిమ చూపి, విజయపతాకనెగుర వేసిన సన్నివేశాన్ని మీ నోటిద్వారా వినాలని కుతూహల పడుతున్నాం! అన్నారు ప్రభువులు. సర్వజ్ఞ సింగభూపాలా! మీ శౌర్య ప్రతాపాలు విన్నాం! మీ రసార్ణవ సుధాకర గ్రంథాన్ని చదివాం! అది సుకవి కర్ణ రసామృతం. సర్వజ్ఞులైన మీయంతటి వారిని మెప్పించటం సామాన్య విషయమా ప్రభూ! విద్వదౌషధమైన నైషధాన్ని, తెలుగులో విద్వదమృతంగా అందించానంటే, అదంతా శారదాదేవి కటాక్షమే! ఆ తల్లి మీ కొలువులో నెలకొని ఉన్నది. ఆ తల్లినన్నెలా కాపాడుతుందో కదాయని భావిస్తున్నాను, అంటూ, సింగభూపాలునితో పల్కి, ఆ మధుర భావాన్నే, శారదాంబతో పలుకుతున్నట్లుగా, ఆశువుగా, సీస పద్య సింహాసనాధిష్ఠితుడై, శారదను స్వాగతించాడు శ్రీనాథ సుకవి ॥

సీ॥ దీనారటంకాల తీర్థమాడించితి
దక్షిణాధీశు ముత్యాలశాల ।
పలుకుతోడై తాంధ్ర భాషా మహాకావ్య
నైషధ గ్రంథ సందర్భమునను
పగులగొట్టించి తుద్భట వివాద ప్రౌఢి
గౌడ డిండిమభట్టు కంచు ఢక్క ।
చంద్ర భూష క్రియా శక్తి రాయల యొద్ద
పాదుకొల్పితి సార్వభౌమ బిరుద

గీ॥ మెటులు మెప్పించెదో నన్ను నింకమీద
రావు సింగ మహీపాలు ధీవిశాలు
నిండు కొలువున నెలకొని యుండి నీవు
సరస సద్గుణ నికురంబ । శారదాంబ ॥

సర్వజ్ఞ సింగ భూపాలునితో సహా అందరూ కరతాళ ధ్వనులు చేసారు. కవులు మెచ్చుకొన్నారు. సాహితీ పిపాసకులం, కనుకనే మీ వంటి వారినాహ్వానించాం. మీరు

సాహిత్యంలోనే కాదు, రాజనీతిలోను పారంగతులు కనుకనే, మా ఆహ్వానాన్ని మన్నించారు. మీ శ్రుతి శ్రవణానందమే!... అని ప్రశంసించిన సర్వజ్ఞుని గ్రంధంలోని రసధ్వని తెలిపాడు శ్రీనాథుడు. తన గ్రంథంలోని రసధ్వని రహస్యాలు, శ్రీనాథుని నోట వింటూంటే, సర్వజ్ఞుని హృదయం రస ప్లావితమైంది. మధ్య మధ్య సింగభూపాలుని, గీర్వాణాంధ్ర భాషలలో స్తుతించాడు. ఆతని కొలువు కూటమిలో గల రసజ్ఞులు, అడిగిన ప్రశ్నలకు పద్యగద్యాలలో చమత్కారంగా సమాధానాలు చెప్తూంటే, ఓ కొంటె కోణంగి... శ్రీనాథ కవిగారూ! గిన్నెడు సాంబారులో ఎంత ఉప్పు వేయాలండి? అన్నాడు. శ్రీనాథుడు నవ్వుతూ, ఓ గిన్నెడు వేస్తే సరిపోతుందన్నారు. అదేమిటి? అని ముఖం పెట్టిన వానితో, నీ గిన్నెను బట్టే మా గిన్ని ఉంటుంది. ఉగ్గు గిన్నె కూడ గిన్నే కదా! అన్నారు. ప్రభువుల చెలికాడొకడు, శ్రీనాథా! సంస్కృత పదాలతో దీవిస్తూ, తెలుగు ఛందస్సులో పద్యం మా ప్రభువులపై చెప్పాలి... అని విజ్ఞప్తి చేసాడు.

శ్రీనాథుడు, రసవత్తరమైన చర్చ చేస్తున్నారు. సర్వజ్ఞులు, పండితులు, సాహితీ ప్రియంభావుకులు రసామృత పాన మత్త చిత్తులై ఉన్న సమయంలో విదూషక ప్రశ్న విన్న శ్రీనాథుడు, ఒకే సంస్కృత సమాసంలో పద్యం చెప్పేసారు. వాడికేమీ అర్థం కాలేదు, వెంటనే చిన్న చిన్న వాక్యాలతో చెప్పటం ప్రారంభించారు. వాడు, ఊ! అన్నాడు, అంటే నీకిలాచెప్తే అర్థమవుతుందన్న మాట. మా కవితాసుమాలు, నీటి కొలది తామర సుమ్మీ ! అన్నారు.

గీ॥ **వృద్ధిరస్తు ! స్వస్త్యస్తు ! ప్రసిద్ధిరస్తు !**
జ్ఞానమస్తు ! కుశలమస్తు ! ధ్యానమస్తు!
శక్తిరస్తు ! నిరంతరైశ్వర్య మస్తు !
శాశ్వత మహోస్తు ! విజయోస్తు ! శాంతిరస్తు ॥ అని శ్రీనాథ కవి దీవించారు. తర్వాత, రకరకాల ఛందస్సుమాలనందించారు. వారి కోరిక మేరకు రెండు రోజులుండి తమ కవితాగానం వినిపించారు. శాస్త్ర చర్చలు చేసారు. ప్రభువులుప్పొంగి పోయారు. శ్రీనాథ కవి పాండిత్య శౌండీర్యానికి, కవితా వైభవానికి, ప్రతిభా పాటవాలకు ప్రముదిత చేతస్కులై, ఘనంగా సన్మానించారు. ఈ ప్రకారంగా క్రీ.శ. 1435లో పద్మనాయక ప్రభువులచే సత్కారాలు పొంది, రాజమహేంద్రవరం చేరారు. వారు చేరేలోపునే, వీరభద్రారెడ్డి గారి చెవిలో, శ్రీనాథునిపై కొన్ని "కాకదంత" కథలల్లి చెప్పారు, పండితంమన్యులు. చక్రవర్తులు చార చక్షువులు కనుక, శ్రీనాథ కవీశ్వరులు, చెప్పినట్లు వారల్లిన పద్యాలను పెడ చెవిని

పెట్టి వారికి బుద్ధి చెప్పారు.

శ్రీనాథుడు, రాచకొండకు వెళ్ళిన విషయం పసిగట్టి కొందరు మచ్చరంతో, శ్రీనాథునికి తెలియని వారిని సింగభూపాలుని ఆస్థానానికి పంపించారు. సంస్కృతంలో అత్యద్భుతంగా సర్వజ్ఞునిపై చెప్పిన శ్లోకాలు, తెలుగులో మధురాతి మధురంగా పల్కిన పద్యాలు పూర్తిగా అర్థం కాక, వారు తిరిగి రాజమహేంద్రవరం వచ్చేలోపుననే మచ్చరించువారు వచ్చి, శ్రీనాథుడు చెప్పినట్లొక పద్యాన్ని వ్రాసియిచ్చారు. ఆ పద్యాన్ని, వీరభద్ర ప్రభువులకు వినిపించి, సింగభూపాలునికి కైవారాలు శ్రీనాథుడు చేసాడని, సర్వజ్ఞ సింగభూపాలుని మెప్పించి సన్మానాలు పొందాడని చెప్తూ, ప్రభూ! ఈ పృధ్విలో శివునికి రావు సింగ భూపాలునికి సర్వజ్ఞనామధేయము చెల్లుతుందట, మిగిలిన వారిని సర్వజ్ఞుడనుట, కుక్కను చూపి ఏనుగు అన్నట్లుంటుందన్నాడుట. విన్నారూ! మిగిలిన రాజుల్ని ఇలాతిడతాడా! అని కూపస్థమండుకాల్లాంటి అల్పజ్ఞులైన వైతండికులు, రాజు గార్కి నూరిపోసి పద్యం వినిపించారు.

కం॥ సర్వజ్ఞనామధేయము
శర్వునకే, రావుసింగ జన పాలునకే
యుర్విం జెల్లును ! దక్కొరు
సర్వజ్ఞుండనుట కుక్క సామజమనుటే ॥

ఎంతటి సహృదయునికైనా ఈ పద్యం వింటూంటే బాధ కల్గుతుంది. కలగాలనే చెప్పారు. లోకులు పలుగాకులు. రాజు గారి బాధ నర్థం జేసికొన్నారు, కొందరు సహృదయులైన పండిత పరమహంసలు. వారు, ప్రభూ! మీ ప్రతి పక్షినిలా శ్రీనాథుడు పొగిడి ఉండవచ్చునేమో! - అని మీరు బాధ పడుతున్నారు. ముత్యాలశాలలో కనకాభిషేకం పొందిన కవిసార్వభౌములలాపల్కరు. ఇది సత్యం, వారు సచ్ఛీలురు. ఒకవేళ పల్కినారే అనుకొందాం! ఈ పద్యాన్ని పరిశీలిస్తే - "సర్వజ్ఞనామధేయము శర్వునకే, రావు సింగజనపాలునకు, ఏ యుర్విన్ చెల్లును?" అని విభాగం చేసినచో, మీ ప్రతిపక్షి "సర్వజ్ఞు" డనుకొని శాసనాలపై చెక్కించుకొన్నాడుగా, అలాంటి వారిని పోల్చినాడేమోనని యూహించండి! అలాంటి నైచ్యం తొంగిచూచు పద్యాన్ని, దుష్టార్థాన్నిచ్చు దాన్ని "రసార్ణవ సుధాకర" గ్రంథ కర్త యంతటివాడు, విద్వత్కవి చక్రవర్తి విని నొచ్చుకోక మెచ్చుకొని సత్కరిస్తాడా ప్రభూ! ఇతః పూర్వం కూడ శ్రీనాథుని వైదుష్యానికి తట్టుకోలేక, మచ్చరంతో ఇలాగే కొందరు పద్యాలతో కథలల్లి భంగపడ్డారని వివరించారు. వీరభద్రారెడ్డి ప్రభువుల

మనస్సు కుదుట పడింది. శ్రీనాథుని శంకించినందులకు వీరభద్రారెడ్డి, తన ప్రీతముఖము చూపలేనన్నాడు. "ప్రమాదో ధీమతామపి", అని పల్కి హ్లాదియై, అతని మనస్సును రసవత్తరమైన తన పద్యగద్యాలతో హ్లాదితం చేసాడు, శ్రీనాథుడు. పయః పిచ్ఛలమైన కాశీఖండాన్ని, నిత్యము చదివి వినిపిస్తూ, ప్రభువులకు మనశ్శాంతినిచ్చాడు. వినమ్రుడైన ప్రభువు, శ్రీనాథ కవికీ విధంగా శ్రమ కల్పిస్తున్నానని పలికితే, ప్రభూ! ఈ పురాణ శ్రవణం, ఉభయ తారకమన్నాడు. అపుడపుడు, నిత్యము తనలో మెదిలే ముత్యాలశాల వైభవాన్ని, వీరభద్రారెడ్డి ప్రభువులకు వినిపిస్తూండేవాడు.

వార్ధ లేడింటికి వలపు వనితయై సప్తశాఖా మంగళోత్సంగయగు గౌతమ గంగా సైకత స్థలుల పంచాక్షరీ మంత్ర పారాయణ గావిస్తూ, పరమేశ్వరార్చన కళాశీలుడై గోదావరీ పవిత్రోదకంతో మార్కండేయస్వామిని, మహాన్యాస పూర్వకముగా అభిషేకిస్తూ, పండిత సంగోష్ఠులు నిర్వహిస్తూ, సత్కాలక్షేపం చేస్తున్నాడు శ్రీనాథుడు.

కాలచక్రం తిరుగుతోంది. రక్తాక్షి సంవత్సరం వచ్చేసింది. క్రీ.శ. 1444, రక్తాక్షి నడుస్తోంది. కటకాధిపతి, రాజమహేంద్రవరంపై దండెత్తి వచ్చాడు. అరివీరభయంకరుడైన వీరభద్రారెడ్డి యుద్ధం చేస్తుంటే, శ్రీనాథుడు తాను నిండు యౌవ్వనంలో గద త్రిప్పి శత్రువులను కొట్టినప్పటి చప్పుళ్ళలకు, మల్ల చఱచినప్పటి చప్పుళ్ళలకు చెట్లపై పిట్టలు రాలినట్లు, పండుటాకులు రాలినట్లుగా వారల భీకర యుద్ధంలో శత్రువులు నేలకూలుతున్నారు. యుద్ధవీరులు తునాతునకలౌతున్నారు. రామకృష్ణుల్లా సోదరులు పోరుసాగిస్తూంటే నిలవటం కష్టమని, ధర్మయుద్ధాన్ని ప్రక్కకునెట్టి, కటకాధిపతి కుత్రపన్ని వేమ, వీరభద్రుల్ని విశ్వేశ్వరుని సన్నిధికి పంపించాడు. దాంతో రాజమహేంద్రవరం, కటకాధిపతి వశమైంది. రక్తాక్షి వైశాఖి శ్రీనాథునికి సార్థకనామధేయిగా సాక్షాత్కరించింది. క్రీ.శ. 1444వ సంవత్సరాన రెడ్డి రాజుల రాజ్యాంతంతో, శ్రీనాథుని జాతకం, ఘట్టకుటీ ప్రభాతన్యాయంలా, మళ్ళీ తన తట్ట బుట్ట చేతికొచ్చాయి. అయినా వారు స్థిత ప్రజ్ఞులు. రెడ్డి రాజ్యాలు పోయాయి. రెడ్డి ప్రభువులు పోయారు. ఒడ్డె రాజులు వచ్చారు. "కొసర కాబోతునాబోతు గ్రుమ్ములాడ, నడిమిలేబయ్య గతివచ్చె నాకు నిపుడు" – అని శ్రీనాథుడు తలచాడు. జాయతో, విధి బలీయమన్నాడు. "కమలలోచన! మనుజు డొక్కటి దలంప, దైవమొక్కటి దలచుటెంతయు నిజంబు" – అని అనుకూలవతితో పల్కుతూంటే, రెడ్డి రాజులిచ్చిన సీమ విభాగాలన్నీ, ఒడ్డెరాజులు కైవసం చేసికొన్నారు. ఎప్పుడూ అవి పరిపాలించే రాజులవే కదండీ! ఎపుడూ వాటిని మనవిగా భావింపలేదని 'మనైవి' మనవి

జేసింది. మనస్సులో శ్రీశైలం దర్శించి, శివరాత్రి మహిమ వ్రాయాలనుకొన్నారు.

"ఈ క్షోణిన్ నినుబోలు సత్కవులు లేరీ నేటి కాలంబునన్" అని మెచ్చుకొని, గౌరవించిన రసజ్ఞ శేఖరుడైన వేమారెడ్డి, శివైక్యం చెందాడు. బాల్యసఖుడై మహారాజుల యఱచేతి నిమ్మపండై రాజ చిహ్నాలతో కర్పూర వసంతరాయలుగా పేరుపొందిన కర్పూర కస్తూరికా చందనాది సుగంధ ద్రవ్య వ్యాపారియైన అవచితిప్పయ్యశెట్టి కాంచీపురైకామ్రేశ్వరునిలో కలసిపోయాడు. తన పంక్తిలో కూర్చోబెట్టుకొని సువర్ణ పాత్రలో భోజనం పెట్టిన విస్సన్న మంత్రి స్వర్గస్థుడయ్యాడు. మామిడి సింగన్న లేడే! వేమ, వీరభద్రారెడ్డి ప్రభువుల మంత్రి, తనకు బాంధవుడైన బెండపూడి అన్నయమంత్రి భీమన్నలో కలసిపోయాడే, రెడ్డి సామ్రాజ్యలక్ష్మికి కంచుకోటయైన కొండవీటి దుర్గభిత్తికలు, బీటులువారి పాండవ బీడుగా మారిపోయాయి. రెడ్డి రాజుల అంతః కలహాలతో, ఆంధ్రభూమి ఒడ్డెరాజుల పాలైంది. చిరకాలంగా పొంచియున్న కపిలేంద్ర గజపతి, తన ఓఢ్ర ప్రతినిధుల కధికారాన్నిచ్చి పాలన ప్రారంభించాడు. రెడ్డిరాజులకు భూతపూర్వాశ్రితులైన వారు తలఎత్తుకొనే అవకాశమే లేదు. తలఎత్తితే అవమానమే. కపిలేంద్ర గజపతి రెడ్డి రాజ్యాన్ని హస్తగతం చేసికొన్నాక రెడ్డిరాజులిదివరలో బ్రాహ్మణులకిచ్చిన అగ్రహారాలు కైవశం చెసికొని, ఓఢ్ర బ్రాహ్మణులకే దానాలిచ్చాడు.

నడివీధిన పడ్డ శ్రీనాథుడు, తన రిక్త హస్తాలను చూసికొన్నాడు. ముత్యాలశాల గుర్తుకు వచ్చింది. ఈ చేతులు, వేవేల బంగారు నాణెములు, ఎందరికో దానం చేసినవి. ముత్యాలశాలలో తనకు జరిగిన కనకాభిషేకం నాడు – సువర్ణ పాత్రలతో సువర్ణ కలశాలతో ఎన్నెన్నో దీనారాలు టంకాలు, శిరస్సున రాయలు వారు ధారగా పోసిరో గుర్తొచ్చింది. ఆ బంగారు నాణేలన్నీ అందరికీ పంచివేయుడని సంజ్ఞ చేసిన చేతులివి. ఈ చేతుల్లో చిల్లిగవ్వ కూడ నేడు లేదు. నిన్నటిదాక మహారాజుల చేత శ్రేష్ఠులచేత సత్కృతుడై సకలైశ్వర్యాలు కల్గి మృష్టాన్నాలు తింటూ సమృద్ధిగా ఇతరులకు పెట్టుకొనే చేయి గతి ఏమిటి? ఒడ్డె రాజులున్నదంతా ఊడ్చుకుపోయారు. "ఏమిసేయుదు? నెక్కడికేగువాడ? ధనము నిప్పచ్చరంబు" ! విద్యయ ధనంబ ! "పెట్టసాగెడు నాచేయి బిక్షసేయ నెట్ట నేరుచు? దైవంబయెఱగు నింక" – అని మదిలో తలచాడో లేదో, ఓ యతి తన చెంతకు వచ్చాడు. నమస్కరించి, స్వామీ! తమరే శ్రీనాథులని విన్నాను. ముత్యాలశాలలో, కనుగొన్నాను కనకాభిషేక మహోత్సవాన్ని – అంటూ నాపేరు శాంతయ్య. నేను శ్రీశైలంలో ఉంటున్నాను. అక్కడున్న భిక్షావృత్తి మఠాధిపతి శాంత భిక్షావృత్తియతీశ్వరుల ఆదేశానుసారం, మీ చెంతకు

వచ్చాను. ఈశ్వరానుగ్రహంతో మీ పరిస్థితిని గమనించిన యతీశ్వరులు, మీ కుటుంబాన్నంతని శ్రీశైల భిక్షావృత్తి మఠానికి తీసికొనిరమ్మని నన్నాదేశించారు. రెండెడ్ల బండి సిద్ధం చేసాను. బయలుదేరండి. బండిలో పళ్ళు, ఫలాలు మంచితీర్థం అన్నీ ఉన్నాయి. అమ్మగారిని తీసికొని మీరు బండి ఎక్కండి. నేను, ఆ యతీశ్వరుని మూలభృత్యుణ్ణి!... అంటూ శ్రీనాథుని పాదాలకు నమస్కరించాడు, శాంతయ్య. శ్రీనాథుడు కూడ శ్రీశైలం వెళ్ళాలని, ఆ రోజే అనుకొన్నాడు. అరుణోదయాన్నే, "శివరాత్రి మాహాత్మ్యం" అనే కావ్యం వ్రాయాలని శ్రీకారం చుట్టాడు. ఆడకు బోవు తీర్థమెదురైంది. పువ్వు ముడిచిన పురవీధిలో కట్టెలమ్ముకోకుండ మల్లికార్జునుడు, దయచూపాడని తలచి వలచాడు. కావ్యానికి శ్రీకారం చుట్టిన వేళా విశేషమని తలచాడు. కట్టు బట్టలతోనే దేవతా విగ్రహాలను అర్చన సామాగ్రి తీసికొని, రాజమహేంద్రికి, గోదావరీమాతకు నమస్కరించి స్వవాసినితో బండెక్కాడు శ్రీనాథుడు. శ్రీశైలం చేరాడు, "శ్రీశైల శిఖరం దృష్ట్వా పునర్జన్మ నవిద్యతే" – అని తలచి, గిడిగిళ్ళ నందించారు. మఠాధిపతిని దర్శించి – "చతుస్సాగరపర్యంతం, గోబ్రాహ్మణేభ్యః శుభం భవతు, భారద్వాజ బార్హస్పత్య అంగీరసత్ర్యార్షేయ ప్రవరాన్విత భారద్వాజ సగోత్రః అధ్వర్యువేద శాఖాధ్యాయీ, ఆపస్తంబ సూత్రః, శ్రీనాథ శర్మ అహంభో అభివాదయే" – అని వేద వాక్కులనలంకరించాడు. ఘన వినిపించాడు. శివరాత్రి మాహాత్మ్య మనుమహాకావ్య రచన చేయడానికి శ్రీకారం చుట్టిన విషయాన్ని వినిపించాడు. మఠాధిపతి సంతోషించారు. వారిని దీవించి, మఠంలోనే ఉండి కావ్యాన్ని పూర్తిచేయుమన్నారు. సకల సదుపాయాలు చూడుమని శాంతయ్య కప్పగించారు. అంతా ఈశ్వరేచ్ఛ!... అని భావించిన శ్రీనాథుడు, మఠంలోనే ఉండి, శ్రీశైల భ్రమరాంబికా మల్లికార్జునులను సేవిస్తూ, "ఓం నమశ్శివాయ" – అను పంచాక్షరీ మంత్రాన్ని జపిస్తూ, శాంతయ్య సేవలో శివరాత్రి మాహాత్మ్యాన్ని రచన చేస్తున్నాడు. స్వామీ, ముత్యాలశాలలో మీకు జరిగిన కనకాభిషేకాన్ని కనులార గాంచిన అదృష్టవంతుణ్ణి – అన్నాడు, శాంతయ్య. మీ వాద ప్రతివాదాలు శ్రవణానందంగావించాయి. మీ వైభవాన్ని యతీశ్వరులైన మఠాధిపతులకు తెలిపాను.... అని శాంతయ్య చెప్తూంటే, ముత్యాలశాలయే, నన్ను శ్రీశైలానికి రప్పించిందన్న మాట! ఆహా! అది మంచి ముత్యాలమూట! యని వేవేల ప్రశంసల నందించాడు, శ్రీనాథుడు.

"ఓం త్ర్యంబకం యజామహే సుగంధిం పుష్టివర్ధనం, ఉర్వారుక మివ బంధనాన్మృత్యో ర్ముక్షీయమామృతాత్" అను మృత్యుంజయ మహామంత్రాన్ని జపిస్తూ, విభూతి ధరించాడు.

పండిన దోసపండు, ముచిక నుండి విడివడినట్లు, మృత్యుముఖం నుండి సునాయాస ముక్తి నొసంగు విభూతి దాల్చాడు. నుదుట కుంకుమ బొట్టు పెట్టి, భ్రమరాంబకు పూజచేసి మల్లికార్జునున కభిషేకించి, వ్యాసపీఠం చెంత మఠంలో కూర్చుని, ఈశాన సంహిత పఠించాడు. తత్సంహితను గర్భంలో దాచుకొన్న స్కాందపురాణానికి కేల్మోగిచాడు.

శ్రీకారం చుట్టిన **శివరాత్రి మాహాత్మ్యాన్ని**, రక్తాక్షిలో ప్రారంభించి వసంతం తిరక్కుండానే క్రోధనలో పూర్తి చేసాడు. అప్పటికీ ఎనభైయైదేండ్ల ప్రాయం. శ్రీనాథుడెపుడూ, తన శ్రీమతితో - ఇది **సుకుమారచరిత్ర...** అని చదివి వినిపించేవాడు. రచయితలకు, ప్రథమశ్రోత తమభార్య కదా!... అంటే, భరించాలిగా, అనేది నవ్వుతూ. విత్త మదమత్త చిత్తులను మెత్త మెత్తగా ఎత్తిపొడిచి, విత్తమున్నవారికి చిత్తశాంతిలేదుబంతి-అనే మీ భావానికి మీ సీసం మేలు బంతి - అని అన్నదా ఇంతి. ఏమిటి? విష్ణువునకు శారఙ్గమును, బ్రహ్మకు గాండీవాన్ని ఇచ్చి, చక్కగా యుద్ధం చేయించారు. యుద్ధం మధ్యలో రుద్రుడు ప్రత్యక్షమైతే - వారు, నీలకంఠ నమోస్తుతే! అన్నారు - అని యజ్ఞపతి సతి సత్యం పల్కుతూంటే, విష్ణుజలకేళి వర్ణన వినిపించాడు, శ్రీనాథుడు.

విష్ణువు వరాహరూపాన్ని ధరించాడు. ఘుర్ ఘుర్ ధ్వనులు చేస్తూ పెద్దకడవలాంటి పాతాళ అంతర్భాగాన్ని చీల్చి లోతైన సముద్రంలో ఈదుతూ, తన చంచలమైన తోక అనే చబుకుతో నీటిలో కొడుతూంటే సమ్మెట వాయిస్తున్నట్లు చప్పుడవుతోందన్నారు. ఆహా! భూదేవి గళసీమగ్రాలు చుండగా ఉత్సాహంగా తోక త్రిప్పుతూ క్రోడం ఈదుతోంది. ఈ జలకేళి ముచ్చటగా ఉన్నదన్నదా వరవర్ణిని. పూర్తిచేసిన కావ్యాన్ని, క్రీ.శ. 1445 మహాశివరాత్రి నాడు, యతీశ్వరుని మూలభృత్యుడగు ముమ్మయ శాంతయ్యకు మఠాధిపతి యాజ్ఞానుసారం, అంకిత మిచ్చి, వరివస్యా ప్రతిఫలమన్నారు. శివసన్నిధిని పెన్నిధిగా తలచిన శ్రీనాథుడు, భుక్తి నొసంగిన మఠాధిపతికి కృతజ్ఞతలు తెలిపి శాంతయనాశీర్వదించి, శ్రీశైలపతి చెంత సెలవు తీసికొన్నాడు. పలనాడుకు పయనమయ్యాడు. చెన్నకేశవుని దర్శించాడు. శ్రీనాథుని చాటువులకు చెవులు కోసికొనే పండితావతంసులు గుడిచెంత శ్రీనాథుని దర్శించి, చిన్నిపూలర్పించి, ఆతిధ్యమిచ్చారు. బ్రాహ్మణ సత్రంలో ఉండడానికి అన్ని ఏర్పాట్లు చేసారు. వారంతా, వీరి "బంగారులాల" ను దక్షిణాధీశుని ముత్యాలశాలలో దర్శించిన పండిత పరమహంసలు. శ్రీనాథుని చూసినవారికి ముత్యాలశాల కనులముందు సాక్షాత్కరిస్తుందని, కనకాభిషేక ద్రష్టల అభిప్రాయం.

పలనాటి ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్న శ్రీనాథుని మనస్సులోని భావానికి

ప్రతిరూపంలా కంటికి చెన్నకేశవుడు సాక్షాత్కరించాడు! ఆ గడ్డపై పుట్టిన బిడ్డల వీరగాథ రచింపుమన్నాడు. "ఏష ఆదేశః, ఏష ఉపదేశః"... అని తలచి, పలనాటి వీరచరిత్ర రచనకు, చెన్నకేశవాలయంలో, ఆదైవము ముందరే కూర్చుని, శ్రీకారం చుట్టి, ఒకనాటి తెలుగు వారి సాంఘిక రాజకీయ సాంస్కృతిక జీవితానికి ప్రతిబింబంగా మంజరీ ద్విపదలో దేశ భక్తిని ప్రబోధిస్తూ, వసంతంలో కావ్యం పూర్తిచేసినాడు. ఇది చారిత్రక కావ్యం. ఇది పలనాటి వీర భారతం. జానపదులలో పుట్టిన కథ-కావ్య రూపం దాల్చింది. అని ఇచ్ఛావతి పల్కుతూంటే, పలనాటి భాగవతమన్నాడా అధ్వర్యుడు. ఆతిథేయులకా కావ్యం వినిపించి, కలలో కన్పించి కావ్యము వ్రాయుమని ఆదేశించిన శ్రీ చెన్నకేశవస్వామికే, **"పలనాటి వీరచరిత్ర"** గ్రంథాన్ని క్రీ.శ.1446లో అంకితం చేసాడు. ఈ విధంగా వారందిరినీ సంతృప్తి పరచి, వారి కోరిక మేరకు ప్రభవ వసంతమంతా కావ్యగానం చేస్తూ వారి ఆతిధ్యాన్ని స్వీకరించి, వారి చెంత సెలవు తీసికొని, విభవ వసంతంలో కృష్ణానదీ తీరం చేరారు. శ్రీనాథునికి ఎనభై ఎనిమిదవ వసంతం నడుస్తూంది. క్రీ.శ.1448. శా.శ.1370. ఆ వయస్సు నందు, వడిగల యెద్దులను కట్టుకొని మడి దున్ని బ్రతుకవచ్చుననుకొన్నాడు. మనస్సు ముందుకు ధ్వజినీ దండంలా ఎదురుగాలిలో పోతూంటే, పతాకాంశుకం వెనక్కు వెడుతూ రెపరెపలాడుతూ ఉంటుంది కదా! అలాగే, సేద్యం చేయాలనే కోరిక ధ్వజినీ దండంలా ముందుకు పోతున్నా, చర్మవస్త్రానికి శరీర పటుత్వం తగ్గటంతో ముందుకు వెళ్ళలేక వెనక్కు వెనక్కు తగ్గుతున్నాడు. నాడున్న ప్రభువుల నుండి, కృష్ణవేణీ నదీ తీరాన గల బొడ్డుపల్లెయను గ్రామాన్ని, ఏటేటా ఏడు నూర్ల టంకాలు శిస్తుగా తాను చెల్లించునట్లుగా గుత్తకు తీసికొన్నాడు. ఆ కృష్ణానదీ తీరంలోనే పర్ణశాల నిర్మించుకొని, భార్యతో కాపురం చేస్తూ, బొడ్డు పల్లెను చూసికొంటున్నాడు.

ముత్యాలశాలలో ఉన్నా, ఈ పర్ణశాలలో ఉన్నా శ్రీనాథుడు చిదానంద స్వరూపుడే! దుఃఖాలలో కలత నొందక, సుఖాలలో ఆసక్తి చూపక, అనురాగం భయం, కోపం తొలగిన స్థిత ప్రజ్ఞునిలా భాసించు శ్రీనాథుడు - కృష్ణానదీ తీరంలో గల గుత్తకు తీసికొన్న బొడ్డుపల్లె పొలాన్ని, సేద్యగాంధ్ర చేతిలో పెట్టాడు. పండిన పంటలో తనకు కొన్ని పాళ్ళిచ్చు పద్ధతిని అమరకం చేసాడు. కృష్ణవేణీ నదీ తీరాన గల తన పొలంలోనే తన భ్రమంతం. అనుకూలవతి కనుక వడి దుడుకులెన్ని ఉన్నా సర్దుకుపోతున్నదని తలచి, గృహిణులంత అలా ఉంటేనే కుటుంబగౌరవమన్నాడు. రవ్వంత చింత కూడలేని యా కులకాంత కనుగొనల నవ్వులు చిందిస్తూ, స్వామీ! కష్టసుఖాలు సముద్రతరంగాల్లాంటివి. ఉవ్వెత్తున

ఎగసి పడుతూ ముందుకు ఎంత వేగంగా వస్తాయో, అంతే వేగంతో వెనక్కి వెనక్కి వెళ్ళిపోవటం వాటి సహజ ధర్మం, అంటూనే అర్ధాంగలక్ష్మి బోసి నవ్వులు విసిరింది. శ్రీనాథుడు, తన పాణి గృహీతి విభూతి నర్థం చేసికొని లోలో మురిసాడు. సతీమతికి జోబిళ్ళు విసిరె!. ఈ లే నవ్వులు నాటి ముత్యాలశాలలోని కలకల నవ్వులకేమాత్రం తీసిపోలేదని, పూవు తావిలా కలసిన, చంద్ర చంద్రికల్లాంటి వారి దాంపత్యాన్ని తలచి కొలచి వలచి కొనియాడాడు.

వశినీ! బ్రహ్మదేవుడు, ప్రీతితో తన భార్య భారతిని జిహ్వాగ్రంపై నర్తింపజేసాడు. అంత సరసవతి స్వరాభిషేకం చేసింది. విష్ణుమూర్తి, శేషపాన్పుపై శయనించి హృదయపీఠిపై సిరికి చోటిచ్చాడు. ఆమె, విష్ణుపదాలు సేవించింది. మరి, పరమేశ్వరుడో తన అర్ధశరీరాన్నే ఇచ్చి స్త్రీ పురుషుల సమానత్వాన్నే చాటాడు. ఆమె, శక్తినే ధారపోసింది... అంటూనే, - "తపో విశేషంబునం బర్వతాత్మజ నీ దేహంబున సగపాలు గొనియె" నని భీమేశ్వరునితో పలికిన పౌరాణిక రహస్యాన్ని, దారకు నివేదించాడు, శ్రీనాథుడు. నీవు, నే నే... అన్నాడు, శ్రీనాథుడు.

స్వామీ! రస స్వరూప పరమాత్మ రెండుగా స్త్రీ పురుషులై సమస్త రసాలను పోషిస్తున్న సామవేద రహస్యాన్ని మీరెన్నోసార్లు, ఒకసారి చెప్పిన అర్థం మరొకసారి చెప్పకుండా చెప్పారు. **"సాహిశ్రీః అమృతాసతాం"**, "సాద్విధా విధాయ సర్వాన్ రసాన్ సమాహరతి" - మొదలగు శ్రుతులను గూడ వినిపించినట్లు శ్రీనాథ వృద్ధ వివరించింది.

మనం, సంసారసాగరంలో పయనిస్తున్నాం! ధర్మాన్నే చుక్కానిగా చేసికొని అర్థకామాలనే నావలో పయనిస్తున్నాం! త్వరలోనే మోక్షమనే గమ్యస్థానం చేరతాం!, ఏమండీ! ధర్మమనే చుక్కానే లేకుంటే అర్థ కామ రూపములైన నావ, నరుని నడిసముద్రంలో ముంచేస్తుంది. అందులో దుఃఖాలను కల్గించు క్రకచాలుంటాయని, తమరే, గంగలో స్నానంచేసి కాశీ మహాక్షేత్రంలో బోధించారు కదండీ!... అని గుర్తు చేసింది, శ్రీనాథ కవిసార్వభౌముని గృహలక్ష్మి - శ్రీలక్ష్మి.

స్వామీ! మీరు - మీ ముత్యాలశాల, ధన్యములైనవి. మీ సత్కీర్తి చంద్రికలు సమాజానికి శీతలత్వాన్ని పావనత్వాన్ని, తత్త్వాన్ని అమృతత్వాన్ని అందిస్తున్నాయి. విశ్వశ్రేయస్సు కోరి, మీరు రచించిన కావ్యాల వలన మీ జన్మ ధన్యత చెందినదన్నదా పోష్య ॥

సాధ్వీ! నీ సహకారంతోనే విశ్వకళ్యాణం కోరే తెలుగు వెలుగుల నందించు గ్రంథాలు వ్రాశాను. మనం, శబ్దార్థాలము! నీవు లేని నాడు, నేను లేను. వయస్తు ధన్యాః - అన్నాడు,

శ్రీనాథుడు.

ముత్యాలశాలను తలపించే పర్ణశాలలో, శివారాధన పూర్తిచేసాడు. "విభవ"లో వేసిన పంట వైభవం చూసి, సేద్యగాండ్రు పండిన పంటలో తామనుకొన్న ప్రకారం కొన్ని పాళ్ళిచ్చారు. ఇంకొంచెం కూడా ఇస్తామంటే, శ్రీనాథుడు వలదన్నాడు. ఏడునూర్ల టంకాల శిస్తు, ఒడ్డెరాజులకు చెల్లించాడు. శిస్తు కట్టగా మిగిలిన దానితో శుక్ల వసంతాన్ని గడిపేస్తున్నాడు. వచ్చే అతిధుల్ని, అభ్యాగతుల్ని సత్కరిస్తున్నాడు. విభవ వసంతం వైభవంగానే గడచినా, శుక్లవత్సరంలో క్షీణత తప్పలేదు. అయినా పంచాక్షరీ జపతత్పరుడై పరవశిస్తూనే, కుంకుమ శోభితతో కాలం గడుపుతున్నారు. వారణాశిలో అన్నపూర్ణమ్మ చూపిన మాతృవాత్సల్యాన్ని స్మరించాడు, శ్రీనాథుడు. జీవిత భాగస్వామిని ప్రేమతో మృణ్మయ పాత్రలో తెచ్చిన కృష్ణ తీర్థాన్ని సేవించాడు. పర్ణశాల పంచలోని అరుగుపై గల దర్భాసనంపై నడుం వాల్చాడు. శ్రీలక్ష్మి, మోదంతో భవన భర్త పాదాలు పట్టు సమయంలో, సోదరుడు దుగ్గన్న వచ్చి, చూచి, నివ్వెరపోయాడు. కొన్ని క్షణాలు, వేసిన చిత్తరువులా ఉండి, తేరుకొని – దేశికోత్తముల యంఘ్రి యుగ్మాన్ని సోదరిని వేడుకొని, ఆమె అంగీకారంపై, తానే బావగారి అడుగులకు మడుగులొత్తాడు. ఒడలు పట్ట బోతుంటే – దుగ్గన్నా! ఈ దేహానికి **సంవాహన** అవసరం లేదయ్యా అన్నాడు శ్రీనాథుడు బోసి నవ్వులతో! శ్రీనాథుని మహాభి నిష్క్రమణాన్ని అర్థం చేసికొని, దుగ్గన్న చింతించాడు.

బంగారు నాణేలను మట్టి గడ్డల్లా చూచిన మహనీయుడు, దీనారాలను పెల్లల్లా భావించిన ధీశాలి. వేవేల టంకాలను, దీనులకు ధారపోసిన వదాన్యుడు. పేద సాదలను, బీదలను, అంగవైకల్యం కలవారిని, అనాధలను, దిక్కులేని వారి నెందరినో ఆదుకొన్న ప్రాజ్ఞుడు. నావంటి వారి నెందరినో తీర్చిదిద్దిన గురుబ్రహ్మకా ఈ స్థితి?... అని మనస్సులో కుమిలిపోతున్నాడు దుగ్గన్న! ఆతని చింత గ్రహించాడు. నాయనా దుగ్గన్నా! అని దరికి రమ్మన్నాడు. మంత్రాలకే చింతకాయాలు రాల్తాయి! అంటూనే, కాళ్ళు చేతులు కడుక్కొని రమ్మన్నాడు. అలాగే శుచిగా వచ్చిన దుగ్గన్నకు మంత్రోపదేశం చేశాడు. చింత, నిత్యమూ బాధిస్తూనే ఉంటుంది. చితి – ఒక్కసారిగా బూడిద చేస్తుంది. చితి కన్న, చింత మిన్న! ఆత్మ, చంపబడదు. "దేహీ నిత్యమవధ్యోయం" – అయం దేహీ నిత్యం అవధ్యః – ఈ ఆత్మ ఎల్లప్పుడు చంపబడని వాడు, సనాతనుడు. పాంచభౌతిక దేహం, పంచభూతాల్లో కలసిపోతుంది. నీవు శోకింప దగని వారిని గూర్చి శోకిస్తున్నావు. మరణించిన వారిని గురించిగాని, జీవించియున్నవారిని గురించిగాని, జ్ఞానులు దుఃఖించరు. నేనుపదేశించిన

మంత్రాన్ని ఉపాసించు. సత్యం నీకు బోధ పడుతుంది. నాణేలకన్న గుణాలే మిన్న, ఆచంద్రార్కం నిలచేది సత్కీర్తి మూర్తియే! ఆడంబరం, రాతిపై పెట్టిన విత్తనం లాంటిది. అణకువ మట్టిలో పెట్టిన విత్తనంలా మొలకెత్తుతుంది. మంచి ఫలాలనిస్తుంది. శీలాన్ని మించిన సౌందర్యం లేదు. చైతన్యం ఉంటే శివం! లేకుంటే శవం! కోపం, పాపానికి ధూపంలాంటిది. కాముడుంటే రాముడుండడు. జితేంద్రియుడే యతీంద్రుడు, దేహమే దేవాలయం, జీవుడే దైవం. భవసాగరాన్ని దాటించునావ, భగవన్నామమే! అది, మృణ్మయుని – చిన్మయునిగా చేస్తుంది. నాయనా! దుగ్గన్నా! మోహక్షయమే మోక్షం! మోక్ష భవనానికి సింహద్వారం – శరణా గతి. మోక్ష పదమునకు, స్వర్గానికి సోపాన మార్గం, భారత. భారతియే! భారతీయులుగా జన్మించుట పూర్వ జన్మసుకృతం. అందున ఆంధ్రుడై ఆత్మతత్త్వము నెఱుంగుట అదృష్టమే! పుట్టినందుకు మరల జన్మలేకుండ, కామక్రోధాల్ని విసర్జించి, ఓంకారంతో కూడిన దైవనామాన్ని స్మరించి, తరించు. జీవిత పరమార్థం కైవల్యమేనని శ్రీనాథుడు బోధ చేస్తుంటే, "కామ క్రోధాల్ని విసర్జించాలి" అని అన్నారంటే, అవి మలమూత్రాల్లాంటి వన్నమాట" అని దుగ్గన్న మనస్సులో తలచి, తలవంచి, దోయిలించి, స్వస్తి పలికాడు.

భగినీ హస్తభోజనాన్ని ప్రసాదంగా స్వీకరించి, ఆచమనం చేసి, ఆచార్యుని సన్నిధిలో అంతే వాసియై కరాంజలులు సమర్పించాడు. శ్రీలక్ష్మిగారు పనులన్నీ పూర్తి చేసికొని, పతిచెంతకేతెంచి, శుశ్రూష చేస్తున్నారు.

ద్వితీయ, అద్వితీయ పరిచర్యలకు సంతసించిన గృహమేధి, శ్రీనాథుడు సుఖదుఃఖాలలో ఏకరీతిగా నుండునది, అన్ని అవస్థలలో అనుగతంగా నుండునది, హృదయానికి విశ్రాంతి నిచ్చేది. అరమరికలు లేక పండిన ప్రేమ నిగ్గులో స్థిరంగా ప్రతిష్ఠితమగునట్టి తమ దాంపత్యం భద్రమైనదిగా మనమున సంతసించి, కన్నులకు అమృతపు వర్తియౌజాయ, సేవకురాలిగా, చక్కని చిక్కని సలహాలనిచ్చు మంత్రిగా, భోజనం పెట్టు సమయాన తల్లిగా, సౌందర్యవల్లిగా, రూపంలో మహాలక్ష్మిగా, ఓర్పులో భూదేవిగా, సౌశీల్య సంపదతో విరాజిల్లే సుచరిత్ర పరమప్రేమైక హృదయానికి సేవలా – అన్నాడు. ఆ గామిని మనములోనే తలచిన శ్రీనాథుడు, దుగ్గన్నా! "జనని సంస్కృతంబు సకల భాషములకును, **దేశ భాషలందు తెలుగు లెస్స**" – అని దేశమంతా తిరిగిచాటాను. ఈ పద్యం వల్లభునికి బాగా నచ్చిందట. వెంటనే ఆపద్యాన్ని క్రీడాభిరామంలో జేర్చుకొంటానంటే, సరేనన్నాను. అందులో నాపద్యాలు చాలా ఉన్నాయి కదా! దాంట్లో ఇది కూడ జేరింది. ఈ పద్యాన్ని అనిమేషులకు

తెలియపరచాలని ఉంది! అమరలోకంలోని విబుధాళిని కూడ జయించి, విజయపతాక నెగురవేయాలి!, అని శ్రీనాథ సుకవీంద్రులు పల్కుతూంటే, గురుదేవా! మీరు, ఇటు రెడ్డి సామ్రాజ్యంలో వింశతి వసంతాలు విద్యాధికారిగా నుండి తెలుగు భాషా సంస్కృతులను దినదినాభివృద్ధి గావించారు. ఎందరినో సన్మానించారు. అటు, విజయనగరాన ముత్యాలశాలలో అరుణగిరినాథుని ఓడించి, వారి కంచు ఢక్కను వారి చేతనే ముక్కలుగ చేయించి, ఆ ముత్యాలశాలలోనే రాయలవారిచే కనకాభిషేక గౌరవాన్ని పొందారు. పద్మనాయక ప్రభువుల్ని మెప్పించి, నందికంత పోతరాజు కఠారిని సన్మానపురస్సరముగా గ్రహించి, రెడ్డి రాజుల కర్పించిన రాజనీతిజ్ఞులు. రాచకొండ ప్రభువులైన సర్వజ్ఞ సింగభూపాలుని, తమ కవితా ఝురుల నోలలాడించి, మెప్పించి, అచటి పండిత పరమహంసలను పారవశ్యమున ముంచి, శ్రీ విశ్వేశ్వర తీర్థుల దివ్యాశీస్సుల నొంది, తెలుగు భాషామతల్లి వైభవ ప్రాభవాలు దశ దిశల కర్పూరం వలె ఘుమ ఘుమలాడు విశద కీర్తి స్ఫూర్తులను వెదజల్లిన సంగతి, తెలుగు ప్రజాళికి తెలుసు! శుక్ల వసంతంలో కృష్ణానది పొంగి పొరలి మీరు గుత్తకు తీసికొన్న పొలాలు వఱదల పాలైనవని విని, మిమ్ములను చూడవచ్చాను. తిండికి గింజలు నిండుకొంటున్నాయని తెలిసింది...అని, నిస్సహాయ స్థితిలో నున్న దుగ్గన్న పలుకుటతోనే, ఆతని కన్నులు బిందువులను రాల్చాయి, దుగ్గన్న వైధుర్యం వెక్కిరించింది.

దుగ్గన్నా! పంటంతా వఱదల పాలవటంతో శిస్తు కట్టడానికి చేత టంకాలు లేవు. కృషికులీయవలసిన పాలి ధాన్యం వఱదల పాలవటంతో వారు మాత్రం ఎక్కడ నుండి తెచ్చి ఇవ్వగలరు? పంటంతా తుడిచిపెట్టుకొని పోవటంతో, ఏ దిక్కూ తోచక, కర్షకులు దీనాతిదీనులై రెండవ పంటగా అప్పు తెచ్చి నువ్వులు, పెసలు జల్లారు. అవి బాగానే పండాయని విన్నాను. ఇంతలోనే బిలబిలాక్షులు పక్షులు వచ్చి తినివేసాయట. **"యత్ర దైవ హతకః తత్రైవ యాంత్యాపదః"** - అన్నట్లున్నది నా పరిస్థితి... అని పలికిన శ్రీనాథ కవీంద్రుని చూచి, తలయూచి, **"విబుధ లోకమందు వెలుగు తెలుగు"** - అని విబుధ లోకాన ఎలుగెత్తి చాటడానికి, దివిజ కవీశ్వరుల నోడించాలనే జిగీష గల బావగారిని చూచి చకచ్చకితుడై, శుక్ల వసంత మహిమను కనులార తిలకించిన దుగ్గన; శ్రీనాథుని కావ్యాలు, తెలుగు సంస్కృతికి చక్కని వెలుగు బాటలని, ఆంధ్రసరస్వతికి అఖండ దీపారాధనలని, సారస్వత రసికులకు నిత్య నీరాజనాలని శ్లాఘించాడు. మర్త్యలోకంలో గల యుద్ధండ కవులపై కవచమేసి, తలలపై కాలుసాచి, నోర్లపై దన్ని, బొమ్ములుగాల్చి,

ఎదురు లేక వీర విహార మాచరించి, విజయ కేతనాల నెగుర వేసిన కవిసార్వభౌములు. వీరికి, గీర్వాణాంధ్ర కవిలోక మంత, పాదాక్రాంతులయ్యారు. అయినా, వారి జయేచ్ఛమరలుట లేదే. ముత్యాలశాలలోని విజయాన్నే తలచుకొంటూ, దివిజ కవివరులపై విజయేచ్ఛగల శ్రీనాథుని మనము గ్రహించిన దుగ్గన్న, బావగారి విజయ జిజ్ఞాసా ప్రమోదానికి ఐదు పదిసేసినంత ప్రమోదూత ప్రవేశించింది. శాలిశకం 1372, క్రీ.శ.1450 నడుస్తోంది. ఓ రోజున, విధురుడైన దుగ్గన - వారిచెంత కేతెంచు వింత దృశ్యాన్ని తిలకించి నిశ్చేష్టుడయ్యాడు.

ఒడ్డెరాజ పురుషులు, శ్రీనాథుడు శిస్తు ధనాన్ని చెల్లించలేదని. భటుల్ని తీసికొని, పర్ణశాల చెంతకు చెలరేగిపోతూ, వికటాట్టహాసాలతో వస్తున్నారు. వారి రాకను గమనించిన శ్రీనాథుడు, చిరునగవులు చిందిస్తూ, లేచి దర్భాసనంపై కూర్చున్నాడు. శ్రీలక్ష్మి ప్రక్కనే ఉంది. యమ దూతల్లాంటి భటులతో, రాజపురుషులు పర్ణశాల సమీపించి, అక్షారాలు రాక, అసంకల్పితంగానే "దండాలయ్యా" - అన్నారు.

అగ్ని జ్వాలల్లా చెలరేగి పోతూ వచ్చి, శ్రీనాథుని చల్లని చూపు పడగానే చల్లబడటం చూచిన, ఏకాశీతి వసంతాల దుగ్గన చకచ్చకితుడయ్యాడు. కృషికులీయ వలసిన పాలిధాన్యం వఱదలపాలై వారీయ జాలకపోయినా, గుత్తకు తీసికొన్న మీరే చెల్లించాలని చెప్పారు. మీరు నిజమేచెప్పారు. పెసలు బాగానే పండాయి. అవి అమ్మి మీ శిస్తు చెల్లించాలను కొన్నాను. కాని, అవి బిలబిలాక్షులు తినేసాయి. ఇది మీకు తెలిసిన సత్యమేకదా, అని పలికిన శ్రీనాథుని మాటలు పెడచెవిని పెట్టి, దుగ్గన్న వారిస్తున్నా వానిని ప్రక్కకు నెట్టి, పర్ణశాలంతా వెతికారు, పర్ణశాలలో మట్టికుండలు, పిడతలు, మట్టి పాత్రలే తప్ప, భటులకెక్కడా, ఒక్కటంకమైనా కంటపడలేదు. పట్టుపీతాంబరాలు లేవు, అన్నీ కుచేలములే. వారి కోపం కట్టలు త్రెంచుకొంది. మృణ్మయ పాత్రలను తెచ్చి, పర్ణశాల ముందున్న రాతిపై చితుక కొడుతూంటే... "కడు నుద్రేకించి హట్టంబునన్ భిక్షా పాత్రము ఱాతిమీద శతధా భిన్నంబుగా వైచితిన్" - అని శ్రీనాథుడు, తాను రచించిన భీమేశ్వర పురాణంలోని పద్యాన్ని చిద్విలాసంతో పఠించాడు. కుండల్ని బ్రద్దలు కొడుతూంటే, అడ్డుకొంటున్న దుగ్గన్నతో - "బాధాచరణంబు నైజము కదా తలపోయ కృతాంత దూతకున్" - అన్నాడు పిన్న, నవ్వుతో శ్రీనాథ దీక్షితుడు. దీక్షితాయిని, స్థిత ప్రాజ్ఞి, వీరిని చూసిన ప్రాడ్వివాకులు, ఆ త్రయిని హెచ్చరించారు. శిస్తు చెల్లించలేదు కనుక, శిక్షల ననుభవింపవలసినదే నన్నారు. వారు ఆతతాయినులు. శిస్తు చెల్లింపని గుత్తదారులకు కఠిన తరములయిన శిక్షలున్నాయి.

ప్రభువులతో చెప్పి, వారు విధించిన కఠిన శిక్షలను వెంటనే అమలు పరుస్తామని చెప్పి వెళ్ళారా ప్రాడ్వాకులు. ఒడ్డె రాజులు, ఒడ్డోలగంలో నుండగా, బొడ్డు పల్లెకు వెళ్ళి వచ్చిన ప్రాడ్వివాకులు, ప్రాడ్వాకులు శిక్షక భటులతో సభా ప్రవేశం చేసారు. శ్రీనాథుడు శిస్తు చెల్లింపలేదని, ఆతని చెంత ముంతలున్నాయి కాని, చిల్లిగవ్వ కూడ లేదని చెప్పారు. వారి, వాగ్ధార శాత్ర వాగ్నికి ఆజ్యధారయై, భగ్గున మండటంతో, ఒడ్డె రాజుల కనులు ఎఱ్ఱబడ్డాయి. న్యాయమూర్తులను రప్పించి, విషయాలు చర్చించారు. శ్రీనాథుని పర్ణశాలలో మట్టి కుండలు, మట్టి పిడతలు, ముంతలు, మూకుళ్ళు మాత్రమే ఉన్నాయని, విలువైన వస్తు వేదీ లేదని, ఒక్కటంకా కూడ దొరకలేదని, వాని పొలాలలోని మొదటి పంట వరద పాలైందని, రెండవ పంట పక్షులు, మిడతల దండు తిన్నాయని, ఆతడే మాత్రం కట్టే స్థితిలో లేడని, ప్రాడ్వివాకులు వివరించారు. తొంభై ఏండ్ల వృద్ధ భూసురుడు, మహాకవి యని, రాజాస్థానాలలో బాగా బ్రతికిన వాడని, ఎందరెందరికో దాన ధర్మాలు చేసిన దాతయని, శ్రీనాథుని వైభవాన్ని తెలిపి, వారిని కనికరించి శిక్షలు వేయక వదలివేయుండని, వారిలో ఒకరిద్దఱు న్యాయమూర్తులు, విన్నవించారు. ఒడ్డె రాజుల హృదయాలు ద్రవింపలేదు సరికదా గట్టి పడ్డాయి. రెడ్డి రాజులు మనకు పరమ శత్రువులు. మన శత్రువులకు మిత్రుడాతడు. శత్రువుల మిత్రుడు, మనకూ పరమ శత్రువే! మన శత్రువులైన వేమ, వీరభద్రారెడ్డి సోదరుల్ని ఎన్నో ఏళ్ళ నుండి కాపు కాసి, మోసం చేసి మట్టు పెట్టాం! నిప్పు కణాన్ని ఒక్కటే కదా అని వదలేస్తే, అది రాజుకొని అంతనీ దగ్ధం చేస్తుంది. శత్రుశేషం ఉండవచ్చా? మీరే చెప్పండి... అన్నారు ఒడ్డెరాజులు.

వారి ఆంతర్యాన్ని అర్థం చేసికొన్న ప్రాడ్వాకులు, శత్రుశేషం ఏమాత్రం ఉండ కూడదన్నారు. "ఋణశేషం, శత్రుశేషం, అగ్నిశేషం తథైవచ; పునః పునశ్చ వర్థంతే తస్మాత్ శేషం న కారయేత్" – అని శాస్త్రం చెపుతోంది... అని వాదించారు. చెడుయె తలకెక్కుతుంది... అని కొందరు మనములోనే మథన పడ్డారు. కొందరు పెద్దలు సాహసించి, బ్రాహ్మణ హత్య మహా పాతకమని, అది వినాశనానికి దారితీస్తుందన్నారు. ఒడ్డెరాజులు, కొంచెం జంకారు. అయినా శత్రు శేషాన్ని జీవచ్ఛవంలా శిక్షించాలని తలచారు. ఇది శ్రీనాథునిపై గల పగ కాదు. రెడ్డి రాజులపై గల పగ, ప్రతీకారాలను, వారి యాశ్రితుడైన శ్రీనాథునిపై కూడ తీర్చుకోవాలన్న ప్రాడ్వాకుల పలుకులే, దుష్ట రాజుల చెవులకింపుగా వినబడ్డాయి. చెడుయె తలకెక్కు ననుమాట పుడమినిజము!

ముత్యాలశాలలో కనకాభిషేకాన్ని పొందిన శ్రీనాథ కవి సార్వభౌమునికా శిక్షయని, కొందరు

న్యాయమూర్తులు మనములోనే వెతజెంది, "వినాశ కాలే విపరీత బుద్ధిః" అని తలచారు.

పూర్వాపరాలన్నీ చర్చించాక; శ్రీనాథుడు శిస్తు రూపంలో చెల్లించాల్సిన ఏడు నూర్లటంకాలకు, ఏడు విధాలైన శిక్షలను అమలు పరచాలని నిర్ణయించారు.

మొదటి శిక్ష : "పొగడ దండ". ఇది చాలా క్రూరమైందిగా నిర్వహించాలి. ఏదో సంకెళ్ళు వేసామంటే కుదరదు. గొలుసుతో మెడను మీగాలిని అంటదీసి కట్టించాలి.

రెండవ శిక్ష : ఏమిటంటే – అలా పొగడదండలా గొలుసు వేసి శిక్షించిన వానిని, అక్కడే వదలి వేయకుండా రాజవీధిలో త్రిప్పాలి. ఎప్పుడో తెలుసా, నీడలో కాదు, వఱువాతను కాదు, సూర్యాస్తమయమయ్యాకను కాదు. పొద్దుగుంక కుండానే, ముఖానికి ఎండ ఎదురయ్యే సమయంలో పొగడ దండ శిక్షవేసి, నడపించాలి.

మూడవ శిక్ష : ఏమిటంటే – నగరి వాకిట నిలబెట్టి, బుజం మీద పెద్ద నల్లరాతి గుండు పెట్టి శిక్షించాలి.

నాల్గవ శిక్ష : ఏమిటంటే – నల్లరాతి గుండు, బుజంపైనుండగానే, రాజవీధిలో పరుగెత్తించాలి.

ఐదవ శిక్షగా : 'వెదురుగొడియ' విధిస్తున్నాం. చేతులు రెండింటిని, రెండు బెజ్జాలు చేసిన, పెద్ద వెదురు బొంగులోనికి చొప్పించి, ఊడి రాకుండా నిలువుగా కఱ్ఱ చీలలు బిగించి, రెండు చేతుల బొటన వ్రేళ్ళను త్రాటితో గట్టిగా దగ్గరగా బిగించి కట్టాలి. ఇదే "వెదురుగొడియ" శిక్ష.

ఆరవ శిక్షగా : రెండు కాళ్ళు మెదలుకుండునట్లు కాళ్ళకు ఇనుప సంకెలలు వేసి కఠినంగా శిక్షించాలి. వేగంగా నడిచే విధంగానే ఈ సంకెళ్ళు వేయాలి.

ఏడవ శిక్షగా : పై శిక్షలన్నీ అమలు పరచు సమయంలో, వానిని కొరడాలతో రక్తాలు చిందేలా కొట్టించాలి. ఈ శిక్షల వల్ల మనం చంపకుండానే, వాడు మరణించాలి. అపుడు శత్రుశేషం ఉండదు. పైగా భూసుర హత్యాదోషమూ ఉండదని ప్రాడ్వాకులు పలికారు. ఈ శిక్షలన్నింటిని వెంటనే పాటించండని, ఒడ్డెరాజుల శిలాహృదయాలు తేల్చి చెప్పాయి. శిస్తు చెల్లించే వరకూ శిక్షించాలి. లేదా మరణించే వరకూ శిక్షించాలన్నారు. దాంతో ప్రాడ్వాక చతుష్టయం, భటాళితో శిక్షల నమలు పరచే సాధనాలను తీసికొని, బొద్దుపల్లెకు బయలుదేరారు.

దర్భాసనంపై ధావళి ధరించిన శ్రీనాథుడు, పద్మాసనంలో ఉంటే, చెంతనే ఉండి శ్రీలక్ష్మి చిర్నగవులు చిందిస్తూంటే, వారిని లక్ష్మీనారాయణులుగా తలచి, దుగ్గన్న చిన్ని

పూలర్పించారు.

ఇంతలోనే, ఒడ్డె రాజ భటులు హుటా హుటిని వచ్చి, పర్ణశాల పంచలోనున్న శ్రీనాథుని బయకులాగారు. దుగ్గన్న నోట మాటరాలేదు. ఆతనిని పక్కకు నూకి, శ్రీనాథునికి శిక్షలమలు చేయుట ప్రారంభించారు. శ్రీ లక్ష్మి యోగేశ్వరియై ధ్యానముద్ర వహించినది.

ముత్యాలశాలలో కనకాభిషిక్తుడైన కవిరాజు కంఠాన ఇనుప గొలుసులు బిగించి, మీగాలికి కలిపి కట్టేసి పొగడ దండ శిక్ష నమలు పరచారు. లాక్కుపోతుంటే వారి వెనకాలే దుగ్గన్న పరుగులెత్తాడు. నెత్తి నోరు బాదుకొన్నాడు. అడ్డు తగులుతూంటే దుగ్గన్నకు కూడ నాలుగు తగిలించారు. పుర వీధిలో ఎదురెండ నడిపిస్తున్నారు. కొంత దూరం వెళ్ళాక నగరి వాకిట నుండు నల్లరాతి గుండును శ్రీనాథుని బుజంపైకి ఎక్కించి గొలుసులతో బిగించారు. రాజ వీధిలో పరుగెత్తిస్తున్నారు. తొంభై ఏళ్ళ వృద్ధుడు పరుగెత్తలేక, కనీసం గట్టిగా నడవలేకుంటే కొరడాలతో కొట్టుతున్నారు. చేతులకు వెదురు గొడియ బిగించారు. చేతులు కదపడానికి వీలు కుదరటం లేదు. నడచే విధంగానే రెండు కాళ్ళకు, ఇనుప సంకెళ్ళు బిగించారు. కొరడాలతో కొడుతూ, సమజాన్ని తోలునట్లు, తోలుతున్నారా సమజం. వృద్ధ భూసురుని దేహం నుండి, వారు కొట్టే కొరడా దెబ్బలకు రక్తాలు చిందుతున్నాయి. నడవలేక నడవలేక పడిపోతుంటే, లేవదీసి, కొడుతున్నారు. ఈ విరత శిక్షల్ని భరిస్తున్న వృద్ధుణ్ణి చూస్తూన్న పుర ప్రజలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఆతతాయినులైన, ఆ దుష్టచతుష్టయం గావించే వికావిక నవ్వులు, వెకిలినవ్వులు, కొందరకు వెగటు కల్గిస్తున్నాయి. దుష్టభటులు కొరడాలతో కొడుతూ పక పక నవ్వుతున్నారు. అనాదర దరహాసాలు, అసహ్యంగా ఉన్నాయి.

ఆరడుగుల ఆజాను బాహువు, ముసలిపండు దేహం నుండి కొరడాదెబ్బలకు రక్తం చిమ్ముతుంటే, విరగబూసిన ఎఱ్ఱపూవుల కడిమి చెట్టులా శోభిస్తున్నాడు. ఈ దుర్భర దుస్థితిని చూడవలసి వచ్చిందేనని, బాధతో ముత్తైదువులు దుమ్మెత్తి పోస్తున్నారు. అస్తమించే సూర్య బింబంలా ప్రకాశించే శ్రీనాథుని రక్తసిక్తమైన దేహాన్ని చూచి, దుగ్గన్న నిర్ఘాంత పోయాడు. ఆతతాయినుల ఆగడాలను భరింపలేక, నడచే శక్తి లేక శరీరం నుండి కారిన రక్తపు మడుగులో పడిన శ్రీనాథుని చూచి, దగ్గుపల్లి దుగ్గన సొమ్మసిల్లి కుప్పకూలాడు.

సహవాసి శుశ్రూషతో మెలమెల్లగా తేరుకొన్నాడు, దుగ్గన్న, శిష్య ప్రశిష్యుల వరివస్యచే స్వాస్థ్యమునొందిన శ్రీనాథ సత్కవి, తన అనుభూతి విభూతిని సీస పద్యంలో వినిపించాడు.

సీ॥ కవిరాజు కంఠంబు కవుగిలించెను గదా

పురవీధి నెదురెండ పొగడ దండ
సార్వభౌముని భుజాస్తంభ మెక్కెను గదా
నగరి వాకిట నుండు నల్లగుండు
వీరభద్రారెడ్డి విద్వాంసు ముంజేత
వియ్యమందెను గదా వెదురు గొడియ
ఆంధ్ర నైషధ కర్త యంఘ్రి యుగ్మంబున
దగిలి యుండెను గదా నిగళ యుగము

గీ॥ కృష్ణవేణమ్మ గొనిపోయె నింత ఫలము
బిల బిలాక్షులు తినిపోయె తిలలు పెసలు,
బొడ్డు పల్లెను గొడ్డేటి మోసపోతి
నెట్లు?, చెల్లింతు టంకంబు లేదు నూర్లు

ఏడు నూర్లటంకాలను చెల్లింతు ననిన శ్రీనాథుని మాట వింటూనే, పువ్వులతో పూజలు చేయాలని దరి జేరిన శాంతయ్య, శ్రీలక్ష్మి హస్తసంజ్ఞాదరలీలచే, తనకు లభించిన ఏడు వందల బంగారు నాణెములను ఒడ్డెరాజులకు చెల్లించి, శిస్తుకట్టిన రశీదు తెచ్చి మద్యపాన ప్రియులైన సభికులగు ప్రాడ్వాక చతుష్టయానికి చూపి, వారలచే విముక్తుడైన శ్రీనాథునితోను వాని సచ్ఛాత్రులతోను దుగ్గనాది సహపాఠులతోను, పర్ణశాల చేరాడు. సేవలు చేసాడు. శ్రీనాథుడు కోలుకొన్నాడని సంతోషించాడు, శాంతయ్య.

శ్రీలక్ష్మి శ్రీనాథ దంపతులకు, శాంతయ్య పువ్వులతో పూజలు చేసాడు. ముమ్మయ శాంతయ్య భక్తి శ్రద్ధలకు సంతసించిన శ్రీనాథుడు, "పువ్వలపు శాంతయ్యా! నీవు ధన్యుడవయ్యా, యశో విరాజితుడవై వర్ధిల్లుదువని దీవించాడు. దుగ్గన్నను దరికి పిలిచి, **ప్రణవ మంత్రోపదేశం** చేసాడు. దుగ్గన్నా! మీ తల్లి గారికి ఒకే కాన్పులో నీవు, నీసోదరి కవలలుగా పుట్టారు. దుర్గాదేవి ఉపాసకురాలైన మీ తల్లిగారు, ముందుగా పుట్టిన నీ సోదరిని 'దుర్గ' - అని పిలిచారు. ఆమె పుట్టిన కొన్ని నిమిషాలకే నీవు పుట్టినందున, నిన్ను 'దుగ్గ' అన్న - అన్నారు. కవలలో వెనుక పుట్టిన వారే పెద్దవారు, ఎందుకంటే గర్భంలో ముందుపడిన బీజమే నీవు. తర్వాత నీ సోదరి. తర్వాత వారే ముందు పుట్టుట సహజం. అందుకే నీవు దుగ్గన్న వైనావు. నీ సోదరి దుర్గయే నా దారగ దరిజేరి, శ్రీలక్ష్మియై నన్ను చేపట్టింది. సరసవతియై అక్షరార్చన చేయించింది. ముగురమ్మల మూలపుటమ్మ దీవెనలతో సహధర్మిణియై తొంభైఏళ్ళు గుత్తకు తీసికొన్న ఈ బొడ్డు పల్లె యౌ దేహాన్ని

విస్మరించేలా చేసింది, అని శ్రీనాథుడు చెప్పి, ధ్యాన ముద్ర వహించాడు. అంత, సరససాహిత్య సేద్యం చేసిన శ్రీనాథుని తురీ యావస్థ, మాయాకల్పితమని ప్రణవోపాసనచే గుర్తించి, సత్యస్వరూపాన్ని దర్శించాడు, దుగ్గన్న.

విద్వత్కల్పులు కొందరు, శ్రీనాథుని సీసపద్యంలో గల ఆనందవర్ధనత్వాన్ని తెలుపుమని దుగ్గన్నను కోరారు. విద్వద్దేశ్యుల సందేహ నివృత్తికై, శ్రీనాథుని పాదాలపై శిరస్సు నుంచి సాష్టాంగ ప్రణామంచేసాడు దుగ్గన్న. శ్రీనాథుని పాదస్పర్శచే దుగ్గన్న శిరస్సు పునీతమైనది. శ్రీనాథుని కంఠానగల ముక్తావళిని దర్శించి, నమస్కరించాడు. అదియే శ్రీనాథుని సత్కీర్తిపతాకయౌ ముత్యాలశాలయని సంభావించాడు. పద్య భావాలు, వినిపించాడు. శ్రీనాథ కవి రాజు, తన కంఠాన 'పొగడ దండ' కట్టబడినది – అనక, అది కంఠమును కౌగిలించుకొన్నది – అనినారు. శ్రీనాథుడు, ఆలింగ్యమానుడు. తొంభై ఏళ్ళ నుండి వియోగాన్ని భరించిన పొగడ పూలదండ తానే వచ్చి, ఇకపై వియోగాన్ని భరింపలేక పురవీధిలోనే ఎదురెండలో, శ్రీనాథుని కంఠాన్ని కౌగిలించుకొన్నది. ఆహా! దాని ఉత్కంఠకే ఉడుగరలన్నాడు. ఇది శిక్షయని భ్రమపడుతున్నారా? శిక్షలొచ్చి కౌగిలించుకొంటాయా? కౌగిలించుకోవటం ప్రేమకు ప్రతీక గాని, పగకు కాదు కదా! పగతో శిక్షించే వారికి ప్రేమ ఉంటుందా? అందునా కవిరాజునా? ఇది స్వవచోవ్యాఘాతమే కదా! పురం – అంటే పూర్ణమైన విశ్వం. విశ్వం విష్ణుః – అని విష్ణు సహస్ర నామాలననుసరించి, పరిపూర్ణమైన పురుషోత్తముడగు శ్రీనాథుడే దర్శనమిస్తున్నాడు. 'ఎండ' – వారినేత్రమే. అందుకే 'ఎదురెండ' – అన్నారు. కవిరాజు – అనటంచే, కవింకవీనాం – అను శ్రుతిరహస్యాన్ని వివరించారు. రసజగన్నాథుడు శ్రీనాథుడే స్వస్వరూపాన్ని పొందు సమయాన పొగడదండ – వారి కంఠాన్ని కౌగలించుకొన్నది. వకుళమాలికదా!

ఒడ్డె రాజులు, అధికారమదాంధులై చూడలేకపోయారు కాని, వారు శ్రీనాథుని శిక్షింప కల్గినంతటి వారా? శిక్షించామనే భ్రాంతిలో రాజులు, రాజభటాళి ఉన్నారు. సమానశీల వ్యసనపరులు కనుకనే సఖ్యమేర్పడి, శ్రీనాథుని భుజముపై బండపెట్టి శిక్షించామని విర్రవీగుతున్నారు. అదంతా వైష్ణవమాయ. శ్రీనాథుడు, తన సీసాన, భుజముపైన అని అనలేదు. భుజాస్తంభమనినాడు. భుజాస్తంభముపైకి, నగరి వాకిటనుండు నల్లగుండు వచ్చి ఎక్కినదట! ఎవరిది? సార్వభౌముని భుజాస్తంభ మెక్కినదన్నాడు. గుండు – అంటే పర్వతం; అది ఎక్కడ ఉన్నది? నగరి వాకిటనున్నది. నామైకదేశే నామగ్రహణం – కనుక, మధురానగరి వాకిటనున్న గోవర్ధన గిరియే, శ్రీనాథుని భుజాస్తంభమైన

కరకనిష్ఠకాగ్రమందు ఎక్కెను గదా! ఆహా! గోవర్ధనగిరి కనిష్ఠికాధిష్ఠితమైనది. గోవర్ధన గిరిధారి దర్శనమిచ్చినాడు. 'యద్భావం, తద్భవతి' కదా. శ్రీనాథుడు, శ్రీనాథుడే.

శ్రీనాథుని ముంజేత, వెదురు గొడియ - అంటే, మురళి వియ్యమందినది ఏమిచమత్కారము? విద్వాంసుని ముంజేత, అనటంచే 'విద్వాన్ సర్వత్రపూజ్యతే' - విద్వాంసుడు త్రిలోకపూజ్యుడు. ఆతడు, విద్వత్తముడు - కనుక ఇది శిక్ష అనటానికి వీల్లేదు. అందున, వియ్యమందినది. కళ్యాణం జరిగితేనే వధూవరుల తల్లిదండ్రులు ఒకరికి మరొకరు వియ్యంకులవుతారు. ఇది శుభపరిణామమే. వియ్యమందితే చుట్టలైనట్లేనని మురళీధరుడైనాడు. వీరభద్రారెడ్డి యాస్థాన విద్వాంసుడైన శ్రీనాథుని ముంజేత వియ్యమందినది 'వంశి' యే నని వెదురు శబ్దంతో నిర్ధారించినాడు. కాశీఖండ కృతి భర్త వీరభద్రారెడ్డి సామాన్యుడు కాడు. సాక్షాత్తు వీరభద్రేశ్వరుడే! ఆ పరమమాహేశ్వర భక్త శిఖామణియే 'కాశీఖండ' కృతి భర్త. కృతి కర్త, విద్వాంసుడు మాత్రమే కాదు, కాశీక్షేత్రాన్ని సందర్శించి, విశ్వేశ్వరునభిషేకించి, అన్నపూర్ణమ్మ చేతి ప్రసాదాన్ని ఆరగించి, అయఃపిండంలాంటి కాశీఖండాన్ని పరమేశ్వరానుగ్రహంతో పయఃపిచ్ఛలంగావించిన ఈశ్వరార్చన కళాశీలడౌ సచ్ఛీలుడు శ్రీనాథుడు. శిస్తు కట్టనివాని ముంజేతికనే భావాన్ని ఇట వ్యక్తపరచలేదు. పైగా విద్వాంసుని, అనటంచే శిక్షార్హుడు కాడనుట సుస్పష్టము. అలాకాకుంటే ఇది స్వవచో వ్యాఘాతమౌతుంది కదా! ఈ పద్యాన్ని పలికినవాడు ముత్యాలశాలలో కనకాభిషిక్తుడౌ విద్వాంసుడు. ఇది సత్యవచస్కుని వినమ్రవాణి. వెదురు - అంటే పిల్లన గ్రోవియే. ఇదియే విద్వాంసుని ముంజేత వియ్యమంది ధన్యమైనది. విద్వదౌషధమైన శ్రీహర్ష నైషధాన్ని తెలుగుభాషలో విద్వదమృతంగా అందజేసినవాడు శ్రీనాథుడు. సంస్కృత కవి, సంస్కృత భాషలో తన భావాలకి అనుగుణంగా వ్రాయుట సులభతరం. ఎలాగంటే, విలుకాడొకడు తన బాణంతో ఏ చెట్టుకో గోడకో తన ఇష్టం వచ్చిన చోటకొట్టి, బెజ్జం చేస్తాడు. కాని, తర్వాత వాడు, ఆ బెజ్జంలో నుంచే బాణం వెళ్ళేలా కొట్టాలంటే ఎంతకష్టం? రెండవ వానిదే కష్టతరమైనట్లుగానే, మూల భావం చెడకుండా, ఆంధ్రీకరించువానిదే కష్టతమ మనిన విషయం, విద్వాంసునికే తెలుస్తుంది. గొడ్రాలికి కనెడి బాధ తెలియనట్లుగా, అవిద్వాంసులకు తెలియదు కదా! కనుక, శ్రీనాథుడంతటి విద్వాంసుడాంధ్రీకరించి నాడంటే సామాన్యమా! శ్రీనాథుని **ఆంధ్రనైషధం**, ఆతని విద్వత్తుకు నికషోపలం. శ్రీహర్షుని కవితాను గుంఫములు, కొందరు సోమరిపోతులు మెచ్చుకోలేరు. అందుకే, 'లేజవరాలు చెక్కుగీటిన, వసవల్చు బాలకుని డెందమునం గలగంగ

నేర్చునే?' – లేత ప్రాయపు సుందరి చెక్కిలి మీటితే, నోట వసవాసన గొట్టు పసివానిడెందము కరగుతుందా?... అనినాడు శ్రీనాథుడు. మూర్ఖులు, సత్కావ్యాలను నిందించటం, 'శుష్కస్తనీ కంచుక న్యాయం' లాంటిదని వివరించాడు.

నైషధ కావ్యస్మరణచేతనే కలిదోషం పోయి, పుణ్యం ప్రాప్తిస్తుంది. "కర్కోటకస్య నాగస్య దమయంత్యా నలస్యచ, ఋతుపర్ణస్య రాజర్షేః కీర్తనం కలినాశనం" – అను ఆర్యోక్తిచే నలకీర్తనం కలినాశన హేతువు. నైషధాన్ని పఠిస్తే, కలిదోషాలు తొలగి, ఆయురారోగ్య విమల విద్యావివేక భాగ్యసౌభాగ్య వైభవ ప్రాభవాలు పొందుదురనిన శ్రీనాథవాణి సత్యం. అంతటి గ్రంథాన్నే రచించిన శ్రీనాథుని పాదాలు, బ్రహ్మకడిగినవి. ఆ పాదాలు దర్శిస్తూంటే, అనంత వేద ఘోష వినిపించింది. అవి పరమాత్మ నిఃశ్వసితాలు. అవి శ్రీనాథుని పదాలనాశ్రయించాయి. అంఘ్రి – అంటే పద్యచరణమనియే భావం. ఇట పదద్వంద్వమన్నమాట. పదద్వంద్వానికి, ని – అంటే నిగమము, అంటే వేదమన్న మాట. ఇది శబ్దబ్రహ్మం. గళం – అంటే వాద్యము. నిగళం – అంటే శ్రుతికంఠం. యుగమంటే – నాలుగు సంఖ్యకు సంకేతం. ఒడ్డెరాజుల కుదృష్టికి శ్రుతిస్వరాలు, సంకెళ్ళుగా కనబడుటలో ఆశ్చర్యం లేదు. ఇదే వైష్ణవ మాయ. జీవాత్మ–పరమాత్మల ననుసంధానం చేసిన సోऽహం స్వరూప హంసయను శ్రుతిస్వరాలు, శ్రీనాథుడు ప్రసాదించిన వరాలు. అవి, వలపించు సిరిమువ్వల స్వరాలు. ఇది శ్రుతి స్వరార్చన.

నాలుగు శ్రుతులకంఠాలు, అంటే నిగమస్వరాలు శ్రీనాథుని పద ద్వయిని స్తోత్రం చేస్తున్నాయి. తగిలియుండెనను పద ప్రయోగంచే, శ్రుతులకు శ్రుతి స్వరూపుని యందే సంబంధమున్నదన్న సంగతి సుస్పష్టమవుతోంది. "యస్యనిఃశ్వసితం వేదాః" – అను శ్రుతిచే, పరమేశ్వరునినిఃశ్వసితములే వేదాలని, అపౌరుషేయ శ్రుతులే శ్రీనాథుని పదద్వయిని **తగిలి** శబ్దబ్రహ్మనే **మోహింపజేస్తున్నాయి**. ఇలా ఈ నాల్గుపాదాల్లోను, ఆ సాంత యోగ విద్యా హృదయంతో బాటు, ఆ మూలాగ్ర రహస్యాన్ని శ్రీనాథుడీ సీసంలో విశదీకరించినట్లు గ్రహించాడు, దుగ్గన్న. ఏడు నూర్లటంకాల శిస్తు చెల్లింపనందులకై ఏడు విధాల శిక్షలను ఒడ్డెరాజులు విధించి అమలు జరిపినట్లుగా భావించి తృప్తిచెందారని గ్రహించాడు. నిజానికి ఆ ఏడు, మూలాధార స్వాధిష్ఠాన మణిపూరక అనాహత విశుద్ధ ఆజ్ఞా సహస్రారములను సప్తచక్రాల యోగదర్శన రహస్యమే ఇందంతర్వాహినిలా సరసవతి ప్రవహిస్తూంది కనుకనే భారతికి హారతులిచ్చాడీ భారత భారతీనందనుడుగు శ్రీనాథుడు.

సప్తధాతువులతో కూడిన దేహ మశాశ్వత మనిన విషయాన్ని కూడ, సప్తావరణములు

తొలగినంత, ఈ దేహంతో సముపార్జించిన ఫలమంత కృష్ణవేణి తల్లియగు **గంగ**గొని పోయిందని, పాపపుణ్యాలన్నీ కృష్ణవేణమ్మ గొనిపోతే పునర్జన్మ ఉండదనే సత్యాన్ని తెలియజేసి, తాను బ్రహ్మర్షియై, తన దేహం కూడ కృష్ణవేణీ ప్రవాహంలో కలసిపోతుందనే భవిష్యత్తును తెలిపిన త్రికాలజ్ఞాని. ఈ పాదంలో కూడ శ్రీనాథుడు తన స్వస్వరూపాన్ని తెలిపి మహాభినిష్క్రమణాన్ని సూచించిన సర్వజ్ఞుడని, దుగ్గన్న సంభావించి, తోటివారికి వివరించాడు.

కృష్ణవేణీ నది పొంగిపొరలిందని, శ్రీనాథుడు గుత్తకు తీసికొనిన పొలంలోని పంటంతా ఆ ప్రవాహంలో కొట్టుకుపోయిందని, దాంతో శిస్తుధనం రాక, పన్నుకట్టలేక పోయాడనిన భావం – "కృష్ణవేణమ్మ గొనిపోయె నింతఫలము" – అనిన శ్రీనాథుని వక్కణలో ఏమాత్రమూలేదు. ముత్యాలశాలలో, శ్రీనాథుడు పొందిన కనకాభిషేక గౌరవాదులన్నీ పాంచభౌతిక దేహంతో సంపాదించిన పుణ్యఫలాలే! **ఇంత** ఫలాన్ని – కృష్ణవేణి, అమ్మ గంగాదేవి, శ్రీనాథుని పాదోద్భవమై వారి పాదాలు కడిగినది. దాంతో తొంభై ఏళ్ళలో తాను సంపాదించిన ఫలమంతా గంగగొనిపోవ, కృష్ణవేణి తన పాంచ భౌతిక దేహాన్ని గొనిపోవునని సూచించిరి. కృష్ణవేణీ నదికి వరదలు రావటం, పంటకొట్టుకు పోవటం, లోకులు గ్రహించిన సంగతి. పుణ్యాలు చేస్తే స్వర్గప్రాప్తి. జ్యోతిష్టోమేన స్వర్గకామోయజేత – ఇత్యాదులు. పుణ్యం క్షీణించాక మరల మర్త్యలోకంలో ప్రాణిగా పుట్టాల్సిందే! "క్షీణే పుణ్యేమర్త్యలోకే విశన్తి – ఇత్యాది శ్రుతులచే, పుడుతూ మరణిస్తూనే ఉండాలి. పాపపుణ్యాలన్నీ క్షీణిస్తే మరల పుట్టకలేదు. అదే ముక్తి. కైవల్య ప్రాప్తికి జ్ఞానమే మూలాధారం. ఆ జ్ఞానం సద్భక్తి వలన లభిస్తుంది. అహంగ్రహోపాసనచే ముక్తి లభిస్తుంది. "నచ పునరావర్తతే" – అని శ్రుతి. **ఇంతఫలం**, కృష్ణవేణి అమ్మ–**గంగ** స్వీకరిస్తుందని, కృష్ణవేణి తన దేహాన్ని గొని పోవునని తెలిపిన శ్రీనాథుడు – **ఋతంభరా ప్రజ్ఞానిధి.**

శ్రీనాథుడు, అధ్వర్యు వేదశాఖాధ్యేత. ధర్మ కర్మ దీక్షా పరతంత్రుడు కనుకనే, దేవముని గురు పితృ ఆత్మఋణ పంచకాల నుండి విముక్తుడగుటకై షోడశ కర్మలనధ్యయనం చేసి, యధోచిత కర్మల నాచరించి, తిలదానాదులతోపాటు తిలతర్పణాలను చేసిన నిష్కామ కర్మిష్ఠుడు, అధీతి బోధ ఆచరణ ప్రచారాలకు ప్రతినిధి. ఆబ్దిక ప్రయోగంలో ప్రధాన పాత్ర వహించేవి తిలలు. భోక్తలకు భోజనంలో **పెసరపప్పు** ముఖ్యమైంది. దానితో చేసిన పిండాలను పితృదేవతలు కాకి రూపంలో వచ్చితిని పెడతారనేది శాస్త్రీయం, పైగా భారతీయుల నమ్మకం. కనుకనే ఆ భారతీనందనుడు **తిలలు పెసలు** బిలబిలాక్షులు

'లగ్గ'న తిని పోయెనని, తాను ఋణ విముక్తుడనైతినని సుస్పష్టం చేసాడు. పెసరపప్పు వండాలి. నువ్వుపచ్చడి చేయాలి. ఇవి శ్రద్ధతో చేయవలసిన సత్కర్మలని ధర్మ జిజ్ఞాసను తెలిపి, "వేదో నిత్యమధీయతాం తదు దితం కర్మస్వనుష్ఠీయతాం" అను ఆది శంకరాచార్యుల సిద్ధాంతాన్ని బలపరచిన దార్శనికుడు. తొంభై ఏళ్ళ వరకు మాయా కంచుకంతో లొంగక యుండుటచే కాబోలు, 'బొడ్డుపల్లెను గొడ్డేటి మోసపోతి నెట్లు?... అని తన పాంచభౌతిక దేహాన్ని చూచి చకచ్చకితుడయ్యాడు. ఈ శరీరమనే క్షేత్రాన్ని గుత్తకు తీసికొని ఎట్లు మోసపోతినని తలపోసాడు. ఈ శరీరాన్నే 'పురం' - అంటారు. శరీరమనే పురమందుండే వాడు పురుషుడు, అంటే ప్రాణి. స్థూలసూక్ష్మ కారణములందుండువాడు - పురుషుడు. 'పూర్షుః స్థూల సూక్ష్మ కారణ కారణేషు తిష్ఠతీతి పురుషః". షోడశ కళాయుక్తుడైన ఆత్మ, పురుషుడే. "షోడశ కలః పురుషః" - అని తలచాడు. పూర్వ జన్మ సుకృతాన్నొసంగి, ఈ దేహాన్ని గుత్తకు తీసికొన్నాం. ఈ శరీరం, బొడ్డు - అంటే నాభినాళం, పల్లె - ఆశ్రయంగా గలది. తల్లి గర్భంలోంచే నాభి సంబంధంతో పుట్టి, పెరిగినదని తలచిన శ్రీనాథుడు, తొంభై ఏళ్ళుగా ఈ బొడ్డుపల్లెను గుత్తకు తీసికొన్న విషయాన్ని ఎలా విస్మరించి మోసపోయాను? అదంతా వైష్ణవీమాయ. మాయా కంచుకం తొలగటంతో సాక్షాత్తు పురుషోత్తముడై గోవిందునిగా దర్శన మిచ్చాడని, ఏకంసత్ - అను అద్వైత తత్త్వం అంతర్వాహినియై సీసాన సాక్షాత్కరించింది. **సాహిశ్రీః అమృతాసతాం** - అను శ్రుతిమూర్తియై, **'చెల్లింతుటంకంబులేదు నూర్లు'** - అని పలికి, సప్త శతీ హృదయమయి హిరణ్మయి కోరిక మేరకు **స్వర్గలక్ష్మికి సేవలు చెల్లింతు**నన్నాడు. తన కంఠమందు గల ముక్తావళిలో ముత్యాలశాలను దర్శించినాడు. టంకము - అంటే నిష్కము, పదహారు భాగాల బంగారు నాణెము. అంటే, పదహారు మంత్రాక్షరాల సువర్ణ పూర్ణ స్వరూపమే షోడశి. దేవీ సప్తశతి హృదయమే షోడశి. షోడశీ మంత్రాధిష్ఠాన దేవతాశ్రీ తత్త్వమును తెలుపుటకే నా వరివస్య చెల్లింతుననుటలో శ్రీనాథుని అవతరణ రహస్యం దాగి ఉన్నది. శ్రుతి ధర్మాలను, తత్త్వార్థాన్ని, భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను బోధించడానికే అవతరించి సద్గ్రంథ రచన చేసాడు. అవి కూడ పదహారే! అని, పలికి, సప్తశతీ హృదయ జిజ్ఞాసలో మైమరచిన దుగ్గన్నను ధ్యానముద్ర వీడిన శ్రీనాథుడు జబ్బచఱచి, నీవు సత్యదర్శివని శ్లాఘించి, ఆ సద్వైమర్శిక శిరోమణితో, దుగ్గన్నా! ఈ దేహం, మట్టికొంప. దేహమనే ప్రమిదలో భక్తి తైలం పోసి సత్కర్మలను వత్తులు వేసి జ్ఞానజ్యోతులు వెలిగించాలి. అవి విశ్వజ్యోతిలో కలిసాక, ప్రమిద మట్టిలో కలిసిపోవుట ప్రకృతిధర్మం కదా. "బ్రహ్మసత్యం,

జగన్మిథ్యా, జీవోబ్రహ్మైవ నాపరః" - అంటూనే, ప్రథమ పురుషములో - శ్రీనాథుడు అమరపురికి అరుగుచున్నాడని పలికినాడు. ఇది, పరబ్రహ్మ వాచ్యుడైన శ్రీనాథుడను భావమున శారదాంబతో పలికిన పలుకులుగా దుగ్గన్న దర్శించినాడు. **"అరుగుచున్నాడు శ్రీనాథుడమరపురికి"** - అనిన పల్కులు వినిన బ్రహ్మజ్ఞులు, ఆ **విద్వత్తముని** నిరూపమాన ధైర్య సాహసాలను, జిగీషను మెచ్చుకొన్నారు.

సాక్షాత్తు వీరభద్రుడే, వీరభద్రారెడ్డిగా అవతరించి, ఎన్నోమారులు రత్నాంబరముల నిచ్చి సత్కరించాడు. అంతటి ఉదారుడీ భూలోకానలేడు. మరి, ఏ రాయడూ అంతటి సత్కారాలను చేయలేడు. కాశీఖండ మహాకావ్యం స్వీకరించిన వీరభద్రారెడ్డి, ఆ పుణ్యఫలంచే కాశీ విశ్వేశ్వరునిలో కలసె. అతడే స్వర్గంలో రాయడై వచ్చునని, రత్నాంబరంబులే - రాయడిచ్చునని విశ్వసించినాడు. కొంతకాలం కొండవీటి రెడ్డి సామ్రాజ్యానికి, మరికొంత కాలం విజయనగర సామ్రాజ్యానికి సామంత రాజుగ సేవల నందించిన పంట మైలారురెడ్డి, కొన్ని కష్ట సమయాల్లో ఆలంబనగా నిలచి ప్రతిదినం తన కుటుంబానికి దినవెచ్చ మిచ్చి కాపాడిన అన్నదాత, కైలాసమేగినాడని, మరి పుడమిపై దినవెచ్చ మేరాజు తీర్పగలడని, వానిని స్మరించి, స్వర్గానికి వెళ్ళినంతనే, అట దినవెచ్చమే రేరాజు తీర్చగలడని భావించాడు. భీమేశ్వరునికి అర్పించడానికై కస్తూరి నొసంగిన తెలుంగురాయలు స్వర్గస్థుడయ్యాడు. స్వర్గంలో, కస్తూరికే - సుర'రాజు'ను ప్రస్తుతింతునని తలచాడు. దిగ్భ్రమణ సమయంలో ఆదుకొని, తన యింట నిలుపుకొని, హేమపాత్రలందు వాని పంక్తిలో భోజనం పెట్టి, కొంత కాలం పోషించిన విస్సనమంత్రి అమరజీవి యైనాడే మరి హేమపాత్రన్న మెవ్వని పంక్తి గలదని తలచి, వాక్పతి గీర్పతులున్న స్వర్గాన అమృత భోజనం లభింపగలదని సంభావించాడు.

శ్లో॥ జనితా చోప నీతాచ యేన విద్యో ప దిశ్యతే ।

అన్నదాతా భయత్రాతా పంచైతే పితరః స్మృతాః ॥ అను శాస్త్ర వచనానుసారం భోజనం పెట్టి ఆదరించిన వారందరూ పితృసములని, పార్థివ శరీరానికి సహకరించిన వారి నందరిని తలచుకొని, కృతజ్ఞతల నర్పించినాడు, శ్రీనాథుడు.

కవుల పాలిటి కల్ప భూరుహమై యవతరించిన మంత్రి రాయ భాస్కరుడు, తన చిననాటి నుండి హితుడై సన్నిహితుడై చతుర వచోనిధియై అన్ని విధాల సహాయ సహకారాలనందించి కలియుగంలో నిక నుండ కష్టమని, ఏనాడో దేవుని సన్నిధికి చేరుకొనినాడని, ఆ సుకృతాత్ములను తలచిన శ్రీనాథుడు - పర్ణశాల కేతెంచిన మిత్రులను,

హితులను, సాహితీరిరంసువులను పాఠక పరమహంసలను, శిష్యప్రశిష్యులను దీవించి, భవతరణకు దైవనామస్మరణే ధన్యోపాయమని బోధించాడు.

"ఉత్తిష్ఠత! మాస్వప్త, అగ్ని మిచ్ఛధ్వం భారతాః" – భారతులారా! లెండు, నిదురింపకుడు. అగ్నిస్వరూప పరమేశ్వరుని ఆరాధింపుడు. "ఉత్తిష్ఠత! జాగృధ, ప్రాప్యవరాన్ని బోధత" – లేవండి, మేల్కొనండి, సరియైన బోధ పొంది గమ్యస్థానం చేరండి. మీ గమ్యస్థానం "ముక్తి". శ్రుతి విహితమైన ధర్మాచరణమే విశ్వమానవాభ్యుదయానికి, విశ్వమానవ కళ్యాణానికి, విశ్వమానవ సౌభ్రాతృత్వానికి, విశ్వ మానవ సమైక్యతకు, విశ్వశాంతికి, శ్రీరామరక్ష! **సత్యమేవ జయతే** – అని పలికిన శ్రీనాథుడు. శ్రీలక్ష్మి చేయిపట్టుకొని కృష్ణవేణీ నదీతీరం చేరాడు. నదికి నమస్కరించాడు. నది స్వాగతించినది. నదిలోకి దిగారు. కృష్ణవేణీ నదీ తరంగాలు, శ్రీలక్ష్మి శ్రీనాథ దంపతుల పరమ పవిత్రములైన పాదాలను స్పృశించాయి. దైవజ్ఞులు మోదిల్ల, విబుధాళి దశ్మాంతులు వల్లించారు. పితృ దేవతలు సుస్వాగతం పలికారు.

సూర్యుడస్తమిస్తున్నాడు. సంధ్యా తాండవ రభసలో వేగంగా జారిపడిన శివుని హార అస్తికలే గగన తారకా గణాలుగా దర్శనమిస్తున్నాయి. అది ప్రమోదూత, ఉత్తరాయణ పుణ్యకాలం. శాలివాహన శకం 1372, క్రీ.శ.1450.

స్వాగతించిన నదికి నమస్కరించి, నదీ తీరాన గల అంతేవాసులను, ఆత్మీయులను చిరునవ్వుల పలుకరించి, 'భారతులారా! ఈ ముత్యాలశాల వృత్తాంతాన్ని వినినవారు, ప్రచారం చేసినవారు. సద్వైమర్శిక పరమహంసలు, ఆయురారోగ్య భోగ భాగ్య సౌభాగ్యాలతోను సుఖశాంతులతోను నిండు నూరేళ్ళు జీవించి, కైవల్యం పొందుతారు. విద్యార్థులు వింటే విజయపరంపరలు వరిస్తాయి. వ్యాపారులు వింటే వారింట బంగారపు పంటలే పండుతాయి. కవి పండిత పరమహంసలు వింటే సన్మాన సన్మంగళ పరంపరలతో శాశ్వత సత్కీర్తి పొందుతారు. నూతన దంపతులు వింటే అన్యోన్య దాంపత్య సుఖాలు పొంది, పిల్లా పాపలతో వంశాభివృద్ధి చేస్తారు. ఇది విన్నవారందరికీ శుభపరంపరలేనని మంగళా శాసనములను పల్కిన శ్రీనాథుడు, సాధ్వితో కలసి, మహాభినిష్క్రమణార్థం నదీ తరంగాలలో ముందడుగు వేస్తూంటే, **"ఏష... అంజసా స్వర్గం యాతి"**... అని ఋత్విక్కులు ఉద్ఘోషిస్తూంటే, శ్రుతి కలిపిన శ్రీనాథుడు, శారదాంబను దలచి, పిలచి విడిచిన నిఃశ్వసితమే మలిశ్వాసయై, సీసపద్యాన వినిపించినది.

సీ॥ కాశికా విశ్వేశు గలిసె వీరారెడ్డి

రత్నాంబరంబులే రాయడిచ్చు
కైలాస గిరిబండె మైలారు విభుడేగి
దిన వెచ్చమే రాజు తీర్పగలడు
రంభ గూడె తెలుంగు రాయరాహుత్తుండు
కస్తూరికే రాజు ప్రస్తుతింతు
స్వర్గస్థుడయ్యె విస్సన మంత్రి, మతి హేమ
పాత్రన్న మెవ్వని పంక్తి గలదు
గీ॥ భాస్కరుడు మున్నె దేవుని పాలి కరిగె
కలియుగంబున నికనుండ కష్టమనుచు,
దివిజ కవివరు గుండియల్ దిగ్గురనగ
నరుగు చున్నాడు శ్రీనాథుడమర పురికి.

శ్రీలక్ష్మి శ్రీనాథ దంపతులు, పంచాక్షరిని మమ్మాఖు నెమ్మనమందు తలపోసి కృష్ణవేణీ నదీ ప్రవాహంలో మునిగి, మహాప్రస్థానం సాగించారు. సచ్ఛాత్రులు శాంతిమంత్రం పఠించారు. తత్త్వదర్శినులు వారి దివ్యాత్మను గోపాలునిగా దర్శించి నతులు నుతులు చేసిరి.

శ్లో॥ కస్తూరీ తిలకం లలాటఫలకే వక్షఃస్థలే కౌస్తుభం
నాసాగ్రే నవమౌక్తికం కరతలే వేణుం కరే కంకణమ్ ।
సర్వాంగే హరిచందనంచ కలయన్ కంఠేచ ముక్తావళీ
గోపస్త్రీ పరివేష్టితో విజయతే గోపాల చూడామణిః ॥

ప్రపంచమందు గల తెలుగు ప్రజలందరికి ప్రాతః స్మరణీయుడై, దివిజ కవివరు గుండియల్ దిగ్గురనగ, అమరపురికేగిన **"విశ్వసుకవి" శ్రీనాథ** కవిసార్వభౌముని, దీనార టంకాలతీర్థ మాడించి, **అజరామర విబుధ సత్కవిగా** నందించి ధన్యమైనది **"ముత్యాలశాల"**. స్వస్తిశ్రీః.

ఇది, 'నది' చే ఉత్తమ స్థాయి నంది ప్రథమ బహుమతి పొందిన **'ముత్యాలశాల'** వచన కావ్య పురస్కార గ్రహీత, సహస్రాధిక గ్రంథకర్త, సువర్ణ గండ పెండేర విభూషిత మకుట ధారణ కనకాభిషిక్త, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ప్రతిభా పురస్కార గ్రహీత, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత, శ్రీ మదాత్రేయార్చనానస శ్యావాశ్వత్ర్యార్షేయ ప్రవరాన్విత ఆత్రేయస గోత్ర పవిత్ర, ఆకొండి వేంకట శాస్త్రి ప్రపౌత్ర, శంకరశాస్త్రి పౌత్ర, దుడ్డు బ్రహ్మయ్య శాస్త్రి దౌహిత్ర, సావిత్రీ సూర్యనారాయణ పుత్ర,

అమరజ్యోతిః కళత్ర, విద్వత్కవి మిత్ర **విశ్వనాథ** ప్రణీతంబైన **"ముత్యాలశాల"** వచన కావ్యము సుసంపన్నమైనది.

శ్లో॥ సావిత్రీ జననీ సాధ్వీ, పితా నారాయణ స్సుధీ!
అమరజ్యోతి మే జాయా, ఆకొండి విశ్వనాథోఽహమ్ ॥

శ్లో॥ ఆకొండి విశ్వనాథాయ, బ్రహ్మణ్యాయ మహాత్మనే!
నారాయణ తనూజాయ, జ్యోతిర్నాథాయ మంగళమ్ ॥

స్వస్తి ప్రజాభ్యః పరిపాలయన్తాం, న్యాయేన మార్గేణ మహీం మహీశాః,
గోబ్రాహ్మణేభ్యః శుభమస్తు నిత్యం, లోకాః సమస్తాః సుఖినోభవన్తు ॥

మంత్రం: ఓం నమో బ్రహ్మణే నమో అస్త్వగ్నయే, నమః పృధివ్యై, నమ ఓషధీభ్యః, నమోవాచే నమో వాచస్పతయే, నమో విష్ణవే బృహతే కరోమి.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః. హరిః ఓం తత్సత్. స్వస్తిశ్రీః.